# అర్థ శాస్త్రం

# ద్రవ్యం, బ్యాంకింగ్

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0223

డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్
1997

CM-0223
31-3-97

# రచయితల బృందం

**సంపాదకుడు**
డా॥ కె. సతీష్ రెడ్డి

**సహా సంపాదకులు**
ఆచార్య పి. రామయ్య
డా॥ బి. సుందర్ రావు

**రచయితలు**
ఆచార్య ఎస్. కిషన్ రావు
ఆచార్య వి. లక్ష్మణ రావు
ఆచార్య సి.ఎస్.ఎన్.రాజు
డా॥ ఏ. సుదర్శన్ రెడ్డి
డా॥ సి. దేవరాజులు నాయుడు
శ్రీ జి.వి. రంగారావు
డా॥ ఎస్. సుధాకర్
డా॥ ఏ. నకులా రెడ్డి
డా॥ ఎస్. లింబా గౌడ్
డా॥ ఎం. ప్రభాకర్ రెడ్డి

**మూల్యాంకనం**
ఆచార్య తిప్పారెడ్డి

**ముఖచిత్రం**
శ్రీ చంద్ర

**గ్రాఫిక్స్**
శ్రీ ఎం. రమేశ్

Dr. B R.A.O.U. LIBRARY
Acc No. CM-0223
Date 31.03.97
Call No

ప్రథమ ముద్రణ : 1997

BRAOU

**© డా॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**

అన్ని హక్కులు విశ్వ విద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించదలచుకొంటే విశ్వ విద్యాలయ అనుమతి పొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వ విద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం. పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో వున్నాయి.

ఇతర వివరాలకు డైరెక్టర్ (అకడమిక్), డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నం. 46, జూబిలీ హిల్స్, హైదరాబాద్ - 500 033 ను సంప్రదించవచ్చు.

ముద్రణ
**చిత్రలిపి ప్రింటర్స్**, గోల్కొండ క్రాస్ రోడ్స్, హైదరాబాద్. ✆ 7631001

# పుస్తక పరిచయం

ద్రవ్యం ఆర్థిక వ్యవస్థకు గుండె వంటిది. ద్రవ్యం లేకుండా వస్తు సేవలను వినిమయం చేసుకోవడం చాలా కష్టం. పూర్వకాలంలో వస్తు మార్పిడి పద్ధతి అమలులో వున్నప్పటికీ ఆ పద్ధతిలో వున్న ఇబ్బందుల మూలంగా అనేక రూపాలలో క్రమంగా రూపాంతరం చెంది ద్రవ్యం ఏర్పడింది. వస్తు రూపం నుండి కాగిత రూపంకు, క్రెడిట్ కార్డుల స్థాయికి మార్పు చెందింది. ద్రవ్య సప్లయ్‌లో $M_1, M_2, M_3, M_4$ అను రూపాలు వున్నాయి. ద్రవ్య సప్లయ్‌ని అనేక కారకాలు నిర్ణయిస్తాయి. అదేవిధంగా ద్రవ్య డిమాండ్ కూడా వివిధ అంశాలపై ఆధారపడుతుంది. ద్రవ్య డిమాండ్‌కు సంబంధించి సంప్రదాయ వాదులు, కేన్స్, కేన్సియన్ వాదులు వారి వారి దృక్పథాలను వ్యక్త పరిచారు. ఆధునిక కాలంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఎంతో అభివృద్ధి చెందింది. ద్రవ్య, మూలధన మార్కెట్లు ఏర్పడ్డాయి. వివిధ బ్యాంకింగ్ సంస్థలను కేంద్ర బ్యాంకు నియంత్రిస్తుంది. అన్ని అభివృద్ధి బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, బాంకేతర విత్త సంస్థలు విస్తరించాయి. భారతదేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను, ద్రవ్య విత్త వ్యవస్థలను, అభివృద్ధి చేయడానికి గాను, వాటిలో సంస్కరణలు తేవడానికి గాను ఏర్పరచబడిన కమిటీలు ఎన్నో సూచనలను చేసాయి. వాటిని అమలు పరిచే ప్రయత్నాలు జరిగాయి, జరుగుతున్నాయి.

ఈ పుస్తకం డా ॥ బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి ఎం.ఎ. అర్థశాస్త్రం రెండవ సంవత్సర పాఠ్య ప్రణాళికలో పొందుపరచిన "ద్రవ్యం, బ్యాంకింగ్" లోని పాఠ్యాంశాలను వివరిస్తుంది. అధ్యయన సౌలభ్యం కోసం పాఠ్య ప్రణాళికను ఖండాలుగా, ఈ ఖండాలను వివిధ భాగాలుగా విభజించాం. సాధారణంగా ప్రతి ఖండం ఒక ప్రత్యేక విషయాన్ని అధ్యయనం చేస్తుంది. ప్రతి భాగం దాని విషయ సూచికతో ఆరంభమై, ఉద్దేశాలు, విషయాల వివరణతో కొనసాగి సారాంశంతో ముగుస్తుంది. మాదిరి పరీక్షా ప్రశ్నలను, సంప్రదింపు గ్రంథాలను, పదకోశాలను విద్యార్థుల సౌకర్యార్థం భాగం చివరలో ఇచ్చాం.

BRAOU

"ద్రవ్యం, బ్యాంకింగ్" అను ఈ కోర్సులో ఆరు ఖండాలు ఉన్నాయి. మొదటి ఖండం ద్రవ్య పరిణామ క్రమాన్ని, ద్రవ్య సప్లయ్‌ని భారత దేశాన్ని సోదాహరణంగా తీసుకొని చర్చించింది. రెండవ ఖండం ద్రవ్య డిమాండ్‌ను, దానికి సంబంధించిన వివిధ సిద్ధాంతాలను వివరించింది. మూడవ ఖండం ద్రవ్యానికి సంబంధించిన వివిధ సమస్యలను, దృక్పథాలను విశ్లేషిస్తుంది. నాల్గవ ఖండం వాణిజ్య బ్యాంకింగ్ వ్యవస్థను, అభివృద్ధి బ్యాంకులను ద్రవ్య మూలధన మార్కెట్లను, బ్యాంకేతర విత్త సంస్థలను విశదీకరిస్తుంది. ఐదవ భాగం కేంద్ర బ్యాంకు వ్యవస్థను, విధులను భారతదేశాన్ని ఉదాహరణగా తీసుకొని చర్చించింది. చివరి (ఆరవ) ఖండం విత్త వ్యవస్థను, విత్త సంస్కరణలను విశ్లేషిస్తుంది.

BRAOU

# విషయ సూచిక


| భాగం పేరు | | | పేజి |
|---|---|---|---|
| ఖండం IV : వాణిజ్య బ్యాంకింగ్ | | | 1 |
| భాగం - 14 | : | విత్త వ్యవస్థ : ద్రవ్య, మూలధన మార్కెట్లు | 3 |
| భాగం - 15 | : | భారత దేశంలో వాణిజ్య బాంకుల విధులు, పురోగతి | 18 |
| భాగం - 16 | : | బాంకేతర పరపతి సంస్థలు | 45 |
| భాగం - 17 | : | భారత దేశంలో అభివృద్ధి బాంకులు | 60 |
| భాగం - 18 | : | భారత దేశంలో గ్రామీణ బ్యాంకింగ్ | 101 |
| భాగం - 19 | : | వాణిజ్య బ్యాంకుల పరపతి సృష్టి | 111 |
| ఖండం V: కేంద్ర బ్యాంకింగ్ | | | 125 |
| భాగం - 20 | : | కేంద్ర బాంకులు - లక్ష్యాలు, విధులు | 127 |
| భాగం - 21 | : | పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు | 154 |
| భాగం - 22 | : | గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు | 169 |
| భాగం - 23 | : | పరపతి ప్రణాళికా విధానం | 178 |
| ఖండం VI: ద్రవ్య, విత్త వ్యవస్థలు - సంస్కరణలు | | | 197 |
| భాగం - 24 | : | భారత దేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ నివేదిక | 199 |
| భాగం - 25 | : | భారత దేశంలో ఇటీవలి విత్త సంస్కరణలు : నరసింహం కమిటీ, ఇతర కమిటీలు | 209 |
| భాగం - 26 | : | అంతర్జాతీయ ద్రవ్య విత్త సంస్థలు | 221 |


BRAOU

BRAOU

# ఖండం - IV

# వాణిజ్య బాంకింగ్

ఆధునిక ఆర్థిక వ్యవస్థలలో బాంకింగ్ రంగపు ప్రాముఖ్యతను గుర్తిస్తూ వాణిజ్య బాంకు వ్యవస్థను, అభివృద్ధి బాంకులను, గ్రామీణ బాంకు వ్యవస్థను, బాంకేతర విత్త సంస్థలను ఈ ఖండం చర్చిస్తుంది. మొదటి పాఠంలో ద్రవ్య, మూలధన మార్కెట్లతో కూడిన విత్త వ్యవస్థను తెలుసుకుందాం. భాగం - 15 లో వాణిజ్య బాంకుల పరిమాణాన్ని, విధులను, పురోగతిని చర్చించుకొందాం. బాంకేతర విత్త మధ్యవర్తిత్వ సంస్థల స్వరూపాన్ని, ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్రను భాగం - 16 లో వివరించుకొందాం. భాగం - 17 లో అభివృద్ధి బాంకుల లక్ష్యాలను, విధులను, ప్రగతిని సమీక్షించుకొందాం. గ్రామీణ పరపతిని కల్పించే బాంకింగ్ వ్యవస్థలను, నాబార్డును భాగం - 18 లో అధ్యయనం చేద్దాం. వాణిజ్య బాంకుల పరపతి సృష్టి విధానాన్ని భాగం - 19 లో చర్చించుకొందాం. అన్ని పాఠాలలోనూ భారతదేశాన్ని సోదాహరణంగా తీసుకోవడం జరిగింది.

ఈ ఖండంలో ఆరు భాగాలున్నాయి. అవి :


భాగం - 14 : విత్త వ్యవస్థ : ద్రవ్య, మూలధన మార్కెట్లు

భాగం - 15 : భారత దేశంలో వాణిజ్య బాంకుల విధులు, పురోగతి

భాగం - 16 : బాంకేతర పరపతి సంస్థలు

భాగం - 17 : భారత దేశంలో అభివృద్ధి బాంకులు

భాగం - 18 : భారత దేశంలో గ్రామీణ బాంకింగ్

భాగం - 19 : వాణిజ్య బాంకుల పరపతి సృష్టి

BRAOU

# భాగం - 14 : విత్త వ్యవస్థ : ద్రవ్య, మూలధన మార్కెట్లు

**విషయ క్రమం**

14.0 ఉద్దేశం

14.1 పరిచయం

14.2 ద్రవ్యం - విత్తం, విత్త మధ్యవర్తుల పాత్ర - సైద్ధాంతిక చర్చ : సమీక్ష

14.3 విత్త వ్యవస్థ నిర్వచనం, స్వరూపం, కూర్పు, భాగాలు

14.3.1 ప్రాథమిక, ద్వితీయ శ్రేణి సెక్యూరిటీలు

14.4 విత్త సంస్థలు - కార్యకలాపాలు, పాత్ర

14.5 విత్త మధ్యవర్తుల వర్గీకరణ

14.5.1 బ్యాంకులు, బ్యాంకేతర విత్త సంస్థలు

14.5.2 మధ్యమిక విత్త సంస్థలు, మాధ్యమికేతర విత్త సంస్థలు

14.5.3 ప్రాథమిక, ద్వితీయ మార్కెట్లు, ఇంకా ఇతర రకాల విభజన

14.6 ద్రవ్య, మూలధన మార్కెట్లు

14.7 భారత దేశ విత్త ఆస్తుల, మార్కెట్ నిర్మాణం

14.7.1 విత్త ప్రవాహాల నిర్మాణం

14.7.2 రంగాల వారి విత్త ప్రవాహాలు

14.8 విత్త సాంద్రత నిష్పత్తులు - భారత విత్త వ్యవస్థ పాత్ర

14.9 భారత ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య మార్కెటు

14.10 భారత దేశ మూలధన మార్కెటు

14.11 సారాంశం

14.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

14.13 సంప్రదింపు గ్రంథాలు

14.14 పారిభాషిక పదకోశం

## 14.0 ఉద్దేశం

ప్రపంచ వ్యాప్తంగా విస్తరించబడిన విత్త వ్యవస్థను,దానిలోని రెండు ముఖ్య అంతర్భాగాలైన ద్రవ్య, మూలధన మార్కెట్లను (భారత దేశ సోదాహరణంగా) అధ్యయనం చేయడం ఈ పాఠం ప్రధాన ఉద్దేశం.

## 14.1 పరిచయం

ద్రవ్యం, విత్తం, పరపతి - ఈ మూడు భావాలు పరస్పర సంబంధం కల పరిపూరకాలు. ద్రవ్యం, విత్తం కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం జన్మించినప్పటికీ, వాటి వృద్ధి గత 2 శతాబ్దాలలో గణనీయంగా కనబడుతుంది. ప్రస్తుత శతాబ్దంలో, ముఖ్యంగా 1950 ప్రాంతం నుంచి ద్రవ్యం, విత్తంల వ్యవస్థీకరణలో, రూపాంతరాలలో,

BRAOU

విప్లవాత్మక మార్పులు కలిగి, సాంకేతికంగా చాలా వృద్ధి చెందాయి. ప్రతి ఆర్థిక వ్యవస్థలో విత్త వ్యవస్థీకరణ పెక్కు రకాల మార్కెట్ల, సాధనాల, వ్యక్తుల, సంస్థలతో కూడుకొని అస్పష్టంగా కనపడుతుంది. విత్త వ్యవస్థ అంటే ఏమిటి? దాని ప్రాధాన్యమేమి ? దాని అంతర్భాగాలేమి ? అది ఎట్లా పనిచేస్తుంది ? అది ఎట్లా వాస్తవిక అంశాలను ప్రభావితం చేస్తూ, స్వయంగా ప్రభావితమవుతుంది ? ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవడానికి ముందు, విత్త వ్యవస్థ లేదా విత్త పద్ధతికి సంబంధించిన సైద్ధాంతిక చర్చను సంక్షిప్తంగా అర్థం చేసుకోవడం అవసరం.

## 14.2 ద్రవ్యం - విత్తం, విత్త మధ్యవర్తుల పాత్ర - సైద్ధాంతిక చర్చ : సమీక్ష

అర్థశాస్త్ర ప్రధాన స్రవంతిలో (mainstream economics) వాస్తవ, విత్త చలాంకాల సంబంధం ప్రధాన చర్చనీయాంశం కాదు. అర్థశాస్త్ర సైద్ధాంతికులు ద్రవ్యం, విత్త విషయాలను ఉపేక్షించి భౌతిక, వాస్తవిక కారకాలను చర్చిస్తారు. వ్యాపార వాదులు (mercantalists) సంపదను (తప్పుగా) ద్రవ్యంగా భావించి, ద్రవ్యమే సర్వస్వమనీ, బంగారం, వెండి రూపంలోగల ద్రవ్యాన్ని సంచయనం చేయడం వల్ల దేశ శ్రేయస్సు పుంజుకొంటుందనీ భావించారు. వీరికి విరుద్ధంగా సంప్రదాయ ఆర్థికవేతల నాయకుడు ఆడమ్‌స్మిత్ భౌతిక సంపదకు ప్రాధాన్యమిచ్చి, మూలధన సంచయనం పాత్రను ప్రత్యేకించి తెలిపి, ద్రవ్యం కేవలం మాధ్యమం మాత్రమేనని వాదించాడు. సంప్రదాయ ఆర్థికవేత్తల వలెనే, నవ్య సంప్రదాయ ఆర్థికవేత్తలు కూడా ద్రవ్యం తటస్థ లక్షణాన్ని (money neutrality) మరింత శాస్త్రీయంగా వివరించి, ద్రవ్య చలాంకాలు వాస్తవ అంశాలను ప్రభావితం చేయవని తెలిపారు. ద్రవ్యం తటస్థ పాత్ర ద్రవ్యరాశి సిద్ధాంతం యొక్క మౌలిక భావన అని ఇచ్చట గుర్తుంచుకోవాలి. ఆర్థిక వ్యవస్థ గమనాన్ని, పనిచేస్తున్న తీరుతెన్నులను ద్రవ్యం ప్రభావితం చేయజాలదని, ద్రవ్యం కేవలం సాధారణ ధరల స్థాయి (general price level) ని మాత్రమే ప్రభావితం చేస్తుందని వాదించారు. ఈ వాదం ఆధునిక ద్రవ్య వాదులు, హేతువాద అంచనాల సిద్ధాంతం వారు బలపరిచారని 12వ, 13 వ పాఠాలలో తెలుసుకొన్నాం.

కేన్సు నమూనాలో స్వయం ప్రేరిత ప్రైవేటు పెట్టుబడులకు, ప్రభుత్వ వ్యయానికి కీలక పాత్రలున్నప్పటికీ, ద్రవ్యానికి ఉచిత పాత్ర కలదు. 1936 లో కేన్స్ ప్రచురించిన 'జనరల్ థియరీ' అను గ్రంథంలో ద్రవ్యం, వడ్డీరేటులు సాధారణ సిద్ధాంతంలో అంతర్భాగాలు. విస్తృతపరిచిన కేన్సియన్ నమూనాగా పరిగణించే IS - LM విశ్లేషణలో ద్రవ్య మార్కెట్, వస్తువుల మార్కెట్ల మధ్యగల పరస్పర సంబంధం (అంటే చర్య, ప్రతి చర్యలు) గుర్తించడం జరిగింది. ఆదాయ - ఉద్యోగిత - వడ్డీరేట్ల స్థాయి సమతౌల్యం ఏక కాలంలో ఏ విధంగా సాధ్యపడుతుందో IS - LM నమూనా వివరిస్తుంది.

కేన్స్ నమూనాలో ద్రవ్యం పాత్ర గురించి మరికొంత వివరంగా తెలుసుకొందాం. ద్రవ్యత్వాభిరుచి భావన కేన్స్ యొక్క ఒక ప్రధాన సేవగా గుర్తించడం జరిగింది. దానివల్ల విప్లవాత్మక మార్పులు కలిగాయి. ఈ భావన ద్రవ్యం, సమీప ద్రవ్యం లేదా ద్రవ్యం ప్రత్యామ్నాయాల భావనలను సుదీర్ఘంగా విస్తృతపరిచింది. అంటే ద్రవ్యత్వాభిరుచి భావన యొక్క నూతన రూపాంతరాలు ప్రచారంలోకి వచ్చాయి. కేన్సు విశ్లేషణలో ద్రవ్యాన్ని కలిగి ఉండడం మాత్రమే ద్రవ్యత్వం కాగా, రాడ్‌క్లిఫ్ కమిటీ వారు, గుర్లే - షాలు ద్రవ్యత్వాభిరుచిని తృప్తి పరచటానికి వివిధ విత్తపరమైన ఆస్తులు ఉండవచ్చని పేర్కొన్నారు. గుర్లే, షాల విశ్లేషణ ఆధారంగా టోబిన్ అను ద్రవ్య ఆర్థికవేత్త ద్రవ్య సంబంధిత ఆస్తుల గురించి, వాటి ప్రత్యామ్నాయ ప్రక్రియ గురించి మరికొన్ని వివరాలతో పరిశీలించాడు.

ఈ పరిణామాత్మక వృద్ధివలన ద్రవ్య సిద్ధాంతానికి, విధానానికి (monetary theory & policy) నూతన అవగాహన ఏర్పడి, పెక్కు వివాదాలకు దారితీసింది. ద్రవ్యాన్ని, సమీప ద్రవ్యాన్ని ఇంకా విత్త సంబంధిత ప్రత్యామ్నాయాల ఉత్పత్తి ఎట్లా జరుగుతుంది ? వివిధ ఆర్థిక ఏజంట్లు, సంస్థలు వాటిని ఏ విధంగా, ఎందుకు

సప్లయ్ చేస్తారు ? ఆర్థిక కార్యకలాపాలపై ఏ రీతిలో ఏ యంత్రాంగం ద్వారా వాటి ప్రభావం వ్యక్తమవుతుంది ? అన్న ప్రశ్నలకు విత్త సిద్ధాంతం జవాబివ్వడానికి ప్రయత్నిస్తుంది.

ద్రవ్య ఆధారంగా పనిచేస్తున్న ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలలో ద్రవ్యానికి, ద్రవ్య ప్రత్యామ్నాయాలకు గల పాత్రను అర్థం చేసుకోవడానికి విత్త పద్ధతి వ్యవస్థీకరణను పరిశీలించాలి. విత్త వ్యవస్థలో పెక్కురకాల మధ్యవర్తులు (intermediaries) ఉంటారు. అవి ద్రవ్యపరమైన, ద్రవ్యపరంకాని (non - monetary) మాధ్యమికాలు లేదా మధ్యవర్తులు. బ్యాంకులు కూడా మాధ్యమికాలే. బ్యాంకుల నుంచి వేరుచేయడానికి, ఇతర మాధ్యమికాలను బాంకేతర విత్త మధ్యవర్తులు (Non - Bank Financial Intermediaries లేదా సంక్షిప్తంగా NBFI) గా అప్పుడప్పుడు ద్రవ్యేతర విత్త సంస్థలు (Non - Monetary Financial Institutions) గా పిలుస్తారు. బ్యాంకుల మాధ్యమికాలకు, బ్యాంకేతర విత్త మధ్యవర్తులకు మధ్యగల భేదం పరపతి (లేదా ద్రవ్యం) సృష్టీకరణ. సమష్టిగా బ్యాంకులు పరపతిని సృష్టిస్తాయని, ఇతర సంస్థలు అట్లా చేయజాలవని తెలుపడం జరిగింది.

ద్రవ్య, విత్త వ్యవస్థను, అది పనిచేసే తీరును పరిశీలిస్తే సంప్రదాయ - నవ్య సంప్రదాయ - ద్రవ్య వాదుల - హేతువాదుల ప్రధాన ప్రమేయమైన ద్రవ్యం తటస్థ పాత్ర వీగిపోతుంది. వస్తు మార్పిడికి విరుద్ధంగా, ఆధునిక ఆర్థిక వ్యవస్థలలో చాలా నివృతపరచబడిన ద్రవ్య విత్త వ్యవస్థ, అనేక ద్రవ్యత్వ సాధనాలు ఉన్నప్పుడు కొనసాగే లావాదేవీలు విశేషంగా ఉంటాయి. ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయిలు, గణనీయంగా వృద్ధి చెందుతాయి. పెట్టుబడి, పొదుపు చేసేవారు వేరు వేరు తరగతులలో విభజించబడుతారు. వినియోగం చేయనిదంతా స్వయంచాలకంగా పెట్టుబడిగా మారటానికి అవకాశం తగ్గుతుంది. ద్రవ్య - విత్త వ్యవస్థ వృద్ధివలన శ్రమ విభజన ప్రత్యేకీకరణలు సాధ్యమవుతాయి. వస్తు మార్పిడి పద్ధతిలో కనపడే స్వయంసంపూర్ణ ఆర్థిక ఏజంట్లు సుదీర్ఘంగా క్షీణిస్తారు. పొదుపు, పెట్టుబడుల కార్యకలాపాలు వేరుకావడం వల్ల విత్త సంస్థల ఏజంట్ల పరిధి చాలా విస్తరించబడుతుంది. ఈ విత్త సంస్థలు ప్రాథమిక (ప్రత్యక్ష), ద్వితీయ (పరోక్ష) శ్రేణి విత్త ఆస్తులను సృష్టిస్తాయి. ఆర్థిక వ్యవస్థ వృద్ధి పంథాలో ద్రవ్య ఆస్తుల (అప్పుల) ఆదాయ నిష్పత్తి పెరుగుతుంది. అట్లాగే ద్వితీయ - ప్రాథమిక శ్రేణి సెక్యూరిటీల (పూచీల - securities) నిష్పత్తి కూడా పెరుగుతుంది. భౌతిక ఆర్థిక కార్యకలాపాల విస్తరణ, స్థాయిల పెరుగుదలకు ద్రవ్య విత్త ఆస్తుల వృద్ధి అవసరం. ఒకటి మరొక దానికి కారణంగా, ఫలితంగా గుర్తించడం ఉత్తమం. ఈ రెండూ నాణానికి రెండు ముఖాలుగా భావించాలి, అంటే పరస్పర పూరకాలని గమనించాలి. ద్రవ్య- విధానాన్ని పటిష్టం చేయడానికి, ఆర్థిక వృద్ధిని త్వరితం చేయడానికి వివిధీకరించబడిన, వృద్ధి చెందిన ద్రవ్య - విత్త వ్యవస్థ తప్పనిసరి అని ప్రత్యేకంగా తెలుపనవసరం లేదు. పైన వివరించిన సైద్ధాంతిక సమీక్షను దృష్టిలో ఉంచుకొని విత్త వ్యవస్థను వ్యావహారికంగా పరిశీలిద్దాం.

## 14.3 విత్త వ్యవస్థ విర్వచవం, స్వరూపం, కూర్పు, భాగాలు

నిధులను బదిలీ చేయడానికి సహకరించే వ్యక్తుల, సంస్థల వ్యవస్థీకరణను విత్త వ్యవస్థగా నిర్వచించవచ్చు. ప్రత్యేకీకరణగల, ప్రత్యేకీకరణలేని సంస్థలు, సంఘటిత, అసంఘటిత విత్త మార్కెట్లు, విత్త సాధనాలు, సేవలు గల కూర్పును ఒక దేశం యొక్క విత్త పద్ధతి / వ్యవస్థగా ఎల్.ఎం. భోలే నిర్వచించాడు. విత్త మార్కెట్లలో, విత్తపరమైన పరస్పర సంబంధాలలో పాటించే నియమాలు, పద్ధతులు కూడా విత్త వ్యవస్థ యొక్క భాగాలని తెలుపుతారు. ఈ భాగాలు అన్ని సందర్భాలలో పరస్పరంగా విడదీయబడిన (mutually exclusive) యూనిట్లుగా కనబడకపోవచ్చు. విత్త మార్కెట్లలో విత్త సంస్థలు కార్యకలాపాలను నిర్వహించుకొంటాయి. విత్త వ్యవస్థ పదం యొక్క అర్థాన్ని కొంత వివరంగా తెలుసుకుందాం. సంకీర్ణంగా సన్నిహిత సంబంధం గల లేదా మిశ్రితంగా గల సంస్థలు, ఏజంట్లు పాటించే లాంఛనాల వ్యవహారాల, మార్కెట్ల కార్యకలాపాల ఆధిపత్యాన్ని వ్యక్తంచేసే ఆస్తుల

లేదా అప్పుల (assets or liabilities) ఒక సమితిని 'వ్యవస్థ' గా అర్థం చేసుకోవాలి. విత్త సంస్థలు ప్రధానంగా వ్యాపార సంస్థలు. అవి పొదుపు లేదా మిగులును ఒకరి నుంచి సేకరించి, పరపతి లేదా విత్తాన్ని ఇతరులకు సమకూర్చుతాయి. ఇంతే కాకుండా సమాజానికి పలు రకాల సేవలు సమకూర్చుతాయి. వీటికి, విత్తేతర మధ్యవర్తులకు (సాధారణ, పారిశ్రామిక వ్యాపార సంస్థలు) తేడా కలదు. విత్త మధ్యవర్తులు చేపట్టే కార్యకలాపాలు డిపాజిట్లు, అప్పులు, సెక్యూరిటీ (security) ల రూపంలో ఉంటాయి. విత్తేతర మధ్యవర్తులు చేపట్టే వ్యవహారాలు వాస్తవ ఆస్తులైన యంత్ర సామగ్రి, భూమి, భవనాలు, రియల్ ఎస్టేట్, వస్తువుల విలువల రూపంలో ఉంటాయి. కొన్ని విత్త మధ్యవర్తులు ప్రత్యేక సేవలను సమకూర్చగా విభిన్న రకాల సేవలను సమకూర్చే మధ్యవర్తులు (మాధ్యమికాలు) అధిక సంఖ్యలో ఉంటాయి.

విత్త వ్యవస్థ పరిధిలో ద్రవ్య, పరపతి వ్యవహారాలు రెండూ ఉంటాయి. ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య మిగులును సేకరించి, లోటు వ్యయం చేసే వారికి (deficit spending) బదిలీ చేసే ఒక విధమైన సంస్థాపర అమరిక సమితిని విత్త వ్యవస్థగా ఎస్.బీ. గుప్త నిర్వచించాడు. ఈ నిర్వచనాన్నిబట్టి విత్త ఆస్తుల, విత్త మార్కెట్ల, ఇంకా విత్త సంస్థల కూడలిని విత్త వ్యవస్థగా భావించవచ్చు. విత్త మిగులును వాస్తవ వనరులపై హక్కు లేదా అధికారంగా (command over resources) లేదా ప్రతినిధులుగా అర్థం చేసుకోవాలి.

### 14.3.1 ప్రాథమిక, ద్వితీయ శ్రేణి పూచీలు (సెక్యూరిటీలు)

ద్రవ్య ఆస్తులు రెండు రకాలు - ప్రాథమిక లేదా ప్రత్యక్ష సెక్యూరిటీలు (పూచీలు), ద్వితీయ లేదా పరోక్ష సెక్యూరిటీలు. వాస్తవ రంగంలోని యూనిట్లపై హక్కును తెలిపేవి ప్రాథమిక సెక్యూరిటీలు. వాస్తవ రంగం యూనిట్లు అంతమ రుణ గ్రహీతలుగా, తమ లోటు వ్యయాన్ని భర్తీ చేయుటకు ప్రాథమిక సెక్యూరిటీలను సృష్టిస్తాయి. ఉదా ॥ బిల్లులు, బాండ్లు, వాటాలు మొదలయినవి. ప్రజల నుంచి నిధుల సేకరణకు విత్త సంస్థలు లేదా విత్త మాధ్యమికాలు (మధ్యవర్తులు) తమపై తామే జారీ చేసుకున్న విత్త హక్కులను (claims) ద్వితీయ లేదా పరోక్ష సెక్యూరిటీలుగా నిర్వచించవచ్చు. ఉదా. కరెన్సీ నోట్లు, బ్యాంకు డిపాజిట్లు, భీమా పత్రాలు (insurance policies), యు. టి. ఐ., ఇతర మ్యూచువల్ నిధుల (mutual funds) యూనిట్లు మొదలగునవి.

## 14.4 విత్త సంస్థలు - కార్యకలాపాలు, పాత్ర

అంతిమ రుణ దాతలు, అంతిమ రుణ గ్రహీతల మధ్య లేదా మిగులు, లోటు బడ్జెటులు గలవారి మధ్య మధ్యవర్తులుగా ప్రవర్తించే సంస్థలను విత్త సంస్థలుగా గుర్తించాం. గమనించవలసిన విషయం ఏమంటే మిగులు, లోటు గల రెండు రకాల ఆర్థిక యూనిట్లు వాస్తవ రంగానికి చెందినవి. పైన తెలిపిన ప్రకారం మధ్యవర్తుల ముఖ్య విధి ఏమనగా మిగులు గల వారినుంచి నిధులను సమీకరించి, లోటు వ్యయాన్ని చేసేవారికి బదిలీ చేయడం. మధ్యవర్తిత్వ విధి నిర్వహణలో అవి స్వయంగా పరపతిని సృష్టిస్తాయి. వాస్తవ రంగానికి చెందిన వారి ముఖ్య కార్యకలాపం ఉత్పత్తి కారకాలను క్రయ విక్రయం చేసి ఉత్పత్తిని చేపట్టడం కాగా, విత్త మధ్యవర్తులు విత్త ఆస్తుల క్రయ విక్రయాలను చేపడతాయి. వాస్తవ రంగ ఆర్థిక యూనిట్లు, విత్త మధ్యవర్తులు కలవారు. ప్రాథమిక సెక్యూరిటీలను కొన్నప్పుడు వారు అంతిను రుణ గ్రహీతలకు ప్రత్యక్షంగా విత్తాన్ని సమకూర్చుతున్నారని గమనించాలి.

పైన తెలిపిన విధంగా ఆధునిక ద్రవ్య ఆధారిత ఆర్థిక వ్యవస్థలలో ప్రత్యక్ష విత్త లభ్యత, కావలసిన మొత్తం విత్తంలో చాలా తక్కువ. ఆధునిక కాలంలో విత్త సంస్థల ద్వారా ద్వితీయ సెక్యూరిటీలలో పెరుగుతున్న పెద్ద మొత్తాలలో వ్యక్తుల, సంస్థల మిగులు పెట్టుబడి చేయబడుతుంది. అంటే పరోక్ష విత్త కల్పన వాటా గణనీయంగా

BRAOU

కలదు. ఇట్లా మధ్యవర్తుల ద్వారా అంతిమ రుణ గ్రహీతలు తమ లోటు వ్యయానికి నిధులను సేకరించుకుంటారు.' ఈ వివరాల ఆధారంగా విత్త మాధ్యమికాలను సెక్యూరిటీల లావాదేవీలు, క్రయ విక్రయదారులుగా అన్వయించుకోవచ్చు. వీరు చేసే ప్రధాన కార్యకలాపమేమనగా ప్రాథమిక కొనుగోలు చేసి, ద్వితీయ సెక్యూరిటీలను అమ్మేతారు. అంటే ప్రాథమిక సెక్యూరిటీలను తమ ఆస్తుల విభాగంలో (asset portfolio) లో పొందుపరుచుకుని, వాటికి కావలసిన విత్తాన్ని (financing them) సేకరించడానికి ద్వితీయ సెక్యూరిటీలను సృష్టిస్తాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే అవి ప్రాథమిక సెక్యూరిటీలను ద్వితీయ సెక్యూరిటీలుగా బదిలీ చేస్తాయి. అవి ఎట్లాంటి, ఏ సౌకర్యాలు, ఏ ఆకర్షణలు గల ద్వితీయ సెక్యూరిటీలను ప్రజలకు అందజేస్తాయో వాటిని బట్టి విత్త మాధ్యమికాల (మధ్యవర్తుల) జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. ఈ సంస్థలు మాత్రమే ఆస్తులను వివిధ రూపాంతరాలుగా మారకం చేసే శక్తిని గలిగి ఉంటాయి. లోటు వ్యయం చేసే వారు ఇచ్చే ప్రాథమిక సెక్యూరిటీల కన్న, అవి సృష్టించే ద్వితీయ సెక్యూరిటీలు మిగులుకల ఆర్థిక యూనిట్లకు సమ్మతంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. మిగులు కలవారు తమ నిధులను ఇవ్వడానికి పలు రకాల ద్రవ్యత్వం, రాబడి, నష్ట భయంగల సెక్యూరిటీలను కాంక్షిస్తారు. వాస్తవ రంగంలోని లోటు వ్యయ యూనిట్ల రుణదాతలకు ఆమోదయోగ్యమైన పలు రకాల సెక్యూరిటీలను ఇవ్వజాలవు. విత్త మాధ్యమికాలు తమ నైపుణ్యత, ప్రత్యేక అనుభవం, విత్త సాంకేతిక పురోగతి ద్వారా అంతిమ రుణదాతల, గ్రహీతల అభిరుచుల, ప్రాధాన్యతలకు అనుగుణంగా పలు రకాల సెక్యూరిటీలను, నష్ట భయంకల ఈ గురుతర బాధ్యతను నిర్వహిస్తూ, కార్యకలాపాల వృద్ధికి తద్వారా పెట్టుబడి - ఉత్పత్తి - ఉద్యోగిత పెరుగుదలకు, దేశ శ్రేయస్సుకు ఇతోధిక సేవ చేస్తాయి.

ఆర్థిక వ్యవస్థలోని రంగాలన్నింటినీ విత్త, విత్తేతర రంగాలలో కుదించవచ్చు. మధ్యవర్తిత్వ బాధ్యతను నిర్వహించేవి బ్యాంకులు, బ్యాంకేతర విత్త మధ్యవర్తులు (Non - Bank Financial Intermediaries - N. B. F. I.). ఈ రెండు విత్తరంగంలోని భాగాలు. ఈ విత్త మధ్యవర్తులను నికరంగా అన్వయించినప్పుడు మిగులును లేదా పెట్టుబడులను చేయజాలవు. కాని నికరంగా కేవలం వాస్తవ రంగంలోని ఆర్థిక రంగంలోని ఏజంట్ల సమష్టిగా నికర ఋణదాతలు కావచ్చు, లేదా నికర ఋణ గ్రహీతలు కావచ్చు.

## 14.5 విత్త మధ్యవర్తుల వర్గీకరణ

విత్త వ్యవస్థను స్పష్టంగా అర్థం చేసుకొని, దాని పాత్రను అంచనా వేయటానికి విత్త మధ్యవర్తులను వేరు వేరు ప్రాతిపదికల ఆధారంగా వివిధ తరగతులలో విభజించవచ్చు. విధులు, ప్రత్యేకత, ఆస్తుల స్వరూపం, భౌగోళిక, రంగాల వారీ విస్తరణ, మార్కెట్లను బట్టి వర్గీకరణ చేయవచ్చు.

### 14.5.1 బ్యాంకులు, బ్యాంకేతర విత్త సంస్థలు

ఈ రెండింటి మధ్య సారూప్యతలు చాలా ఉన్నప్పటికీ ఇంతకుముందే తెలిపిన ప్రకారం వాటి మధ్య ఒక ముఖ్య భేదం కలదు. బ్యాంకు విత్త సంస్థలు ద్రవ్యాన్ని (పరపతిని) సృష్టించగలుగుతాయి. వ్యవహారాల కొనసాగింపుకు కావలసిన సౌకర్యాలను కలిగిస్తూ, ఆర్థిక వ్యవస్థ చెల్లింపుల యంత్రాంగంలో కీలక స్థానాన్ని కలిగి ఉంటాయి. ఆర్థిక వ్యవస్థ మొత్తం ద్రవ్యంలో వాటి డిపాజిటు బాధ్యతలు, లేదా $M_3$ లోని రెండు ప్రధాన భాగాల వాటా గణనీయంగా ఉంటుంది. ఉదాహరణకు 1995 మే నెలలోభారత దేశంలో $M_3$ సుమారు రూ. 5,11,000 కోట్లు. దీనిలో బాంకు డిపాజిట్ల ద్రవ్యం రూ. 4,10,000 కోట్లు, అంటే బాంకు డిపాజిట్ల ద్రవ్యం వాటా 80%. బాంకు మాధ్యమికాలు (మధ్యవర్తులు) రెండు రకాలు - వాణిజ్య బాంకులు, సహకార బాంకులు. జీవిత భీమా సంస్థ, యు. టి. ఐ., ఐ. డి. బి. ఐ. బ్యాంకేతర విత్త మధ్యవర్తులకు ఉదాహరణలు.

BRAOU

### 14.5.2 విత్త మధ్యవర్తులు, విత్తేతర మధ్యవర్తి సంస్థలు

పొదుపు, పెట్టుబడి చేసే వారి మధ్య లావాదేవీలు జరిపే వాటిని విత్త మధ్యవర్తి సంస్థలు అంటారు. అవి అప్పు ఇస్తాయి, డిపాజిట్లు తీసుకుంటాయి. అవి అంతిమ పొదుపు చేసేవారికి బాకీ ఉంటాయి. పెట్టుబడి చేసేవారు లేదా అప్పులు తీసుకునే వారు ఇచ్చే పత్రాలు, సెక్యూరిటీలు మొదలగునవి వాటి ఆస్తులు. మాధ్యమికేతర (non - intermediaries) విత్త సంస్థలు అప్పులు (మాత్రమే) ఇస్తాయి. అంతిమ పొదుపు చేసేవారి నుంచి ప్రత్యక్షంగా నిధులు సేకరించవు.


బాంకులన్నీ విత్త మాధ్యమికాలే. బ్యాంకేతర సంస్థలు కూడా ఋణాలిస్తాయి, డిపాజిట్లు స్వీకరిస్తాయి. వాటిని కూడా విత్త మాధ్యమికాలంటారు. కాని వీటిని బాంకేతర విత్త మధ్యవర్తి సంస్థలు (N.B.F.I.)అని అంటారు. ఇంతకు ముందు తెలిపిన ప్రకారం జీవిత భీమా సంస్థ, సాధారణ భీమా సంస్థ, యు. టి. ఐ. లను ఎన్. బి.ఫ్. ఐ. లుగా, ఐ. డి. బి. ఐ., ఐ. ఎఫ్. సి. ఐ., నాబార్డు వంటి శాసనీయ ప్రభుత్వ రంగ సంస్థలను మాధ్యమికేతర విత్త సంస్థలుగా పరిగణించుతారు. వీటిని ప్రత్యేక రంగాలకు, ప్రాంతాలకు, ప్రత్యేక ప్రయోజనాలను కల్పించడానికి సృష్టించారు.

### 14.5.3 ప్రాథమిక, ద్వితీయ మార్కెట్లు, ఇంకా ఇతర రకాల విభజన

చలామణి అయ్యే సెక్యూరిటీల స్వభావం ఆధారంగా ద్రవ్య మార్కెట్లు రెండు రకాలు - ప్రాథమిక, ద్వితీయ లేదా ప్రత్యక్ష, పరోక్ష సెక్యూరిటీల మార్కెట్లు. ప్రాథమిక మార్కెట్లలో నూతన విత్త పత్రాల వ్యాపారం జరుగుతుంది. అవి నూతన వాటాలు, డిబెంచర్లు, బాండ్లు కావచ్చు. ఈ మార్కెట్లు పరిశ్రమలకు ఇతర వ్యాపార సంస్థలకు అదనంగా, నూతనంగా, పెట్టుబడి నిధులను సమకూర్చుతాయి. ద్వితీయ మార్కెట్లు పరిశ్రమలు మొదలగు వాటికి నూతన మూలధనాన్ని ప్రత్యక్షంగా సప్లయ్ చేయకపోయినప్పటికీ, సెక్యూరిటీ మార్కెట్లలో అమ్మబడిన వాటాలకు ద్రవ్యత్వం కల్పించి, పరోక్షంగా పరిశ్రమలకు సహాయం చేస్తాయి. స్టాకు మార్కెట్లు ప్రాథమిక, ద్వితీయ మార్కెట్ల మిశ్రమమని గమనించాలి.

B R A O U

**చార్టు - 14.1 : విత్త వ్యవస్థ స్వరూపం**




మూలం : L. B. Bhole, *Financial Institutions & Markets*

విత్త మార్కెట్ల కూర్పును లేదా పరిణామాన్ని తెలుసుకొనడానికి, వాటిని విధుల వ్యవస్థీకరణ పరంగా లేదా సంస్థాపరంగా విభజిస్తారు. విధులను బట్టి స్వల్ప, దీర్ఘ కాలిక నిధుల మార్కెట్లుగా లేదా ద్రవ్యం, మూలధన మార్కెట్లుగా వర్గీకరించవచ్చు. సంస్థాపరంగా వాటిని సంఘటిత, అసంఘటిత మార్కెట్లుగా విభజింపవచ్చు. సంఘటిత మార్కెటులో కొన్ని వ్యాపార సూత్రాలపై, మరికొన్ని సహకార సూత్రాలపై వ్యవస్థీకరించబడతాయి. మరొక విధంగా వాటిని రంగాల వారిగా విభజింపవచ్చు. కొన్ని విత్త సంస్థలు ప్రత్యేకంగా వ్యవసాయానికి, మరికొన్ని పరిశ్రమలకు, వాణిజ్యానికి పరపతిని కల్పించి, వివిధ రకాల సేవలను సమకూర్చుతాయి. చార్టు 14.1 ద్వారా విత్త వ్యవస్థ స్వరూపాన్ని, విత్త మార్కెట్లను, వాటిలో పాల్గొనే యూనిట్లను సూత్రప్రాయంగా తెలుపడం జరిగింది.

విశ్లేషణాపరంగా విత్త మార్కెట్లు వస్తు సేవల మార్కెట్లను పోలి ఉంటాయి. ఈ మార్కెట్లలో కూడా తమ కార్యకలాపాలకు సంబంధించిన వాటికి డిమాండ్, సప్లయ్, పరిమాణం, ధర మొదలగునవి ఉంటాయి. సన్నిహిత సంబంధాలు లేని పరపతి మార్కెట్లు, వివిధ రకాల సంస్థలు, ఒక్కొక్క దాని విధులు, వ్యవస్థీకరణ, పరిమాణం, పరపతి స్వభావం వేరువేరుగా ఉన్న కూడలిని విత్త పద్ధతిగా నిర్వచించాం. దీనిలోని కొన్ని భాగాలు సన్నిహిత సంబంధంతో వ్యవహరిస్తాయి. ప్రతి భాగంలో సాపేక్షికంగా పోటీ ఎక్కువగా, రెండు భాగాలు లేదా రెండు మార్కెట్ల మధ్య పోటీ తక్కువగా ఉంటుంది. కాబట్టి విత్త మార్కెట్‌ను సంఘటితమైన లేదా సంపూర్ణ పోటీ గల వ్యవస్థ లేదా మార్కెట్‌గా భావింపకూడదు.


## 14.6 ద్రవ్య, మూలధన మార్కెట్లు

ఆర్థిక వేత్తలు సాధారణంగా విత్త మార్కెట్లను ద్రవ్య, మూలధన మార్కెట్లుగా విభజించి అధ్యయనం చేస్తారు. ఈ రెండు రకాల మార్కెట్ల మధ్య ప్రధాన బేధం లేదని తెలుపవచ్చు. రెండూ కూడా ఉత్పత్తి ఏజంట్లకు వనరులను బదిలీ చేయడంలో సహకరిస్తాయి. రెండింటిలోనూ పాల్గొనే వారిలో అనేకులు ద్రవ్య ఆస్తుల కాల పరిమితిని బట్టి సంప్రదాయంగా వీటి బేధాన్ని తెలుపడం జరిగింది. ద్రవ్య ఆస్తుల బాధ్యతల లావాదేవీలు ఒక సంవత్సరం వరకు ఉన్న కాలాన్ని స్వల్పకాలికమని, 1 నుంచి 3 లేదా 5 సంవత్సరాల వరకు మాధ్యమిక కాలమని, మూడు లేదా అయిదు సంవత్సరాలు మించిన దానిని దీర్ఘకాలికమని సాధారణంగా నిర్వచిస్తారు. స్వల్పకాలిక నిధుల, ద్రవ్య ఆస్తుల లావాదేవీల వ్యవస్థను ద్రవ్య మార్కెట్‌గా, మాధ్యమిక, దీర్ఘకాలిక నిధుల వ్యవహారాల వ్యవస్థను మూలధన మార్కెటుగా నిర్వచించవచ్చు. వాటాల (stock/share) మార్కెటుతో సహా వ్యవస్థగా, వాటాల మార్కెటు కన్న విశాలంగా మూలధన మార్కెట్ విస్తరించి ఉంటుంది. మరొక విధంగా చెప్పాలంటే మూలధన మార్కెటులో వాటాల మార్కెటు ఒక అంతర్భాగం మాత్రమే. ప్రభుత్వ బాండ్ల మార్కెట్ మరొక భాగం.

ద్రవ్య మార్కెటు-ముఖ్య భాగాలు : ముఖ్య బిల్లులు, ఇతర వాణిజ్య బిల్లుల మార్కెటు, తాత్కాలిక (call) ద్రవ్య మార్కెటు, అంతర్ బ్యాంకుల ఋణ మార్కెటు (వివరాలకు చార్టు 14.2 ను పరిశీలించండి). ద్రవ్య మార్కెటు వలె మూలధన మార్కెటుకూడా సంఘటిత, అసంఘటత విభాగాల. కూర్పు, సంఘటిత రంగం వాటాల మార్కెట్లను కలిగి ఉన్న సమితి. స్టాకు మార్కెటులో ప్రభుత్వ బాండ్లు, ప్రైవేటు సంస్థల బాండ్లు, వాటాల లావాదేవీలు జరుగుతాయి. అసంఘటిత మూలధన మార్కెటులో పెట్టుబడి ఇతర దీర్ఘకాలిక నిధులను పెట్టుబడి కంపెనీలు, చిట్‌ఫండ్ సంస్థలు, మొదలగునవి సప్లయ్ చేస్తాయి (చార్ట్ 14.2 ను పరిశీలించండి). మరికొన్ని వివరాలతో భారత దేశాన్ని సోదాహరణంగా వివరిస్తూ ద్రవ్య, మూలధన మార్కెట్ల పరిశీలనను రాబోయే పుటలలో చేయడం జరిగింది.

BRAOU

చార్టు - 14.2 : విత్త మార్కెట్ వ్యవస్థ




BRAOU

మూలం : S. B. Gupta, *Monetary Economics*

## 14.7 భారత దేశ విత్త ఆస్తుల, మార్కెట్ల నిర్మాణం

ద్రవ్య, మూలధన మార్కెట్లను (భారత దేశ సోదాహరణంగా) అధ్యయనం చేయడానికి ముందు, భారత ఆర్థిక వ్యవస్థలో విత్త ఆస్తుల నిర్మాణాన్ని పరిశీలించడం అవసరం.

**కుటుంబాల పొదుపు నిర్మాణం**

భారత వ్యవస్థలో మిగులు నిధులను సప్లయ్ చేసేవారు ప్రధానంగా కుటుంబాలు. కుటుంబాలంటే ప్రభుత్వేతర, ప్రైవేటు కార్పొరేట్ రంగం కాకుండా ఇతర ఆర్థిక యూనిట్లు. 1993 - 94 సం॥లో భారత దేశ స్థూల దేశీయ పొదుపు రూ. 1,94,000 కోట్లు లేదా జాతీయాదాయంలో 24.2%. దీనిలో కుటుంబ రంగం వాటా 81%. కుటుంబాలు తమ పొదుపును సగానికి పైగా (52%) విత్త ఆస్తులలో భద్రపరుచుకుంటాయి. పట్టిక 14.1 లో కుటుంబాల స్థూల పొదుపు నిర్మాణం వివరించబడింది. ఈ పట్టిక ప్రకారం, 1993 - 94 సం॥ లో కుటుంబాల పొదుపులో ప్రధాన భాగం బ్యాంకు డిపాజిట్ల రూపంలో కలదని వ్యక్తమవుతుంది. బ్యాంకు డిపాజిట్ల అనుపాతం 37%, యోగ క్షేమ ఫించను నిధులలో 17% వరకు, కరెన్సీలో 14% వరకు, జీవిత భీమా పత్రాలలో 9% వరకు, యు. టి. ఐ. యూనిట్లలో 7% మేరకు కుటుంబాలు పొదుపు చేసాయి.

**పట్టిక - 14.1 : కుటుంబ రంగం యొక్క స్థూల పొదుపు నిర్మాణం (1993 - 94 సం॥)**

| | వివరాలు | శాతంలో |
|---|---|---|
| 1. | కరెన్సీ | 14.0 |
| 2. | బ్యాంకు డిపాజిట్లు | 37.0 |
| 3. | బ్యాంకేతర సంస్థలలో డిపాజిట్లు | 3.4 |
| 4. | యోగ క్షేమం, ఫించను నిధులు | 16.7 |
| 5. | జీవిత భీమా నిధి | 8.9 |
| 6. | ప్రభుత్వ పరమైన పత్రాలు, డిపాజిట్లు | 4.4 |
| 7. | వాటాలు, డిబెంచర్లు | 8.8 |
| 8. | యు. టి. ఐ. యూనిట్లు | 7.0 |
| 9. | ఇతరాలు | 10.2 |
| | మొత్తం పొదుపు | 100.00 |

మూలం : RBI, *Report on Currency & Finance*, Vol. II, 1993 - 94.

## 14.7.1 విత్త ప్రవాహాల నిర్మాణం

ఇంతవరకు భారత ఆర్థిక వ్యవస్థలోని ఒక ప్రధాన భాగమైన కుటుంబాల పొదుపు కూర్పును పరిశీలించాం. ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థను ఒక యూనిట్‌గా భావించి విత్త ప్రవాహాల కూర్పును తెలుసుకుందాం. పట్టిక 14.2 ఈ సమాచారాన్ని అందిస్తుంది.



BRAOU

పట్టిక - 14.2 : భారత్‌లో విత్త ప్రవాహాల కూర్పు (1993 - 94)

| | వివరాలు | శాతంలో |
|---|---|---|
| 1. | కరెన్సీ, డిపాజిట్లు | 29.1 |
| 2. | పెట్టుబడులు | 24.5 |
| 3. | రుణాలు, అడ్వాన్సులు | 31.6 |
| 4. | చిన్న మొత్తాల పొదుపు | 1.8 |
| 5. | జీవిత భీమా నిధి | 3.3 |
| 6. | యోగక్షేమ నిధి | 6.8 |
| 7. | నిర్దేశిక డిపాజిట్లు | Negligible |
| 8. | వ్యాపార పరపతి | Negligible |
| 9. | విదేశాల చెల్లింపులు | (-) 2.4 |
| 10. | ఇతరాలు | 6.0 |
| | మొత్తం | 100.00 |

BRAOU

మూలం : RBI, *Report on Currency & Finance*, Vol. III, 1993 - 94.

పట్టిక 14.2 ప్రకారం స్థూల విత్త ప్రవాహాలలో కరెన్సీ, డిపాజిట్లకు మొదటి స్థానం కలదు (దాదాపు 30% వాటా). ఇతర విత్త ప్రవాహాలైన రుణాలు, అడ్వాన్సులకు దాదాపు 3వ భాగం వాటా (31.6%), పెట్టుబడులకు 4వ భాగం వాటా (24.5%) కలవు.

## 14.7.2 రంగాల వారి విత్త ప్రవాహాలు

పట్టిక 14.3 లో విత్త ప్రవాహాల రంగాల వారి కూర్పుకు సంబంధించిన కొన్ని విషయాలను పరిశీలిద్దాం. 1992 - 93 సం॥లో మొత్తం విత్త ప్రవాహాల విలువ రూ. 2,13,444 కోట్లు. దీనిలో బ్యాంకుల ద్వారా 26% మేరకు, ఇతర విత్త సంస్థల ద్వారా 17% మేరకు విత్త వ్యవహారాలు జరిగాయి. అంటే విత్త సంస్థలకు మొత్తం విత్త ప్రవాహాల విలువను నిర్ణయించడంలో ప్రధాన పాత్ర కలదు (26 + 17 = 43%). మరొక విధంగా చెప్పాలంటే, విత్త సంస్థలు 43% వరకు, విత్తేతర సంస్థలు 57% మేరకు విత్త ప్రవాహాల కూటమిలో భాగస్వామ్యం వహించాయి.

పట్టిక - 14.3 : రంగాల వారి విత్త ప్రవాహాలు (992 - 93)

| | సంస్థలు | శాతంలో |
|---|---|---|
| 1. | బ్యాంకులు | 26.1 |
| 2. | ఇతర విత్త సంస్థలు | 16.7 |
| 3. | మొత్తం విత్త సంస్థలు (1 + 2) | 42.8 |
| 4. | విత్తేతర సంస్థలు | 57.2 |
| | మొత్తం విత్త ప్రవాహాలు | 100.00 |

మూలం : RBI, *Report on Currency & Finance*, Vol. I, 1993 - 94

సమష్టి విత్త ప్రవాహాలు స్థూల జాతీయాదాయంలో దాదాపు 25% మేరకు విస్తరించి ఉన్నాయి. పట్టికలలో తెలిపిన స్థూల విత్త ప్రవాహాలు ప్రాథమిక, ద్వితీయ సెక్యూరిటీల జారీ (issues) కి సమానమని గమనించాలి. ఈ వివరాలను, ఇతర అంశాలను పట్టిక 14.4 సహాయంతో తెలుసుకోవచ్చు.

## 14.8 విత్త సాంద్రత నిష్పత్తులు - భారత విత్త వ్యవస్థ పాత్ర

భారత విత్త వ్యవస్థ పాత్రను కొన్ని మౌలిక విత్త సాంద్రత (financial deepening) నిష్పత్తుల పరిశీలన ద్వారా అంచనా వేయవచ్చు. పట్టిక 14. లో ఈ నిష్పత్తుల సాక్ష్యాలను పొందుపరచాం. పట్టిక నుంచి కొన్ని గర్వనీయమైన పోకడలను సులభంగా గుర్తించవచ్చు.

పట్టిక - 14. : విత్తపర అభివృద్ధి సూచికలు (1951 - 93)

(రూ. కోట్లలో)

| వివరాలు | 1951 - 60 | 1960 - 70 | 1970 - 80 | 1980 - 90 | 1992 - 93 |
|---|---|---|---|---|---|
| 1. విడుదల చేసిన మొత్తం సెక్యూరిటీలు (Total Issues) | 810 | 2,907 | 14,741 | 79,184 | 2,13,444 |
| దీనిలో (a) ప్రాథమిక | 542 | 1,945 | 8,472 | 45,474 | 1,22,083 |
| (b) ద్వితీయ | 268 | 962 | 6,269 | 33,710 | 91,361 |
| 2. జాతీయాదాయం (కారకాల దృష్ట్యా నికర జాతీయ ఉత్పత్తి) (ప్రస్తుత ధరలలో) | 10,382 | 22,771 | 62,290 | 2,08,678 | 5,44,935 |
| 3. నికర మూలధన సంచయనం | 859 | 2,475 | 8,962 | 33,203 | 1,01,339 |
| 4. విత్త నిష్పత్తి (%) (జాతీయాదాయంలో మొత్తం విడుదల %) (2లో 1 శాతం) | 7.4 | 12.6 | 22.1 | 36.8 | 39.2 |
| 5. విత్తపర అంతర్ సంబంధాల నిష్పత్తి (1 : 3) | 0.88 | 1.17 | 1.60 | 2.40 | 2.11 |
| 6. నూతన విడుదలల నిష్పత్తి (1 a : 3) | 0.61 | 0.70 | 0.91 | 1.39 | 1.20 |
| 7. ఇంటర్మీడియేషన్ నిష్పత్తి (Intermediation Ratio) 1b : 1a | 0.42 | 0.48 | 0.76 | 0.72 | 0.75 |

మూలం : RBI, *Report on Currency & Finance*, Vol. I, 1993 - 94.

BRAOU

1. గత నాలుగు శతాబ్దాలలో విత్తేతర రంగాలు జారీ చేసిన ప్రాథమిక సెక్యూరిటీలు ఇంకా విత్త రంగాల ద్వితీయ సెక్యూరిటీల (జారీలు) అనుపాతం జాతీయాదాయంలో గణనీయంగా పెరిగింది (4వ అడ్డ వరుస ప్రకారం 7% నుంచి 30% కు పెరిగింది).

2. మొత్తం జారీలో సాపేక్షంగా ద్వితీయ జారీల అనుపాతం 0.42 నుంచి 0.75కు పెరిగింది (7వ అడ్డ వరుస). ఈ నిష్పత్తిని ఇంటర్‌మీడియేషన్ నిష్పత్తిగా తెలుపవచ్చు. 1951 - 60లో ప్రాథమిక, ద్వితీయ జారీల వాటాలు వరుసగా 67%, 33% కాగా, ప్రస్తుతం వాటి విలువలు 57%, 43%.

3. విత్తపర అంతర్ సంబంధాల నిష్పత్తి 1951 - 93 కాలంలో 0.9 నుంచి 2.1 కు పెరిగింది. ఈ నిష్పత్తి విత్త అభివృద్ధి, మూలధన సంచయన సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ నిష్పత్తి పెరగడం వల్ల తెలిసేదేమంటే, భారత విత్త వ్యవస్థ అభివృద్ధి మూలధన సంచయనాన్ని పెంచటానికి సహకరించింది.

4. నూతన జారీల నిష్పత్తి నికర మూలధన సంచయనంలో ప్రాథమిక సెక్యూరిటీల వాటాను తెలుపుతుంది. గత నాలుగు దశాబ్దాల కాలంలో, ఈ నిష్పత్తి విలువ రెండింతలైంది (6వ అడ్డ వరుస). అంటే ప్రాథమిక సెక్యూరిటీల వృద్ధి గణనీయంగా జరిగి, మూలధన సంచయనాన్ని త్వరితంగా పెంచుటకు సహకరించింది.

## 14.9 భారత ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య మార్కెటు

ఈ మార్కెట్‌లో ఇచ్చిపుచ్చుకొనే ఆస్తి ద్రవ్యం. దీనిని డిమాండు చేసేవారు ప్రజలు కాగా, సప్లయ్ చేసేది భారతీయ రిజర్వు బ్యాంకు మరియు వాణిజ్య బ్యాంకులు. ద్రవ్యం వినిమయ మాధ్యమంగా వ్యవహరిస్తుంది. కాబట్టి వస్తు సేవల క్రయ విక్రయాల సాధారణ ప్రక్రియలో వ్యక్తులకు, సంస్థలకు ద్రవ్యం సమకూరుతుంది. వాటాలకు, బాండ్లకు, బిల్లులకు ఉన్న విధంగా ద్రవ్యానికి ప్రత్యేక మార్కెట్ ఏదీ లేదు.

మొత్తం ఆర్థిక వ్యవస్థయే ద్రవ్యం మార్కెటు. భారత ద్రవ్య మార్కెటులో రెండు భాగాలు కలవు. అవి : సంఘటిత, అసంఘటిత రంగాలు. సంఘటిత రంగంలో పాల్గొనే వారిలో ముఖ్యులు : భారతీయ రిజర్వు బ్యాంకు, వాణిజ్య బ్యాంకులు. కొన్ని బాంకేతర విత్త సంస్థలు (ఉదా ॥ యు. టి. ఐ. వంటి మ్యూచువల్ ఫండులు, జీవిత భీమా సంస్థ, సాధారణ భీమా సంస్థలు) కూడా పాల్గొంటాయి. ఇవి సాధారణంగా పరోక్షంగా భాగస్వామ్యం వహిస్తాయి. ఈ మార్కెటుకు కొన్ని పెద్ద కంపెనీలు, క్వాసీ (quasi) ప్రభుత్వ సంస్థలు తమ స్వల్పకాలిక నిధులను అందజేస్తాయి.

BRAOU

అసంఘటిత విభాగంలో ముఖ్యమైనవి దేశీయ బ్యాంకులు (indigenous banks), వడ్డీ వ్యాపారస్తులు. వీరి ఖాతాలు, లావాదేవీలు శాస్త్రీయంగా, లాంఛనంగా ఉండవు, వ్యక్తిగత సంబంధాలు స్పష్టంగా కనబడతాయి. వీటి కార్యకలాపాలను క్రమబద్ధం చేయడానికి, సంఘటిత పరచడానికి రిజర్వు బ్యాంకు ప్రయత్నం చేసింది. రిజర్వు బ్యాంకు నియంత్రణ వీరిపై చాలా తక్కువ. స్థానికంగా దేశీయ బ్యాంకర్లు ఐక్యంగా ఉంటారు. ముంబాయి, అహ్మదాబాద్‌లు వీరి ప్రధాన ప్రాంతాలు. వారి ముఖ్య పరపతి సాధనం హుండీ.

సంఘటిత భాగంలో 3 ఉప భాగాలున్నాయి. (a) అంతర్ బ్యాంకుల అతి స్వల్పకాలిక మార్కెట్లు (call money market) (b) బిల్లు మార్కెటు (c) అంతర బ్యాంకుల అప్పుల మార్కెటు. ఇంతకుముందే తెలిపినట్లు ప్రభుత్వానికి, ఇతరులకు స్వల్పకాలిక నిధులను సమకూర్చడం ద్రవ్య మార్కెట్ ప్రధాన విధి. ఈ విధి నిర్వహణకు పలు రకాల డిపాజిట్లు సృష్టించబడతాయి; పార్టిసిపేషన్ ధృవ పత్రాలు అమ్మబడతాయి; వ్యాపార బిల్లులు, కోశ బిల్లులు జారీచేయబడతాయి. రిజర్వు బ్యాంకు 3, 4 రకాల కోశ బిల్లులను క్రయవిక్రయం చేస్తుంది.

91 రోజుల, 182 రోజుల, 364 రోజుల తాత్కాలిక కోశ బిల్లులు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. అన్ని వేళలలో అమ్మే కోశ బిల్లులు కూడా ఉన్నాయి. రిజర్వు బ్యాంక్ అంతిమ రుణదాతగా, భారతీయ స్టేట్ బ్యాంక్ ద్వితీయ శ్రేణి రుణదాతగా భారత ద్రవ్య మార్కెట్‌లో వ్యవహరిస్తాయి. కాల్ మార్కెటు చాలా సున్నితమైనది, అస్థిరత్వంగా ఉంటుంది. ఇది ఒక రోజుకు లేదా కొద్ది రోజులకు కావలసిన నిధులకు సంబంధించింది. దీనిలో వడ్డీ రేటు ఎంతైనా ఉండవచ్చు. 1952 నుంచి 1970 వరకు పాత బిల్లు మార్కెటు అమలులో వుండగా 1970 నుంచి కొత్త బిల్లు మార్కెటు అమలులో వుంది. నిజమైన బిల్లు మార్కెటును విస్తరింపచేసి, ద్రవ్యత్వ ఒడుదుడుకులను సవరించుటకు రిజర్వు బ్యాంకు ప్రయత్నిస్తుంది. బిల్లులను జారీచేసి, డిస్కాంటు, పునః డిస్కాంటు చేసి నిధులను స్వయంచాలకంగా కల్పించడం బిల్లు మార్కెటు ఉద్దేశం.

## 14.10 భారత దేశ మూలధన మార్కెటు

ఇంతకుముందే తెలిపినట్లు, ఈ మార్కెట్ కేవలం స్టాకు మార్కెట్‌కు పరిమితం కాదు, ప్రభుత్వ బాండ్ల మార్కెటు కూడా కలదు. 1988లో ప్రభుత్వ ఆదేశాల ఆధారంగా భారత సెక్యూరిటీ, మారకం బోర్డు సృష్టించబడి, 1992 ఏప్రిల్ నుంచి శాసనీయ సంస్థగా వ్యవస్థీకరించబడింది. ఈ సంస్థకు స్టాకు మార్కెట్ కార్యకలాపాల సముచిత వృద్ధిలో విశేష పాత్ర కలదు. భారత మూలధన మార్కెట్ కాలానుగతంగా పటిష్ఠంగా, గణనీయంగా వృద్ధి చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారత మూలధన మార్కెటుకు ఉన్నత, మార్గదర్శక స్థానం కలదు. అమెరికా సంయుక్త రాష్ట్రాల తర్వాత భారత మూలధన మార్కెటుకు రెండవ స్థానం కలదు. దాదాపు 6,500 కంపెనీల వాటాలు స్టాకు ఎక్స్ఛేంజీలలో నమోదైనాయి. భారత దేశంలో మిగిలిన దేశాలన్నిటికంటే స్టాక్ ఎక్స్ఛేంజీలు ఎక్కువ వున్నాయి.

ప్రస్తుతం 21 ఎక్స్ఛేంజీలు పనిచేస్తున్నాయి. వీటన్నింటిలో బొంబాయి స్టాకు ఎక్స్ఛేంజీకి ప్రథమ స్థానం కలదు. వీటన్నింటిలో $1\frac{1}{2}$ కోట్ల పెట్టుబడిదారులు పాల్గొంటున్నారు. వార్షికంగా రూ 10,000 కోట్లకు పైగా పెట్టుబడి నిధులు సేకరించబడుతున్నాయి. పరిమాణాత్మక వృద్ధి గణనీయంగా ఉన్నప్పటికీ, గుణాత్మకంగా భారత మూలధన మార్కెట్ వెనుకబడి ఉంది. నెలకు దాదాపు 30,000 వరకు అవకతవకల గురించి అర్జీలు పెట్టుకోబడుతున్నాయి. కానీ నెలకు 3వ వంతు ఫిర్యాదులకు మాత్రమే పరిష్కారం లభిస్తుంది లేదా సమాధానాలు ఇవ్వబడుతున్నాయి. చార్టు 14.2 లో ఈ మార్కెటులోని భాగాలను, పట్టిక 14.4 లో స్టాకు మార్కెటు వృద్ధిలోని ధోరణులను ఇచ్చుట పునఃశ్చరణ చేసుకోవాలి.

## 14.11 సారాంశం

ద్రవ్యం, విత్తాల పాత్ర వాణిజ్య వాదుల కాలం నుంచి చర్చించబడుతున్నది. సంప్రదాయ, నవ్య సంప్రదాయ ఆర్థిక వేత్తలు, ఇంకా ద్రవ్య వాదులు, హేతువాద అంచనాల వారు ద్రవ్యం వాస్తవ అంశాలను ప్రభావితం చేయదనీ, ద్రవ్యం పాత్ర తటస్థమైనదనీ, దాని ప్రభావం ధరలపై మాత్రమే ఉంటుందనీ వాదించారు. కేన్స్ తన 'జనరల్ థియరీ' (1936) అను గ్రంథంలో ద్రవ్యాన్ని, వాస్తవ రంగంలో లీనం చేసి, ద్రవ్యత్వ భావనకు ప్రాముఖ్యమిచ్చాడు. గుర్లే, షా, టోబిన్‌లు పలు రకాల ద్రవ్యత్వానికి, విత్త వ్యవస్థలకు ప్రాముఖ్యమిచ్చారు. ద్రవ్యం, విత్తం, పరపతి పరస్పర సంబంధం కల భావనలు, చలాంకాలు. అవి వాస్తవ రంగంతో ద్విపాక్షిక సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఈ శతాబ్దంలో, ముఖ్యంగా 1950 ప్రాంతం నుంచి భారత్‌తో సహా ప్రపంచ దేశాలలో విత్త వ్యవస్థ సాంకేతిక పురోగతి వల్ల, ప్రభుత్వ విధానాల వల్ల శాఖోపశాఖలుగా విడదీయబడి, విస్తరించబడింది. విత్త వ్యవస్థ ఒక సంకీర్ణ సంస్థల, వ్యవస్థీకరణల, లావాదేవీల సమితి. దీనిలో పలు రకాల వ్యక్తులు, సంస్థలు విభిన్న

Dr. BRAOU LIBRARY
Acc. No: CM-0223
Class No: 332

రకాల విత్త, ద్రవ్య సెక్యూరిటీలలో వ్యవహారాలు జరుపుకుంటారు. విత్త వ్యవస్థను వివిధ ప్రాతిపదికల ఆధారంగా విభజించవచ్చు. కాల పరిమితిని బట్టి ద్రవ్య, మూలధన మార్కెట్ల వర్గీకరణ ప్రచారంలో కలదు. ఈ రెండు మార్కెట్ల పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయి. వాటిని కచ్చితంగా, విడదీసి గుర్తించడం సాధ్యపడదు. భారత్‌లో 1950 ప్రాంతం వరకే విత్త వ్యవస్థ పురోగతి చెందినప్పటికీ, గత 4 దశాబ్దాలలో గణనీయమైన వృద్ధి సాధించబడింది. విత్త వ్యవస్థ పురోగతి, ఆర్థిక వ్యవస్థ వృద్ధి పరిపూరకాలుగా ముందంజ వేస్తున్నాయి. ఇటీవలి కాలంలో మూలధన మార్కెటులోని ఒక భాగమైన స్టాకు మార్కెటు అనేక కొత్త పోకడలను వ్యక్తం చేస్తూ $1\frac{1}{2}$ కోట్ల పెట్టుబడిదారులను ఆకర్షించింది. వార్షికంగా రూ. 10,000 కోట్లకు పైగా పరిశ్రమలకు, ఇతర వ్యాపారాల అభివృద్ధికి నిధులను కల్పించి దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది. పరిమాణాత్మక వృద్ధి శ్లాఘనీయమైనప్పటికీ, గుణాత్మకంగా ఎంతో పరిణతి చెందవలసి వుంది. రిజర్వు బ్యాంకు, భారత ప్రభుత్వ సరళీకృత విధానం, ఇతర చర్యల ద్వారా విత్త వ్యవస్థను, విత్త మార్కెట్లను సమర్థవంతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

## 14.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I క్రింది వాటిలో ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో జవాబులివ్వండి.**

1. విత్త వ్యవస్థను నిర్వచించి, దాని నిర్మాణాన్ని వివరించండి. భారత దేశంలో విత్త వ్యవస్థ ప్రగతిని సమీక్షించండి.
2. విత్త - విత్తేతర, బ్యాంకులు - బ్యాంకేతర విత్త మాధ్యమికాల మధ్య భేదాలను వివరించండి. విత్త వ్యవస్థ ప్రాముఖ్యాన్ని తెలుపండి.

**II క్రింది వాటిలో ఒక్కొక్క దానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య, మూలధన మార్కెట్ల మధ్యగల తారతమ్యాలను విశదీకరించండి.
2. విత్త వ్యవస్థ నిర్వచనాన్ని తెలిపి, దానిలోని అంతర్భాగాలను రాయండి.
3. భారత విత్త వ్యవస్థ స్వరూపాన్ని, పురోగతిని వివరించండి.

## 14.13 సంప్రదింపు గ్రంథాలు


1. L. M. Bhole, *Financial Institutions & Markets,* Tata Mc Graw Hill, Delhi, 1992 (Chapter I)
2. S. B. Gupta, *Monetary Economics,* S. Chand, Delhi, 1982.
3. RBI, *Report on Currency & Finance,* Vols. I & II, 1993 - 94, Bombay.


## 14.14 పారిభాషిక పదకోశం

| | | |
|---|---|---|
| Financial system | : | విత్త వ్యవస్థ |
| Money / Finance | : | ద్రవ్యం / విత్తం |
| Organisation | : | వ్యవస్థ |
| Organised | : | సంఘటిత |
| Unorganised | : | అసంఘటిత |
| Indigenous banks | : | దేశీయ (స్థానిక) బ్యాంకులు |

BRAOU

| | | |
|---|---|---|
| Hundi | : | దేశీయ బ్యాంకులు వ్యవహారం చేసే వాణిజ్య బిల్లు |
| Intermediaries | : | మాధ్యమికాలు / మధ్యవర్తులు |
| Lenders | : | రుణదాతలు |
| Borrowers | : | రుణగ్రహీతలు |
| Securities | : | పూచీలు, సెక్యూరిటీలు |
| Assets portfolio | : | ఆస్తుల విభాగం |
| Liquidity | : | ద్రవ్యత్వం |
| Participation | : | పాల్గొనుట |
| Participants | : | పాల్గొనువారు |
| Criteria | : | ప్రాతిపదిక (లు) |
| Classification | : | వర్గీకరణ |
| Division | : | విభజన |
| Provident fund | : | యోగక్షేమ నిధి |
| Pension funds | : | పించన్ నిధులు |
| Non-Bank Financial Intermediaries | : | బ్యాంకేతర విత్త మధ్యవర్తులు |
| Surplus | : | మిగులు |
| Deficit | : | లోటు |
| Risk | : | నష్ట భయం |
| Specialisation | : | ప్రత్యేకీకరణ |
| Financial technology | : | విత్తపరమైన సాంకేతిక పరిజ్ఞానం |
| Priorities | : | ప్రాధాన్యతలు |
| Interests | : | అభిరుచులు, ప్రయోజనాలు |
| Treasury bill | : | కోశ బిల్లు |
| Financial | : | విత్తపరమైన |
| Non - Financial | : | విత్తేతర |
| Primary | : | ప్రాథమిక |
| Secondary | : | ద్వితీయ |
| Claim / Command | : | అధికారం / హక్కు |
| Maturity | : | పరిపక్వత, కాలపరిమితి పూర్తి కావడం |
| Financial flow | : | విత్త ప్రవాహాలు |

- ఆచార్య ఎస్. కిషన్ రావు

BRAOU

# భాగం - 15 : భారత దేశంలో వాణిజ్య బాంకుల విధులు, పురోగతి

విషయ క్రమం

15.0 ఉద్దేశం
15.1 పరిచయం
15.2 వాణిజ్య బాంకుల నిర్వచనాలు
15.3 బాంకులలో రకాలు
15.3.1 వాణిజ్య బాంకులు
15.3.2 యూనిట్ బాంకింగ్, బ్రాంచి బాంకింగ్, మిశ్రమ బాంకింగ్
15.3.3 వ్యవసాయాభివృద్ధి బాంకులు
15.3.4 ప్రాంతీయ గ్రామీణ బాంకులు
15.3.5 నాబార్డు
15.3.6 పారిశ్రామికాభివృద్ధి బాంకులు
15.3.7 వినిమయ బాంకులు
15.3.8 ఎగుమతి - దిగుమతి బాంకు
15.4 వాణిజ్య బాంకులు పాటించే నియమాలు
15.4.1 ద్రవ్యత్వం
15.4.2 లాభదాయకత
15.4.3 భద్రత
15.5 వాణిజ్య బాంకుల పోర్టుఫోలియో పెట్టుబడి
15.5.1 నిజ బిల్లుల సిద్ధాంతం
15.5.2 బదిలీ సిద్ధాంతం
15.5.3 ఊహించే ఆదాయ సిద్ధాంతం
15.5.4 అప్పుల యాజమాన్య సిద్ధాంతం
15.6 వాణిజ్య బాంకుల విధులు
I ప్రాథమిక విధులు
15.6.1 డిపాజిట్ల సేకరణ
15.6.2 ఋణాల సదుపాయం
15.6.3 చెక్కు పద్ధతి

BRAOU

15.6.4 ప్రాధాన్యతా రంగాలకు ఋణాలు

15.6.5 మర్చంట్ బాంకింగ్

15.6.6 పరపతి సృష్టి

II ద్వితీయ విధులు

15.6.7 ఏజెన్సీ సేవలు

15.6.8 సాధారణ సేవలు

15.7 వాణిజ్య బాంకుల ఆస్తి - అప్పుల పట్టీ

15.7.1 అప్పులవైపు అంశాలు

15.7.2 ఆస్తులవైపు అంశాలు

15.8 భారత దేశంలో వాణిజ్య బాంకుల స్వరూపం

15.8.1 బాంకుల జాతీయీకరణ

15.8.2 జాతీయీకరణ అనంతరం బాంకుల ప్రగతి

15.8.3 బాంకు శాఖల విస్తరణ

15.8.4 షెడ్యూల్డ్ బాంకుల డిపాజిట్‌లు, ఋణాలు

15.8.5 ప్రాథమిక రంగాలకు ఋణాలు

15.9 భారత దేశంలో బాంకింగ్ సంస్కరణలు - నరసింహం కమిటీ

15.9.1 నరసింహం కమిటీ

15.9.2 నరసింహం కమిటీ నివేదికలో ప్రధాన అంశాలు

15.9.2 నరసింహం కమిటీ సిఫారసులు

15.10 ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య బాంకుల పాత్ర

15.11 సారాంశం

15.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

15.13 సంప్రదింపు గ్రంథాలు

15.14 భావనలు

BRAOU

## 15.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు భారత దేశంలో వాణిజ్య బాంకుల పని తీరును, వాటి ప్రగతిని తెలుసుకొనగలుగుతారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భారత దేశంలో బాంకింగ్ రంగంలో ప్రవేశపెట్టబడుచున్న "బాంకింగ్ సంస్కరణల"కు గల కారణాలను అవగాహన చేసుకొనగలుగుతారు.

ఈ భాగం చదివిన తరవాత మీరు :

- భారత దేశంలో వాణిజ్య బాంకుల స్వరూపం, వాటి పని తీరును అంచనా వేయగలుగుతారు.
- బాంకుల రకాలను తెలుసుకొంటారు.

- వాణిజ్య బాంకుల ప్రగతిని, ప్రభుత్వ రంగంలో బాంకుల విస్తరణ ఆవశ్యకతను అర్థం చేసుకొనగలుగుతారు.
- బాంకింగ్ సంస్కరణల తీరు, వాటి అమలు యొక్క ప్రాధాన్యతను అవగాహన చేసుకొనగలుగుతారు.

## 15.1 పరిచయం

ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ దేశాలలో అమలులో ఉన్న బాంకింగ్ వ్యవస్థ, ప్రాచీన కాలంలోనే ప్రారంభించబడిందని చెప్పవచ్చు. క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల నాడు బాబిలోన్ ప్రజలు బాంకింగ్ వ్యవస్థను అమలు పరిచారు.

ప్రారంభ దశలో బాంకింగ్ వ్యాపారాన్ని ప్రైవేటు వ్యక్తులు మాత్రమే చేపట్టినప్పటికీ, తరువాత కాలంలో ప్రభుత్వ రంగంలో కూడా వాణిజ్య బాంకులు స్థాపించబడినాయి. 1157వ సంవత్సరంలో స్థాపించబడిన "బాంక్ ఆఫ్ వెనిస్" అతి ప్రాచీనమైన వాణిజ్య బాంకుగా పేర్కొనబడింది.

ఆధునిక బాంకింగ్ వ్యవహారాల ప్రగతికి రెండు వర్గాలకు చెందినవారు - వ్యాపార సంస్థలు, స్వర్ణకారులు- ప్రధాన కారకులని క్రౌథర్ అభిప్రాయపడినాడు.

వ్యాపార లావాదేవీల కోసం ద్రవ్యాన్ని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలించవలసి వుంటుంది. ప్రస్తుతం ఈ విధమైన సౌకర్యాన్ని వాణిజ్య బాంకులు కల్పిస్తున్నాయి. పూర్వం వ్యాపారస్థులకు, వ్యాపార నిమిత్తమై తమ ద్రవ్యాన్ని ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి తీసుకొని వెళ్లుట ఇబ్బందికరంగా ఉండేది. ఇట్లు ద్రవ్యాన్ని భౌతికంగా ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి మోసుకొని పోవుటకు బదులు ఈ ద్రవ్యాన్ని బాధ్యతగల వ్యక్తుల వద్ద డిపాజిట్ చేసి రసీదులు పొందుట ద్వారా వ్యాపారాన్ని కొనసాగించడాన్ని వ్యాపారస్థులు సౌకర్యంగా భావించారు. ఇలాంటి పరిస్థితియే ప్రస్తుతపు "హుండీ" వ్యాపార అభివృద్ధికి కారణమైంది. కాల క్రమంలో ఈ పద్ధతి ఆధునిక బాంకులు జారీ చేసే చెక్కు విధానం, డ్రాఫ్ట్ల జారీ వంటి సమీప ద్రవ్యపు అభివృద్ధికి కారణమైంది.

స్వర్ణకారులు తమ ఖాతాదారుల ద్రవ్యాన్ని, బంగారాన్ని భద్రంగా దాచడం, తిరిగి చెల్లించడం వంటి కార్య క్రమాలు చేపట్టేవారు. స్వర్ణకారుల ఈ విధానమే ప్రస్తుత బాంకింగ్ వ్యవస్థ అభివృద్ధికి చాలా దోహదం చేసింది. తమ ఖాతాదారులు జమ చేసిన మొత్తానికి స్వర్ణకారులు జారీచేసిన రసీదులు వారి వ్యాపార లావాదేవీలకు అవగా అమ్మకాలకు, కొనుగోళ్లకు సాధనాలుగా ఉపకరించాయి. ఈ విధాన క్రమమే వాస్తవంగా ప్రస్తుత బాంకింగ్ ఉన్నతికి, అభివృద్ధికి ప్రధాన కారణమని భావించవచ్చు.

## 15.2 వాణిజ్య బాంకుల నిర్వచనాలు

బాంకులు నిర్వహించే అన్ని కార్యకలాపాలను వివరించేటట్లుగా బాంకు అనే పదాన్ని, బాంకింగ్ వ్యాపారం అనే పదాన్ని నిర్వచించడం కష్టం. ప్రజల నుండి వ్యాపార సంస్థల నుండి డిపాజిట్లను స్వీకరించి వాటికి భద్రత కల్పించి వాటి ద్వారా ఋణాలను సృష్టించే సంస్థలే బాంకులు.

బాంకు అనే పదాన్ని డా॥ హర్ట్ ఈ విధంగా నిర్వచించాడు :. "సాధారణ వ్యాపార సరళిలో వ్యక్తులు జమ కట్టే సొమ్మును వారి పేర కరెంట్ ఖాతాలో జమ కడుతూ ఆయా వ్యక్తులు తనమీద జారీ చేసిన చెక్కులను ఆదరిస్తూ చెల్లించే వ్యక్తి బాంకరు."

భారత బాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టం, 1949 బ్యాంకింగ్ వ్యాపారాన్ని ఈ విధంగా నిర్వచించింది : "కోరిన వెంటనేగాని, చెక్కు, డ్రాఫ్ట్ ఆర్డర్ల ద్వారా గాని, ఇంకొక విధంగా గాని, తిరిగి చెల్లించే షరతుల మీద

డిపాజిట్‌లు స్వీకరించి, ఆ సొమ్మును ఋణాలు ఇవ్వడానికి గాని, పెట్టుబడి కోసం గాని ఉపయోగించడం బాంకింగ్ వ్యాపారం".

## 15.3 బాంకులలో రకాలు

ఆధునిక ఆర్థిక వ్యవస్థలో బాంకింగ్ కార్యకలాపాలకు ఎంతో ప్రాధాన్యత కలదు. బాంకులు ఆచరించే పద్ధతులు, అవి ప్రజలకు, వ్యాపార సంస్థలకు అందించే సేవల, సౌకర్యాల దృష్ట్యా బాంకులను అనేక విధాలుగా వర్గీకరించవచ్చు. వాటిలో ప్రధానమైన వాటిని ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

### 15.3.1 వాణిజ్య బాంకులు

వివిధ రకాల ఆకర్షణీయ పథకాలను రూపొందించి అమలు పరచడం ద్వారా ఖాతాదారుల నుండి డిపాజిట్లను సేకరించి, వారు అడిగిన వెంటనే సొమ్మును సమకూర్చే సంస్థలే వాణిజ్య బాంకులు. ఇవి డిపాజిట్లను సేకరించి వాటి సహాయంతో చెక్కులు, డ్రాఫ్టుల రూపేణా పరపతి ద్రవ్యాన్ని సృష్టిస్తాయి. ఈ బాంకులు సృష్టించే పరపతికి మూలధన మార్కెట్‌లో అత్యంత ప్రాధాన్యత ఉంటుంది.

భారత దేశంలో వాణిజ్య బాంకులు ప్రధానంగా రెండు రకాలుగా ఉన్నాయి. అవి : a) షెడ్యూల్డ్ బాంకులు b) నాన్ - షెడ్యూల్డ్ బాంకులు.

**(a) షెడ్యూల్డ్ బాంకులు**

రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934, సెక్షన్ 42 (బి) లోని రెండవ షెడ్యూల్‌లో నమోదయిన బాంకులను షెడ్యూల్డు బాంకులు అంటారు. మన కేంద్ర బాంకు అయిన రిజర్వు బాంకు నియమావళికి లోబడి ఈ బాంకులకు కొన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయి. వీటి అధీకృత మూలధనం రూ. 5 లక్షలకు తక్కువ కాకుండా ఉండాలి. వీటి చర్యలు ఖాతాదారుల డిపాజిట్ల భద్రతకు ముప్పు వాటిల్లేవిగా ఉండరాదు. ఇవి కంపెనీల చట్టం, 1956 లోని సెక్షన్ 3లో నిర్వచించిన విధంగా "కంపెనీ" గా గుర్తింపు కలిగి ఉండాలి. మన దేశంలో జాతీయం చేయబడిన వాణిజ్య బాంకులు, భారతీయ స్టేట్ బాంకు, దాని అనుబంధ బాంకులు, రాష్ట్ర సహకార బాంకులు, ఇతర అనేక బాంకులు షెడ్యూల్డ్ బాంకులుగా కొనసాగుచున్నవి.

BRAOU

**షెడ్యూల్డ్ బాంకుల బాధ్యతలు**

1. ప్రతి షెడ్యూల్డ్ బాంకు కేంద్ర బాంకు అయిన రిజర్వు బాంకులో అకౌంట్ తెరవాలి. తన మొత్తం డిపాజిట్లలో 3 శాతం రిజర్వ్ బాంకులో నిలువ చేయాలి. ఈ నిలువ శాతాన్ని 3 నుండి 15 శాతం వరకు మార్చే అధికారం రిజర్వు బాంకుకు ఉంది.
2. ప్రతి షెడ్యూల్డ్ బాంకు తన ఆస్తి అప్పుల పట్టికను ప్రతి వారం రిజర్వు బాంకుకు సమర్పించాలి.
3. షెడ్యూల్డ్ బాంకులన్నియూ రిజర్వు బాంకు తనఖీకి లోబడి పనిచేస్తాయి.
4. ఋణాలను మంజూరు చేసేటప్పుడు రిజర్వు బాంకు ఆదేశాలను షెడ్యూల్డ్ బాంకులు పాటించాలి.

**షెడ్యూల్డ్ బాంకుల హక్కులు**

1. హుండీల డిస్కౌంటింగ్ ద్వారా, సెక్యూరిటీల తాకట్టు ద్వారా షెడ్యూల్డ్ బాంకులు రిజర్వు బాంకు నుండి ద్రవ్య సహాయం పొందవచ్చు.

2. ఏ విధమైన చార్జీలు లేకుండా కేంద్ర బాంకు నుండి షెడ్యూల్డ్ బాంకులకు ద్రవ్యపు బట్వాడా జరుగుతుంది.

3. షెడ్యూల్డ్ బాంకులు సంక్షోభ పరిస్థితుల్లో ఉన్నప్పుడు రిజర్వు బాంకు వాటిని ఆదుకొంటుంది.

**(b) నాన్ - షెడ్యూల్డ్ బాంకులు**

రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934, రెండవ షెడ్యూల్‌లో నమోదు కాని బాంకులను నాన్-షెడ్యూల్డ్ బాంకులు అంటారు. వీటి అధీకృత మూలధనం రూ. 5లక్షల కంటే తక్కువగా ఉంటుంది. సాధారణంగా ఇవి చిన్న సంస్థల రూపంలో ఉండి గ్రామీణ ప్రాంతాల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తాయి. ఇవి కూడా రిజర్వు బాంకు ఆజమాయిషీకి లోబడి ఉంటాయి. అయితే వీటికి షెడ్యూల్డ్ బాంకుల వలె ప్రత్యేక హక్కులు ఉండవు.

1992 జూన్ నాటికి మన దేశంలో 289 వాణిజ్య బాంకులు ఉన్నాయి. వీటిలో 239 ప్రభుత్వ రంగంలో ఉన్న షెడ్యూల్డ్ బాంకులు, 34 ప్రైవేట్ రంగంలో ఉన్న షెడ్యూల్డ్ బాంకులు, 13 విదేశీ మారక బాంకులు కాగా మిగిలిన 3 నాన్ - షెడ్యూల్డ్ బాంకులు. గత మూడు దశాబ్దాల కాలంలో 99.9 శాతం బాంకింగ్ వ్యాపారాన్ని షెడ్యూల్డ్ బాంకులు చేయగా, 0.01 శాతం వ్యాపారాన్ని నాన్ - షెడ్యూల్డ్ బాంకులు చేశాయి.

## 15.3.2 యూనిట్ బాంకింగ్, బ్రాంచి బాంకింగ్, మిశ్రమ బాంకింగ్

వాణిజ్య బాంకుల స్వరూపం, వ్యవస్థీకరణను అనుసరించి ఇవి ప్రధానంగా మూడు రకాలుగా ఉంటాయి. అవి : a) యూనిట్ బాంకింగ్, b) బ్రాంచి బాంకింగ్, c) మిశ్రమ బాంకింగ్.

**(a) యూనిట్ బాంకింగ్**

యూనిట్ బాంకులు స్వతంత్ర ప్రతిపత్తిని కలిగి యుండి ఏక కార్యాలయ సంస్థలుగా పనిచేస్తాయి. వీటి వ్యవహారాలు ఈ కార్యాలయానికే పరిమితమై ఉంటాయి. ఈ వ్యవస్థ అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఎక్కువగా వుంది. సాధారణంగా ఈ బాంకులు అధిక శాతం చిన్న పట్టణాల్లో స్థాపించబడతాయి. వీటినే దేశీయ బాంకులని, సిటీ బాంకులని కూడా అంటారు. అయితే ఇవి ఒకదానితో ఒకటి కరస్పాండెంట్ పద్ధతి ద్వారా సన్నిహిత సంబంధం కలిగి ఉంటాయి. అనగా చిన్న పట్టణ ప్రాంతాల్లో ఉండే బాంకులకు సమీప పట్టణ ప్రాంతాల్లో ఉండే బాంకు కరస్పాండెంట్ బాంకుగా వ్యవహరిస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని న్యూయార్క్, షికాగోలలో ఉన్న బాంకులు కరస్పాండెంట్ బాంకులుగా వ్యవహరిస్తున్నాయి.

BRAOU

**యూనిట్ బాంకింగ్ సుగుణాలు**

యూనిట్ బాంకింగ్ వలన కలిగే ప్రయోజనాలు కింది విధంగా ఉంటాయి.

1. ఇవి ఏక కార్యాలయ సంస్థలుగా పనిచేయుట వలన ఉద్యోగ బృందంపై ఆజమాయిషీ సులభతరమవుతుంది. ఇందువలన వనరుల దుర్వినియోగం కాని, అవకతవకలు కాని జరుగుటకు చాలా తక్కువ అవకాశం ఉంటుంది.

2. ఈ బాంకుల వ్యవస్థాపకులు మరియు ఉద్యోగస్తులు స్థానికులైనందువల్ల వీరు ఖాతాదారులతో సత్సంబంధాలు ఏర్పరచుకొని అధిక ద్రవ్యాన్ని సమీకరించగలుగుతారు.

3. స్థానికంగా సేకరించిన ద్రవ్య నిధులను ఆ ప్రాంతపు అభివృద్ధికే ఉపయోగించుటకు వీలుంటుంది.

4. వీటి స్థాపన వలన బాంకింగ్ రంగంలో ఏకస్వామ్యం నిరోధించబడుతుంది.

### యూనిట్ బ్యాంకింగ్ లోపాలు

1. అనుకోకుండా ఏర్పడే నష్టాలను ఇవి ఎదుర్కొనజాలవు. ఉదాహరణకు ఒకపెద్ద ఖాతాదారుడు నిర్దేశిత సమయానికి డబ్బు తిరిగి చెల్లించని పక్షంలో ఈ వ్యవస్థ సంక్షోభానికి గురవుతుంది.

2. ఈ బాంకుల వద్ద ద్రవ్య నిధులు తక్కువగా ఉన్నందువల్ల, ఎక్కువ మంది ఖాతాదారులు ఒకేసారి ద్రవ్యాన్ని వాపసు తీసుకున్న పక్షంలో ఇవి ఆర్థిక దుస్థితికి లోనవుతాయి.

3. ఈ బాంకులకు ఇతర శాఖలు లేనందువలన ఇవి తమ ఖాతాదారులకు బహుళ సేవలనందించవు. అనగా ఇవి స్థానికంగా కేంద్రీకృతం కావడం వల్ల వ్యాపారస్థులు ఇతర ప్రాంతాల్లో వ్యాపారం చేయుటకు ఇవి తోడ్పడవు.

### (b) బ్రాంచి బాంకింగ్

బ్రాంచి బాంకింగ్ ఫెడరల్ వ్యవస్థగా ఉంటుంది. ఈ విధానం మొదట బ్రిటన్‌లో 1833లో అమలు చేయబడింది. తర్వాత ఈ విధానం కెనడా, ఆస్ట్రేలియా, దక్షిణ ఆఫ్రికాలతోబాటు ప్రపంచంలోని అనేక దేశాలకు విస్తరించబడింది. ఈ విధానం ప్రకారం బాంకు యొక్క కేంద్ర కార్యాలయం పెద్ద పెద్ద పట్టణాల్లో ఉండి దాని శాఖలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తాయి. ప్రస్తుతం మన దేశంలో ఈ విధానమే అమలులో వుంది.

### బ్రాంచి బాంకింగ్ సుగుణాలు

1. ఈ విధానపు అమలులో నష్ట భయం తక్కువగా ఉంటుంది. ఒకవేళ నష్టం సంభవించినా, ఒక ప్రాంతంలో వచ్చిన నష్టాన్ని మరొక ప్రాంతంలో వచ్చిన లాభంతో సర్దుబాటు చేయడానికి వీలుంటుంది.

2. ఈ బాంకుల వ్యవస్థా స్వరూపం పెద్ద మొత్తంలో ఉండడం వలన ఇవి సమర్థవంతమైన ఉద్యోగ బృందాన్ని నియమించగలవు.

3. వీటి శాఖలు అనేక ప్రాంతాలలో ఉండడం వలన ఇవి ద్రవ్య నిధులను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలిచండం ద్వారా ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి.

4. ఈ విధానంలో అన్ని ప్రాంతాల్లోనూ వడ్డీ రేట్లలో సమానత్వం ఉంటుంది.

5. కేంద్ర కార్యాలయంగా ఉన్న బాంకుకు అనేక బ్రాంచీలు ఉన్నందువలన ఇవి తమ ద్రవ్య నిధులను సమర్థవంతంగా ఉపయోగించి అధిక లాభాలను ఆర్జించగలుగుతాయి.

6. వీటి వద్ద అధిక మొత్తంలో నిధులు ఉండడం వలన ఇవి బాంకింగ్ నియమాలకు లోబడి ద్రవ్యాన్ని ఎంపిక చేసిన రంగాల్లో పెట్టుబడి చేస్తాయి.

### బ్రాంచి బాంకింగ్ లోపాలు

1. ఈ వ్యవస్థలో వివిధ బ్రాంచీలు కేంద్ర కార్యాలయం ఆజమాయిషీలో ఉన్నందువలన ఉద్యోగిస్వామ్యపు పెత్తనం ఎక్కువగా ఉంటుంది. సమర్థవంతమైన యాజమాన్యం ఉండదు. విధాన నిర్ణయంలో జాప్యం ఉంటుంది.

2. ఈ వ్యవస్థలో స్థానికుల అవసరాలు ఆశించిన రీతిలో తీర్చబడవు. ఎందుకంటే ఈ బాంకులలో పనిచేసే మేనేజరులు తరచూ బదిలీ అవుతూ ఉంటారు.

BRAOU

3. ఈ విధానంలో ఒక ప్రాంతపు నిధులు మరొక ప్రాంతానికి తరలించబడుతాయి. ఈ పరిస్థితి ప్రాంతీయ అసమానతలకు దారి తీయవచ్చు.

4. ఒకే ప్రాంతంలో వివిధ బ్రాంచీల బాంకులు స్థాపించబడడం వలన వీటిమధ్య అనవసర పోటీ పెరుగుతుంది.

పైన వివరించిన లోపాలు బ్రాంచి బాంకింగ్ వ్యవస్థలో ఉన్నప్పటికీ, యూనిట్ బాంకింగ్ కంటే బ్రాంచి బాంకింగ్ మేలైనదని చెప్పవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, ఒకటైన భారత దేశంలో వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపార వాణిజ్య రంగాలకు నిధులు కల్పించుట ద్వారా బ్రాంచి బాంకులు ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. కేంద్ర బాంకు నియమావళిని సమర్థవంతంగా అమలుపరచడం ద్వారా బ్రాంచి బాంకింగ్‌లో గల లోపాలను సరిదిద్దవచ్చు.

**(c) మిశ్రమ బాంకింగ్**

పారిశ్రామిక సంస్థలకు, వ్యాపార వాణిజ్య రంగాలకు స్వల్ప కాలిక ఋణాలతో బాటు దీర్ఘకాలిక ఋణాలను కూడా కల్పించే బాంకింగ్ వ్యవస్థనే "మిశ్రమ బాంకింగ్" అంటారు. బ్రిటన్ బాంకింగ్ విధానం ప్రకారం ఆ దేశంలోని వాణిజ్య బాంకులు కేవలం స్వల్పకాలిక ఋణాలనే కల్పిస్తాయి. కాని నెదర్లాండ్, హంగరీ, జర్మనీ, బెల్జియం వంటి దేశాల్లోని వాణిజ్య బాంకులు స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక ఋణాలు ఇస్తాయి.

**మిశ్రమ బాంకింగ్ సుగుణాలు**

1. పరిశ్రమలకు ప్రారంభ మూలధనం (initial capital) కల్పించడం ద్వారా ఇవి పారిశ్రామికీకరణకు తోడ్పడతాయి.

2. ఇవి పారిశ్రామిక సంస్థల డిబెంచర్లకు, వాటాలకు చందా పూచీ సౌకర్యం కల్పించడం ద్వారా వివిధ వర్గాల పొదుపులకు రక్షణ కల్పిస్తాయి.

3. ఈ బాంకులు పరిశ్రమలకు దీర్ఘకాలిక ఋణాలు కల్పించడం వలన వాటికి అధిక లాభాలు సంక్రమిస్తాయి. అధిక వడ్డీ పొందుటకు వీలవుతుంది.

**మిశ్రమ బాంకింగ్ లోపాలు**

1. ఇవి దీర్ఘ కాలిక ఋణాలు కల్పిస్తాయి. అందువలన ద్రవ్యం చాలా కాలం వరకు తిరిగి రాదు. ఈ పరిస్థితి బాంకులు పాటించే నియమాల్లో ఒకటైన "ద్రవ్యత్వం" అను నియమానికి విఘాతం కల్పిస్తుంది.

2. ఆర్థిక వ్యవస్థలో ఒకవేళ ఆర్థిక మాంద్యం (అంటే ప్రతికూల వ్యాపార పరిస్థితులు) ఏర్పడితే ఋణాలు తీసుకున్న వ్యాపారస్థులు సకాలంలో ఋణాలను చెల్లించరు. అందువలన బాంకులు దివాళా తీసే పరిస్థితి ఏర్పడుతుంది.

## 15.3.3 వ్యవసాయాభివృద్ధి బాంకులు

ఈ బాంకుల ప్రధాన లక్ష్యం వ్యవసాయదారులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాలు కల్పించి రైతులను గ్రామీణ ఋణగ్రస్తుల నుండి, వడ్డీ వ్యాపారస్థుల మోసాల బారి నుండి రక్షించి వ్యవసాయాభివృద్ధి సాధించటం.ఇందు నిమిత్తమై భారత దేశంలో స్వల్పకాలిక ఋణాల కల్పనలో ప్రాథమిక సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బాంకులు, రాష్ట్ర సహకార బాంకులు పనిచేస్తున్నాయి. ప్రాథమిక సహకార సంఘాలు గ్రామీణ స్థాయిలో ఉండి రైతుల పరపతి అవసరాలు తీరుస్తాయి. రాష్ట్ర సహకార బాంకు వివిధ ప్రాథమిక సహకార సంఘాలకు అందించు

పరపతి జిల్లా కేంద్ర సహకార బాంకుల ద్వారా పంపిణీ చేయబడుతుంది. ఈ విధంగా రాష్ట్ర సహకార బాంకు, ప్రాథమిక సహకార సంఘాలకు మధ్య జిల్లా కేంద్ర సహకార బాంకు సమన్వయకర్తగా పనిచేస్తుంది. భూమి అభివృద్ధి బాంకులు రైతులకు దీర్ఘకాలిక ఋణాలను, వారి భూమికి సంబంధించిన పట్టా కాగితాల తాకట్టుపై కల్పిస్తాయి.

## 15.3.4 ప్రాంతీయ గ్రామీణ బాంకులు

సన్నకారు రైతులకు ఉపాంత రైతులకు, స్వయం ఉపాధిని చేపట్టే నిరుద్యోగ విద్యావంతులకు, బలహీన వర్గాలకు, చిన్న వ్యాపారస్థులకు ఋణాలు కల్పించడం వీటి ప్రధాన లక్ష్యం. మన దేశంలో మొదట వీటిని అక్టోబర్ 2వ తేది 1975 సంవత్సరంలో 5 కేంద్ర కార్యాలయాలతో ప్రారంభించారు. 1987 నాటికి వీటి సంఖ్య 196. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో స్థాపించబడి సమీపంలో ఉన్న జాతీయం చేయబడిన వాణిజ్య బాంకు ఆజమాయిషీలో పనిచేస్తాయి.

## 15.3.5 వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బాంకు (National Bank for Agriculture and Rural Development - NABARD)

ఈ బాంకు యొక్క ప్రధాన ఉద్దేశం వ్యవసాయ రంగం మరియు ప్రాంతీయ గ్రామీణాభివృద్ధి. ఈ బాంకు జూలై 12, 1982 సంవత్సరంలో రూ. 100 కోట్ల మూలధనంతో ప్రారంభించబడింది. ఈ బాంకు వ్యవసాయాభివృద్ధికి, గ్రామీణాభివృద్ధికి తోడ్పడే బాంకులైన రాష్ట్ర సహకార బాంకులు, భూమి అభివృద్ధి బాంకులు, ప్రాంతీయ గ్రామీణ బాంకులు, వాణిజ్య బాంకులు మరియు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఋణాలు కల్పించడం ద్వారా పరోక్షంగా వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతుంది.

## 15.3.6 పారిశ్రామికాభివృద్ధి బాంకులు

పారిశ్రామిక సంస్థలకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలు అందించి పారిశ్రామికాభివృద్ధిని సాధించడం ఈ బాంకుల ప్రధాన ఉద్దేశం. ఈ విధమైన ఋణాల కల్పనలో మన దేశంలో భారతీయ పారిశ్రామిక విత్త సహాయ సంస్థ (IFCI, 1948), రాష్ట్ర విత్త సహాయ సంస్థలు (SFCs,1951 Act), భారతీయ పారిశ్రామికాభివృద్ధి బాంకు (IDBI, 1964), యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI, 1964), జీవిత భీమా సంస్థ (LIC), చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బాంకు (SIDBI, 1990) లతో బాటు ICICI (1955), IRBI (1985) వంటివి పనిచేస్తున్నాయి. ఈ బాంకింగ్‌లో పారిశ్రామిక అభివృద్ధి బాంకు (IDBI) శిఖరాగ్రపు బాంకుగా వ్యవహరిస్తూ పరపతి కల్పనలో వివిధ సంస్థల మధ్య సమన్వయం సాధిస్తుంది.

## 15.3.7 వినిమయ బాంకులు

ఒక బాంకు కేంద్ర కార్యాలయం స్వదేశంలో ఉండి దాని బ్రాంచీలు విదేశాలలో ఉంటే వాటిని వినిమయ బాంకులు అంటారు. ఉదాహరణకు మన దేశంలో ఉన్న భారతీయ స్టేట్ బాంకు (SBI) శాఖలు బ్రిటన్‌లో ఉంటే బ్రిటన్‌లో వాటిని వినిమయ బాంక్‌లు అంటారు. ఇవి అంతర్జాతీయ వ్యాపారానికి ఎంతగానో తోడ్పడతాయి. బాంక్ ఆఫ్ అమెరికా, బాంక్ ఆఫ్ టోక్యో, చార్టర్డ్ బాంకు, సిటీ నేషనల్ బాంకు, గ్రిండ్లేస్ బాంకు, ది ఎమిరేట్స్ కమర్షియల్ బాంకు వంటి ప్రముఖమైన వినిమయ బాంకులు ప్రస్తుతం మనదేశంలో వ్యాపారం చేస్తున్నాయి. మనదేశంలో వాణిజ్య బాంకింగ్ రంగంలో అగ్రగామి అయిన భారతీయ స్టేట్ బాంకు బ్రిటన్, అమెరికా మరియు గల్ఫ్ దేశాల్లో తన శాఖలను విస్తరింపజేసింది.

BRAOU

### 15.3.8 ఎగుమతి - దిగుమతి బ్యాంకు

ఎగుమతులు, దిగుమతులు చేపట్టే ఉద్యమదారులకు, వ్యాపార సంస్థలకు అవసరమయిన పరపతిని కల్పించడానికి జనవరి 1, 1982 లో ఈ బ్యాంకును స్థాపించారు. ఇది స్వదేశీ ఉద్యమదారులు విదేశాల్లో చేసే పెట్టుబడులకు కూడా ఋణం కల్పిస్తుంది. పరపతి సహాయమేకాకుండా పరిపాలన, సాంకేతిక పరిజ్ఞానం వంటి విషయాల్లో కూడా ఈ బ్యాంకు ఉద్యమదారులకు సహకారం అందిస్తుంది.

## 15.4 వాణిజ్య బ్యాంకులు పాటించే నియమాలు

వాణిజ్య బ్యాంకులు వాటి వద్ద ఉన్న వాటా మూలధనంతోబాటు పలు రకాల పథకాల ద్వారా ప్రజల నుండి డిపాజిట్లను సేకరిస్తాయి. ఈ బ్యాంకుల ప్రధాన లక్ష్యం లాభాలను ఆర్జించడం. బ్యాంకులు పాటించే "పెట్టుబడి విధానం" పై ఈ లాభాలు ఆధారపడి ఉంటాయి. దీనినే "పోర్టుఫోలియో" పెట్టుబడి అంటారు. ఇందుకోసం అవి లిక్విడిటీ, లాభదాయకత, భద్రత అనే మూడు నియమాలను పాటిస్తాయి. ప్రతిరోజు బ్యాంకులలో కొంతమంది ఖాతాదారులు ద్రవ్యాన్ని డిపాజిట్ చేయగా మరికొంత మంది డిపాజిట్‌లను తిరిగి వాపసు తీసుకొంటూ ఉంటారు. అందుకే ద్రవ్యాన్ని తిరిగి చెల్లించుటకు బ్యాంకుల వద్ద తగినంత ద్రవ్యం నగదు రూపంలో గాని, ద్రవ్యత్వపు ఆస్తుల రూపంలో గాని ఉండాలి. ఇందుకోసం అవి 'లిక్విడిటీ' సూత్రాన్ని పాటించాలి. అలాగని సేకరించిన ద్రవ్యాన్ని నూటికి నూరు శాతం తమ వద్దనే బ్యాంకులు ఉంచుకుంటే అవి నష్టపోతాయి. అందువల్ల జాగ్రత్తగా పెట్టుబడులు చేస్తూ బ్యాంకులు "లాభాన్ని" ఆర్జించాలి. బ్యాంకులు వాటి కార్యకలాపాల ద్వారా దివాళా తీయడం గాని, తీవ్ర నష్టాలకు గురవడం గాని జరిగితే ఖాతాదారుల డిపాజిట్లకు "భద్రత" లోపిస్తుంది. కాబట్టి అవి 'భద్రత' అనే నియమాన్ని పాటించాల్సి ఉంటుంది. ఈ విధంగా ఈ లక్ష్యాలు పరస్పరాధారితమై ఒక దానితో ఒకటి పోటీ స్వభావాన్ని కలిగి ఉంటాయి.

### 15.4.1 లిక్విడిటీ లేదా ద్రవ్యత్వపు నియమం

తమ ఖాతాదారులు అడిగిన వెంటనే ద్రవ్యాన్ని సమకూర్చే స్థాయిలో వాణిజ్య బ్యాంకులు ఉండాలి. అప్పుడే బ్యాంకింగ్ వ్యవస్థపై ఖాతాదారులకు విశ్వాసం ఉంటుంది. ఇందుకోసం బ్యాంకులు నగదు నిలువలను మరియు ద్రవ్యత్వపు ఆస్తులను కలిగి ఉంటాయి. సాధారణంగా వీటి వద్ద నగదు నిలువలు 10 శాతం వరకు ఉంటాయి. బ్యాంకుల ద్రవ్యత్వపు ఆస్తులు ప్రజల బ్యాంకింగ్ అలవాట్లు, ద్రవ్య మార్కెట్ స్వభావం, నగదు నిలువల నిష్పత్తి వంటి అంశాలపై ఆధారపడుతాయి. నగదు నిలువలు ఎక్కువగా ఉంటే బ్యాంకుల వద్ద ద్రవ్యత్వపు ఆస్తులు తక్కువగా ఉంటాయి. ఖాతాదారులు చెక్కుల ద్వారా బ్యాంకింగ్ వ్యవహారాలు చేపడితే బ్యాంకులకు ద్రవ్యపు అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇందుకు భిన్నంగా వారు తరచూ నగదు రూపంలో డిపాజిట్లను వాపసు తీసుకొంటూ ఉంటే బ్యాంకులు ఎక్కువ మొత్తంలో ద్రవ్యాన్ని నిలువ ఉంచాలి. అభివృద్ధి చెందిన ద్రవ్య మార్కెట్ ఉంటే బ్యాంకులు ద్రవ్య నిలువలను ఎక్కువగా ఉంచవలసిన అవసరముండదు. బ్రాంచి బ్యాంకింగ్ వ్యవస్థ అమలులో ఉంటే బ్యాంకులు ద్రవ్యం కొరత ఏర్పడినపుడు కేంద్ర కార్యాలయం నుండి అవసరమయిన నిధులను పొందుతాయి.

బ్యాంకుల వద్ద ద్రవ్యత్వపు ఆస్తులు ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితులలో ద్రవ్యం అవసరమయినప్పుడు అవి ఈ ఆస్తులను ద్రవ్య రూపంలోకి మార్చుకోవచ్చు. కేంద్ర బ్యాంకు వద్ద ఉన్న డిపాజిట్లు, ట్రెజరీ బిల్లులు, పిలుపు ద్రవ్యం మరియు ఇతర రకాల సెక్యూరిటీల రూపంలో ఉన్న ఆస్తులను ద్రవ్యత్వపు ఆస్తులని చెప్పుకోవచ్చు.

BRAOU

బాంకులు పోర్టుఫోలియో రూపంలో చేసే పెట్టుబడికి ద్రవ్యత్వపు లక్షణం ఉండాలి. ప్రభుత్వ స్వల్పకాలిక సెక్యూరిటీలలో పెట్టుబడి చేయడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. ప్రభుత్వ సెక్యూరిటీలలో, బాండ్లలో పెట్టుబడి చేయడం వలన అసలు విలువకు నష్టం వాటిల్లదు. ఇలా కాకుండా బాంకులు ప్రైవేట్ కంపెనీల వాటాలను, డిబెంచర్లను కొనుగోలు చేస్తే అవి మార్కెట్ ఆటుపోటులకు గురయి లాభంగాని, నష్టంగాని సంభవిస్తుంది. అనగా నిశ్చిత పరిస్థితులుండవన్న మాట. భద్రత దృష్ట్యా ఎక్కువ ద్రవ్యత్వపు నిధులు ఉండడం వాణిజ్య బాంకులకు ఆవశ్యకమే అయినప్పటికీ అవి తమ వద్ద ఎక్కువ నగదును ఉంచుకొంటే లాభాలు తగ్గుతాయి. అందువలన బాంకులు ఒకవైపు 'ద్రవ్యత్వపు' నియమంతోబాటు మరోవైపు 'లాభం' అనే నియమాన్ని కూడా పాటించాలి.

### 15.4.2 లాభదాయకత నియమం

వాణిజ్య బాంకుల ప్రధాన లక్ష్యం లాభాలను ఆర్జించడం. అయితే వాటి వ్యాపార లావాదేవీలు అనిశ్చితంగానూ, నష్ట భయంతోనూ కూడుకొని ఉంటాయి. పరిపాలనా ఖర్చులు, సిబ్బంది జీతాలు, వాటాదారులకు డివిడెండ్ల చెల్లింపు వంటి సర్దుబాట్ల కోసం ఈ బాంకులు లాభాలను ఆర్జించవలసి యుంటుంది. అలాగని అధిక లాభోద్దేశంతో ఇవి అనేక రంగాలలో పెట్టుబడి చేయడం సముచితం కాదు. ఎందుకంటే వివిధ రంగాలలో చేసే పెట్టుబడి వ్యాపార చక్రాలకు లోబడి అనిశ్చితంగా ఉంటుంది. నష్టాలు సంభవిస్తే ఇవి 'లాభార్జన' తో బాటు 'ద్రవ్యత్వం' అనే నియమాన్ని కూడా పాటించాలి. ఇందుకోసం ఇవి ప్రభుత్వ సెక్యూరిటీలు, పేరుగాంచిన కంపెనీల వాటాలలో పెట్టుబడి చేస్తే మంచిది.

### 15.4.3 భద్రత నియమం

బాంకుల ఆస్తులకు ప్రధాన ఆధారం ప్రజలనుండి వ్యాపార సంస్థల నుండి సేకరించిన ప్రాథమిక డిపాజిట్లు. అందువలన ఈ ఆస్తులను పెట్టుబడి చేసేటప్పుడు బాంకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవి ఇతరుల డబ్బుతో వ్యాపారం చేస్తున్నందున వారి ద్రవ్యానికి 'భద్రత' కల్పించాలి. వీలయినంతవరకు బాంకులు స్పెక్యులేషన్‌తో కూడిన వ్యాపారం చేయకూడదు. స్పెక్యులేషన్‌తో వ్యాపారం చేసే వారికి ఇవి ఋణాలు ఇవ్వరాదు. ప్రభుత్వ సెక్యురిటీలు, అర్హమైన సెక్యురిటీల పూచీపైన ఋణాలిచ్చుటలో ఇవి శ్రద్ధ వహించాలి. వివిధ రంగాల్లో పెట్టుబడి చేసేముందు, వివిధ వర్గాలకు ఋణాలను కల్పించేటప్పుడు వాటిలో గల ఇబ్బందులను, నష్ట భయాన్ని బాంకులు అంచనా వేసుకోవాలి. లిక్విడిటీ, లాభదాయకత వంటి నియమాలకు భంగం కలగని రీతిలో ఇవి పెట్టుబడి చేయాలి.

పైన పేర్కొన్న మూడు నియమాలను బాంకులు పాటిస్తూ కొన్ని ఎంపిక చేసిన రంగాలలో మాత్రమే కాకుండా నష్ట భయాన్ని సరియైన విధంగా అంచనావేసి పలు రంగాలలో పెట్టుబడి చేయాలి. వీలయినంత వరకు ఇవి కొత్త సంస్థల, పలుకుబడిలేని సంస్థల వాటాలలో పెట్టుబడి చేయకూడదు. స్టాక్ మార్కెట్‌లో దాదాపు నిలకడగా ఉన్న వాటాలలో ఇవి పెట్టుబడి చేయాలి. సాధారణంగా పేరు పొందిన సంస్థల వాటాలు స్టాక్ మార్కెట్ ఆటుపోటులకు గురికావు.

## 15.5 వాణిజ్య బాంకుల పోర్టుఫోలియో పెట్టుబడి సిద్ధాంతాలు

వాణిజ్య బాంకులు గరిష్ట లాభార్జన కోసం వివిధ రంగాలలో చేసే పెట్టుబడినే పోర్టుఫోలియో పెట్టుబడి అంటారు. ఈ రకమైన పెట్టుబడి చేయుటలో బాంకులు ద్రవ్యత్వం, లాభదాయకత, భద్రత అనే బాంకింగ్ నియమాల మధ్య సంతులనం సాధించటానికి ప్రయత్నిస్తాయి. పోర్టుఫోలియో పెట్టుబడికి సంబంధించి కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించబడినాయి. వాటిని గురించి తెలుసుకొందాం.

BRAOU

### 15.5.1 నిజ బిల్లుల సిద్ధాంతం (Real Bills Theory)

ఇది సంప్రదాయక సిద్ధాంతం. బాంకులు ఉత్పాదకతతో కూడుకొన్న స్వల్పకాలిక ఋణాలను ఇవ్వడాన్ని నిజ బిల్లుల సిద్ధాంతం తెలుపుతుంది. ఋణాల గడువు తక్కువయినందువలన బాంకుల నిధులు ఎక్కువ కాలం ఒకరివద్ద లేదా ఒక సంస్థ వద్ద నిలకడగా ఉండవు. పైగా ఉత్పాదకతతో కూడుకొన్న రంగాలకు ఋణాలు ఇవ్వడం వలన వాటి వసూలులో ఇబ్బంది ఉండదు. వర్తక వాణిజ్యాల ప్రగతి అధికంగా ఉంటే వాణిజ్య బాంకుల ఋణాల సంఖ్య కూడా పెరుగుతుంది. అయితే మాంద్య వ్యాపార పరిస్థితులున్నపుడు ఈ సిద్ధాంతం సత్ఫలితాలనివ్వదు.

### 15.5.2 బదిలీ సిద్ధాంతం (The Shiftability Theory)

ఈ సిద్ధాంతం ప్రకారం బాంకు ఒకసారి ఇచ్చిన ఋణం వసూలైన తరువాతే కొత్త ఋణం ఇవ్వడానికి బదులుగా గడువుకు ముందే ఋణ పరిమాణాన్ని ఇతర సంస్థలకు బదిలీ చేయాలి. బాంకింగ్ వ్యవస్థకు నష్టం రాకుండా ఈ బదిలీ జరగాలి. సూక్ష్మ ఆర్థిక విశ్లేషణ ప్రకారం ఇది సాధ్యమనిపించినా బాంకింగ్ వ్యవస్థనంతా దృష్టిలో ఉంచుకొన్నప్పుడు స్థూల విశ్లేషణ ప్రకారం ఇది ఆచరణ సాధ్యం కాదు.

### 15.5.3 ఊహించే ఆదాయ సిద్ధాంతం (Anticipated Income Theory)

సిద్ధాంతాన్ననుసరించి ఋణాన్ని ఇచ్చే ముందు ఋణగ్రహీత యొక్క "చెల్లింపు సామర్థ్యం"ను అంచనా వేయాలి. అప్పులు పుచ్చుకున్నవారు వాటిని ఏ విధంగా తీరుస్తారనేది ప్రధాన అంశం. ఈ విధానం ద్వారా బాంకుల ఋణ విస్తరణకు అవకాశముంటుంది.

### 15.5.4 అప్పుల యాజమాన్య సిద్ధాంతం (Liability Management Theory)

వాణిజ్య బాంకుల పోర్టుఫోలియో పెట్టుబడి సిద్ధాంతాలలో ఇది ఆధునిక సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం వాణిజ్య బాంకులు తమ వద్ద అధిక మొత్తంలో ద్రవ్యత్వంతో కూడుకొన్న నిధులను ఉంచుకోవాల్సిన అవసరం లేదు. స్వల్పకాలంలోకూడా వనరులను సమకూర్చుకొనుటకు వాణిజ్య బాంకులకు అనేక మార్గాలున్నాయని ఈ సిద్ధాంతం చెబుతుంది. ఈ సిద్ధాంతం పేర్కొన్న వనరుల సమీకరణ ఆధారాలు ఈ విధంగా ఉన్నాయి : i) లాభాలను తిరిగి పెట్టుబడి చేయుట (ii) సహ వాణిజ్య బాంకుల నుండి ఋణాలు పొందుట (iii) కేంద్ర బాంకు నుండి ఋణాలు పొందుట (iv) ద్రవ్య మార్కెట్ నుండి ఋణాలు సేకరించుట (v) కాల పరిమితి పత్రాల జారీ ద్వారా డిపాజిట్ల సేకరణ మొదలగునవి.

## 15.6 వాణిజ్య బాంకుల విధులు

వాణిజ్య బాంకులు ప్రధానంగా రెండు రకాల విధులను నిర్వర్తిస్తాయి. అవి : (1) ప్రాథమిక విధులు (2) ద్వితీయ విధులు లేదా ఏజెన్సీ విధులు.

### I ప్రాథమిక విధులు

### 15.6.1 డిపాజిట్ల సేకరణ

బాంకులు ప్రజల నుండి అనేక రకాలైన డిపాజిట్లను సేకరిస్తాయి. ఈ విధంగా అవి గృహ రంగపు పొదుపును సమీకరిస్తాయి. బాంకులు సేకరించే వివిధ రకాల డిపాజిట్లను కింది విధంగా పేర్కొనవచ్చు.

i) **సేవింగ్స్ డిపాజిట్లు (పొదుపు ఖాతాలు)**

చిన్న పొదుపు మొత్తాలను ప్రోత్సహించుటకు ఈ విధమైన డిపాజిట్లను వాణిజ్య బాంకులు సమీకరిస్తాయి. బాంకు నియమాలకు లోబడి ప్రజలు ఈ ఖాతాలో ద్రవ్యాన్ని జమ చేయవచ్చు, తిరిగి తీసుకోవచ్చు. ఈ రకమైన డిపాజిట్లపై బాంకులు స్వల్ప మొత్తం వడ్డీని చెల్లిస్తాయి.

ii) **కరెంట్ డిపాజిట్లు లేదా డిమాండ్ డిపాజిట్లు**

కరెంట్ డిపాజిట్లనే డిమాండ్ డిపాజిట్లని కూడా అంటారు. ఇలాంటి ఖాతాలో వ్యాపారస్థులు, పెద్ద వ్యాపార సంస్థలు ద్రవ్యాన్ని జమ చేయవచ్చు. ఏ విధమైన నోటీసు లేకుండా ఈ రకమైన ఖాతాదారులు బాంకుల నుండి ద్రవ్యాన్ని తిరిగి తీసుకోవచ్చు. ఖాతాదారులు అడిగిన వెంటనే బాంకులు ద్రవ్యాన్ని సమకూర్చుతాయి. కరెంట్ ఖాతాలపై బాంకులు ఎలాంటి వడ్డీని చెల్లించవు.

iii) **ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా కాల పరిమితి డిపాజిట్లు**

ఒక నిర్ణీత కాలానికి ఖాతాదారులు ఈ పద్ధతి ద్వారా ద్రవ్యాన్ని జమ చేసుకోవచ్చు. 15 రోజులకు పైబడి 2 సం॥లకు లోబడి ఖాతాదారులు ఈ రకమైన డిపాజిట్ల రూపంలో ద్రవ్యాన్ని దాచుకోవచ్చు. డిపాజిటు కాలాన్ని బట్టి వడ్డీ రేటు మారుతూ ఉంటుంది. ఈ రకమైన డిపాజిట్లపై బాంకులు 10 నుండి 12 శాతం వడ్డీ చెల్లిస్తాయి. నిర్ణీత కాలం త రువాత ద్రవ్యాన్ని డిపాజిట్‌దారు తిరిగి తీసుకోవచ్చు. అవసర నిమిత్తమై గడువుకు ముందు కూడా డిపాజిట్‌దారు ద్రవ్యాన్ని తిరిగి పొందవచ్చు. ఈ పరిస్థితిలో బాంకులు కొంత వడ్డీని మినహాయించుకొని డబ్బును చెల్లిస్తాయి.

iv) **హోమ్ లోన్ అకౌంట్**

గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించడంలో భాగంగా కొన్ని వాణిజ్య బాంకులు ఈ విధమైన ఖాతా ద్వారా పొదుపులను సమీకరిస్తున్నాయి. ఈ ఖాతాలో కొంత నిర్దేశిత కాలానికి ద్రవ్యాన్ని జమ చేసిన ఖాతాదారులు గడువు తీరిన తరువాత వారు జమ చేసిన మొత్తానికి కొన్ని రెట్లు ఋణం రూపంలో పొందవచ్చు.

v) **స్టాక్ ఇన్‌వెస్ట్‌మెంట్ పథకం**

వివిధ సంస్థలు జారీ చేసే వాటాలను (shares), డిబెంచర్లను కొనుగోలు చేయడానికి వీలుగా ఖాతాదారులుగా ఈ ఖాతాలో జమ చేసుకొనే సౌకర్యాన్ని ప్రస్తుతం వాణిజ్య బాంకులు కల్పిస్తున్నాయి. సాధారణంగా వాటాల కొనుగోళ్లకు ప్రజలు ప్రత్యక్షంగా ద్రవ్యాన్ని చెల్లింపు చేసినపుడు 3 నెలల కాల వ్యవధి వరకు వేచి యుండాలి. ఈ వ్యవధిలో ఒకవేళ వాటాలు వారి పేర జారీ కాని పక్షంలో ఏ విధమైన వడ్డీ చెల్లించకుండా సంస్థలు డబ్బును వాపసు చేస్తాయి. కాని ప్రజలు ఈ స్టాక్ ఇన్‌వెస్ట్‌మెంట్ పథకంలో డబ్బును జమ చేస్తే వారు వాటాలు పొందని పక్షంలో వారికి నిలువ ఉన్న ద్రవ్యంపై వడ్డీ చెల్లించబడుతుంది.

vi) **మ్యూచువల్ ఫండ్స్**

బాంకులు "బోర్డ్ ఆఫ్ ట్రస్టీ" లను నియమించి వాటి యాజమాన్యంలో ప్రజలనుండి, సంస్థలనుండి డిపాజిట్లను మ్యూచువల్ ఫండ్స్ రూపంలో సేకరిస్తున్నాయి. ఇట్లు సేకరించిన ద్రవ్యాన్ని బాంకులు ఎంపిక చేసిన రంగాలలో పెట్టుబడి చేసి తద్వారా వచ్చిన లాభాన్ని ఖాతాదారులకు డివిడెండ్ల రూపంలో పంపిణీ చేస్తాయి. ఈ మ్యూచువల్ ఫండ్స్ డిపాజిట్ల సేకరణలో ప్రస్తుతం భారతీయ స్టేట్ బాంకు, పంజాబ్ నేషనల్ బాంకు, కెనరా బాంకు, ఇండియన్ బాంకు వంటివి చురుగ్గా పాల్గొంటున్నాయి. ఈ రూపంలో ద్రవ్యాన్ని సమీకరించే బాంకులన్నీ

BRAOU

"సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా" (SEBI) పర్యవేక్షణలో ఉండి అది రూపొందించే నియమాలను పాటిస్తున్నాయి.

### 15.6.2 ఋణాల పదుపాయం

వాణిజ్య బాంకులు వివిధ రూపాలలో సేకరించిన ప్రాథమిక డిపాజిట్ల సహాయంతో బాంకింగ్ నియమ నిబంధనలకు లోబడి పెట్టుబడిదారులకు ఋణాలను కల్పిస్తాయి. ఇవి వ్యాపారస్థులకు, పెట్టుబడిదారులకు తగిన సెక్యూరిటీల ఆధారంగా గాని, బంగారం నిల్వల పూచీపై గాని ఋణాలనిస్తాయి.

బాంకులు పెట్టుబడిదారులకు అందించే ఋణాలు అనేక విధాలుగా ఉంటాయి. వాటిని గురించి తెలుసుకొందాం.

**i) ఓవర్ డ్రాఫ్టులు**

కరెంట్ ఖాతాలో డబ్బును జమచేసిన ఖాతాదారులకు వాణిజ్య బాంకులు ఈ రకమైన ఋణ సహాయాన్ని కల్పిస్తాయి. ఈ సౌకర్యం ద్వారా ఖాతాదారులు తాము జమచేసిన మొత్తం కంటే ఎక్కువ అనగా బాంకు అనుమతించిన మేరకు చెక్కులను జారీచేయవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తికి కరెంట్ ఖాతాలో ఒక లక్ష రూపాయలు ఉండగా, బాంకు అతనికి యాభై వేల రూపాయల ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పిస్తే ఆ వ్యక్తి లక్షా యాభై వేల రూపాయల వరకు చెక్కులు జారీచేయవచ్చు.

**ii) క్యాష్ క్రెడిట్**

పారిశ్రామిక సంస్థలు, వ్యాపార సంస్థల వంటివి ఈ రకమైన ఋణాన్ని వాణిజ్య బాంకుల నుండి తీసుకొంటాయి. వ్యక్తిగత పూచీపై గాని, లేదా వస్తువులను తాకట్టుపెట్టడం ద్వారాగానీ బాంకుల నుండి ఈ విధమైన ఋణాన్ని పొందవచ్చు. బాంకులు అనుమతించిన పరిమితి వరకు సంస్థలు ఋణాన్ని వాడుకోవచ్చు.

**iii) బిల్లుల డిస్కౌంటింగ్**

అర్హమైన బిల్లులను డిస్కౌంటింగ్ చేయడం ద్వారా వ్యాపార రంగానికి బాంకులు ఋణాలను కల్పిస్తాయి. సాధారణంగా వ్యాపారస్థుల మధ్య జరిగే వ్యాపారం అరువు పద్ధతిలో ఉంటుంది. వ్యాపార లావాదేవీలలో వస్తు కొనుగోలుదారు, వస్తు అమ్మకందారునకు వస్తువు విలువకు సంబంధించి 'వ్యాపార బిల్లు' (trade bill) వ్రాసి ఇస్తాడు. సాధారణంగా వ్యాపార బిల్లులు 3 నెలల కాల వ్యవధికి సంబంధించి ఉంటాయి. బిల్లులో నిర్దేశిత కాలం వరకు వేచి ఉండకుండా వ్యాపారస్థునికి గడువుకు ముందే ద్రవ్యం అవసరం రావచ్చు. అలాంటి సందర్భాల్లో ఈ బిల్లును కలిగియున్న వ్యాపారస్థుడు ఆ బిల్లును తన బాంకు వద్ద డిస్కౌంట్ చేసుకొని ఋణం పొందవచ్చు. బిల్లు కాల పరిమితి అనంతరం బాంకు ఆ ద్రవ్యాన్ని వసూలు చేసి ఖాతాదారుని పేర జమ చేస్తుంది.

**iv) పిలుపు ద్రవ్యం (Money at Call)**

అతి తక్కువ కాలానికి సంబంధించి ఈ రకమైన ఋణాలను వాణిజ్య బాంకులు కల్పిస్తాయి. ఈ విధమైన ఋణాన్ని బాంకులు తగిన సెక్యూరిటీని, డిబెంచర్లను పూచీగా ఉంచుకొని షేర్ బ్రోకర్లకు, సహా బాంకులకు ఇస్తాయి. ఈ ఋణాల కాల పరిమితి సాధారణంగా 7 రోజుల నుండి 15 రోజుల వరకు ఉంటుంది.

**v) కాల పరిమితి ఋణాలు**

వ్యాపారస్థులకు, పారిశ్రామిక వేత్తలకు, వ్యవసాయదారులకు బాంకులు ఈ రకమైన ఋణాలను ఇస్తాయి. సాదారణంగా ఈ ఋణాల కాల పరిమితి 1 సం॥ నుండి 10 సం॥ ల వరకు ఉంటుంది. ఈ

BRAOU

ఋణాలను బాంకులు నిర్ణయించిన ప్రకారం వాయిదాల రూపంలో తిరిగి చెల్లించాలి. యంత్రాలను, యంత్ర పరికరాలను కొనడానికి సంస్థలకు ఈ ఋణం ఉపకరిస్తుంది.

### 15.6.3 చెక్కు పద్ధతి

తమ ఖాతాదారులు డిపాజిట్లను వాపసు తీసుకోవడానికి వీలుగా ఆధునిక బాంకింగ్ "చెక్కుల పద్ధతి" ని ప్రవేశ పెట్టింది. ఈ చెక్కులు రెండు రకాలుగా ఉంటాయి. అవి : (1) బేరర్ చెక్కు, (2) క్రాస్డ్ చెక్కు. మొదటి రకం చెక్కును కలిగియున్న వ్యక్తికి ఆ చెక్కును బాంకుకు సమర్పించిన తక్షణమే డబ్బు చెల్లించబడుతుంది. కాగా రెండవ రకమైన చెక్కు ద్వారా ఈ అవకాశముండదు. క్రాస్డ్ చెక్కును కలిగియున్న వ్యక్తి దానిని బాంకుకు సమర్పిస్తే అందులో నిర్దేశించిన ద్రవ్యాన్ని అతని పేర జమ చేసిన పిమ్మట అతను ఆ ద్రవ్యాన్ని బాంకు నుండి పొందవచ్చు.

### 15.6.4 ప్రాధాన్యతా రంగాలకు ఋణాలు

జాతీయీకరణకు పూర్వం అధిక శాతం వాణిజ్య బాంకులు పట్టణ ప్రాంతాలకే పరిమితమై పెద్ద పారిశ్రామిక సంస్థలకే ఋణాలనిచ్చేవి. 1969లో బాంకుల జాతీయీకరణ జరిగిన తరువాత ఇవి తమ శాఖలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి. వీటి ఋణ విధానంలో కూడా గణనీయమైన మార్పు వచ్చింది. రిజర్వు బాంకు ఆఫ్ ఇండియా నిర్దేశాలకు అనుగుణంగా ఇవి "ప్రాధాన్యతా రంగాలకు" ఋణాలివ్వడం ప్రారంభించాయి. చిల్లకారు రైతులు, ఉపాంత రైతులు, చిన్న పరిశ్రమల ఉద్యమదారులు, స్వయం ఉపాధిని చేపట్టే నిరుద్యోగ యువంతులు, బలహీన వర్గాల ప్రజలు మొదలగు వారికి ఋణాల నివ్వడం వంటివి ప్రాధాన్యతా రంగాల కిందికి వస్తాయి. 1969 సంగలో వాణిజ్య బాంకులు వ్యవసాయ రంగానికి కేవలం రూ. 40 కోట్ల ఋణం కల్పించగా 1990 జూన్ నాటికి ఇవి రూ. 15,283 కోట్ల ఋణం కల్పించాయి. అలాగే చిన్న పరిశ్రమలకు 1969లో బాంకులు కల్పించిన ఋణం రూ. 257 కోట్లు కాగా ఇది 1985 నాటికి రూ. 9,354 కోట్లకు పెరిగింది.

### 15.6.5 మర్చంట్ బాంకింగ్

ఆధునిక బాంకింగ్ విస్తరణా పథంలో పేర్కొనదగ్గ అంశం 'మర్చంట్ బాంకింగ్' వృద్ధి. ఈ వ్యవస్థ ద్వారా బాంకులు పారిశ్రామిక సంస్థలకు, ఉద్యమదారులకు, నూతన వస్తూత్పత్తికి సంబంధించిన వివరాలను వాటాల జారీ సూత్రాలను తెలియజేస్తాయి. సంస్థలు జారీ చేసిన వాటాలకు చందా పూచీ సౌకర్యం కల్పిస్తాయి. మర్చంట్ బాంకింగ్ విస్తరణలో భాగంగా భారతీయ స్టేట్ బాంక్ (SBI) ఆగస్టు 1, 1986లో 'SBICAP' ను స్థాపించి కార్పోరేటు రంగానికి విత్త వ్యవహారాలలో ఎంతగానో తోడ్పడుతున్నది. ఈ బాంకు మర్చంట్ బాంకింగ్ ద్వారా ఇండియన్ రైల్వే కార్పోరేషన్, ఇండోగల్ఫ్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ వంటి సంస్థలకు ఈక్విటీ మూలధనం కల్పించింది. ఈ బాంకుతో బాటు ఇతర బాంకులు కూడా మర్చంట్ బాంకింగ్‌ను విస్తరింపజేస్తున్నాయి. మర్చంట్ బాంకింగ్ వ్యవహారాలపై SEBI, RBI ల నియంత్రణ ఉంటుంది.

### 15.6.6 పరపతి సృష్టి

ప్రాథమిక డిపాజిట్ల సహాయంతో వాణిజ్య బాంకులు పరపతిని సృష్టిస్తాయి. ఖాతాదారుల నుండి సేకరించిన డిపాజిట్లలో కొంత శాతం నగదు నిలువల రూపంలో కేంద్ర బాంకు వద్ద ఉంచి మిగిలిన ద్రవ్యం సహాయంతో వాణిజ్య బాంకులు పరపతి ద్రవ్యాన్ని సృష్టిస్తాయి. ఈ ద్రవ్యం చెక్కులు, డ్రాఫ్ట్‌ల రూపంలో ఉంటుంది. ఈ పరపతి ద్రవ్యం నగదు నిలువల నిష్పత్తిపై, ప్రాథమిక డిపాజిట్లపై ఆధారపడుతుంది. నగదు నిలువల నిష్పత్తి తక్కువగా ఉంటే వాణిజ్య బాంకులు ఎక్కువ పరపతిని సృష్టిస్తాయి. సాధారణంగా బాంకులు

BRAOU

ఋణాలు మంజూరు చేసినప్పుడు ఆ మొత్తాన్ని అప్పుదారు పేర ఖాతా తెరుస్తుంది. అప్పును నగదు రూపంగా ఇవ్వదు. అయితే అప్పును చెక్కుల ద్వారా పొందేందుకు వీలు కల్పిస్తుంది. ఈ విధంగా చెక్కుల రూపంలో జారీ చేయబడే ద్రవ్యమే పరపతి ద్రవ్యం.

## II ద్వితీయ విధులు

### 15.6.7 ఏజెన్సీ సేవలు

తమ ఖాతాదారుల కోసం వారి తరపున వాణిజ్య బాంకులు కింది విధమైన ఏజెన్సీ విధులను వాణిజ్య బాంకులు నిర్వర్తిస్తాయి.

i) ఖాతాదారులు తమ వద్ద ఉన్న వాటాలు, డిబెంచర్ల మీద వచ్చే వడ్డీని వసూలు చేయవలసిందిగా కోరినపుడు అవి సాధారణ కమీషన్‌పై ఈ పనిని చేసి పెడతాయి.

ii) తమ తరపున ఇన్స్యూరెన్స్ ప్రీమియంలు, క్లబ్ చందాలు, ఇంటి అద్దెలు మొదలగు వాటిని చెల్లించమని ఖాతాదార్లు బాంకులను కోరినపుడు ఈ విధమైన పనిని కమీషన్ పద్ధతిపై వాణిజ్య బాంకులు చేస్తాయి.

iii) బాంకులు ఖాతాదార్లకు ఏజంట్లుగా, ట్రస్టీలుగా, కరస్పాండెంట్‌లుగా కూడా వ్యవహరిస్తాయి.

iv) ఖాతాదారులకు ఆదాయపు పన్నుల లెక్కల వివరాల సమర్పణకు అవసరమయిన సహాయాన్ని కూడా వాణిజ్య బాంకులు అందజేస్తాయి.

### 15.6.8 సాధారణ సేవలు

పైన పేర్కొన్న విధులతో పాటు వాణిజ్య బాంకులు అనేక సాధారణ సేవలను కూడా తమ ఖాతాదార్లకు కల్పిస్తాయి.

i) ఖాతాదారులు తమ విలువైన డాక్యుమెంట్లను, బంగారు ఆభరణాలను దాచుకోవడానికి వీలుగా లాకర్ సౌకర్యాన్ని బాంకులు కల్పిస్తాయి.

ii) ఖాతాదారులు, వారి వ్యాపార వ్యవహారాలు కొనసాగించడానికి వీలుగా బాంకులు చెక్కులు, డ్రాఫ్ట్‌లు, ట్రావెలర్ చెక్కులు వంటివి జారీ చేస్తాయి.

iii) వ్యాపారస్తులకు పరపతి లేఖలు (letter of credit) జారీ చేయడం ద్వారా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తాయి.

iv) వివిధ కంపెనీలు జారీ చేసే వాటాలకు, డిబెంచర్లకు బాంకులు చందా పూచీ సౌకర్యం కల్పిస్తాయి.

## 15.7 వాణిజ్య బాంకుల ఆస్తి, అప్పుల పట్టీ

అన్ని వ్యాపార సంస్థల వలెనే వాణిజ్య బాంకులు కూడా ప్రతి సంవత్సరం ఆస్తి - అప్పుల పట్టీని తయారుచేసి ప్రకటిస్తాయి. ఈ ఆస్తి - అప్పుల పట్టీని పరిశీలిస్తే బాంకు కార్యకలాపాల పనితీరును అవగాహన చేసుకోవడానికి వీలవుతుంది. వ్యాపార సంస్థల ఆస్తి - అప్పుల పట్టీలో వాటిలో పెట్టుబడి చేసిన భాగస్వాములకే ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఇతరుల ద్రవ్యంతో వాణిజ్య బాంకులు తమ కార్యకలాపాలు కొనసాగించడం వలన,

BRAOU

బాంకులు సృష్టించే పరపతి ప్రభావం ఆర్థిక వ్యవస్థపైన ఉండడం వలన బాంకుల ఆస్తి - అప్పుల పట్టీ విషయంలో వాటి భాగస్వాములకే గాక సాధారణ ప్రజానీకానికి కూడా అధిక శ్రద్ధాశక్తులు ఉంటాయి. సాధారణంగా ఈ పట్టీలో ఆస్తులు కుడివైపున, అప్పులు ఎడమవైపున జంట పద్దు విధానంలో చూపబడతాయి. బాంకుల ఆస్తి, అప్పుల పట్టీలో ముఖ్య అంశాలు పట్టిక - 15.1 లో చూపిన విధంగా ఉంటాయి.

**పట్టిక - 15.1 : బాంకు ఆస్తి - అప్పుల పట్టీ నమూనా**

| అప్పులు | ఆస్తులు |
|---|---|
| 1. వాటా మూలధనం<br>a) అధీకృత మూలధనం<br>b) జారీ చేసిన మూలధనం<br>c) చందా మూలధనం<br>d) చెల్లించమని కోరిన మూలధనం | 1. చేతిలో నగదు<br>a) కేంద్ర బాంకు మరియు ఇతర బాంకుల వద్ద ఉన్న నగదు నిధులు |
| 2. రిజర్వు నిధి | 2. పిలుపు ద్రవ్యం |
| 3. ప్రాథమిక డిపాజిట్లు<br>a) సేవింగ్స్ డిపాజిట్లు<br>b) కరెంట్ డిపాజిట్లు<br>c) ఫిక్స్‌డ్ డిపాజిట్లు | 3. డిస్కౌంట్ చేయబడిన బిల్లులు |
| 4. ఇతర బాంకుల నుండి ఋణాలు | 4. పెట్టుబడులు |
| 5. ఖాతాదార్ల తరపున అంగీకరించిన, ఎండార్స్ చేసిన హుండీలు | 5. ఋణాలు, అడ్వాన్సులు |
| | 6. ఖాతాదార్ల తరపున అంగీకరించిన, ఎండార్స్ చేసిన హుండీలు |

BRAOU

## 15.7.1 అప్పుల వైపు అంశాలు

### 1. వాటా మూలధనం

కంపెనీల వలె బాంకులు కూడా అధీకృత మూలధనాన్ని కలిగి ఉంటాయి. ఈ అధీకృత మూలధనంలో కొంతభాగం వాటాదారుల నుండి సమీకరించవచ్చు. ఇందుకోసం బాంకు జారీ చేసే వాటాలనే జారీచేసిన మూలధనం అంటారు. జారీచేసిన వాటాలలో ప్రజలు తీసుకొన్న వాటాలను చందా మూలధనం అంటారు. వాటాదారులు మొత్తం మూలధనాన్ని ఒకేసారి చెల్లించకుండా వాయిదాలలో చెల్లించమని బాంకులు కోరవచ్చు. దీనినే చెల్లించమని కోరిన మూలధనం అంటారు.

### 2. రిజర్వు నిధి

బాంకులు సంపాదించిన లాభాన్నంతయూ వాటాదారులకు పంచిపెట్టకుండా కొంత మొత్తం ఉంచవచ్చు. దీనినే రిజర్వు నిధి అంటారు. ఇది బాంకుల ప్రగతికి, విస్తరణకు తోడ్పడుతుంది.

### 3. ప్రాథమిక డిపాజిట్‌లు

వాణిజ్య బాంకుల వ్యాపారానికి ప్రధాన ఆధారం ప్రాథమిక డిపాజిట్లు. ఇవి సేవింగ్స్ డిపాజిట్లు, కరెంట్ డిపాజిట్లు, ఫిక్సెడ్ డిపాజిట్ల రూపంలో ఉంటాయి. ఈ డిపాజిట్‌లే వాణిజ్య బాంకులు సృష్టించే పరపతికి ప్రధాన ఆధారం.

### 4. ఇతర బాంకుల నుండి ఋణాలు

అత్యవసర పరిస్థితులలో వాణిజ్య బాంకులు కేంద్ర బాంకు నుండి, సహా బాంకుల నుండి పొందే ఋణాన్ని ఈ అంశం తెలుపుతుంది.

### 5. ఖాతాదార్ల తరపున అంగీకరించిన హుండీలు

తన ఖాతాదారులు ఇతర ప్రాంతాలలో సరుకును కొనుగోలు చేసినప్పుడు బాంకులు పరపతి లేఖలు జారీచేస్తాయి. కొన్న సరుకు విలువ మేరకు అమ్మకందారు కొనుగోలుదారుపై గాకుండా అతని బాంకు పైన హుండీ వ్రాస్తాడు. ఈ హుండీల చెల్లింపుకు బాంకులు బాధ్యత వహిస్తాయి. హుండీ కాలం పూర్తి అయిన నాటికి బాంకులు ఈ సొమ్మును చెల్లిస్తాయి. అందుకే ఈ అంశం బాంకుల అప్పులవైపు చూపబడుతుంది. అయితే హుండీ కాలం గడువుకు ముందే ఖాతాదారులు హుండీ సొమ్మును బాంకుకు చెల్లించాల్సి యుంటుంది. కావున ఈ అంశం బాంకు ఆస్తుల వైపు కూడా చూపబడుతుంది.

## 15.7.2 ఆస్తులపైపు అంశాలు

### 1. చేతిలో నగదు

బాంకింగ్ వ్యాపారానికి ప్రధాన ఆధారం ప్రాథమిక డిపాజిట్‌లు. కావున డిపాజిటర్‌లు అడిగిన వెంటనే ద్రవ్యాన్ని సమకూర్చడానికి బాంకుల వద్ద తగినంత నగదు ఉండాలి. ఇందుకోసం బాంకులు తమవద్ద కొంత నగదును ఉంచుకోవడంతోబాటు కేంద్ర బాంకు వద్ద, సహా బాంకుల వద్ద కూడా నగదును దాచుకొంటాయి. ప్రతిరోజూ బాంకులో కొంతమంది ద్రవ్యాన్ని డిపాజిట్ చేయగా మరికొంత మంది వాపసు తీసుకొంటూ ఉంటారు. ఇట్లా జరిగే వసూళ్లు, చెల్లింపులు సాధారణంగా సమానంగా ఉంటాయి. ఒకవేళ వసూళ్ల కన్నా చెల్లింపులు ఎక్కువ చేయాల్సి వచ్చినపుడు బాంకుల వద్ద ఉండే నగదు ఉపయోగపడుతుంది.

### 2. పిలుపు ద్రవ్యం

సాధారణంగా ఈ రకమైన ద్రవ్యాన్ని బాంకులు షేర్ బ్రోకర్‌లకు, సహా బాంకులకు అతి స్వల్పకాలిక వ్యవధి రూపంలో ఇస్తాయి. అడిగిన వెంటనే ఇలాంటి ద్రవ్యాన్ని బాంకులు వాపసు పొందగలుగుతాయి.

### 3. డిస్కౌంటు చేయబడిన బిల్లులు

వ్యాపారస్థుల హుండీలను డిస్కౌంట్ చేసుకోవడం ద్వారా బాంకులు ఋణాలనిస్తాయి. గడువు తీరిన తరువాత వీటికి సంబంధించిన డబ్బు తప్పనిసరిగా వసూలవుతుంది. అయితే మన దేశంలో అభివృద్ధి చెందిన బిల్లు మార్కెట్ లేనందువలన బాంకులు ట్రెజరీ బిల్లులు కొనడానికి ద్రవ్యాన్ని ఉపయోగిస్తున్నాయి. ఈ బిల్లులను త్వరితంగా నగదులోకి మార్చుకోవడానికి వీలవుతుంది.

### 4. పెట్టుబడులు

బాంకులు సేకరించిన ద్రవ్యాన్ని తమ వద్దనే నగదుగా ఉంచుకుంటే లాభాలు రావు. అందువలన ఇవి ఎంపిక చేసిన రంగాలలో, నష్ట భయం తక్కువ ఉన్న రంగాలలో పెట్టుబడి చేస్తాయి. ప్రభుత్వ సెక్యూరిటీలలో

BRAOU

పెట్టుబడి చేయుటకు ఇవి ఇష్టపడతాయి. ఈ రూపంలో చేసే పెట్టుబడికి అధిక ద్రవ్యత్వంతోబాటు భద్రత కూడా ఉంటుంది.

5. **ఋణాలు, అడ్వాన్సులు**

బాంకులు వ్యాపారస్థులకు, ఖాతాదారులకు ఋణాలనిస్తాయి. ఈ ఋణాలపై వడ్డీ రూపంలో బాంకులకు ఎంతో ఆదాయం లభిస్తుంది. తగిన సెక్యూరిటీలను ఆధారం చేసుకొని బాంకులు వ్యాపారస్తులకు ఋణాలిస్తాయి.

## 15.8 భారత దేశంలో వాణిజ్య బాంకుల స్వరూపం

పూర్వకాలంలో మన దేశంలో దేశీయ బాంకింగ్ వ్యాపారం ఎక్కువగా ఉండేది. మన దేశంలో బ్రిటిష్ వారి ఆధిపత్యంలో ఉన్నప్పుడు వాణిజ్య బాంకింగ్ వ్యవస్థకు పునాది ఏర్పడిందని చెప్పవచ్చు. పాశ్చాత్య దేశాల్లో ఉండే పద్ధతిలో 1770 సం॥లో బాంక్ ఆఫ్ హిందుస్తాన్ అనే బాంకును కలకత్తాలో స్థాపించారు. భారతీయుల యాజమాన్యంలో 1881 లో ఔద్ కమర్షియల్ బాంక్ స్థాపించబడింది. ప్రభుత్వ సహాయంతో 1806 లో బాంక్ ఆఫ్ కలకత్తా, 1840 లో బాంక్ ఆఫ్ బొంబాయి, 1843 లో బాంక్ ఆఫ్ మద్రాస్ స్థాపించబడినాయి. 1921 లో ఈ మూడు బాంకులను సంలీనం చేసి ఇంపీరియల్ బాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు. 1955 లో దీనిని జాతీయం చేసి భారతీయ స్టేట్ బాంకుగా మార్చారు. ప్రస్తుతం మన దేశంలో వాణిజ్య బాంకింగ్ రంగంలో ఇదే అగ్రగామి బాంకు.

రిజర్వు బాంకు ఆఫ్ ఇండియా చట్టం, 1934 ప్రకారం భారత దేశంలో ఉన్న వాణిజ్య బాంకులను రెండు రకాలుగా విభజించవచ్చు : (1) షెడ్యూల్డ్ బాంకులు (2) నాన్ - షెడ్యూల్డ్ బాంకులు. రిజర్వు బాంకు ఆఫ్ ఇండియా చట్టం, 1934లోని రెండవ షెడ్యూల్‌లో నమోదై, రూ. 5 లక్షల అధికృత మూలధనం కలిగి ఉన్న బాంకులు షెడ్యూల్డ్ బాంకులుగా పరిగణింపబడతాయి. కాగా రిజర్వు బాంకు చట్టం, 1934 లోని రెండవ షెడ్యూల్‌లో నమోదు కాని బాంకులు నాన్-షెడ్యూల్డ్ బాంకులుగా పిలువబడతాయి.

షెడ్యూల్డ్ వాణిజ్య బాంకులను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి : (1) ప్రభుత్వ రంగ వాణిజ్య బాంకులు లేదా జాతీయం చేయబడిన వాణిజ్య బాంకులు (2) ప్రైవేట్ బాంకులు.

BRAOU

### 15.8.1 బాంకుల జాతీయీకరణ

మన కేంద్ర బాంకు అయిన రిజర్వు బాంకు 1935 సం॥లో స్థాపించబడింది. దీనిని 1949 సం॥లో జాతీయం చేశారు. వాణిజ్య బాంకింగ్ రంగంలో జాతీయం చేయబడిన బాంకులలో భారతీయ స్టేట్ బాంక్ మొట్టమొదటిది. బ్రిటిష్ పాలనా కాలంలో స్థాపించబడిన బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీ బాంకులను విలీనం చేసి 1921 సం॥లో ఇంపీరియల్ బాంకును స్థాపించారు. 1935 సం॥లో రిజర్వు బాంకును స్థాపించే వరకు కేంద్ర బాంకు విధులను ఈ బాంకే నిర్వహించింది. అయితే ఈ బాంకు వాటా మూలధనంలో అధికభాగం ఆంగ్లేయులదే ఉండింది. హోదాలు గల పదవులు ఆంగ్లేయులు పొందారు. ఇందువలన ఈ బాంకు తీవ్ర విమర్శలకు గురయింది. గ్రామీణ పరపతి పరిశీలనా సంఘం సిఫారసు మేరకు భారత ప్రభుత్వం 1955 సం॥ జూలై 1వ తేదీ నాడు ఈ ఇంపీరియల్ బాంకును జాతీయం చేసి స్టేట్ బాంకు ఆఫ్ ఇండియాగా మార్చింది. 1960 సం॥లో దీని అనుబంధ బాంకులైన స్టేట్ బాంక్ ఆఫ్ మైసూర్, హైదరాబాద్, ఇండోర్, బీకనీర్ అండ్ జయపూర్, పాటియాలా, సౌరాష్ట్ర, ట్రావెంకూర్‌లను కూడా జాతీయం చేసింది.

ఇంపీరియల్ బాంకును జాతీయం చేసినప్పటినుంచి మిగిలిన వాణిజ్య బాంకులను కూడా జాతీయం చేయాలనే అభిప్రాయం చోటు చేసుకొంది. ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న బాంకులు అవినీతికి పాల్పడ్డాయి. ఈ బాంకులు ధనవంతుల ఆధీనంలో ఉండటం వలన, వాటిని వారు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకొన్నారు. స్పెక్యులేషన్ వ్యాపారం చేయడం, అధిక లాభాల కోసం ద్రవ్య నిధులలో కృత్రిమ కొరత సృష్టించడం వంటి అక్రమ చర్యలు చేశారు. బాంకు డైరెక్టర్లే పెద్ద పారిశ్రామిక సంస్థల డైరెక్టర్‌లు కూడా కావడం వలన బాంకుల ఋణాలలో అధిక శాతం వీరే ఉపయోగించుకున్నారు. ఈ విధమైన అక్రమ చర్యలే బాంకింగ్ రంగంలో ప్రైవేట్ యాజమాన్యపు ఆర్థిక శక్తి కేంద్రీకరణకు దారితీశాయి. బాంకులను జాతీయం చేసినట్లయితే ఈ అక్రమ వ్యవహారాలకు తావుండదని భావించబడింది.

ఆర్థిక వ్యవస్థలో ప్రధాన రంగాలైన వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, ఎగుమతులు, దిగుమతులు మొదలగు రంగాలకు వాణిజ్య బాంకులు ఋణాలను కల్పించలేదు. ఈ ప్రాథమిక రంగాలకు ఋణాలను కల్పించి ఆర్థికాభివృద్ధి సాధించడం కోసం బాంకులను జాతీయం చేయడమే ఉత్తమ మార్గమని భావించబడింది. అయితే బాంకుల జాతీయీకరణ విషయంలో 1969 సం॥వరకు ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేదని చెప్పవచ్చు. బాంకుల నిర్వహణలో ఉన్న లోటుపాట్లను సవరించి అవి ప్రాథమిక రంగాలకు ఋణాలిచ్చేందుకు వీలుగా వీటిపై 'సామాజిక నియంత్రణ' విధించవలెనని ప్రభుత్వం భావించింది. ఇందుకు అనువుగా బాంకింగ్ రెగ్యులేషన్ చట్టాన్ని సవరించి 1968 సం॥లో ప్రభుత్వం బాంకులపై 'సామాజిక నియంత్రణ'ను ప్రవేశపెట్టింది.

బాంకులపై విధించిన 'సామాజిక నియంత్రణ' ఆశించిన ఫలితాలనివ్వలేదు. బాంకుల ఋణ విధానంలో పెద్ద మార్పులు ఏమీ రాలేదు. బాంకుల నిర్వహణ సరిగాలేదనే భావం బలపడింది. జాతీయం చేయకుండా సామాజిక నియంత్రణ విధించడం అర్థరహితమని ప్రభుత్వం భావించి జూలై 19, 1969 సం॥లో రూ. 50 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లుగల 14 వాణిజ్య బాంకులను జాతీయం చేసింది. జాతీయం చేసిన 14 బాంకులు ఏవంటే: 1. అలహాబాద్ బాంకు 2. బాంక్ ఆఫ్ బరోడా 3. బాంక్ ఆఫ్ మహారాష్ట్ర 4. కెనరా బాంక్ 5. సెంట్రల్ బాంక్ ఆఫ్ ఇండియా 6. దేనా బాంకు 7. ఇండియన్ బాంకు 8. ఇండియన్ ఓవర్‌సీస్ బాంకు 9. పంజాబ్ నేషనల్ బాంకు 10. యునైటెడ్ బాంకు 11. సిండికేట్ బాంకు 12. బాంక్ ఆఫ్ ఇండియా 13 యునైటెడ్ కమర్షియల్ బాంకు 14. యూనియన్ బాంక్ ఆఫ్ ఇండియా.

BRAOU

ఏప్రిల్ 15వ తేది, 1980 సం॥లో రూ. 200 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్‌లు కలిగియున్న మరో 6 వాణిజ్య బాంకులను కూడా ప్రభుత్వం జాతీయం చేసింది. అవి : 1.ఆంధ్రా బాంకు 2. కార్పొరేషన్ బాంకు 3. న్యూ బాంక్ ఆఫ్ ఇండియా 4. ఓరియంటల్ బాంక్ ఆఫ్ కామర్స్ 5. పంజాబ్ అండ్ సింధ్ బాంక్ 6. విజయా బాంకు.

జాతీయం చేయబడిన బాంకులలో న్యూ బాంక్ ఆఫ్ ఇండియా నష్టాలతో నడుస్తున్నందున దానిని 1993 సెప్టెంబర్‌లో పంజాబ్ నేషనల్ బాంకులో విలీనం చేశారు. ఈ విధంగా ప్రస్తుతం మన దేశంలో 27 జాతీయం చేయబడిన బాంకులు, ప్రైవేట్ రంగంలో 38 బాంకులు, 21 విదేశీ మారక బాంకులు, 196 ప్రాంతీయ గ్రామీణ బాంకులు పని చేస్తున్నాయి.

### 15.8.2 జాతీయీకరణ అనంతరం బాంకుల ప్రగతి

1969 సం॥లో ప్రవేశపెట్టబడిన బాంకుల జాతీయీకరణ బాంకింగ్ వ్యవస్థలో ఒక చారిత్రక సంఘటన. దీని అమలు ద్వారా ప్రైవేట్ బాంకింగ్ రంగంలో గల అక్రమ అవినీతి వ్యవహారాలను నిరోధించి బాంకుల ద్వారా ప్రాధాన్యతా రంగాలకు ఋణాలు కల్పించాలని ప్రభుత్వం భావించింది. జాతీయీకరణ వలన ఋణాల

కల్పనలో బాంకు విధానాలలో చెప్పుకోదగ్గ మార్పులు వచ్చాయి. ఆర్థిక స్థితిని బట్టి, పరపతిని బట్టి ఋణాలు మంజూరుకు బదులుగా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బాంకులు ఋణాలు మంజూరు చేయనారంభించాయి. బాంకుల శాఖలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయి.

### 15.8.3 బాంకు శాఖల విస్తరణ

ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య బాంకులు ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంటాయి. వివిధ రంగాల ప్రగతి బాంకింగ్ రంగ అభివృద్ధిపై ప్రత్యక్షంగా ఉంటుంది. కావున బాంకులు పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి. జాతీయాకరణ ద్వారా ఇది సాధ్యపడింది. వాణిజ్య బాంకుల శాఖల విస్తరణ వివరాలు పట్టిక 15.2లో వివరించబడినాయి.

**పట్టిక - 15.2 : వాణిజ్య బాంకుల శాఖల విస్తరణ**

| తేది/సం॥ | బ్రాంచీల సంఖ్య | గ్రామీణ బ్రాంచీలు | మొత్తం బ్రాంచీలలో గ్రామీణ బ్రాంచీలు (శాతంలో) |
|---|---|---|---|
| 19-7-1969 | 8,260 | 1,860 | 22 |
| 30-6-1993 | 61,050 | 33,880 | 55 |

Source : *Economic Survey, 1993 - 94*

జాతీయాకరణ నాటికి మన దేశంలో వాణిజ్య బాంకుల శాఖలు 8,260 ఉండగా 1,860 (22 శాతం) శాఖలు మాత్రమే గ్రామీణ ప్రాంతాలలో ఉన్నాయని, జాతీయాకరణ అనంతరం 1993 సం॥ నాటికి వీటి శాఖల సంఖ్య 61,050 కి పెరిగి, మొత్తంలో 55 శాతం శాఖలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయనే విషయం పట్టిక 15.2 ద్వారా తెలుసుకోవచ్చు.

### 15.8.4 షెడ్యూల్డ్ బాంకుల డిపాజిట్‌లు, ఋణాలు

జాతీయాకరణ ద్వారా వాణిజ్య బాంకుల శాఖలు దేశం నలుమూలలా విస్తరింపబడడమే గాకుండా వాటి డిపాజిట్ల సేకరణ, ఋణాల కల్పనలో కూడా గణనీయమైన మార్పులు సంభవించాయి. వాటి వివరాలు పట్టిక 15.3 లో తెలుపబడ్డాయి.

**పట్టిక - 15.3 : అన్ని షెడ్యూల్డ్ బాంకుల డిపాజిట్‌లు, ఋణాలు**

| సంవత్సరం | డిపాజిట్‌లు | ఋణాలు |
|---|---|---|
| 1950-51 | 820 | 580 |
| 1960-61 | 1,750 | 1,320 |
| 1970-71 | 5,910 | 4,690 |
| 1980-81 | 37,990 | 25,270 |
| 1990-91 | 1,92,540 | 1,16,300 |
| 1992-93 | 2,68,570 | 1,15,980 |

Source : RBI, *Report on Currency and Finance, 1992 - 93, Vol. II.*

B R A O U

పట్టిక 15.3 లోని వివరాల ప్రకారం జాతీయాకరణ ముందు గల రెండు దశాబ్దాలలో డిపాజిట్లలోని పెరుగుదల 7 రెట్లు కాగా జాతీయాకరణ అనంతరం ఈ పెరుగుదల 40 రెట్లయింది. ఇంచుమించు ఇదే రకమైన మార్పు వాణిజ్య బాంకులు ఇచ్చే ఋణాలలో ఉండడం గమనించదగ్గ అంశం.

### 15.8.5 ప్రాథమిక రంగాలకు ఋణాలు

జాతీయాకరణ ద్వారా బాంకుల ఋణ కల్పనలో ప్రయోజనాత్మక మార్పులు సంభవించాయి. జాతీయాకరణకు పూర్వం ఈ బాంకులు ప్రాథమిక రంగాలైన వ్యవసాయ రంగం, చిన్న పరిశ్రమల రంగం, ఎగుమతుల రంగం, బలహీన వర్గాలు వంటి వాటిని నిర్లక్ష్యం చేశాయి. అయితే జాతీయాకరణ అనంతరం ఇవి ప్రాథమిక రంగాలకు కూడా ఋణాలు కల్పిస్తున్నాయి. 1960లో బాంకులు ప్రాథమిక రంగాలకు కేవలం రూ. 440 కోట్లు ఋణాన్ని ఇవ్వగా అవి 1993లో రూ. 47,850 కోట్లు ఇచ్చాయి.

## 15.9 భారత దేశంలో బాంకింగ్ సంస్కరణలు - నరసింహం కమిటీ

### 15.9.1 నరసింహం కమిటీ

బాంకుల జాతీయాకరణ అనంతరం గత రెండు దశాబ్దాల కాలంలో భారత దేశంలో వాణిజ్య బాంకులు గణనీయమైన ప్రగతిని సాధించాయి. బాంకింగ్ శాఖల విస్తరణ ద్వారా గృహ రంగపు పొదుపు సమీకరణ విస్తరించబడింది. బాంకింగ్ రంగంలో ఇలాంటి పరిమాణాత్మకపు మార్పు సంభవించినప్పటికీ, గుణాత్మకపు మార్పులు చోటు చేసుకోలేదు. బాంకులు ఖాతాదారులకు అందించే సౌకర్యాలలోనూ, ఇతర వాణిజ్య బాంకులతో పోటీని ఎదుర్కోవడంలోనూ విఫలమయ్యాయి. పరపతి వ్యవస్థలో ఏర్పడిన ఇలాంటి ప్రతిష్టంభనను తొలగించడం కోసమై ఈ విషయాలను అధ్యయనం చేయవలసిందిగా భారత ప్రభుత్వం యం. నరసింహం అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ 1991 నవంబర్‌లో తన నివేదికను సమర్పించింది.

### 15.9.2 కమిటీ నివేదికలోని ప్రధాన అంశాలు

1969, జూలైలో బాంకు జాతీయాకరణ అనంతరం వాటి ప్రగతి, వాటి సమస్యలను నరసింహం కమిటీ క్రింది విధంగా పేర్కొంది.

**ప్రగతికి సంబంధించిన అంశాలు**

i) బాంకు శాఖల విస్తరణ ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా జరిగింది.

iI) డిపాజిట్ల సేకరణలో గణనీయమైన పెరుగుదల జరిగింది.

iii) బాంకులు ఇచ్చే ఋణాల్లో ప్రాధాన్యతా రంగాలకు ఋణ విస్తరణ జరిగింది.

iv) బాంకులు తక్కువగా ఉన్న రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బాంకు శాఖల విస్తరణ జరిగింది.

**సమస్యలు**

బాంకుల జాతీయాకరణ అనంతరం బాంకులు చెప్పుకోదగిన ప్రగతిని సాధించినప్పటికీ అవి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని నరసింహం కమిటీ అభిప్రాయపడింది. ఇందుకు గల ప్రధాన కారణాలను నాలుగు రకాలుగా నరసింహం కమిటీ విభజించింది.

BRAOU

1. పెట్టుబడి విధానం
2. పరపతి విధానం
3. బాంకింగ్ వ్యవహారాల్లో రాజకీయ ప్రమేయం
4. బాంకుల్లో పెరుగుతున్న నష్టాలు

**1. పెట్టుబడి విధానం**

బాంకింగ్ వ్యవస్థ ప్రగతి అవి కలిగియున్న ద్రవ్యత్వ ఆస్తులపై ఆధారపడుతుంది. మన దేశంలో బాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టం, 1949, సెక్షన్ 24 ప్రకారం తాము సేకరించే అన్ని రకాల డిపాజిట్లలో 25 శాతం మొత్తాన్ని ద్రవ్యం, బంగారం, ప్రభుత్వ సెక్యూరిటీల రూపంలో బాంకులు నిలువ ఉంచాలి. ఇందుకోసం RBI చట్టబద్ధమైన ద్రవ్యత్వ నిష్పత్తి (SLR) ని 25 శాతం నుండి 38.5 శాతం వరకు మార్పు చేసే అధికారాన్ని కలిగి యున్నది. ఈ విధంగా SLR లో మార్పులు ప్రవేశపెట్టడం ద్వారా తమ నిధులను ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి చేయవలసిందిగా RBI వాణిజ్య బాంకులను నిర్దేశించవచ్చు. ఇందువల్ల వాణిజ్య బాంకులు తమ పెట్టుబడి నిధులను వ్యాపార పారిశ్రామిక రంగాలకు తరలించలేకపోతున్నాయని నరసింహం కమిటీ పేర్కొంది.

SLR లోని పెరుగుదల వాణిజ్య బాంకుల లాభం రేటును తగ్గిస్తుందని నరసింహం కమిటీ పేర్కొంది. ఎందుకంటే ఈ చట్టబద్ధత్వ నిష్పత్తి రూపంలో ఉంచిన నిధులపై బాంకులకు ఇచ్చే వడ్డీ రేటు, మార్కెట్‌లో లభించే వడ్డీ రేటు కంటే తక్కువ. SLR ను పెంచడం ఒక విధంగా బాంకులపై విధించే 'పన్ను' లాంటిదని నరసింహం కమిటీ అభిప్రాయపడింది.

RBI చట్టం, 1934 ప్రకారం ప్రతీ వాణిజ్య బాంకు తాను సేకరించే డిపాజిట్లలో కొంతమేరకు నగదు నిలువల నిష్పత్తి (CRR) రూపంలో ఉంచాలి. ఈ నిష్పత్తిని RBI 5 నుండి 15 శాతం వరకు మార్పు చేయవచ్చు. తరచూ నగదు నిలువల నిష్పత్తిలో వచ్చే మార్పులు కూడా వాణిజ్య బాంకుల పెట్టుబడి విధానాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం SLR 38.5 శాతం, CRR 15శాతం ఉన్నాయి. ఈ విధంగా వాణిజ్య బాంకులు దాదాపు 53.5 శాతం నిధులను నగదు రూపంలో ఉంచవలసి వుంది.

**2. పరపతి విధానం**

1969 లో వాణిజ్య బాంకులను జాతీయం చేసిన తరవాత వాటి ఋణ కల్పన తీరులో భారీ మార్పులు ఏర్పడ్డాయి. ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయ రంగం, చిన్న తరహా పరిశ్రమల వంటి వాటికి కూడా ఋణాలను విస్తరింపజేశాయి. ఇంతేగాక ఎగుమతి రంగానికి కూడా ఇవి ఋణాలను కల్పిస్తున్నాయి. "భద్రతతో కూడిన పరపతి కల్పన" స్థానంలో "లక్ష్యాల సాధనకు పరపతి" చోటుచేసుకున్నది. ఈ విధమైన మార్పులు ఆశించదగినవే అయినప్పటికీ వాణిజ్య బాంకులు ఇలాంటి మార్పులవలన విపరీతమైన బకాయిల (overdues) సమస్యతో సతమతమవుతున్నాయి.

**3. పాలనా వ్యవస్థలో రాజకీయ ప్రమేయం**

బాంకుల పరపతి వ్యవస్థ పతనానికి ఒక ప్రధాన కారణం బాంకింగ్ పాలనా కార్యక్రమాల్లో 'రాజకీయ ప్రమేయం' పెరగడమే అని ఈ కమిటీ తెలిపింది. ఉదాహరణకు కాంగ్రెసు ప్రభుత్వం అమలు పరచిన "లోన్ మేళా"లు బాంకింగ్ ప్రాథమిక సూత్రాలకు విరుద్ధం. అదే విధంగా సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (IRDP) దాని సంబంధిత ఋణాల కల్పన కూడా ఈ పరిస్థితికి దారితీసింది. పారిశ్రామిక రుగ్మతకు లోనైన పరిశ్రమలకు

ఋణాలనివ్వవలసిందిగా బాంకులను ప్రభుత్వం ఆదేశించడం కూడా బాంకింగ్ వ్యవహారాల్లో రాజకీయ జోక్యానికి నిదర్శనం.

**4. బాంకింగ్ రంగంలో పెరుగుతున్న నష్టాలు**

బాంకింగ్ రంగంలో పెరుగుతూ ఉన్న నష్టాలకు గల కారణాలను నరసింహం కమిటీ క్రింది విధంగా పేర్కొంది.

1. అవసరానికి మించిన బాంకింగ్ శాఖల విస్తరణ.
2. బాంకులలో సిబ్బంది సంఖ్యలో, పదోన్నతిలో విస్తరణ.
3. పదోన్నతి, బదిలీలు, వేతనాల పెరుగుదల వంటి విషయాల్లో కార్మిక సంఘాల పాత్ర.
4. ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమల వంటి వాటికి సబ్సిడీ రూపంలో తక్కువ వడ్డీ రేటుకు ఋణాలనివ్వడం.

### 15.9.3 నరసింహం కమిటీ సిఫారసులు

బాంకుల ప్రాథమిక డిపాజిట్లలోని పెరుగుదలకు మూలం ఖాతాదారులు. కావున ఖాతాదారులకు బాంకింగ్ పట్ల నమ్మకాన్ని పెంచుటకు బాంకులకు తగినంత స్వేచ్ఛ అవసరమని ఈ కమిటీ అభిప్రాయపడింది. ఇందుకోసమై చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి (SLR)ని 38.5 శాతం నుండి 25 శాతానికి తగ్గించాలని ఈ కమిటీ సూచించింది. అదే విధంగా RBI నగదు నిలువల నిష్పత్తిని పెంచే బదులుగా బహిరంగ మార్కెట్ వ్యవహారాల (open market operations) పై ఆధారపడాలని ఈ కమిటీ పేర్కొంది. అంతేగాక వాణిజ్య బాంకులు CRR రూపంలో ఉంచే ద్రవ్య నిధులపై ఎక్కువ శాతం వడ్డీ రేటును చెల్లించాలని అభిప్రాయపడింది. ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చే ఋణాలను శాశ్వత పద్ధతిపై కాకుండా తాత్కాలిక పద్ధతిలో ఎంపిక చేసిన బలహీన వర్గాలకు కల్పించాలని ఈ కమిటీ సూచించింది. అంతేగాక ఈ రకమైన ఋణం మొత్తం ఋణంలో 10 శాతానికి మించరాదని కూడా తెలిపింది. ఋణాల కల్పనలో బాంకులు వసూలు చేసే వడ్డీ రేట్లపై ప్రస్తుతం ప్రభుత్వ పరంగా ఉన్న నిర్దేశాలన్నింటినీ తొలగించాలని కమిటీ తెలిపింది.

BRAOU

ఈ కమిటీ సిఫారసులను అంగీకరించి భారత ప్రభుత్వం 1991-92 నుండి "బాంకింగ్ సంస్కరణ" ల రూపంలో అమలు పరుస్తోంది. ఉదాహరణకు చట్టబద్ధమైన ద్రవ్యత్వ నిష్పత్తిని 38.5 శాతం నుండి 33 శాతానికి తగ్గించింది. అలాగే నగదు నిలువల నిష్పత్తిలో 1 శాతం తగ్గుదల ప్రవేశ పెట్టింది. బాంకులకు విధాన నిర్ణయంలో తగినంత స్వేచ్ఛ కల్పించుటకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

## 15.10 ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య బాంకుల పాత్ర

ఒక దేశ మూలధన మార్కెట్‌లో వాణిజ్య బాంకుల కార్యకలాపాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఆర్థికాభివృద్ధి రేటును నిర్ణయించుటలో మూలధన సంచయనం ముఖ్యపాత్ర కలిగియుంటుంది. ఈ మూలధనంలోని పెరుగుదల తిరిగి పొదుపు రేటుపై ఆధారపడుతుంది. గృహ రంగం, వ్యాపార రంగం నుండి వాణిజ్య బాంకులు పొదుపులు సమీకరించుట ద్వారా మూలధన సంచయనంలోని పెరుగుదలకు తోడ్పడతాయి. పారిశ్రామిక రంగంలో నవకల్పనలను ప్రవేశపెట్టుటకు ప్రధాన ఆధారం వాణిజ్య బాంకులు సమకూర్చే మూలధన నిధులు. ప్రపంచ దేశాల్లో 18వ మరియు 19వ శతాబ్దాల కాలంలో ఏర్పడిన పారిశ్రామిక విప్లవానికి వాణిజ్య

బ్యాంకింగ్ కార్యకలాపాలు ఎంతగానో తోడ్పడ్డాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాల ప్రగతిలో వాణిజ్య బ్యాంకుల తోడ్పాటు ప్రశంసనీయం. ప్రత్యేకించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఉన్న దేశాల్లో వాణిజ్య బ్యాంకులు అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ఈ దేశాలలో అధిక శాతం ప్రజలు పేదరికంలో ఉండి నిరుద్యోగులై వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. అందువలన ఈ దేశాలలో మూలధనం కొరతగా ఉంటుంది. ఇలాంటి నిరోధకాల తొలగింపుకు వాణిజ్య బ్యాంకులు తోడ్పడతాయి.

ఆర్థికాభివృద్ధిలో వాణిజ్య బ్యాంకుల పాత్రను క్రింద పేర్కొన్న అంశాల సహాయంతో వివరించవచ్చు.

### 15.10.1 పొదుపుల సమీకరణ

ప్రజల నుండి డిపాజిట్లను సేకరించి వాటి సహాయంతో పరపతిని సృష్టించుట ద్వారా వాణిజ్య బ్యాంకులు పెట్టుబడి నిధులను సమకూర్చుతాయి. చిన్న మొత్తాల పొదుపులను సమీకరించి మూలధన నిధులను పెంచి వివిధ సంస్థలకు స్వల్పకాలిక, మధ్యకాలిక ఋణాలివ్వడం ద్వారా ఉత్పాదకతను పెంచుతాయి.

### 15.10.2 పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ఋణాలు

వాణిజ్య బ్యాంకులు తగిన సెక్యూరిటీలను పూచీగా ఉంచుకొని వివిధ రంగాలకు ఋణాలు కల్పిస్తాయి. ఈ కారణంగా ఇవి పెద్ద పారిశ్రామిక సంస్థలకే ఋణాలివ్వడానికి ఇష్టపడతాయి. కానీ మన దేశంలో జాతీయాకరణ అనంతరం ఇవి పారిశ్రామిక రంగంతో బాటు వ్యవసాయ రంగానికి కూడా ఋణాలు కల్పిస్తున్నాయి.

### 15.10.3 స్వయం ఉపాధి పథకాలకు ఋణాలు

విద్యావంతులైన నిరుద్యోగుల కోసం ప్రభుత్వం అమలు పరుస్తున్న వివిధ స్వయం ఉపాధి పథకాలకు అవసరమైన పరపతిని వాణిజ్య బ్యాంకులు కల్పిస్తూ నిరుద్యోగ సమస్య నివారణకు కృషి చేస్తున్నాయి. ఇంజనీరింగ్, వైద్య శాస్త్రం వంటి సాంకేతిక విద్య నభ్యసించే విద్యార్థులకు ఋణాలు అందించడం ద్వారా ఇవి యువత భవిష్యత్తుకు బంగారు బాట వేయుటలో తోడ్పడుతున్నాయి.

### 15.10.4 ఎగుమతులకు ప్రోత్సాహం

వాణిజ్య బ్యాంకులు దేశీయ వ్యాపారానికే గాకుండా అంతర్జాతీయ వ్యాపారానికి అవసరమయిన నిధులను సమకూర్చుతున్నాయి. వ్యాపార బిల్లులను డిస్కౌంట్ చేసి ఋణాలివ్వడం ద్వారా ఇవి అంతర్జాతీయ వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతున్నాయి.

### 15.10.5 ద్రవ్య విధానం

వ్యాపార చక్రాలను నివారించడానికి, ధరలలో స్థిరీకరణను సాధించడానికి కేంద్ర బ్యాంకు అమలు పరిచే ద్రవ్య విధానపు విజయానికి వాణిజ్య బ్యాంకులు కేంద్ర బ్యాంకుతో సహకరిస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయి.

### 15.10.6 నవకల్పనలు

ఆర్థికాభివృద్ధికి నవకల్పనలు ఎంతో ఉపకరిస్తాయి. షుంపీటర్ అనే ఆర్థికవేత్త ప్రకారం వాణిజ్య బ్యాంకులు కల్పించే పరపతి ద్వారానే నవకల్పనలు సాధ్యమవుతాయి. ఉద్యమదారులు నవకల్పనలను ప్రవేశపెట్టడానికి వాణిజ్య బ్యాంకులు ప్రోత్సహిస్తాయి.

## 15.10.7 బాంకింగ్ అలవాట్లు

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజలకు బాంకింగ్ అలవాట్లు తక్కువగా ఉంటాయి. ప్రజలలో పొదుపు అలవాట్లను ప్రోత్సహించడానికి ఈ దేశాలలో ఉండే వాణిజ్య బ్యాంకులు ఆకర్షణీయమైన పథకాలు ప్రవేశపెట్టి డిపాజిట్లను సేకరిస్తాయి.

ఆర్థికాభివృద్ధి రేటు పెంపుదలలో వాణిజ్య బాంకులు మహత్తరమైన సేవలనందిస్తున్నాయనే విషయం పై చర్చ ద్వారా మనకు తెలుస్తుంది. అందువల్ల ఇవి పట్టణ ప్రాంతాలకు పరిమితం కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాలి. ప్రజాస్వామిక విలువలు, ప్రజా సంక్షేమం వంటివి దృష్టిలో ఉంచుకొంటే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ బాంకులపై సామాజిక నియంత్రణ ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంటుంది.

## 15.11 సారాంశం

మన దేశంలోగల వాణిజ్య బాంకులను వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు. ఉదాహరణకు షెడ్యూల్డ్ బాంకులు, నాన్ - షెడ్యూల్డ్ బాంకులు, విదేశ మారక బాంకులు మొదలైనవి. భారతీయ రిజర్వు బాంకు చట్టం, 1934 లోని రెండవ షెడ్యూల్‌లో నమోదయిన బాంకులను షెడ్యూల్డ్ బాంకులు అంటారు. ఈ బాంకులకు కేంద్ర బాంకు నియమావళికి లోబడి హక్కులు, బాధ్యతలు ఉంటాయి. రిజర్వు బాంకు చట్టం, 1934, రెండవ షెడ్యూల్‌లో నమోదు కాని బాంకులు నాన్ - షెడ్యూల్డ్ బాంకులు. వ్యాపారస్థులకు, ఉద్యమదారులకు నూతన వ్యాపారానికి సంబంధించిన సలహాలు, వాటాల జారీకి, జారీచేసిన వాటాలకు చందాపూచీ కల్పించేవి మర్చంట్ బాంకులు. మన దేశంలో షెడ్యూల్డ్ బాంకులలో రెండు రకాల బాంకులున్నాయి. అవి : a) జాతీయం చేయబడిన బాంకులు, b) ప్రైవేట్ బాంకులు.

లాభాపేక్షయే ప్రధాన లక్ష్యంగా వ్యాపార వర్గాల ద్వారా మన దేశంలో ప్రైవేట్ రంగంలో వాణిజ్య బాంకులు స్థాపించబడ్డాయి. వీటి వ్యాపార వ్యవహారాల ద్వారా ఆర్థికాభివృద్ధికి, సాంఘిక న్యాయానికి ఆటంకం కలిగింది. దీని నివారణ కోసం ప్రభుత్వం బాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలో మార్పులు తెచ్చి 1968 లో బాంకులపై 'సామాజిక నియంత్రణ'ను అమలు చేసింది. ఈ నియంత్రణ సత్ఫలితాలను ఇవ్వనందున 1969లో రూ. 50 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లు గల 14 బాంకులు జాతీయం చేయబడ్డాయి. రూ. 200 కోట్ల కంటే ఎక్కువ డిపాజిట్లు గల మరో 6 బాంకులను 1980 లో ప్రభుత్వం జాతీయం చేసింది. స్టేట్ బాంకు ఆఫ్ ఇండియా చట్టంలో మార్పులు తెచ్చి 1955 లో స్టేట్ బాంకు ఆఫ్ ఇండియాను జాతీయం చేసింది.

జాతీయాకరణ అనంతరం బాంకింగ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సంభవించాయి. శాఖల విస్తరణలో, డిపాజిట్ల సేకరణలో, ఋణాల కల్పనలో చెప్పుకోదగిన మార్పులు సంభవించాయి. గతంలో ఈ బాంకులు కేవలం పట్టణ ప్రాంతాల్లోనే ఉండి పారిశ్రామికవేత్తలకే ఋణాలిచ్చేవి. కాని జాతీయాకరణ అనంతరం ఇవి ప్రాధాన్యతా రంగాలకు కూడా ఋణాలనిస్తున్నాయి.

జాతీయాకరణ అనంతరం డిపాజిట్లు పెరిగి బాంకులు కల్పించే ఋణ విధానంలో మార్పులు వచ్చినప్పటికీ, బాంకులు తీవ్ర నష్టాలతో కొనసాగడం గమనించదగిన విషయం. ఈ పరిస్థితిని గమనించి దీని నివారణ కోసమే బాంకింగ్ రంగంలో "సంస్కరణల" ఆవశ్యకత ఏర్పడింది. ఇందుకోసం భారత ప్రభుత్వం 'నరసింహం కమిటీ'ని నియమించింది. బాంకుల పెట్టుబడి విధానం, బాంకింగ్ వ్యవహారాల్లో రాజకీయ ప్రమేయం వంటి సమస్యలు బాంకింగ్ వ్యవస్థలో ఉన్నాయని వీటి నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఈ కమిటీ సూచించింది. ఈ కమిటీ సిఫారసులను భారత ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తుంది.

BRAOU

## 15.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులిమ్ము**

1. వాణిజ్య బాంకులను నిర్వచించి, వాటి ప్రధాన విధులను విశదీకరించండి.

2. మన దేశ బాంకింగ్ రంగంలో ప్రవేశపెట్టబడిన వ్యవస్థాపరమైన మార్పులను తెలియజేసి, వాటి ఆవశ్యకతను వివరించండి.

**II క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తుల చొప్పున జవాబులిమ్ము**

1. భారత దేశంలో ప్రభుత్వ రంగ బాంకుల ఆవశ్యకతను వివరించండి.

2. బాంకుల రకాలను వివరించండి.

3. బాంకులు పాటించే నియమాలను తెలుపండి.

4. క్రింది వాటిని వివరించండి.

   a) మర్చంట్ బాంకింగ్

   b) వాణిజ్య బాంకుల ఆస్తి - అప్పుల పట్టీ

5. క్రింది వాటిని వివరించండి

   a) ప్రాధాన్యతా రంగాలు

   b) పోర్టుఫోలియో పెట్టుబడి.

## 15.13 సంప్రదింపు గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | K. C. Shekar | : | Banking Theory and Practice |
| 2. | Dutt & Sundaram | : | Indian Economy (Latest Edition) |
| 3. | H.L. Bhatia | : | Monetary Theory |
| 4. | M.L. Jhingan | : | Macro Economic Theory |
| 5. | B. N. Ghosh & Rama Ghosh | : | Modern Macro Economics : Theory and Policy |
| 6. | Telugu Academy Books on | : | Money and Banking |


## 15.4 భావనలు

| | | |
|---|---|---|
| షెడ్యూల్డ్ బాంకులు (Scheduled banks) | : | రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934 సెక్షన్ 42 (బి) లోని రెండవ షెడ్యూల్‌లో నమోదయిన బాంకులు. |
| ప్రాధాన్యతా రంగాలు (Priority sectors) | : | సన్నకారు రైతులు, ఉపాంత రైతులు, చిన్న పరిశ్రమల ఉద్యమదారులు, స్వయం ఉపాధిని చేపట్టే విద్యావంతులైన నిరుద్యోగులు, బలహీనవర్గాలు. |

BRAOU

ఎగుమతి వ్యాపారం చేపట్టేవారు ప్రాధాన్యతా రంగాలుగా పరిగణించ బడుదురు. జాతీయాకరణ అనంతరం బాంకులు ఈ రంగానికి ఋణాలు కల్పిస్తున్నాయి.

| | | |
|---|---|---|
| పిలుపు ద్రవ్యం (Call money) | : | వాణిజ్య బాంకులు అతి స్వల్ప కాలానికి సంబంధించి షేర్ బ్రోకర్లకు, సహ బాంకులకు ఇచ్చే ఋణం. |
| మర్చంట్ బాంకింగ్ (Merchant banking) | : | నూతన వ్యాపారం చేపట్టడానికి బాంకింగ్ వ్యవస్థ కల్పించే మార్కెటింగ్ సమాచారం, వాటాల జారీ, చందా పూచీ సౌకర్యం మొదలైనవి. |
| పోర్టుఫోలియో పెట్టుబడి (Portfolio investment) | : | ద్రవ్యత్వం, లాభదాయకత, భద్రత అనే బాంకింగ్ నియమాలు పాటిస్తూ వాణిజ్య బాంకులు వివిధ రంగాలలో చేసే పెట్టుబడి. |

***- డా॥ ఎస్. లింబా గౌడ్***

BRAOU

# భాగం - 16 : బాంకేతర పరపతి సంస్థలు

విషయ క్రమం

16.0 ఉద్దేశాలు

16.1 పరిచయం

16.2 భారత దేశంలో బాంకేతర సంస్థల స్వరూపం

16.2.1 మ్యూచువల్ ఫండ్స్

16.2.2 భీమా సంస్థలు

16.2.3 వాయిదా కొనుగోళ్లకు పరపతినందించు సంస్థలు

16.2.4 భవిష్య నిధి మరియు పెన్షన్ నిధి

16.2.5 మర్చంట్ బాంకింగ్

16.3 బాంకేతర పరపతి సంస్థల విధులు

16.4 బాంకులు - బాంకేతర సంస్థల సారూప్యతలు, తేడాలు

16.5 పరపతి కల్పనలో బాంకేతర సంస్థల పాత్ర

16.5.1 పొదుపుల సమీకరణ

16.5.2 పెట్టుబడి నిధుల కల్పన

16.5.3 తరహా ఆదాలు

16.6 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో బాంకేతర సంస్థల పాత్ర

16.7 బాంకేతర సంస్థలు - ద్రవ్య విధానం

16.7.1 రాడ్ క్లిఫ్ - సేయర్స్ సిద్ధాంతం

16.7.2 గుర్లీ - షా సిద్ధాంతం

16.8 బాంకేతర సంస్థలపై రిజర్వు బాంకు నియంత్రణ ఆవశ్యకత

16.9 బాంకేతర సంస్థలు - ఎం. నరసింహం కమిటీ సూచనలు

16.9.1 వాయిదా కొనుగోళ్లకు పరపతి నందించు సంస్థలకు సంబంధించినవి

16.9.2 మర్చంట్ బాంకింగ్‌కు సంబంధించినవి

16.9.3 మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించినవి

16.9.4 పెట్టుబడి కంపెనీలకు సంబంధించినవి

16.10 సారాంశం

BRAOU

16.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

16.12 సంప్రదింపు గ్రంథాలు

16.13 భావనలు

16.14 పదకోశం

## 16.0 ఉద్దేశాలు

భారత దేశంలో వాణిజ్య బాంకుల పనితీరు, వాటి ప్రగతి, ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్రను ఇంతకుముందే తెలుసుకున్నాం. ఈ భాగంలో బాంకేతర పరపతి సహాయ సంస్థలను తెలుసుకొందాం. బాంకింగ్ సంస్థలు, బాంకేతర సంస్థలు ఈ రెండూ కూడా పరపతి కల్పనకు సంబంధించి మూలధన మార్కెట్‌లో అధిక ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. భారత దేశంలో బాంకేతర సంస్థల స్వరూపం, వాటి విధులు, ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్ర, వాటి కార్యకలాపాలపై కేంద్ర బాంకు నియంత్రణ ఆవశ్యకత వంటి అంశాలను చర్చించుకొందాం.

ఈ భాగం చదివిన తరువాత మీరు :

- వాణిజ్య బాంకులు - బాంకేతర సంస్థల మధ్యగల తేడాను తెలుసుకోగలుగుతారు.
- భారత దేశంలో బాంకేతర సంస్థల స్వరూపం తెలుసుకోగలుగుతారు.
- పరపతి వ్యవస్థలో బాంకేతర సంస్థల ప్రాధాన్యతను అంచనా వేయగలుగుతారు.

## 16.1 పరిచయం

ప్రతి ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య వ్యవహారాలకు సంబంధించి మధ్యవర్తిత్వ సంస్థలు పనిచేస్తాయి. అనగా ఇవి పొదుపు చేసే వారికి మరియు పెట్టుబడి చేసే వారికి మధ్యవర్తులుగా ఉంటాయి. వాణిజ్య బాంకులు ఈ రకమైన పనినే నిర్వర్తిస్తాయి. కాగా కొన్ని సంస్థలు వ్యవస్థ రూపేణా బాంకులు కాకపోయినా బాంకుల మాదిరిగానే పనిచేస్తాయి. వీటినే బాంకేతర విత్త మధ్యవర్తి సంస్థలు (Non- Banking Financial Intermediaries) అంటారు. పొదుపులను సమీకరించి ఋణాలనిచ్చే సంస్థలు, భీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్, ఫైనాన్స్ కార్పోరేషన్‌లు, చిట్ ఫండ్స్, వాయిదాల రూపంలో కొనుగోళ్ళకు పరపతినందించు సంస్థలు, పించన్ ఫండ్స్, ప్రావిడెంట్ ఫండ్స్ మరియు ప్రభుత్వ పరంగా ఋణాలను కల్పించే సంస్థల వంటివి బాంకేతర పరపతి సంస్థలకు కొన్ని ఉదాహరణలు. ఇవి వాణిజ్య బాంకుల వలె ఋణాత్మక నిధులను సృష్టించవు కాని ఋణాత్మక నిధులకు దళారీలు (brokers) గా పనిచేస్తాయి. ఇవి జారీచేయు ద్వితీయ శ్రేణి సెక్యూరిటీలు వాణిజ్య బాంకులు జారీచేయు సమీప ద్రవ్య సాధనాల వలె మార్కెట్‌లో వినిమయ మాధ్యమంగా పనిచేయవు.

బాంకేతర సంస్థలు ప్రజల నుండి వివిధ రకాల డిపాజిట్లను సేకరించి వాటిని ఉద్యమదారులకు వ్యాపార నిమిత్తమై పెట్టుబడి నిధులను సమకూర్చుతాయి. కాల పరిమితి రూపంలో పలు రకాల పథకాలను – ఉదాహరణకు మ్యూచువల్ ఫండ్స్, భీమా పాలసీల వంటివి – ప్రవేశపెట్టి వాటిని సెక్యూరిటీలుగా జారీచేసి ఈ సంస్థలు ప్రజల నుండి డిపాజిట్లను సేకరిస్తాయి. ఈ సంస్థలు జారీ చేయు సెక్యూరిటీలనే ద్వితీయ శ్రేణి సెక్యూరిటీలు అంటారు. ఇవి ఋణగ్రహీతల నుండి లేదా పెట్టుబడిదారుల నుండి ప్రాథమిక సెక్యూరిటీలను పూచీగా ఉంచుకొని వారికి ఋణాలు కల్పిస్తాయి. ఇలాంటి ప్రాథమిక సెక్యూరిటీలు సాధారణంగా ఆస్తుల

BRAOU

తాకట్టు, అర్హమైన వాటాలు, ప్రభుత్వ సెక్యూరిటీలు మొదలగు రూపాల్లో ఉంటాయి. ఇట్లు బాంకేతర సంస్థలు ఒకవైపు ద్రవ్యత్వపు ఆస్తులను కొనుగోలు చేస్తూ, మరొకవైపు వాటి అమ్మకాలు చేపడతాయి. ఉదాహరణకు భీమా సంస్థలు వివిధ సంస్థలకు వాటి బాండ్ల సెక్యూరిటీపై ఋణాన్ని కల్పించగా, ఇన్స్యూరెన్సు కంపెనీలు పాలసీలు జారీచేసి డిపాజిట్లను సేకరిస్తాయి. అలాగే మ్యూచువల్ ఫండ్స్ తగిన తాకట్టుపై వ్యాపార సంస్థలకు ఋణాలనిస్తూ, వివిధ ఆకర్షణీయ పథకాల సహాయంతో ప్రజల నుండి డిపాజిట్లను సేకరిస్తాయి. ఈ విధంగా బాంకేతర సంస్థలు ద్రవ్య నిధులను అంతిమ ఋణదాతల నుండి అంతిమ ఋణగ్రహీతలకు చేరవేయడంలో ప్రధాన సాధనాలుగా ఉపకరిస్తాయి. ఈ సంస్థలు నిర్వర్తించు ఇలాంటి కార్యకలాపాలు దళారీల వ్యవహారం వలె కనిపించినప్పటికీ, బాంకేతర సంస్థలకు దళారీ వ్యవస్థకు మధ్య తేడా కలదు. దళారులు ఋణదాతలను, ఋణగ్రహీతలను ఒక వేదిక దగ్గర చేర్చి కమీషన్ రూపంలో ద్రవ్యాన్ని సంపాదిస్తారు. కాని ఇందుకు భిన్నంగా బాంకేతర సంస్థలు డిపాజిట్‌దారులనుండి నిధులను సేకరించి నష్ట భయాన్ని తమపై వేసుకొని ఋణగ్రహీతలకు అప్పులనిస్తాయి.

బాంకేతర పరపతి సంస్థల స్వరూపం ప్రపంచ దేశాలన్నింటిలో ఒకే రకంగా లేదు. కొన్ని దేశాల్లో ఇవి పరిమాణం దృష్ట్యా వర్గీకరింపబడగా మరికొన్ని దేశాల్లో వాటి ద్రవ్య ఆస్తుల ప్రకారం వర్గీకరింపబడ్డాయి. గుర్లే, షా ప్రకారం బాంకేతర సంస్థలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. 1. ప్రభుత్వ రంగ బాంకేతర సంస్థలు 2. ప్రైవేట్ రంగ బాంకేతర సంస్థలు. భీమా సంస్థలు, పింఛను నిధులు, తపాలా పొదుపుల వంటివి ప్రభుత్వ రంగ బాంకేతర సంస్థలకు ఉదాహరణలు. చిట్ ఫండ్స్, ప్రైవేట్ బిల్డింగ్ సొసైటీలు, వాయిదా కొనుగోళ్లకు అప్పులనిచ్చు సంస్థలు, ఇంతేగాక వివిధ పథకాల ద్వారా అప్పులు కల్పించే సంస్థలన్నియూ ప్రైవేట్ రంగ బాంకేతర సంస్థలకు ఉదాహరణలు. బాంకేతర సంస్థలను అవి చేపట్టే కార్యకలాపాల దృష్ట్యా వాటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి : 1. పొదుపులను సమీకరించేవి, 2. అప్పులను కల్పించేవి.

| | పొదుపులను సమీకరించు సంస్థలు | | అప్పులిచ్చు సంస్థలు |
|---|---|---|---|
| 1. | మ్యూచువల్ ఫండ్స్ | 1. | వాయిదా కొనుగోళ్లకు పరపతినందించు సంస్థలు |
| 2. | జీవిత భీమా సంస్థలు | 2. | పెట్టుబడి నిధులు కల్పించు సంస్థలు |
| 3. | ప్రభుత్వ కంపెనీలు | 3. | ఫైనాన్స్ కార్పోరేషన్స్ |
| 4. | సేవింగ్స్ అసోసియేషన్స్ | 4. | చిట్ ఫండ్స్ |

BRAOU

## 16.2 భారత దేశంలో బాంకేతర సంస్థల స్వరూపం

మన దేశంలో పలురకాల బాంకేతర సంస్థలు ఉన్నాయి. పరిమాణ పరంగా వీటిలో కొన్ని పెద్దవిగానూ, మరికొన్ని చిన్నవిగానూ ఉన్నాయి. ఋణాలనిచ్చే సంస్థలు, ఫైనాన్స్ కార్పోరేషన్‌లు, వాయిదా కొనుగోళ్ళకు పరపతినందించు సంస్థలు, చిట్‌ఫండ్స్ వంటి వాటితోబాటు, మ్యూచువల్ ఫండ్స్, పింఛను పథకం, జీవిత భీమా సంస్థ, యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా వంటివి తమ సాధారణ కార్యకలాపాలతోబాటు అమలుచేస్తున్న మ్యూచువల్ ఫండ్స్, జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పోరేషన్ కార్యక్రమాలు, జాతీయం చేయబడిన బాంకులైన భారతీయ స్టేట్ బాంకు, పంజాబ్ నేషనల్ బాంకు, కెనరా బాంకు, ఇండియన్ బాంకు వంటివి కొనసాగిస్తున్న అనేక విధాలైన మ్యూచువల్ ఫండ్స్ ప్రస్తుతం బాంకేతర కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. వీటితోబాటు అనేక ప్రైవేట్ సంస్థలు ఉదాహరణకు బిర్లా మ్యూచువల్ ఫండ్స్, కొఠారి మ్యూచువల్ ఫండ్స్ వంటివి కూడా బాంకేతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

పైన వివరించిన బాంకేతర సంస్థల్లో కొన్ని ప్రభుత్వపరమైనవి కాగా మరికొన్ని ప్రైవేట్ రంగ సంస్థలు. ఇందులో కొన్ని డిపాజిట్లను లేదా పొదుపులను సేకరించే సంస్థలయితే మరికొన్ని పెట్టుబడిదారులకు ఋణాలనిచ్చే సంస్థలు. ఈ సంస్థలు చేపట్టే కార్యక్రమాలు రిజర్వు బాంకు నియమ నిబంధనలకు లోబడి ఉంటాయి. భారత ప్రభుత్వ కంపెనీల చట్టం, 1975 నియమావళిని ఇవి పాటిస్తాయి. ప్రస్తుతం భారత దేశంలో కొనసాగుతున్న బాంకేతర సంస్థలలో ప్రధానమైన వాటిని కింది విధంగా పేర్కొనవచ్చు.

## 16.2.1 మ్యూచువల్ ఫండ్స్

ఆర్థిక వ్యవస్థలో నిధుల సమీకరణలో మ్యూచువల్ ఫండ్స్ ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. చిన్న పొదుపుదారులకు, పెద్ద పరిశ్రమలకు మధ్య వారధిలా ఉండి మధ్యవర్తిత్వం నెరిపే ఈ సంస్థలు ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్నాయి. ప్రజల నుండి పొదుపు రూపంలో డబ్బును సేకరించి తిరిగి దాన్ని ఈక్విటీ బాండ్లు, డిబెంచర్లు వంటి సెక్యూరిటీలపై పెట్టుబడి పెట్టే సంస్థలే మ్యూచువల్ ఫండ్స్.

నేడు ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల్లో మ్యూచువల్ ఫండ్స్ పని చేస్తున్నాయి. పశ్చిమ దేశాలైన అమెరికా, బ్రిటన్‌లలో వీటి వృద్ధి అధికంగా ఉంది. భారత దేశంలో ఏప్రిల్ 1995 నాటికి ఇరవై ఒక్క మ్యూచువల్ ఫండ్స్ ఉన్నాయి. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఇందులో ఒకటి. ఈ సంస్థలు ఇప్పటి వరకు 155 పథకాలు అమలు పరచి రూ. 64,820 కోట్లను సేకరించాయి. ఇందులో 81 శాతం ఒక్క యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సమీకరించింది. ఈ ట్రస్ట్‌తోబాటు కేరళ స్టేట్ కో-ఆపరేటివ్ బాంకు, తారస్ కేరళ ఫండ్, కెనరా బాంకు, బాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బాంకు, పంజాబ్ నేషనల్ బాంకు, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, భారతీయ జీవిత భీమా సంస్థ వంటివి కూడా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ద్రవ్య నిధులను సమీకరిస్తున్నాయి. వీటి యొక్క పథకాలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి.

(a) ఓపెన్ - ఎండెడ్ పథకం : ఈ పథకం ప్రకారం బుక్ - క్లోజింగ్ సమయంలో తప్ప సంవత్సరంలో మిగిలిన అన్ని రోజులలో ఇందులో పొదుపు చేయవచ్చు.

(b) క్లోజ్ - ఎండెడ్ పథకం : ఈ పథకం ప్రకారం ఒక నిర్దేశిత కాలంలోనే పెట్టుబడి చేయుటకు వీలుంటుంది.

పెట్టుబడిదారులకు భద్రత కల్పించేందుకు సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (SEBI) కొన్ని ప్రమాణాలు, నిబంధనలు రూపొందించి వాటిని మ్యూచువల్ ఫండ్స్ అనుసరించేలా తగిన జాగ్రత్తలు తీసుకొంటుంది. పెట్టుబడులపై, కనీస సబ్‌స్క్రిప్షన్‌పై పరిమితులు విధిస్తూ మ్యూచువల్ ఫండ్స్ కుక్కగొడుగుల్లా పెరగకుండా 'సెబి' నియంత్రిస్తుంది.

## 16.2.2 భీమా సంస్థలు

భీమా పాలసీలను, బాండ్లను ప్రజలకు, సంస్థలకు అమ్మడం ద్వారా ఈ సంస్థలు నిధులను సేకరిస్తాయి. భీమా చేసిన మొత్తానికి ప్రీమియంలను నిర్ణయించి నెలవారీగా, త్రైమాసిక, అర్ధ సంవత్సర వారీగా, సంవత్సర వారీగా పాలసీదారుల నుండి ఈ సంస్థలు పొదుపులను సమీకరిస్తాయి. భారత దేశంలో భీమా సంస్థలు అనేక రూపాల్లో ఉన్నాయి. జీవిత భీమా సంస్థ వ్యక్తుల జీవిత కాలాన్ని ఆధారం చేసుకొని పలు రకాల పథకాల ద్వారా పొదుపులను సేకరిస్తుంది. వాహనాలు, ఆభరణాలు, విలువైన వస్తువులు, గృహ సామగ్రి, వ్యాపార సంస్థల ఆస్తులు మొదలగు వాటికి భీమా కల్పించి పొదుపులు సేకరించుటలో యునైటెడ్ అస్యూరెన్స్ కార్పొరేషన్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటివి ప్రముఖ పాత్ర కలిగియున్నవి. యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా 'యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీ' (ULIP) ద్వారా పొదుపులను సేకరిస్తుంది. వీటితోబాటు "పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్" పథకం సహాయంతో తపాలా శాఖ కూడా చిన్న పొదుపు మొత్తాలను సేకరిస్తుంది.

### 16.2.3 వాయిదా కొనుగోళ్లకు పరపతినందించు సంస్థలు

పారిశ్రామిక రంగంలో వస్తూత్పత్తికి భారీ పెట్టుబడులు అవసరమౌతాయి. అలాగే వ్యాపార, వాణిజ్య రంగాలకు కూడా అధిక మొత్తం పెట్టుబడి నిధులు అవసరమవుతాయి. వ్యాపారస్థులకు, ఉద్యమదారులకు యంత్రాలు, యంత్ర పరికరాలు, ఇతర స్థిర మూలధనపు కొనుగోలుకు అవసరమయిన ద్రవ్యాన్ని వాయిదా కొనుగోలు పరపతి సహాయ సంస్థలు (hire purchase companies) సమకూర్చుతాయి. ఈ విధమైన ద్రవ్యాన్ని సమకూర్చి ఈ సంస్థలు తిరిగి ఆ మొత్తాన్ని వాయిదాల రూపంలో వసూలు చేస్తాయి. మన దేశంలో ప్రైవేట్ రంగంలో ఈ రకమైన సంస్థలు అనేకం ఉన్నాయి. వీటి విస్తరణ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉంది. పెద్ద పారిశ్రామిక సంస్థలకు ఈ విధమైన పరపతిని కల్పించే సంస్థలలో (1) రిస్క్ కాపిటల్ అండ్ టెక్నాలజీ కార్పోరేషన్ లిమిటెడ్ (2) లీజింగ్ అండ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ (IL&Fs) (3) క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (CRISIL) వంటివి పేర్కొనదగినవి. ఇందులో మొదటి సంస్థ భారతీయ పారిశ్రామిక విత్త సహాయ సంస్థ (IFCI) సహాయంతో కొనసాగుతోంది. ఈ సంస్థ నూతన ఉద్యమదారులకు నామమాత్రపు వడ్డీరేటుతో పరపతిని అందిస్తుంది. రెండవ సంస్థ 1988 లో స్థాపించబడింది. ఈ సంస్థ యంత్రాల, యంత్ర పరికరాల కొనుగోలుకు వాయిదా కొనుగోలు రూపంలో ఋణం కల్పిస్తుంది. కార్పోరేట్ రంగానికి, వాటాలకు చందా పూచీ సౌకర్యం ఈ సంస్థ కల్పిస్తుంది. మూడవ సంస్థ 1988 లో స్థాపించబడింది. ఈ సంస్థ వివిధ కంపెనీలు జారీచేసే ఫిక్సెడ్ డిపాజిట్స్, కన్వర్టిబుల్ మరియు నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లకు ప్రామాణీకరణ చేస్తుంది.

### 16.2.4 భవిష్య నిధి మరియు పెన్షన్ ఫండ్స్

ప్రభుత్వ రంగంలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగస్తులనుండి స్వచ్ఛంద మరియు నిర్బంధ పద్ధతుల్లో పొదుపులను భవిష్య నిధి సేకరిస్తుంది. ఈ నిధి సేకరించే పొదుపులను అత్యవసర సమయంలో ప్రభుత్వం తాత్కాలిక ఋణం రూపంలో పొందుతుంది. పదవీ విరమణ తర్వాత సాంఘిక భద్రతతో కూడిన జీవనం గడుపుటకు వీలుగా పెన్షన్ ఫండ్స్ వ్యక్తుల నుండి డిపాజిట్స్ సేకరిస్తాయి. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ఇటీవల ప్రతిపాదించిన 'రిటైర్మెంట్ బెనిఫిట్ ప్లాన్, పెన్షన్ ఫండ్స్‌కు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

### 16.2.5 మర్చంట్ బ్యాంకింగ్

సాధారణ బ్యాంకింగ్‌తోబాటు ప్రస్తుతం మర్చంట్ బ్యాంకింగ్ పేరొందిన బ్యాంకుల ప్రధాన కార్యక్రమంగా మారింది. వీటితోబాటు కొన్ని ప్రైవేట్ పరపతి సహకార సంస్థలు, విదేశీ సంస్థల భాగస్వామ్యంతో మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు చేస్తున్నాయి. మర్చంట్ బ్యాంకులు నూతనంగా వ్యాపారం చేపట్టే వారికి వాటాల జారీ, నూతన ఉత్పత్తి విధానం, పరపతి పొందే విధం, వస్తువు అమ్మకాలకు సంబంధించిన భవిష్యత్ అంచనాల వంటి విషయాల్లో సహాయం చేస్తాయి. ఇవి సంస్థల వాటాలకు సంబంధించి చందా పూచీ సౌకర్యం కూడా కల్పిస్తాయి. ప్రస్తుతం మర్చంట్ బ్యాంకింగ్ వ్యవహారాలను భారతీయ స్టేట్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకులతోబాటు మరికొన్ని జాతీయం చేయబడిన బ్యాంకులు కూడా చేపడుతున్నాయి. వీటి కార్యకలాపాలను 'సెబి' మరియు రిజర్వు బ్యాంకు నియంత్రణ చేస్తాయి.

## 16.3 బ్యాంకేతర పరపతి సంస్థల విధులు

బ్యాంకులు, బ్యాంకేతర పరపతి సంస్థలు రెండూ కూడా రెండు రకాల వర్గాలను లేదా సంస్థలను సంతృప్తి పరుచుటకు ప్రయత్నిస్తాయి. వీటిలో మొదటి వర్గం అప్పులిచ్చేవారు కాగా రెండవ వర్గం అప్పు పుచ్చుకునేవారు.

అప్పు తీసుకునేవారు తమ నిజ ఆస్తులను పెంచుకొనుటకు, సంస్థలు వాటి ఉత్పత్తులను పెంచుకొనుటకు ప్రయత్నించగా, అప్పులిచ్చువారు నష్ట భయం లేకుండా అసలును పెట్టుబడి చేసి అధిక మొత్తం సంపాదించుటకు ప్రయత్నిస్తారు. వీరి లక్ష్యాల సాధనలో బాంకేతర సంస్థలు పేర్కొనదగ్గ సేవలనందిస్తాయి. ఇందుకోసం బాంకేతర సంస్థలు పాటించే పద్ధతులు ప్రశంసనీయంగా ఉంటాయి. వాటిలో కొన్ని : (1) ఈ సంస్థలు ఋణ గ్రహీతలతో చేసే సంప్రదింపులు, లెక్కలు వ్రాసే పద్ధతి, ఇచ్చిన ఋణాలు వసూలు చేసే పద్ధతి వంటి అంశాలకు సంబంధించి పాలనాపరమైన ఖర్చులో పొదుపును పాటిస్తాయి. (2) వ్యక్తి గతంగా ప్రజలు ద్రవ్యాన్ని అప్పుగా ఇవ్వటంలో నష్ట భయం ఎక్కువగా ఉంటుంది. కాని ప్రజలందరి నుండి డిపాజిట్లను సేకరిస్తూ బాంకేతర సంస్థలు సామూహిక నష్ట భయాన్ని భరించటం ద్వారా పరపతి అవకాశాలను విస్తరింపజేస్తాయి.

బాంకేతర సంస్థల కార్యకలాపాలు రెండు రకాలుగా ఉంటాయి. కొన్ని సంస్థలు స్వల్పకాలిక ఋణాలను ఇవ్వగా మరికొన్ని సంస్థలు దీర్ఘకాలిక ఋణాలను ఇస్తాయి. ఉదాహరణకు అభివృద్ధి చెందిన దేశాల్లోని డిస్కౌంటింగ్ సంస్థలు, స్వీకృతి గృహాలు వంటివి స్వల్పకాలిక ఋణాలను కల్పించగా, పెట్టుబడి సంస్థలు, భీమా సంస్థలు, ప్రావిడెంట్ ఫండ్స్ వంటివి దీర్ఘకాలిక ఋణాలను కల్పిస్తాయి.

**విధులు**

1. బాంకేతర సంస్థలు నిధులను ఋణదాతలనుండి ఋణగ్రహీతలకు బదిలీకి తోడ్పడతాయి. ప్రజలు వ్యక్తిగతంగా అప్పులు ఇవ్వడం నష్ట భయంతో కూడుకొని అనిశ్చితంగా ఉంటుంది. బాంకేతర సంస్థలు తమ వ్యాపార విధానంలో ప్రత్యేకతలు ప్రవేశపెట్టడం ద్వారా డిపాజిట్‌దారులకు మంచి సేవలనందిస్తూ వారి సొమ్ముకు భద్రతను కల్పిస్తాయి. ఇలాంటి సేవ ద్వారా ఇవి పొదుపుదారులకు మధ్యవర్తిగా పని చేయడమేగాకుండా వారి పోర్టుపోలియో పెట్టుబడికి సంబంధించి సహాయ సహకారాలు అందిస్తాయి.

2. ప్రజలు వ్యక్తిగతంగా అప్పులు ఇచ్చినప్పుడు వాటిని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతల ఆర్థిక స్తోమత, సకాల చెల్లింపు వంటి సమస్యలు ఎదురౌతాయి. కానీ బాంకేతర సంస్థలు తమ వ్యవహారాల ద్వారా డిపాజిట్‌దారులను, ఋణగ్రహీతలను కూడా ఆకర్షిస్తాయి. అంతేగాక ఇవి నష్ట భయాలను కనిష్ట స్థాయిలో ఉంచగలుగుతాయి.

3. బాంకేతర సంస్థలు పలు రకాలైన ద్రవ్యత్వపు ఆస్తులను కలిగియుండి ద్రవ్య ఆర్థిక వ్యవస్థ ప్రగతికి తోడ్పడుతాయి. ఇవి జారీ చేయు సెక్యూరిటీలు ద్రవ్య ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. వాయిదాల పద్ధతిలో చేసే కొనుగోళ్లకు ఇవి పరపతిని కల్పిస్తాయి.

4. ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి కొన్ని రంగాల్లో మిగుళ్లు, మరికొన్ని రంగాలలో కొరతలు ఉండవచ్చు. వీటి సర్దుబాటు విషయంలో బాంకేతర సంస్థలు ఎంతగానో ఉపయోగపడతాయి.

## 16.4 బాంకులు - బాంకేతర సంస్థల సారూప్యతలు, తేడాలు

వాణిజ్య బాంకులు - బాంకేతర సంస్థల మధ్య అనేక రకాల సారూప్యతలు మరియు తేడాలు ఉంటాయి. సాంప్రదాయ సిద్ధాంత ప్రతిపాదకులు వాణిజ్య బాంకులను బాంకేతర సంస్థలతో పోల్చడం సరైన వాదం కాదని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే వాణిజ్య బాంకులు ఋణాత్మక నిధులను సృష్టిస్తాయి. కాగా బాంకేతర సంస్థలు ఋణాత్మక నిధులకు దళారీలుగా వ్యవహరిస్తాయి. అయితే ఆధునిక సిద్ధాంత ప్రతిపాదకుల ప్రకారం ఇవి నిర్వర్తించు కార్యకలాపాల దృష్ట్యా వీటిమధ్య కొన్ని సారూప్యతలు ఉన్నాయి. అవేమిటంటే : రెండు సంస్థలు కూడా

ద్రవ్యత్వపు ఆస్తులతో వ్యాపారం చేస్తాయి. పొదుపు చేసేవారు, పెట్టుబడి చేసేవారి విషయంలో ఈ రెండూ కూడా మధ్యవర్తులుగా పనిచేస్తాయి. బాంకులు, బాంకేతర సంస్థలు లాభార్జన అనే ప్రధాన లక్ష్యంతో పనిచేస్తాయి. తమ వ్యవహారాల కొనసాగింపులో రెండూ కూడా ప్రాథమిక సెక్యూరిటీల ఆధారంగా ఋణాలనిస్తూ డిపాజిట్‌దారులకు ద్వితీయ శ్రేణి సెక్యూరిటీలను జారీ చేస్తాయి. ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యత్వపు ఆస్తుల అభివృద్ధిలో రెండు సంస్థలు కూడా తమ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ఇట్లు వ్యవహారాల రీత్యా వీటి మధ్య గుణాత్మక తేడా ఏమీ ఉండదని చెప్పవచ్చు. అయినప్పటికీ, వీటిమధ్య తేడాలు ఉన్నాయి. వీటిమధ్య గల తేడాలను ఈ విధంగా పేర్కొనవచ్చు.

1 వాణిజ్య బాంకులు ప్రజల నుండి డిపాజిట్లను సేకరించి వాటి ద్వారా చెక్కులు, డ్రాఫ్టుల రూపంలో పరపతిని సృష్టిస్తాయి. కాని బాంకేతర సంస్థలు డిపాజిట్లను సేకరించి వాటిని ఇతరులకు అప్పులు ఇవ్వడం ద్వారా నూతన ఆస్తులను పెంచుతాయి.

2. పరపతి ద్రవ్యాన్ని సృష్టించే శక్తి బాంకేతర సంస్థలకంటే వాణిజ్య బాంకులకు అధికంగా ఉంటుంది. వాణిజ్య బాంకులు జారీ చేయు పరపతి ద్రవ్యం ఆర్థిక వ్యవస్థలో వినిమయ మాధ్యమంగా పనిచేస్తుంది. కానీ బాంకేతర సంస్థలు జారీ చేయు ద్వితీయ శ్రేణి సెక్యూరిటీలను అన్ని వర్గాల ప్రజలు వినిమయ మాధ్యమంగా స్వీకరించకపోవచ్చు.

3. వాణిజ్య బాంకులు ప్రైవేట్ రంగం నుండి అధిక మొత్తంలో డిపాజిట్లను సేకరించగలుగుతాయి. కాని డిపాజిట్ల సమీకరణలో బాంకేతర సంస్థల పరిధి చాలా తక్కువ.

4. దేశంలో ఉండే అన్ని వాణిజ్య బాంకులు, బాంకింగ్ నియమావళికి లోబడి తాము సేకరించే అన్ని రకాల డిపాజిట్లలో కొంత మొత్తాన్ని నగదు నిలువల రూపంలో ఉంచుతాయి. వీటిపై కేంద్ర బాంకు నియంత్రణ ఉంటుంది. ఇలాంటి నియమ నిబంధనలు బాంకేతర సంస్థలకు ఉండదు. కేంద్ర బాంకు ద్వారా వీటిపై సమర్థవంతమైన నియంత్రణ ఉండదు.

5. డిపాజిట్ల సేకరణలో బాంకేతర సంస్థల మధ్య పోటీ ఉంటుంది. అనగా వివిధ బాంకేతర సంస్థలు విభిన్న రకాల వడ్డీ రేట్లను నిర్ణయించి డిపాజిట్లను సేకరిస్తాయి. కానీ వాణిజ్య బాంకులకు సాధారణంగా ఒకే విధమైన వడ్డీ రేట్లు ఉంటాయి.

BRAOU

వ్యాపార వ్యవహారాల రీత్యా వాణిజ్య బాంకులు, బాంకేతర సంస్థలు సారూప్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, వీటికి సంబంధించి ఆర్థిక వేత్తలు విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చినారు. సంప్రదాయ సిద్ధాంత దృక్పథం (చికాగో విశ్వవిద్యాలయ దృక్పథం) ననుసరించి వాణిజ్య బాంకులు, బాంకింగ్ నియమావళిని అనుసరించి వాటి నిధుల కంటే అధిక మొత్తం పరపతిని సృష్టిస్తాయి. వాణిజ్య బాంకులకు ఉండే ప్రత్యేక లక్షణాన్ని బాంకేతర సంస్థల కార్యకలాపాలతో పోల్చడానికి వీలులేదని వారు అభిప్రాయపడ్డారు. వాణిజ్య బాంకులు సృష్టించే పరపతి, చట్టబద్ధ ద్రవ్యం వలె వినిమయ మాధ్యమంగా పనిచేయడమే ఇందుకు గల ప్రధాన కారణమని వారు చెప్పారు. ఆర్థిక వ్యవస్థలో బాంకేతర సంస్థల ప్రాధాన్యత పెరిగి, వాణిజ్య బాంకుల డిపాజిట్లు బాంకేతర సంస్థలకు బదిలీ జరిగినప్పుడు కూడా వాణిజ్య బాంకుల ప్రాధాన్యత తగ్గదు. ఇందువలన కేవలం ద్రవ్యత్వ ఆస్తుల బదిలీ మాత్రమే జరుగుతుందని వారు తెలిపారు. టోబిన్ అనే ఆర్థికవేత్త ప్రకారం బాంకులు, బాంకేతర సంస్థలు సృష్టించే పరపతిలో తేడాలు ఉన్నాయి. ఉదాహరణకు జీవిత భీమా సంస్థలు వ్యక్తుల మరణానికి భీమా కల్పిస్తాయి. కాని ఇలాంటి సౌకర్యాన్ని వాణిజ్య బాంకులు కల్పించవు.

## 16.5 పరపతి కల్పనలో బాంకేతర సంస్థల పాత్ర

ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాలకు పరపతిని కల్పించడంలో బాంకేతర సంస్థలు బహుళ సేవలనందిస్తాయి. ఇంగ్లాండు, అమెరికా వంటి దేశాల్లో 1960, 1970 దశాబ్దాల్లో ఈ సంస్థలు శీఘ్రతర వృద్ధిని సాధించాయి. ఈ దేశాల్లో ఇవి వాణిజ్య బాంకుల కంటే వేగంగా వృద్ధిని సాధించాయి. ఇందుకు గల ప్రధాన కారణం ఏమంటే ఈ సంస్థలు ప్రజల నుండి సమీకరించే పొదుపులపై వాణిజ్య బాంకుల కంటే ఎక్కువ వడ్డీని చెల్లించడమే కాకుండా, ఇవి ఉద్యమదారులకు ఇచ్చే ఋణాలపై తక్కువ వడ్డీని వసూలు చేస్తున్నాయి. ఇలా ఈ సంస్థల వృద్ధి ఆర్థికాభివృద్ధికి ముఖ్యంగా పరపతి విస్తరణలో ఋణదాతలకు ఋణగ్రహీతలకు ఎంతగానో తోడ్పడతుంది. పరపతి కల్పనకు బాంకేతర సంస్థలు తోడ్పడుతున్న తీరు ఈ విధంగా పేర్కొనవచ్చు.

### 16.5.1 పొదుపుల సమీకరణ

మూలధన మార్కెట్‌లో ఈ సంస్థలు అనేక విధాలైన పొదుపులను సమీకరించి వాటిని ఉద్యమదారులకు ఋణాల రూపంలో అందిస్తాయి. పొదుపుదారులకు ఇవి అందించే సేవల తీరు వారు చేసే డిపాజిట్లను ఆకర్షిస్తాయి. ఈ సేవలు సులభ ద్రవ్యత్వం, అసలుకు భద్రత వంటి రూపంలో ఉంటుంది. చిన్న మొత్తం పొదుపుల సమీకరణలో ప్రైవేట్ ఫైనాన్స్‌లు, ఋణాలిచ్చే సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్ వంటివి ప్రాధాన్యత వహించగా పెద్ద మొత్తంలో డిపాజిట్ల సేకరణలో భీమా సంస్థలు, భవిష్య నిధి సంస్థల వంటివి ప్రాముఖ్యం కలిగి ఉంటాయి. ఈ విధంగా డిపాజిట్లను సేకరిస్తూ ఈ సంస్థలు పొదుపుదారులకు కచ్చితమైన ప్రతిఫలాలపై హామీనిస్తాయి.

### 16.5.2 పెట్టుబడి నిధుల కల్పన

బాంకేతర సంస్థలు అవి సేకరించిన పొదుపులను ఉద్యమదారులకు ఋణాల రూపంలో ద్రవ్యాన్ని అందించడం ద్వారా పెట్టుబడి నిధులను సమకూర్చుతాయి. ఇందుకోసం వివిధ సంస్థలు వివిధ పద్ధతులను పాటిస్తాయి. ఉదాహరణకు మ్యూచువల్ ఫండ్స్ పూచీని ఆధారం చేసుకొని ఋణాలనివ్వగా, ఇన్స్యూరెన్సు కంపెనీలు బాండ్లను, సెక్యూరిటీలను పూచీగా ఉంచుకొని పరపతిని కల్పిస్తాయి.

BRAOU

### 16.5.3 తరహా ఆదాలు

పొదుపుల సమీకరణలో, ఋణాల కల్పనలో బాంకేతర సంస్థలు ప్రవేశపెట్టే ప్రత్యేకతలు తరహా ఆదాలను పెంచుతాయి. ప్రజలు వ్యక్తిగతంగా తమ ద్రవ్యాన్ని ఋణాలుగా ఇవ్వడమనేది సమస్యా భరితమై, అనిశ్చితంగా ఉంటుంది. ఇందుకు భిన్నంగా బాంకేతర సంస్థలు ప్రజల నుండి ద్రవ్యాన్ని సేకరించి అప్పులు ఇవ్వడంలో భారీ స్థాయిలో వ్యవహారాలు చేపడ్తాయి. ఋణ విధానంలో ఈ సంస్థలు అనుసరించే పద్ధతుల దృష్ట్యా వాటిలోని ప్రత్యేకతల దృష్ట్యా సెక్యూరిటీల అమ్మకాలు, కొనుగోళ్లలో వ్యయం కనిష్ట స్థాయిలో ఉంటుంది. ఈ సంస్థలు తమ కార్యకలాపాల్లో నైపుణ్యం కలిగిన ఉద్యోగ బృందాన్ని, పాలనకు సంబంధించి సమర్థవంతమైన యంత్రాంగాన్ని ఉపయోగిస్తాయి. ఇవి ఋణదాతల నిధులను ఋణగ్రహీతలకు అప్పులుగా మార్చడంలో మధ్యవర్తులుగ వ్యవహరించటం ద్వారా ఋణదాతలకు నష్టభయ హామీని కల్పిస్తాయి.

## 16.6 అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో బాంకేతర సంస్థల పాత్ర

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బాంకేతర సంస్థలు ఒక ప్రత్యేక పాత్రను నిర్వర్తిస్తాయి. ఎందుకంటే ఈ దేశాల్లో మూలధన మార్కెట్ వ్యవస్థీకృతం కాకుండా ఉండి దాని అభివృద్ధి అల్పస్థాయిలో ఉంటుంది. జనాభాలో

అధిక శాతం ప్రజలు పేదవారైనందువలన వారి పొదుపు రేటు కూడా తక్కువగా ఉంటుంది. తక్కువ శాతం ఉన్న ధనవంతులు పొదుపు చేసినా దానికి వారు బంగారం, ఆభరణాలు, ఆస్తుల కొనుగోలు వంటి విలాసాలపై వెచ్చిస్తారు. ఇలాంటి పరిస్థితుల నివారణకు బాంకేతర సంస్థలు ఉపకరిస్తాయి. ఇవి వాటి వినూత్న పథకాల సహాయంతో అనుత్పాదక వినియోగాన్ని ఉత్పాదక ఉపయోగాలవైపు మళ్లిస్తాయి.

ఆర్థిక వ్యవస్థ ద్రవ్యేతర రంగం నుండి ద్రవ్య రంగంవైపు అభివృద్ధి చెందడం వలన ప్రజల బాంకింగ్ అలవాట్లు వృద్ధి చెందుతాయి. ఇందువలన వాణిజ్య బాంకింగ్ వ్యవహారాలతోబాటు బాంకేతర సంస్థల కార్యకలాపాలు కూడా విస్తరిస్తాయి. ఈ విధంగా ఆర్థికాభివృద్ధి పెంపుదలలో బాంకేతర సంస్థలు కూడా తమ వంతు పాత్రను నిర్వహిస్తాయి.

## 16.7 బాంకేతర సంస్థలు - ద్రవ్య విధానం

ద్రవ్య విధానం ప్రధాన లక్ష్యం వ్యాపార చక్రాల నివారణ (అనగా ద్రవ్యోల్బణ, ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులు రాకుండా చర్యలు గైకొనడం), ధరల స్థిరీకరణ, పరపతి నియంత్రణ వంటి చర్యలు చేపట్టడం. సాధారణంగా ద్రవ్య విధానాన్ని ఒక దేశపు కేంద్ర బాంకు అమలు పరుస్తుంది. కేంద్ర బాంకు ఈ విధానం ద్వారా పరపతిని నియంత్రిస్తూ ఆర్థిక స్థిరత్వానికి ప్రయత్నిస్తుంది.

బాంకేతర సంస్థల వ్యవహారాల ప్రభావం పరపతిని నియంత్రించడంలో కేంద్ర బాంకు ద్రవ్య విధానంపై ఏ రీతిలో ఉంటుందనే విషయంపై భిన్నాభిప్రాయాలు కలవు.

బ్రిటన్‌లో రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితులను రాడ్‌క్లిఫ్ కమిటీ అధ్యయనం చేసింది. ఈ దేశపు కేంద్ర బాంకు అయిన బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ పరపతి నియంత్రణ కోసం అమలు పరచిన ద్రవ్య విధానానికి, బాంకేతర సంస్థల చర్యలు ప్రతికూల ప్రభావాన్ని కల్పించినవని ఈ కమిటీ అభిప్రాయపడింది. ఇంచుమించు ఇదే రకమైన అభిప్రాయాన్ని 'గుర్లే - షా' కూడా తెలిపారు.

బాంకేతర సంస్థలు వివిధ పథకాల ద్వారా ప్రాథమిక సెక్యూరిటీల పూచీపై ఋణాలనిస్తాయి. బాంకేతర సంస్థల ఈ చర్యలు తప్పకుండా పరపతి వ్యవస్థను, వడ్డీ రేట్లను ప్రభావితం చేస్తాయి. వాణిజ్య బాంకుల వలె ఇవి పరపతిని సృష్టించవు. కాని నూతన ఆస్తులను పెంచుతాయి. ఇది ద్రవ్య చలామణి వేగాన్ని పెంచి ద్రవ్య విధానపు అమలును ప్రభావితం చేస్తుంది.

కేంద్ర బాంకు ద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించాలనుకున్నప్పుడు వాణిజ్య బాంకుల పరపతి సృష్టిని తగ్గించేందుకు బహిరంగ మార్కెట్ వ్యవహారాల ద్వారా బాండ్లను, సెక్యూరిటీలను ప్రజలకు అమ్ముతుంది. వాణిజ్య బాంకుల నగదు నిల్వల నిష్పత్తిని పెంచుతుంది. ఇందువల్ల వాణిజ్య బాంకుల డిపాజిట్లు తగ్గి వడ్డీ రేట్లు పెరుగుతాయి. ఈ కారణంగా బాంకేతర సంస్థల ప్రాథమిక సెక్యూరిటీలపై కూడా వడ్డీ రేట్లు పెరుగుతాయి. అందువల్ల ఈ సంస్థలు తాము సేకరించే డిపాజిట్లపై కూడా వడ్డీ రేటును పెంచి పొదుపరులను ఆకర్షిస్తాయి. ఈ పరిస్థితిలో డిపాజిటర్లు వాణిజ్య బాంకుల నుండి డిపాజిట్లను వాపసు తీసుకొని బాంకేతర సంస్థలలో జమ చేస్తారు. దీనితో బాంకేతర సంస్థలకు ఋణాలు ఇచ్చే శక్తి పెరుగుతుంది. ఈ విధంగా ద్రవ్య సరఫరాలో మార్పు లేకపోయినా పరపతిలో పెరుగుదల సంభవించవచ్చు. కేంద్ర బాంకు ఒకవైపు ద్రవ్య విధానం ద్వారా పరపతిని తగ్గించడానికి ప్రయత్నించగా మరొకవైపు బాంకేతర సంస్థల చర్యలు ద్రవ్య చలామణి వేగాన్ని పెంచి ద్రవ్య విధానానికి అడ్డంకులుగా పరిణమించవచ్చు.

BRAOU

ద్రవ్య విధానపు అమలును ప్రభావితం చేయడంలో బాంకేతర సంస్థలు ఎంతటి ప్రాధాన్యతను కలిగియుంటావనే విషయానికి సంబంధించి విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. వాటిలో 'రాడ్‌క్లిఫ్ - సేయర్స్' సిద్ధాంతం, 'గుర్లే - షా' సిద్ధాంతం ప్రముఖమైనవని చెప్పవచ్చు.

## 16.7.1 రాడ్‌క్లిఫ్ - సేయర్స్ సిద్ధాంతం

వీరి ప్రకారం ద్రవ్య వ్యవహారాల్లో ద్రవ్య సప్లయ్ కంటే ముఖ్యమైనది ద్రవ్యం ఏ విధంగా ప్రజల డిమాండ్‌ను ప్రభావితం చేస్తుందనేది. ఋణాలు పొందడానికి వీలుగా మార్కెట్‌లో అందుబాటులో ఉండే పలు మార్గాలు వినియోగదారుల అలవాట్లను, పెట్టుబడిదారుల చర్యలను ప్రభావితం చేస్తాయి. ఈ వ్యవహారం ద్రవ్యత్వపు ఆస్తులపై ఆధారపడుతుంది. ద్రవ్యత్వపు ఆస్తులు మార్కెట్‌లో ఉండే వడ్డీ రేటుచే ప్రభావితం అవుతాయి. ప్రభుత్వం తన ద్రవ్య విధానం ద్వారా వీటిమధ్య సర్దుబాటు సాధించుటకు ప్రయత్నిస్తుంది. వడ్డీ రేటులో మార్పులు ప్రవేశపెట్టడం ద్వారా ద్రవ్యాన్ని నియంత్రించాలని రాడ్‌క్లిఫ్ కమిటీ పేర్కొంది. ఇలా చేయడం ద్వారా బాంకేతర సంస్థల ప్రతికూల చర్యలను కేంద్ర బాంకు పరోక్షంగా అరికట్టగలుగుతుందని రాడ్‌క్లిఫ్ కమిటీ అభిప్రాయపడింది. వడ్డీ రేటును పెంచడం ద్వారా బాంకేతర సంస్థల ఋణకల్పన శక్తిని తగ్గించవచ్చు. దేశంలో ఉన్న అన్ని పరపతి సహాయ సంస్థల ద్రవ్యత్వ ఆస్తులపై ఆంక్షలు విధించాలని వడ్డీ రేటులో మార్పు ప్రవేశపెట్టడం ద్వారా వాటి చర్యలను క్రమబద్ధం చేయాలని రాడ్‌క్లిఫ్ - సేయర్స్ సిద్ధాంతం పేర్కొంది.

## 16.7.2 గుర్లే - షా సిద్ధాంతం

ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో బాంకులు, బాంకేతర సంస్థలు వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. ఇవి ఋణగ్రహీతలనుండి ప్రాథమిక సెక్యూరిటీలను పొంది ఋణదాతలకు ద్వితీయశ్రేణి సెక్యూరిటీలను జారి చేస్తాయి. సాంప్రదాయవాదుల ప్రకారం వాణిజ్య బాంకులు ఋణాత్మక నిధులను సృష్టించగా, బాంకేతర సంస్థలు ఋణాత్మక నిధులకు దళారులుగా పనిచేస్తాయి. ఇందుకు భిన్నంగా వాణిజ్య బాంకులే కాకుండా బాంకేతర సంస్థలు కూడా ఋణాత్మక నిధులను సృష్టించగలవని గుర్లే - షా తెలిపారు. ఈ విధంగా ఈ రెండు సంస్థలు కూడా ఋణాత్మక నిధుల కల్పనకు కృషి చేస్తాయి. అయితే ఋణాత్మక నిధుల సృష్టి కోసం వాణిజ్య బాంకులు నగదు నిలువలను ఉంచాలి. బాంకులన్నియు ఒకే విధమైన వడ్డీ రేటును పాటించాలి. కాని ఇలాంటి నియమాలు బాంకేతర సంస్థలకు లేవు. అందువల్ల కేంద్ర బాంకు యొక్క నియంత్రణ కేవలం వాణిజ్య బాంకులపైన మాత్రమే కాకుండా బాంకేతర సంస్థలపై కూడా ఉండాలని గుర్లే - షా అభిప్రాయపడ్డారు. ద్రవ్య విధానపు అమలులో వాణిజ్య బాంకులకు, బాంకేతర సంస్థలకు మధ్య తేడా ఉండకూడదని ఈ కమిటీ తెలిపింది. బాంకేతర సంస్థల వ్యాపార సరళిని కేంద్ర బాంకు నియంత్రణ నుండి మినహాయించినట్లయితే అవి తమ వ్యవహారాల ద్వారా వాణిజ్య బాంకులతో పోటీపడి వాటి ప్రగతిని దెబ్బతీసి ఆర్థిక వ్యవస్థలో అస్థిర పరిస్థితులను నెలకొల్పగలవని గుర్లే - షా తెలియజేశారు.

పైన పేర్కొన్న రెండు రకాల దృక్పథాల ప్రకారం బాంకేతర సంస్థల చర్యలు, కేంద్ర బాంకు ద్రవ్య విధానానికి ప్రతికూల ప్రభావాన్ని కలుగజేస్తాయి. కావున వీటిపై కేంద్ర బ్యాంకు నియంత్రణ తప్పకుండా ఉండాలి. కాని జాన్సన్ అనే ఆర్థికవేత్త వీరి అభిప్రాయంతో ఏకీభవించలేదు. ఇతని ప్రకారం బాంకేతర సంస్థలు, కేంద్ర బాంకు ద్రవ్య విధానాన్ని నిరోధిస్తాయనే అంశానికి సంబంధించి అనుభవపూర్వకమైన ఆధారాలు లేవని అంతేగాక ప్రజలు వాణిజ్య బాంకులపై గాకుండా బాంకేతర సంస్థల పథకాలవైపు ఆకర్షితమైనంత వరకు కేంద్ర బాంకు వాటిపై సమర్థవంతమైన నియంత్రణను కలిగి ఉండదని అభిప్రాయపడ్డాడు. బాంకేతర సంస్థల



BRAOU

వ్యవహారాలు కేంద్ర బాంకు ద్రవ్య విధానానికి ప్రతికూల ప్రభావాన్ని కాకుండా అనుకూల ప్రభావాన్ని కలుగజేస్తుందని Aschheim, స్మిత్, షపీరో అభిప్రాయపడ్డారు. గుర్లే - షా ప్రకారం బాంకుల వలె బాంకేతర సంస్థలు కూడా ఋణాత్మక నిధులను సృష్టిస్తాయి. బాంకేతర సంస్థలు జారీచేయు ద్వితీయ శ్రేణి సెక్యూరిటీలు, వాణిజ్య బాంకులు జారీచేయు పరపతి ద్రవ్యం మాదిరి వినిమయ మాధ్యమంగా పనిచేయవని అందువలన బాంకేతర సంస్థలు ఋణాత్మక నిధుల దళారీలుగా మాత్రమే పనిచేస్తాయని Aschheim అభిప్రాయపడ్డాడు. బాంకేతర సంస్థలు తమవద్ద ప్రభుత్వ సెక్యూరిటీలను కలిగి ఉంటాయని అందువల్ల కేంద్ర బాంకు తన బహిరంగ మార్కెట్ వ్యవహారాల (open market operations) ద్వారా ఈ సంస్థలను నియంత్రించగలుగుతుందని ఇతను తెలిపాడు.

## 16.8 బాంకేతర సంస్థలపై రిజర్వుబాంకు నియంత్రణ ఆవశ్యకత

కేంద్ర బాంకు ద్రవ్య విధానపు అమలులో బాంకేతర సంస్థల చర్యల ద్వారా కలిగే ప్రతికూల ప్రభావాల నివారణ కోసమై ప్రభుత్వం చేత 1972 సం॥లో నియమించబడిన "బాంకింగ్ కమీషన్" క్రింద పేర్కొన్న సూచనలను చేసింది.

1. బాంకేతర సంస్థలు కార్పోరేట్ సంస్థలుగా మారుటకు తగిన ప్రోత్సాహం కల్పించాలి.
2. నిర్దేశింపబడిన మూలధనాన్ని, రిజర్వులను ఏ బాంకేతర సంస్థలైతే ఆచరిస్తాయో, ఏవైతే సమర్థవంతమైన యాజమాన్యాన్ని కలిగి ఉంటాయో వాటికి వాణిజ్య బాంకుల నుండి రీఫైనాన్సింగ్ సౌకర్యం కల్పించడమే కాకుండా భీమా సౌకర్యం కూడా కల్పించాలి.
3. వాయిదా కొనుగోళ్లకు పరపతిని కల్పించే సంస్థలు విధిగా లైసెన్సులు పొందాలి. లైసెన్సింగ్ వ్యవస్థకు వాటిపై పూర్తి స్థాయి నిఘా ఉండాలి.
4. బాంకేతర సంస్థలకు ప్రత్యామ్నాయంగా యూనిట్ ట్రస్టులను, పెట్టుబడి కంపెనీలను ప్రోత్సహించుటకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.
5. చిట్ ఫండ్‌ల కార్యకలాపాలు డిపాజిట్‌దారులను ఎంతగానో ఆకర్షిస్తాయి. అయితే వీటి చర్యల వలన ఋణదాతలు, ఋణగ్రహీతలు మోసానికి గురికావచ్చు. అందుకని తగిన ప్రత్యామ్నాయం లేకుండా వీటిని రద్దు చేయలేం. వీటి మోసపూరిత చర్యలను నియంత్రించడంలో ప్రభుత్వం తగిన చొరవ చూపాలి. దేశమంతటా ఒకే రకమైన చిట్ ఫండ్ విధానం అమలులో ఉండే విధంగా చట్టం చేయాలి.
6. ఫైనాన్స్ కంపెనీలకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక పలుకుబడి ఉంటుంది. కాబట్టి ఇవి తప్పనిసరిగా ప్రభుత్వం నుండి లైసెన్సులు పొందడానికి చర్యలు తీసుకోవాలి. వాటి సొంత వాటా మూలధనం, డిపాజిట్ల సేకరణ, ఋణాల కల్పన వంటి విషయాల్లో అన్ని ఫైనాన్స్ కంపెనీలకు ఒకే రకమైన నిర్దేశితాలు ఉండి, అవి సమర్థవంతంగా అమలు అయ్యేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
7. బాంకేతర సంస్థల కార్యకలాపాల నియంత్రణకోసమై ఒక ప్రత్యేక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఏజెన్సీని నెలకొల్పాలి.

భారత దేశ ఆర్థిక వ్యవస్థలో బాంకేతర సంస్థల పాత్రను చక్రవర్తి కమిటీ (1985) సమీక్షించింది. బాంకేతర సంస్థలు సంప్రదాయ పద్ధతులలో తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ అనియత (informal) రంగంలో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని ఈ కమిటీ తెలిపింది. వాణిజ్య బాంకులతో బాంకేతర సంస్థలను పోల్చేటప్పుడు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, డిపాజిట్‌దారుల భద్రత కోసం బాంకేతర సంస్థలకు లైసెన్స్ విధానం ప్రవేశపెట్టాలని, ఇవి చేసే వ్యాపారానికి పరిమితిని నిర్ణయించాలని ఈ కమిటీ తన నివేదికలో పేర్కొంది.

BRAOU

బాంకేతర సంస్థలు ప్రచార సాధనాలైన వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్‌ల ద్వారా డిపాజిట్‌దారులకు అధిక వడ్డీ రేట్లు, ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని ప్రకటిస్తాయి. ఇందువల్ల సహజంగా ప్రజలు ప్రత్యేకించి పదవీ విరమణ పొందిన ఉద్యోగస్తులు ఈ సంస్థలలో పెట్టుబడి చేస్తారు. ప్రజలు ఈ సంస్థలలో పెట్టుబడులు చేసే ముందు అవి రిజర్వు బాంకు చట్టం, 1934 లోని సెక్షన్ 45 లో పొందుపరచిన నియమాలు పాటిస్తున్నాయా లేదా అనే విషయాన్ని గమనించాలని రిజర్వు బాంకుకు చెందిన "ఫైనాన్సియల్ కంపెనీస్ వింగ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సూపర్‌విజన్" నవంబర్ 24, 1995 నాడు పత్రికాముఖంగా తెలియపరచింది. ఇవి స్వీకరించాల్సిన డిపాజిట్ల గరిష్ట పరిమితిని నిర్ణయించి ఇవి తప్పనిసరిగా వాటి లాభాల, డివిడెండ్ల వివరాలను తెలుపాలని కోరింది. ఫైనాన్సియల్ కంపెనీల పనితీరుపై రిజర్వు బాంకు చేత 1992 సం॥లో నియమించబడిన 'షా కమీషన్' కూడా వీటి డిపాజిట్లపై గరిష్ట పరిమితిని నిర్ణయించాలని, వీటి పనితీరును సమీక్షించడానికి ప్రత్యేకంగా ఒక "స్టాండింగ్ అడ్వయిజరీ కమిటీ" ని నియమించాలని పేర్కొంది. బాంకేతర సంస్థల కార్యకలాపాల మూలంగా వాణిజ్య బాంకుల విస్తరణకు, ప్రగతికి ఆటంకం ఏర్పడుతున్నదని అందువల్ల వాణిజ్య బాంకులు బాంకేతర సంస్థలకు ఇచ్చే ఋణ సౌకర్యాన్ని ప్రోత్సహించరాదని, 'షా కమీషన్' సిఫారసులను అమలుపరచి ఈ సంస్థలను క్రమబద్ధం చేయాలని రిజర్వు బాంకు గవర్నర్ అభిప్రాయపడ్డారు.

## 16.9 బాంకేతర సంస్థలు - ఎం. నరసింహం కమిటీ సూచనలు

భారత దేశ పరపతి వ్యవస్థలో నిర్దేశిత లక్ష్యాల సాధనకు, "బాంకింగ్ రంగంలో సంస్కరణలు" ప్రవేశపెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం రిజర్వు బాంకు మాజీ గవర్నర్ అయిన ఎం. నరసింహం అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ తన నివేదికను 1991 సం॥లో సమర్పించింది. బాంకింగ్ సంస్కరణల్లో భాగంగా ఈ కమిటీ బాంకేతర సంస్థల నడవడికపై కూడా కొన్ని సూచనలు చేసింది. ఈ కమిటీ వాయిదా కొనుగోళ్లకు పరపతినిచ్చే సంస్థల గురించి, మర్చంట్ బాంకింగ్ గురించి, మ్యూచువల్ ఫండ్స్ గురించి, పెట్టుబడి కంపెనీల గురించి విడివిడిగా సూచనలను చేసింది.

### 16.9.1 వాయిదా కొనుగోళ్ళకు పరపతినందించు సంస్థలకు సంబంధించినవి

ఈ మధ్య కాలంలో మన దేశ పరపతి వ్యవస్థలో ఈ విధమైన సంస్థలు అనేకం వెలిసాయి. అయితే వీటిలో చాలా వరకు అదృశ్యమయ్యాయి. ఇందుకు గల ప్రధాన కారణం వాటి అల్ప స్థాయి మూలధనం. ఈ సంస్థల విస్తరణ ద్వారా చిన్న తరహా, మధ్య తరహా ఉద్యమదారులకు ఎంతో మేలు జరిగింది.

ఆర్థిక రంగంలో వీటి ప్రాధాన్యతను గమనించి నరసింహం కమిటీ క్రింద పేర్కొన్న సూచనలు చేసింది.

(a) ఈ సంస్థలకు ఒక కనిష్ట మొత్తం మూలధన నిధులను నిర్దేశించాలి.

(b) వీటి వ్యాపార సరళిపై కచ్చితమైన నియమ నిబంధనలు నిర్దేశింపబడాలి.

(c) వీటి లాభాలపై నియంత్రణ ఉండాలి.

### 16.9.2 మర్చంట్ బాంకింగ్‌కు సంబంధించినవి

వ్యాపార రంగంలో ఉద్యమదారులకు, వాటాల జారీలో చందా పూచీ కల్పించుట, పరపతిని కల్పించుట, ఇతర మార్గాల ద్వారా ఉద్యమదారులు పరపతిని పొందే సౌకర్యాన్ని కల్పించుట, నూతన ఉత్పత్తికి సంబంధించి ప్రణాళికను తయారుచేసి భవిష్యత్ డిమాండ్, అమ్మకాలపై సమాచారాన్ని అందించుట వంటి కార్యకలాపాలు

BRAOU

చేసే వాటిని మర్చంట్ బాంకింగ్ సంస్థలు అంటారు. మన దేశంలో మర్చంట్ బాంకింగ్ వ్యవహారాలను వాణిజ్య బాంకులు చేపడుతున్నాయి. ఇవేగాక విదేశీ బాంకుల సహాయంతో మన దేశంలో ప్రైవేట్ సంస్థలు కూడా ఈ వ్యాపారం చేస్తున్నాయి.

భారత పారిశ్రామిక రంగంలో మర్చంట్ బాంకింగ్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వీటి ప్రగతిని, అభివృద్ధిని ప్రోత్సహించాలని నరసింహం కమిటీ సూచించింది. ఇవి నిర్దేశిత నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని వీటిని రిజర్వు బాంకు సమర్థవంతంగా నియంత్రించాలని ఈ కమిటీ తెలిపింది. ప్రస్తుతం ఈ బాంకులు 'SEBI' మరియు రిజర్వు బాంకు నియంత్రణలో పని చేస్తున్నాయి.

### 16.9.3 మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించినవి

మూలధన మార్కెట్‌లో వీటి అభివృద్ధి వేగవంతమైంది. "బోర్డ్ ఆఫ్ ట్రస్టీ"ల అధ్వర్యంలో వివిధ రకాల పథకాలు రూపొందించి వాటిని అమలు చేయడం ద్వారా ప్రజల నుండి డిపాజిట్లను సేకరించే సంస్థలే మ్యూచువల్ ఫండ్స్. ఈ సంస్థలు పన్ను మినహాయింపు పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా కూడా డిపాజిట్లను సేకరిస్తున్నాయి. ప్రస్తుతం ఇవి SEBI ఆజమాయిషికి లోబడి పని చేస్తున్నాయి.

వీటికి సంబంధించి కమిటీ సూచనలు క్రింది విధంగా ఉన్నాయి.

a) దేశంలోని అన్నీ మ్యూచువల్ ఫండ్స్ సౌభాగ్యంగా ఉండి పోటీతత్వంతో కొనసాగేందుకు ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలి.

b) వీటి స్థాపన మరియు విస్తరణకు ఒక విధమైన చట్టం ఉండాలి.

c) పన్ను మినహాయింపు పథకాలకు సంబంధించి అన్ని మ్యూచువల్ ఫండ్స్‌కు ఒకే రకమైన ప్రాధాన్యత ఉండాలి.

### 16.9.4 పెట్టుబడి కంపెనీలకు సంబంధించినవి

ఆధునిక పద్ధతులలో వ్యాపారం చేపట్టేందుకు ద్రవ్య నిధులను కల్పించే సంస్థలే పెట్టుబడి కంపెనీలు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నూతన పద్ధతులను కనిపెట్టే ఉద్యమదారులను ఈ సంస్థలు ప్రోత్సహిస్తాయి. ప్రస్తుతం మన దేశంలో వీటికి సంబంధించిన నియమ నిబంధనలు వీటి ప్రగతిని నిరోధించేవిగా ఉన్నాయని నరసింహం కమిటీ పేర్కొంది. ఈ పరిస్థితిని సమీక్షించి సరళత్వ విధానాన్ని అమలు చేసి వీటి వ్యవహారాలను ప్రోత్సహించాలని ఈ కమిటీ పేర్కొంది. ఈ సంస్థల వ్యవహారం నష్ట భయంతో కూడుకొనియున్నందున ఇవి సంపాదించే లాభంపై రాయితీలతో కూడిన పన్నులను విధించాలని ఈ కమిటీ అభిప్రాయపడింది.

## 16.10 సారాంశం

వివిధ రకాల ఆకర్షణీయమైన పథకాలు రూపొందించి, అధిక వడ్డీ రేట్లు ప్రవేశపెట్టడం ద్వారా ప్రజల నుండి డిపాజిట్లను సేకరించి, వాటిని ఉద్యమదారులకు అప్పులిచ్చే సంస్థలే బాంకేతర సంస్థలు. ఋణాలిచ్చే సంస్థలు, భీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్, మర్చంట్ బాంకింగ్, పించన్ సంస్థలు, వాయిదా కొనుగోళ్లకు పరపతిని కల్పించే సంస్థలు, చిట్ ఫండ్స్ మొదలగు వాటిని బాంకేతర సంస్థలకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ సంస్థలు బాండ్లను, సెక్యూరిటీలను జారీచేసి ప్రజల డిపాజిట్లను సేకరిస్తాయి. వీటినే పరోక్ష సెక్యూరిటీలు లేదా ద్వితీయ

BRAOU

శ్రేణి సెక్యూరిటీలు అంటారు. అదే సమయంలో ఇవి పెట్టుబడిదారులకు అర్హమైన సెక్యూరిటీలను పూచీగా ఉంచుకొని అప్పులు ఇస్తాయి. ఈ విధంగా బాంకేతర సంస్థలు ఋణ దాతలకు, ఋణ గ్రహీతలకు మధ్య సారధిగా, ప్రధాన సాధనంగా తోడ్పడతాయి.

బాంకులు, బాంకేతర సంస్థలు అవి నిర్వహించే కార్యకలాపాల రీత్యా ఒకే మాదిరిగా గోచరించినప్పటికీ వాటి మధ్య తేడా ఉంటుంది. బాంకేతర సంస్థలకు భిన్నంగా బాంకులు డిపాజిట్ల సహాయంతో పరపతిని సృష్టిస్తాయి. అంతేగాక బాంకింగ్ నియమాలను పాటిస్తూ వాణిజ్య బాంకులు తాము సేకరించిన అన్ని రకాల డిపాజిట్లలో కొంత శాతం నగదు నిలువల రూపంలో ఉంచాలి.

పరపతి వ్యవస్థలో ప్రముఖ స్థానాన్ని కలిగియుండి ఆర్థికాభివృద్ధిలో ప్రాధాన్యతను కలిగిన బాంకేతర సంస్థల చర్యలు కేంద్ర బాంకు యొక్క ద్రవ్య విధానపు అమలుకు అడ్డంకులుగా ఉన్నాయని కావున వీటిపై కేంద్ర బాంకు సమర్థవంతమైన నియంత్రణను కలిగియుండవలెనని ప్రభుత్వం చేత నియమించబడిన బాంకింగ్ కమీషన్, చక్రవర్తి కమీషన్, షా కమీషన్ పేర్కొన్నాయి. అలాగే బాంకింగ్ సంస్కరణలకు సంబంధించి 1991లో తన నివేదికను సమర్పించిన నరసింహం కమిటీ కూడా బాంకేతర సంస్థలకు సంబంధించి పలు సూచనలు చేసింది. దేశంలోని బాంకేతర సంస్థలకు స్పష్టమైన, నిర్దిష్టమైన నియమ నిబంధనలు ఉండాలనీ, మర్చంట్ బాంకింగ్, పెట్టుబడి కంపెనీలు మొదలగు వాటి వృద్ధిని ప్రోత్సహించాలనీ ఈ కమిటీ పేర్కొంది.

## 16.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 40 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. బాంకేతర పరపతి సంస్థలు అనగానేమి ? మూలధన మార్కెట్‌లో వాటి పాత్రను వివరించండి.
2. బాంకేతర పరపతి సంస్థల విధులను తెలియజేయండి. వాటిపై కేంద్ర బాంకు నియంత్రణ ఆవశ్యకతను విశ్లేషించండి.

**II ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి సుమారు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. బాంకులు - బాంకేతర సంస్థల సారూప్యతను, వాటి మధ్యగల తేడాలను వివరించండి.
2. ద్రవ్య విధానపు అమలులో బాంకేతర సంస్థల పాత్రను అంచనా వేయండి.
3. బాంకేతర సంస్థలకు సంబంధించి నరసింహం కమిటీ సూచనలను రాయండి.

## 16.12 సంప్రదింపు గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | H.L. Bhatia | : | Monetary Theory |
| 2. | M.L. Jhingan | : | Money, Banking and International Trade |
| 3. | K.C. Shekar | : | Banking Theory and Practice |
| 4. | B.N. Ghosh and Rama Ghosh | : | Modern Macro Economics : Theory and Policy |
| 5. | M.J.C. Surrey (Ed) | : | Macro Economic Themes |
| 6. | Ruddar Dutt and KPM Sundaram | : | Indian Economy (Latest Edition) |




BRAOU

## 16.13 భావనలు

| | | | |
|---|---|---|---|
| 1. | బీమా సంస్థలు | : | బాండ్లను జారీచేసి ప్రీమియం రూపంలో ప్రజల నుండి, వ్యాపార సంస్థల నుండి పొదుపులను సేకరించు సంస్థలు. ఉదా : జీవిత బీమా, వాహనాల బీమా, డిపాజిట్ల బీమా మొదలగునవి. |
| 2. | తరహా ఆదాలు | : | వస్తూత్పత్తి ప్రక్రియలో ఉత్పాదకాలపై చేసిన వ్యయం ఫలితంగా ఉత్పత్తి దారులు వస్తూత్పత్తిలో అనుభవించే ప్రతిఫలాలు. |
| 3. | ద్రవ్య విధానం | : | ధరల స్థాయిలో స్థిరత్వం సాధించి వ్యాపార చక్రాలను నిరోధించుట అనగా ద్రవ్యోల్బణ, ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులను నివారించుట; వాణిజ్య బాంకుల పరపతి సృష్టిని నియంత్రించుట. |

## 16.14 పదకోశం

| | | |
|---|---|---|
| బీమా సంస్థలు | : | Insurance companies |
| మూలధన మార్కెట్ | : | Capital market |
| చందా పూచీ | : | Underwriting |
| ఉద్యమదారులు | : | Entreprenuers |
| తరహా ఆదాలు | : | Returns to scale |
| భవిష్య నిధి | : | Provident Fund |
| ద్రవ్య విధానం | : | Monetary policy |
| ఋణదాత | : | Lender |
| ఋణగ్రహీత | : | Borrower |
| స్వల్పకాలిక ఋణం | : | Short term loan |
| ఋణాత్మక నిధులు | : | Loanable funds |
| పరపతి ద్రవ్యం | : | Credit money |

- డా॥ ఎస్. లింబా గౌడ్

BRAOU

# భాగం - 17 : భారత దేశంలో అభివృద్ధి బాంకులు

**విషయ క్రమం**


17.0 ఉద్దేశాలు

17.1 పరిచయం

17.2 అభివృద్ధి బాంకుల భావన, నిర్వచనం

17.3 ఆర్థిక వృద్ధి సిద్ధాంతం - అభివృద్ధి బాంకుల పాత్ర

17.4 అభివృద్ధి బాంకుల లక్ష్యాలు, విధులు

17.5 అభివృద్ధి బాంకుల యాజమాన్యం

17.6 అభివృద్ధి బాంకుల మూలధన నిర్మాణం

17.7 అభివృద్ధి విత్తం : నియమ నిబంధనలు

17.8 భారత దేశంలో అభివృద్ధి బాంకుల జననం, వృద్ధి

17.9 భారత పారిశ్రామిక విత్త సంస్థ (IFCI)

17.10 భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ (ICICI)

17.11 భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు (IDBI)

17.12 భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు (SIDBI)

17.13 రాష్ట్ర విత్త సంస్థలు (SFCs)

17.14 ఇతర అభివృద్ధి బాంకులు

17.14.1 భారత పారిశ్రామిక పునర్నిర్మాణ బాంకు (IRBI)

17.14.2 రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు

17.15 పెట్టుబడి సంస్థలు

17.15.1 యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (UTI)

17.15.2 భారత జీవిత భీమా సంస్థ (LIC)

17.15.3 జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (GIC)

17.16 సారాంశం

17.17 మాదిరి పరీక్షా ప్రశ్నలు

17.18 సంప్రదింపు గ్రంథాలు

17.19 పదకోశం


## 17.0 ఉద్దేశాలు

అభివృద్ధి బాంకుల నిర్వచనం, లక్ష్యాలు, విధులు, మూలధన నిర్మాణం గురించి ఈ భాగం వివరిస్తుంది. భారత దేశంలో అభివృద్ధి బాంకుల జననం, ప్రగతిని సమీక్షిస్తుంది. ఈ భాగంలో భారత దేశంలోని వివిధ అభివృద్ధి బాంకుల విధులు, కార్యక్రమాలు, పనితీరును, పారిశ్రామికాభివృద్ధిలో ఆ బాంకుల సేవలను చర్చించాం.

BRAOU

ఈ భాగంలోని పాఠ్యాంశాన్ని చదివిన తర్వాత, మీరు కింది విషయాలను గురించి వివరించగలరు.

- అభివృద్ధి బాంకుల లక్ష్యాలు, విధులు, మూలధన నిర్మాణం, నిర్వహించే కార్యక్రమాలు.
- భారత దేశంలో వివిధ అభివృద్ధి బాంకుల జననం, వృద్ధి.
- భారత దేశంలో వివిధ అభివృద్ధి బాంకుల విధులు, కార్యకలాపాలు, విత్త, ప్రవర్తనాపరమైన సహాయం.

## 17.1 పరిచయం

రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో ఆర్థిక వృద్ధికి సంబంధించిన సమస్యల వైపు ఆ దేశాల దృష్టి మళ్ళింది. పారిశ్రామికంగా ఎంతో ప్రగతి సాధించిన దేశాల అనుభవాలతో పోల్చుకుంటూ అతి తక్కువ కాలవ్యవధిలో ఆర్థిక వృద్ధి సాధనే వాటి లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో మూలధనం కొరత, పరిమిత సాంకేతిక విజ్ఞానం, పారిశ్రామికీకరణకు అవసరమైన వనరులను సమకూర్చే సంస్థల కొరత వంటి ఎన్నో మౌళిక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆర్థిక వృద్ధి ఆయా దేశాల సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సంస్థాగత కారకాలపై ఆధారపడి యుంటుంది. ఆర్థిక వృద్ధిని సాధించాలంటే పారిశ్రామికాభివృద్ధియే ముఖ్యమైన మార్గం. కావున, ఆర్థికంగా వెనుకబడిన దేశాల ఆర్థిక వృద్ధి ఆ దేశాల పారిశ్రామిక ప్రగతిపైన ఆధారపడి వుంది.

ఆర్థికంగా వెనుకబడిన దేశాలు, వాటి పారిశ్రామికీకరణకు ఎన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వస్తుంది. వాటిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు : 1. ఆర్థికపరమైన పరిసరాల కొరత, 2. సాంఘీక, జనాభా పరమైన సమస్యలు, 3. ఉత్పత్తి కారకాల కొరత. పారిశ్రామికాభివృద్ధిని సాధించడం ముఖ్యంగా ఉద్యమకారుని నైపుణ్యం, నవీన ఉత్పత్తి పద్ధతులు, యాజమాన్య సమర్థత, సాంకేతిక నిపుణత గల వ్యక్తులు, మార్కెట్లు, మూలధన లభ్యత మొదలగు అంశాలపై ఆధారపడి యుంది. వీటిలో కొన్నింటిని మనం ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవచ్చు. కొన్నింటిని మన దేశంలోనే అభివృద్ధి పరచవచ్చు. కాబట్టి పారిశ్రామికాభివృద్ధి సాధనకు అవసరమైన వనరులను సమకూర్చి, తరలించి, అభివృద్ధి పరచి, వాటిని ఉత్పాదక రంగాలలో వినియోగ పరచడానికి సరియైన సంస్థల అవసరం ఏర్పడింది. ఈ తరుణంలో అభివృద్ధి బాంకులు ప్రవేశించాయి. భారత దేశంలో ఈ అభివృద్ధి బాంకులు విస్తరించి, పరిశ్రమలకు అవసరమైన ఎన్నో విత్తపరమైన, ప్రవర్తనాపరమైన కార్యక్రమాలను అమలు పరచి పారిశ్రామికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడినాయి.

## 17.2 అభివృద్ధి బాంకుల భావన, నిర్వచనం

ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో ఆర్థికాభివృద్ధిని వేగిరపరచుటకు ముఖ్య సంస్థాపర సాధనాలుగా అభివృద్ధి బాంకులు ఇటీవలి కాలంలో వెలువడినాయి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం చాలా దేశాలు స్వాతంత్ర్యం పొందిన తరుణంలో, ఆ దేశాలలో త్వరితగతిన ఆర్థిక, సాంఘికాభివృద్ధి సాధించాలనే కోరిక ప్రబలమయింది. ఈ వెనుకబడిన దేశాలలో భౌతిక వనరుల కొరత వలన సత్వర ఆర్థికాభివృద్ధి కోసం ప్రజల కోరికలు, అందుకవసరమైన వనరుల కొరతల మధ్య అంతరం క్రమేణా పెరుగుతూ వచ్చింది. ఈ రెండింటి మధ్యగల అంతరాలను తొలగించి విత్తపరమైన, ప్రవర్తనాపరమైన సహాయ సహకారాలను అందించి సత్వర పారిశ్రామికాభివృద్ధి కోసం మొదటిసారిగా 'అభివృద్ధి బాంకింగ్' అనే భావన వెలువడింది.

బ్రిటన్ వంటి ఆర్థికంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో ఆ దేశాల పారిశ్రామికీకరణ ప్రారంభ దశలలో అవసరమైన మూల ఉత్పత్తి కారకాలు పుష్కలంగా లభించేవి. వెనుకబడిన దేశాలు ఈ ఉత్పత్తి కారకాల కొరతవలన చాలా సమస్యలు ఎదుర్కొంటుండేవి. ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో ఆదాయాలు, పొదుపులు తక్కువ స్థాయిలో ఉండటం వలన, ఆ చిన్న మొత్తాల పొదుపులను సమీకరించి వాటిని ఉత్పాదక పెట్టుబడులుగా

BRAOU

ఉపయోగించడానికి సరియైన మూలధన మార్కెట్ లేని కారణంగా ఆ దేశాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు, ఉన్నటువంటి పెట్టుబడి అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవసరమైన ప్రతిభ, నైపుణ్యం గల ఉద్యమదారుల కొరత వలన, పారిశ్రామిక సంస్థలను రూపొందించి నిర్వహించడానికి సమర్థత గల వ్యక్తులు లభించకపోవడం వలన అభివృద్ధి చెందుతున్న దేశాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వెనుకబడిన దేశాల ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఆర్థిక వృద్ధికి అవరోధాలుగా మిగిలాయి. ఇటువంటి పరిస్థితులలో ఆర్థికాభివృద్ధికి అవసరమైన కనీసం కొన్ని ఉత్పత్తి కారకాలైనా సమకూర్చగల సంస్థల రూపకల్పనకు ప్రయత్నం జరిగింది. ఈ ప్రయత్నం ఫలితమే అభివృద్ధి బాంకుల ప్రవేశం.

అభివృద్ధి బాంకులు ఇటీవలి కాలంలోనే వెలువడినాయని చాలా మంది అభిప్రాయం. వాణిజ్య, పారిశ్రామిక విత్తం సమకూర్చడానికి 1822 సంᵢᵢలోనే బెల్జియం దేశంలో సొసైటి జనరల్ డి బెల్‌గివ్ (Societe general de Belgive) అనే మొదటి అభివృద్ధి బాంకును స్థాపించారు. తర్వాత 1852 సంవత్సరంలో ఫ్రాన్స్ దేశంలో 'క్రెడిట్ మొబైలర్' అనే సంస్థను స్థాపించారు. తదుపరి జర్మనీ, ఆస్ట్రేలియా, నెదర్‌లాండ్స్, ఇటలీ, స్విట్జర్లాండ్, స్పెయిన్ మొదలగు దేశాలు అభివృద్ధి బాంకులను స్థాపించాయి. విదేశీ మూలధనం సమకూర్చడానికి, బాండ్ల మార్కెట్ అభివృద్ధి పరచడానికి జపాన్ ప్రభుత్వం 1902లో 'జపాన్ పారిశ్రామికాభివృద్ధి బాంకు'ను ఏర్పాటు చేసింది. 1944 తర్వాత చాలా దేశాలు అభివృద్ధి బాంకులను ప్రారంభించాయి. భారత దేశంలో మొట్టమొదటి అభివృద్ధి బాంకు భారత పారిశ్రామిక విత్త సంస్థ (Industrial Finance Corporation of India) ను 1948లో స్థాపించారు. ఈ విధంగా రెండవ ప్రపంచ యుద్ధాంతానికి ప్రపంచంలో చాలా దేశాలలో అభివృద్ధి బాంకులు బహుళ ప్రచారం పొందాయి.

అభివృద్ధి బాంకులను నిర్వచించడం చాలా క్లిష్టమైన పని. ఈ బాంకుల నిర్మాణంలో, విధులలో, యాజమాన్యంలో, లక్ష్యాలలో, పద్ధతులలో భేదాలుండటం వలన వీటిని నిర్వచించడం సులభం కాదు. ఈ అభివృద్ధి బాంకులు ఆయా దేశాల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించబడినాయి. కాని వివిధ దేశాల అభివృద్ధి బాంకుల నిర్మాణం, విధులు, కార్యకలాపాలలో వైవిధ్యం వున్నా అభివృద్ధి బాంకుల ముఖ్యం లక్ష్యం ఒక్కటే – పారిశ్రామికీకరణ ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడం. శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధనకు అవసరమైన విత్త, సాంఘిక, ఆర్థిక వసతులను ఏర్పరచుటలో సహాయపడి, అవసరమైన మూలధనం, సాంకేతిక, యాజమాన్య పరిజ్ఞానాన్ని సమకూర్చి సహకరించడమే అభివృద్ధి బాంకుల ముఖ్య లక్ష్యం. కొన్ని దేశాలలో అభివృద్ధి బాంకులు పరిశ్రమలకు అవసరమైన విత్తం సమకూర్చడానికి ప్రాముఖ్యతను ఇవ్వగా, కొన్ని దేశాలలో ప్రవర్తనా కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వగా, కొన్నింటిలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుటకు కృషి చేయగా, మరికొన్ని దేశాలలో ఆర్థిక ప్రణాళికలకు ప్రాముఖ్యతను ఇస్తున్నాయి. ఆయా దేశాల అవసరాలనుబట్టి అభివృద్ధి బాంకులు తమ లక్ష్యాలను ఏర్పరచుకొని అమలు చేస్తున్నాయి.

అభివృద్ధి బాంకులు వివిధ పేర్లతో పని చేస్తున్నాయి. ఇవి పారిశ్రామిక తనఖా బాంకులనీ, పారిశ్రామిక విత్త సంస్థలనీ, పారిశ్రామికాభివృద్ధి సంస్థలనీ వాడుకలో వున్నాయి. వీటి మధ్యగల భేదాలను మనం గమనించాలి. పరిశ్రమలకు అవసరమైన దీర్ఘకాల ఋణాలను సమకూర్చడం పారిశ్రామిక తనఖా బాంకుల విధి. పారిశ్రామిక విత్త సంస్థ పరిశ్రమలకు అవసరమైన దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చడంతోబాటు పూచీదారుగా వ్యవహరించడం, పరిశ్రమల వాటాలకు చందా కట్టడం, డిబెంచర్లపై పెట్టుబడి పెట్టడం మొదలైన విధులను నిర్వహిస్తుంది. వీటికి భిన్నంగా పారిశ్రామికాభివృద్ధి సంస్థలు పరిశ్రమలకు ఉపయోగపడే ప్రవర్తనా కార్యక్రమాలను అనగా సాంకేతిక - ఆర్థిక సర్వేలు, మార్కెట్ పెట్టుబడుల పరిశోధనలు, సాంకేతిక, యాజమాన్య, పరిపాలనా సలహాలు మొదలగు కార్యక్రమాలను నిర్వహించి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడతాయి.

అభివృద్ధి బాంకులు పైన వివరించిన మూడు రకాల సంస్థలు నిర్వహించే కార్యకలాపాలన్నీ నిర్వహిస్తాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య అభివృద్ధి బాంకుల పాత్రలో తేడాలుంటాయి.అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో అభివృద్ధి బాంకులు మార్కెట్ అవసరాలను బట్టి వెలువడుతాయి. ఆర్థికాభివృద్ధి రేటును పెంచడమే వాటి లక్ష్యం. పారిశ్రామిక నిర్మాణంలోని లోటును భర్తీ చేయవలసిన అవసరం లేదు. కాని, అందుకు భిన్నంగా వెనుకబడిన ఆర్థిక వ్యవస్థలలో వాటి పాత్ర వేరుగా ఉంటుంది. అభివృద్ధి బాంకులు మూలధనాన్ని పెంచాలి; పెట్టుబడిదారులను, ఉద్యమదారులను ప్రోత్సహించాలి; భౌతిక, మానవ వనరుల కొరతను తీర్చాలి; ప్రవర్తనా విధులను నిర్వర్తించాలి; ఒక మంచి పారిశ్రామిక ప్రాజెక్టు నిధుల కొరత వలనగాని, సాంకేతిక పరిజ్ఞాన లోపం వలన గాని సంస్థ అభివృద్ధి కుంటుపడకుండా చూడాలి. కాబట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి బాంకులు ఆర్థికాభివృద్ధి సాధనాలుగా రూపొందించబడినాయి.

అభివృద్ధి బాంకుల లక్ష్యాలు, విధులు సాంప్రదాయక విత్త సంస్థలు, వాణిజ్య బాంకుల విధులకు భిన్నంగా ఉంటాయి. వాణిజ్య బాంకులు ప్రజల నుండి పొదుపులు సేకరించి వాటిని ఉత్పాదక రంగాలకు, అర్హత గలిగిన ఉద్యమదారులకు స్వల్ప కాలిక, మధ్య కాలిక ఋణాల రూపంలో తరలిస్తాయి. అభివృద్ధి బాంకులు కేవలం పరిశ్రమలకు అవసరమైన ఋణాలివ్వడమే కాక ఎన్నో రకాల విధులను నిర్వర్తిస్తాయి. ఉదాహరణకు, భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు పారిశ్రామిక సంస్థల వాటాలకు పూచీదారుగా వ్యవహరించడం, హామీలివ్వడం, పరిశ్రమల వాటాలకు చందా కట్టడం, సంస్థల బిల్లుల రి-డిస్కౌంటింగ్, పారిశ్రామిక విత్త సంస్థలకు పునర్విత్త సహాయమందించడం వంటి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుంది. వీటితోపాటు, పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడే ఎన్నో ప్రవర్తనా కార్యక్రమాలు – అనగా సాంకేతిక - ఆర్థిక సర్వేలు నిర్వహించడం, పారిశ్రామిక అవకాశాల సర్వేలు, ఆర్థికంగా స్వయం భరణ శక్తి గల ప్రాజెక్టులను గుర్తించడం, వాటి స్వయం భరణ శక్తిని మదింపు వేయడం, సాంకేతిక, యాజమాన్య సలహాలివ్వడం మొదలగునవి చేపడుతుంది. జాతీయ అవసరాలకు అనుగుణంగా పారిశ్రామికాభివృద్ధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా గల సమస్యలన్నింటిని పరిష్కరిస్తుంది. కాబట్టి అభివృద్ధి బాంకులు వాణిజ్య బాంకుల కన్నా ఎక్కువ కార్యక్రమాలు చేపడతాయి.

తమ నిధులను ఉపయోగించడంలో అభివృద్ధి బాంకులు ఎక్కువగా అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కలిగి ఉంటాయి. అందుకు భిన్నంగా వాణిజ్య బాంకులు లాభాలకు, పెట్టుబడుల ఉత్పాదకతకు ప్రాధాన్యతను ఇస్తాయి. ముఖ్యంగా గమనించదగ్గ విషయం : అభివృద్ధి బాంకులు వాణిజ్య బాంకులకు, ఇతర సంస్థలకు పోటీగా వ్యవహరించవు. సాధారణ మార్గంలో అవసరమైన ఋణాలను పొందలేని పారిశ్రామిక సంస్థలకు అభివృద్ధి బాంకులు విత్త సహాయాన్నందిస్తాయి. వాణిజ్య బాంకులు తమ విధులను వ్యాపార సూత్రాల ఆధారంగా రూపొందించుకొంటాయి; లాభమే ముఖ్య లక్ష్యంగా కలిగి ఉంటాయి. కాని, అభివృద్ధి బాంకులు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కలిగి ఉంటాయి. పారిశ్రామిక సంస్థలకు సహాయం అందజేయునప్పుడు లాభాలకు మారుగా దేశ సాంఘిక, ఆర్థిక లక్ష్యాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రాధాన్య రంగాల అభివృద్ధి, నైపుణ్యంగల ఉద్యమదారులను ప్రోత్సహించడం మొదలైన అంశాలను పరిగణిస్తాయి. దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన సంస్థల స్థాపనలో, నష్టాలు సంభవించే అవకాశాలున్నా కూడా, అభివృద్ధి బాంకులు విత్త సహాయమందిస్తాయి. పైన విశ్లేషించిన విషయాల ఆధారంగా అభివృద్ధి బాంకులను ఆర్థికాభివృద్ధి సాధనాలుగా అభివర్ణించవచ్చు.

## 17.3 ఆర్థిక వృద్ధి సిద్ధాంతం - అభివృద్ధి బాంకుల పాత్ర

రెండవ ప్రపంచ యుద్ధానంతరం వెనుకబడిన దేశాలు ముఖ్యంగా పారిశ్రామికీకరణ ద్వారా త్వరితగతిన ఆర్థిక వృద్ధి సాధనకు కృషి చేశాయి. ఆర్థిక వేత్తలు ఆర్థిక వృద్ధి ప్రాముఖ్యతను, ఆవశ్యకతను గుర్తించారు. హిక్స్

BRAOU

భావన ప్రకారం, దీర్ఘకాల సమతౌల్య సిద్ధాంతమే నవీన అర్థశాస్త్రంలో ఆర్థిక వృద్ధి సిద్ధాంతంగా మారింది. ఆర్థికాభివృద్ధి సిద్ధాంత ముఖ్య లక్ష్యం తలసరి ఆదాయాన్ని పెంచుటకు ఉపయోగించే పద్ధతులను వివరించడం.

ఆర్థిక వృద్ధి ప్రక్రియ చాలా క్లిష్టమైన అంశం. ఆర్థిక వృద్ధి కేవలం మానవుల ఆర్థిక లక్ష్యాలపైనే ఆధారపడుతుందని చెప్పలేమని రోస్టో అభిప్రాయం. అతని ప్రకారం సంస్థాగత కారకాలు అనగా మానవ విలువలు, మానవ వనరులు, సామాజిక విలువలు, అభిరుచులు, సాంస్కృతిక విలువలు, రాజకీయ వాతావరణం, ఇంకా చాలా ఆర్థికేతర కారకాలు దేశ ఆర్థిక వృద్ధి నిర్ణాయకాలని చెప్పవచ్చు.

భారత దేశ ప్రణాళికా సంఘం ప్రకారం, ఆర్థిక వృద్ధి రేటు జనాభా పెరుగుదల రేటుపైన, ప్రస్తుత ఆదాయంలో మూలధనానికి ఉపయోగించే ఆదాయ అనుపాతంపైన, మూలధన ఉత్పాదకత పైన ఆధారపడుతుంది. మూలధనం ఆర్థిక ప్రగతి రేటును నిర్ణయించుటలో కీలక పాత్ర వహిస్తుంది. ఆర్థిక ప్రగతి ప్రక్రియలో మూలధన ప్రాముఖ్యతను కురిహార, కైర్న్‌క్రాస్‌ల వంటి ప్రముఖ ఆర్థిక వేత్తలు తమ గ్రంథాలలో ప్రధానంగా వివరించారు. మూలధన సంచయనం మూలధన ఆస్తులను సృష్టించడమే కాక ఎన్నో దశల వారీగా వస్తూత్పత్తి పెంపుదలకు అవకాశమిస్తుంది. మూలధన నిల్వలు పెరగడం వలన ఉత్పత్తి రంగం విస్తృత పడుతుందనీ, సాంకేతికాభివృద్ధికి తోడ్పడుతుందని కైర్న్‌క్రాస్ అభిప్రాయం. రాగ్నార్ నర్క్స్ తన గ్రంథంలో "మూలధనం ప్రగతికి ఒక అవసరమైన నిబంధనేగాని సరిపడినంత నిబంధన కాదు" అని వ్యాఖ్యానించాడు. కాబట్టి మూలధనంతోబాటు మిగతా ఉత్పత్తి కారకాలను, ఆర్థిక వృద్ధిలో వాటి పాత్రను గురించి చర్చించవలసి వుంది. సహజ వనరులు, మార్కెట్ పరిమాణం ముఖ్య కారకాలైనప్పటికీ, సమర్థులైన ఉద్యమకారులు, యాజమాన్య సామర్థ్యం ఆర్థికంగా వెనుకబడిన వ్యవస్థలకు అత్యంత ముఖ్యం.

షుంపీటర్ ఆర్థిక వృద్ధి ప్రక్రియలో ఉద్యమదారుడు నిర్వహించే పాత్రను ప్రధానంగా వివరించాడు. అతని భావంలో ఉద్యమదారుడు ఎల్లప్పుడూ నవకల్పనలను సృష్టించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ ముందంజ వేయడానికి తోడ్పడుతాడు. ఆర్థికాభివృద్ధిలో యాజమాన్య సామర్థ్యం పాత్రను విలియమ్ డైమండ్ నొక్కి చెప్పడం జరిగింది. వెనుకబడిన ఆర్థిక వ్యవస్థలలో మూలధనం, ఉద్యమకారులు, యాజమాన్య సమర్థత అన్నవి మూడు ముఖ్యమైన ఉత్పత్తి కారకాలుగా పరిగణించవచ్చు. ఉదాహరణకు, మన దేశంలో పరిశ్రమలకు అవసరమైన శ్రామికులు, ముడి పదార్థాలు సమృద్ధిగా లభించునప్పటికీ, మూలధనం కొరత, నైపుణ్యం గల ఉద్యమదారుల కొరత, యాజమాన్య అసమర్థత మొదలగునవి ఆర్థికాభివృద్ధి అవరోధాలు. ఈ ఉత్పత్తి కారకాల కొరత తీరిననాడు భారత దేశం ఆర్థిక ప్రగతిని సాధిస్తుందనడంలోఅనుమానం లేదు.

కీన్సు సిద్ధాంతం ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలలో సార్థక డిమాండు లోపం వలన నిరుద్యోగిత ఏర్పడుతుంది. కాని అభివృద్ధి చెందుతున్న దేశాలలో మూలధనం కొరత వలన ఉత్పాదకత శక్తి లేకపోవడం వలన నిర్మాణాత్మక నిరుద్యోగిత లేదా ప్రచ్ఛన్న నిరుద్యోగిత ఏర్పడుతుంది. కురిహార ప్రకారం కూడా వెనుకబడిన దేశాలలో మూలధనం కొరత నిర్మాణాత్మక నిరుద్యోగితకు అవకాశం ఇస్తుంది. అభివృద్ధి ఛెందుతున్న దేశాలు ఎక్కువగా అభిలషణీయ వృద్ధి రేటును సాధించడానికి ప్రయత్నిస్తాయి. కాబట్టి అభివృద్ధి బాంకులు పరిశ్రమలకు అవసరమైన మూలధనాన్ని సమకూర్చడం ద్వారా అభిలషణీయ వృద్ధి రేటును పెంచి, ఆర్థిక వృద్ధికి తోడ్పడుతాయి. ఈ విధంగా సంపూర్ణ ఉద్యోగితా దిశలో ఈ దేశాలు వృద్ధి చెందే అవకాశముంటుంది.

BRAOU

### 17.3.1 అభివృద్ధి బ్యాంకులు - మూలధన కల్పన

ప్రస్తుత ఆదాయంలో కొంత భాగం పొదుపు చేసి, ఆ పొదుపును తిరిగి ఉత్పత్తికి వినియోగించడం ద్వారా మూలధన నిల్వలను పెంచడం మూలధన సంచయనం అనవచ్చు. ఒక ఆర్థిక వ్యవస్థ ఉత్పాదక సామర్థ్యం ఆ వ్యవస్థ యొక్క మూలధన పరిమాణం, లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడి నిష్పత్తి, పొదుపు నిష్పత్తి, మూలధన-ఉత్పత్తి నిష్పత్తి మూలధన సంచయనపు కొలమానాలుగా పరిగణించవచ్చు. ఈ అంశాలను ప్రభావితం చేయడంలో అభివృద్ధి బ్యాంకుల పాత్రను చర్చించడం ఇక్కడ సమంజసంగా ఉంటుంది.

ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో అధిక శాతం జనాభా చాలీచాలని ఆదాయాలతో పేదరిక విషవలయంలో చిక్కుకొని తక్కువ జీవన ప్రమాణాలు కల్గి వున్నారు. దీనికి కారణం తక్కువ ఆదాయాలు, తక్కువ స్థాయి వృద్ధి రేటు, మూలధనం కొరత మొదలైనవి. ఈ పరిస్థితి ఆ దేశాలలో ప్రజలలో తక్కువ కొనుగోలు శక్తికి, తద్వారా స్వల్ప లాభాలు, స్వల్ప పెట్టుబడులకు దారి తీస్తుంది. వీటంతటికి కారణం స్వల్ప ఉత్పాదకతయే. నర్క్స్ ప్రకారం, స్వల్ప మూలధన పరిమాణ ఫలితంగా స్వల్ప ఉత్పాదకతా స్థాయి ఏర్పడి, ఆ స్వల్ప మూలధన పరిమాణం తక్కువ పెట్టుబడి ప్రేరణ వలన కలుగుతుంది. కాబట్టి ఇటువంటి దేశాలలో ముఖ్యంగా పెట్టుబడులను పెంచాలి. పెట్టుబడులను పెంచుట ద్వారా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. కాబట్టి ఏ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి సాధించాలన్నా కనీస క్లిష్ట ప్రయత్నం చేయాలని లైబిన్‌స్టైన్ సూచించారు.

అభివృద్ధి బ్యాంకులు పెట్టుబడులను పెంపొందించుటలో ప్రముఖపాత్ర వహించాలి. ప్రణాళిక, వనరుల కేటాయింపుల పరిధిలో మూలధన పెరుగుదల ద్వారా అదనపు పెట్టుబడులను ప్రోత్సహించాలి. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన విదేశీ మూలధనం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుటలో అభివృద్ధి బ్యాంకులు తోడ్పడాలి. ఆర్థికంగా వెనుకబడిన వ్యవస్థలలో మూలధన కొరత ఎక్కువగా ఉంటుంది, మూలధన సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. వడ్డీరేటు స్థిరంగా వున్నప్పుడు పెట్టుబడి లాభదాయకమవుతుంది. భవిష్యత్తులో నష్ట భయం, అనిశ్చితత్వంలాంటి కారణాలకన్నా భారతదేశంలో కోశ, ద్రవ్య విధానాలు లోపభూయిష్టమై, ధరలు తరచుగా మారుతూ ఉండడం వలన పెట్టుబడి వాతావరణం చాలా దెబ్బ తిన్నది. విదేశీ సంస్థల పోటీ, ఎక్కువ సంఖ్యలో పారిశ్రామిక సంస్థలు మూతపడడంలాంటి కారణాలు ఇందుకు తోడ్పడుతున్నాయి. ఈ కారణాలు, భారత దేశంలో తక్కువ మూలధన సామర్థ్యాన్ని సూచిస్తున్నాయి. భారత దేశంలో మూలధన మార్కెట్, అధిక సంఖ్యలో ఆర్థిక, ఆర్థికేతర సంస్థలున్నప్పటికీ ఎన్నో శాసనపరమైన ప్రోత్సాహకాలున్నప్పటికీ, పెట్టుబడులను ప్రోత్సహించుటలో విఫలమొందింది. ఇందుకు ముఖ్య కారణాలుగా నిపుణతగల ఉద్యమదారుల కొరత, పెట్టుబడి అవకాశాల కొరత, పొదుపులను ఉత్పాదక పెట్టుబడులుగా మార్చుటలో గల సమస్యలు, నిర్ణయ లోపాలు, సాంకేతిక పరిజ్ఞాన కొరత, కీలకమైన ఉత్పత్తి కారకాల కొరతలు చెప్పవచ్చు.

అభివృద్ధి బ్యాంకులు పైన సూచించిన పెట్టుబడి అవరోధాల నిర్మూలనకు లేక పరిష్కారానికి ముఖ్య సాధనాలుగా ఉపయోగపడతాయి. పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే మూలధనం, ఇతర ఉత్పత్తి కారకాలను సప్లయ్ చేయడం ద్వారా ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తాయి.

### 17.3.2 అభివృద్ధి బ్యాంకులు - పొదుపులు

వెనుకబడిన దేశాలలో మూలధన సప్లయ్ ప్రజల పొదుపు ప్రవృత్తిపై, పొదుపు సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. వెనుకబడిన దేశాలలో ఆదాయాలు తక్కువగా ఉన్నందువలన, పొదుపు ఆదాయంపై ఆధారపడుతుంది. కాబట్టి పొదుపులు స్వల్ప స్థాయిలో ఉంటాయి. కాబట్టి వెనుకబడిన దేశాలలో పొదుపు స్థాయిని నిర్ణయించేది

BRAOU

ఆదాయాలు కానీ వడ్డీరేటు కాదు. అయినప్పటికీ, భారత దేశంలో అసంఘటిత రంగంలోని మూలధన మార్కెట్‌లో స్వల్ప స్థాయి పొదుపులు - అధిక వడ్డీ రేటు కలిసి ఉన్నాయి. ఉన్నటువంటి స్వల్ప పొదుపులు సయితం పెట్టుబడి రంగాలకు తరలకపోవడానికి ముఖ్యం కారణం ఈ చిన్న మొత్తాల పొదుపులు కూడా ఉద్యమిత్వం లేని ప్రజల చేతిలో ఉండటం, చాలా మంది ప్రజలు తమ పొదుపులను నగదు రూపంలో గాని, విలువైన ఆభరణాల రూపంలోగాని నిల్వచేయడం. పొదుపులను విలాస వస్తువుల వినియోగం కోసం, భవిష్యత్తు లావాదేవీల కోసం ఉపయోగిస్తున్నారు. కాబట్టి స్వల్ప స్థాయి పొదుపులకు తక్కువ ఆదాయాలే గాక అధిక వినియోగ ప్రవృత్తి కూడా కారణమౌతుంది.

వెనుకబడిన దేశాలలో అత్యధిక శాతం ప్రజలు కనీస జీవనాధార స్థాయిలో నివసిస్తుంటారు. వారికి ఎన్నో తీరని కోరికలుంటాయి. ప్రస్తుత పొదుపు రేటు, ఆ కోరిక తీరని వస్తువుల డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఆదాయాలు ఏ మాత్రం పెరిగినా, అది వినియోగం పెరుగుదలకు తోడ్పడుతుంది. కాబట్టి ఆదాయం పెరిగితే పొదుపు పెరుగుతుందన్న వాదన అవాస్తవం. అదే విధంగా వెనుకబడిన దేశాలలో ఆదాయాలు తక్కువగా వున్నంత మాత్రాన ప్రజలు పొదుపు చేయరని చెప్పడానికి లేదు. కనీస జీవనాధార స్థాయి జీవనం వలన పొదుపు, పెట్టుబడులకు అవకాశం లేదు అన్న రోసెన్ వాదన వాస్తవం కాదు. వెనుకబడిన దేశాలలో కూడా ఆదాయాలు తక్కువైనప్పటికీ పొదుపు చేస్తున్నారు. ఆ పొదుపులు నగదు రూపంలో ఉండవచ్చు, ఆభరణాల రూపంలో ఉండవచ్చు. వెనుకబడిన దేశాల ముఖ్య సమస్య – పొదుపు రేటును ఏ విధంగా పెంచాలి? ఆ పొదుపులను పెట్టుబడులుగా ఉపయోగపడేటట్లు ఏ విధంగా చేయాలి? పెట్టుబడులకోసం పొదుపు చేయడం కింది అంశాలపై ఆధారపడి ఉంటుంది. 1. ఆదాయంలో పెరుగుదల, 2. ధరల స్థిరత్వం, 3. పొదుపుల సమీకరణకు సంస్థలు, 4. చిన్న పొదుపుదార్లకు పెట్టుబడి అవకాశాలు.

ఈ సందర్భంలో అభివృద్ధి బాంకులు ఏ విధంగా పొదుపులను పెంచి, వాటిని పెట్టుబడులుగా మార్చడానికి దోహదపడతాయి అన్న విషయాన్ని మనం ఆలోచించాలి. పారిశ్రామిక ప్రగతికి అవసరమైన ఉద్యమిత్వం, యాజమాన్యం, పెట్టుబడులను పెంపొందించడం ద్వారా ఆదాయాలు, పొదుపులను పెంచవచ్చు. మిగతా సంస్థలు సేకరించిన పొదుపులను తరలించడం ద్వారా పొదుపులను పెంచవచ్చు. పెట్టుబడి అవకాశాలను అన్వేషించి, చిన్న ఉద్యమదారులను ప్రోత్సహించడం ద్వారా అభివృద్ధి బాంకులు పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడవచ్చు. అభివృద్ధి బాంకులు పొదుపులను ప్రోత్సహించడం ద్వారా పెట్టుబడులను పెంపొందించి అభిలషణీయ వృద్ధి రేటును పెంచడానికి తోడ్పడుతాయి, ఆర్థిక వృద్ధి సాధనలో ముఖ్యపాత్ర వహిస్తాయి.

## 17.4 అభివృద్ధి బాంకుల లక్ష్యాలు, విధులు

### 17.4.1 లక్ష్యాలు

దేశ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన అనుకూల పరిస్థితులను కల్పించడం అభివృద్ధి బాంకుల ముఖ్య లక్ష్యంగా పేర్కొనవచ్చు. ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో మూలధన కొరతకు తోడుగా ప్రజ్ఞ, నైపుణ్యం గల ఉద్యమదారుల కొరత ఉండటంవలన, అభివృద్ధి బాంకుల పాత్ర కేవలం దీర్ఘకాలిక ఋణాలివ్వడం వంటి సాంప్రదాయక విధులకే పరిమితం కాదు. ఇవిగాక, అభివృద్ధి బాంకులు ఎన్నో ప్రవర్తనా విధులను నిర్వర్తించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తాయి. పారిశ్రామిక సంభావ్య పరిశోధనలు, లాభదాయక ఉత్పాదక పరిశ్రమలను గుర్తించడం, మార్కెట్-పెట్టుబడుల సర్వేలను నిర్వహించడం, ఉద్యమదారులకు ఆధునిక పద్ధతులలో శిక్షణ ఇవ్వడం మొదలైన కార్యకలాపాలు చేపడతాయి. అభివృద్ధి బాంకులు ముఖ్యంగా కింది లక్ష్యాలను కల్గి ఉంటాయి.

BRAOU

1. పరిశ్రమలకు, ముఖ్యంగా ప్రాధాన్య రంగాల పరిశ్రమలకు దీర్ఘకాలిక ఋణాలివ్వడం;
2. చిన్న పరిశ్రమలకు, శిక్షణ పొందిన, అర్హతగల ఉద్యమదారులకు మూల విత్తం సమకూర్చడం;
3. పారిశ్రామికాభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలను తొలగించి, పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం.
4. ఎగుమతులను పెంపొందించే, దిగుమతుల ప్రత్యామ్నాయ పారిశ్రామిక సంస్థలను ప్రోత్సహించడం;
5. పరిశ్రమలకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చడం, శిక్షణ మరియు పరిశోధనలు నిర్వహించడం;
6. పారిశ్రామిక యూనిట్లు తమ వద్ద నుండి పొందిన ఋణాల వినియోగంపై నిఘా వేయడం, ఖాయిలాపడ్డ పరిశ్రమలను పునరుద్ధరించడం;
7. సాంప్రదాయేతర, ప్రాధాన్య పారిశ్రామిక సంస్థలను ప్రోత్సహించడం.

పైన వివరించిన విధంగా అభివృద్ధి బాంకులు కేవలం విత్త సంస్థలవలే కాకుండా ఎన్నో ప్రవర్తనా కార్యక్రమాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన వసతులను కల్పించడం, ప్రోత్సహించడం, అభివృద్ధి పరచడం వాటి లక్ష్యం.

## 17.4.2 విధులు

అభివృద్ధి బాంకుల విధులను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు : 1. విత్తపరమైన విధులు, 2. ప్రవర్తనాపరమైన విధులు.

**1. విత్తపరమైన విధులు**

అభివృద్ధి బాంకులు పరిశ్రమలకు దీర్ఘకాలిక ఋణాలివ్వడం, పూచీదారుగా వ్యవహరించడం, పారిశ్రామిక సంస్థల ఋణాలకు గ్యారంటీ ఇవ్వడం, పారిశ్రామిక సంస్థల వాటాలకు, డిబెంచెర్లకు చందా కట్టడం వంటి విత్తపరమైన విధులను నిర్వర్తిస్తాయి.

(i) *ఋణాల మంజూరు :* అభివృద్ధి బాంకులు పారిశ్రామిక సంస్థలకు మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చుతాయి. తమ ఋణాలను దేశీయ, విదేశీ కరెన్సీలలో కూడా మంజూరు చేస్తాయి. ఈ విధి నిర్వహణలో అభివృద్ధి బాంకులు వాణిజ్య బాంకులతో పోటీ పడవు. అభివృద్ధి బాంకులు స్వల్పకాలిక, చర మూలధన ఋణాలను ఇవ్వవు.

(ii) *చందా పూచీ (Underwriting):* పారిశ్రామిక సంస్థల వాటాలు, బాండ్లు, డిబెంచర్లకు చందా పూచీదారుగా వ్యవహరించి సంస్థలకు అవసరమైన నిధులను సమకూర్చడం అభివృద్ధి బాంకుల ముఖ్య విధి. అభివృద్ధి బాంకులు తామే స్వయంగా ఋణాలివ్వడానికి బదులు పూచీదారుగా వ్యవహరించి ప్రజల నుండి ఇతర సంస్థల నుండి పారిశ్రామిక సంస్థలకు కావలసిన నిధులను సమీకరించి సహాయపడడం ముఖ్య విధిగా కలిగి ఉన్నాయి.

(iii) *ఋణాల గ్యారంటీ :* పారిశ్రామిక యూనిట్లు పొందే వివిధ రకాల ఋణాలకు అభివృద్ధి బాంకులు హామీ ఇస్తాయి. ముఖ్యంగా బహిరంగ మార్కెట్లో, విదేశీ సంస్థల నుండి పొందిన ఋణాలకు హామీ ఇస్తాయి. మూలధనం దిగుమతి చేసుకొన్నప్పుడు లేదా స్వదేశీ మార్కెట్లో కొన్నప్పుడు వాటికి చెల్లించవలసిన విలంబిత చెల్లింపులకు హామీలిస్తాయి. క్లయింట్ సెక్యూరిటీల జారీకి హామీలివ్వడం జరుగుతుంది.

(iv) *సంస్థల వాటాలకు, డిబెంచర్లకు ప్రత్యక్ష చందా:* పారిశ్రామిక సంస్థలు జారీ చేసిన వాటాలను, డిబెంచర్లను అభివృద్ధి బాంకులు ప్రత్యక్షంగా చందా కట్టి కొనుగోలు చేయవచ్చు.

BRAOU

**2. ప్రవర్తనా పరమైన విధులు**

విత్త సహాయం అందించడంతోపాటు అభివృద్ధి బాంకులు ప్రవర్తనా పరమైన విధులను కూడా నిర్వహిస్తాయి. కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం, యాజమాన్య సలహాలను ఇవ్వడం, సాంకేతిక ఆర్థిక సర్వేలను నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతాయి.

## 17.5 అభివృద్ధి బాంకుల యాజమాన్యం

అభివృద్ధి బాంకుల యాజమాన్య వ్యవస్థ సంబంధిత బాంకుల నిర్మాణంలో ముఖ్యపాత్ర వహించిన వివిధ సంస్థలు, ఆ సంస్థల విధులు, అభివృద్ధి బాంకుల కార్యకలాపాలలో ఆ సంస్థల పాత్రపై ఆధారపడి ఉంటుంది. పూర్తిగా ప్రభుత్వంచే రూపొందించబడిన అభివృద్ధి బాంకుల విషయంలో ఆ బాంకు యాజమాన్యంపై ప్రభుత్వం పూర్తి ఆధిపత్యం కల్గి యుంటుంది. అభివృద్ధి బాంకుల యాజమాన్యం, నిర్వహణ బాధ్యత డైరెక్టర్లతో కూడిన బోర్డు నిర్వహిస్తుంది. ఈ బోర్డులోని సభ్యులను వివిధ సంస్థలు నియమిస్తాయి లేక ఎన్నుకొంటాయి. కొన్ని అభివృద్ధి బాంకులు డైరెక్టర్ల నియమాకంలో, పారిశ్రామిక రంగంలో, ఆర్థిక రంగంలో పరిపాలన, సాంకేతిక నైపుణ్యంగల, అనుభవం గల వారిని డైరెక్టర్లుగా నియమించడంలో జాగ్రత్త వహిస్తాయి. ప్రయివేటు రంగంలో స్థాపించబడిన అభివృద్ధి బాంకుల డైరెక్టర్ల నియమాకంలో ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదు. అటువంటి బాంకులకు కూడా కొన్ని దేశాలలో ఒకరు లేక ఇద్దరిని డైరెక్టర్లుగా నియమించే అధికారాన్ని ప్రభుత్వాలు పొంది వున్నాయి. చాలా అభివృద్ధి బాంకులు ఏదో ఒక రకంగా ప్రభుత్వ మద్దతుతో ఏర్పాటైనందున వాటి బోర్డులలో ప్రభుత్వ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రభుత్వ ప్రతినిధులు ప్రభుత్వ విధానాలను అమలు పరుస్తూ, ఆ విధానాల పరిధిలో నిర్ణయాలు చేస్తాయి. కొన్ని అభివృద్ధి బాంకులలో కొంత భాగం ప్రభుత్వం, కొంత భాగం కేంద్ర బాంకు, కొంత భాగం ఇతర సంస్థలు వాటాలు పొంది ఉంటాయి. అటువంటి బాంకుల విషయంలో వివిధ సంస్థలు వాటి వాటి వాటాలను అనుసరించి డైరెక్టర్లను నియమిస్తాయి.

ఏ అభివృద్ధి బాంకైనా దేశ ఆర్థిక విధానాలకు అనుగుణంగా పని చేయవలసి వున్నందున అభివృద్ధి బాంకులు కేంద్ర బాంకుతో సత్సంబంధాలు కలిగి ఉంటాయి. కొన్ని బాంకుల విషయంలో కేంద్ర బాంకే ప్రధాన సంరక్షకునిగా వ్యవహరిస్తుంది. ఉదాహరణకు రాష్ట్ర విత్త సంస్థలు. అభివృద్ధి బాంకుల యాజమాన్య పరిపాలనా వ్యవహారాలు డైరెక్టర్ల బోర్డు నిర్వహిస్తుంది. విధి నిర్వహణలో బోర్డుకు సహాయపడడానికి కార్యనిర్వాహక కమిటీలు, సలహా కమిటీలు, అడహాక్ కమిటీలుంటాయి. దైనందిన కార్యకలాపాలను నిర్వర్తించడానికి అధికారులు, సిబ్బంది ఉంటారు.

## 17.6 అభివృద్ధి బాంకుల మూలధన నిర్మాణం

సాధారణంగా అభివృద్ధి బాంకుల మూలధనం మూడు రకాలుగా సమకూరుతుంది. 1. ప్రభుత్వం, 2. ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు, 3. విదేశ, అంతర్జాతీయ సంస్థలు. వివిధ దేశాలలో ప్రభుత్వాలు ఈ అభివృద్ధి బాంకుల కార్యకలాపాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. అభివృద్ధి బాంకుల మూలధనానికి బాంకులు ఎన్నో విధాలుగా సహాయపడవచ్చు. బాంకు యొక్క వాటాదారు కావచ్చు; బాంకు జారీ చేసిన బాండ్లకు, డిబెంచర్లకు చందా కట్టవచ్చు; బాంకు వాటాలు, బాండ్లు కొన్నవారికి హామీలివ్వవచ్చు; బాంకు విదేశీ సంస్థల నుండి పొందే ఋణాలకు హామీలివ్వవచ్చు; అవసరమైనప్పుడు అభివృద్ధి బాంకులకు దీర్ఘ కాలిక ఋణాలివ్వవచ్చు. ఈ విధంగా అనేక మార్గాలలో ప్రభుత్వం అభివృద్ధి బాంకుల మూలధన కల్పనకు తోడ్పడుతుంది.

కేంద్ర బాంకులు అభివృద్ధి బాంకుల వాటాలు కొనడం ద్వారా, దీర్ఘకాలిక ఋణాలివ్వడం ద్వారా, అభివృద్ధి బాంకుల కోసం రిజర్వు నిధులను ఏర్పరచడం ద్వారా అభివృద్ధి బాంకుల మూలధన నిల్వలు పెంచడానికి సహాయపడుతాయి. ప్రయివేటు సంస్థలు, ప్రజలు బాంకుల వాటాలకు కట్టే చందాలు, బాంకు నిల్వలు, మార్కెట్‌లో సేకరించిన ఋణాలు, డిపాజిట్లు మొదలగునవి ఇతర వనరులు. వివిధ అభివృద్ధి బాంకులు వివిధ రకాలైన మూలధన సేకరణ పద్ధతులు కల్గి వున్నాయి. కొన్ని అభివృద్ధి బాంకుల వాటాలకు స్థానిక విత్త సంస్థలు పెట్టుబడి పెట్టే అవకాశం కల్పించబడింది. కొన్ని బాంకుల విషయంలో అటువంటి అవకాశం లేదు. కొన్ని బాంకులలో విదేశీ వాటాదారులున్నారు. కొన్ని బాంకులలో విదేశీ వాటాలకు అనుమతి లేదు.

అభివృద్ధి బాంకులు, వాటి లక్ష్యాలను పరిశీలిస్తే, ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో ఆ బాంకులు ప్రయివేటు సంస్థలు, స్థానిక విత్త సంస్థలు, భీమా సంస్థలు ఇతర సంస్థలను వాటాదారులుగా అంగీకరించడం వలన మూలధన వనరులను పెంచుకోవచ్చు. కాల పరిమితి డిపాజిట్లను అంగీకరించి మూలధన నిల్వలు వుంచుకోవచ్చు. కాని ఈ డిపాజిట్ల సేకరణ వాణిజ్య బాంకులకు ఏ మాత్రం పోటీ కానేరదు. అభివృద్ధి బాంకులు డిపాజిట్ల సేకరణలో 10:1 ఋణ ఈక్విటీ నిష్పత్తిని పాటించవలసి ఉంటుంది.

అభివృద్ధి బాంకులు విదేశ/అంతర్జాతీయ సంస్థల నుండి కూడా మూలధన నిధులను సమకూర్చుకొంటాయి. ఉదాహరణకు, భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ యొక్క మూలధనంలో విదేశీ సంస్థలు, పెట్టుబడిదారులు వాటాలు పొంది వున్నారు. జర్మనీలోని Kreditanstalt, జర్మనీ అభివృద్ధి కంపెనీ మొదలగు విత్త సంస్థలు ఇతర అభివృద్ధి బాంకులకు ఋణాలను ఇస్తాయి. ఇవిగాక ప్రపంచ బాంకు, USAID వెనుకబడిన దేశాల అభివృద్ధి బాంకులకు కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణానికి ఋణాలను ఇస్తాయి. ఈ విదేశీ ఋణాలు, విత్త సహాయం వెనుకబడిన దేశాలకు అవసరమైన మూలధనం, యంత్ర సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానం దిగుమతి చేసుకోవడానికి ఉపయోగపడతాయి.

## 17.7 అభివృద్ధి విత్తం : నియమ నిబంధనలు

పారిశ్రామిక యూనిట్లకు అవసరమైన విత్త సహాయం అందించడానికి అభివృద్ధి బాంకులు కొన్ని నియమాలను పాటిస్తాయి. ఉన్నటువంటి మూలధనాన్ని సమర్థవంతంగా వినియోగించడానికి కొన్ని నిబంధనలను ఏర్పరచుకొన్నాయి. ఋణాలను మంజూరు చేసే ముందు, వాటిని విడుదల చేసే ముందు, తర్వాత కొన్ని జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఉంది. తమ ఋణాలు సక్రమంగా వినియోగించబడినాయా లేదా అని అభివృద్ధి బాంకులు తనిఖీ చేస్తాయి.

పారిశ్రామిక సంస్థలకు ఋణ సహాయం మంజూరు చేసే ముందు తమ ఋణాల భద్రత గురించి అభివృద్ధి బాంకులు మదింపు చేస్తాయి. సంస్థ యొక్క స్థిరాస్తులను మొదటి తనఖా రూపంలో సెక్యూరిటీగా కోరుతాయి. కొన్ని సంస్థలు తగినంత సెక్యూరిటీ చూపలేనప్పుడు ప్రభుత్వ హామీల ఆధారంగా అభివృద్ధి బాంకులు ఋణాలను మంజూరు చేస్తాయి. కొన్ని అభివృద్ధి బాంకులు, ప్రాజెక్టు యొక్క భవిష్యత్తు, దేశ ఆర్థికాభివృద్ధికి ఆ ప్రాజెక్టు ప్రాముఖ్యత ఆధారంగా తగిన సెక్యూరిటీ చూపలేని సంస్థలకు కూడా అభివృద్ధి బాంకులు ఋణ సహాయం అందించవచ్చు. కాని సాధారణంగా తమ ఋణాల భద్రత, ఋణాల ఉత్పాదకత దృష్ట్యా సంస్థల నుండి సెక్యూరిటీలు కోరడం జరుగుతుంది. సెక్యూరిటీ లేదనే నెపంతో ఏ మంచి ప్రాజెక్టును అభివృద్ధి బాంకులు నిర్లక్ష్యం చేయరాదు. అభివృద్ధి బాంకులు ఋణాలను మంజూరు చేయునప్పుడు, ఆ ఋణాలను తిరిగి చెల్లించడానికి సంస్థకు గల సామర్థ్యాన్ని సరిగా మదింపు వేయాలి. అభివృద్ధి బాంకులు విధించే వడ్డీ రేటులో వివిధ బాంకుల మధ్య, వివిధ దేశాల మధ్య తేడాలుంటాయి. సాధారణంగా అభివృద్ధి బాంకుల వడ్డీ

BRAOU

రేటు తక్కువగాను, పెట్టుబడిదారులకు ప్రోత్సాహకరంగాను ఉంటుంది. ఋణాల తిరిగి చెల్లింపు పట్టిక, వాయిదాల వారీ చెల్లించవలసిన సొమ్ము, సంస్థ యొక్క ఆర్థిక పరిస్థితిని బట్టి, వ్యయ లాభ అంచనాలను బట్టి, విరామ సమయాన్ని బట్టి అభివృద్ధి బాంకులు నిర్ణయిస్తాయి.

సంస్థల స్థిరాస్తుల సెక్యూరిటీతో బాటు కొన్ని అభివృద్ధి బాంకులు, పారిశ్రామిక సంస్థ యొక్క మేనేజింగ్ డైరెక్టర్ల వద్ద నుండి వ్యక్తిగత హామీలు తీసుకుంటారు. దీని వలన డైరెక్టర్లు సంస్థ అభివృద్ధికి కృషి చేస్తారని నమ్మకం ఏర్పడుతుంది. కొన్ని పారిశ్రామిక సంస్థల బోర్డులలో ఒకరు లేక ఇద్దరిని అభివృద్ధి బాంకులు తమ ప్రతినిధులుగా నియమిస్తారు. ఈ ప్రతినిధులు సంస్థ కార్యకలాపాలపై నిఘా వేసి ఉంచుతారు. ఋణాలు దుర్వినియోగం కాకుండా జాగ్రత్త పడతారు. తమ వద్ద ఋణాలను పొందిన సంస్థల డివిడెండ్లు, ఇతర ఋణాల చెల్లింపులపై అభివృద్ధి బాంకులు ఆంక్షలు విధించు అధికారం కల్గివున్నాయి. తమ వద్ద సహాయం పొందిన సంస్థలను అభివృద్ధి బాంకులు తనిఖీ చేయవచ్చు. పైన వివరించిన విధంగా అభివృద్ధి బాంకులు తమ ఋణాల భద్రత కోసం, వాటిని సద్వినియోగపరచడం కోసం కొన్ని నిబంధనలను అమలు పరుస్తాయి.

పారిశ్రామిక సంస్థలకు అభివృద్ధి బాంకులు ఋణాలను మంజూరు చేయడం మూడు దశలుగా ఉండవచ్చు. 1. సంస్థ యొక్క ప్రాధాన్యతను నిర్ణయించడం, 2. ప్రాజెక్టు నివేదికల మదింపు, 3. అనుక్రమ చర్య. అభివృద్ధి బాంకులు దేశ ప్రాథమిక అవసరాలను, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని తాము ప్రాధాన్యతను ఇవ్వవలసిన రంగాలను ఎంపిక చేస్తాయి. సంస్థ యొక్క మూలధన సామర్థ్యం, పున: పెట్టుబడి అవకాశాలు, మూలధన- శ్రామిక నిష్పత్తి, విదేశీ ఋణ చెల్లింపుల శేషంపై సంస్థ ప్రభావం, ఉద్యోగ అవకాశాలు, స్థానిక వనరుల వినియోగ అవకాశాలు, మిగతా రంగాల అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ప్రభావం మొదలయిన అంశాలను పరిశీలించిన మీదట సంస్థకు ఋణ సహాయం అందించడానికి నిర్ణయం తీసుకొంటాయి. సంస్థలు చేసిన ధరఖాస్తులను పరిశీలించి, సంస్థల యాజమాన్యంతో చర్చించిన తర్వాత అభివృద్ధి బాంకులు ఆ సంస్థ యొక్క ప్రాథమిక సమాచారాన్ని సేకరిస్తాయి. ఆ తర్వాత సంస్థ యొక్క మూల పత్రాలను పొందడం, ప్రాజెక్టును తనిఖీ చేయడం, సంక్షిప్త నివేదికను తయారు చేయడం మొదలైన పనులను నిర్వహిస్తుంది. ఈ నివేదికలను అడహాక్ కమిటీలు, సలహా కమిటీలు పరిశీలించిన మీదట కార్యనిర్వాహక కమిటీ ఆమోదానికి సమర్పిస్తారు. ఆ కమిటీ ఆమోదం పొందిన తర్వాత డైరెక్టర్ల బోర్డు తుది నిర్ణయం తీసుకొంటుంది. ఋణాల మంజూరు, బట్వాడా తర్వాత ఆ ఋణాల వినియోగంపై అభివృద్ధి బాంకులు తగిన నిఘా వేసి ఉంచుతాయి. ఋణాల వినియోగంలో సంస్థలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి అభివృద్ధి బాంకులు సహాయపడతాయి.

## 17.8 భారత దేశంలో అభివృద్ధి బాంకుల జననం, వృద్ధి

ప్రణాళికాబద్ధమైన పారిశ్రామికాభివృద్ధి కోసం అమలు పరిచే కార్యక్రమాలు విజయవంతం కావడం, వివిధ పారిశ్రామిక సంస్థలకు సరిపడినంత విత్త వనరులు లభించడం పైన ఆధారపడి ఉంది. బ్రిటిష్ బాంకుల నమూనాల ఆధారంగా రూపుదాల్చిన భారత దేశంలోని వాణిజ్య బాంకులు వాణిజ్యానికి, పరిశ్రమల చర మూలధన ఋణాలివ్వటం వరకే పరిమితమయ్యాయి. కాబట్టి ప్రత్యేకంగా పారిశ్రామిక సంస్థలకు విత్త సహాయం అందించగల ప్రత్యేక విత్త సంస్థల ఆవశ్యకత ఏర్పడింది. అభివృద్ధి విత్త సంస్థల నిర్మాణంలో మొదటి మెట్టుగా తీసుకొన్న చర్య – 1948వ సంవత్సరంలో భారత పారిశ్రామిక విత్త సంస్థ (Industrial Finance Corporation of India) స్థాపన. ఈ సంస్థ కార్పొరేటు రంగంలోని, పారిశ్రామిక సహకార రంగంలోని యూనిట్లకు మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చుతుంది.

చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల అవసరాలు తీర్చడానికి ప్రాంతీయ అభివృద్ధి బాంకుల ఆవశ్యకతను గుర్తించి 1951లో భారత పార్లమెంటు రాష్ట్ర విత్త సంస్థల చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టానికి అనుగుణంగా వివిధ రాష్ట్రాలు రాష్ట్ర విత్త సంస్థలను ఏర్పాటు చేసుకొన్నాయి. 1967–68 నాటికి ఇప్పుడున్న 18 రాష్ట్ర విత్త సంస్థలు స్థాపించబడినాయి. ఈ సంస్థలు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలకు, ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలకు, భాగస్వామ్య సంస్థలకు, యాజమాన్య సంస్థలకు ఋణాలను ఇస్తాయి. రాష్ట్ర విత్త సంస్థలకు తోడు, చిన్న పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడానికి 1955లో ఒక నూతన సంస్థ ఏర్పాటు చేయబడింది. ఆ సంస్థ 'జాతీయ చిన్న పరిశ్రమల సంస్థ' (National Small Industries Corporation). ఇది పూర్తిగా ప్రభుత్వంచే స్థాపించబడిన సంస్థ. ఇది ప్రధానంగా విత్త సంస్థ కాదు. ఈ సంస్థ వివిధ ప్రవర్తనాపరమైన కార్యక్రమాల ద్వారా అనగా యంత్ర సామగ్రి సప్లయ్, శ్రామికుల శిక్షణ, చిన్న పరిశ్రమల ఉత్పత్తుల మార్కెటింగ్, విలంబిత చెల్లింపులకు హామీలు మొదలగు కార్యక్రమాల ద్వారా చిన్న పరిశ్రమలకు సహాయపడుతుంది.

భారత ప్రభుత్వం, ప్రపంచ బాంకు, కామన్ వెల్త్ అభివృద్ధి విత్త సంస్థ, ఇతర విదేశీ సంస్థల మద్దతుతో జాయింట్ స్టాకు కంపెనీగా భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ (Industrial Credit and Investment Corporation of India) 1955లో స్థాపించబడింది. ప్రయివేటు రంగంలోని పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రపంచ బాంకు ఈ సంస్థ ద్వారా చాలా విడతలుగా విదేశీ ఋణాలను సమకూర్చింది. ఈ సంస్థ దీర్ఘకాలిక ఋణాలివ్వడమే కాక, సంస్థల వాటాలకు పూచీదారుగా, సంస్థల వాటాలు, బాండ్లు, డిబెంచర్లకు ప్రత్యక్ష చందాదారుగా, హామీదారుగా వ్యవహరిస్తుంది. ఈ సంస్థ ప్రయివేటు రంగంలో స్థాపించబడినప్పటికీ, ఈ సంస్థ జారీ చేసిన బాండ్లకు ప్రభుత్వ గ్యారంటీ వుంది. ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ సలహాలు, సూచనల మేరకు పనిచేస్తుంది. కాబట్టి ఈ సంస్థ కూడా ప్రభుత్వ సంస్థ లక్షణాలను కలిగి వుంది.

ప్రయివేటు రంగంలోని పారిశ్రామిక సంస్థలకు ఇచ్చిన కాల ఋణాలకు బదులుగా వాణిజ్య బాంకులకు, రాష్ట్ర విత్త సంస్థలకు పునర్విత్తం ఇవ్వటానికి 1958లో రీ-ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (RCI) అనే సంస్థ రూపొందించబడింది. 1964లో భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ఏర్పాటైన తర్వాత ఈ సంస్థను అందులో విలీనం చేసారు. తర్వాత 1960 ప్రాంతంలో వివిధ రాష్ట్రాలు రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలను (State Industrial Development Corporations) నెలకొల్పినాయి. ఈ సంస్థలు మధ్య తరహా పరిశ్రమలకు సహాయం అందిస్తాయి. ఈ సంస్థలు 1976 తర్వాత భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు యొక్క పునర్విత్త సౌకర్యాలకు అర్హాలుగా పరిగణించబడినాయి. కాబట్టి ఈ సంస్థలు కూడా అభివృద్ధి బాంకు వ్యవస్థలో ముఖ్య భాగాలైనాయి. ఈ సంస్థలతో పాటు రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేయబడినాయి. ఈ సంస్థలు పారిశ్రామిక వాడల ఏర్పాటు, యాజమాన్యం, ముడి పదార్థాల సప్లయ్, సాధారణ సేవా సౌకర్యాలను కల్పించడం, వాయిదాల పద్ధతిలో యంత్ర సామగ్రి సప్లయ్ చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి చిన్న పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతాయి.

ఈ విధంగా 1960 నాటికి దేశంలో ఎన్నో పారిశ్రామిక విత్త సంస్థలు ఏర్పాటు కాబడి, పరిశ్రమలకు కావలసిన విత్తపరమైన, ప్రవర్తనాపరమైన సహాయ సహకారాలను అందించుటలో సఫలీకృతమైనాయి. ఈ సంస్థల కార్యకలాపాలను సమన్వయ పరచి, వీటిని ఒక నిర్దిష్ట మార్గంలో నడిపేందుకు ఒక శిఖర సంస్థ అవసరమైంది. ఈ తరుణంలో 1964లో భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు స్థాపించబడింది. మొట్టమొదట ఈ బాంకు భారతీయ రిజర్వు బాంకు యాజమాన్యం క్రింద దాని అనుబంధ సంస్థగా రూపొందించబడింది. 1976లో ఈ యాజమాన్యం రిజర్వు బాంకు నుండి కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయబడింది. ఈ బాంకు ఎలాంటి పారిశ్రామిక సంస్థకయినా,

BRAOU

ఎంత ఋణమైనా, ఏ ఉద్దేశానికయినా, ఎటువంటి పరిశ్రమకు సంబంధించిన సంస్థకయినా విత్త సహాయమందించడానికి సంపూర్ణ స్వేచ్ఛ కల్గి వుంది.

భారత దేశంలో అభివృద్ధి బాంకులతో పాటు పెట్టుబడి సంస్థలు కూడా పారిశ్రామిక విత్తం సమకూర్చడంలో ముఖ్య పాత్ర వహిస్తున్నాయి. 1964లో యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా, 1956లో భారత జీవిత భీమా సంస్థ, 1973లో జనరల్ ఇన్సూరెన్సు కార్పొరేషన్‌లు స్థాపించబడినాయి. 1971లో ఖాయిలాపడిన సంస్థల పునరుద్దరణ, పునర్నిర్మాణాలకు సహాయపడడానికి భారత పారిశ్రామిక పునర్నిర్మాణ సంస్థ (IRCI) ను ఏర్పాటు చేసారు. 1982లో భారత ఎగుమతి, దిగుమతుల బాంకు (Export - Import Bank of India) ను స్థాపించారు. ఈ సంస్థ ఎగుమతి, దిగుమతిదార్లకు ఋణ సహాయం చేస్తూ, ఎగుమతి దిగుమతిదార్లకు విత్త సహాయమందించే సంస్థల కార్యకలాపాలను సమన్వయ పరుస్తుంది; ఆ సంస్థలు అందించిన ఋణాలకు బదులు పునర్విత్తం ఇస్తుంది.

వ్యవసాయ, గ్రామీణ రంగాలలో ఋణల అవసరాలను తీర్చి, గ్రామీణ వ్యవసాయ రంగాలకు పరపతిని అందించే బాంకులను, సంస్థలను బలపరచి, వాటి కార్యకలాపాలను సమన్వయపరచడానికి 1982 జూలైలో జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బాంకు (NABARD) ను స్థాపించారు. చిన్న పరిశ్రమలకు తగిన ప్రాధాన్యతను ఇచ్చి, ఈ పారిశ్రామిక సంస్థలకు సహాయం అందించే విత్త సంస్థలకు, బాంకులకు పునర్విత్తం లాంటి సౌకర్యాలను కలిగించి, వాటిని పటిష్ట పరచి చిన్న పరిశ్రమల అవసరాలు తీర్చగల శిఖర సంస్థగా అఖిల భారత స్థాయిలో భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు (Small Industries Development Bank of India) ను 1990లో రూపొందించారు. 1990 నాటికి భారత దేశంలో వివిధ రకాల పరిశ్రమలకు విత్తపరమైన, ప్రవర్తనాపరమైన సహాయ సహకారాలందించగల ఎన్నో అభివృద్ధి బాంకులు వెలువడినాయి.

## 17.9 భారత పారిశ్రామిక విత్త సంస్థ (Industrial Finance Corporation of India)

భారతదేశ స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికాభివృద్ధి ద్వారా త్వరితగతిన ఆర్థికాభివృద్ధి సాధించాలనే కాంక్ష ఉత్పన్నమైంది. అదే సమయాన ఉన్నటువంటి పరిశ్రమలను ఆధునీకరించి, మూతపడిన సంస్థల పునర్నిర్మాణం చేయవలసిన అవసరమేర్పడింది. పరిశ్రమలకు కావలసిన దీర్ఘకాల విత్తం సమకూర్చే సంస్థల కొరత, ఉన్నటువంటి సంస్థల వద్ద నిధుల కొరతల కారణంగా పారిశ్రామిక విత్త చట్టం, 1948 ద్వారా 1948లో భారత పారిశ్రామిక విత్త సంస్థ ఏర్పాటైంది.

### 17.9.1 సంస్థ లక్ష్యాలు, పరిధి

మూలధన మార్కెట్ నుండి నిధులను పొందలేని పారిశ్రామిక సంస్థలకు మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను ఇచ్చి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడటమే ఈ సంస్థ ముఖ్య లక్ష్యం. ప్రారంభంలో ఈ సంస్థ ప్రయివేటు రంగంలోని పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలకు, సహకార సంస్థలకు మాత్రమే ఋణ సహాయం అందించేది. ఈ సంస్థను స్థాపించినప్పుడు చిన్న తరహా పరిశ్రమలకు విత్తం సమకూర్చే ప్రత్యేక సంస్థలేవి లేనందున కొంత కాలం ఈ సంస్థ చిన్న పరిశ్రమలకు కూడా ఋణాలను ఇచ్చేది. IFCI చట్టం సెక్షన్ 2 (సి) ప్రకారం, "వస్తూత్పత్తిలో గాని, ప్రాసెసింగ్‌కు సంబంధించి గనులు, హోటళ్ళు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, పంపిణీలకు సంబంధించి భారత దేశంలో అప్పటికి ఉన్న చట్టాల ప్రకారం రిజిస్టరు కాబడిన పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు లేక సహకార సంస్థలను పారిశ్రామిక సంస్థ"లుగా పరిగణించింది. కాలానుక్రమంలో పారిశ్రామిక సంస్థ నిర్వచనం మారుతూ విస్తరించబడింది. 1959 నుండి ఈ సంస్థ ప్రభుత్వ రంగంలోని పారిశ్రామిక సంస్థలకు కూడా విత్త సహాయం చేసేది. ఈ సంస్థ యొక్క

పరిధి 1982 సవరణల చట్టం ద్వారా విస్తరించబడింది. ఈ చట్టం ప్రకారం, పరిశ్రమలకు అవసరమైన సరళీకృత విత్త సహాయం అందించడమే కాక కొన్ని అనుషంగిక కార్యకలాపాలను కూడా చేపట్టడం జరిగింది. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన మార్కెటింగ్, పెట్టుబడి పరిశోధనలు, సర్వేలు చేపట్టడానికి, సాంకేతిక ఆర్థిక పరిశీలనలు నిర్వహించడానికి ఈ సవరణ చట్టం అవకాశమిచ్చింది. వ్యవస్థాపన నిర్వహణ లేదా విస్తరణలో ఏ పారిశ్రామిక సంస్థకైనా సాంకేతిక, పరిపాలనా సహాయం అందించడానికి, మర్చెంట్ బాంకింగ్ కార్యకలాపాలను చేపట్టడానికి ఈ సవరణల చట్టం అనుమతించింది.

### 17.9.2 విధులు

భారత పారిశ్రామిక విత్త సంస్థ విధులను స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు : 1. విత్తపరమైన విధులు, 2. ప్రవర్తనాపరమైన విధులు.

**1. విత్తపరమైన విధులు**

(i) ఋణాలు : పారిశ్రామిక సంస్థలకు దేశీయ కరెన్సీలో అనగా రూపాయలలో ఋణాలను మంజూరు చేయడం మరియు అవసరమైన సంస్థలకు విదేశీ ద్రవ్యంలో ఋణాలు మంజూరు చేయడం ఈ సంస్థ నిర్వహించే ముఖ్య విధులు. ఈ సంస్థ మంజూరు చేసే ఋణాలకు గరిష్ట కాల పరిమితి 25 సంవత్సరాలు.

(ii) పూచీదారు : పారిశ్రామిక సంస్థలు జారీచేసిన వాటాలకు, డిబెంచర్లకు పూచీదారుగా వ్యవహరించి ఆ సంస్థల వాటాలను కొనడం ద్వారా సంస్థలకు కావలసిన మూలధనాన్ని ఏర్పాటు చేయడం.

(iii) హామీ ఇవ్వడం : పారిశ్రామిక సంస్థలు పొందే ఋణాలకు హామీలివ్వడం ద్వారా సంస్థలకు అవసరమైన నిధులను సేకరించడానికి సహాయపడటం; ఇతర దేశాల నుండి లేక స్వదేశంలో కొనుగోలు చేసిన యంత్రాలకు విలంబిత చెల్లింపులకు హామీలివ్వడం; పారిశ్రామిక సంస్థలు ఇతర బాంకుల నుండి, మార్కెట్ నుండి సేకరించిన ఋణాలకు హామీలివ్వడం ఈ సంస్థ విధులు.

**2. ప్రవర్తనా పరమైన విధులు**

విత్తపరమైన విధులను నిర్వహించటంతో బాటు ఎన్నో ప్రవర్తనా పరమైన విధులను ఈ సంస్థ నిర్వర్తిస్తుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, యాజమాన్య శిక్షణ, ఔత్సాహిక ఉద్యమదారులకు ప్రత్యేక రాయితీలు, స్త్రీ ఉద్యమదారులకు ప్రోత్సాహకాలు, సాంకేతిక శిక్షణ, సాంకేతిక అర్హత గల ఉద్యమదారులకు మూల విత్తం సమకూర్చడం, అభివృద్ధి అవకాశాలు గల పరిశ్రమలను గుర్తించడం, మార్కెట్ పెట్టుబడుల సర్వేలను నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టి పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తుంది.

BRAOU

### 17.9.3 మూలధన నిర్మాణం

భారత పారిశ్రామికవిత్త సంస్థ స్థాపించినప్పుడు సంస్థ యొక్క అధీకృత మూలధనం రూ. 5 కోట్లు. ఆ మూలధనంలో ఒక్కొక్క వాటా రూ. 25,000 కాగా మొత్తం 2,000 వాటాలు కలిగి ఉండేది. సెలెక్ట్ కమిటీ సలహాపై ఆ మూలధనాన్ని రూ. 10 కోట్లకు, తరువాత రూ. 50 కోట్లకు పెంచబడింది. ప్రస్తుత అధీకృత మూలధనం రూ. 100 కోట్లు. దానిలో చెల్లించిన మలధనం రూ. 25 కోట్లు. మూలధనంలో భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు 50 శాతం, షెడ్యూల్డు బాంకులు 20 శాతం, భీమా సంస్థలు, పెట్టుబడి ట్రస్టులు, ఇతర విత్త సంస్థలు 21.4 శాతం, మిగతా సంస్థలు అనగా సహకార బాంకులు 8.6 శాతం వాటాలు పొంది ఉన్నాయి. ఈ సంస్థ మూలధనంపై కొన్ని సంస్థల ఆధిపత్యాన్ని నివారించడానికి, IFCI చట్టం ప్రకారం, ఏ ఒక్క సంస్థ ఆ వర్గంలోని సంస్థలకు కేటాయించిన వాటాలో 10 శాతం వాటాలను మించి కొనరాదు. ఒక సంస్థ యొక్క వాటాలను, ఆ వర్గంలోని మిగతా సంస్థలకు బదిలీ

చేయవచ్చు. ఈ సంస్థ జారీ చేసిన వాటాల అసలు, డివిడెండ్ తిరిగి చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తుంది.

భారత పారిశ్రామిక విత్త సంస్థ బాండ్లు, డిబెంచర్లను జారీ చేసి మూలధనాన్ని సమకూర్చుకుంటుంది. ఈ బాండ్లు, డిబెంచర్ల అసలు, వడ్డీల తిరిగి చెల్లింపుకు కేంద్ర ప్రభుత్వం హామీ దారుగా వ్యవహరిస్తుంది. ఈ బాండ్లను, డిబెంచర్లను జారీ చేయడానికి సంస్థ 10:1 ఋణ-ఈక్విటీ నిష్పత్తిని అధిగమించరాదు. తమ బాండ్లను, డిబెంచర్లను భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు కొనడం ద్వారా ఆ బాంకు నుండి వనరులను పొందవచ్చు. ఈ సంస్థ తనకు అవసరమైన నిధులను 5 సంవత్సరాలకు పై బడిన డిపాజిట్ల రూపంలో పొందవచ్చు. IFCI చట్టం ప్రకారం, ఈ డిపాజిట్ల ద్వారా సేకరించిన నిధులు రూ. 10 కోట్లకు మించరాదు. సంస్థ తానే స్వయంగా ఋణాలను పొందడం ద్వారా మూలధన నిధులు పెంచుకోవచ్చు. తనకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి గాని, రిజర్వు బాంకు నుండి గాని, భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు నుండి గాని ఋణాల రూపంలో పొందవచ్చు. కానీ సంస్థ యొక్క ప్రత్యక్ష ఋణాలు 10:1 ఋణ-ఈక్విటీ నిష్పత్తిని దాటరాదు. ఈ సంస్థ ప్రపంచ బాంకు నుండి, ఇతర విదేశీ సంస్థల నుండి విదేశీ కరెన్సీ ఋణాలను కూడా పొందవచ్చు.

### 17.9.4 విత్త కార్యకలాపాలు

1948 సంవత్సరంలో సంస్థ ప్రారంభం నుండి 1993 మార్చి అంతానికి మంజూరైన సంచితమైన ధన సహాయం రూ. 15,427.5 కోట్లు. అందులో రూ. 10,382.7 కోట్లు విడుదల చేయబడింది. పట్టిక 17.1లో ఇచ్చిన వివరాలను పరిశీలిస్తే సంస్థ మంజూరు చేసిన, విడుదల చేసిన విత్త సహాయం క్రమేణా పెరుగుతూ వచ్చింది. సంస్థ మంజూరు చేసి విడుదల చేసిన విత్త సహాయ వివరాలు పట్టిక 17.1లో చూపబడినాయి.

పట్టిక – 17.1 : భారత పారిశ్రామిక విత్త సంస్థ : మంజూరు, విడుదల చేసిన విత్త సహాయం (రూ. కోట్లలో)

| సంవత్సరం | మంజూరు చేసిన మొత్తం | విడుదల చేసిన మొత్తం |
|---|---|---|
| 1970–71 | 32.3 | 17.4 |
| 1975–76 | 51.3 | 34.7 |
| 1980–81 | 206.6 | 108.9 |
| 1985–86 | 499.2 | 403.9 |
| 1990–91 | 2517.8 | 1574.8 |
| 1991–92 | 2435.0 | 1604.8 |
| 1992–93 | 2492.0 | 1732.5 |
| మార్చి 1993 నాటికి సంచితమైన మొత్తం | 15427.5 | 10382.7 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

భారత పారిశ్రామిక విత్త సంస్థ మంజూరు చేసిన సంచిత ధన సహాయం రూ. 15,427.5 కోట్లలో 62.23 శాతం స్వదేశీ కరెన్సీ ఋణాలుగా, 15.16 శాతం విదేశీ కరెన్సీ ఋణాలుగా, 6.70 శాతం పూచీదారుగా, ప్రత్యక్ష చందాల ద్వారా, 4.21 శాతం హామీలివ్వడం ద్వారా పారిశ్రామిక సంస్థలకు విత్త సహాయం అందించింది. వివరాలు పట్టిక – 17.2లో ఇవ్వబడినవి.

B R A O U

పట్టిక– 17.2 : భారత పారిశ్రామిక విత్త సంస్థ : మంజూరు చేసిన వివిధ రకాల విత్త సహాయం (రూ. కోట్లలో)

| స్కీము | 1990–91 | 1991–92 | 1992–93 | 1993 మార్చి అంతానికి సంచితమైన | |
|---|---|---|---|---|---|
| | | | | ఋణాలు | శాతం |
| ప్రాజెక్టు విత్తం | | | | | |
| 1. రూపాయి ఋణాలు | 1517.1 | 1418.5 | 1204.5 | 9600.3 | 62.23 |
| 2. విదేశీ కరెన్సీ ఋణాలు | 420.4 | 259.7 | 265.9 | 2339.6 | 15.16 |
| 3. పూచీదారు/ప్రత్యక్ష చందాలు | 113.5 | 184.4 | 271.7 | 1032.9 | 6.70 |
| 4. హామీలు | 61.5 | 212.8 | 221.3 | 649.9 | 4.21 |
| విత్తపరమైన సేవలు | 405.3 | 359.6 | 528.6 | 1804.8 | 11.70 |
| మొత్తం | 2517.8 | 2435.0 | 2492.0 | 15427.5 | 100.0 |

Source : *Report on Development Banking in India*, 1992–93, IDBI, Bombay

**పరిశ్రమల వారీ విత్త సహాయం**

భారత పారిశ్రామిక విత్త సంస్థ 1948 నుండి 1993 మార్చి అంతం వరకు మంజూరు చేసిన సంచిత విత్త సహాయంలో 13.21 శాతం నూలు, వస్త్ర పరిశ్రమకు, 11.08 శాతం రసాయనాలు, రసాయనిక ఉత్పత్తుల పరిశ్రమకు, 11.21 శాతం మూల లోహ పరిశ్రమలకు ఇవ్వడం జరిగింది. ఇవికాక ఈ సంస్థ ఆహారోత్పత్తులు, ఎలక్ట్రికల్ పరిశ్రమ, రసాయనిక ఎరువులు, విద్యుచ్ఛక్తి, సేవారంగ పరిశ్రమలకు కూడా ప్రాధాన్యతను ఇచ్చిందని తెలుస్తుంది.

**రాష్ట్రాల వారీ విత్త సహాయం**

భారత పారిశ్రామిక విత్త సంస్థ 1948 నుండి 1993 వరకు మంజూరు చేసిన విత్త సహాయం మొత్తం రూ. 15,427.5 కోట్లలో, 15.80 శాతం మహారాష్ట్రలోని పరిశ్రమలకు మంజూరు చేయగా, గుజరాత్‌కు 12.55 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 11.10 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌కు 8.72 శాతం, తమిళనాడుకు 7.51 శాతం, మధ్య ప్రదేశ్‌కు 6.75 శాతం మంజూరు చేయడం జరిగింది. ఇక్కడ మనం ముఖ్యంగా గుర్తించవలసిన విషయం ఏమంటే ఈ సంస్థ ఎక్కువగా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించిన రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు ప్రాముఖ్యతను ఇచ్చింది. సంస్థ రాష్ట్రాల వారీ మంజూరు చేసిన విత్త సహాయాన్ని పట్టిక 17.3 లో చూపాం.



Dr BRAOU LIBRARY
Acc. No: CM-0223
Class No: 330

పట్టిక – 17.3 : భారత పారిశ్రామిక విత్త సంస్థ : రాష్ట్రాల వారీ మంజూరు చేసిన విత్త సహాయం (రూ. కోట్లలో)

| పరిశ్రమ | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| 1. మహారాష్ట్ర | 2437.9 | 15.80 |
| 2. గుజరాత్ | 1935.8 | 12.55 |
| 3. ఉత్తర ప్రదేశ్ | 1712.2 | 11.10 |
| 4. ఆంధ్ర ప్రదేశ్ | 1344.9 | 8.72 |
| 5. తమిళనాడు | 1159.5 | 7.51 |
| 6. మధ్య ప్రదేశ్ | 1041.2 | 6.75 |
| 7. పంజాబ్ | 880.5 | 5.71 |
| 8. రాజస్థాన్ | 870.9 | 5.64 |
| 9. ఇతర రాష్ట్రాలు | 4044.6 | 26.22 |
| మొత్తం | 15427.5 | 100.00 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

**రంగాల వారీ విత్త సహాయం**

1993 మార్చి అంతానికి మంజూరు చేసిన విత్త సహాయంలో, 75.89 శాతం ప్రయివేటు రంగంలోని పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేయబడింది. ప్రభుత్వ రంగ సంస్థలకు 7.99 శాతం, ఉమ్మడి రంగంలోని సంస్థలకు 11.26 శాతం, సహకార రంగంలో నెలకొల్పబడిన సంస్థలకు 4.86 శాతం ఋణాలను మంజూరు చేయడం జరిగింది. పై వివరాలను పరిశీలిస్తే ఈ సంస్థ ఎక్కువగా ప్రయివేటు రంగ సంస్థలకు ప్రాముఖ్యతను ఇస్తుంది.

**ఉద్దేశాల వారీ విత్త సహాయం**

భారత పారిశ్రామిక విత్త సంస్థ 1948 నుండి 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం రూ. 15,427.5 కోట్లలో, నూతన సంస్థలకు 46.48 శాతం, విస్తరణ, వైవిధ్యీకరణలకు 21.32 శాతం, ఆధునికీకరణ, బాలెన్సింగ్ పరికరాలకు 21.44 శాతం, పునర్నిర్మాణానికి 0.93 శాతం కేటాయించబడింది. దీనిని బట్టి చూస్తే ఈ సంస్థ ఎక్కువగా నూతన సంస్థలకు ప్రాముఖ్యతను ఇస్తున్నది.

**వెనుకబడిన ప్రాంతాలకు విత్త సహాయం**

భారత పారిశ్రామిక విత్త సంస్థ వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన పారిశ్రామిక సంస్థలకు తమ ఋణాల మంజూరులో ప్రాముఖ్యతను ఇస్తుంది. 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత ధన సహాయం రూ. 15,427.5 కోట్లలో 47.4 శాతం వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన పారిశ్రామిక సంస్థలకు కేటాయించడం జరిగింది. ఉత్తర ప్రదేశ్, కర్నాటక, రాజస్థాన్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో 50 శాతం పైగా ఈ సంస్థ విత్త సహాయం వెనుకబడిన ప్రాంతాలకు మంజూరు చేయడం జరిగింది. వెనుకబడిన ప్రాంతాల

BRAOU

పారిశ్రామిక యూనిట్లను ప్రోత్సహించి పారిశ్రామికాభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలను తగ్గించుటకు సంస్థ ఎంతగానో దోహదపడుతుంది.

### 17.9.5 ప్రవర్తనా పరమైన కార్యకలాపాలు

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు, భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థలతోకూడి ఉమ్మడిగా నిర్వహించే ప్రవర్తనా కార్యక్రమాలే కాకుండా, భారత పారిశ్రామిక విత్త సంస్థ స్వయంగా పరిశ్రమలకు ఉపయోగపడే ఎన్నో ప్రవర్తనా పథకాలు రూపొందించి అమలు చేసింది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే సంస్థలకు సబ్సిడీలు ఇవ్వడం, మార్కెట్ పరిశోధనలు నిర్వహించడానికి చిన్న ఉద్యమదారులకు సబ్సిడీలు ఇవ్వడం, పెట్టుబడుల, ఆర్థిక శక్యతా అధ్యయనాలు చేయడానికి చిన్న ఉద్యమదారులకు సబ్సిడీలు, అనుబంధ, చిన్న తరహా సంస్థలకు ప్రోత్సాహక సబ్సిడీలు, ఖాయిలా పడిన సంస్థల పునరుద్ధరణకు సబ్సిడీలు, నిరుద్యోగ యువకుల స్వయం అభివృద్ధికి ఋణ సహాయం మొదలగు పథకాలను అమలు చేసి పారిశ్రామిక సంస్థల అభివృద్ధికి పాటుపడింది.

ఒక పారిశ్రామిక సంస్థను స్థాపించడానికి అన్ని అర్హతలు కలిగి యుండి కూడా, కావలసిన మూలధనం సమకూర్చుకోలేని ఉద్యమదారులకు మూల విత్తం సమకూర్చడానికి ఈ సంస్థ 1975లో రిస్క్ కాపిటల్ ఫౌండేషన్‌ను స్థాపించింది. ఈ ఫౌండేషన్ ఉద్యమదారులకు వడ్డీలేని ఋణాలనిస్తుంది. ఈ ఫౌండేషన్ 1976 జూన్ నుండి పనిచేయడం ప్రారంభించింది.

అభివృద్ధి బాంకులలో పనిచేసే సిబ్బందికి, పారిశ్రామిక సంస్థల కార్య నిర్వాహకులకు, ఉద్యమదారులకు ఆధునిక యాజమాన్య పద్ధతులలో శిక్షణను నిర్వహించడానికి, అభివృద్ధి బాంకింగ్‌లో పరిశోధనలు నిర్వహించడానికి 1973లో భారత పారిశ్రామిక విత్త సంస్థ యాజమాన్య అభివృద్ధి సంస్థ (Management Development Institute) ను నెలకొల్పింది. దీనికి అనుబంధంగా 1977లో అభివృద్ధి బాంకింగ్ కేంద్రాన్ని (Development Banking Centre) నెలకొల్పింది.

అభివృద్ధి బాంకింగ్, విత్త, పారిశ్రామిక యాజమాన్యంలో పరిశోధనలు నిర్వహించడానికి దేశంలోని ఆరు విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్లను నియమించింది. భారత పారిశ్రామిక విత్త సంస్థ ఇలాంటి ఎన్నో ప్రవర్తనా కార్యక్రమాలను అమలు పరిచి పారిశ్రామికాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది.

BRAOU

### 17.9.6 ముగింపు

పైన విశ్లేషణ చేసిన విత్తపరమైన, ప్రవర్తనాపరమైన కార్యకలాపాలను సమీక్షించగా భారత పారిశ్రామిక విత్త సంస్థ తన వైవిధ్యమైన విధులను సమర్థవంతంగా నిర్వర్తించి పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని చెప్పవచ్చు. వెనుకబడిన ప్రాంతాల పరిశ్రమలకు ప్రాధాన్యతనిచ్చి సంతులిత పారిశ్రామికాభివృద్ధికి పాటుపడుతుంది. నూతన సంస్థలకు, ప్రయివేటు రంగ సంస్థలకు ఎక్కువ శాతం ఋణాలను మంజూరు చేసి పారిశ్రామిక సంస్థల విస్తరణకు తోడ్పడుతుంది. ఈ సంస్థ విధానాలు ఎక్కువగా పెద్ద పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కేంద్రాలు అనగా ముంబాయి, అహమ్మదాబాద్, కలకత్తా వంటి కేంద్రాలలో స్థాపించబడిన సంస్థలకే ఎక్కువగా ఋణాలను ఇస్తున్నదన్న విమర్శలు వున్నాయి. నిధుల వినియోగంపై, ఋణాలను తీసుకొన్న సంస్థలపై సరియైన పర్యవేక్షణ, నిఘా లేనందువలన ఋణ సహాయం పొందిన సంస్థలు నిధులను మళ్ళించడమో లేక దుర్వినియోగం చేయడమో జరుగుతున్నది. మూలధన మార్కెట్‌లో కావలసిన నిధులను సేకరించగల సంస్థలకే ఈ సంస్థ సహాయం చేస్తుందన్న విమర్శ ప్రబలంగా ఉంది. ఒక అభివృద్ధి బాంకుగా, మార్కెట్లో నిధులు సేకరించలేని సంస్థలకు ఋణ సహాయం

చేయాలి. సంస్థ ఋణాలను మంజూరు చేయడంలో ఎక్కువ కాలయాపన జరుగుతుందని, మంజూరు చేసే పద్ధతి క్లిష్టమైనదని, పద్ధతులను సరళీకృతం చేయవలసి ఉన్నదని నిపుణుల అభిప్రాయం. ఋణాలు మంజూరైనప్పటికీ, వాటిని విడుదల చేయడంలో జాప్యం జరుగుచున్నందున పారిశ్రామిక సంస్థలు సకాలంలో నిర్మాణం పనులు పూర్తి చేయలేకపోతున్నాయని, అందువలన నిర్మాణ వ్యయాలు పెరిగిపోతున్నాయన్న విమర్శలు చాలా వచ్చాయి. సంస్థ విదేశాల నుండి పొందిన విదేశీ ఋణాలను సమర్థవంతంగా వినియోగించడం లేదన్న అభిప్రాయం కూడా ప్రబలంగా ఉంది. ఈ సంస్థ పనితీరుపై ఎన్నో విమర్శలు వచ్చినప్పటికీ భారత దేశ పారిశ్రామిక ప్రగతికి ఎంతో చేయూతను ఇచ్చిందన్నది వాస్తవం.

## 17.10 భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ (Industrial Credit and Investment Corporation of India)

భారత దేశ మూలధన మార్కెట్‌లోని సంస్థాగత నిర్మాణంలోని అంతరాలను పూడ్చి, సత్వర పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడటానికి జనవరి 5, 1955న భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థను స్థాపించారు. ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో ప్రయివేటు రంగంలో పారిశ్రామిక సంస్థలకు అవసరమైన మూలధన వనరులను సమకూర్చి ప్రోత్సహించడానికి ప్రపంచ బాంకు చేసిన కృషి ఫలితమే ఈ సంస్థ ఏర్పాటు. ఈ సంస్థను ఏర్పాటు చేయడంలో ప్రపంచ బాంకు కీలక పాత్ర వహించింది.

### 17.10.1 లక్ష్యాలు

భారత దేశంలోని ప్రయివేటు రంగంలో పారిశ్రామిక సంస్థలకు మూలధనం సప్లయ్ చేయడంలో గల సంస్థాగత అవధులను పూడ్చి పరిశ్రమలను అభివృద్ధి పరచడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. పారిశ్రామిక సంస్థలకు కావలసిన దీర్ఘకాలిక నిధులను సప్లయ్ చేయడం ఈ సంస్థ ముఖ్య ధ్యేయం. భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ ఈ కింది లక్ష్యాలను కలి ఉంది. 1. భారత దేశంలో ప్రయివేటు రంగంలో పరిశ్రమల స్థాపనకు, విస్తరణకు, ఆధునీకీకరణకు ఆర్థిక సహాయం చేయడం; 2. పారిశ్రామిక సంస్థల మూలధనంలో స్వదేశీ, విదేశీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం; 3. పారిశ్రామిక సంస్థలపై ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించడం, పెట్టుబడి మార్కెట్లను విస్తరింపజేయడం.

BRAOU

### 17.10.2 విధులు

భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ ఈ క్రింది విధులను నిర్వహిస్తుంది.

1. ఋణాలు : పారిశ్రామిక సంస్థలకు అవసరమైన ఋణాలను సమకూర్చుట ఈ సంస్థ ముఖ్య విధి. ఋణాలను రూపాయలలోను, విదేశీ కరెన్సీలోనూ సమకూర్చుతుంది. సంస్థ ఇచ్చే ఋణాలకు గరిష్ట కాల పరిమితి 15 సంవత్సరాలు. ఒక సంస్థకు ఇచ్చే ఋణ గరిష్ట పరిమితి రూ. 1 కోటి, కనిష్ట పరిమితి రూ. 5 లక్షలు. విదేశీ ఋణాలివ్వడం ఈ సంస్థ యొక్క ప్రత్యేకత. భారత దేశంలో విదేశీ ద్రవ్య కొరత వలన విదేశీ ఋణాలు పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ఉపయోగకరం. విదేశీ నిధులు పరిమితమైనందున ఒక సంస్థకిచ్చే విదేశీ ద్రవ్య ఋణాల గరిష్ట పరిమితి రూ. 3 కోట్లు, కనిష్ట పరిమితి రూ. 1 లక్ష. ముఖ్య ప్రాజెక్టుల విషయంలో ఈ పరిమితులను సడలించడం జరుగుతుంది.

2. పూచీదారు : పారిశ్రామిక సంస్థలు జారీ చేసే వాటాలకు, డిబెంచర్లకు పూచీదారుగా వ్యవహరించి సంస్థలకు కావలసిన నిధులను సమకూర్చుటకు తోడ్పడుతుంది. 1955లో ఈ సంస్థ స్థాపించబడినప్పుడు పూచీదారుగా పారిశ్రామిక సంస్థలకు నిధులను సమీకరించే సంస్థలు లేవు. సంస్థ ప్రారంభం నుండి ఈ

విధిని నిర్వహించడం ద్వారా పరిశ్రమలకు చాలా సేవ చేసిందన్నది వాస్తవం. అభివృద్ధి బాంకులు పారిశ్రామిక సంస్థలకు ప్రత్యక్ష ఋణాలివ్వడానికి బదులు మార్కెట్ నుండి వాటికి కావలసిన నిధులను ఏర్పాటు చేయడమే ముఖ్య కర్తవ్యం. ఈ విధి నిర్వహణలో మిగతా సంస్థలకన్నా ఈ సంస్థ అగ్రగామిగా నిలిచిందన్నది అతిశయోక్తి కానేరదు.

3. పారిశ్రామిక ఋణాలకు హామీలు : పారిశ్రామిక సంస్థలు పొందే ఋణాలకు ఈ సంస్థ హామీలిస్తుంది. ఈ విధిని నిర్వర్తించడంలో ఈ సంస్థ అనుకున్నంత ప్రగతిని సాధించలేదనే చెప్పాలి. పారిశ్రామిక సంస్థలు ఈ సంస్థ హామీల కన్నా ఋణాలను పొందడానికే ప్రయత్నించాయి.

4. ప్రత్యక్ష చందాదారు : పారిశ్రామిక సంస్థల వాటాలకు, బాండ్లకు, డిబెంచర్లకు ప్రత్యక్షంగా చందా కట్టడం ద్వారా కూడా ఈ సంస్థ వాటికి కావలసిన నిధులను కల్పించవచ్చు.

5. ప్రవర్తనాపరమైన విధులు : విత్త సహాయానికి అనుబంధంగా పరిశ్రమల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే ఎన్నో ప్రవర్తనా కార్యక్రమాలను ఈ సంస్థ నిర్వహిస్తుంది. పరిశ్రమలకు సాంకేతిక నిర్వహణలో సహాయపడుతుంది. రివాల్వింగ్ పెట్టుబడులకు కావలసిన నిధులను ఏర్పాటు చేస్తుంది. మర్చెంట్ బాంకింగ్ సేవలను నిర్వహిస్తుంది. ప్రవాస భారతీయులకు ప్రాజెక్టు కౌన్సిలింగ్ సేవలను అందిస్తుంది. యంత్ర పరికరాల లీజింగ్ వ్యవహారాలను చేపడుతుంది. యాజమాన్య, సాంకేతికపరమైన శిక్షణ కార్యక్రమాలను నడుపుతుంది.

### 17.10.3 మూలధన నిర్మాణం

భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ ఏర్పాటైనప్పుడు దాని అధీకృత మూలధనం రూ. 25 కోట్లు. 1992 మార్చి అంతానికి సంస్థ యొక్క అధీకృత మూలధనం రూ. 300 కోట్లు కాగా, చెల్లించబడిన మూలధనం రూ. 171 కోట్లు. 1993 మార్చి అంతానికి సంస్థ యొక్క రిజర్వులు రూ. 965 కోట్లు కాగా సంస్థ యొక్క ఆస్తుల విలువ రూ. 12,354.7 కోట్లు. వాటా మూలధనంలో సుమారు 11 శాతం విదేశీ వాటాదార్లు సమకూర్చారు. ఈ సంస్థ పూర్తిగా ప్రయివేటు రంగంలోని అభివృద్ధి బాంకు. కాని జీవిత భీమా సంస్థను జాతీయం చేయడం, ఆ సంస్థ వాటాలను ఈ సంస్థకు బదిలీ చేయడంతో భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థకు జీవిత భీమా సంస్థ ముఖ్య వాటాదారు అయింది. ఇదేగాక జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ, యూనిట్ ట్రస్టు, ఇతర బాంకులు ఈ సంస్థ వాటాదారులుగా చేరడం జరిగింది.

సంస్థ తనకు కావలసిన నిధులను సమీకరించడానికి డిబెంచర్లను జారీ చేస్తుంది. మొట్టమొదటిసారిగా 1967లో డిబెంచర్లను జారీ చేయడం జరిగింది. ఈ సంస్థ విడుదల చేసిన బాండ్లు, డిబెంచర్లు కేంద్ర ప్రభుత్వ హామీ కలిగి యుంటాయి. ఈ సంస్థ బాండ్లను జారీ చేయడం ద్వారా విదేశీ సంస్థల నుండి నిధులను పొందవచ్చు. అవసరమైనప్పుడు కేంద్ర ప్రభుత్వం నుండి, ప్రపంచ బాంకు నుండి భారత పారిశ్రామికాభివృద్ధి సంస్థ నుండి ఋణాలను తీసుకొంటుంది.

### 17.10.4 విత్త కార్యకలాపాలు

భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ మంజూరు చేసి విడుదల చేసిన విత్త సహాయాన్ని పట్టిక 17.4 లో చూపాం.

BRAOU

పట్టిక–17.4 : భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ : మంజూరైన, విడుదలైన విత్త సహాయం (రూ. కోట్లలో)

| సంవత్సరం | మంజూరు చేసిన మొత్తం | విడుదలైన విత్త సహాయం |
|---|---|---|
| 1970–71 | 43.9 | 28.9 |
| 1975–76 | 62.9 | 45.4 |
| 1980–81 | 314.1 | 185.3 |
| 1985–86 | 708.2 | 482.2 |
| 1990–91 | 3738.0 | 1967.5 |
| 1991–92 | 4094.9 | 2351.3 |
| 1992–93 | 5882.7 | 3315.2 |
| మార్చి 1993 నాటికి సంచితమైన మొత్తం | 29328.0 | 18499.3 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

1993 మార్చి అంతానికి సంస్థ మంజూరు చేసిన సంచితమైన ధన సహాయం రూ 29,328 కోట్లు కాగా అందులో రూ. 18,499.3 కోట్లు మాత్రం విడుదల చేయబడింది. పట్టిక 17.4 ను పరిశీలిస్తే ఈ సంస్థ యొక్క విత్త సహాయం 1985-86 తర్వాత క్రమేణా పెరుగుతూ వచ్చిందని తెలుస్తుంది.

భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ మంజూరు చేసిన వివిధ రకాల విత్త సహాయాన్ని పట్టిక 17.5లో ఇచ్చాం.

B R A O U

పట్టిక – 17.5 : భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ :
మంజూరు చేసిన వివిధ రకాల విత్త సహాయం (రూ. కోట్లలో)

| స్కీము | 1990–91 | 1991–92 | 1992–93 | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచితమైన విత్త సహాయం | శాతం |
|---|---|---|---|---|---|
| ఎ. ప్రాజెక్టు విత్తం | | | | | |
| 1. రూపాయి ఋణాలు | 1382.4 | 1709.8 | 2742.6 | 10387.8 | 35.42 |
| 2. విదేశీ కరెన్సీ ఋణాలు | 1040.5 | 775.4 | 581.7 | 10251.8 | 34.95 |
| 3. పూచీదారు/ప్రత్యక్ష చందాలు | 255.8 | 311.6 | 1081.6 | 2480.2 | 8.46 |
| 4. హామీలు | 30.9 | 320.4 | 302.7 | 1051.8 | 3.59 |
| బి. విత్తపరమైన సేవలు | 1028.4 | 977.7 | 1174.1 | 5156.4 | 17.58 |
| మొత్తం | 3738.0 | 4094.9 | 5882.7 | 29328.0 | 100.00 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

1993 మార్చి అంతానికి సంస్థ మంజూరు చేసిన సంచితమైన విత్తం రూ. 29,328 కోట్లు కాగా అందులో 35.42 శాతం రూపాయి ఋణాలుగా ఇచ్చింది. విదేశీ కరెన్సీ ఋణాల మొత్తం విత్త సహాయంలో 34.95 శాతంగా నమోదై మిగతా అభివృద్ధి బాంకుల కంటే ప్రత్యేక స్థానం పొందింది. పూచీదారుగా, ప్రత్యక్ష చందాల ద్వారా 8.46

శాతం నిధులను సమకూర్చింది. హామీలివ్వడం ద్వారా పారిశ్రామిక సంస్థలకు 3.59 శాతం సమకూర్చింది. ఈ సంస్థ పరిశ్రమలకు ఎక్కువ మొత్తంలో విదేశీ ద్రవ్య ఋణాలివ్వడం ద్వారా మూలధన సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానం దిగుమతులకు చాలా సహాయపడింది.

**పరిశ్రమల వారీ విత్త సహాయం**

1993 మార్చి అంతానికి సంస్థ మంజూరు చేసిన సంచితమైన విత్తంలో 20.49 శాతం రసాయనాలు, రసాయనిక ఉత్పత్తుల పరిశ్రమకు, 11.05 శాతం మూల లోహ పరిశ్రమకు, 10.32 శాతం వస్త్ర పరిశ్రమకు, 9.99 శాతం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల పరిశ్రమకు, 9.05 శాతం యంత్రాల పరిశ్రమకు 6.27 శాతం సిమెంటు పరిశ్రమకు మంజూరు చేయడం జరిగింది.

**రాష్ట్రాల వారీ విత్త సహాయం**

భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ మంజూరు చేసిన రాష్ట్రాల వారీ విత్త సహాయ వివరాలు పట్టిక 17.6 లో ఇవ్వబడినవి.

పట్టిక – 17.6 : భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ :
రాష్ట్రాలవారీ మంజూరు చేసిన విత్త సహాయం (రూ. లక్షలలో)

| రాష్ట్రం | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| 1. మహారాష్ట్ర | 8244.2 | 28.11 |
| 2. గుజరాత్ | 4639.0 | 15.82 |
| 3. తమిళనాడు | 2677.2 | 9.13 |
| 4. కర్నాటక | 1897.7 | 6.47 |
| 5. ఉత్తర ప్రదేశ్ | 1846.8 | 6.30 |
| 6. ఆంధ్ర ప్రదేశ్ | 1698.5 | 5.79 |
| 7. పశ్చిమ బెంగాల్ | 1481.4 | 5.05 |
| 8. మధ్య ప్రదేశ్ | 1478.8 | 5.04 |
| 9. రాజస్థాన్ | 1187.4 | 4.05 |
| 10. ఇతర రాష్ట్రాలు | 4177.0 | 14.24 |
| మొత్తం | 29328.0 | 1000 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

B R A O U

1993 మార్చి 31 నాటికి సంస్థ మంజూరు చేసిన సంచిత విత్త సహాయం రూ. 29,328 కోట్లలో, 28.11 శాతం మహారాష్ట్రకు, 15.82 శాతం కర్నాటక రాష్ట్రానికి, 6.30 శాతం ఉత్తర ప్రదేశ్‌కు, 5.79 శాతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మంజూరు చేయబడింది. రాష్ట్రాలవారీ విత్త సహాయాన్ని సమీక్షిస్తే మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో పరిశ్రమలకే 43.93 శాతం విత్త సహాయం మంజూరైంది. ఈ సంస్థ కూడా పారిశ్రామిక కేంద్రాలుగా పేరొందిన ముంబాయి, అహ్మదాబాద్ వంటి నగరాలలోని సంస్థలకే ఎక్కువ సహాయమందించిందనే తెలుస్తుంది.

**రంగాల వారీ విత్త సహాయం**

1993 మార్చి అంతానికి మంజూరైన మొత్తం విత్త సహాయంలో, ప్రయివేటు రంగ సంస్థలకు 89.77 శాతం, ఉమ్మడి రంగానికి 6.27 శాతం, ప్రభుత్వ రంగానికి 2.43 శాతం, సహకార రంగానికి 1.53 శాతం విత్తం మంజూరు చేయబడింది.

**ఉద్దేశాల వారీ విత్త సహాయం**

1991-92లో సంస్థ మంజూరు చేసిన విత్త సహాయంలో నూతన సంస్థలకు 16.64 శాతం, విస్తరణ, వైవిధ్యానికి 33.09 శాతం, ఆధునికీకరణకు 6.88 శాతం, సామాగ్రి విత్తానికి 29.24 శాతం, పునర్నిర్మాణానికి 0.49 శాతం మంజూరు చేయడం జరిగింది. 1992 - 93 సంవత్సరంలో నూతన సంస్థలకు 12.92 శాతం, విస్తరణ, వివైధ్యానికి 20.31 శాతం, ఆధునికీకరణకు 7.18 శాతం, సామగ్రి విత్తానికి 24.77 శాతం, పునర్నిర్మాణానికి 0.90 శాతం, ఇతర ఉద్దేశాలకు 33.92 శాతం విత్త సహాయం మంజూరు చేయబడింది.

**వెనుకబడిన ప్రాంతాలకు సహాయం**

1993 మార్చి అంతానికి మంజూరైన విత్త సహాయం లో 35.08 శాతం వెనుకబడిన ప్రాంతాలలో స్థాపించిన పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేయబడింది. కాబట్టి ఈ సంస్థ ఒక అభివృద్ధి బాంకుగా వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామికాభివృద్ధికి సహాయపడవలసిన అవసరం ఎంతైనా వుంది.

## 17.10.5 ప్రవర్తనాపరమైన కార్యకలాపాలు

భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ మిగతా అఖిల భారత స్థాయి అభివృద్ధి బాంకులతో ఉమ్మడిగా ఎన్నో ప్రవర్తనా కార్యక్రమాలు నిర్వహించడమే గాక తానే స్వయంగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలైన ప్రవర్తనా విధులను నిర్వహించింది. పరిశ్రమల విత్త యాజమాన్యానికి సంబంధించి కోర్సుల నిర్వహణ, పరిశోధనలు జరుపడానికి 1970 లో మద్రాసులో 'ఇనిస్టిట్యూట్ ఫర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ రిసెర్చి' అను సంస్థను నెలకొల్పింది. 1973 లో మర్చెంట్ బాంకింగ్ విధులను చేపట్టింది. 1975 నుండి లెటర్స్ ఆఫ్ క్రెడిట్ కార్యక్రమాన్ని అమలుపరచి ముఖ్యంగా విదేశీ సంస్థలతో లావాదేవీలలో, యంత్ర సామగ్రి దిగుమతులలో, పారిశ్రామిక సంస్థలకు సహాయపడుతుంది. సంస్థలకు అవసరమైన యంత్రాలను కౌలు పద్ధతిలో సమకూర్చు కార్యక్రమాన్ని అమలు చేసింది. ఒరిస్సా ప్రభుత్వ సహకారంతో ఒరిస్సా రాష్ట్రంలోని కన్సబహాల్‌లో ఫోర్‌మేన్ శిక్షణా సంస్థను నెలకొల్పి, ఆ సంస్థ ద్వారా ఫోర్మన్‌లకు శిక్షణ ఇస్తున్నది. 1983 నుండి ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ డెవలప్‌మెంట్ బాంకింగ్ అనే పత్రికను ప్రచురించింది. ఈ విధంగా పారిశ్రామిక సంస్థలకు అవసరమైన విత్తం సమకూర్చడంతో పాటు వాటి అభివృద్ధికి అవసరమైన ఎన్నో ప్రోత్సాహ కార్యక్రమాలను అమలు పరచి పరిశ్రమల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నది.

## 17.10.6 ముగింపు

పై సమీక్ష ఆధారంగా భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పరిశ్రమలకు ఎంతో విశిష్ట సేవలందించింది. ఈ సంస్థ అందించిన విదేశీ ఋణాలు విదేశీ యంత్ర సామాగ్రి, సాంకేతిక విజ్ఞాన దిగుమతి చేసుకోవడానికి చాలా ఉపయోగపడినాయి. పూచీదారుగా పారిశ్రామిక సంస్థలకు అవసరమైన నిధులను సమకూర్చుటలో మిగిలిన అభివృద్ధి బాంకులకు మార్గదర్శకంగా నిలిచింది. సంస్థ ప్రారంభించిన నాటి నుండి ప్రవర్తనాపర కార్యకలాపాలను అమలు జరిపి పరిశ్రమలకు తోడ్పడింది. ఈ సంస్థ మూలధన నిర్మాణం మిగతా సంస్థలకు భిన్నంగా విదేశీ వనరులను సమీకరించుట ద్వారా ప్రత్యేకతను కల్గి వుంది. విత్త సహాయం అందించడంలో ఈ సంస్థ సాంప్రదాయేతర ప్రాధాన్యత గల పారిశ్రామిక యూనిట్లకు ప్రాముఖ్యతను ఇవ్వడం ప్రశంసనీయం.

కాని విత్త సహాయ పంపిణీలో ఈ సంస్థ పెద్ద సంస్థలకు, అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు ఎక్కువగా సహాయపడినట్లు గణాంక వివరాలు తెలుపుతున్నాయి. వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన సంస్థలను ఆశించినంతగా ప్రోత్సహించలేదనే చెప్పాలి. మిగిలిన అభివృద్ధి బాంకుల వలనే ఋణాల మంజూరు, విడుదలల మధ్య అంతరం ఎక్కువగా ఉన్నది. ఋణాల మంజూరుకు సంస్థ పాటిస్తున్న నిబంధనలు సరళతరం చేయవలసిన అవసరం వుంది. ఈ సంస్థ యొక్క పనితీరును వివిధ కోణాలలో పరిశీలిస్తే సంస్థ సమర్థవంతంగా పనిచేసి పారిశ్రామికాభివృద్ధికి గణనీయమైన సేవ చేస్తున్నదని చెప్పవచ్చు.

## 17.11 భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు (Industrial Development Bank of India)

1960వ సంవత్సరం నాటికి పారిశ్రామిక విత్తం సమకూర్చే ఎన్నో విత్త సంస్థలు వెలిశాయి. ఎక్కువ సంఖ్యలో ఈ అభివృద్ధి బాంకుల ఏర్పాటు గందరగోళానికి, సంస్థల మధ్య అనవసరమైన పోటీకి దారి తీసింది. ఈ సంస్థల కార్యకలాపాలన్నీ సమన్వయించి పరిశ్రమలకు కావలసిన నిధులను సమకూర్చుటలో సహాయపడేందుకు ఒక శిఖర సంస్థ ఆవశ్యకత యేర్పడింది. ఈ సందర్భంలో భారత పారిశ్రామికాభివృద్ధి బాంకును, రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా యాజమాన్యంలో అనుబంధ సంస్థగా భారత పారిశ్రామిక చట్టం, 1964 ప్రకారం జూలై 1, 1964న స్థాపించబడింది. ఈ బాంకు పరిశ్రమలకు ఋణ సహాయం అందించే విత్త సంస్థల కార్యకలాపాలను సమన్వయించి భారత దేశ పారిశ్రామిక నిర్మాణంలోగల అంతరాలను పూడ్చడానికి అనువుగా రూపుదాల్చింది. ఈ బాంకు కేంద్ర ప్రభుత్వానికి బదిలీ చేయబడింది.

### 17.11.1 లక్ష్యాలు

దేశంలో మధ్యకాలిక, దీర్ఘకాలిక పారిశ్రామిక విత్తం డిమాండ్ సప్లయ్‌ల మధ్యగల తేడాలను తగ్గించి, నిర్దిష్ట వ్యవధిలో పరిశ్రమలకు విత్త సహాయాన్నందించి, వివిధ సంస్థల మధ్య సామరస్యం, సంవిధానం పెంపొందిచుట పారిశ్రామిక విత్త రంగంలో శిఖర సంస్థగా భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ముఖ్య లక్ష్యం. దేశంలోని పారిశ్రామిక విత్త సంస్థలన్నింటిని పునర్‌వ్యవస్థీకరించి, పారిశ్రామికాభివృద్ధిని వేగపరచటం ఈ బాంకు ముఖ్య ఆశయం. పరిశ్రమల ప్రణాళిక, వ్యవస్థాపన, అభివృద్ధితో బాటు ఎన్నో ప్రవర్తనా కార్యక్రమాలను నిర్వహించి పారిశ్రామికాభివృద్ధికి ఈ బాంకు తోడ్పడుతుంది. ఈ బాంకు కార్యకలాపాలకు ఎటువంటి నిబంధనలు లేవు. సెక్యూరిటీల గురించి, ఋణాల గరిష్ట, కనిష్ట పరిమితులను సడలించడానికి బాంకుకు పూర్తి స్వేచ్ఛ వుంది.

### 17.11.2 విధులు

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు విధులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు : (1) ప్రత్యక్ష విత్త సహాయం, (2) పరోక్ష విత్త సహాయం, (3) సమన్వయ విధులు.

1. ప్రత్యక్ష విత్త సహాయం : సాధారణ మూలధన మార్కెట్లో నిధులను సమకూర్చుకోలేని సంస్థలకు ఈ బాంకు ఋణ సహాయం అందిస్తుంది. ఈ బాంకు ముఖ్యంగా భారీ పరిశ్రమలకు ఋణ సౌకర్యం కలుగజేస్తుంది. ఈ బాంకు విదేశీ కరెన్సీలో ఋణాలనిచ్చే అధికారం పొంది వున్నది. కాని 1981-82 వరకు ఈ విధిని నిర్వహించలేదు. విదేశీ ఋణావసరాలు గల సంస్థలను భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థకు సిఫారసు చేస్తుండేది. ఋణాల పరిమాణంపై గాని, కాల వ్యవధికి సంబంధించిగాని ఈ బాంకుకు ఎలాంటి ఆంక్షలు లేవు. 1966 నుండి ఇతర విత్త సంస్థలతో కలిసి ఉమ్మడిగా పారిశ్రామిక సంస్థలకు ఋణాలను ఇచ్చే పథకాన్ని అమలు పరచింది.

   భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు పారిశ్రామిక సంస్థల వాటాలకు, బాండ్లకు పూచీదారుగా వుండి ఆ సంస్థలకు కావలసిన నిధులను సమకూర్చుతుంది. పారిశ్రామిక సంస్థల వాటాలకు, బాండ్లకు డిబెంచర్లకు ప్రత్యక్ష చందా కట్టడానికి కూడా బాంకు అధికారం పొంది వున్నది. పారిశ్రామిక సంస్థల

వాయిదా చెల్లింపులకు తగిన హామీలిచ్చు అధికారం కలిగి వున్నది. మిగతా విత్త సంస్థల నుండి గాని, బహిరంగ మార్కెట్లో గాని సంస్థలు పొందిన ఋణాలకు హామీలిస్తుంది. విదేశీ మార్కెట్లో సంస్థలు పొందిన ఋణాలకు కూడా హామీలిస్తుంది. పారిశ్రామిక సంస్థలు యంత్ర సామగ్రి కొనుగోలుకు సంబంధించిన విలంబిత చెల్లింపులకు హామీ ఇస్తుంది. కొత్త సంస్థలు స్థిరాస్తులను సేకరించుకోవడానికి, ఉన్నటువంటి సంస్థల విస్తరణకు, ఆధునికీకరణకు ఈ బాంకు ప్రత్యక్షంగా విత్త సహాయం చేస్తుంది.

2. పరోక్ష విత్త సహాయం : భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు పారిశ్రామిక సంస్థలకు పరోక్షంగా ఎన్నో రకాలుగా సహాయపడుతుంది. పారిశ్రామిక సంస్థల ప్రామిసరీ నోట్లు, వినిమయ బిల్లులను రీ-డిస్కౌంటు చేసే అధికారం ఈ బాంకు కలిగి వుంది. ఈ పథకాన్ని 1965 ఏప్రిల్‌లో ప్రారంభించింది. దేశంలో యంత్ర సామగ్రిని ఉత్పత్తి చేసే సంస్థలు పారిశ్రామిక సంస్థలకు యంత్రాల సప్లయ్ చేసినందుకుగాను, ఆ సంస్థల ప్రామిసరీ నోట్లు, బిల్లుల ఆధారంగా మూలధన ఉత్పత్తుల పరిశ్రమలకు దీర్ఘకాలిక ఋణాలను ఇవ్వడం ద్వారా అటు మూలధన ఉత్పత్తుల పరిశ్రమలకు వాయిదాల పద్ధతిలో యంత్రాలు పొందడంలో పారిశ్రామిక సంస్థలకు సహాయపడుతుంది. రాష్ట్ర విత్త సంస్థలు, వాణిజ్య బాంకులు పారిశ్రామిక సంస్థలకు ఇచ్చిన ఋణాలకు బదులుగా ఆ బాంకులకు పునర్విత్త సహాయం అందిస్తుంది. ఈ పథక ఉద్దేశం విత్త సంస్థల మూలధన నిధులను పటిష్ట పరచడమే. ఈ బాంకు పారిశ్రామిక విత్త సంస్థల వాటాలకు, డిబెంచర్లకు ప్రత్యక్షంగా చందా చెల్లించవచ్చు.

3. సమన్వయ విధులు : దేశంలోని అభివృద్ధి బాంకులకు ఇది శిఖరాగ్ర సంస్థ. ఈ బాంకు అన్ని అభివృద్ధి బాంకుల కార్యకలాపాలను సమీక్షించి సమన్వయం చేస్తుంది. దేశ సమగ్ర పారిశ్రామికాభివృద్ధి కోసం, పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతాలలో పారిశ్రామిక సంస్థల ఏర్పాటు చేయడానికి, సహాయ పడేందుకు మిగతా విత్త సంస్థలను ప్రోత్సహిస్తుంది. దేశ పారిశ్రామికాభివృద్ధి అవసరాలను, దేశ పారిశ్రామిక నిర్మాణంలోని అంతరాలను పూడ్చాలనే లక్ష్య సాధనను గుర్తించి పారిశ్రామిక వేత్త సంస్థలను నిర్దేశిస్తుంది.

4. ప్రవర్తనా పరమైనవిధులు : విత్తపరమైన సమన్వయ విధులకు తోడుగా పారిశ్రామిక ప్రగతి కోసం అనేక ప్రవర్తనా విధులను నిర్వహిస్తుంది. పారిశ్రామిక సంభావ్య సర్వేలను నిర్వహించడం, వ్యవస్థాపనాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం, అభివృద్ధి బాంకుల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను చేపట్టడం మొదలైన కార్యక్రమాలను సాంకేతిక సహాయ నిధి (Technical Assistance Fund) ద్వారా అమలు జరుపుతుంది. ఈ బాంకు తాను ఆర్జించిన లాభాల నుండి జూలై 1977లో ఈ నిధి సృష్టించబడింది. వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన సంస్థలకు ఎన్నో రాయితీలను ఇచ్చి ప్రోత్సహిస్తుంది. కీలకమైన పారిశ్రామిక ప్రాజెక్టులను గుర్తించి వాటికి అవసరమైన నిధులను అభివృద్ధి బాంకుల ద్వారా సమకూర్చుటకు రాష్ట్ర స్థాయిలో అంతర్ సంస్థల సముదాయాలను (inter institutional groups) ఏర్పాటు చేయడం జరిగింది. పారిశ్రామిక సంస్థలకు అవసరమైన సలహాలకు సంప్రదింపులకు ముఖ్యంగా చిన్న ఉద్యమదారులకు సహాయపడేందుకు మిగతా సంస్థల సహకారంతో భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు సాంకేతిక సంప్రదింపుల సంస్థలను (Technical Consultancy Organisations) స్థాపించింది. ఈ విధంగా పారిశ్రామికాభివృద్ధికి ఉపయుక్తమైన ఎన్నో ప్రవర్తనా విధులను నిర్వహిస్తుంది.

### 17.11.3 మూలధన నిర్మాణం

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ప్రారంభంలో అధీకృత మూలధనం రూ. 50 కోట్లు. అవసరాన్ని బట్టి మూలధనాన్ని పెంచుకునే అధికారం బాంకు కల్గి వుంది. 1991 జూన్ 30 నాటికి బాంకు యొక్క అధీకృత

మూలధనం రూ. 1,000 కోట్లు, జారీ చేసి చెల్లించిన మూలధనం రూ. 703 కోట్లు. ఆ రోజుకు బాంకు యొక్క రిజర్వు నిధులు రూ. 1,266 కోట్లు. భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ఇతర సంస్థల వలే వనరులు సమీకరించేందుకు బాండ్లను, డిబెంచర్లను జారీ చేయవచ్చు. బాంకు జారీచేసిన బాండ్లు, డిబెంచర్లు అసలు, వడ్డీ చెల్లింపులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ గ్యారంటీ కలిగి ఉంటాయి. అవసరమైతే దీర్ఘకాలిక డిపాజిట్ల ద్వారా కూడా నిధులను సమీకరించే అధికారం పొంది వున్నది.

తనకు కావలసిన నిధులను రిజర్వు బాంకు నుండి ఋణాల రూపంలో పొందవచ్చు. సమీప భవిష్యత్తులో పారిశ్రామిక సంస్థల తిరిగి చెల్లింపులకు బదులుగా రిజర్వు బాంకు నుండి ఋణాలను పొందవచ్చు. ఈ బాంకు స్థాపించినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ బాంకుకు రూ. 10 కోట్లు వడ్డీలేని ఋణాన్ని ఇచ్చింది. విదేశీ విత్త సంస్థల నుండి అవసరమైన ఋణాలను పొందడానికి అధికారం కల్గివున్నా ఈ విషయంలో ఈ బాంకు అంతగా శ్రద్ధ చూపలేదు. సంస్థ ప్రారంభానికి, ఉత్పత్తి ప్రారంభానికి మధ్యగల కాల వ్యవధి ఎక్కువగా ఉండి, స్వల్ప లాభావకాశాలన్న కీలకమైన సంస్థలకు 1965 లో స్థాపించిన అభివృద్ధి సహాయక నిధి (Development Assistance Fund) నుండి నిధులను ఏర్పాటు చేస్తుంది. మిగతా విత్త సంస్థలనుండి, మూలధన మార్కెట్ నుండి కూడా అవసరమైనప్పుడు ఋణాలను పొంది నిధులను సమీకరిస్తుంది.

### 17.11.4 విత్త కార్యకలాపాలు

1964–65 వ సంవత్సరంలో కేవలం రూ. 29 కోట్లు మాత్రమే విత్త సహాయం చేయగలిగిన ఈ బాంకు 1992–93 నాటికి రూ. 9,459.4 కోట్లు విత్త సహాయం మంజూరు చేయగలిగింది. 1964–65లో రూ. 20.7 కోట్ల విత్త సహాయం విడుదల చేయగా 1992–93 నాటికి రూ. 6,668.5 కోట్లు విడుదల చేయడం జరిగింది. పట్టిక 17.7 ను పరిశీలిస్తే ప్రతి సంవత్సరం బాంకు మంజూరు చేసే సహాయం క్రమంగా పెరుగుతున్నది. కాని విత్తం మంజూరు, విడుదలల మధ్య అంతరం పెరుగుతూ ఉంది. 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచితమైన విత్త సహాయం రూ. 64,695.5 కోట్లు కాగా విడుదలైన విత్త సహాయం రూ. 47,087.7 కోట్లు. వివరాలు పట్టిక 17.7 లో ఇవ్వబడినవి.

పట్టిక – 17.7 : భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు : మంజూరు, విడుదల చేసిన విత్త సహాయం (రూ. కోట్లలో)

| సంవత్సరం | మంజూరు చేసిన విత్త సహాయం | విడుదల చేసిన విత్త సహాయం |
|---|---|---|
| 1964–65 | 28.6 | 20.7 |
| 1980–81 | 1276.6 | 1014.1 |
| 1985–86 | 3491.8 | 2783.9 |
| 1986–87 | 4327.3 | 3205.9 |
| 1987–88 | 4580.6 | 3613.6 |
| 1988–89 | 6659.9 | 4745.8 |
| 1989–90 | 7495.8 | 5084.8 |
| 1990–91 | 6431.2 | 4459.4 |
| 1991–92 | 7590.0 | 5762.8 |
| 1992–93 | 9459.4 | 6668.5 |
| మార్చి 1993 నాటికి సంచితమైన మొత్తం | 64695.5 | 47087.5 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

BRAOU

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు మంజూరుచేసిన వివిధ రకాల విత్త సహాయ వివరాలు పట్టిక 17.8లో ఇవ్వబడినవి.

పట్టిక – 17.8 : భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు : మంజూరు చేసిన వివిధ రకాల విత్త సహాయం (రూ. కోట్లలో)

| స్కీము | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| **ప్రత్యక్ష విత్తం** | | |
| 1. రూపాయి ఋణాలు | 24050.6 | 37.17 |
| 2. విదేశీ కరెన్సీ ఋణాలు | 3070.0 | 4.74 |
| 3. పూచీదారు/ప్రత్యక్ష చందాలు | 2062.0 | 3.19 |
| 4. ఋణాల విలంబిత చెల్లింపులకు హామీలు | 1229.6 | 1.90 |
| 5. వెంచర్ కాపిటల్ | 142.5 | 0.22 |
| 6. సామిగ్రికాలు | 309.1 | 0.48 |
| **పరోక్ష విత్తం** | | |
| 1. పారిశ్రామిక విత్త సంస్థలకు పునర్విత్తం | 17518.5 | 27.08 |
| 2. బిల్లుల విత్తం | 12665.7 | 19.58 |
| 3. విత్త సంస్థలకు ఋణాలు, వాటి వాటాలకు చందాలు | 3647.5 | 5.64 |
| మొత్తం | 64695.5 | 100.00 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

1993 మార్చి 31 నాటికి బాంకు మంజూరు చేసిన సంచితమైన విత్త సహాయం రూ.64,695.5 కోట్లు. అందులో 47.7 శాతం ప్రత్యక్ష విత్తం, 52.3 శాతం పరోక్ష విత్తం. మొత్తం సంచిత విత్త సహాయంలో 37.17 శాతం రూపాయి ఋణాలుగాను, 4.74 శాతం విదేశీ కరెన్సీ ఋణాలుగాను పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేయడమైంది. పారిశ్రామిక విత్త సంస్థలకు తాము పారిశ్రామిక సంస్థలకు ఇచ్చిన ఋణాలకు ప్రతిగా భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు పునర్విత్తం మొత్తం విత్త సహాయంలో 27.08 శాతంగా ఉండగా, 19.58 శాతం బిల్లుల విత్తం రూపంలో పారిశ్రామిక సంస్థలకు సహాయం చేసింది. విత్త సంస్థలను పటిష్ట పరచడానికి ఆ సంస్థలకు ఋణాలివ్వడం ద్వారా గాని, లేక వాటి వాటాలకు, డిబెంచర్లకు ప్రత్యక్ష చందా ద్వారా గాని ఈ బాంకు సహాయపడుతుంది. ఆ స్కీము కింద 5.64 శాతం నిధులను మంజూరు చేసింది. పై వివరాలను సమీక్షిస్తే, భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ఎక్కువగా పరోక్ష విత్త సహాయానికి, ఋణాలకు ప్రాధాన్యత ఇస్తున్నదని తెలుస్తుంది. పరోక్ష విత్తంలో ముఖ్యంగా పునర్విత్తానికి, బిల్లుల రీ–డిస్కౌంట్ చేయడానికి ప్రాధాన్యతను ఇస్తున్నది.

**పరిశ్రమల వారీ విత్త సహాయం**

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు 1993 మార్చి అంతానికి రూ. 60,928.3 కోట్లు సంచితమైన విత్త సహాయం మంజూరు చేసింది. అందులో 12.59 శాతం వస్త్ర పరిశ్రమకు, 12.00 శాతం రసాయనాలు, రసాయనిక ఎరువుల పరిశ్రమకు, 14.48 శాతం సేవల పరిశ్రమలకు, 10.79 శాతం విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే పరిశ్రమలకు మంజూరు చేసింది. ఆహార వస్తువుల పరిశ్రమ, మూల లోహాలు, రసాయనిక ఎరువులు వరుసగా 5.53 శాతం, 6.89 శాతం, 4.79 శాతం విత్త సహాయం పొందాయి. పరిశ్రమల వారీ బాంకు అందించిన సహాయాన్ని సమీక్షిస్తే ఎక్కువగా కీలకమైన పరిశ్రమలకు విత్త సహాయం చేయడం ద్వారా సమగ్ర పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడుతున్నది.

### రాష్ట్రాల వారీ విత్త సహాయం

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ప్రారంభం నుండి 1993 మార్చి వరకు మంజూరు చేసిన విత్త సహాయంలో 16.75 శాతం మహారాష్ట్రలో నెలకొల్పబడిన సంస్థలు పొందాయి. రెండవ స్థానాన్ని 12.51 శాతంతో గుజరాత్ ఆక్రమించింది. తమిళనాడుకు 9.67 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 9.47 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌కు 8.65 శాతం, కర్నాటక రాష్ట్రానికి 6.27 శాతం, పశ్చిమ బెంగాల్‌కు 5.74 శాతం మంజూరు చేయడమైంది. పై వివరాలను సమీక్షిస్తే భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు కూడా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించిన కేంద్రాలకే ఎక్కువ మొత్తంలో విత్తం సమకూర్చిందన్నది విదితమౌతుంది. పట్టిక 17.9 లో వివరాలను చూడండి.

పట్టిక 17.9 : భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు : రాష్ట్రాలవారీ మంజూరు చేసిన విత్త సహాయం (రూ. కోట్లలో)

| పరిశ్రమ (4) | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| 1. మహారాష్ట్ర | 10206.1 | 16.75 |
| 2. గుజరాత్ | 7620.9 | 12.51 |
| 3. తమిళనాడు | 5893.1 | 9.67 |
| 4. ఉత్తర ప్రదేశ్ | 5767.1 | 9.47 |
| 5. ఆంధ్ర ప్రదేశ్ | 5271.6 | 8.65 |
| 6. కర్నాటక | 3818.8 | 6.27 |
| 7. పశ్చిమ బెంగాల్ | 3496.5 | 5.74 |
| 8. మధ్య ప్రదేశ్ | 3433.7 | 5.63 |
| 9. రాజస్థాన్ | 2966.8 | 4.87 |
| 10. పంజాబ్ | 1875.9 | 3.08 |
| 11. హర్యానా | 1807.9 | 2.97 |
| 12. ఇతర రాష్ట్రాలు | 8769.9 | 14.39 |
| మొత్తం | 60928.3 | 100.00 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

BRAOU

### రంగాల వారీ విత్త సహాయం

బాంకు మంజూరు చేసిన మొత్తం విత్తంలో 75.4 శాతం ప్రయివేటు రంగంలోని పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేయబడింది. ప్రభుత్వ రంగానికి 16.52 శాతం, ఉమ్మడి రంగానికి 6.28 శాతం, సహకార రంగానికి 1.85 శాతం మంజూరు చేయబడింది.

### ఉద్దేశాల వారీ విత్త సహాయం

1991-92 వ సంవత్సరంలో బాంకు మంజూరు చేసిన విత్తం రూ. 6,961.3 కోట్లలో నూతన సంస్థలకు 29.28 శాతం, విస్తరణ, వైవిధీకరణలకు 30.71 శాతం, ఆధునికీకరణకు 39.24 శాతం, పునర్నిర్మాణానికి 0.88 శాతం మంజూరు చేసింది. 1992-93లో మంజూరైన విత్తం రూ. 9,039.6 కోట్లలో నూతన సంస్థలకు 30.92

శాతం, విస్తరణ, వైవిధ్యీకరణకు 32.03 శాతం, ఆధునికీకరణకు 36.61 శాతం, పునర్నిర్మాణానికి 0.44 శాతం మంజూరు చేయబడింది. పై వివరాలను సమీక్ష చేయగా విస్తరణకు, ఆధునికీకరణకు ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తుంది.

**వెనుకబడిన ప్రాంతాలకు సహాయం**

ఈ బాంకు మంజూరు చేసిన 1993 మార్చి అంతానికి సంచితమైన విత్త సహాయం రూ. 60,928.3 కోట్లలో 39.11 శాతం వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పబడిన పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేయబడింది. కాబట్టి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అనుకున్నంత ప్రాముఖ్యత ఇవ్వడం లేదని విదితమౌతుంది. ఒక అభివృద్ధి బాంకు, అభివృద్ధి బాంకులకు శిఖర సంస్థగా ఈ బాంకు ఎక్కువగా వెనుకబడిన ప్రాంతాలలో నిర్మితమైన సంస్థలను ప్రోత్సహించి మార్గదర్శకంగా నిలవాలి.

## 17.11.5 ప్రవర్తనాపర కార్యకలాపాలు

సంతులిత ప్రాంతీయాభివృద్ధి, ఉద్యమదారులకు ప్రోత్సాహకాలు, లాభదాయ ప్రాజెక్టులను రూపొందించడం, వాటిని మదింపు వేయడం, అమలు చేయడంలో ప్రావీణ్యత పెంపొందింపజేయడం, పారిశ్రామిక సంభావ్య పరిశోధనలు నిర్వహించడం, వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమాలు, అభివృద్ధి బాంకుల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు మొదలైన ఎన్నో ప్రవర్తనా కార్యకలాపాలను చేపట్టి పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నది. ఈ కార్యకలాపాలను నిర్వహించడానికి నిధులను సమకూర్చడానికి 1977లో సాంకేతిక సహాయ నిధిని ఏర్పాటు చేయడం జరిగింది. బాంకు ఆర్జించిన లాభాల నుండి ఈ నిధికి నిధులను కేటాయించింది. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామికాభివృద్ధిని సాధించడానికి మిగతా అఖిల భారత స్థాయి విత్త సంస్థల, అభివృద్ధి బాంకుల సహకారంతో వెనుకబడిన ప్రాంతాల సర్వేలను 1970 లో చేపట్టింది. సరి అయిన ఉత్పాదక పరిశ్రమలను గుర్తించడానికి సహాయపడేందుకు అంతర సంస్థల సముదాయాలను ఏర్పాటు చేసింది.

ఉద్యమదారులకు కావలసిన సలహా సంప్రదింపులను సముచిత వ్యయాలను అందించడానికి మిగతా అభివృద్ధి బాంకుల సహకారంతో సాంకేతిక సంప్రదింపుల సంఘాలను నెలకొల్పింది. ఉద్యమదారుల ఉపయోగార్థం పారిశ్రామిక సంప్రదింపుదారుల డైరీని ప్రచురించింది. మిగతా అభివృద్ధి బాంకులు, స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారత వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (Entrepreneurship Development Institute of India) ను స్థాపించింది. ఈ సంస్థ వ్యవస్థాపనాభివృద్ధి పరిశోధనలు, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. భారత పెట్టుబడి కేంద్రం నుండి 5 వ్యవస్థాపక సలహా బ్యూరోలను చేపట్టింది. ఈ బ్యూరోలు వ్యవస్థాపనాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ వ్యవస్థాపకులకు సలహాలిస్తుంటాయి. మహారాష్ట్రలోని కజరత్‌లో నెలకొల్పబడిన గ్రామీణ వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (Rural Entrepreneurship Development Institute) కు గ్రాంటు ఇచ్చి సహాయపడుతుంది. పరిశ్రమలు లేని జిల్లాల పథకం (No Industry Districts) పథకాన్ని అమలుజేసి పరిశ్రమలు లేని జిల్లాలలో నెలకొల్పిన సంస్థలకు ఎన్నో రాయితీలను ఇచ్చి ప్రోత్సహిస్తుంది. పైన వివరించిన విధంగా భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు ఎన్నో ప్రవర్తనా కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

## 17.11.6 ముగింపు

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు పారిశ్రామిక విత్త సంస్థలకు శిఖరాగ్ర సంస్థగా దేశ పారిశ్రామికాభివృద్ధికి విశిష్టమైన సేవలను అందిస్తుంది. అభివృద్ధి బాంకుల కార్యకలాపాలను సమన్వయించి, అభివృద్ధి బాంకుల కార్యకలాపాలను సమన్వయించి, ప్రవర్తనా కార్యక్రమాలను అమలుపరచి, అభివృద్ధి బాంకుల నిధులను బలపరచి

BRAOU

సత్వర, సమగ్ర పారిశ్రామికాభివృద్ధికి పాటుపడుతున్నది. అయితే మిగతా విత్త సంస్థలవలే ఈ బాంకు విషయంలో కూడా నిధుల మంజూరు, విడుదలల మధ్య అంతరాలు ఎక్కువగా ఉంటున్నాయని గణాంక వివరాలు విశదపరుస్తున్నాయి. పారిశ్రామిక విత్తంలో ప్రధాన సంస్థగా ఈ బాంకు వెనుకబడిన ప్రాంతాల సంస్థలకు 40 శాతం కన్నా తక్కువ విత్త సహాయాన్నందించి తన లక్ష్యాన్ని నెరవేర్చలేకపోయింది. ఈ బాంకు ప్రత్యక్ష విత్తానికన్నా పరోక్ష విత్తానికి ప్రాధాన్యతను ఇవ్వడం ప్రశంసనీయం. తమ విత్త సహాయాన్ని ఎక్కువగా ప్రయివేటు రంగంలోని సంస్థలకు అందించడం, విస్తరణ, ఆధునికీకరణకు ఎక్కువ మొత్తంలో విత్తం సమకూర్చడం, మిగతా విత్త సంస్థల ఆర్థిక స్తోమతను పెంపొందించడంవంటి ఉత్పాదక విధానాలను అమలుజేసి పారిశ్రామిక ప్రగతికి గణనీయ సేవలను అందిస్తూంది.

## 17.12 భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు (Small Industries Development Bank of India)

భారత పారిశ్రామికాభివృద్ధి బాంకుకు అనుబంధ సంస్థగా భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాకు 1990లో ఒక ప్రత్యేక చట్టం ద్వారా నెలకొల్పబడింది. ఈ బాంకు 1990 ఏప్రిల్ 2 నుండి తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ బాంకు జాతీయ స్థాయిలో చిన్న పరిశ్రమల స్థాపనకు, అభివృద్ధి నిధుల సమీకరణకు, చిన్న పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడటమే ముఖ్య లక్ష్యంగా కలిగి వుంది. దీనికితోడు, చిన్న పరిశ్రమలకు విత్త సహాయం అందించే ఇతర సంస్థల విధులను సమన్వయ పరుస్తుంది. చిన్న పరిశ్రమలకు సంబంధించిన భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు నిర్వహించే కార్యకలాపాలను ఈ బాంకుకు బదిలీ చేయడం జరిగింది. చిన్న తరహా సంస్థల జాతీయ ఈక్విటీ నిధి నిర్వహణ ఈ బాంకుకు అప్పగించబడింది. ఈ బాంకు ప్రారంభంనుంచే గ్రామీణ, కుటీర, చిన్న పరిశ్రమలకు ప్రాధాన్యతను ఇస్తూ వివిధ కోణాల నుండి వాటిని అభివృద్ధి పరచడమే కేంద్ర లక్ష్యంగా ఈ బాంకు పనిచేస్తున్నది.

### 17.12.2 లక్ష్యాలు

భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు ఈ కింది లక్ష్యాలను కలిగి వుంది.

(1) ప్రస్తుతం నెలకొని వున్న చిన్న పరిశ్రమల సాంకేతికాభివృద్ధికి, వాటి ఆధునికీకరణకు సహాయపడటం;

(2) దేశీయ, విదేశీ మార్కెట్లో చిన్న పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను విస్తృతపరచడం;

(3) గ్రామీణ ప్రాంతాలలో చిన్న పరిశ్రమలను ప్రోత్సహించి, ఉద్యోగావకాశాలను పెంపొందించడం;

(4) చిన్న పరిశ్రమలకు విత్త సహాయమందించే సంస్థలకు నిధులను సమకూర్చి, వాటి కార్యకలాపాలను సమీక్షించడం.

### 17.12.2 విధులు

భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు చిన్న పరిశ్రమలకు అవసరమైన కాల ఋణాలను ఇస్తుంది. కౌలుదారీ సంస్థలకు ఋణాలను మంజూరు చేస్తుంది. చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ఋణాలకు ప్రతిగా విత్త సంస్థలకు, బాంకులకు పునర్విత్తం సమకూర్చుతుంది. యంత్ర సామగ్రి, మూలధన వస్తువుల వాయిదా చెల్లింపు బిల్లులను రీ-డిస్కౌంటింగ్ చేయడం ద్వారా చిన్న పరిశ్రమలకు దేశీయ యంత్రాలను, మూలధన వస్తువులను సప్లయ్ చేయిస్తుంది. ఇంతేగాక SEMFEX, మహిళా ఉద్యమ నిధి, జాతీయ ఈక్విటీ నిధి, మూల విత్త నిధికి నిధులను మంజూరు చేస్తుంది. ఈ బాంకు జాతీయ చిన్న పరిశ్రమల సంస్థ, రాష్ట్ర చిన్న తరహా పారిశ్రామికాభివృద్ధి సంస్థలు, రాష్ట్ర విత్త సంస్థలు, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు మొదలైన విత్త సంస్థల వనరుల సమీకరణలో సహాయపడుతుంది.

BRAOU

### 17.12.3 విత్త కార్యకలాపాలు

భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు 1993 మార్చి అంతానికి అనగా ప్రారంభించిన తర్వాత మొదటి మూడు సంవత్సరాలలో రూ. 8,163.0 కోట్ల విత్త సహాయం మంజూరు చేసింది. దానిలో 78.13 శాతం విత్త సంస్థలకు పునర్విత్తంగా ఇచ్చింది. బిల్లుల విత్తానికి 18.17 శాతం, కాల ఋణాలకు 1.42 శాతం, మిగతా విత్త సంస్థలకు 1.93 శాతం నిధులను మంజూరు చేసింది. ఈ బ్యాంకు మంజూరు చేసిన వివిధ రకాల విత్త సహాయం పట్టిక – 17.10 లో చూపబడింది.

పట్టిక–17.10 : భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు : మంజూరు చేసిన వివిధ రకాల విత్తసహాయం (రూ. కోట్లలో)

| స్కీమ్ | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| 1. పునర్విత్తం | 6378.0 | 78.13 |
| 2. బిల్లుల విత్తం (బిల్లుల డిస్కౌంటింగ్, రీ–డిస్కౌంటింగ్) | 1482.8 | 18.17 |
| 3. కాల ఋణాలు | 115.8 | 1.42 |
| 4. SEMFEX, మహిళా ఉద్యమ నిధి, జాతీయ ఈక్విటీ నిధి మొ॥ వాటికి ఈక్విటీ సహాయం | 28.6 | 0.35 |
| 5. జాతీయ చిన్న పరిశ్రమల సంస్థ, రాష్ట్ర విత్త సంస్థలు, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు మొ॥ సంస్థల వనరుల పటిష్టత | 157.8 | 1.93 |
| మొత్తం | 8163.0 | 100.00 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

BRAOU

**పరిశ్రమల వారీ విత్త సహాయం**

1993 మార్చి అంతానికి బ్యాంకు మంజూరు చేసిన సంచిత విత్త సహాయం రూ. 7,860.8 కోట్లలో ఎక్కువగా అనగా 23.79 శాతం సేవలకు సంబంధించిన పరిశ్రమలు పొందాయి. వస్త్ర పరిశ్రమకు 8.80 శాతం, ఆహారోత్పత్తులకు 8.29 శాతం, రసాయనాలు, రసాయనిక ఉత్పత్తులకు 8.11 శాతం, విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి 8.03 శాతం, యంత్రాల పరిశ్రమకు 5.56 శాతం, రవాణా సామాగ్రికి 4.70 శాతం మరియు లోహ ఉత్పత్తులకు 4.18 శాతం మంజూరు చేయబడింది.

**రాష్ట్రాల వారీ విత్త సహాయం**

1993 మార్చి చివరి నాటికి బ్యాంకు మంజూరు చేసిన మొత్తం విత్తంలో 14.82 శాతం మహారాష్ట్రలో నెలకొల్పబడిన చిన్న పరిశ్రమలకు, 14.09 శాతం గుజరాత్‌కు మంజూరు చేయబడింది. అనగా ఈ బ్యాంకు కూడా ఎక్కువ శాతం నిధులను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందిన ముంబాయి, అహ్మదాబాద్ వంటి నగరాలలో నిర్మించబడిన సంస్థలకే ఎక్కువ మొత్తంలో ఋణాలను ఇస్తుంది. తమిళనాడు రాష్ట్రానికి 10.59 శాతం, కర్నాటకకు 8.71 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 7.98 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌కు 6.78 శాతం, రాజస్థాన్‌కు 5.59 శాతం మంజూరు చేసింది. మరిన్ని వివరాలను పట్టిక – 17.11లో ఇచ్చాం.

పట్టిక–17.11 : భారత చిన్న పరిశ్రమల పారిశ్రామికాభివృద్ధి బాంకు : రాష్ట్రాలవారీ మంజూరు చేసిన విత్త సహాయం

(రూ. కోట్లలో)

| రాష్ట్రం | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| 1. మహారాష్ట్ర | 1165.0 | 14.82 |
| 2. గుజరాత్ | 1107.5 | 14.09 |
| 3. తమిళనాడు | 832.3 | 10.59 |
| 4. కర్నాటక | 684.8 | 8.71 |
| 5. ఉత్తర ప్రదేశ్ | 627.3 | 7.98 |
| 6. ఆంధ్ర ప్రదేశ్ | 533.1 | 6.78 |
| 7. రాజస్థాన్ | 439.5 | 5.59 |
| 8. కేరళ | 366.0 | 4.66 |
| 9. హర్యానా | 359.9 | 4.58 |
| 10. మధ్య ప్రదేశ్ | 331.8 | 4.22 |
| 11. పశ్చిమ బెంగాల్ | 314.7 | 4.00 |
| 12. ఇతర రాష్ట్రాలు | 1098.9 | 13.98 |
| మొత్తం | 7860.8 | 100.00 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

**ఉద్దేశాల వారీ విత్త సహాయం**

భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు 1993 మార్చి చివరి నాటికి మంజూరు చేసిన మొత్తం విత్తంలో 75.11 శాతం నూతన సంస్థలకే మంజూరు చేసింది. విస్తరణ, వైవిధ్యాలకు 8.51 శాతం, ఆధునికీకరణకు 6.37 శాతం, పునర్నిర్మాణానికి 0.48 శాతం, అనుబంధ సహాయంగా 9.53 శాతం విత్తం మంజూరు చేయబడింది.

**వెనుకబడిన ప్రాంతాలకు సహాయం**

1993 మార్చి అంతానికి బాంకు మంజూరు చేసిన రూ. 7,860.8 కోట్లలో వెనుకబడిన ప్రాంతాలలో ఏర్పాటుకాబడిన సంస్థలకు 34.66 శాతం మాత్రమే మంజూరు చేయడం జరిగింది. చిన్న పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి ప్రధాన అభివృద్ధి బాంకుగా వెనుకబడిన ప్రాంతాలలో చిన్న పరిశ్రమల అభివృద్ధికి కొన్ని రాయితీలిచ్చి ఎక్కువగా విత్త సహాయం అందించి చిన్న పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడాలి.

## 17.12.4 ముగింపు

భారత దేశ ఆర్థికాభివృద్ధిలో చిన్న పరిశ్రమల ప్రాముఖ్యతను గుర్తించి చిన్న పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేకంగా జాతీయ స్థాయి అభివృద్ధి బాంకు స్థాపించడం ఎంతైనా సమంజసం. ఈ బాంకు స్థాపించబడి మూడు సంవత్సరాలే అయినందున బాంకు పనితీరును మదింపు వేయడం కష్టం. కాని, గణాంక వివరాల ఆధారంగా పరిశీలిస్తే ఈ బాంకు విధానాలు మున్ముందు సత్ఫలితాలనిస్తాయని, చిన్న పరిశ్రమల అభివృద్ధికి విశిష్ట సేవలను అందించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తుంది.

BRAOU

## 17.13 రాష్ట్ర విత్త సంస్థలు (State Financial Corporations)

చిన్న తరహా, మధ్య తరహా పారిశ్రామిక సంస్థల వ్యవస్థాపనకు, విస్తరణకు విత్తం సమకూర్చడానికి రాష్ట్ర స్థాయిలో సంస్థల ఆవశ్యకతను భారత ప్రభుత్వం గుర్తించింది. 1948 భారత పారిశ్రామిక విత్త సంస్థను స్థాపించినప్పుడు, చిన్న తరహా, మధ్య తరహా పారిశ్రామిక సంస్థల అవసరాలను తీర్చడం కోసం ప్రత్యేక సంస్థల ఏర్పాటు అవసరమని భావించింది. దాని ఫలితంగా 1951 లో పార్లమెంటు రాష్ట్ర విత్త సంస్థల చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం 1952 ఆగస్టు 1 నుండి అమలులోకి వచ్చింది. వివిధ రాష్ట్రాలు రాష్ట్ర విత్త సంస్థలను ఏర్పాటు చేశాయి. మొట్ట మొదటగా రాష్ట్ర విత్త సంస్థను పంజాబ్ రాష్ట్రం ప్రారంభించింది. భారత దేశంలో ప్రస్తుతం 18 రాష్ట్ర విత్త సంస్థలు పని చేస్తున్నాయి. కార్యకలాపాల పరిధిలో తేడాలు తప్ప ఈ సంస్థలు కూడా భారత పారిశ్రామిక విత్త సంస్థ వలే పని చేస్తాయి. భారత పారిశ్రామిక విత్త సంస్థ భారీ పరిశ్రమలకు సహాయపడగా, రాష్ట్ర విత్త సంస్థలు మధ్య తరహా, చిన్న తరహా పరిశ్రమలకు సహాయపడుతాయి. ఆయా రాష్ట్ర విత్త సంస్థలు ఆయా రాష్ట్రాలకే పరిమితం.

### 17.13.1 లక్ష్యాలు

బాంకులనుండి, ఇతర సాధారణ విత్త సంస్థలనుండి ఋణ సౌకర్యం పొందలేని చిన్న పారిశ్రామిక సంస్థలకు అవసరమైన మధ్యకాలిక, దీర్ఘకాలిక ధన సహాయం అందించడమే రాష్ట్ర విత్త సంస్థల ముఖ్య లక్ష్యం. ఉన్నటువంటి సంస్థల విస్తరణకు, ఆధునికీకరణకు, పునరుద్ధరణకు ఆర్థిక సహాయాన్ని అందించడం ఈ సంస్థల ముఖ్య ధ్యేయం. ఏ రకమైన సంస్థకయినా అనగా ప్రయివేటు సంస్థకుగాని, ప్రభుత్వ సంస్థకుగాని, భాగస్వామ్య సంస్థకుగాని ఈ విత్త సంస్థలు ఋణ సహాయం చేస్తాయి. రాష్ట్ర విత్త సంస్థల చట్టం, సెక్షన్ 2 (సి) ప్రకారం మైనింగ్, హోటళ్ళు, రోడ్డు రవాణా, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, పంపిణీ, పారిశ్రామిక వాడల అభివృద్ధి, షిప్పింగ్, వస్తువుల ఉత్పత్తి, ప్రాసెసింగ్, నిల్వ చేయడం మొదలైన కార్యకలాపాలకు సంబంధించిన ఏ సంస్థకయినా రాష్ట్ర విత్త సంస్థలు సహాయం అందించవచ్చు.

### 17.13.2 విధులు

రాష్ట్ర విత్త సంస్థలు కింద సూచించిన విధులను నిర్వర్తిస్తాయి.

1. ఈ సంస్థలు 20 సంవత్సరాలకు మించకుండా పారిశ్రామిక సంస్థలకు ఋణాలివ్వడం, వాటి డిబెంచర్లకు చందాకట్టడం;
2. ఆమోదయోగ్యమైన షరతులపై తీసుకున్న 20 సంవత్సరాలలోపు తిరిగి చెల్లించే ఋణాలకు హామీలివ్వడం;
3. మూలధన సామాగ్రి, యంత్రాల సప్లయ్‌లకు సంబంధించిన విలంబిత చెల్లింపులకు హామీలివ్వడం;
4. మార్కెట్లో 7 సంవత్సరాలలోపు పరిష్కరించబడే షరతుపై పారిశ్రామిక సంస్థల వాటాలకు, బాండ్లకు, డిబెంచర్లకు పూచీ ఇవ్వడం;
5. వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన చిన్న పారిశ్రామిక సంస్థల ఈక్విటీ మూలధనంలో పాల్గొనడం.

పై విధులతోబాటు రాష్ట్ర విత్త సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, భారత పారిశ్రామికాభివృద్ధి బాంకుకు ఏజెంట్లుగా కూడా వ్యవహరిస్తాయి.

### 17.13.3 మూలధన నిర్మాణం

రాష్ట్ర విత్త సంస్థల అధీకృత మూలధనం రూ. 10 కోట్లు. ఈ గరిష్ట పరిమితిని మించకుండా ఈ సంస్థల మూలధనాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తాయి. రాష్ట్ర విత్త సంస్థలు జారీ చేసే వాటాలకు డివిడెండ్లు, అసలు

BRAOU

తిరిగి చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వాలు హామీలిస్తాయి. రాష్ట్ర విత్త సంస్థల మూలధనంలో నాలుగింట మూడు వంతులు రాష్ట్ర ప్రభుత్వం, రిజర్వు బాంకు, షెడ్యూలు బాంకులు, సహకార బాంకులు, భీమా కంపెనీలు ముందు నిర్ణయించబడిన నిష్పత్తిలో సమకూర్చుతాయి. మిగిలిన నాలుగో వంతు మూలధనాన్ని ప్రజలకు జారీ చేస్తారు. ఋణాల - ఈక్విటీల నిష్పత్తి 10:1 దాటకుండా రాష్ట్ర విత్త సంస్థలు తమ నిధులను సమీకరించడానికి బాండ్లు, డిబెంచర్లను జారీ చేయవచ్చు. రాష్ట్ర విత్త సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల నుండి, రిజర్వు బాంకు నుండి, స్థానిక సంస్థల నుండి, ప్రజల నుండి డిపాజిట్లను పొందే అధికారం కల్గివున్నాయి. అంతేగాక రిజర్వు బాంకు, వాణిజ్య బాంకులు, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అవసరమైనప్పుడు రాష్ట్ర విత్త సంస్థలు ఋణాలను పొందవచ్చు. చిన్న పరిశ్రమలకు తాను ఇచ్చిన ఋణాలకు ప్రతిగా భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు నుండి పునర్విత్తం పొంది తమ వనరులను పెంచుకోవచ్చు.

### 17.13.4 విత్త కార్యకలాపాలు

భారతదేశంలోని రాష్ట్ర విత్త సంస్థలు మంజూరు చేసి విడుదల చేసిన విత్త సహాయ వివరాలు పట్టిక 17.12లో ఇవ్వబడినవి.

పట్టిక – 17.12 : రాష్ట్ర విత్త సంస్థలు మంజూరుచేసి, విడుదల చేసిన విత్త సహాయం (రూ. కోట్లలో)

| సంవత్సరం | మంజూరు చేసిన మొత్తం | విడుదల చేసిన మొత్తం |
|---|---|---|
| 1965–66 | 25.3 | 18.0 |
| 1970–71 | 49.6 | 33.5 |
| 1980–81 | 370.5 | 248.0 |
| 1986–87 | 1210.8 | 791.9 |
| 1990–91 | 1863.9 | 1270.8 |
| 1991–92 | 2190.3 | 1536.8 |
| 1992–93 | 2025.4 | 1569.7 |
| మార్చి 1993 నాటికి సంచితమైన మొత్తం | 15491.8 | 11909.6 |

Source : *Report on Development Banking in India,* 1992–93, IDBI, Bombay

BRAOU

1993 మార్చి అంతానికి రాష్ట్ర విత్త సంస్థలు రూ. 15,491.8 కోట్లు మంజూరు చేయగా, రూ. 11,909.6 కోట్లు మాత్రం విడుదల చేయబడింది. పారిశ్రామిక సంస్థలకు అందించే విత్త సహాయం క్రమంగా పెరుగుతూ వుంది. రాష్ట్ర విత్త సంస్థలు అందించిన వివిధ రకాల విత్త సహాయాన్ని సమీక్షిస్తే మొత్తం సంచిత విత్త సహాయంలో 99.27 శాతం రూపాయి ఋణాలుగా ఇవ్వడం జరిగింది. మూల విత్తం, ప్రత్యేక మూలధన పథకాలకు 0.58 నిధులను మంజూరు చేసింది. దీనిని బట్టి చూస్తే రాష్ట్ర విత్త సంస్థలు కేవలం చిన్న పరిశ్రమలకు ఋణాల రూపంలో సహాయపడతాయి.

**పరిశ్రమలవారీ విత్త సహాయం**

1993 మార్చి అంతానికి రాష్ట్ర విత్త సంస్థలచే మంజూరు చేయబడిన రూ. 15,491.8 కోట్లలో, 14.40 శాతం సేవా పరిశ్రమలకు, 11.78 శాతం రసాయనాలు, రసాయనిక ఉత్పత్తుల పరిశ్రమలకు, 10.72 శాతం ఆహార ఉత్పత్తుల పరిశ్రమకు మరియు 10.05 శాతం వస్త్ర పరిశ్రమకు మంజూరు చేయడం జరిగింది.

**రాష్ట్రాల వారీ విత్త సహాయం**

రాష్ట్ర విత్త సంస్థలు 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచితమైన ధన సహాయంలో 11.48 శాతం గుజరాత్ రాష్ట్రానికి, 11.27 శాతం కర్నాటకకు, 10.13 శాతం మహారాష్ట్రకు చెందింది. మొత్తం విత్తంలో 10.05 శాతం ఆంధ్ర ప్రదేశ్, 9.84 శాతం తమిళనాడు, 9.39 శాతం ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర విత్త సంస్థలు మంజూరు చేశాయి. రాజస్థాన్ రాష్ట్ర విత్త సంస్థ 1993 వరకు రూ. 987.4 కోట్లు మంజూరు చేయగా, బీహార్ రాష్ట్ర విత్త సంస్థ రూ. 716.9 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర విత్త సంస్థలవారీ మంజూరైన విత్త సహాయ వివరాలు పట్టిక 17.13లో ఇవ్వబడినాయి.

పట్టిక – 17.13 : రాష్ట్ర విత్త సంస్థలు మంజూరుచేసి, విడుదల చేసిన విత్త సహాయం (రూ. కోట్లలో)

| రాష్ట్రం | 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన సంచిత విత్త సహాయం | శాతం |
|---|---|---|
| 1. గుజరాత్ | 1771.9 | 11.43 |
| 2. కర్నాటక | 1746.5 | 11.27 |
| 3. మహారాష్ట్ర | 1569.4 | 10.13 |
| 4. ఆంధ్ర ప్రదేశ్ | 1556.8 | 10.05 |
| 5. తమిళనాడు | 1524.0 | 9.84 |
| 6. ఉత్తర ప్రదేశ్ | 1454.2 | 9.39 |
| 7. రాజస్థాన్ | 987.4 | 6.37 |
| 8. బీహార్ | 716.9 | 4.63 |
| 9. ఒరిస్సా | 609.9 | 3.94 |
| 10. కేరళ | 641.0 | 4.14 |
| 11. పంజాబ్ | 574.3 | 3.71 |
| 12. మధ్య ప్రదేశ్ | 531.0 | 3.43 |
| 13. హర్యానా | 512.7 | 3.31 |
| 14. ఇతర రాష్ట్రాలు | 1295.8 | 8.36 |
| మొత్తం | 15491.8 | 100.00 |

Source : *Report on Development Banking in India*, 1992–93, IDBI, Bombay

**పరిమాణంవారీ ఋణ సహాయం**

రాష్ట్ర విత్త సంస్థలు 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన ఋణాలలో ఒక సంస్థకు రూ. 1 లక్షకు లోబడి ధన సహాయం ఇచ్చిన సంస్థలు 2,90,328. రాష్ట్ర విత్త సంస్థలు ఋణ సహాయం చేసిన సంస్థల (5,30,292)లో ఇవి 54.73 శాతం. మొత్తం సహాయం పొందిన సంస్థలలో 31.34 శాతం రూ. 1 లక్ష నుండి రూ. 5 లక్షల మేరకు ఋణాలను పొందాయి. పై వివరాలను బట్టి చూస్తే రాష్ట్ర విత్త సంస్థలు ఎక్కువగా చిన్న మొత్తాలలో ఎక్కువ సంస్థలకు ఋణ సహాయం అందించడానికే ప్రాముఖ్యతను ఇస్తున్నాయి. రాష్ట్ర విత్త సంస్థలు మంజూరు చేసిన సంచిత ధన సహాయంలో 80.2 శాతం చిన్న పరిశ్రమలకు ఇచ్చింది. మొత్తం సహాయం పొందిన 5,30,292 సంస్థలలో 92.4 శాతం చిన్న పరిశ్రమలే. మొత్తం సంచిత ధన సహాయంలో 84.22 శాతం నూతన

B R A O U

సంస్థలకు ఇవ్వగా, 10.19 శాతం సంస్థల విస్తరణకు, వైవిధ్యానికి మంజూరు చేసినాయి. రాష్ట్ర విత్త సంస్థలు అర్హత కలిగిన, సాంకేతిక నైపుణ్యంగల ఉద్యమదారులకు కావలసిన మూల విత్తం సమకూర్చేందుకు ప్రత్యేక నిధి సహాయం (Special Capital Assistance) పథకాన్ని అమలుజేస్తున్నాయి.

### 17.13.5 ముగింపు

పైన విశ్లేషించిన వివరాలను సమీక్షించగా, రాష్ట్ర విత్త సంస్థలు వైవిధ్య పారిశ్రామిక సంస్థలకు, చిన్న పరిశ్రమలకు ఉపయుక్తమైన సేవలను అందిస్తున్నాయి. అన్ని రాష్ట్ర విత్త సంస్థలలో ముఖ్యంగా గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల విత్త సంస్థలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. రాష్ట్ర విత్త సంస్థలు ప్రాంతీయాభివృద్ధి బాంకులకు, పారిశ్రామిక సంస్థలకు నిధులను సమీకరించి సహాయపడటానికి బదులు ఎక్కువగా ఋణాలను ఇవ్వడానికే పరిమితమైనాయి. చాలా వరకు ఇచ్చిన ఋణాలపై తగిన నిఘా లేక ఋణాలు దుర్వినియోగమౌతున్నాయి. రాష్ట్ర విత్త సంస్థలు అందించిన ఋణాలను చాలా సంస్థలు తిరిగి చెల్లించడంలో విఫలమై ఈ సంస్థలు చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. అభివృద్ధి బాంకుగా రాష్ట్ర విత్త సంస్థలు పరిశ్రమలకు ఉపయోగకరమైన ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తే ఆ సంస్థలు తమ లక్ష్య సాధనలో సఫలీకృతమౌతాయి.

## 17.14 ఇతర అభివృద్ధి బాంకులు

### 17.14.1 భారత పారిశ్రామిక పునర్నిర్మాణ బాంకు

గతంలో ఖాయిలాపడిన, మూతపడిన పారిశ్రామిక సంస్థలకు విత్త సహాయం అందిస్తున్న భారత పారిశ్రామిక పునర్నిర్మాణ సంస్థను పునర్వ్యవస్థీకరించి IRBI చట్టం, 1984 ప్రకారం, 1985లో భారత పారిశ్రామిక పునర్నిర్మాణ బాంకు స్థాపించబడింది. ఈ బాంకు ఖాయిలాపడిన, మూతపడిన పారిశ్రామిక సంస్థలచే ముఖ్య వ్యవస్థగా రూపొందించబడింది. ఈ బాంకు సంస్థలకు కావలసిన ఋణాలను ఇవ్వడం, సంస్థల వాటాలకు, డిబెంచర్లకు పూచీదారుగా వ్యవహరించడం, ఋణాలకు, వాయిదా చెల్లింపులకు హామీలివ్వడం మొదలైన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. యంత్ర సామగ్రిని లీజు పద్ధతిలో ఏర్పాటు చేయడం, వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేయడం, సామాగ్రి విత్తం, అవస్థాపనా పద్ధతులు కల్పించడం, యాజమాన్య, మార్కెటింగ్ సేవలను అందించడం వంటి కార్యక్రమాలను చేపడుతుంది.

BRAOU

ఈ బాంకు 1993 మార్చి అంతానికి మంజూరు చేసిన విత్త సహాయం రూ. 1,785.2 కోట్లు కాగా, రూ. 1,288.3 కోట్లు విడుదల చేయడం జరిగింది. మొత్తం మంజూరైన రూ. 1,785.2 కోట్లలో 95.5 శాతం ఋణాల రూపంలో ఇవ్వడం జరిగింది. ఈ బాంకు పారిశ్రామిక సంస్థలకు ప్రత్యక్షంగా రూ. 1,766.2 కోట్ల విత్త సహాయం చేసింది. అందులో వస్త్ర పరిశ్రమకు 24.53 శాతం, రసాయనాలు, రసాయనిక ఉత్పత్తులకు 9.18 శాతం, మూల లోహాల పరిశ్రమకు 10.29 శాతం ఇవ్వడం జరిగింది. మొత్తం మంజూరైన విత్తంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం 24.10 శాతం, మహారాష్ట్ర 14.51 శాతం, తమిళనాడు 11.74 శాతం మేరకు పొందాయి. వెనుకబడిన ప్రాంతాలలో నిర్మితమైన సంస్థలకు మొత్తం మంజూరైన విత్తంలో 29.18 శాతం ఇవ్వబడింది. ఈ బాంకు ఎక్కువ శాతం నిధులను ప్రయివేటు రంగంలోని సంస్థలకు ఇచ్చింది.

### 17.14.2 రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు

మధ్యతరహా, భారీ పరిశ్రమలను ప్రోత్సహించి అభివృద్ధి పరచడానికి రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో 1996-70 ల మధ్య కంపెనీల చట్టం, 1956 క్రింద రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు నెలకొల్పబడినవి. ఈ

సంస్థలు, ఆయా రాష్ట్రాలలో పెట్టుబడులను ప్రోత్సహించి అభివృద్ధికి తోడ్పడుతాయి. ఈ సంస్థలు కాల ఋణాలివ్వడం ద్వారా, పూచీగారుగా, ప్రత్యక్ష చందాల రూపంలో, హామీదారుగా పారిశ్రామిక సంస్థలకు అవసరమైన నిధులను ఏర్పాటు చేయడమేగా ఎన్నో ప్రవర్తనాపరమైన కార్యక్రమాలు అనగా పారిశ్రామిక సంభావ్య పరిశోధనలు, వ్యవస్థాపనాభివృద్ధి కార్యక్రమాలు, పారిశ్రామిక వాడల అభివృద్ధిలాంటి కార్యకలాపాలను చేబట్టి రాష్ట్ర స్థాయిలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఈ సంస్థలు తమ విధి నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ ఏజంట్లుగా కూడా వ్యవహరిస్తాయి. ప్రస్తుతం మన దేశంలో 28 రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు పని చేస్తున్నాయి. వాటిలో 11 రాష్ట్ర విత్త సంస్థలుగా కూడా వ్యవహరిస్తున్నాయి.

ఈ సంస్థలు 1993 మార్చి నెలాంతానికి సంచితంగా రూ. 7,402.7 కోట్లు మంజూరు చేయగా అందులో రూ. 5,658.8 కోట్లు విడుదల చేయడం జరిగింది. మొత్తం మంజూరైన విత్త సహాయంలో 85.46 శాతం రూపాయి ఋణాలలో మంజూరు చేశాయి. మొత్తం విత్తంలో రసాయనాలు, రసాయనిక ఉత్పత్తుల పరిశ్రమకు 15.64 శాతం, వస్త్ర పరిశ్రమకు 13.85 శాతం, ఆహార వస్తువుల పరిశ్రమకు 9.15 శాతం, మూల లోహ పరిశ్రమకు 7.16 శాతం ఋణాలుగా మంజూరు చేయబడినవి.

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థలు మంజూరు చేసిన సంచిత ధన సహాయంలో 56.8 శాతం వెనుకబడిన ప్రాంతాలలోని యూనిట్లకు అందింది. ఈ సంస్థలు 83.66 శాతం మంజూరైన ఋణాలను ప్రయివేటు రంగ సంస్థలకు కేటాయించాయి. మొత్తం మంజూరైన విత్తంలో 64.42 శాతం నూతన సంస్థలకు, 20.95 శాతం విస్తరణ, వైవిధ్యాలకు ఇవ్వబడింది. పైన వివరించిన అంశాల దృష్ట్యా పరిశీలిస్తే, ఈ సంస్థలు రాష్ట్ర స్థాయిలో పారిశ్రామిక సంస్థలకు కావలసిన ఋణాలను అందించి, వెనుకబడిన ప్రాంతాలలోని యూనిట్లకు అధిక శాతం ఋణాలను మంజూరుచేసి, ఎక్కువ శాతం ప్రయివేటు రంగంలోని సంస్థలకు ఇవ్వడం ద్వారా ఆయా రాష్ట్రాల పారిశ్రామికాభివృద్ధికి గణనీయమైన సేవలందిస్తున్నాయి.

## 17.15 పెట్టుబడి సంస్థలు (Investment Institutions)

### 17.15.1 యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

భారత దేశంలో ముఖ్యమైన పెట్టుబడి సంస్థలు – యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, భారత జీవిత భీమా సంస్థ, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా. యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సంస్థాగత పెట్టుబడి సంస్థలలో అతి ముఖ్యమైన సంస్థ. పెట్టుబడి మార్కెట్‌లోకి ప్రజల స్వల్ప మొత్తాల పొదుపులను సమీకరించి పరిశ్రమలకు కావలసిన మూలధనాన్ని పెంచడానికి ఈ సంస్థ యొక్క ఆవశ్యకతను ష్రాఫ్ (Shroff) కమిటీవారు 1954 లో తమ నివేదికలో పేర్కొన్నారు. కాని ఆ కమిటీ సలహాలను ప్రభుత్వం గుర్తించలేదు. 1962 లో చైనా దురాక్రమణ తర్వాత పరిశ్రమలకు అవసరమైన మూలధనానికి తీవ్ర కొరత ఏర్పడింది. అప్పుడు పెట్టుబడి సంస్థల ప్రాముఖ్యతను గుర్తించి, 1964 లో యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం, 1964 జులై 1 నుండి ఈ సంస్థ తమ విధులను ప్రారంభించింది. ప్రజల పొదుపులను సేకరించి, పారిశ్రామిక సంస్థల పెట్టుబడులుగా వాటిని మళ్ళించి, పొదుపుదార్లకు భద్రత, ద్రవ్యత, లాభదాయకత వంటి ప్రయోజనాలను కల్పించి వ్యక్తుల పొదుపులను ప్రేరేపించడం, పారిశ్రామిక సంస్థల వాటాలలో, సెక్యూరిటీలలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ సంస్థ ముఖ్య ఆశయం.

ఈ సంస్థ రూ. 5 కోట్ల మూలధనంతో ప్రారంభించబడింది. అందులో రిజర్వు బాంకు రూ. 2.5 కోట్లు, జీవిత భీమా సంస్థ 0.5 కోట్లు, స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా రూ. 0.75 కోట్లు మరియు షెడ్యూల్డు బాంకులు, ఇతర

సంస్థలు రూ. 1 కోటి పెట్టుబడి పెట్టాయి. దీనికి తోడు యూనిట్ల అమ్మకం ద్వారా సంస్థ వనరులను పెంపొందించుకొంటుంది. అవసరమైనప్పుడు రిజర్వు బాంకు నుండి ఋణాలను తీసుకొంటుంది. యూనిట్ ట్రస్టు యొక్క సాధారణ పరిపాలన, నిర్దేశనం, కార్యకలాపాల నిర్వహణ ట్రస్టీల బోర్డు నిర్వహిస్తుంది. ఈ సంస్థ 1964 లో మొదటి యూనిట్ స్కీమును ప్రారంభించి ఎన్నో స్కీముల ద్వారా ప్రజల పొదుపులను సేకరించింది. ఈ విధంగా సేకరించిన పొదుపులను పారిశ్రామిక పెట్టుబడులుగా మళ్ళించి పొదుపుదార్లకు సముచిత ఆదాయాన్ని పంచి పెడుతుంది.

1993 మార్చి అంతానికి యూనిట్ ట్రస్ట్ పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేసిన సంచిత విత్త సహాయం రూ. 19,396.8 కోట్లు, అందులో రూ. 14,611.6 కోట్లు విడుదల చేయబడింది. పారిశ్రామిక సంస్థలకు వివిధ స్కీముల ద్వారా ప్రత్యక్షంగా చేసిన విత్త సహాయం రూ. 16,052.8 కోట్లు కాగా, అందులో ప్రత్యేక డిపాజిట్లుగా రూ. 3,354 కోట్లు మంజూరు చేయబడింది. 1993 మార్చి అంతానికి మంజూరైన సంచిత ఋణాలలో రసాయనాలు, రసాయనిక ఉత్పత్తుల పరిశ్రమకు 15.82 శాతం, సేవా పరిశ్రమలకు 9.14 శాతం, విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి 7.58 శాతం మంజూరు చేయబడ్డాయి. మొత్తం మంజూరైన రూ. 16,052.8 కోట్లలో 38.58 శాతం కేవలం ఒక్క మహారాష్ట్ర రాష్ట్రంలోని పరిశ్రమలకు అందినవి. మిగిలిన రాష్ట్రాలలో గుజరాత్ రాష్ట్రానికి 9.06 శాతం, ఉత్తర ప్రదేశ్‌కు 5.60 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌కు 5.26 శాతం, తమిళనాడుకు 4.88 శాతం మంజూరు చేసింది. మొత్తం మంజూరైన విత్తంలో ప్రయివేటు రంగంలోని సంస్థలకు 64.35 శాతం ఇవ్వబడింది.

## 17.15.2 భారత జీవిత భీమా సంస్థ (Life Insurance Corporation of India)

ప్రయివేటు సంస్థల జీవిత భీమా వ్యాపారాలను జాతీయం చేసి, ఆ నిధులను ప్రణాళికా ప్రాధాన్యతగల రంగాలకు మరల్చడానికి LIC చట్టం, 1956 ప్రకారం భారత జీవిత భీమా సంస్థ నెలకొల్పబడింది. జీవిత భీమా సంస్థ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని వ్యక్తులకు, గ్రూపులకు ఉపయోగపడే విధంగా వైవిధ్యంగల ఎన్నో భీమా పథకాలను నిర్వహిస్తుంది. ఈ సంస్థ 75 శాతానికి తగ్గకుండా తమ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీలపై పెట్టుబడి పెట్టవలసి ఉంది. దీనికి తోడు ఈ సంస్థ గృహ నిర్మాణం, గ్రామీణ విద్యుదీకరణ, నీటి సరఫరా పథకాలు, సాంఘిక పథకాలకు ఋణాలను ఇస్తుంది. ఈ సంస్థ కార్పొరేటు రంగానికి ఋణాల ద్వారా, పూచీదారు, ప్రత్యక్ష చందాల ద్వారా సంస్థలకు నిధులను ఏర్పాటు చేస్తుంది.

1993 మార్చి అంతానికి జీవిత భీమా సంస్థ కార్పొరేట్ రంగానికి మంజూరు చేసిన సంచితమైన ధన సహాయం రూ. 7,589.1 కోట్లు, అందులో విడుదలైన మొత్తం రూ. 5,714.1 కోట్లు. మొత్తం మంజూరైన విత్తంలో 32.41 శాతం ఋణాల రూపంలో, 53.75 శాతం పూచీదారుగా, ప్రత్యక్ష చందాల ద్వారా సమకూర్చింది. మిగిలిన 13.84 శాతం మిగతా విత్త సంస్థలకు ఋణాల రూపంలో ఇచ్చింది. ఈ సంస్థ పారిశ్రామిక సంస్థలకు మంజూరు చేసిన ప్రత్యక్ష ధన సహాయం రూ. 6,539.1 కోట్లు కాగా అందులో రసాయనాలు, రసాయనిక ఉత్పత్తుల పరిశ్రమకు 20.00 శాతం, వస్త్ర పరిశ్రమకు 15.40 శాతం, యంత్రాల పరిశ్రమకు 16.51 శాతం, మూల లోహాల పరిశ్రమకు 13.46 శాతం మంజూరు చేయబడింది. సంస్థ మంజూరు చేసిన సంచిత సహాయంలో 25.72 శాతం మహారాష్ట్రకు, 14.82 శాతం గుజరాత్‌కు ఇవ్వబడింది. సంస్థ తాను మంజూరు చేసిన విత్త సహాయంలో 76.65 శాతం ప్రయివేటు రంగానికి మంజూరు చేసింది. ఈ సంస్థ నూతన సంస్థలకు, సంస్థల విస్తరణకు, ఆధునీకరణకు ధన సహాయం చేస్తుంది.

BRAOU

### 17.15.3 జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

1973లో దేశంలో సాధారణ భీమా సంస్థలను జాతీయం చేయడం ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్థాపించబడింది. ఈ కార్పొరేషన్, దాని యొక్క నాలుగు అనుబంధ సంస్థలు కలసి వివిధ స్కీములను అమలు చేస్తాయి. భీమా చట్టం, 1938 మరియు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఈ భీమా సంస్థలు తమ పెట్టుబడి నిధులలో 70 శాతం సాంఘిక ప్రాధాన్యతగల రంగాలలో పెట్టుబడి పెట్టాలి. 1976 నుండి ఈ సంస్థ కార్పొరేటు రంగంలోని పారిశ్రామిక సంస్థలకు ఋణాల రూపంలో, పూచీదారుగా, ప్రత్యక్ష చందాల ద్వారా నిధుల సమీకరణకు ఉపయోగపడుతుంది. 1993 మార్చి అంతానికి ఈ సంస్థ, దాని అనుబంధ సంస్థలు కలిసి పెట్టిన పెట్టుబడులు రూ. 7,368.3 కోట్లు. 1993 మార్చి అంతానికి కార్పొరేటు రంగంలో సంస్థలకు మంజూరు చేసిన సంచిత విత్త సహాయం రూ. 2,742.6 కోట్లు. ఈ సంస్థ పారిశ్రామిక యూనిట్లకు ప్రత్యక్షంగా ఋణాలివ్వడానికి బదులు, పూచీదారుగా లేక ప్రత్యక్ష చందాల ద్వారా నిధులను సమకూర్చడానికి ప్రాముఖ్యత ఇస్తుంది. 1991-92 లో సంస్థ మంజూరు చేసిన రూ. 657.2 కోట్లలో 30.74 శాతం ఋణాల రూపంలో మంజూరు చేసింది . మిగిలిన 69.26 శాతం పూచీదారుగా, ప్రత్యక్ష చందాల ద్వారా సహాయం అందించింది. 1992-93 లో మంజూరైన రూ. 464.1 కోట్లలో 24.97 శాతం ఋణాలుగా మంజూరు చేసింది.

1992-93లో మంజూరైన రూ. 464.1 కోట్లలో మూల లోహ పరిశ్రమకు 22.4 శాతం, వస్త్ర పరిశ్రమకు 21.8 శాతం, యంత్రాల పరిశ్రమకు 12.6 శాతం, రసాయనాలు, రసాయనిక ఉత్పత్తులకు విత్తంలో 7.3 శాతం మంజూరు చేయబడింది. 1992 - 93 లో మంజూరైన 38.46 శాతం మహారాష్ట్రకు, 19.52 శాతం గుజరాత్‌కు, 9.74 శాతం పశ్చిమ బెంగాల్‌కు మంజూరు చేయడం జరిగింది. 83.30 శాతం విత్త సహాయం ప్రయివేటు రంగానికి మంజూరు చేసింది. అధిక శాతం నిధులు సంస్థల విస్తరణ, ఆధునీకరణకు వినియోగించడం జరిగింది.

## 17.16 సారాంశం

భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం సత్వర పారిశ్రామికాభివృద్ధి కోసం 1948లో భారత పారిశ్రామిక విత్త సంస్థ స్థాపనతో మొదలయి ఎన్నో అభివృద్ధి బాంకులు నెలకొల్పబడినాయి. వైవిధ్యమైన పరిశ్రమలకు, వివిధ రకాల విత్తపరమైన, ప్రవర్తనాపరమైన సేవలను అందించి పారిశ్రామికాభివృద్ధికి విశిష్టమైన సేవలను అందిస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పిన పరిశ్రమలను ప్రోత్సహించడం, ప్రయివేటు రంగ పరిశ్రమలకు ప్రాధాన్యతను ఇవ్వడం, సంస్థల విస్తరణకు, ఆధునికీకరణకు చేయూతనివ్వడం, ఉద్యమదారులకు శిక్షణ ఇవ్వడం లాంటి ఎన్నో ఉపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహించి, పారిశ్రామిక నిర్మాణంలోగల అవధులను పూడ్చి సమగ్ర పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. భవిష్యత్తులో అభివృద్ధి బాంకులు ఎక్కువగా సాంప్రదాయేతర పరిశ్రమలకు, సాంకేతికాభివృద్ధికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చి దేశ ఆర్థికాభివృద్ధికి ముఖ్య సాధనాలుగా కృషి చేస్తాయని ఆశిస్తాం.

## 17.17 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు సుమారు 40 పక్తుల చొప్పున జవాబులిమ్ము.

1. భారత దేశంలో అభివృద్ధి బాంకుల పనితీరును, పారిశ్రామికాభివృద్ధిలో వాటి సేవలను మదింపు వేయండి.
2. భారత పారిశ్రామిక విత్త సంస్థ విధులు, విత్తపరమైన కార్యకలాపాలను సమీక్షించండి.

3. భారత పారిశ్రామిక పరపతి, పెట్టుబడి సంస్థ మూలధన నిర్మాణం, విత్తపరమైన, ప్రవర్తనాపరమైన కార్యక్రమాలను వివరించండి.

4. భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు విధులను, దాని పనితీరును, పారిశ్రామికాభివృద్ధిలో ఆ బాంకు పాత్రను విశ్లేషించండి.

5. రాష్ట్ర విత్త సంస్థల లక్ష్యాలను, విధులను తెలియజేస్తూ, పరిశ్రమలకు ఆ సంస్థలు అందించే సేవలను వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు సుమారు 20 పక్తుల చొప్పున జవాబులిమ్ము.**

1. అభివృద్ధి బాంకులను నిర్వచించి, వాటి విధులను వివరించండి.

2. ఆర్థిక వృద్ధి సిద్ధాంతాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆర్థిక వృద్ధిలో అభివృద్ధి బాంకుల పాత్రలను వివరించండి.

3. భారత దేశంలో అభివృద్ధి బాంకుల జననం, వాటి వృద్ధి గురించి చర్చించండి.

4. పెట్టుబడి సంస్థల విధులను, అవి పరిశ్రమలకు అందించే సేవలను సమీక్షించండి.

## 17.18 సంప్రదింపు గ్రంథాలు


1. Reports on Development Banking in India, Industrial Development Bank of India, Bombay.
2. Annual Reports of Industrial Finance Corporation of India.
3. Annual Reports of Industrial Credit and Investment Corporation of India.
4. R.M. Saxena – Development Banking in India.
5. Prabhu N. Singh – Role of Development Banks in a Planned Economy, Vikas Publishing House, Delhi, 1974.
6. V. Lakshmana Rao – Progress of Development Banking in India, Chugh Publications, Allahabad, 1986.
7. S.L.N. Sinha – Development Banking in India, Institute of Financial Management and Research, Madras, 1976.
8. William Diamond – Development Banks, John Hopkins Press, Baltimore, 1957.
9. S.K. Basu – The Thoery and Practice of Development Banking : A Study in the Asian Context, Asia Publishing House, New York, 1965.


## 17.19 పదకోశం

| | | |
|---|---|---|
| Natural growth rate | : | సహజ వృద్ధి రేటు |
| Warranted growth rate | : | సంభావ్య వృద్ధి రేటు |
| Unorganised sector | : | అసంఘటిత రంగం |
| Promotional activities | : | ప్రవర్తనాపరమైన కార్యకలాపాలు |
| Financial activities | : | విత్తపరమైన కార్యకలాపాలు |

BRAOU

| | | |
|---|---|---|
| Underwriter | : | పూచీదారు |
| Guarantees | : | హామీలు |
| Cumulative | : | సంచితమైన |
| Coordination | : | సమన్వయం |
| Indirect finance | : | పరోక్ష విత్తం |
| Direct finance | : | ప్రత్యక్ష విత్తం |
| Capital structure | : | మూలధన నిర్మాణం |
| Defered payments | : | విలంబిత చెల్లింపులు |
| Refinance | : | పునర్విత్తం |
| Debt-equity ratio | : | ఋణాల-ఈక్విటీ నిష్పత్తి |
| Participation scheme | : | పాల్గొను పథకం |
| Technical Assistance Fund | : | సాంకేతిక సహాయ నిధి |
| Development Assistance Fund | : | అభివృద్ధి సహాయ నిధి |
| Diversification | : | వైవిధ్యీకరణ |
| Modernisation | : | ఆధునికీకరణ, ఆధునీకరణ |
| Bill finance | : | బిల్లుల విత్తం |
| Rehabilitation | : | పునరుద్ధరణ |
| Reconstruction | : | పునర్నిర్మాణం |
| Authorised capital | : | అధీకృత మూలధనం |
| Special Capital Scheme | : | ప్రత్యేక మూలధన పథకం |
| Industrial estates | : | పారిశ్రామిక వాడలు |
| Technical Consultancy Organisations | : | సాంకేతిక సంప్రదింపు వ్యవస్థలు |
| Repayment schedule | : | తిరిగి చెల్లింపుల పట్టిక |
| Financial assistance | : | విత్త సహాయం |

– డా॥ సి. దేవరాజులు నాయుడు

B R A O U

# భాగం - 18 : భారత దేశంలో గ్రామీణ బ్యాంకింగ్

**విషయ క్రమం**


18.0 ఉద్దేశాలు

18.1 పరిచయం

18.2 గ్రామీణ పరపతి - రకాలు, ఆధారాలు (Rural Credit - Types and Sources)

18.3 గ్రామీణ బాంకింగ్ - సంఘటిత రంగం (Rural Banking - Organised Sector)

18.4 సహకార రంగ సంస్థలు (Cooperative Sector)

18.5 వాణిజ్య బ్యాంకులు (Commercial Banks)

18.6 భూమి అభివృద్ధి బాంకులు (Land Development Banks)

18.7 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (Regional Rural Banks)

18.8 వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బాంకు (National Bank for Agriculture and Rural Development – NABARD)

18.9 సారాంశం

18.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

18.11 సంప్రదింపు గ్రంథాలు

18.12 భావనలు

18.13 పదకోశం


## 18.0 ఉద్దేశాలు

గ్రామీణ పరపతిని అందించే సంఘటిత రంగ బాంకింగ్ తత్సంబంధ సంస్థల గురించి వివరించడం ఈ భాగపు ముఖ్య లక్ష్యం. గ్రామీణ పరపతి రకాలను, ఆధారాలను వివరంగా తెలుసుకోవడం ఈ భాగపు లక్ష్యం. గ్రామీణ బాంకింగ్ వ్యవస్థలను, నాబార్డును అధ్యయనం చేయడం ఈ భాగపు లక్ష్యం.

## 18.1 పరిచయం

వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి పథకాలకు కీలకమైన ఉత్పాదకంగా గ్రామీణ పరపతిని, ముఖ్యంగా వ్యవసాయ పరపతిని పరిగణింపవచ్చు. వ్యవసాయ అభివృద్ధిలో, గ్రామీణాభివృద్ధిలో పరపతి పాత్ర అతి ముఖ్యమైనది. దీర్ఘకాలం (ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ) భారత దేశ గ్రామీణ రంగపు ముఖ్య పరపతి ఆధారం ప్రైవేటు ద్రవ్య ఋణదాతలే (private money lenders). ఈ పరపతి ఆధారం కావలసిన మేరకు ఉండేదికాదు. అంతే కాకుండా అది అధిక వ్యయ భరితం ఎందుకంటే ఋణదాతలు అత్యధిక వడ్డీని వసూలు చేస్తారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరనుంచి బహుళ సంస్థల దృక్పథం (multi - agency approach) ద్వారా చవుకైన, అవసరాలకు సరిపోయే గ్రామీణ పరపతిని అందించడానికి ప్రయత్నం జరుగుతోంది. సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మొదలైనవి సంఘటిత పరపతి రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. గ్రామీణ పరపతిలో త్వరితగతిని సంస్థాగత పరపతి (institutional credit) ప్రాముఖ్యతను

పెంచుకుంటూ పోవడం స్వతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ విధాన ముఖ్య లక్ష్యం. బలహీన వర్గాల,వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ముఖ్య లక్ష్య సముదాయాలుగా (target groups) విధానం రూపొందింపబడింది.

ప్రభుత్వ విధాన ముఖ్య లక్ష్యాలు దిగువ ఇవ్వబడ్డాయి.

1. సకాలంలో, అధిక మేరకు వ్యవసాయ రంగానికి పరపతి అందేటట్లు చూడడం.
2. గ్రామీణ రంగం నుంచి ద్రవ్య ఋణదాత (money lender) పాత్రను పూర్తిగా తొలగించడం.
3. పరపతి సౌకర్యాలను అందించడం ద్వారా ప్రాంతీయ విభేదాలను తగ్గించి క్రమంగా తొలగించడం.
4. ప్రత్యేక పథకాలున్న ప్రాంతాలలో ఎక్కువ మేరకు పరపతిని అందించడం. ఈ ప్రత్యేక పథకాలు పప్పు దినుసుల అభివృద్ధి పథకం, జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకం మొదలైనవి.

గ్రామీణ అభివృద్ధిలో వివిధ బాంకింగ్, ఫైనాన్సియల్ సంస్థలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. గ్రామీణ రంగంలో బ్యాంకింగ్ సదుపాయాలకు సంబంధించిన గురించిన వివరాలను ఈ భాగంలో తెలుసుకుందాం.

## 18.2 గ్రామీణ పరపతి - రకాలు, ఆధారాలు

### 18.2.1 గ్రామీణ పరపతి రకాలు

వ్యవసాయదారుల పరపతి అవసరాలను మూడు రకాలుగా విభజించవచ్చు.

**1. స్వల్పకాల పరపతి (Short Term Credit)**

వ్యవసాయ పనులకు, గృహ అవసరాలకు కావలసినపరపతిని స్వల్పకాలిక పరపతి అంటారు. ఉదాహరణకు విత్తనాలను కొనేందుకు, పశుగ్రాసం కొనేందుకు, పంట బాగా పండనప్పుడు గృహ అవసరాలకొరకు వ్యవసాయ దారులకు పరపతి అవసరమవుతుంది. స్వల్పకాలమంటే 15 మాసాలకు లోపు కాలం అని చెప్పవచ్చు.

**2. మధ్యకాల పరపతి (Medium Term Credit)**

15 నెలల నుంచి 5 ఏళ్ళ వరకు గల కాలాన్ని మధ్యకాలమనవచ్చు. భూమిని మెరుగుపరచడానికి, వ్యవసాయ పనిముట్లను కొనడానికి, పశువులను కొనడానికి వ్యవసాయదారులకు మధ్యకాల పరపతి అవసరమవుతుంది.

**3. దీర్ఘకాల పరపతి (Long Term Credit)**

అదనంగా భూమిని కొనడానికి, భూమిని శాశ్వతంగా మెరుగుపరచడానికి, పాత ఋణాలను తీర్చడానికి, ఖరీదైన వ్యవసాయ పనిముట్లను కొనడానికి వ్యవసాయదారులకు దీర్ఘకాల పరపతి అవసరమవుతుంది.

వ్యవసాయదారుల అప్పులను రెండు రకాలుగా విభజించవచ్చు : ఉత్పత్తికి అవసరమైన ఉత్పాదక ఋణాలు (productive loans), అనుత్పాదక (unproductive) ఋణాలు. వ్యవసాయ చర్యలకు అవసరమయ్యే ఋణాలు మొదటి తరగతికి చెందితే ; వినియోగం కొరకు, వివాహాది శుభ కార్యాల కొరకు, జనన మరణ సంబంధిత ఖర్చులకొరకు మొదలగు వాటికి అవసరమయ్యేవి అనుత్పాదక ఋణాలు. వ్యవసాయదారుల అనుత్పాదక ఋణాలు సమర్థనీయం కావు.

### 18.2.2 గ్రామీణ పరపతి ఆధారాలు (Sources of Rural Credit)

ఈ పరపతి ఆధారాలను స్థూలంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు :

1. అసంఘటిత రంగ ఆధారాలు
2. సంఘటిత రంగ ఆధారాలు.


BRAOU

ద్రవ్య ఋణదాతలు, వ్యాపారస్తులు (traders), కమీషన్ ఏజంట్లు (commision agents), బంధువులు (relatives), భూస్వాములు (landlords) మొదలగు వారిని అసంఘటిత రంగంలో ఆధారాలుగా సూచించవచ్చు. సంఘటిత రంగంలో ప్రభుత్వం, సహకార సంస్థలు, వాణిజ్య బాంకులు, ప్రాంతీయ గ్రామీణ బాంకులు మొదలైనవాటిని ముఖ్యమైన ఆధారాలుగా చెప్పవచ్చు.


## 18.3 గ్రామీణ బాంకింగ్ - సంఘటిత రంగం

సంఘటిత రంగ ఆధారాల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

### 18.3.1 స్వల్పకాల, మధ్యకాల పరపతి సంస్థలు (Short - Term and Medium - Term Credit Institutions)




### 18.3.2 దీర్ఘకాల పరపతి సంస్థలు




ఈ భాగపు మిగతా వివరణలో గ్రామీణ బాంకింగ్ సంస్థల గురించి తెలుసుకుందాం.

## 18.4 సహకార రంగ సంస్థలు

దేశ ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసినవారు సహకార రంగం ఆర్థికాభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహించాలని భావించారు. ముఖ్యంగా గ్రామీణ రంగ అభివృద్ధిలో సహకార సంస్థలు ప్రముఖ పాత్ర వహించాలని వారు కృషిని సాగించారు. భారత దేశంలో గ్రామీణ ప్రజలకు సహాయకారిగా ఉండడానికి రైతుకు తక్కువ వడ్డీ

BRAOU

రేటుతో అవసరమైన పరపతిని అందించేందుకు సహకారోద్యమం (cooperative movement) ప్రారంభింపబడింది. ద్రవ్య ఋణదాత (money lender) ల బారినుండి రైతును కాపాడాలనే ఉద్దేశంతో సహకార పరపతి సంస్థలను స్థాపించడం జరిగింది.

### 18.4.1 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (Primary Agricultural Credit Society)

ఈ సంఘం తక్కువ కాలపరిమితి ఋణాలను అందిస్తుంది. వ్యవసాయ పనులకు స్వల్పకాల ఋణాలను పరపతి సంఘాలు మంజూరు చేస్తాయి. ఈ ప్రాథమిక పరపతి సంఘాల ప్రాధాన్యత కాలక్రమేణా అధికమవుతూ వస్తోంది. 1950 - 51 లో ఈ సంస్థలిచ్చిన ఋణాలు సుమారు రూ. 23 కోట్లు. 1960-61 సంవత్సరానికి ఈ ఋణాలు రూ. 200 కోట్లకు పెరిగాయి. 1991 - 92 సంవత్సరానికి రూ. 4,230 కోట్లకు చేరుకున్నాయి.

### 18.4.2 సహకార కేంద్ర బాంకులు (Cooperative Central Banks)

ఇవి సాధారణంగా జిల్లా స్థాయి బాంకులు. ఆ జిల్లాలోని ప్రాథమిక సంఘాలన్నీ కేంద్ర బాంకు పరిధిలోకి వస్తాయి. గ్రామీణ ప్రాథమిక పరపతి సంఘాలకు అవసరమైన ఋణాలను అందివ్వడం కేంద్ర బాంకుల ప్రధాన విధి. ఈ బాంకులు రాష్ట్ర స్థాయి రాష్ట్ర సహకార బాంకుకు, గ్రామీణ పరపతి సంఘాలకు మధ్య మధ్యవర్తి పాత్రను పోశిస్తాయి.

### 18.4.3 రాష్ట్ర సహకార బ్యాంకు (State Cooperative Bank)

ప్రతి రాష్ట్రంలో సహకార సంస్థల నిర్మాణం అత్యున్నత సంస్థగా ఈ రాష్ట్ర స్థాయి బాంకు వ్యవహరిస్తుంది. కేంద్రీయ సహకార బాంకులకు ఫైనాన్స్ ఇవ్వడం, వాటిపై ఆధిపత్యాన్ని వహించడం ఈ బాంకు ముఖ్య విధి. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బాంకు (National Bank for Agriculture and Rural Development-NABARD) కు కేంద్రీయ పరపతి బాంకులకు మరియు ప్రాథమిక సంఘాలకు మధ్య వారధిగా రాష్ట్ర స్థాయి బాంకు పనిచేస్తుంది.

భారత దేశం వంటి వర్ధమాన దేశాలలో ముఖ్యంగా గ్రామీణ రంగంలో సహకార సంఘాలు ప్రముఖ పాత్ర వహించాల్సి ఉంది. కాని వాస్తవంలో సహకారోద్యమాన్ని చాలా బలహీనతలు పట్టి పీడిస్తున్నాయి.

1. సహకార పరపతి సంస్థల ఓవర్‌డ్యూస్ (overdues) అధికంగా ఉండడం సహకారోద్యమం గురించి ఒక బాధాకర నిజం. ఈ ఓవర్‌డ్యూస్ ప్రస్తుతం రూ. 3,000 కోట్లు దాటి ఉన్నాయి. క్రమశిక్షణ, ఋణాలు తీర్చేందుకు ఇష్టత (discipline and willingness) లేకపోవడం ఈ ఓవర్‌డ్యూస్ పెరిగిపోవడానికి ముఖ్య కారణమని 1974 లో తమ నివేదికను సమర్పించిన "సహకార పరపతి సంఘాల ఓవర్‌డ్యూస్ అధ్యయన జట్టు" (Study Team on Overdues of Cooperative Credit Institutions) పేర్కొంది.

2. కౌలుదార్లు (tenants), పంట పంపకందార్లు (share cropers), భూమిలేని వ్యవసాయ కూలీలు (landless agricultural labourers), గ్రామీణ వృత్తులవారు (rural artisans) మొదలైన వారికి అవసరమైన మేరకు పరపతి అందకపోవడం సహకార పరపతి యొక్క మరో బలహీనతగా చెప్పవచ్చు. ఈ తరగతులు అతి పేద వర్గాలకు చెందిన వారని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

3. రాష్ట్రాల మధ్య, ప్రాంతాల మధ్య పరపతి పంపిణీ అసమానతలు సహకార పరపతి మరొక బలహీనతగా చెప్పవచ్చు. రైతులకు అందిన తలసరి పరపతి సూచీగా తీసుకుంటే గుజరాత్, పంజాబ్, హర్యానా,

BRAOU

తమిళనాడు రాష్ట్రాలలో ఈ సూచీ అధికంగానూ, ఒరిస్సా, బీహార్, యు.పి., పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో తక్కువగానూ ఉంది.

4. నిర్వహణ (management) లోపం కూడా సహకారోద్యమంలో ఒక ముఖ్య బలహీనతగా గుర్తింపబడింది. "నాబార్డ్" (వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బాంకుకు క్లుప్త రు పం) నాయకత్వంలో సహకారోద్యమాన్ని పటిష్ట పరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## 18.5 వాణిజ్య బాంకులు

వాణిజ్య బాంకులు తమ కార్యకలాపాలలో గ్రామీణ రంగాన్ని విస్మరించారనీ, ఆ రంగానికి పరపతిని అందివ్వడంలో తగు పాత్ర వహించలేదనేది బాంకుల జాతీయీకరణ వాదాలలో ఒకటి. 1967లో బాంకులపై సామాజిక నియంత్రణ (social control of banks) ప్రారంభమైన నాటి నుండి గ్రామీణ రంగంలో బాంకు బ్రాంచీల సంఖ్య పెరగడం ప్రారంభమయింది. జూలై 1969 నాటికి వాణిజ్య బాంకులన్నిటికీ గ్రామీణ, సెమీ - పట్టణ (semi - urban) ప్రాంతాలలో 5,200 బ్రాంచీలుంటే, జూన్ 1991 నాటికి అవి 34,500 అయ్యాయి. 1969 లో వ్యవసాయ ఋణ అకౌంట్లు 0.2 మిలియన్ (మొత్తం వ్యవసాయ ఋణం రూ. 160 కోట్లు) అయితే 1991 నాటికి ఈ అకౌంట్లు 2.3 మిలియన్లు (మొత్తం వ్యవసాయ ఋణం రూ. 17,000 కోట్లు). వాణిజ్య బాంకుల నుండి ఋణగ్రహీతలుగా గ్రామీణ సహకార సంస్థలను ప్రముఖంగా చెప్పవచ్చు.

జాతీయీకరణ జరిగిన తొలి కాలంలో వాణిజ్య బాంకులు పెద్ద సాగుదార్లపైన (large cultivators), ప్రత్యేక తరహా రైతుల (అధిక దిగుబడినిచ్చే ఆహార పంటల సాగుదారుల) పైన శ్రద్ధ వహించారు. 1990 దశాబ్దం మొదటి సంవత్సరాలలో వాణిజ్య బాంకులు స్వల్పకాల పంట ఋణాలు, రైతులకిచ్చిన మొత్తం బాంకు ఋణాలలో సుమారు 45 శాతం. పంపుసెట్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు కొనుగోలుకు బాంకులు ఇచ్చిన దీర్ఘకాల ఋణాలు సుమారు 35 శాతం. ఇవే కాకుండా బాంకులు పాడి పరిశ్రమకు, కోళ్ళ పెంపకానికి, తేనెటీగల పెంపకానికి, ఇలాంటి ఇతర అవసరాలకు కూడా ఋణాలిస్తున్నాయి. ఈ ఋణాలు మొత్తం గ్రామీణ రంగ బాంకు ఋణాలకు సుమారు 16 శాతం.

వాణిజ్య బాంకులు ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా కూడా గ్రామీణ రంగానికి పరపతి సౌకర్యం కల్పిస్తోంది. గ్రామీణ సహకార సంస్థలకు పరపతిని అందించడం ఒక విధమైన పరోక్ష ఫైనాన్సింగ్ అయితే, రసాయనిక ఎరువులు, ఉత్పాదకాల పంపిణీకి పరపతిని అందించడం మరొక విధమైన పరోక్ష ఫైనాన్సింగ్. అలాగే వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను సప్లై చేసే సంస్థలకు వాణిజ్య బాంకులు పరపతిని అందించడం ద్వారా వ్యవసాయ రంగానికి తోడ్పడుతున్నాయి. భారత ఆహార సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీలకు వాణిజ్య బాంకులు పరపతిని అందిస్తున్నాయి.

కేంద్ర భూమి అభివృద్ధి బాంకుల (Central Land Development Banks) డిబెంచర్లు (debentures) కొనడం ద్వారానూ, వారికి ఋణాల్విడం ద్వారానూ వాణిజ్య బాంకులు గ్రామీణ రంగాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీల (Small Farmers Development Agencies) ద్వారాను, ఇతరత్రా చిన్న రైతులకు పరపతి సౌకర్యాన్ని వాణిజ్య బాంకులు అందిస్తున్నాయి. సంఘటిత గ్రామీణ అభివృద్ధి పథకం (Integrated Rural Development Programme) క్రింద కూడా వాణిజ్య బాంకులు పరపతి సౌకర్యాన్ని అందిస్తున్నాయి.

## 18.6 భూమి అభివృద్ధి బాంకులు (Land Development Banks)

రైతుల దీర్ఘకాలిక పరపతి అవసరాలు చాలా వరకు అసంఘటిత ఆధారాల (ముఖ్యంగా ద్రవ్య ఋణదాతల) ద్వారానే తీరుతూ ఉండేవి. తర్వాతి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం, సహకార సంస్థలు పరపతిని

BRAOU

అందిస్తూ ఉండేవి. కాని ఈ విధంగా అందే పరపతి సరిపోయేది కాదు. ఈ కొరతను తీర్చేందుకు భూమి అభివృద్ధి బాంకులు స్థాపించబడ్డాయి. ప్రాథమిక భూమి అభివృద్ధి బాంకుల బ్రాంచీల సంఖ్య 1950-51లో 286 కాగా 1990-91 నాటికి ఈ సంఖ్య 1,850 కి పెరిగింది. కేంద్ర (లేక రాష్ట్ర) భూమి అభివృద్ధి బాంకుల సంఖ్య 5 నుండి 19 కి పెరిగింది. ఈ బాంకులు ఇచ్చిన ఋణాలు 1991 - 92 నాటికి రూ. 3,500 కోట్ల స్థాయికి చేరింది.

భూమి అభివృద్ధి బాంకులు నిధులను క్రింది ఆధారాల ద్వారా సంపాదిస్తాయి.

1. వాటా మూలధనం నిల్వలు (share capital reserves)

2. ఖాతాలు (deposits)

3. బాండ్లు, డిబెంచర్ల అమ్మకం.

వీటిలో మూడవది ప్రముఖమైంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ ఉంటుంది. వీటిని జీవిత భీమా సంస్థ, వాణిజ్య బాంకులు, భారతీయ స్టేట్ బాంక్, దాని అనుబంధ సంస్థలు మరియు భారతీయ రిజర్వ్ బాంక్ కొంటాయి. "నాబార్డ్" రిఫైనాన్సింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో భూమి అభివృద్ధి బాంకుల ఫైనాన్సియల్ వనరులు అధికమయ్యాయి.

వ్యవసాయ ఆస్తుల తనఖాపై ఋణాలివ్వడం ఈ బ్యాంకుల ముఖ్య విధి. ఈ బాంకులు చాలా రకాలైన ఋణాలిస్తాయి. 1) పాత అప్పులు తీర్చేందుకు ఋణాలు, 2) బావుల తవ్వకానికి ఋణాలు, 3) భూమి మెరుగు పరిచేందుకు ఋణాలు, 4) విలువైన వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు ఋణాలు. మొదట్లో వ్యవసాయదారులు అధికంగా పాత అప్పులు తీర్చేందుకు ఋణాలు పుచ్చుకున్నా గత కొన్ని సంవత్సరాలుగా భూమి మెరుగుదలకు, బావులు తవ్వించడానికి (56 శాతం) మరియు వ్యవసాయ పరికరాల కొనుగోలుకు (30శాతం) బాంకుల నుండి ఋణాలు తీసుకుంటున్నారు.

## 18.7 ప్రాంతీయ గ్రామీణ బాంకులు (Regional Rural Banks)

పాత 20 పాయింట్ల ఆర్థిక పథకం (20 Point Economic Programme) లో ఒక లక్ష్యం గ్రామీణ ఋణగ్రస్తత (rural indebtedness) ను దశలలో తుదముట్టించి, రైతులకు, వివిధ వృత్తులవారికి (farmers and artisans) సంస్థా పరపతి (institutional credit) ని అందివ్వడం. ఈ లక్ష్య సాధన కృషిలో భాగంగా ప్రాంతీయ గ్రామీణ బాంకులు స్థాపించబడ్డాయి. చిన్న, ఉపాంత రైతులకు, వివిధ వృత్తులవారికి, వ్యవసాయ కూలీలకు, చిన్న ఉద్యమదారులకు (small entrepreneurs) ఋణ సదుపాయాల్నివ్వడం ద్వారా సర్వతోముఖ గ్రామీణాభివృద్ధిని సాధించడం ఈ బాంకుల ముఖ్య లక్ష్యం. 1975 లో 5 గ్రామీణ బాంకులు స్థాపించబడ్డాయి. వాణిజ్య బాంకులు వీటిని స్పాన్సర్ (sponsor) చేసాయి. కేంద్ర ప్రభుత్వం 50శాతం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం 15శాతం, స్పాన్సర్ చేసిన వాణిజ్య బాంకు 35 శాతం ఈ బాంకులకు మూలధనంగా (share capital) ఇచ్చాయి.

ప్రాంతీయ గ్రామీణ బాంకులు ప్రాథమికంగా షెడ్యూల్డ్ వాణిజ్య బాంకులే అయినప్పటికీ వాణిజ్య బాంకులకు, వీటికి కొన్ని తేడాలున్నాయి.

1. గ్రామీణ బాంకుల కార్యకలాపాలు ఒక ప్రాంతానికే పరిమితమవుతాయి. ఈ ప్రాంతంలో ఒక రాష్ట్రానికి చెందిన ఒకటి లేక రెండు జిల్లాలుంటాయి.

2. ఈ బాంకులు చిన్న, ఉపాంత రైతులకు, గ్రామీణ వృత్తులవారికి (rural artisans),వ్యవసాయ కూలీలకు, తదితర పేదలకు మాత్రమే ఋణాలను మంజూరు చేస్తాయి. ఈ ఋణాలు ఉత్పాదకత కార్యకలాపాలకు మాత్రమే ఇవ్వబడతాయి.

BRAOU

3. స్పాన్సర్ చేసిన బాంకులు, భారతీయ రిజర్వు బాంకు ఈ గ్రామీణ బాంకులకు సబ్సిడీలు, కన్‌సెషన్స్ ఇస్తాయి. గ్రామీణ బాంకుల ఋణాలపై వడ్డీ రేటు సహకార సంస్థలు తీసుకునే వడ్డీరేట్లను మించకూడదు.

స్పాన్సర్ బ్యాంకులు గ్రామీణ బాంకులకు నిర్వహణ, ఫైనాన్సియల్ సహాయాలు అందిస్తున్నాయి. అంతేకాకుండా తక్కువ వడ్డీ రేట్లకు ఋణాలిస్తాయి. గ్రామీణ బాంకు ఉద్యోగుల శిక్షణా వ్యయాలను (training expenses) స్పాన్సర్ బాంకులు భరిస్తాయి.

రిజర్వ్ బాంకు గ్రామీణ బాంకులకు చాలా సదుపాయాలు అందజేస్తోంది. గ్రామీణ బాంకులు నగదు నిల్వల నిష్పత్తి 3శాతం మేరకు, చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి 25 శాతం మేరకు ఉంచాలి. "నాబార్డ్" ద్వారా గ్రామీణ బాంకులకు రిఫైనాన్స్ సదుపాయం రిజర్వ్ బాంకు అందిస్తోంది. గ్రామీణ బాంకుల కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయడం, గ్రామీణ బాంకులకు సంబంధించి విధానాలు రూపొందించడం, ఆ బాంకులకు పునర్విత్త సదుపాయం అందివ్వడం "నాబార్డ్" బాధ్యత. గ్రామీణ బాంకుల తనిఖీ, వాటి పనిచేసే తీరును గమనించడం, బ్రాంచీలను పెంచడంలో రిజర్వు బాంకు సంప్రదింపుతో తన పాత్రను పోషించడం "నాబార్డ్" బాధ్యత.

గత ఇరవై ఏళ్ళలో గ్రామీణ బ్యాంకులు చాలా ప్రగతిని సాధించాయి. ప్రస్తుతం దేశంలో 196 గ్రామీణ బాంకులున్నాయి. వాటి శాఖలు 14,500 ఉన్నాయి. సెప్టెంబరు మాసాంతానికి ఇచ్చిన ఋణాలు రూ. 3,560 కోట్లు. ఈ ఋణాలు - స్వల్పకాలిక పంట ఋణాలు, దీర్ఘకాలిక వ్యవసాయ ఋణాలు, గ్రామీణ వృత్తిదార్లకు ఋణాలు, గ్రామీణ, కుటీర పరిశ్రమలకు ఋణాలు, చిల్లర వ్యాపార ఋణాలు, వినియోగ ఋణాలు మొదలైనవి. సుమారు 90 శాతం గ్రామీణ బాంకుల ఋణాలు బలహీన వర్గాలకు ఇవ్వబడ్డాయి. గ్రామీణ రంగ అభివృద్ధిలో గ్రామీణ బ్యాంకులకు అతి ముఖ్యమైన పాత్ర ఉంది.

## 18.8 వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బాంకు (National Bank for Agriculture and Rural Development – NABARD)

భారతీయ రిజర్వ్ బాంకు ఆరంభం నుండి వ్యవసాయ రంగంపై శ్రద్ధ తీసుకుంటూ వచ్చింది. ఆ రంగం కొరకు ఒక శాఖ (department) ను ఏర్పరిచింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాల్ని వ్యవసాయ రంగానికి రాష్ట్ర స్థాయి సహకార, భూమి అభివృద్ధి బాంకుల ద్వారా అందించేది.

అంతేకాకుండా వ్యవసాయ రిఫైనాన్స్ అభివృద్ధి కార్పొరేషన్ (Agricultural Refinance Development Corporation) ను స్థాపించి, ఆ సంస్థ బాంకులకు రిఫైనాన్స్ సౌకర్యాన్ని కలిగించేటట్లు చేసింది. "వ్యవసాయాభివృద్ధి", లక్ష్యాన్ని "గ్రామీణాభివృద్ధి" (rural development) గా విస్తృత పరిచినప్పుడు ఆ లక్ష్య సాధనకు ఒక సంస్థ అవసరమైంది. ఫలితమే "నాబార్డ్" స్థాపన. వ్యవసాయ ఋణాలకు సంబంధించి భారత రిజర్వు బాంకు విధులను, రిఫైనాన్స్‌కి సంబంధించి "వ్యవసాయ రిఫైనాన్స్ అభివృద్ధి కార్పొరేషన్" విధులను "నాబార్డ్" తీసుకుంది.

పార్లమెంటు చట్టం ద్వారా "నాబార్డ్" జూలై 1982లో స్థాపింపబడింది. "నాబార్డ్" వాటా మూలధనానికి 50 శాతం ఇచ్చిన రిజర్వు బాంకు జాతీయ బాంకుతో అతి సమీప సంబంధం కలిగింది. మిగతా 50 శాతం వాటా మూల ధనం భారత ప్రభుత్వం ఇచ్చింది. "నాబార్డ్" అధీకృత వాటా మూలధనం (authorised share capital) రూ. 500 కోట్లు. అందులో చెల్లించిన మూలధనం (paid - up capital) రూ. 100 కోట్లు. "నాబార్డ్" భారత ప్రభుత్వం నుంచి, ప్రపంచ బాంకు (World Bank) తదితర సంస్థలనుంచి నిధులను సేకరిస్తుంది. మార్కెటునుంచి కూడా

BRAOU

నిధులను సమీకరిస్తుంది. జాతీయ వ్యవసాయ (దీర్ఘకాల కార్యకలపాలు, స్థిరీకరణ) నిధి (Long - Term Operations and Stabilzation Fund) నాబార్డ్ వశం చేయబడింది.

### 18.8.1 "నాబార్డ్" విధులు (Functions of NABARD)

ప్రాథమికంగా నాబార్డ్ విధులు రెండు రకాలు : ఒకటి అత్యున్నత సంస్థ (apex institution) గా, రెండవది రిఫైనాన్సింగ్ సంస్థగా విధులను నిర్వహిస్తుంది. భారతీయ రిజర్వు బాంకు నుండి మొదటి రకపు విధి నాబార్డ్‌కి సంక్రమించింది. ఇంతకు మునుపు గ్రామీణ పరపతికి సంబంధించి రిజర్వు బాంకు విధుల్ని నాబార్డ్ తీసుకుంది. అలాగే ఇంతకు మునుపు వ్యవసాయ రిఫైనాన్స్ అభివృద్ధి కార్పోరేషన్ విధుల్ని కూడా నాబార్డ్ తీసుకుంది. "నాబార్డ్" విధులు క్రింద చెప్పబడ్డాయి.

1. వ్యవసాయానికి, చిన్న తరహా పరిశ్రమలకు, గ్రామీణ, కుటీర పరిశ్రమలకు, చేతి పనులకు, గ్రామీణ వృత్తిదార్లకు ఉత్పత్తికై ఇచ్చే పరపతి సంస్థల ఋణాలకు రీఫైనాన్సింగ్ సౌకర్యం అందించడం, తద్వారా గ్రామీణ రంగపు అభివృద్ధికి సహాయపడడం "నాబార్డ్" ముఖ్య కర్తవ్యం.
2. రాష్ట్ర సహకార బాంకుకు, ప్రాంతీయ గ్రామీణ బాంకులకు, భూమి అభివృద్ధి బాంకులకు రిజర్వ్ బాంక్ సమ్మతించిన ఇతర ఫైనాన్సియల్ సంస్థలకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను అందివ్వడం "నాబార్డ్" మరో విధి.
3. సహకార సంస్థలకు మూలధనాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు దీర్ఘకాలిక ఋణాల్విడం.
4. వ్యవసాయ, గ్రామీణ రంగ అభివృద్ధితో ప్రమేయమున్న ఏ సంస్థకైనా (కేంద్ర ప్రభుత్వ సమ్మతితో) దీర్ఘ కాలిక ఋణాలివ్వడం.
5. వికేంద్రీకృత రంగ (decentralized sector) అభివృద్ధికి సంబంధించి చిన్న తరహా పరిశ్రమలు, గ్రామీణ, కుటీర పరిశ్రమలకు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్యకలాపాలను సమీకరించడం.
6. సహకార రంగ పరపతి వ్యవస్థలను తనిఖీ చేయడం.
7. పరిశోధనా, అభివృద్ధి నిధి (Research and Development Fund) ను కొనసాగిస్తూ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి పరిశోధనలను ప్రోత్సహించడం, వివిధ పథకాలను రూపొందించడం "నాబార్డ్" బాధ్యత.

గ్రామీణ రంగ అభివృద్ధిలో, సహకార రంగాన్ని పటిష్ఠ పరచడంలో నాబార్డ్ గణనీయమైన కృషి సాగిస్తోంది.

## 18.9 సారాంశం

గ్రామీణ పరపతిని అందించే సంఘటిత రంగ బాంకింగ్ తత్సంబంధ సంస్థల గురించి ఈ భాగంలో వివరించడం జరిగింది. భారత దేశంలో 60 శాతానికి మించి జనాభా గ్రామీణ రంగంలో నివసిస్తున్నారు. దేశపు సర్వతోముఖాభివృద్ధిలో అంతర్భాగం గ్రామీణ అభివృద్ధి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సహకార రంగాన్ని అభివృద్ధి పరచి ఆ రంగం వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహించేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. "నాబార్డ్" ను అత్యున్నత గ్రామీణ రంగ బాంకుగా తీర్చిదిద్ది గ్రామీణ రంగ అభివృద్ధికి సంస్థాగత ప్రగతికి నాంది వేసింది. ప్రాంతీయ గ్రామీణ బాంకులు, భూమి అభివృద్ధి బాంకులు గ్రామీణ రంగ అభివృద్ధికి కావలసిన పరపతినందివ్వడంలో తమ కృషి ని సాగిస్తున్నాయి. వాణిజ్య బాంకులు తమ శాఖలను గ్రామీణ రంగానికి విరివిగా విస్తరించి అభివృద్ధికి దోహదకారులవుతున్నాయి.

BRAOU

## 18.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులిమ్ము.**

1. గ్రామీణ బాంకింగ్ నిర్మాణాన్ని విశ్లేషించండి.
2. "నాబార్డ్" లక్ష్యాలను, విధులను వివరించండి.
3. సహకార పరపతి సంస్థల పాత్రను విశదీకరించండి.

**II క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులిమ్ము.**

1. వ్యవసాయ రంగ పరపతి అవసరాలను వివరించండి.
2. ప్రాంతీయ గ్రామీణ బాంకుల విధులను తెలుపండి.
3. భూమి అభివృద్ధి బాంకుల విధులను విపులీకరించండి.

## 18.11 సంప్రదింపు గ్రంథాలు


1. RBI, *Reserve Bank of India : Functions and Working*
2. V.S. Mahajan, *Studies in Indian Banking and Finance, Vol.1*
3. Dutt and Sundaram, *Indian Economy*
4. V. Lakshmana Rao, *Economic Development of India*


## 18.12 భావనలు

**గ్రామీణాభివృద్ధి :** వ్యవసాయ, వ్యవసాయ సంబంధ, వ్యవసాయేతర కార్యకలాపాల ద్వారా గ్రామీణ రంగ సర్వతోముఖాభివృద్ధి.

**రీఫైనాన్సింగ్ :** ఋణాలిచ్చిన సంస్థలకు ఆ ఋణాల ఆధారంగా ఋణాలిచ్చే ప్రక్రియ.

BRAOU

## 18.13 పదకోశం

| | | |
|---|---|---|
| Rural banking | - | గ్రామీణ బాంకింగ్ |
| Cooperative sector | - | సహకార రంగం |
| Commercial banks | - | వాణిజ్య బాంకులు |
| Land Development Banks | - | భూమి అభివృద్ధి బాంకులు |
| Regional Rural Banks | - | ప్రాంతీయ గ్రామీణ బాంకులు |
| National Bank for Agriculture and Rural Development (NABARD) | - | వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి జాతీయ బాంకు (నాబార్డ్) |
| Money lender | - | ద్రవ్య ఋణదాత |
| Credit | - | పరపతి |

| | | |
|---|---|---|
| Source | | ఆధారం |
| Productive loans | - | ఉత్పాదక ఋణాలు |
| Cooperative movement | - | సహకారోద్యమం |
| Institutional credit | - | సంస్థాగత పరపతి |
| Unproductive | - | అనుత్పాదక |
| Overdues | - | ఓవర్‌డ్యూస్ |
| Rural artisans | - | గ్రామీణ వృత్తులవారు |
| Management | - | నిర్వహణ |
| Social control | - | సామాజిక నియంత్రణ |
| Share capital | - | వాటా మూలధనం |
| Indebtedness | - | ఋణగ్రస్తత |
| Entrepreneurs | - | ఉద్యమదారులు |
| Refinance | - | పునర్విత్తం, రీఫైనాన్స్ |
| Authorised | - | అధీకృత |
| World Bank | - | ప్రపంచ బ్యాంకు |
| Apex Institution | - | అత్యున్నత సంస్థ |
| Decentralized | - | వికేంద్రీకృత |

- ఆచార్య వి. లక్ష్మణ రావు

BRAOU

# భాగం - 19 : వాణిజ్య బ్యాంకుల పరపతి సృష్టి

**విషయ క్రమం**


19.0 ఉద్దేశం

19.1 పరిచయం

19.2 కరెంట్ డిపాజిట్లు - పొదుపు డిపాజిట్లు

19.3 వాణిజ్య బాంకుల పరపతి సృష్టి

19.3.1 బాంకు ఋణం డిపాజిట్‌గా ఎలా ఏర్పడుతుంది ?

19.3.2 బాంకు ఋణాలు డిపాజిట్లను ఎలా సృష్టిస్తాయి ?

19.3.3 డిమాండ్ డిపాజిట్లు ఏర్పడే క్రమం

19.3.4 పరపతి సృష్టి ప్రక్రియ

19.3.5 పరపతి సృష్టిలో గమనించదగిన అంశాలు

19.4 బాంకు డిపాజిట్ల బహుళ వ్యాప్తి - పరపతి గుణకం

19.4.1 బాంకు పరపతి బహుళ వ్యాప్తి ప్రమేయాలు

19.4.2 బాంకింగ్ రంగంలో పరపతి బహుళ వ్యాప్తి క్రమం

19.4.3 పరపతి గుణకం

19.4.4 సంభావ్య బహుళార్థ డిపాజిట్ సృష్టి

19.4.5 గణిత రూప వివరణ

19.4.6 పరపతి గుణకం ప్రమేయాలు

19.5 బాంకుల పరపతి సృష్టికి పరిమితులు

19.6 పరపతి సృష్టి సిద్ధాంతంపై విమర్శ

19.7 పరపతి సృష్టి ప్రాముఖ్యత

19.8 సారాంశం

19.9 సంప్రదింపు గ్రంథాలు

19.10 నమూనా పరీక్షా ప్రశ్నలు


## 19.0 ఉద్దేశం

వాణిజ్య బాంకులు తాము సేకరించే డిపాజిట్ల ద్వారా ఏ విధంగా పరపతిని సృష్టిస్తాయో, అందుకుగాను పరపతి గుణకం ఎలా పనిచేస్తుందో, పరపతి సృష్టికి గల పరిమితులేమిటో చర్చించుకోవడమే ఈ పాఠం ప్రధాన ఉద్దేశం.

## 19.1 పరిచయం

పరపతి సృష్టి వాణిజ్య బాంకుల ముఖ్య విధి. ఆధునిక ఆర్థిక, వ్యాపార వ్యవహారాలు ఈ బాంకు పరపతి ద్వారా నిర్వహింపబడుతున్నాయి. చెక్కులు, హుండీలు, వ్యాపార వినిమయ పత్రాలు, ప్రోనోట్ల వంటి పరపతి సాధనాల ప్రాముఖ్యం పెరుతున్న అంశాన్ని మనం గమనించవచ్చు. ఈదృష్ట్యా గమనించినప్పుడు బాంకులు పరపతి సృష్టికర్తలుగా పరిగణింపబడతాయి.



BRAOU

ఒక దేశంలో ఉన్న ద్రవ్య చలామణి రెండు అంశాలతో కూడుకొని ఉంటుంది : (1) ప్రభుత్వం లేదా కేంద్ర బాంకు ముద్రించి జారీ చేసే నోట్లు, నాణేలు, (2) బాంకింగ్ రంగంలో బాంకులు సృష్టించే పరపతి ద్రవ్యం. అయితే బాంకింగ్ అలవాట్లు, అభివృద్ధి దశ, ఆర్థిక వ్యవస్థ ద్రవ్యీకరణ స్థాయిని బట్టి ఈ రెండు అంశాల ప్రాముఖ్యతలో వ్యత్యాసాలు ఏర్పడతాయి. బాంకింగ్ అలవాట్లు ఎక్కువగా ఉన్న దేశాల్లో బాంకు ద్రవ్యం శాతం హెచ్చుగా ఉండగా, చట్టరీత్యా జారీచేసిన ద్రవ్యం శాతం తక్కువగా ఉంటుంది. ఈ అలవాటు తక్కువగా ఉన్న వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల్లో పరపతి ద్రవ్యం శాతం సాపేక్షికంగా అల్పంగా ఉంటుంది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ వున్న దశలో బాంకింగ్ అలవాట్లు పెరిగే అవకాశం ఉన్న కారణంగా పరపతి సృష్టికి సంబంధించిన విశ్లేషణ ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

## 19.2 కరెంటు డిపాజిట్లు - పొదుపు డిపాజిట్లు

ఒక బాంకు పరపతిని సృష్టించినప్పుడుగాని లేదా ఋణాలనిచ్చినప్పుడు గాని మొత్తం బాంకింగ్ వ్యవస్థలో "పరపతి బహుళార్థక వ్యాప్తి" జరుగుతుంది. ఆచార్య సేయర్స్ పేర్కొన్నట్లు "బాంకులనేవి కేవలం ద్రవ్యాన్ని వెదజల్లేవేకావు, కాని ఒక ముఖ్యమైన అర్థంలో, అవి ద్రవ్యాన్ని సృష్టించేవి." బాంకు డిపాజిట్లు ప్రధానంగా రెండు రకాలు - (1) కరెంటు డిపాజిట్లు (2) పొదుపు డిపాజిట్లు. కరెంటు డిపాజిట్లను వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు తమ ఋణాలను తీర్చుకోవడానికి వాడతారు. వీటిమీద జారీచేసే చెక్కులు కాష్ డిపాజిట్ అనిగాని, డిమాండ్ డిపాజిట్ అనిగాని అంటాం. ప్రస్తుత అవసరాలకు వాడకుండా చేసే బాంకు డిపాజిట్లను పొదుపు డిపాజిట్లు అంటాం. వీటిని ప్రజలు సాధారణంగా వడ్డీని పొందే విధంగా చేసేవి లేదా పొదుపు కోసంగాని చేసేవి.

ప్రతి డిపాజిట్ తన డిపాజిట్ ఖాతాపై ఇచ్చే చెక్కుద్వారా తన చెల్లింపు అవసరాలను తీర్చుకొనే అవకాశం ఉన్నందున ప్రతి బాంకు డిమాండ్ డిపాజిట్‌ను ద్రవ్యంగా గుర్తించవచ్చు. కాబట్టి ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఈ బాంకు డిమాండ్ డిపాజిట్లు మొత్తం ద్రవ్య చలామణిలో ఎక్కువ శాతం ఉండటం వల్ల డిమాండ్ డిపాజిట్లలో వచ్చు మార్పు సమాజంలో ఉన్న ద్రవ్యరాశిని ప్రభావితం చేస్తుంది.

## 19.3 వాణిజ్య బాంకుల పరపతి సృష్టి

ఒక బాంకు డిమాండ్లు డిపాజిట్లు రెండు విధాలుగా ఏర్పడతాయి. (1) డిపాజిటర్లు నగదును బాంకులో డిపాజిట్ (జమ) చేయడం వల్ల, (2) బాంకు ఋణాలు మరియు పెట్టుబడుల వల్ల. మొదటి విధానంలో ప్రజలు నగదును బాంక్‌లో డిపాజిట్ చేయడంవల్ల నగదును డిమాండ్ డిపాజిట్‌గా మార్చడం జరిగి ఒక విధమైన ద్రవ్యాన్ని వేరొక రకమైన ద్రవ్యంగా మార్చబడుతుంది. ఈ విధంగా ఏర్పడిన డిమాండ్ డిపాజిట్లను ప్రాథమిక డిపాజిట్లు (primary deposits) అంటారు. రెండవ విధానంలో బాంకింగ్ రంగంలోకి ప్రాథమిక డిపాజిట్లుగా తేబడిన నగదును ఉపయోగించి మార్కెటు నుండి బిల్లులు, బాండ్లు, డిబెంచర్లు మొదలగు ఆస్తులను కొనుగోలు చేస్తుంది. లేదా వ్యాపార వేత్తలకు, పారిశ్రామిక వేత్తలకు ఋణాలనిస్తుంది. అయితే బాంకు ఎప్పుడు ఆస్తులు కొన్నప్పుడు గాని, ఋణాలనిచ్చినప్పుడుగాని నగదును ఇవ్వకుండా వారి ఖాతా పేరిట డిమాండు డిపాజిట్లను సృష్టిస్తుంది. ఇట్టి డిపాజిట్లనే 'వ్యుత్పన్న డిపాజిట్లు' (derivative deposits) అంటారు. ఈ వ్యుత్పన్న డిపాజిట్లకు ప్రేరణ బాంకింగ్ వ్యవస్థ నుండే లభిస్తుంది. ఈ రెండు రకాలైన డిమాండు డిపాజిట్లలో వచ్చే మార్పులు చలామణి అయ్యే ద్రవ్యంలో మార్పులు తెస్తాయి. ఆ విధంగా ఆర్థిక నిక్షేపాల హెచ్చుతగ్గులను ప్రభావితం చేసే శక్తి వాణిజ్య బాంకులకు ఉన్న కారణంచేత దీనినే పరపతి సృష్టి అని అనవచ్చు. అయితే ఏ విధంగా డిమాండు డిపాజిట్లు ఏర్పడతాయి ? ప్రతి బాంకు ఋణం ఏ విధంగా డిపాజిట్‌గా ఏర్పడుతుందో క్రింది వివరణ ద్వారా తెలుసుకోవచ్చు.

BRAOU

### 19.3.1 బాంకు ఋణం డిపాజిట్‌గా ఎలా ఏర్పడుతుంది ?

ఒక వ్యక్తి బాంకులో డిపాజిట్ చేసినప్పుడు బాంకు అతని పేర ఒక ఖాతాను ఏర్పాటు చేసి ఆ సొమ్మును క్రెడిట్ చేస్తుంది. అనగా ఆ సొమ్ముకు బదులు బాంకు తన మీద తానే ఋణ బాధ్యతను స్వీకరించిందన్నమాట. ఆ ఖాతాదారు తనకు అవసరమేర్పడినపుడు మొత్తంగా గాని, పాక్షికకంగా గాని చెక్కుల ద్వారా తీసుకోవడానికి అధికారం ఉంటుంది. ఇట్టి హక్కును కొనుగోలు శక్తిగా (ద్రవ్యం మాదిరిగా) అనుకోవచ్చు. వస్తు సేవలను కొనుగోలు చేసినపుడు అమ్మకందార్లకు చెల్లించడానికి ఈ చెక్కులను వాడుకోవడం జరుగుతుంది. ఈ విధంగా ఇది ద్రవ్యం వలె పని చేస్తుంది, కనుక బాంకులు ద్రవ్యాన్ని సృష్టిస్తాయనవచ్చు.

వాణిజ్య బాంకులు లాభం దృష్టితో పని చేస్తాయి. కాబట్టి ఇతర ఆస్తుల కొనుగోలుకై పెట్టుబడి పెట్టడానికిగాను, వ్యాపార, పారిశ్రామిక వేత్తలకు ఋణాలివ్వడానికిగాను ప్రజల వద్ద నుండి బాంకులు డిపాజిట్లను స్వీకరిస్తాయి. అంటే ఋణాలను ఇవ్వగలుగుతున్నాయంటే మూలకారణం డిపాజిట్లే. అందువల్ల డిపాజిట్లు ఋణాలను సృష్టించడం జరుగుతుంది.

### 19.3.2 బాంకు ఋణాలు డిపాజిట్లను ఎలా సృష్టిస్తాయి ?

a) బాంకు ఋణాన్ని మంజూరు చేసినప్పుడు, ఋణగ్రహీత పేర బాంకు ఒక డిపాజిట్‌ను సృష్టిస్తుంది. తన ఋణదాతలకు చెల్లించే విధంగా ఈ డిపాజిట్‌నుండి చెక్కు ద్వారా చెల్లించే వీలు కల్పించడం జరుగుతుంది. బాంకు ఋణాలను పెంచడం ద్వారా డిపాజిట్లను పెంచవచ్చు. వడ్డీగా వచ్చిన సొమ్ము అదనపు ద్రవ్యమౌతుంది.

b) మూడు మాసాలకు మించిన కాల వ్యవధిలో ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినప్పుడు, సెక్యూరిటీలను కొనుగోలు చేసినప్పుడు పెట్టుబడులేర్పడతాయి. ప్రభుత్వం నుండి బాండును కొనుగోలు చేసినప్పుడు, ప్రభుత్వం పేరిట డిపాజిట్‌ను ఏర్పాటు చేస్తుంది. పాత ప్రభుత్వ బాండును బాంకు ఒకవేళ స్టాక్ ఎక్స్చేంజ్ నుండి కొనుగోలు చేసినట్లయితే, అమ్మకందారు పేర డిపాజిట్‌ను సృష్టిస్తుంది.

c) అదేవిధంగా ఒక బాంకు వ్యాపార బిల్లును కొనుగోలు చేసినప్పుడు (డిస్కౌంటు చేసినప్పుడు), కొనుగోలు చేసిన పార్టీ పేరిట డిపాజిట్ సృష్టించడం జరుగుతుంది లేదా చెక్కుద్వారా చెల్లింపు చేయడం జరుగుతుంది. చెక్కు ఇచ్చినప్పుడు ఆ వ్యక్తి తన బాంకు ఖాతాలో జమ చేసుకుంటాడు. ఏ రూపంలోనైనా బాంకు డిపాజిట్లు పెరుగుతాయి.

d) స్టాక్ ఎక్స్చేంజీల్లో అంచనా వ్యాపారులకు, బ్రోకర్లకు పూర్తి స్వల్పకాలపు ఋణాలను అందించే ప్రక్రియలో కూడ డిపాజిట్లు ఏర్పడతాయి. పిలుపు మేరకు, స్వల్ప నోటీసులో చెల్లించుటకు ఇచ్చిన ప్రమాణాలను పురస్కరించుకొని బాంకులు అంచనా వ్యాపారస్తుల మరియు బ్రోకర్ల ఖాతాలో డిపాజిట్ చేస్తాయి. వీరు తమ క్రెడిటర్లకు చెక్కులేదా డ్రాఫ్టురూపంలో చెల్లించినప్పుడు వారు తమ బాంకు ఖాతాల్లో జమ చేసుకుంటారు. ఈ ప్రకారంగా బాంకు ఏర్పాటు చేసిన ఋణ సొమ్ముకు సమానంగా డిపాజిట్లు సృష్టిస్తుందని చెప్పవచ్చు. పైన వివరించిన అంశాలను బట్టి ప్రతి ఆస్తిని సముపార్జించినప్పుడు బాంకు ఆ ఆస్తి అమ్మకందార్లపేరిట డిపాజిట్ సృష్టిస్తుంది. ఈ విషయంలో రెండు అంశాలను గమనించవలసి ఉంటుంది.

a) మొదటిది : సముపార్జించిన ప్రతి ఆస్తి దాని విలువ మేరకు డిపాజిట్‌ను సృష్టిస్తుంది. ఋణాలను ఇవ్వడంలో, ఆదాయాన్నిచ్చే ఆస్తులను సంపాదించడంలో బాంకులు చొరవను తీసుకుంటాయి. ఆ విధంగా చేయడంలో బాంకింగ్ రంగంలోని మొత్తం డిపాజిట్లు పరిమాణాన్ని నియంత్రిస్తాయి.

BRAOU

b) రెండవది : ఇతరుల ఋణాలను వాణిజ్య బాంకులు ద్రవ్యీకరిస్తాయి. ఇతరుల చెల్లింపుల హామీలకు బదులుగా బాంకులే చెల్లించే హామీలను చేస్తుంది. మొదటిది ద్రవ్యంకాదుగాని, తర్వాతది మాత్రం ద్రవ్యమే. ఈ దృష్ట్యా బాంకులు ద్రవ్యాన్ని సృష్టిస్తాయి.

### 19.3.3 డిమాండు డిపాజిట్లు ఏర్పడే క్రమం

డిమాండు డిపాజిట్ ఏర్పడే క్రమం ఈ క్రింది విధంగా ఉంటుంది. బాంకులు అప్పులివ్వడానికి ప్రజల వద్దనుండి డిపాజిట్లను స్వీకరిస్తాయి. ప్రజలు తమ పొదుపు ద్రవ్యాన్ని భద్రతకోసంగానీ, వడ్డీని ఆర్జించడానికి గానీ లేదా చెల్లింపుల సౌలభ్యం కోసం గానీ బాంకుల్లో డిపాజిట్ చేస్తారు. బాంకులు డిపాజిట్లను స్వీకరించి డిపాజిటర్ల పేరిట ఖాతాలను ఏర్పరుస్తాయి. ఇది డిమాండు డిపాజిట్. అయితే డిపాజిటర్ అవసరాలను బట్టి వస్తువులను, సేవలను కొనుగోలు చేయడానికిగాని, బాకీలను తీర్చడానికిగాని, కావలసినప్పుడల్లా చెక్కుద్వారా రొక్కాన్ని ఉపసంహరించుకోవచ్చు. నిత్యం బాంకులో రెండు రకాల కార్యకలాపాలు జరుగుతూ ఉంటాయి. కొందరు ద్రవ్యాన్ని లేదా చెక్కులను డిపాజిట్ చేస్తూ ఉంటే మరి కొందరు ద్రవ్యాన్ని చెక్కుద్వారా ఉపసంహరిస్తుంటారు. బాంకును ఒక 'సరస్సు'గా భావిస్తే, ఒకవైపు నుంచి ద్రవ్య ప్రవాహం బాంకులోకి వస్తూ ఉంటే ఇంకోవైపు ద్రవ్యం నగదుగా, పరపతిగా అవతలికి ప్రవహిస్తూనే ఉంటుంది. ఏ నిర్ణీత సమయంలోనైనా చాలామేరకు నిక్షేప రొక్కం నిరుపయోగమైన ద్రవ్యంగా బాంకర్ల వద్ద ఉంటుంది. వీటిని అప్పుగా ఇచ్చినప్పుడు వీటి ఉపయోగిత ఏర్పడుతుంది. బాంకు అప్పును మంజూరు చేసినప్పుడు అది ఓవర్ డ్రాఫ్టు రూపంలోగాని, హుండీలను డిస్కౌంట్ చేయడంవల్లగాని, నగదు క్రెడిట్ ఇవ్వడం వల్లగాని జరిగినప్పుడు, అట్టి దాన్ని ఋణ గ్రహీత ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. ఇందువల్ల ఇదివరకు లేని అదనపు కొనుగోలు శక్తి (ద్రవ్యాన్ని) ని సృష్టించినట్లే అవుతుంది. ఆ అప్పుగా ఇవ్వబడిన సొమ్మును ఖాతాదారు తన అవసరాల మేరకు వాడుకోవడం జరుగుతుంది. బాంకు అప్పు ఇవ్వకపోతే ఇట్లా చేయడం సాధ్యం కాని పని. అందువల్ల బాంకు ఋణాలు మంజూరు చేయడమంటే ద్రవ్యాన్ని సృష్టించినట్లే. అప్పును తిరిగి చెల్లించినప్పుడు అసలుతోపాటు వడ్డీనికూడ చెల్లిస్తారు. కాబట్టి ఈ వడ్డీగా వచ్చిన సొమ్ము అదనపు ద్రవ్యం అవుతుంది. అందువల్ల బాంకు ఇచ్చిన ప్రతి అప్పువల్ల ద్రవ్యాన్ని సృష్టించడం జరుగుతుందని చెప్పవచ్చు.

### 19.3.4 పరపతి సృష్టి ప్రక్రియ

BRAOU

ఒక వాణిజ్య బాంకు ఆస్తి అప్పుల పట్టిక కింది విధంగా ఉందని భావిద్దాం.

వాణిజ్య బాంకు

| ఆస్తులు (రూ.) | | అప్పులు (రూ.) | |
|---|---|---|---|
| నగదు నిలువ | 20 | డిమాండు డిపాజిట్లు | 100 |
| ఋణాలు | 20 | | 100 |
| పెట్టుబడులు | 60 | | |
| | 100 | | |

బాంకింగ్ రంగంలో నగదు నిలువ నిష్పత్తి 20 శాతంగా ఊహించినప్పుడు రూ. 100 డిమాండు డిపాజిట్లను పోషించడానికి ఉంచబడిన 20% చట్టబద్ధమైన నగదు నిల్వల నిష్పత్తి ఆధారంగా రూ. 20 నగదు ఉండగా అదనపు నిలువలు ఏమీలేవు. ఖాతాదారు నుండి ఉదాహరణకు రూ. 10 నగదు బాంకులో చేర్చబడిందని అనుకుందాం. అప్పుడు బాంకు ఆస్తి అప్పుల పట్టికలో జరిగిన మార్పు ఈ విధంగా ఉంటుంది.

**బాంకుల ఆస్తి అప్పుల పట్టిక**

| ఆస్తులు (రూ.) | | అప్పులు (రూ.) | |
|---|---|---|---|
| నగదు నిలువ | 20 + 2 | డిమాండు డిపాజిట్లు | 100 + 10 |

(అదనపు నగదు నిల్వలు రూ. 8)

ఇప్పుడు రూ. 110 ల డిమాండ్ డిపాజిట్‌ను పోషించడానికి రూ. 22 నగదు నిల్వలు అవసరం ఉన్నందున, బాంకు అదనపు నిల్వలను రూ. 8 గా కల్గి ఉంది. కాని పబ్లిక్ ద్రవ్య సప్లయిలో ఏమీ పొందలేదు. ఎందుకనగా బాంకుకు పోయిన ద్రవ్యం డిమాండు డిపాజిట్ రూపంలో ఆవిర్భవించింది. ఈ అదనపు నిల్వలను అదనంగా ఋణాలుగా ఇచ్చినప్పుడు, లేదా పెట్టుబడి పెట్టినప్పుడు మాత్రమే ద్రవ్య సప్లయ్ పెరుగుతుంది. అదనపు నిల్వలు ద్రవ్య సృష్టికి అనుకూలంగా ఉంటాయని ఊహించినప్పటికీ, అది నిజమైన ద్రవ్య సృష్టికి సమానం మాత్రం కాజాలదు.

ఒకవేళ బాంకు నగదు రూపంలో అపు ఇచ్చినప్పుడు, బాంకు స్టేట్‌మెంటు కింది విధంగా ఉంటుంది.

**బాంకు ఆస్తి అప్పుల పట్టిక**

| ఆస్తులు (రూ.) | | అప్పులు (రూ.) | |
|---|---|---|---|
| నగదు నిలువ | 20 + 2 | డిమాండు డిపాజిట్లు | 100 + 10 |
| ఋణాలు | 20 + 8 | | |
| పెట్టుబడులు | 60 | | |
| | 100 | | 100 |

(అదనపు నిల్వలు = 0, ద్రవ్య సప్లయి పెరుగుదల = రూ. 8)

BRAOU

ఋణ గ్రహీతలు తమ ఖాతాలనుండి మొత్తం తీసివేసుకొనడం వల్ల డిమాండు డిపాజిట్లలో మార్పుండదు. బాంకు నగదు రూ. 30 బదులు రూ. 22 మాత్రమే ఉంటాయి. ఎందుకనగా నగదు డిపాజిట్ నుండి రూ. 8 ఋణ గ్రహీత తీసుకోవడం జరిగింది. అందువల్ల అదనపు నిల్వలు సున్న. రూ. 110 డిమాండు డిపాజిట్లను పోషించడానికి ఉండవలసిన కనీస నగదు రూ. 22. కాని పబ్లిక్ చేతిలో ఉండే ద్రవ్యం, నగదు రూపంలో తీసుకున్న ఋణానికి (అనగా రూ. 8) సమానంగా ఉంది.

ఇచ్చట గమనించవలసిన విషయమేమంటే బ్యాంకరు ఋణాన్ని పెంచటం వల్లనే అప్పు ఇవ్వడం జరిగింది. దీనికి బదులుగా బాంకరుకు తిరిగి చెల్లించే విధంగా ఋణగ్రహీత వాగ్దానం మరియు వడ్డీ పొందుతాడు; కాని అప్పు మంజూరు చేయడం వల్ల బాంకు ఋణం కూడ పెరిగింది. అయితే అప్పువల్లనే అదనపు ద్రవ్యం ఆవిర్భవిస్తుంది. అందువల్లనే "ప్రతి ఋణం డిపాజిట్‌ను సృష్టిస్తుందని" చెప్పడం జరిగింది.

## 19.3.5 పరపతి సృష్టిలో గమనించదగిన అంశాలు

పరపతి సృష్టి విషయంలో గమనించవలసిన మరో అంశం ఏమనగా బాంకు నోటు అనేది పబ్లిక్ దృష్ట్యా ఆస్తికి ప్రతినిధి. కాని బాంకుకు అది అప్పు. బాంకు అప్పునిచ్చినప్పుడు, చెల్లింపు వాగ్దానాలు చేయవలసి ఉంటుంది. కాని బాంకు ఋణగ్రహీతలు చెల్లిస్తామన్న వాగ్దానాల వల్ల లాభాలను పొదుతుందే తప్ప, తన

వాగ్దానాలవల్ల మాత్రం కాదు. ఒకే లావాదేవీలోనే రెండు అంశాలు ఉత్పన్నమౌతాయి, కాని అవి వేర్వేరుగా ఉంటాయి. ఒకవేళ ఆస్తి అదృశ్యమైతే (ఋణగ్రహీత దివాలా తీస్తే) నోట్లపైన, డిపాజిట్లపైన అప్పు మిగులుతుంది. ఒకవేళ అప్పు అదృశ్యమైతే (నోట్లు నాశనమైతే) ఆస్తి మిగులుతుంది.

ఈ విధమైన పరపతి సృష్టికి సంబంధించిన యంత్రాంగాన్ని అర్థం చేసుకునేటప్పుడు ఈ క్రింది అంశాలను గుర్తుంచుకోవలసి ఉంటుంది.

1. సాధారణంగా అప్పునిచ్చే పద్ధతి ఋణగ్రహీత ఖాతాలో జమ చేయుట. బాంకరు ఋణాలు ద్రవ్యంగా పనిచేస్తాయి.

2. డిపాజిట్లను కల్పించడం కేవలం అప్పుల రూపంలోనే కాదు. సెక్యూరిటీలను కొనుగోలుచేసినప్పుడు, పెట్టుబడులు పెట్టినప్పుడు, ఇతర ఆస్తులను కొనుగోలు చేసినప్పుడు కూడ డిమాండు డిపాజిట్లు ఏర్పడతాయి.

3. కాని బాంకరు సృష్టించే ప్రతి ద్రవ్యం బాంకు అప్పు అన్న సంగతి మరువరాదు. బాంకు క్లైయిమ్‌లు రెండు రూపాల్లో ఏర్పడతాయి. (1) పబ్లిక్ నిత్యం కొనుగోళ్ళకు కావలసిన ద్రవ్యాన్ని కోరడం (2) క్లియరింగ్ హౌస్ శేషాలను (balances) ను సెటిల్ చేయడానికి తోటి బాంకుల క్లైయిమ్‌లు వాటి కొఱకై బాంకులు కొంత నగదును ఎప్పుడూ కల్గి ఉండవలసి వస్తుంది.

4. పరపతి సృష్టి బాంకు డిపాజిట్ అప్పులను (liabilities) పెంచుతుంది. మరియు డిమాండ్ డిపాజిట్‌లను పోషించడానికి కావలసిన కనీస నగదు నిల్వల కన్న తక్కువకు పడిపోకుండా నగదు నిల్వలను కాపాడుకోవలసి ఉంటుంది. సాధారణంగా ఒక దేశంలోని కేంద్ర బాంకు ఈ నగదు నిల్వల నిష్పత్తిని నిర్ధారిస్తుంది. బాంకులు దాని పరిధిలో పరపతిని సృష్టించవచ్చు. కేంద్ర బాంకు నిర్దేశించే నిక్షేప నిల్వల శాతాన్ని తగ్గకుండా ప్రజల బాంకింగ్ అలవాట్లను బట్టి, నగదు నిల్వలను నిక్షేపాలకు ప్రతిగా ఉంచుకొన్న తర్వాత పరపతిని ఈ నిలవలకు కొన్ని రెట్లు ఎక్కువగా సృష్టించవచ్చు. దీనినే "బాంకు డిపాజిట్ల బహుళ వ్యాప్తి" అంటాం. దీని గురించి క్రింద తెలుసుకుందాం.

BRAOU

## 19.4 బాంకు డిపాజిట్ల బహుళ వ్యాప్తి (Multiple Expansion of Bank Deposits)

మనం ఇదివరకే గమనించినట్లు వ్యుత్పన్న డిపాజిట్లను (ఇంకోరకంగా చెప్పాలంటే పరపతి సృష్టిని) పెంచడానికి మరియు ద్రవ్య సప్లయిని పెంచడానికి ఆధారం ప్రాథమిక డిపాజిట్లే. ఒక వ్యక్తిగతమైన బాంకు కేవలం హెచ్చు నిల్వల మేరకు మాత్రమే పరపతిని విస్తృతపరచగలదు. ఎందుకనగా (1) ఋణగ్రహీతలు జారీచేసిన చెక్కుల చెల్లింపులద్వారా నగదును ఇతర బ్యాంకులకు కోల్పోతుంది. (2) జారీ చేసిన అప్పుల్లో కొంత భాగం పబ్లిక్‌కు నగదు రూపంలో కోల్పోతుంది. కాని బాంకింగ్ రంగం మొత్తంగా ప్రాథమిక హెచ్చు నిల్వలకన్న ఎన్నో రెట్లుగా పరపతిని విస్తృత పరుస్తుంది. ఈ ప్రక్రియనే "పరపతి బహుళవ్యాప్తి" అంటాం.

### 19.4.1 బాంకు పరపతి బహుళ వ్యాప్తి ప్రమేయాలు

బాంకింగ్ రంగం మొత్తంగా పరపతి బహుళ వ్యాప్తిని ఎలా చేస్తుందన్న విషయాన్ని క్రింది కల్పిత ఉదాహరణ ద్వారా వివరించడం జరిగింది. దీనిని వివరించడానికి క్రింది ప్రమేయాలు చేయడం జరిగింది:

1. బాంకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రతి బాంకుకు ప్రత్యేక డిపాజిటర్లు ఉంటారు.

2. ప్రతి బాంకు చట్టరీత్యా నిర్ణీత నిష్పత్తిలో నగదు నిల్వలను ఉంచవలసి వస్తుంది. సాధారణంగా దీనిని కేంద్ర బాంకులు నిర్దేశిస్తాయి. ఈ ఉదాహరణ కొరకు నగదు నిల్వల నిష్పత్తిని 20 శాతంగా ఉంచబడింది.

3. రూ. 1,000 విలువ చేసే ప్రాథమిక డిపాజిట్ బాంకు –I లో చేర్చబడింది. ఇప్పుడు పరపతి సృష్టి బాంకింగ్ రంగంలో ప్రారంభింపబడుతుంది. బాంకులో రూ.1,000 జమచేసినప్పుడు ఖాతాదారులకు ఇది ఆస్తి (credit) అంశంగాను, బాంకు ఖాతాకు (debit) అంశం అవుతుంది. శాసించిన నిల్వలు 20 శాతం అనుకొన్నప్పుడు, రూ. 200 నగదు నిల్వలను కల్గి ఉండాలి.

## 19.4.2 బాంకింగ్ రంగంలో పరపతి బహుళ వ్యాప్తి క్రమం

**బాంకు -I ఆస్తి అప్పుల పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| కొత్త డిపాజిట్లు | 1000 | కొత్తగా చేరిన నగదు | 1000 |
| | 1000 | | 1000 |

జంట పద్దు ప్రకారం రూ. 1,000 రెండువైపుల చూపించడం జరుగుతుంది. ఇదివరకే పేర్కొన్నట్లు డిపాజిట్లు బాంకు అప్పులు లేదా బాకీలు. అదేవిధంగా ఈ రూ. 1,000 నగదును బాంకు ఆస్తిగా పరిగణిస్తుంది. కారణమేమనగా, దీన్ని బాంకు అప్పుగా ఇచ్చుకోవడానికి వీలుంటుంది. ఇప్పుడు బాంకు–I 20 శాతం నగదు నిల్వలను కల్గి ఉంటూ మిగతా రూ. 800 మేరకు 'A' అనే వ్యక్తికి ఋణాలను కల్పిస్తుంది. ఆ తర్వాత బాంకు - I పట్టిక క్రింది విధంగా ఉంటుంది.

**బాంకు - I పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| డిపాజిట్లు | 1000 | నగదు | 200 |
| | | 'A' కు ఇచ్చిన ఋణం | 800 |
| | 1000 | | 1000 |

'A' కు ఇచ్చిన ఋణాన్ని ఉదాహరణకు 'A' బాంకు - II లో డిపాజిట్ చేస్తాడు అనుకుందాం. అప్పుడు బాంకు – II పట్టిక స్వరూపం ఇలా ఉంటుంది.

**బాంకు - II పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| డిపాజిట్‌లు | 800 | కొత్తగా వచ్చిన నగదు | 800 |
| | 800 | | 800 |

బాంకు – II 20 శాతం నగదుగా ఉంచుకొని మిగతాది 'B' అనే వ్యక్తి వద్ద బిల్లులు కొనుగోలు చేసింది. అప్పుడు బాంకు - II పట్టిక క్రింది విధంగా ఉంటుంది.

BRAOU

**బాంకు - II పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| డిపాజిట్‌లు | 800 | కొత్త నగదు | 160 |
| | | బిల్లులు కొన్నది | 640 |
| | 800 | | 800 |

'B' అను వ్యక్తి బాంకు – II కు బిల్లులను అమ్మినపుడు బాంకు – II అతనికి జారీచేసిన చెక్కును తన ఖాతాగల బాంకు– III లో దాన్ని డిపాజిట్ చేసినాడనుకొందాం. అప్పుడు బాంకు – III పట్టిక కింది విధంగా ఉంటుంది.

**బాంకు - III పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| డిపాజిట్‌లు | 640 | కొత్త నగదు | 640 |
| | 640 | | 640 |

బాంకు – III ఇట్లా చేరిన డిపాజిట్‌లో 20 శాతం చొప్పున రూ. 128 నగదుగా ఉంచుకొని మిగతా రూ. 512 తో ప్రభుత్వ బాండును కొనుగోలుచేసింది అనుకుందాం. అప్పుడు బాంకు – III ఆస్తి అప్పుల పట్టిక కింది విధంగా ఉంటుంది.

**బాంకు - III పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| డిపాజిట్‌లు | 640 | నగదు | 128 |
| | | పెట్టుబడి | 512 |
| | 640 | | 640 |

ప్రభుత్వ బాండును అమ్మిన వ్యక్తి –'C' తన బాంకు ఖాతాలో జమ చేసిన పిదప బాంకు – IV పట్టిక కింది విధంగా ఉంటుంది.

**బాంకు - IV పట్టిక**

| అప్పులు (రూ.) | | ఆస్తులు (రూ.) | |
|---|---|---|---|
| డిపాజిట్‌లు | 512 | కొత్త నగదు | 512 |
| | 512 | | 512 |

బాంకు – IV కూడా 20 శాతం నగదుగా ఉంచుకొని మిగిలినదాన్ని ఋణంగా ఇవ్వడంగాని, ఇతరత్రా పెట్టుబడి పెట్టడంగాని జరగవచ్చు. ఈ విధమైన ప్రక్రియ ప్రాథమిక డిపాజిట్ రూ. 1,000 అయిపోయేవరకు కొనసాగుతుంది. ఆ విధంగా మొదట ఏర్పడిన ప్రాథమిక డిపాజిట్ రూ 1,000 అదుపు డిపాజిట్లపై వరసగా రూ. 800, రూ.640, రూ. 512, రూ. 410 ...... దారితీస్తుంది. వీటన్నింటినీ చివరిదాకా జమచేస్తే అది సుమారుగా రూ. 5,000 అవుతుంది. అనగా 20 శాతం నగదు నిల్వల నిష్పత్తి ఉన్నప్పుడు బాంకింగ్ రంగంలో ఏర్పడే ప్రతిరూపాలను ప్రాథమిక డిపాజిట్ రూ. 5 విలువగల వ్యుత్పన్న డిపాజిట్లను సృష్టిస్తుంది. అనగా ప్రాథమిక డిపాజిట్‌కు 5 రెట్లు పరపతి ద్రవ్యాన్ని సృష్టిస్తుంది. దీన్ని పరపతి గుణకంగా పేర్కొనవచ్చు. ప్రస్తుత ఉదాహరణలో ఈ పరపతి గుణకం 5 గా ఉంది.

## 19.4.3 పరపతి గుణకం

బాంకింగ్ అలవాట్లు, ద్రవ్య సప్లయి సృష్టి నగదు నిల్వల నిష్పత్తి కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. నగదు నిల్వల నిష్పత్తిలోని మార్పులను బట్టి బాంకింగ్ రంగంలో పరపతి సృష్టి స్థాయి ఆధారపడి ఉంటుంది.

ఈ విషయంలో ఉన్న సూత్రం :

పరపతి గుణకం $(k) = \frac{1}{r}$ (r = నగదు నిల్వల శాతం)

పై ఉదాహరణలో నగదు నిల్వల శాతం 20 కాబట్టి పరపతి గుణకం $= \frac{1}{20\%} = 5$.

ఒకవేళ నగదు నిల్వల శాతాన్ని 25కు పెంచితే పరపతి గుణకం $k = \frac{1}{25\%} = 4$.

ఒకవేళ నగదు నిల్వల శాతాన్ని 10గా భావిస్తే,

$k = \frac{1}{10\%} = 10$.

దీనినిబట్టి పరపతి గుణకానికి, నగదు నిల్వల శాతానికి ఋణాత్మక సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది. నగదు నిల్వల శాతం పెరిగితే పరపతి గుణకం తగ్గుతుంది. ఒకవేళ నగదు నిల్వల శాతం తగ్గితే పరపతి గుణకం పెరుగుతుంది.

## 9.4.4 సంభావ్య బహుళార్థ డిపాజిట్ సృష్టి

దీని నుండి సంభావ్య పరపతి సృష్టికి సంబంధించిన సూత్రాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

సంభావ్య బహుళార్థ డిపాజిట్ సృష్టి లేదా Δ Derivative Deposits (DD) =

$\Delta DD = \Delta ER. \frac{1}{r}$

$\Delta DD$ = వ్యుత్పన్న డిపాజిట్లు

$\Delta ER$ = ప్రాథమిక డిపాజిట్లు - అవసరమైన నగదు నిల్వలు

r = నగదు నిల్వల నిష్పత్తి.

పై ఉదాహరణలో ప్రాథమిక డిపాజిట్ రూ. 1000 అవసరమైన నగదు నిల్వలు (@ 20%) = రూ. 200.

$\therefore \Delta ER$ = రూ. 1000 - రూ. 200 = రూ. 800

$$\therefore \Delta DD = 800 \times \frac{1}{20\%}$$

$$800 \times 5 = రూ.\ 4,000$$

అనగా $\Delta DD$=అనేది $\Delta ER$తో ప్రత్యక్ష ధనాత్మక సంబంధం ఉండగా, 'r' తో మాత్రం విలోమంగా ఉంది.

### 19.4.5 గణిత రూప వివరణ

గణిత రూపంలో పరపతి సృష్టి ప్రక్రియను కింది విధంగా తెలుపవచ్చు.

$$\Delta DD = \Delta ER + (1-r)\Delta ER + (1-r)^2 \Delta ER + (1-r)^3 \Delta ER + \ldots\ldots + (1-r)^n \Delta ER.$$

$\Delta$ = మార్పును సూచిస్తుంది.

n = వివిధ బాంకులలో జరిగిన డిపాజిట్ రౌండ్ల సంఖ్యను తెలియపరుస్తుంది.

### 19.4.6 పరపతి గుణకం ప్రమేయాలు

పైన వివరించిన పరపతి గుణకం కింది ప్రమేయాలపై ఆధారపడి ఉంటుంది :

1. ద్రవ్యత్వ దృష్ట్యా డిపాజిట్లు, నగదు నిల్వల విషయంలో స్థిరమైన సంబంధాన్ని కల్గి ఉండే ఉదేశంతో బాంకులన్నీ ఆస్తుల నిల్వలను సర్దుబాటు చేసుకుంటాయి.
2. అన్ని దశల్లో నగదు నిల్వల నిష్పత్తి నిలకడగా ఉంటుంది.
3. పరపతి మరియు వ్యుత్పన్న డిపాజిట్ల ప్రవాహంలో ఎటువంటి లోటుపాట్లు (leakages) ఏర్పడరాదు. బదులుగా వివిధ బాంకుల వద్ద ప్రాథమిక డిపాజిట్లుగా ఏర్పడాలి. అనగా ప్రజల్లో బాంకింగ్ అలవాట్లు వృద్ధి చెందినవిగా ఉంటూ అభివృద్ధి చెందిన బాంకింగ్ విధానం ఉండాలి.
4. కేంద్ర బాంకు పరపతి నియంత్రణ విధానం ఉండరాదు.
5. వ్యాపార పరిస్థితులు సాధారణంగా ఉండాలి.

## 19.5 బాంకుల పరపతి సృష్టికి పరిమితులు

సిద్ధాంత పరంగా బాంకింగ్ రంగం డిపాజిట్ల విస్తృతి ద్వారా అపరిమితమైన ద్రవ్యాన్ని సృష్టించవచ్చు. కాని వాస్తవంగా చూసినపుడు పరపతి సృష్టి స్థాయి పెక్కు అంశాలపై ఆధారపడి ఉన్న కారణంగా దానిపై అనేక పరిమితులున్నాయి.

#### 1. బాంకింగ్ రంగంలో లభ్యమయ్యే నగదు

బాంకింగ్ రంగం పరపతి సృష్టిపై ఉన్న ప్రధాన పరిమితుల్లో ఒకటి బాంకింగ్ రంగంలో లభ్యమయ్యే నగదు. ఈ నగదు ఎక్కువగా లభ్యమైనపుడు హెచ్చు నిల్వలు ఏర్పడి, ఎక్కువ మొత్తంలో పరపతి సృష్టించే అవకాశం ఏర్పడుతుంది. ప్రాథమిక డిపాజిట్ల స్థాయి నగదు లభ్యతపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఖాతాదారులు కోరినప్పుడు ద్రవ్యాన్ని అందించవలసి ఉంటుంది. లేనిచో ప్రజల్లో బాంకులపై నమ్మకం పోతుంది. డిపాజిట్లు పెరిగినప్పుడు నగదు అవసరం పెరుగుతుంది. కాబట్టి క్రౌథర్ చెప్పినట్లుగా నగదు ద్రవ్యం ద్రవ్య దృష్టిని నిర్దేశించడంలో 'మీట' గా పనిచేస్తుంది.

BRAOU

**2. నగదు నిల్వల నిష్పత్తి**

డిపాజిటర్ల రొక్కం సంరక్షణార్థం నగదు నిల్వల శాతాన్ని నిర్ణయిస్తుంది. ఆర్థిక వ్యవస్థలోని స్థితిగతులను బట్టి ముఖ్యంగా ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం ఏర్పడుతున్న సందర్భాల్లో ద్రవ్య సప్లయిని నియంత్రించడానికి సాధనంగా ఈ నగదు నిల్వల నిష్పత్తిని మారుస్తుంది. ఆ ప్రకారంగా బాంకింగ్ రంగం సృష్టించే పరపతి స్థాయి ఈ నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది.

**3. దేశంలో ద్రవ్య పరిమాణం**

కేంద్ర బాంకు విడుదల చేసే ద్రవ్య పరిమాణాన్ని బట్టి ప్రజల ధనావశ్యకత మారుతుంది. దేశంలో ద్రవ్యరాశి పెరిగితే తప్పకుండా బాంకు డిపాజిట్లు పెరుగుతాయి. కాబట్టి ఒక నిర్ణీత కాలంలో బాంకులు సృష్టించే పరపతి పరిమాణం దేశంలో చలామణి అయిన ద్రవ్యరాశిపై ఆధారపడి ఉంటుంది.

**4. ప్రజలు ఋణాలు తీసుకోవడానికి కనబరిచే సంసిద్ధత**

బాంకులు ఎంత పరపతి ద్రవ్యాన్ని సృష్టిస్తాయన్నది ప్రజలు ఋణాలు తీసుకోవడానికి ఎంత మేరకు సంసిద్ధంగా ఉన్నారన్న అంశంపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామిక రంగంలో లేదా వ్యాపార రంగంలో లాభసాటితనాన్ని బట్టి ఈ నిర్ణయాలు చేయడం జరుగుతుంది. అదే విధంగా వడ్డీ రేటుపై కూడ ఆధారపడి ఉంటుంది. ద్రవ్యోల్బణ పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో నెలకొన్నప్పుడు ఋణాలు తీసుకోవడానికి ఎక్కువగా ముందుకు వస్తారు. అందువల్ల పరపతి సృష్టి ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. దీనికి భిన్నంగా ఆర్థిక మాంద్యం నెలకొన్నప్పుడు ఋణాలు తీసుకోవడానికి సంసిద్ధంగా ఉండని కారణం చేత పరపతిని బాంకింగ్ రంగం ఎక్కువగా సృష్టించలేదు.

**5. ద్రవ్యత్వాభిరుచి**

ప్రజల్లో ద్రవ్యత్వాభిరుచి ఎక్కువగా ఉన్నట్లయితే నగదు లభ్యత బాంకుల్లో తక్కువగా ఉంటుంది. ఋణాలు ఇచ్చినప్పుడు కూడ వెంటనే నగదు రూపంలో విరమించుకోవడం జరుగుతుంది. ప్రాథమిక డిపాజిట్లు కూడ ఎక్కువగా ఏర్పడలేవు. తత్కారణంగా బాంకింగ్ రంగం పరపతి సృష్టికి పరిమితి ఏర్పడుతుంది.

**6. పూచీ ఆస్తుల సప్లయి**

బాంకులు ఋణాలనిచ్చినప్పుడు బిల్లులను, షేర్లను, వస్తు నిల్వల వంటి ఆస్తులను పూచీగా పెట్టుకోవడం జరుగుతుంది. కాబట్టి ఋణగ్రహీతల వద్ద లభించే ఆస్తుల పరిమాణం కూడ పరపతి సృష్టి పరిమాణాన్ని పరిమితం చేస్తుంది. బాంకులు ఆకాశం / శూన్యం నుండి పరపతిని సృష్టించలేవు. ద్రవ్యత్వ లక్షణం గల సెక్యూరిటీల ఆధారంగా మాత్రమే ఋణాల ద్వారా ద్రవ్య వసతిని బాంకులు ఏర్పాటు చేయగలవు.

**7. బాంకింగ్ అలవాట్లు మరియు బాంకింగ్ వ్యవస్థ**

బాంకింగ్ రంగం అభివృద్ధి, ప్రజల్లో బాంకింగ్ అలవాట్లపై బాంకుల ద్రవ్య సృష్టి పరిమాణం ఆధారపడి ఉంటుంది. ప్రజలు చెక్కులకు బదులు నగదుతోనే తమ లావాదేవీలు నిర్వహిస్తే బాంకుల పరపతి సృష్టి సన్నగిల్లుతుంది. దీనికి భిన్నంగా చెక్కులద్వారా లావాదేవీలు నిర్వహిస్తే, డిపాజిట్ల సృష్టి వేగంగాను, హెచ్చు పరిమాణంలోను చేయడానికి వీలు ఏర్పడుతుంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో హెచ్చు భాగం లావాదేవీలు బాంకు చెక్కులద్వారా నిర్వహింపబడతాయి. వెనుకబడిన ఆర్థిక వ్యవస్థల్లో ఈ అలవాటు చాల అల్పంగా మాత్రమే ఉంటుంది. బాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందినదిగా ఉన్నప్పుడే బాంకింగ్ అలవాట్లు కూడ అభివృద్ధి చెందుతాయి.

BRAOU

**8. కేంద్ర బాంకు అనుసరించే ద్రవ్య విధానం**

బాంకింగ్ రంగం పరపతి సృష్టించే శక్తి ఆ దేశం అనుసరిస్తున్న ద్రవ్య విధానంపై ఆధారపడి ఉంటుంది. అనేక ద్రవ్య నియంత్రణ పద్ధతుల ద్వారా కేంద్ర బాంకు దేశంలోని పరపతి పరిమాణాన్ని నియంత్రిస్తుంది. ఆ విధంగా బాంకు పరపతిని ప్రభావితం చేస్తుంది. అప్పుల పరిమితి అనేది కేంద్ర బాంకు అనుసరించే అప్పుల విధానం మీద కూడ ఆధారపడి ఉంటుంది.

**9. పరపతి సృష్టిలో చిద్రములు (Leakages)**

పరపతి సృష్టిలో ఏర్పడు చిద్రముల (leakages) కారణంగా సంభావ్య పరపతి సృష్టికి, వాస్తవ పరపతి సృష్టికి మధ్య తేడా ఏర్పడవచ్చు; (1) బాంకులు మిగులు నిల్వలు ఏర్పడినంత మేరకే పరపతిని సృష్టించలేకపోవచ్చు. మిగులు నిల్వలు రూ. 800 ఉన్నప్పుడు ఋణాలను అంతకన్న తక్కువగా ఇచ్చినప్పుడు (రూ.700) ఈ రెండింటి తేడా వల్ల పూర్తి స్థాయి పరపతి సృష్టి జరుగదు. (2) ప్రజలకు ఇచ్చిన అడ్వాన్సులు తిరిగి బాంకింగ్ రంగంలో పూర్తిగా కొత్త డిపాజిట్లను సృష్టిస్తాయని ఊహించడం జరిగింది. కాని వాస్తవంగా అడ్వాన్సులలోని కొంత భాగాన్ని ప్రజలే నగదు రూపంలో వాడుకోవచ్చు. అందువల్ల పరపతి సృష్టిలో లోటుపాట్లు ఏర్పడటం జరుగుతుంది. ఇట్టి లోటుపాట్లు పరపతి సృష్టిని పరిమితం చేస్తాయి.

## 19.6 పరపతి సృష్టి సిద్ధాంతంపై విమర్శ

వాల్టర్ లీఫ్ మరియు ఎడ్విన్ కానన్ పండితులు పైన పేర్కొన్న ద్రవ్య సృష్టి విశ్లేషణకు తీవ్రమైన అభ్యంతరాన్ని తెలుపుతూ అసలు బాంకులు ద్రవ్యాన్ని గాని పరపతిని గాని సృష్టించలేవన్నారు. పరపతి సృష్టికి చొరవ బాంకుల నుండి వస్తుందన్నది తప్పని, దానికి భిన్నంగా ఎవరి డిపాజిట్లు ఆధారంగా బాంకులు అపులనిస్తున్నాయో అట్టి డిపాజిటర్లలోనే చొరవ ఏర్పడుతుందని వారన్నారు. డిపాజిటర్లు బాంకర్లకు అందించిన దానికన్నా బాంకులు ఎక్కువ పరపతిని సృష్టించలేవన్నారు. వాల్టర్ లీఫ్ ఉద్దేశంలో బాంకరు డిపాజిట్‌ను సృష్టించినపుడు అట్టి డిపాజిట్ రొక్కాన్ని వెంటనే గాని, ఆ తర్వాత గానీ వాపసు తీసుకొనేదేనని, అందువల్ల ఖాతాదారు జమచేసిన నగదుకన్న ఎక్కువగా సృష్టించలేడని పేర్కొన్నారు. అందువల్ల ఖాతాదారు జమ చేసిన నగదు కన్న ఎక్కువగా సృష్టించలేడని పేర్కొన్నారు. అందువల్ల వాస్తవ స్థితిలో పరపతిని సృష్టించలేవన్నారు.

కానన్ బాంకింగ్ రంగాన్ని ఒక సామాను గది (cloak room) తీరుగా అభివర్ణించారు. ఒక క్లబ్బుకు 100 మంది గొడుగులను ఒక్కొక్కరే తెచ్చి డిపాజిట్ చేస్తే, ప్రతి గంటకు కేవలం 10 గొడుగులే తీసుకొనిపోతే, మిగతా 90 గొడుగులను కిరాయికు ఇచ్చి కొంత సొమ్ము చేసుకొనవచ్చు. అంతమాత్రాన కౌంటర్ వద్దనున్న వ్యక్తి 90 గొడుగులను సృష్టించినట్లవుతుందా ? అని ప్రశ్నించారు. నిజంగా కాదు. అదే విధంగా, డిపాజిటర్లందరూ ఒకేసారి తమ ద్రవ్యాన్ని వాపసు (తిరిగి) తీసుకోరు. కాబట్టి కొంతకాలంగా డిపాజిట్లలోని కొంత భాగాన్ని అప్పుగా ఇచ్చి కొంత సొమ్ము చేసుకొనవచ్చు. అంత మాత్రాన బాంకు ద్రవ్యాన్ని సృష్టించిందని అర్థం కాదన్నారు. కాబట్టి సృష్టి అనేది సరియైన వర్ణన కాదన్నారు. అనుభవం గల బాంకరు తన అధికారాన్ని పొందడం జరుగుతుందన్నారు. కాని వాస్తవంగా రూ.10 అదనపు రొక్కం ఉంటే బాంకరు రూ. 10 మేరకే అప్పుగా ఇవ్వగలడు, కొంత ఎక్కువా లేదా తక్కువా కాదు. అందువల్ల కానన్ 'బాంకులు ద్రవ్యాన్ని సృష్టించవు- తమ డిపాజిటర్లు అందించిన మేరకే అప్పుగా ఇవ్వగల్గుతాయి" అని అన్నాడు.

పై విమర్శకు క్రౌథర్‌గారు సిద్ధాంతపరంగాను, అనుభవరీత్యాను కింది సమాధానం ఇచ్చారు. సిద్ధాంతపరమైన జవాబు ఏమనగా అనుభవజ్ఞుడైన బాంకరు తన విశ్లేషణను చివరిదాకా కొనసాగించలేడు.

BRAOU

వ్యక్తిగత బాంకరు దృష్ట్యా ఆలోచించినప్పుడు, వారు కొనసాగించింది వాస్తవమే. కాని బాంకింగ్ రంగం మొత్తాన్ని తీసుకున్నప్పుడు వారు చేసిన వాదన వీగిపోతుందన్నారు. ఒక బాంకు పరపతిని సృష్టించినప్పుడు, ఈ పరపతి ద్రవ్యం ఇంకో బాంకుకు పోతుంది, అది మళ్ళీ అప్పులనిచ్చే అవకాశాన్ని కల్పించడం ద్వారా బాంకు ద్రవ్యాన్ని సృష్టించడం మొదలు పెరుగుతుంది. ఈ ప్రక్రియలో సృష్టించబడిన ద్రవ్యం తిరిగి మొదటి బాంకుకు తిరిగి రావచ్చు; ఈ విధంగా తన నగదును తిరిగి పొందే వీలు కల్గుతుంది. కాని ప్రాథమిక హెచ్చు నగదు బాంకింగ్ వ్యవస్థ బయటి నుండి వస్తే మాత్రం, ఇది ఏదో ఒక బాంకు నగదు నిల్వలను పెంచుతుంది. పరపతి బహుళ వ్యాప్తి వేరే భాగపు బాంకింగ్ వ్యవస్థలో జరగకముందే ఈ బాంకుల నగదు నిల్వలు సాధారణంగా ఉండే నిల్వలను మించి పెరుగుతాయి. డిపాజిట్ల విస్తృతి మరియు నగదు ముందు వెనుకల కదలింపు అదనపు డిపాజిట్ల సృష్టి ఏర్పడునంతవరకూ కొనసాగుతాయి. అందువల్ల డిపాజిట్ సృష్టి జరుగుతుందన్నారు క్రౌథర్‌గారు.

## 19.7 పరపతి సృష్టి ప్రాముఖ్యత

ఆధునిక సమాజాల్లో బాంకు డిపాజిట్లు ముఖ్యమైన ద్రవ్యం రకంగా కల్గి ఉండటం వల్ల, బాంకు డిపాజిట్లు విస్తృతమౌతున్నాయంటే దేశంలో ద్రవ్య సప్లయి పెరుగుతున్నట్లే. అట్లాగే బాంకు డిపాజిట్లు తగ్గితే మొత్తం ద్రవ్య సప్లయి తగ్గినట్లే. వీటి సప్లయిల్లో వచ్చే మార్పుల ప్రభావంగా ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పులకు దారి తీయవచ్చు. ఆర్థిక లావాదేవీలు, ధరలు, వేతనాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. పరపతి పెరిగినప్పుడు ద్రవ్య సప్లయి పెరిగి, ధరలు తద్వారా లాభాలు పెరిగి, ఆర్థిక కార్యకలాపాల విస్తృతికి దోహదపడుతుంది. అందుకు భిన్నంగా బాంకు డిపాజిట్లు తగ్గడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు తగ్గుతాయి. ఆ విధంగా గమనించినప్పుడు వ్యాపార చక్రాలకు హేతువుగాను, వాటి నియంత్రణ సాధనంగాను బాంకు డిపాజిట్ల ప్రాముఖ్యతను గుర్తించడం జరిగింది. ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ అంశంలో పరపతి విస్తృతి ప్రధాన పాత్ర వహించినప్పటికీ లేదా ద్వితీయ పాత్ర వహించినప్పటికీ పరపతి నియంత్రణ అంశంలో పరపతి సృష్టి కీలకమైన పాత్ర వహిస్తుందనటంలో సందేహం లేదు. అయితే పరపతి సృష్టిలో బాంకుల శక్తి అనేక పరిమితుల ద్వారా పరిమితం చేయబడుతుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

BRAOU

## 19.8 సారాంశం

వాణిజ్య బాంకులు పరపతిని ఏ విధంగా సృష్టించగలవో, అందులో వున్న ప్రమేయాలు, పరిమితులు ఏమిటో వివరంగా తెలుసుకొన్నాం. పరపతి సృష్టిలో నగదు నిల్వల నిష్పత్తి, పరపతి గుణకం ఏ విధంగా ప్రధాన పాత్రను వహిస్తాయో చర్చించుకొన్నాం.

## 19.9 సంప్రదింపు గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Crowther | . | An Outline of Money |
| 2. | Sayers | : | Modern Banking |
| 3. | K. P. M. Sundaram | : | Money, Banking and International Trade |
| 4. | S. M. Israney | : | Principles of Economics |
| 5. | K. K. Kurihara | : | Monetary Theory and Public Policy |
| 6. | తెలుగు అకాడమీ ప్రచురణలు | | 1. కరెన్సీ - బాంకింగ్ - అంతర్జాతీయ వర్తకం<br>కె. రామ మోహనరావు & వి. విశ్వనాథం (1983) |

2. ద్రవ్యం - విత్తం
టి. సులోచన & టి. తిప్పారెడ్డి (1974)

3. స్థూల అర్థ శాస్త్రం
యం. నర్సింహులు, & యం. వి. యస్. మూర్తి &
వి. బ్రహ్మానందం (1990)

## 19.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులు రాయండి.**

1. "ఋణం డిపాజిట్‌ను సృష్టిస్తుంది" వివరించండి.
2. బాంకింగ్ వ్యవస్థ ద్రవ్యాన్ని ఎలా సృష్టిస్తుంది ? వాణిజ్య బాంకుల పరపతి సృష్టి విషయంలో ఉన్న పరిమితులను వివరించండి.
3. బాంకులు పరపతిని సృష్టించగలవా ? విమర్శనాత్మకంగా జవాబునిస్తూ, పరపతి సృష్టి పరిమితులను వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తుల చొప్పున జవాబులు రాయండి.**

1. బాంకు డిపాజిట్లు ఎట్లు ఏర్పడునో ఉదాహరణల ద్వారా వివరించండి.
2. ప్రాథమిక డిపాజిట్లకు, వ్యుత్పన్న డిపాజిట్లకు మధ్యగల వ్యత్యాసాన్ని వివరించండి.
3. పరపతి సృష్టి విధానాన్ని తెలుపండి.
4. బాంకు పరపతి సృష్టి పరిమితులను పేర్కొనండి.
5. పరపతి సృష్టి విషయంలో గమనించవలసిన అంశాలను విశదీకరించండి.
6. పరపతి అనగానేమి ? పరపత సృష్టి ప్రాధాన్యతను వివరించండి.
7. పరపతి సృష్టిపై వాల్టర్ లీఫ్, కానన్ పేర్కొన్న అభ్యంతరాలను వివరించండి.
8. పరపతి గుణకం అనగానేమి ? దాని ప్రమేయాలేవి ?

**- ఆచార్య వి. సుదర్శన్ రెడ్డి**

B R A O U

# ఖండం – V

# కేంద్ర బ్యాంకింగ్

BRAOU

ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య మార్కెట్‌కు కేంద్ర బ్యాంకు నాయకత్వం వహిస్తుంది. మన దేశంలో భారతీయ రిజర్వు బ్యాంకు కేంద్ర బ్యాంకుగా వ్యవహరిస్తుంది. ఈ ఖండంలో కేంద్ర బ్యాంకింగ్ వ్యవస్థను భారత దేశాన్ని సోదాహరణంగా తీసుకొని చర్చించుకొందాం. భాగం - 20 లో కేంద్ర బ్యాంకు లక్ష్యాలను, విధులను తెలుసుకొందాం. భాగాలు - 21,22లలో కేంద్ర బ్యాంకు పాటించే పరపతి నియంత్రణా సాధనాలైన పరిమాణాత్మక, గుణాత్మక చర్యలను వివరించాం. భాగం - 23 లో పరపతి ప్రణాళికా విధానాన్ని సూక్ష్మ, స్థూల స్థాయిలలో తెలుసుకొందాం.

ఈ ఖండంలో గల నాలుగు భాగాలు :

భాగం – 20 : కేంద్ర బ్యాంకులు – లక్ష్యాలు, విధులు

భాగం – 21 : పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

భాగం – 22 : గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

భాగం – 23 : పరపతి ప్రణాళికా విధానం

BRAOU

# భాగం - 20 : కేంద్ర బాంకులు - లక్ష్యాలు, విధులు

విషయ క్రమం


20.0 ఉద్దేశం

20.1 పరిచయం

20.2 కేంద్ర బాంకుల పరిణామ క్రమం

20.3 కేంద్ర బాంకు - నిర్వచనాలు

20.4 కేంద్ర బాంకుల లక్ష్యాలు

20.5 కేంద్ర బాంకు విధులు

- 20.5.1 కరెన్సీ నోట్లను జారీ చేయడం
- 20.5.2 ప్రభుత్వానికి బాంకరుగా, ఏజెంటుగా, సలహాదారుగా పని చేయడం
- 20.5.3 వాణిజ్య బాంకుల నగదు నిల్వల కర్తగా వ్యవహరించడం
- 20.5.4 అంతర్జాతీయ ద్రవ్య నిధుల పరిరక్షణ
- 20.5.5 రీడిస్కౌంటు బాంకుగా, అంతిమ ఋణదాతగా వ్యవహరించడం
- 20.5.6 కేంద్ర క్లియరెన్స్ పరిష్కార, బదలాయింపు బాంకుగా పని చేయడం
- 20.5.7 పరపతి నియంత్రణ

20.6 ముగింపు

20.7 నమూనా పరీక్షా ప్రశ్నలు

20.8 సంప్రదింపు గ్రంథాలు

20.9 పదకోశం


BRAOU

## 20.0 ఉద్దేశం

19వ శతాబ్దాంతానికి పూర్వం కేంద్ర బాంకింగ్ అంటే ఒక నిర్దిష్టమైన భావం లేదు. తరువాతి కాలంలో చాలా దేశాలలో కేంద్ర బాంకులు స్థాపించారు. ఈనాడు ప్రపంచంలో కేంద్ర బాంకు లేని దేశమే లేదు. దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య మార్కెట్‌కు కేంద్ర బాంకు నాయకత్వం వహిస్తుంది. దేశంలో గల వాణిజ్య బాంకులను, ఇతర విత్త సంస్థలను పర్యవేక్షించడం, వాటి ద్రవ్యపరమైన కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం, నోట్లను జారీచేయడం, ప్రభుత్వానికి బాంకరుగా సలహాదారుగా వ్యవహరించడం, పరపతిని నియంత్రించడం, అంతర్జాతీయ నిధులను సంరక్షించడం వంటి ముఖ్య విధులను నిర్వర్తిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే సంస్థే కేంద్ర బాంకు. భారత దేశంలో రిజర్వు బాంకు కేంద్ర బాంకుగా వ్యవహరిస్తుంది. ఈ అత్యున్నత బాంకుల క్రమవికాసం, లక్ష్యాలు, లక్ష్య సాధనలో కేంద్ర బాంకులు నిర్వర్తించే విధులు మొదలగు అంశాలను విశ్లేషణ చేయడమే ఈ భాగం ముఖ్యోద్దేశం.

## 20.1 పరిచయం

కేంద్ర బాంకులు ఆయా దేశాలలో బాంకింగ్ వ్యవస్థకు నాయకత్వం వహిస్తూ, దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే ద్రవ్య విధానాన్ని రూపకల్పన చేసి, దేశంలో మారకపు రేట్ల సుస్థిరత, ధరల స్థిరత్వం, సంపూర్ణోద్యోగిత, ఆర్థికాభివృద్ధి వంటి లక్ష్యాల సాధనలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయన్నది నిర్వివాదం. 1656 లో స్వీడన్‌లోని రిక్స్ బాంక్‌తో ప్రారంభమై, ఈనాడు అన్ని దేశాలలో కేంద్ర బాంకులు స్థాపించబడినాయి. ప్రతి దేశంలోనూ కేంద్ర బాంకులు కరెన్సీ నోట్లను జారీ చేయడం, ప్రభుత్వాలకు బాంకరుగా, సలహాదారుగా వ్యవహరించడం, దేశంలోని వాణిజ్య బాంకుల నగదు నిల్వలను సంరక్షించి వాటి వ్యవహారాలను క్రమపరచడం, దేశ పురోభివృద్ధికి అత్యంత కీలకమైన అంతర్జాతీయ విధులను పరిరక్షించడం, వాణిజ్య బాంకులకు అంతిమ ఋణదాతగా వ్యవహరించడం, వీటన్నింటికంటే ముఖ్యంగా పరపతి నియంత్రణ చేయడం ముఖ్య విధులుగా నిర్వహిస్తూ దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ద్రవ్య విధానాలను రూపొందించి ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయి. ఒకదేశంలోని కేంద్ర బాంకు విధులకు మరొక దేశంలోని కేంద్ర బాంకు విధులకు మధ్య తేడాలు ఉండవచ్చు. కాని స్థూలంగా కేంద్ర బాంకుల లక్ష్యాలు ఒక్కటే. కేంద్ర బాంకుల లక్ష్యాలు, విధులను తెలుసుకోవడం ద్వారా దేశాభివృద్ధిలో కేంద్ర బాంకులు నిర్వహించే పాత్ర, ద్రవ్య వ్యవస్థ పనిచేసే తీరు సరిగా అవగాహన చేసుకోవడానికి వీలవుతుంది. వివరాలను క్రింద చర్చించుకొందాం.

## 20.2 కేంద్ర బాంకుల పరిణామ క్రమం (Evolution of Central Banks)

ఆధునిక ఆర్థిక చరిత్రను పరిశీలిస్తే కేంద్ర బాంకింగ్ విధానం ప్రముఖమైనదిగా ఉన్నది. 20వ శతాబ్దానికి పూర్వం కేంద్ర బాంకింగ్ విధానంపై ఒక నిర్దిష్టమైన అభిప్రాయం లేదు. వివిధ దేశాలలో కేంద్ర బాంకింగ్ ఒక క్రమ పరిణామ రూపంలో రూపొందుతూ వచ్చింది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్యం అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకొన్నది. నేటి ద్రవ్యార్థిక వ్యవస్థలలో ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయిలను నిర్ణయించడంలో ద్రవ్యానికి విశిష్ట పాత్ర ఉన్నందున ద్రవ్య సప్లయ్ అవసరం ఏర్పడింది. కేంద్ర బాంకులు, వాణిజ్య బాంకులు ఈ బాధ్యతను నిర్వర్తించుచున్నాయి. ప్రతి దేశంలోని కేంద్ర బాంకు నోట్ల జారీ ద్వారా, వాణిజ్య బాంకులు తమ వద్దనున్న ద్రవ్య నిల్వల ఆధారంగా ద్రవ్య సృష్టి చేసి ఆర్థిక వ్యవస్థకు చలామణికి కావలసిన ద్రవ్య సప్లయ్ చేస్తున్నాయి. నోట్ల జారీయేగాక వివిధ రకాలైన ఇతర కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రతి దేశంలో కేంద్ర బాంకు అవసరం ఏర్పడింది. కనుక క్రమేణా ప్రతి దేశంలో కేంద్ర బాంకు ఏర్పాటు గావించవలసిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం ప్రతి దేశంలోను కేంద్ర బాంకు ఉన్నది.

కరెన్సీ నోట్లను జారీ చేయడం, చలామణిలోని ద్రవ్య సప్లయ్‌ని అదుపులో వుంచి ద్రవ్య సుస్థిరతను కాపాడటం, ద్రవ్య విధానాన్ని రూపొందించి అమలు పరచడం, ప్రభుత్వ బాంకరుగా వ్యవహరించడం, వాణిజ్య బాంకులకు బాంకుగా వ్యవహరించడం మొదలైనవి కేంద్ర బాంకు నిర్వహించే విధులలో ప్రధానమైనవి. ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక పురోగతిలోను, ఆర్థిక వ్యవస్థలలోను అనేక తేడాలుంటాయి. అందువలన ఆయా దేశాలలో వున్న కేంద్ర బాంకులు నిర్వర్తించాల్సిన విధులలోను, సాధించాల్సిన లక్ష్యాలలోను తేడాలు ఉంటాయి. కనుక దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర బాంకులు తమ విధానాలను, పద్ధతులను రూపొందించుకొంటాయి. దీనిని బట్టి అన్ని దేశాలలో కేంద్ర బాంకులు ఒకే విధంగా లేవు. నిర్మాణంలోను, వ్యవస్థలోను, అవలంభించే విధానాలలోను, ఉపయోగించే పద్ధతులలోను తేడాలుంటాయి. అయినప్పటికీ కేంద్ర బాంకులు నిర్వహించే ప్రధాన విధులు మాత్రం దాదాపు ఒకే విధంగా ఉంటాయి.

BRAOU

ఒకప్పుడు వాణిజ్య బాంకులు కరెన్సీ నోట్లను జారీ చేస్తుండేవి. ఈ నేపథ్యంలో అన్ని బాంకులు కరెన్సీ నోట్లను జారీచేయడం వలన చెలామణిలోనున్న ద్రవ్య సప్లయ్‌ని అదుపులో ఉంచడం సాధ్యం కాకపోయేది. ప్రభుత్వం నిర్దిష్ట నిబంధనలు విధించకపోవడం వలన తమ ఇష్టానుసారంగా వారివారికి తోచినట్లు కరెన్సీ నోట్లను జారీచేయసాగినాయి. అంతేగాక తమవద్ద తగినన్ని బంగారు నిల్వలు లేకుండా నోట్లను జారీచేయడం వలన, బాంకులు తమ నోట్లపై వ్రాసిన ప్రకారం సొమ్ము చెల్లించలేక దివాలా తీస్తుండేవి. తత్ఫలితంగా కరెన్సీ నోట్ల విషయంలో ప్రజలలో భయం ఎక్కువగా యుండేది. అంతేగాకుండా వివిధ బాంకులు జారీచేసే కరెన్సీ నోట్లు వివిధ రకాలుగా ఉండేవి. కరెన్సీ నోట్లు వ్యాపార అవసరాలకు మించి ఉన్నట్లయితే ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడుతూ ఉండేవి. ఇటువంటి పరిణామాలను రూపుమాపడానికి కరెన్సీ నోట్లు జారీచేసే అధికారాన్ని దేశంలోని వివిధ బాంకులకు రద్దుచేసి, ఒకే ఒక బాంకుకు ప్రభుత్వం యీ అధికారాన్ని ఇవ్వడం జరిగింది. ఈ విధంగా కరెన్సీ నోట్లు జారీచేయడంలో గుత్తాధిపత్యం పొందిన బాంకే కేంద్ర బాంకుగా రూపొందింది. కొన్ని దేశాలలో ఈ గుత్తాధికారం ఒక పెద్ద బాంకుకు అప్పగించడం జరిగింది. ఈ క్రమంలో ఆ బాంకే కేంద్ర బాంకుగా రూపొందింది. ఎం.హెచ్. డి. కాక్ పేర్కొన్న విధంగా నోట్ల జారీ గుత్తాధికారంవల్ల ప్రభుత్వ బాంకుగాను, ఏజెంటుగాను వ్యవహరించడం వలన అనేక ప్రాచీన దేశాలలో ఒక బాంకు కాలక్రమేణా కేంద్ర బాంకు స్థాయిని పొందుతూ ఉండేది. ప్రారంభ దశలో వీటిని జాతీయ బాంకులనిగాని, నోట్ల జారీ బాంకులనిగాని వ్యవహరించేవారు. కేంద్ర బాంకు అనే పదం కొద్దో గొప్పో నిర్దిష్టమైన అర్థంలో వాడటం జరిగే వరకు, కాలక్రమేణా యీ నోట్ల జారీ బాంకులే బాంకులకుండే ఇతర ధర్మాలను, విధులను చేపట్టడం ప్రారంభించాయి. ఈ విధంగా కేంద్ర బాంకింగ్‌కు నేడు ఉన్న స్వభావం అనేక దశాబ్దాలుగా జరిగిన పరిణామ ఫలితమేనని పేర్కొనాలి.

కేంద్ర బాంకులలో అతి పురాతనమైనది, తొలిగా స్థాపించబడినది స్వీడన్‌లోని రిక్స్ (Riks) బాంకు. దీనిని 1656 లో స్థాపించారు. 1656 లో ప్రయివేటు బాంకుగా ఆవిర్భవించిన రిక్స్ బాంక్ 1658లో స్టేటు బాంకుగా రూపొందింది. ఆ తరువాత 1694 లో ఇంగ్లాండ్‌లో ది బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (The Bank of England) పేరుతో కేంద్ర బాంకును స్థాపించారు. ఆ తరువాత ప్రపంచంలోని వివిధ దేశాలు క్రమంగా కేంద్ర బాంకులను స్థాపించుకోసాగాయి. 1800 లో ది బాంక్ ఆఫ్ ఫ్రాన్స్ (The Bank of France), 1814 లో ది బాంక్ ఆఫ్ నెదర్‌లాండ్స్ (The Bank of Netherlands), 1817లో ది నేషనల్ బాంక్ ఆఫ్ ఆస్ట్రియా (The National Bank of Austria), ది బాంక్ ఆఫ్ నార్వే (The Bank of Norway), 1856 లో ది బాంక్ ఆఫ్ స్పెయిన్ (The Bank of Spain), 1860 లో ది బాంక్ ఆఫ్ రష్యా (The Bank of Russia), 1875 లో ది రిష్ బాంక్ ఆఫ్ జర్మనీ (The Risch Bank of Germany), 1826 లో ది బాంక్ ఆఫ్ జపాన్ (The Bank of Japan) లు కేంద్ర బాంకులుగా ఏర్పడినాయి. 19వ శతాబ్ది కాలంలోనే పోర్చుగల్, రుమేనియా, బల్గేరియా, టర్కీ, ఈజిప్టు మొదలగు దేశాలలో కూడా కేంద్ర బాంకులు నెలకొల్పబడ్డాయి.

20వ శతాబ్దం ప్రారంభంలో నూతన ప్రపంచంలోని దేశాలే గాక చైనా, ఇండియా వంటి ప్రాచీన దేశాలలో కూడా కేంద్ర బాంకులు స్థాపించబడలేదు. అమెరికాలో 1914 లో ఫెడరల్ రిజర్వు బాంకుల రూపంలో కేంద్ర బాంకింగ్ వ్యవస్థను రూపొందించడం జరిగింది. 1920 లో బ్రెజిల్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ ఆర్థిక సమావేశం (International Finance Conference) లో ఇంతవరకు కేంద్ర బాంకును స్థాపించుకోలేని దేశాలు తక్షణమే కేంద్ర బాంకులను స్థాపించుకోవాలని తీర్మానించబడింది. తత్ఫలితంగా 1921 నుంచి వివిధ దేశాలు తమ తమ దేశాలలో కేంద్ర బాంకులను నెలకొల్పుకోసాగాయి. అందులో భాగంగానే 1925 లో ఏర్పాటు చేయబడిన హిల్టన్ యంగ్ కమీషన్ వారి సూచనల మేరకు, 1931 లో ఏర్పాటు చేయబడిన సెంట్రల్ బాంకింగ్ ఎంక్వయిరీ కమిటీ వారి సిఫార్సుల మేరకు భారత దేశంలో ఇంపీరియల్ బాంకు స్థానంలో రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా చట్టం ద్వారా 1935 లో రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా అనే పేరుతో కేంద్ర బాంకు నెలకొల్పబడింది. ఈ విధంగా ఏప్రిల్ 1, 1935 నుంచి రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా భారత దేశ కేంద్ర బాంకుగా అమలులోకి వచ్చింది.

BRAOU

వివిధ దేశాలలో వున్న కేంద్ర బాంకుల నిర్మాణంలోనూ, వ్యవస్థలోనూ తేడాలున్నాయి. ప్రారంభ దశలో నెలకొల్పిన కేంద్ర బాంకులన్నీ వాటాదార్ల మూలధనంతో స్థాపించినవే. కేంద్ర బాంకుల నిర్వహణలో సంపూర్ణమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వాటికి ఉండాలనే అభిప్రాయం కారణంగా వాటిని ప్రైవేటు సంస్థలుగా స్థాపించారు. 1929 - 34ల మధ్య ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యం (economic depression), దాని పరిణామాలు ప్రభుత్వాల జోక్యానికి దారితీసాయి. ఆర్థిక సుస్థిరతను చేకూర్చడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టాల్సి వచ్చింది. కనుక కేంద్ర బాంకులను జాతీయం చేయాలనే అభిప్రాయానికి వచ్చాయి. దీనికితోడు రెండవ ప్రపంచ యుద్ధ ప్రభావం కూడా కొంతవరకు కారణమైంది. దీని ఫలితంగా రెండవ ప్రపంచయుద్ధానికి పూర్వం కొన్ని కేంద్ర బాంకులను, ఆ తరువాత చాలా కేంద్ర బాంకులను జాతీయం చేసారు. ఈ నేపథ్యంలో 1946 లో బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌ను, 1949 లో రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియాను జాతీయం చేసారు.

## 20.3 కేంద్ర బాంకు - నిర్వచనాలు (Central Bank - Definitions)

కేంద్ర బాంకుకు నిర్దిష్టమైన నిర్వచనాన్ని పేర్కొనడం చాలా కష్టం. అది నిర్వహించే విధుల ఆధారంగా నిర్వచనాలను పేర్కొనవచ్చు. చాలామంది ఆర్థిక శాస్త్రవేత్తలు కేంద్ర బాంకు నిర్వహించు విధుల ఆధారంగా కేంద్ర బాంకుని నిర్వచించారు. ఆచార్య హాట్రే (Hawtrey) తన 'ఆర్ట్ ఆఫ్ సెంట్రల్ బాంకింగ్' (Art of Central Banking) అనే గ్రంథంలో అంతిమ ఋణదాత (lender of last resort) గా కేంద్ర బాంకును పేర్కొన్నాడు. వేరా స్మిత్ (Vera Smith) తన 'రేషనేల్ ఆఫ్ సెంట్రల్ బాంకింగ్' (Rationale of Central Banking) లో "ఒకే బాంకుకు నోట్ల జారీ విషయంలో సంపూర్ణమైన లేదా పాక్షికమైన గుత్తాధిపత్యం కల్పించిన వ్యవస్థ"గా కేంద్ర బాంకును నిర్వచించాడు (The primary definition of central banking is a banking system in which a single bank has either a complete or a residuary monopoly in the note issue – Vera Smith).

'థియరీ అండ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ సెంట్రల్ బాంకింగ్ (Theory and Principles of Central Banking) అనే గ్రంథంలో షా (Shaw) పరపతిని నియంత్రించడం ఒక్కటే కేంద్ర బాంకుకున్న వాస్తవమైన, పరిపుష్టమైన ధర్మమని అభిప్రాయపడినాడు (The one true, but at the same time all - sufficing function of a central bank is control of credit). "ద్రవ్యపు చలామణిని నియంత్రించడంతోబాటు ద్రవ్య ప్రమాణానికి గల స్థిరత్వాన్ని (stability of monetary standard) పరిరక్షించడం కేంద్ర బాంకు ముఖ్య ధర్మమని" కిష్, ఎల్కిన్ (Kisch and Elkin) లు తాము రచించిన 'సెంట్రల్ బాంక్స్' (Central Banks) అనే గ్రంథంలో పేర్కొన్నారు. జాన్సే (Jauncey) "కేంద్ర బాంకుకు గల ప్రధాన కార్యక్రమం క్లియరింగ్" అని భావించాడు (clearing is the main operation of central banking).

అంతర్జాతీయ పరిష్కారాల బాంకు (Bank for International Settlement) వారు వారి చట్టాలలో కేంద్ర బాంకును క్రింది విధంగా నిర్వచించారు. "ఏ దేశంలోనైనా కరెన్సీ పరిమాణాన్ని, పరపతి పరిమాణాన్ని క్రమబద్ధం చేయడమనే ధర్మాన్ని ఏ బాంకుకైతే అప్పగించారో ఆ బాంకునే కేంద్ర బాంకుగా పేర్కొనవచ్చు" (A central bank is defined as the bank in a country to which has been entrusted the duty of regulating the volume of currency and credit in that country"– The Statute of the Bank for International Settlement).

ఆచార్య ఎం. హెచ్. డి కాక్ (M.H. De Kock) తన గ్రంథమైన 'కేంద్ర బాంకింగ్' (Central Banking) లో కేంద్ర బాంకును క్రింది విధంగా నిర్వచించాడు : "దాని అధికార పరిధిలో వున్న ప్రాంతంలోని పరిస్థితుల మూలంగా జరిపించడం అవసరమని లేదా వాంఛనీయమని తోచిన పక్షంలో నిజమైన కేంద్ర బాంకు పైన పేర్కొన్న విధులను నిర్వచించడానికి నిత్యమూ సిద్ధంగా ఉండాలి. ఏ సమయంలోనైనా తన విధులలో ఒక్క దానిని గాని లేదా కొన్ని విధులను గాని నిర్వర్తించడంలో కేంద్ర బాంకు ప్రజా శ్రేయస్సు దృష్ట్యా మాత్రమే వ్యవహరిస్తూ లాభమే

ప్రధాన లక్ష్యంగా పెట్టుకోకుండా వ్యవహరించాలి (A true central bank should always be ready to perform any of the functions enumerated above, if the conditions and circumstances in its area of operation render it necessary or desirable for it to do so .......... it should act only in the public interest and without regard to profit as a primary consideration" – De Kock).

## 20.4 కేంద్ర బాంకుల లక్ష్యాలు

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఉత్పన్నమయ్యే నష్టాలు కనీసంగా ఉండేటట్లు, ప్రయోజనాలు గరిష్టంగా ఉండేటట్లు చూడడానికి ద్రవ్య అధికారులు (monetary authorities) కొన్ని చర్యలు తీసుకొంటారు. వాటినే ద్రవ్య విధానం (monetary policy) గా తీసుకోవాలి. ద్రవ్యార్థిక వ్యవస్థలు సాధారణంగా వ్యాపార చక్రాలకు, ద్రవ్యోల్బణానికి గురవుతూ ఉంటాయి. సమగ్ర ద్రవ్య విధానం ద్వారా ఉత్పత్తి స్థాయిని, ధరల స్థాయిని అదుపు చేయవచ్చు. వ్యాపార చక్రాలు ద్రవ్యం ఉన్న ఆర్థిక వ్యవస్థలోనే ఏర్పడుతాయి. ద్రవ్యం లేని ఆర్థిక వ్యవస్థలలో పొదుపు, పెట్టుబడులు సమానంగానే ఉంటాయి. కాని ద్రవ్యం ఉన్న ఆర్థిక వ్యవస్థలలో పొదుపు పెట్టుబడులు సాధారణంగా సమానంగా లేకపోవడం కారణంగా ఆర్థికపరమైన ఒడుదుడుకులు ఏర్పడుతాయి. ద్రవ్యంపై అదుపు ఉండాలి లేనిచో ఆర్థిక వినాశనాన్ని సృష్టిస్తుంది. అందువలన పటిష్టమైన ద్రవ్య విధానం చాలా అవసరం. ఈ ద్రవ్య విధాన రూపకల్పనలో కేంద్ర బాంకు ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఈ విధంగా ద్రవ్య విధాన రూపకల్పన కేంద్ర బాంకు యొక్క ముఖ్య లక్ష్యంగా పేర్కొనవచ్చు.

బాంకులు సృష్టించే డిపాజిట్ ద్రవ్యాన్ని అదుపులో ఉంచి ద్రవ్య సుస్థిరతకు తద్వారా క్రమబద్ధమైన ఆర్థిక పురోగతికి దోహదం చేయడం కేంద్ర బాంకు యొక్క ప్రధాన కర్తవ్యం. మారకపు రేట్లను, ధరల స్థాయిని స్థిరంగా ఉండునట్లు చూడడం, ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం వంటి వాటిని నివారించడం, సంపూర్ణోద్యోగితను సాధించడం, విదేశీ చెల్లింపుల శేషం అనుకూలంగా ఉండేటట్లు చూడడం మొదలైనవి ద్రవ్య విధాన లక్ష్యాలలో ముఖ్యమైనవి. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర బాంకు కృషి చేస్తుంది.

ద్రవ్య విధానం దేశ ఆర్థిక విధానంలో ఒక అంతర్భాగంగా వ్యవహరిస్తుంది. కనుక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ద్రవ్య నిర్వహణ అవసరం. మారకపు రేట్ల సుస్థిరత (stability of exchange rates), ధరల స్థిరత్వం (price stability), సంపూర్ణ ఉద్యోగిత (full employment), ఆర్థికాభివృద్ధి (economic development) మరి యింకా కొన్ని లక్ష్యాలను సాధించడానికి ద్రవ్య విధానం తోడ్పడుతుంది. వీటితోబాటు విదేశీ వ్యాపార చెల్లింపుల శేషం (balance of payments) సరిగా ఉండేటట్లు చూడడం, అంతర్జాతీయ ద్రవ్య సహకారాన్ని పెంపొందించడం వంటివి కూడా ద్రవ్య విధాన లక్ష్యాలలో భాగమే. ఈ లక్ష్యాలను సాధించడానికి కేంద్ర బాంకు కృషి చేస్తుంది. పైన పేర్కొన్న లక్ష్యాలను సాధించడానికి కేంద్ర బాంకు కొన్ని సాధనాలను ఉపయోగిస్తుంది. వాటినే పరపతి నియంత్రణ సాధనాలంటారు. ఈ సాధనాల సహకారంతో, వాటిని అమలు చేయడం ద్వారా ఆశించిన లక్ష్యాలను సాధించడమే కేంద్ర బాంకు ప్రధాన ధ్యేయంగా ఉంటుంది.

## 20.5 కేంద్ర బాంకుల విధులు (Functions of the Central Bank)

కేంద్ర బాంకు నిర్వహించు విధులను (functions) గూర్చి తన గ్రంథమైన కేంద్ర బాంకింగ్ (Central Banking) లో ఆచార్య ఎం. హెచ్. డి కాక్ (M. H. De Kock) సమగ్రంగా పేర్కొన్నాడు. కేంద్ర బాంకులు నిర్వహించే విధులను ప్రప్రథమంగా క్రోడీకరించి వివరించిన ఖ్యాతి అతనికే దక్కింది. వివిధ ఆర్థిక శాస్త్రవేత్తల భావాల ఆధారంగా వివిధ దేశాల కేంద్ర బాంకుల విధులను విశ్లేషించి కేంద్ర బాంకులు నిర్వహించే ఏడు రకాలైన ప్రధాన విధులను గూర్చి డికాక్ వివరించాడు. అవి

BRAOU

1. నోట్లను జారీ చేయడం.

2. ప్రభుత్వానికి బాంకరుగా, ఏజెంటుగా, సలహాదారుగా పనిచేయడం.

3. వాణిజ్య బాంకుల నగదు నిల్వలకర్తగా వ్యవహరించడం.

4. అంతర్జాతీయ ద్రవ్య నిధులను పరిరక్షించడం.

5. రీడిస్కౌంటు బాంకుగా, అంతిమ ఋణదాతగా వ్యవహరించడం.

6. కేంద్ర క్లియరెన్స్ పరిష్కార, బదలాయింపు బాంకుగా పనిచేయడం.

7. పరపతి నియంత్రణ చేయడం.

పైన పేర్కొన్న ముఖ్య విధుల నిర్వహణ ద్వారా ప్రతి దేశంలోని కేంద్ర బాంకు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా దేశ క్షేమానికి, ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలను గైకొని దేశాభ్యుదయానికి తోడ్పడుతుంది. కనుక కేంద్ర బాంకు నిర్వహించు విధులను సవివరంగా తెలుసుకోవడం చాలా అవసరం.

## 20.5.1 కరెన్సీ నోట్లను జారీ చేయడం (Issue of Currency Notes)

నోట్ల జారీ విధి ఒక ప్రత్యేక హక్కుగా దాదాపు అన్ని దేశాలలోను కేంద్ర బాంకులు కల్గియున్నాయి. ఇది ఒక క్రమపరిణామంగా కొనసాగిన ప్రక్రియ. నిజానికి 20వ శతాబ్ద ప్రారంభం వరకు కేంద్ర బాంకులన్నీ జారీ బాంకులు (banks of issue) గానే చెలామణి అవుతూ వచ్చాయి. చాలా దేశాలలో ప్రభుత్వాలు నాణెపు కరెన్సీని జారీ చేస్తూ నోట్ల జారీని కేంద్ర బాంకులకు అప్పగించారు. కొన్ని దేశాలలో ప్రభుత్వమే స్వయంగా నోట్లను జారీ చేస్తుంది. ఆ విధంగా జారీ చేసిన నోట్లు ప్రజా విశ్వాసం కోల్పోవడం మూలంగా నోట్ల జారీ విధిని కేంద్ర బాంకులకు అప్పగించారు. దేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లను, డిపాజిట్ ద్రవ్యాన్ని వ్యాపార పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సరిదిద్దడం, ద్రవ్య సుస్థిరత నెలకొల్పడం కేంద్ర బాంకు విధులలో ముఖ్యమైనవి. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సుస్థిరతను కాపాడే నిమిత్తం కేంద్ర బాంకులకు కరెన్సీ నోట్లు జారీ చేయడంలో గుత్తాధిపత్యం (monopoly) ఇవ్వడం జరిగింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలు త్వరితగతిని అభివృద్ధి చెందడంతో వివిధ దేశాలలో కరెన్సీ నోట్లు ఎక్కువగా ఉపయోగంలోకి వచ్చాయి. అందువలన నోట్ల చలామణిలో ఒకే రకమైన విధానం అవసరమైంది. కనుక వేరా స్మిత్ (Vera Smith) చెప్పినట్లు నోట్ల జారీని ఇతోధికంగా నియమబద్ధం చేసే ఉద్దేశంతో ప్రతి దేశంలోను ఒకే ఒక బాంకుకు నోట్ల జారీ సంపూర్ణ గుత్తాధికారంగాని, పాక్షికమైన గుత్తాధికారంగాని సంక్రమింపచేస్తూ ప్రత్యేకమైన చట్టాలు రూపొందించబడినాయి.

స్వీడన్, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, ఇంగ్లాండ్, జర్మనీ, కెనడా లాంటి దేశాలలో సంపూర్ణ గుత్తాధిపత్యంతో నోట్లను జారీచేసే కేంద్ర బాంకులు వెలసిన నాటికి కూడా ఇతర బాంకులు కరెన్సీ నోట్లను జారీ చేస్తుండేవి. కాల క్రమేణా ఇతర బాంకులకు ఆ అధికారం రద్దు చేయబడింది. ప్రస్తుతం ప్రపంచంలో చాలా దేశాలలో నోట్ల జారీ విషయంలో కేంద్ర బాంకులు సంపూర్ణ గుత్తాధిపత్యం పొందియున్నాయి. భారత దేశంలో రిజర్వు బాంకు స్థాపన (1935 సం॥) కు పూర్వం ప్రభుత్వం కరెన్సీ నోట్లను జారీ చేయగా, ఇంపీరియల్ బాంకు పరపతి ద్రవ్యాన్ని అదుపులో పెట్టే బాధ్యత నిర్వహిస్తుండేది. 1935 సంవత్సరం నుండి యీ రెండు బాధ్యతలను రిజర్వు బాంకు చేపట్టింది.

కరెన్సీ నోట్లను జారీ చేయడానికి కేంద్ర బాంకు బంగారం, విదేశీ మారక ద్రవ్యం, విదేశీ సెక్యూరిటీలు, స్వదేశీ సెక్యూరిటీలను రిజర్వులుగా ఉంచుకొని వాటి ఆధారంగా ప్రభుత్వానికి, ఇతర సంస్థలకు ప్రత్యక్షంగా

BRAOU

ద్రవ్య మార్కెట్‌కు అవసరమైన కరెన్సీని సప్లయ్ చేస్తుంది. వీటికి సంబంధించిన నియమ నిబంధనలపై కేంద్ర బాంకుకు కరెన్సీ జారీ చేయడంలో గుత్తాధిపత్యం ఉన్నా, అది అపరిమితమైన గుత్తాధిపత్యం మాత్రం కాదు. స్వర్ణ ప్రమాణాన్ని పరిరక్షించడానికి ద్రవ్య సుస్థిరతను కాపాడటానికి - ముఖ్యంగా ద్రవ్యోల్బణ ప్రమాదాన్ని నివారించడానికి - కరెన్సీ నోట్లను జారీ చేసే అధికారాల విషయంలో కొన్ని హద్దులను నిర్దేశించాల్సి వచ్చింది. పైన పేర్కొన్న కరెన్సీ రిజర్వుకు సంబంధించిన నిబంధనలు వివిధ దేశాలలో వివిధ రకాలుగా ఉన్నాయి.

## నోట్లను జారీచేసే పద్ధతులు (Systems of Note Issue)

నోట్లను జారీచేసే నిబంధనలతోబాటు కొన్ని పద్ధతులు కూడా ఉన్నాయి. కేంద్ర బాంకు ఈ పద్ధతులను కూడా పాటించాలి. నోట్లను జారీ చేయటంలో అనుసరించాల్సిన వివిధ పద్ధతులను క్రింద వివరించడం జరిగింది.

1. స్థిర లేదా పాక్షిక విశ్వాసాశ్రిత పద్ధతి (Fixed or Partial Fiduciary System)

2. గరిష్ట నోట్ల జారీ పద్ధతి (Maximum Note Issue System)

3. అనుపాత రిజర్వు పద్ధతి (Proportional Reserve System)

4. కనిష్ట రిజర్వు పద్ధతి (Minimum Reserve System)

5. విదేశీ నిల్వల రిజర్వు పద్ధతి (Foreign Exchange Reserve System)

పైన పేర్కొన్న వాటిలో వివిధ దేశాల కేంద్ర బాంకులు తమకు అనుకూలమైన దానిని పాటించి నోట్లను జారీ చేస్తున్నాయి.

### 1. స్థిర లేదా పాక్షిక విశ్వాసాశ్రిత పద్ధతి

మొదటగా ఈ పద్ధతి 1844లో ఇంగ్లాండ్‌లో అమలులోకి వచ్చింది. ఆ తరువాత అనేక ఇతర దేశాలు కూడా అనుసరించాయి. దీని ప్రకారం కరెన్సీ నోట్లను జారీచేయడానికి ఒక నిర్ణీత మొత్తం వరకు బంగారపు నిల్వలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ సెక్యూరిటీల హామీ ఉంటే చాలు. ఆ నిర్దిష్టమైన పరిమితి దాటి కేంద్ర బాంకు కరెన్సీ నోట్లను జారీ చేస్తే వాటికి నూటికి నూరుపాళ్ళు బంగారపు నిల్వలుండి తీరాలి. ఈ పద్ధతి ప్రకారం నోట్ల జారీ అవ్యాకోచంగా ఉంటుంది. ఆర్థిక సంక్షోభం, అత్యవసర పరిస్థితులలో కరెన్సీకి డిమాండు పెరిగినా కూడా తగిన సర్దుబాటు చేయడానికి వీలుపడదు. కాబట్టి దీనిని స్థిర విశ్వాసాశ్రిత పద్ధతి అనేవారు. ఈ పద్ధతికి వ్యాకోచత్వ లక్షణం లోపించినందువలన అవసరమైనప్పుడు ఈ హద్దును పెంచడానికి 1928 చట్టం అనుమతించింది. ఈ విధంగా అనేకసార్లు విశ్వాసాశ్రిత హద్దును పెంచడం జరిగింది. ఈ హద్దును మార్చే హక్కు ప్రభుత్వానికి ఉన్నందువలన యీ స్థిర, పాక్షిక విశ్వాసాశ్రిత జారీ విధానాన్ని ఇంగ్లాండ్ వదులుకొన్నది. తరువాత బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రభుత్వ సెక్యూరిటీలు, బంగారు, వెండి నాణేల ఆధారంగా ప్రత్యక్షంగా నోట్ల జారీకి అనుమతి పొందింది.

### 2. గరిష్ట నోట్ల జారీ పద్ధతి

ఈ పద్ధతి 1926వ సంవత్సరానికి పూర్వం ఇటలీలోను, 1940 వరకు జపాన్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్ దేశాలలోను 1870 - 1928 సంవత్సరాల మధ్య కాలంలో అమలులో ఉండేది. తరువాత 1939 సంవత్సరం నుంచి ఇంగ్లాండ్‌లోనూ, 1941 నుంచి జపాన్‌లోనూ యీ పద్ధతి అమలులోకి వచ్చింది. ఈ పద్ధతి ప్రకారం బంగారపు నిల్వల హామీతో నిమిత్తం లేకుండా కేంద్ర బాంకు జారీచేసే కరెన్సీ నోట్ల జారీకి గరిష్ట పరిమితిని నిర్ణయించడం

BRAOU

జరుగుతుంది. ఈ గరిష్ఠ పరిమితిని అవసరమైనప్పుడు సవరించవచ్చు. గరిష్ఠ పరిమితి దాటి నోట్లను జారీచేసే హక్కు కేంద్ర బాంకుకు ఉండదు. అందువలన ఇంగ్లాండ్, జపాన్ దేశాలలో అత్యవసర పరిస్థితులలో గరిష్ఠ పరిమితిని హెచ్చించే అధికారాన్ని శాసన సభ ప్రభుత్వానికి ఇచ్చింది. కాని ఫ్రాన్స్ దేశం యీ గరిష్ఠ నోట్ల జారీ విధానాన్ని 1938లో త్యజించింది.

**3. అనుపాత రిజర్వు పద్ధతి**

ఈ పద్ధతి ప్రకారం చలామణిలోనున్న కరెన్సీ నోట్లలో కొంత శాతం మేరకు కేంద్ర బాంకు వద్ద బంగారం లేదా విదేశీ మారక నిల్వలుండాలి. మిగతా భాగం ప్రభుత్వ బాండ్ల రూపంలో ఉండవచ్చు. ఈ పద్ధతి ప్రకారం జారీ చేయబడిన నోట్లు ప్రభుత్వ బాండ్ల హామీ కల్గి యుండేవి. భారత దేశంలో యీ పద్ధతి 1935 నుంచి 1956 వరకు అమలులో ఉంది. ఈ పద్ధతి ప్రకారం రిజర్వు బాంకు నోట్ల జారీకి 40 శాతం బంగారం రూపంలోగాని, విదేశీ ప్రభుత్వ బాండ్ల రూపంలో గాని ఉండాలి. 1914 నుంచి యీ పద్ధతి అమెరికాలో అమలులోకి వచ్చింది. దీని ప్రకారం నోట్ల జారీకి 40 శాతం వరకు బంగారం నిల్వలు బాంకు వద్ద నిల్వ ఉంచాలి. ఆ తర్వాత దీనిని 25 శాతానికి తగ్గించారు.

కరెన్సీ నోట్లను బంగారంలోకి మార్చడానికి వీలు కల్పించే నిమిత్తం యీ పద్ధతి ప్రవేశపెట్టబడింది. ప్రజలందరూ తమ నోట్లను ఒకేసారి బంగారంలోకి మార్చడానికి సిద్ధపడరు. కాబట్టి జారీ చేసే నోట్లకు నూరు శాతం బంగారం నిల్వలు ఉండవలసిన అవసరం లేదు. కొంత శాతం బంగారపు నిల్వ ఉంటే చాలు. ఈ విధానం ద్వారా కరెన్సీ నోట్లను సులభంగా జారీ చేయడానికి వీలవుతుంది. ఉదాహరణకు రూ. 100 కోట్ల కరెన్సీ నోట్లను జారీ చేయాలంటే రూ. 25 కోట్ల విలువగల బంగారం ఉంటే సరిపోతుంది. అంటే బంగారం విలువకు నాలుగు రెట్లు కరెన్సీ నోట్లను జారీ చేయవచ్చు. అత్యవసర పరిస్థితులలో, యుద్ధ కాలంలో కరెన్సీ నోట్లకు డిమాండ్ పెరిగినప్పుడు నోట్ల జారీని పెంచడానికి ఈ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుంది.

ఈ విధానంలో కూడా లోపాలు లేకపోలేదు. ఈ పద్ధతిలో కేంద్ర బాంకు వద్దనున్న బంగారానికి, చలామణిలోనున్న నోట్లకు పొత్తు కుదురుతుంది. కాని వ్యాపారావసరాలకు, కరెన్సీ నోట్ల పరిమాణానికి పొత్తు కుదరదు. ధరల పెంపుదలను అరికట్టుటకు యీ పద్ధతి ఉపయోగపడదు. నోట్ల జారీకి హామీగా కొంత భాగం మాత్రం బంగారపు నిల్వలున్నందువలన, ప్రజలందరు ఒకేసారి తమ నోట్లను బంగారంలోకి మార్చుకోదలిస్తే యీ పద్ధతి విఫలమౌతుంది. ఒకవేళ కేంద్ర బాంకుకు అదనంగా బంగారం వచ్చినప్పుడు ఆ మేరకు నోట్ల జారీని పెంచవచ్చు. అదే విధంగా కేంద్ర బాంకు వద్ద బంగారం నిల్వలు తగ్గినప్పుడు నోట్ల జారీని తగ్గించవలసి ఉంటుంది. కాని అదనంగా బంగారం వచ్చినప్పుడు అదనపు నోట్లను జారీ చేయకపోవచ్చుగాని, బంగారం తగ్గినప్పుడు మాత్రం నోట్ల జారీని తగ్గించక తప్పదు. స్వభావ రీత్యా కాఠిన్యం వలన యీ పద్ధతి యిబ్బందికరంగా మారింది. కాబట్టి భారతీయ రిజర్వు బాంకు యీ పద్ధతికి 1956 లో స్వస్తి చెప్పి కనిష్ఠ రిజర్వు పద్ధతిని అవలంబించింది. బర్జెస్ (Burges) ఉద్దేశంలో యీ అనుపాత పద్ధతి ఎంతో కఠినమైనది. ఆటవిడుపుల కాలంలో, ఆర్థిక మాంద్య పరిస్థితులలో నోట్ల జారీని తగ్గించడానికి లేదా అత్యయిక పరిస్థితులలో, వ్యాపార విస్తరణ కాలంలో సత్వరమే నోట్ల జారీని పెంచడానికి సాధ్యంకాదు.

**4. కనిష్ఠ రిజర్వు పద్ధతి**

భారత దేశంలో 1956 రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా సవరణ చట్టం ద్వారా యీ కనిష్ఠ రిజర్వు పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఈ పద్ధతిలో కేంద్ర బాంకు జారీచేసే నోట్ల జారీకి హామీగా ఉండవలసిన బంగారం, విదేశీ మారక నిల్వలకు కనిష్ఠ పరిమితిని నిర్ణయించడం జరుగుతుంది. ఈ కనిష్ఠ పరిమితిని మించి జారీ చేయబడే నోట్లకు

వాణిజ్య బిల్లులు, ప్రభుత్వ సెక్యూరిటీలు హామీగా ఉంటాయి. ఈ పద్ధతిలో నోట్ల జారీకి గరిష్ట పరిమితి లేదు. కేంద్ర బాంకు దేశ పరిస్థితులకు అనుగుణంగా తన విచక్షణను ఉపయోగించి నోట్లను జారీచేయవచ్చు. ఈ పద్ధతి 1928 సంవత్సరం నాటికి చాలా దేశాలలో అమలులోకి వచ్చింది. 1930-33ల మధ్య ఏర్పడిన ఆర్థిక మాంద్య పరిస్థితుల ఒత్తిడివలన, రెండ ప్రపంచ యుద్ధ ప్రభావం వలన చాలా దేశాలు యీ కనిష్ట పరిమితిని తాత్కాలికంగా వదులుకోవడం లేదా కనిష్ట పరిమితిని తగ్గించడం అనివార్యమైంది.

1956 సంవత్సరంలో భారతీయ రిజర్వు బాంకు కనిష్ట రిజర్వు పద్ధతిని ప్రవేశపెట్టింది. చట్టం ప్రకారం నోట్ల జారీకి గాను రిజర్వు బాంకు తనవద్ద కనీసం రూ. 115 కోట్ల విలువగల బంగారం, రూ. 400 కోట్ల విలువగల విదేశీ మారక నిల్వలు ఉంచుకోవాలి.

**5. విదేశీ మారక ద్రవ్య నిల్వల పద్ధతి**

ఈ పద్ధతి అనుపాత రిజర్వు పద్ధతి, కనిష్ట రిజర్వు పద్ధతుల కలయిక. ఈ పద్ధతి ప్రకారం బంగారం నిల్వలున్నా, లేకున్నా విదేశీ మారక ద్రవ్య సెక్యూరిటీల ఆధారంగా కూడా కేంద్ర బాంకు కరెన్సీ నోట్లను జారీ చేయవచ్చు.

పైన పేర్కొన్న వివిధ పద్ధతుల ఆధారంగా కేంద్ర బాంకులు కరెన్సీ నోట్లను జారీ చేయడంలో దేశ కాలమాన పరిస్థితులను బట్టి అవలంబిస్తాయి.

నోట్లను జారీ చేయడానికి బంగారపు నిల్వలు అవసరమా అన్నది ప్రధానంగా చర్చించవలసిన అవసరముంది. ఈ బంగారపు నిల్వలు దేశంలో చలామణిలోనున్న కరెన్సీకి హామీగా ఉంటుంది. నోట్లను నాణేలలోకి మార్పు చేయడానికి వీలు కల్పిస్తుంది. విదేశీ వర్తక చెల్లింపుల శేషంలోని తేడాలను పరిష్కరించడానికి ఉపయోగపడుతుంది. పై రెండు విధులలో విదేశీ వ్యాపారం చెల్లింపుల శేషంలోని అసమతౌల్యాన్ని పరిష్కరించడానికి ముఖ్యంగా బంగారపు నిల్వలను ఉపయోగించడం మూలాన యీ నిల్వల విధానం బలహీనమవుతుందని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త కేన్స్ అభిప్రాయం. పూర్వం శాస్త్రవేత్తలు కరెన్సీ నోట్లను బంగారంలోకి మార్చడానికి పూర్తి అవకాశం ఉండాలని అభిప్రాయపడేవారు. ఈ అవకాశం స్వర్ణ ప్రమాణం అమలులోనున్న దేశాలలో ఉంటుంది. బంగారపు నిల్వలు ఉన్నంతమాత్రాన కరెన్సీ విలువలో సుస్థిరత, ధరల మారకపు విలువలలో సుస్థిరత ఉండకపోవచ్చు. అధికంగా నిల్వలున్న దేశాలలో కూడా అప్పుడప్పుడూ ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ అనుభవాలను పురస్కరించుకొని చాలా దేశాలు యీ బంగారపు నిల్వలను తగ్గించుకోవాలనే అభిప్రాయానికి రావడం జరిగింది.

ఒక గరిష్ట పరిమితిని నిర్ణయించి, ఆ పరిమితికి లోబడి బంగారపు నిల్వలతో నిమిత్తం లేకుండా కరెన్సీ నోట్లను జారీచేయడానికి కేంద్ర బాంకుకు పూర్తి అధికారం యివ్వాలని ప్రముఖ అర్థశాస్త్రవేత్త క్రౌథర్ (Crowther) సూచించాడు. ద్రవ్య సుస్థిరతను కాపాడటానికి, అవసరాలకు అనుగుణంగా కరెన్సీని జారీ చేయడానికి కేంద్ర బాంకుకు అధికారం ఉండాలని 1937లో ఆస్ట్రేలియన్ బాంకింగ్ కమీషన్ (Australian Banking Commission), ఇంగ్లాండ్‌లోని మాక్మిలన్ కమిటీ (Macmillan Committee) క్రౌథర్ అభిప్రాయంతో ఏకీభవించారు. బంగారపు నిల్వలను చట్టరీత్యా నిర్ణయించడానికి బదులు ఆ నిర్ణయాన్ని కేంద్ర బాంకుకు వదిలిపెట్టడం మంచిదని కేన్స్ (Keynes) అభిప్రాయం. కరెన్సీ జారీకి గరిష్ట పరిమితి నిర్ణయించినందువలన కేంద్ర బాంకు తన ఇష్టానుసారంగా కరెన్సీ నోట్లను జారీచేయడానికి వీలుపడదు. కనిష్ట బంగారపు నిల్వలు అత్యయిక పరిస్థితులలో ఉపయోగపడతాయి. అందువలన కేంద్ర బాంకు వద్ద ఒక కనిష్ట పరిమితి వరకు బంగారపు నిల్వలు ఉండాలని, కరెన్సీ జారీకి ఒక గరిష్ట పరిమితి ఉండాలనే అభిప్రాయాన్ని కేన్స్ సమర్థించాడు.

BRAOU

భారత దేశంలో రిజర్వు బాంకు చట్టంలోని 22వ సెక్షన్ ప్రకారం కరెన్సీ నోట్ల ముద్రణ జారీలపై రిజర్వు బాంకుకు సర్వాధికారముంది. రూపాయి నోట్లు, రూపాయి నాణేలు, చిల్లర నాణేలు ప్రభుత్వం తయారు చేసి రిజర్వు బాంకు ద్వారా విడుదల చేస్తుంది. ద్రవ్య వ్యవస్థను సక్రమంగా నడపటానికి రిజర్వు బాంకుకున్న అధికారాలలో కరెన్సీ జారీ ముఖ్యమైంది. రిజర్వు బాంకు చట్టం ప్రకారం కరెన్సీ నోట్లను జారీ చేయడానికి, బాంకింగ్ వ్యవహారాలను చూడటానికి రిజర్వు బాంకులో రెండు ప్రత్యేక శాఖలు కలవు. వీటిని జారీ శాఖ మరియు బాంకింగ్ శాఖ అంటారు. జారీ శాఖ నోట్లను జారీ చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రజలకు కరెన్సీ నోట్లను విడుదల చేయడం, వారి వద్ద నుంచి తిరిగి తీసుకోవడం బాంకింగ్ శాఖ కర్తవ్యం. ఉదాహరణకు ఒక షెడ్యూల్డు బాంకు బాంకింగ్ శాఖ వద్ద నున్న తమ డిపాజిట్ల నుండి అవసరమైన నగదును తీసుకోవచ్చు. బాంకింగ్ శాఖ ఆ బాంకుకు కావలసిన డినామినేషన్లలో కరెన్సీ నోట్లను యిచ్చి ఆ బాంకు ఖాతాకు ఖర్చు వ్రాస్తుంది. అదే విధంగా బాంక్ నగదును బాంకింగ్ శాఖకు డిపాజిట్ చేసినప్పుడు షెడ్యూల్డు బాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఇటువంటి లావాదేవీల నిమిత్తం బాంకింగ్ శాఖవద్ద తగినంత కరెన్సీ ఉంటుంది. తమ వద్దనున్న కరెన్సీ తగ్గినప్పుడు తన ఆస్తులను కొన్నింటిని జారీ శాఖకు బదిలీచేసి, అవసరమైన కరెన్సీ నోట్లను తీసుకొంటుంది. తమవద్ద కరెన్సీ నోట్లు అధికంగా ఉంటే బాంకింగ్ శాఖ ఆ కరెన్సీని జారీ శాఖకు బదిలీ చేస్తుంది. దానికి పరిహారంగా ఆస్తులను తీసుకొంటుంది. కరెన్సీకి బదులు నాణేలను, నాణేలకు బదులు కరెన్సీని బదిలీ చేసే పని జారీ శాఖే స్వయంగా నిర్వహిస్తుంది.

జారీ శాఖ కరెన్సీ నోట్లకు బదులు ఏ రకమైన ఆస్తిని ఇచ్చిపుచ్చుకోవాలన్న విషయం రిజర్వు బాంకు చట్టం 33వ సెక్షన్‌లో యివ్వబడింది. దీని ప్రకారం, నోట్లకు బదులు బంగారం కాని, బంగారు నాణేలు గాని, విదేశీ సెక్యూరిటీలుగాని, రూపాయి నాణేలుగాని, రూపాయి సెక్యూరిటీలుగాని, బాంకు క్రయానికి అర్హత కలిగిన హుండీలు కాని, ప్రామిసరీ నోట్లుగాని అయివుండాలి. 1935లో రిజర్వు బాంకును స్థాపించినప్పటినుండి అనుపాత రిజర్వు పద్ధతి ప్రకారం నోట్లను జారీచేయడం జరిగింది. ఈ పద్ధతిని అనుసరించి, జారీ చేసిన నోట్లకు రక్షణగా 40 శాతానికి తగ్గకుండా బంగారం గాని, విదేశీ సెక్యూరిటీలుగాని, 40 కోట్ల రూపాయల విలువకు తక్కువ కాని బంగారం గాని నిల్వలుగా ఉండాలనే నిబంధన ఉండేది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో, ఆటు తర్వాత దేశంలో చెలామణిలోనున్న కరెన్సీ నోట్ల మొత్తం విదేశీ నిల్వలపై ఆధారపడకుండా ఉండే విధంగా కేంద్ర బాంకు చట్టాలలో సవరణలు చేయడం జరిగింది. విదేశీ నిల్వల ప్రయోజనం దేశంలో చెలామణి అవుతున్న నోట్లకు రక్షణ కాదనీ, అంతర్జాతీయ వ్యాపార చెల్లింపులలోని లోటును తీర్చడానికి అవి ఉపయోగపడుతాయనీ గుర్తించి రిజర్వు బాంకు చట్టంలో అవసరమైన మార్పులు తీసుకొని రావడం జరిగింది. 1956 రిజర్వు బాంకు సవరణ చట్టం ద్వారా నోట్ల జారీకి సంబంధించి అనుపాత రిజర్వు పద్ధతికి స్వస్తి చెప్పడం జరిగింది. దానికి ప్రతిగా కనిష్ట రిజర్వు పద్ధతి అమలులోకి వచ్చింది. 1956 చట్టం ప్రకారం రిజర్వు బాంకు వద్ద కనీసం రూ. 115 కోట్ల విలువగల బంగారం, రూ. 400 కోట్ల విలువగల విదేశీ మారక నిల్వలు ఉండాలి.

రిజర్వు బాంకుకు కరెన్సీ చెస్టులను నిర్వహించడం మరో ముఖ్యమైన బాధ్యత. ప్రభుత్వ వ్యవహారాలు లావాదేవీలకు, బాంకుల, ప్రజల లావాదేవీలకు కావలసినంత కరెన్సీని రిజర్వు బాంకు అందజేయాలి. బాంకింగ్ శాఖకు అవసరమైనప్పుడు నోట్లను సమకూర్చడమేకాక ప్రజలకు కూడా నోట్లకు బదులు నాణేలను, నాణేలకు బదులు నోట్లను ఇస్తుంది. ఈ బాధ్యతను నిర్వహించడానికి ప్రధాన నగరాలలో జారీ శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. బాంకు తన ఏజెంట్లుగా వ్యవహరించే స్టేటు బాంక్, దాని అనుబంధ బాంకులు, వాటి శాఖల వద్ద ఈ బాంకుల శాఖలు లేనిచోట ప్రభుత్వ ట్రెజరీలు, సబ్‌ట్రెజరీల వద్ద కరెన్సీ చెస్టులను నెలకొల్పింది. కరెన్సీ చెస్టులలో ఎప్పుడూ సరికొత్త నోట్లు, చెలామణిలోనున్న నోట్లు, రూపాయి నాణేలుంటాయి. ఏ రోజైనా ఏ

BRAOU

బాంకుగాని, ట్రెజరీ గాని తమ చెల్లింపులు తమ వద్దనున్న నగదును మించినట్లయితే కరెన్సీ చెస్టుల నుండి కావలసిన నగదును తీసుకోవచ్చు. ఒకవేళ చెల్లింపులు తక్కువైనట్లయితే మిగులు నగదును చెస్టులలో జమకట్టవచ్చు. ఈ విధంగా కరెన్సీ చెస్టులుండటం వలన బాంకులు, ట్రెజరీలు నగదును ఒకచోటనుండి ఇంకొక చోటికి తరలించవలసిన అవసరం ఉండదు.

### 20.5.2 ప్రభుత్వానికి బాంకరుగా, ఏజెంటుగా, సలహాదారుగా పనిచేయడం (Acting as Banker, Agent and Adviser to Government )

దాదాపుగా అన్ని దేశాలలోను కేంద్ర బాంకు ప్రభుత్వానికి బాంకరుగా, ఏజెంటుగా, సలహాదారుగా అనేక విధులను నిర్వర్తిస్తుంది. ప్రభుత్వ బాంకరుగా కేంద్ర బాంకు ప్రభుత్వ శాఖలకు, వివిధ బోర్డులకు సంస్థలకు గల ఖాతాలన్నింటినీ నిర్వహిస్తుంది. అవసరమైనప్పుడు కేంద్ర బాంకు ప్రభుత్వానికి తాత్కాలిక ధన సహాయం కూడా చేస్తుంది. ఆర్థిక మాంద్య పరిస్థితులలో, యుద్ధ కాలాలలో, అత్యవసర పరిస్థితులలో అసాధారణ ఋణాలను మంజూరు చేయడం, విదేశీ ద్రవ్యాల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన ప్రభుత్వ లావాదేవీలు జరపడం లాంటి విధులను కేంద్ర బాంకు నిర్వహిస్తుంది. ప్రభుత్వ ఆర్థిక ఏజెంటుగా అనేక సేవలను అందజేస్తూ దేశంలో ఉన్న ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి ప్రభుత్వానికి సలహాదారుగా కూడా వ్యవహరిస్తుంది. ప్రభుత్వ వ్యవహారాల వలన చెలామణిలోనున్న ద్రవ్యం పెరిగినప్పుడు తమవద్ద నున్న ప్రభుత్వ బాండ్లను అమ్మి, చలామణిలోనున్న ద్రవ్యం తగ్గినప్పుడు తమవద్దనున్న ప్రభుత్వ బాండ్లను కొనడం ద్వారా ద్రవ్య పరిమాణాన్ని స్థిరంగా ఉంచి తద్వారా ద్రవ్య మార్కెట్లో ఒడుదుడుకులను నివారించుటకు కృషి చేస్తుంది.

కేంద్ర బాంకు ప్రభుత్వ ఏజెంటుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వ ఋణాలు కేంద్ర బాంకు ద్వారా జారీచేయబడుతాయి. ఈ ఋణాలకు సంబంధించిన వ్యవహారాలన్నీ కేంద్ర బాంకు నిర్వహిస్తుంది. ప్రభుత్వానికి తాత్కాలికంగా డబ్బు కొరత ఏర్పడినప్పుడు కేంద్ర బాంకు అర్థనోపాయ అడ్వాన్సులు (ways and means advances) మంజూరు చేస్తుంది. విదేశీ ఋణాల చెల్లింపుల నిమిత్తం కేంద్ర బాంకు ప్రభుత్వానికి విదేశీ మారక ద్రవ్యాన్ని సప్లయ్ చేస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన ద్రవ్య విధానాన్ని అమలు పరిచే బాధ్యత కేంద్ర బాంకు చేపడుతుంది. ద్రవ్య విధానాన్ని నిర్ణయించేటప్పుడు ప్రభుత్వం కేంద్ర బాంకు సలహాలను తీసుకొంటుంది.

BRAOU

వాణిజ్య బాంకులు తమ ఖాతాదారుల విషయంలో ఏ విధులైతే నిర్వహిస్తాయో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బాంకింగ్ ఖాతాలు నిర్వహించడంలో అవే విధులను కేంద్ర బాంకు నిర్వహిస్తుంది. ప్రభుత్వం తరపున ఒక ఖాతానుంచి మరొక ఖాతాకు, ఒక కేంద్రం నుంచి మరొక కేంద్రానికి నిధులను మార్పిడి చేస్తుంది. ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలు అత్యధిక సంఖ్యలో ఉండటంమూలాన, ప్రభుత్వ ఖాతాలను నిర్వహించడం వ్యయ ప్రయాసలతో కూడుకొన్న పని. కొన్ని సందర్భాలలో ప్రభుత్వం తన ఖాతాలో తగినంత నిల్వలను చూపించే నిమిత్తం కేంద్ర బాంకు వద్ద అప్పు చేస్తుంది.

ద్రవ్యపరమైన విధుల నిర్వహణను కాలక్రమేణా చాలా దేశాలలో ప్రభుత్వాలు కేంద్ర బాంకులకు అప్పగించడం జరిగింది. 1936లో రిజర్వుబాంక్ ఆఫ్ న్యూజిలాండ్, బాంక్ ఆఫ్ కెనడాలకు జాతీయ ఋణాల నిర్వహణ బాధ్యత అప్పగించడం జరిగింది.

ప్రభుత్వానికి, కేంద్ర బాంకులకు గల ఆర్థిక సంబంధాలను సమీక్షిస్తే అనేక పరిణామాలు, పోకడలు కనిపిస్తాయి. ప్రభుత్వాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కేంద్ర బాంకుల ఋణాల మీద ఎక్కువగా

ఆధారపడుతున్నాయి. కేంద్ర బాంకులు ఆయా ప్రభుత్వాలకు పైన వివరించిన విధంగా బాంకరుగా, ఏజెంటుగా, సలహాదారుగా వ్యవహరించి ఎంతో ఉపయుక్తమైన సేవలను అందిస్తాయి.

భారత దేశంలో భారతీయ రిజర్వు బాంకు చట్టపరంగా కేంద్ర ప్రభుత్వానికి అంగీకరించిన ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకు బాంకరుగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వాలకు అవసరమైన అన్ని రకాల బాంకింగ్ సేవలను అందిస్తుంది. ప్రభుత్వ చెల్లింపులను సమీకరించడం, డిపాజిట్లను స్వీకరించడం, ప్రభుత్వ నిధుల బదిలీ మొదలగు సేవలను రిజర్వు బాంకు అందిస్తుంది. ప్రభుత్వం యొక్క ప్రధానమైన అకౌంట్లు రిజర్వు బాంకు వద్ద ఉంటాయి. రిజర్వు బాంకు స్థాపించడానికి మునుపు ప్రభుత్వ లావాదేవీలను ఇంపీరియల్ బాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించేది. కాని ప్రభుత్వ ఋణాల నిర్వహణ ప్రభుత్వమే నిర్వహించేది. ఈ రెండు బాధ్యతలను తర్వాత రిజర్వు బాంకుకు అప్పగించడం జరిగింది. రిజర్వు బాంకు ఇటు కేంద్ర ప్రభుత్వానికి, అటు రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా బాంకరుగా పనిచేస్తుంది.

రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా చట్టంలోని సెక్షన్లు 20,21 ప్రకారం రిజర్వు బాంకు కేంద్ర ప్రభుత్వం యొక్క బాంకింగ్ వ్యవహారాలు నిర్వహించవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వం తమ వద్దనున్న నగదు నిల్వలను వడ్డీలేకుండా కేంద్ర బాంకువద్ద డిపాజిట్ చేస్తుంది. సెక్షన్ 21 A ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాల తరపున అటువంటి విధులను కుదిరిన ఒప్పందాల మేరకు రిజర్వు బాంకు నిర్వహిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాంకరుగా వ్యవహరించడానికి సంబంధించిన వివిధ నియమ నిబంధనలను ప్రభుత్వాలకు, బాంకుకు మధ్య జరిగిన ఒప్పందాల మేరకు నిర్ణయించబడుతాయి. అటువంటి ఒప్పందం మొట్టమొదటిసారిగా 1935 ఏప్రిల్‌లో జరిగింది. తరువాత ఆ ఒప్పందాలలో కొన్ని సవరణలు చేయడం జరిగింది. ఈ ఒప్పందం మేరకు కేంద్ర ప్రభుత్వ సాధారణ బాంకింగ్ వ్యవహారాలను నడుపుటకు రిజర్వు బాంకుకు ఎటువంటి ప్రతిఫలం చెల్లించవలసిన అవసరం లేదు. కాని రిజర్వు బాంకులో జమచేసిన ప్రభుత్వ నగదు నిల్వలకు రిజర్వు బాంకు వడ్డీ చెల్లించవలసిన పనిలేదు. ప్రభుత్వ కనీస నగదు నిల్వలు రూ. 50 కోట్లకు తగ్గరాదు. ఈ నిల్వలు పరిమితికి తగ్గినప్పుడు ట్రెజరీ బిల్లులు సృష్టించడం ద్వారా రిజర్వు బాంకు యీ నిల్వలను పెంచుకొంటుంది. ఈ ట్రెజరీ బిల్లులను రిజర్వు బాంకు యొక్క జారీ విభాగం జారీ చేస్తుంది. ఒకవేళ ప్రభుత్వ నగదు నిల్వలు రూ. 50 కోట్లకు మించినప్పుడు ట్రెజరీ బిల్లులను రద్దు చేయడం ద్వారా మిగులును తగ్గిస్తుంది. రిజర్వు బాంకు ప్రభుత్వం సూచించిన ప్రదేశాలలో తన జారీ విభాగం యొక్క కరెన్సీ చెస్టులను నిర్వహించవలసి ఉంటుంది. ఈ చెస్టులలో అవసరమైన, చాలినంత నోట్లు, నాణేలు నిలువ చేయడం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలకు అవసరమైన లావాదేవీలు జరుపడానికి వీలవుతుంది. కేంద్ర ప్రభుత్వం తరపున రిజర్వు బాంకు విదేశీ ఋణాలకు సంబంధించిన అసలు వడ్డీ చెల్లింపుల లావాదేవీలను చేపడుతుంది. ప్రభుత్వ ఋణాల నిర్వహణ కూడా రిజర్వు బాంకు నిర్వహిస్తుంది.

ప్రభుత్వ ఆదాయ చెల్లింపుల, వ్యయాల మధ్య ఏర్పడిన లోటును భర్తీ చేయడానికి రిజర్వు బాంకు అర్థనోపాయ అడ్వాన్సులను మంజూరు చేస్తుంది. అనుకోని తాత్కాలిక యిబ్బందులను, ప్రభుత్వ ఋణాలను భరించే నిమిత్తం యీ అడ్వాన్సులను చెల్లిస్తుంది. రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా సెక్షన్ 17 (5) ప్రకారం రిజర్వు బాంకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మూడు నెలలకు మించని గడువులోగా చెల్లించే అర్థనోపాయ అడ్వాన్సులను యివ్వవచ్చు. ఈ అడ్వాన్సుల గరిష్ట పరిమితి, వడ్డీ రేటును గురించి చట్టపరంగా ఎటువంటి ఆంక్షలు లేవు. ఈ విషయాలన్నీ రిజర్వు బాంకు, సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు నిర్ణయించబడుతాయి.

1954-55 సం॥ తర్వాత కేంద్ర ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలలో పెరుగుతున్న అభివృద్ధి వ్యయాన్ని భరించడానికి ఎక్కువగా రిజర్వు బాంకుపై ఆధారపడుతున్నది. దీనికోసం అర్థనోపాయ అడ్వాన్సుల రూపంలోనే

BRAOU

గాక తాత్కాలిక ట్రెజరీ బిల్లుల రూపంలో రిజర్వు బ్యాంకు నుండి ప్రభుత్వం ఋణాలను పొందుచున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు యీ మధ్య కాలంలో రిజర్వు బ్యాంకునుండి రెండు మార్గాల ద్వారా స్వల్పకాల ఋణాలు పొందడం ప్రారంభించాయి. మొదటగా, అర్థనోపాయ అడ్వాన్సుల రూపంలో ఋణాలను పొందడం. బ్యాంకు నిర్ణయించిన పరిమితిమేరకు సెక్యూరిటీ లేకుండా యీ అడ్వాన్సులు యివ్వబడుతాయి. రెండవది, కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల హామీగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అర్థనోపాయ అడ్వాన్సులను పొందవచ్చు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో పరిమితి దాటి కూడా అదనపు అర్థనోపాయ అడ్వాన్సులు ఇవ్వడం జరుగుతుంది. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన పరిమితులకు మించి రిజర్వు బ్యాంకు నుండి ఓవర్ డ్రాఫ్టులను పొందుతుండటం మనం తరచూ గమనిస్తున్నాం. కాని ఇది శ్రేయస్కరం కాదు.

రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి బ్యాంకింగ్, విత్తపరమైన విషయాలలోనేగాక వివిధ ఆర్థికాంశాలపై సలహాదారుగా పనిచేస్తుంది. దేశ పంచ వర్ష ప్రణాళికలో విత్తపరమైన అంశాలపై, నిధుల సమీకరణపై, సంస్థాపరమైన విషయాలపై ప్రభుత్వం రిజర్వు బ్యాంకు సలహాలను పొందుతుంది. అంతర్జాతీయ విత్తానికి సంబంధించిన విషయాలపై కూడా రిజర్వు బ్యాంకు సలహాలను ఇస్తుంది. ప్రస్తుత ఆర్థిక, విత్తపరమైన అభివృద్ధిపై పరిశోధనలు జరిపి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలను ఇస్తుంది.

### 20.5.3 వాణిజ్య బ్యాంకుల నగదు నిల్వలకర్తగా వ్యవహరించడం (Acting as Custodian of Commercial Banks, Cash Reserves)

కేంద్ర బ్యాంకు దేశంలో గల వాణిజ్య బ్యాంకుల నగదు రిజర్వులకు సంరక్షకునిగా వ్యవహరించడం ఒకానొక ముఖ్య విధి. ఉదాహరణకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద ఆ దేశంలోని వాణిజ్య బ్యాంకులు ఎక్కువగా రిజర్వులను ఉంచేవి. అమెరికాలో ఫెడరల్ రిజర్వు బ్యాంకుల స్థాపనతో బ్యాంకు రిజర్వుల విషయంలో ఒక నూతన విధానం రూపొందింది. సభ్య బ్యాంకులన్నీ వాటి కాల, డిమాండ్ డిపాజిట్ల మొత్తాలను బట్టి సంబంధిత రిజర్వు బ్యాంకుల వద్ద చట్టపరంగా కనీస మొత్తాన్ని రిజర్వుగా ఉంచాలి. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఇండియా మొదలైన దేశాలలో కేంద్ర బ్యాంకు చట్టాలలో యీ నిబంధననే ఏదో ఒక రూపంలో పొందుపరచడం జరిగింది. చాలా దేశాలలో వాణిజ్య బ్యాంకులు కేంద్ర బ్యాంకు వద్ద రిజర్వులను ఉంచాలనే ఆచారం కొనసాగుతూనే ఉంది.

వాణిజ్య బ్యాంకుల నగదు నిల్వలను కేంద్ర బ్యాంకులలో ఉంచడం ద్రవ్య వ్యవస్థకే ఆయువుపట్టు. ఈ విధానం పరపతి వ్యాకోచానికి దోహదపడుతుంది. ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు, అత్యవసర పరిస్థితులలోను యీ నిల్వలను ఉపయోగించవచ్చు. సభ్య బ్యాంకులనుండి కేంద్ర బ్యాంకుల ఖజానాలకు నిధులను తరలించడం వలన బ్యాంకు రిజర్వుల స్వభావంలోను, సార్థకతలోను కొంత మార్పు కనపడుతుందని బర్జెస్ అనే ప్రముఖ ఆర్థికవేత్త అభిప్రాయం. కొన్ని బ్యాంకులకు అదనపు నిధులు అవసరమైనప్పుడు యీ రిజర్వులను ఉపయోగించుకొనవచ్చు. కేంద్ర బ్యాంకు వద్ద రిజర్వులు లేనట్లయితే, ప్రతి వాణిజ్య బ్యాంకు తాత్కాలిక అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అదనంగా నగదు తనవద్ద ఉంచుకోవలసివస్తుంది. కేంద్ర బ్యాంకుల వద్ద నగదు రిజర్వుల మూలాన అటువంటి అవసరం లేదు. ఈ రిజర్వులు కేంద్ర బ్యాంకుకు గల రీడిస్కౌంట్ సామర్థ్యాన్ని ఇనుమడింపజేస్తాయి. వాణిజ్య బ్యాంకులకు, ద్రవ్య మార్కెట్‌కు గల నగదు అవసరాలను తీర్చేందుకు, పరపతిని సృష్టించడానికి వీలు కలిగిస్తాయి.

పూర్వం నుంచి కేంద్ర బ్యాంకులున్న దేశాలు కొన్ని, నూతనంగా కేంద్ర బ్యాంకులు స్థాపించిన దేశాలు కొన్ని, నిర్దిష్టంగా కనిష్ఠ నగదు రిజర్వులుండే దేశాలు కొన్ని, అటువంటి నిబంధనలు లేని దేశాలు కొన్ని - ఈ రకమైన దేశాలన్నింటిలోనూ వాణిజ్య బ్యాంకులు వాటి అవసరాలకు మించి మిగిలిన నగదును కేంద్ర బ్యాంకుల వద్ద

BRAOU

రిజర్వుగా ఉంచడం ఆచారంగా ఏర్పడింది. వాణిజ్య బాంకులు వాటి కనిష్ట రిజర్వులను కేంద్ర బాంకు వద్ద ఉంచడం వలన కేంద్ర బాంకు తన దైనందిన వ్యవహారాలకు అవసరమైన కనిష్ట నిధులను సమకూర్చుకొంటుంది. దీనివలన తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవడమేగాక దేశంలోని బాంకింగ్ పరిస్థితులను, పరపతి పరిస్థితిని అదుపులో ఉంచడానికి దీనిని సాధనంగా వినియోగించగలుగుతుంది. 1931లో అమెరికాలో కమిటీ ఆఫ్ బాంక్ రిజర్వు తన నివేదికలో యీ విధంగా అభిప్రాయపడింది - 'వ్యక్తిగతమైన సభ్య బాంకు ద్రవ్యత్వాన్ని (liquidity) పరిరక్షించడం గాని, లేదా దానికై హామీ పడటంగాని శాసనాత్మక రిజర్వు అవసరాల ముఖ్య ధర్మం కానేరదు. ప్రస్తుత బాంకింగ్ వ్యవస్థను అనుసరించి సభ్య బాంకుల శాసనాత్మక రిజర్వు అవసరాలకు గల ముఖ్య ధర్మాలు రెండుగా పేర్కొనవచ్చు. ఒకటి, బాంకు పరపతి పరిమాణంలో వచ్చే మార్పులమీద ప్రభావాన్ని చూపి పటిష్టమైన పరపతి పరిస్థితులు సృష్టించడానికి దోహదం చేయటం. రెండోది, ఒక కట్టుదిట్టమైన బాంకింగ్ విధానాన్ని అనుసరించే నిమిత్తం ఫెడరల్ రిజర్వు బాంకులకు చాలినంత వనరులను సమకూర్చటం, శాసనాత్మక రిజర్వు అవసరాలు అసలే లేని ఇంగ్లాండ్‌లో 1931లో మాక్‌మిలన్ కమిటీ యీ విధంగా ప్రస్తావించింది - "బాంకులు వాటి దైనందిన వ్యవహారాలకు అవసరమైన కనిష్ట మొత్తాలకంటే అధికంగా రిజర్వులు ఉంచాలనే నిబంధనకు కారణం కేంద్ర సంస్థకు చాలినంత వనరులను సమకూర్చడం. ఈ వనరులతో ఆ కేంద్ర సంస్థ దేశ ద్రవ్య వ్యవస్థను నిర్వహించడమే గాకుండా సభ్య బాంకులకు కూడా సత్వరంగా వాటి లాభసాటి ఆస్తులను మార్పిడి చేసుకొనే సదుపాయాలు కల్గిస్తుంది. సభ్య బాంకులు యీ సదుపాయాల మీద ఆధారపడి వాటి వాటి నగదు రిజర్వుల మొత్తాలను నిర్ణయించడం జరుగుతుంది."

నగదు రిజర్వులను కేంద్రీకృతం చేయటం, నియంత్రణాధికారం సంక్రమింపజేయటం, శాసనాత్మక కనిష్ట రిజర్వులను నిర్దేశించడం మొదలగునవి అనేక దేశాలలో కేంద్ర బాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేశాయి. చట్టరీత్యా వాణిజ్య బాంకుల కనిష్ట రిజర్వులను పురస్కరించుకొని కేంద్ర బాంకు వాణిజ్య బాంకులతో పోటీ పడరాదు. ఆ విధంగా జరిగినట్లయితే వాణిజ్య బాంకు నిధులనే వాటికి వ్యతిరేకంగా కేంద్ర బాంకు వినియోగించినట్లు అవుతుంది. అనేక వాణిజ్య బాంకులు తమవద్ద ఉంచిన డిపాజిట్ల మీద కేంద్ర బాంకు వడ్డీ చెల్లించవలసిన అవసరం లేదు. కనుక కేంద్ర బాంకు వాణిజ్య బాంకుల కంటే తక్కువ వడ్డీరేటుకు ఋణాలను మంజూరుచేసే అవకాశముంది. వాణిజ్య బాంకుల నగదు నిల్వలు తనవద్ద ఉన్నంత మాత్రాన కేంద్ర బాంకులకు వాణిజ్య బాంకులతో పోటీపడే అవకాశం అంతగా లేదు. డిస్కౌంట్ల రూపంలోను, ఋణాల రూపంలోను తలెత్తే పోటీ కేంద్ర బాంకు వద్ద నుండే రిజర్వులను పెంచకుండా దాని ఋణ బాధ్యతలను పెంచుతుంది. దీనివలన పరపతి పరిమాణం అపరిమితంగా పెరిగి ప్రతికూలమైపోవడం లేదా పెట్టుబడి నిధులన్నీ ఎగుమతి కావడం లేదా విదేశీ మారక ద్రవ్యానికి డిమాండ్ పెరగడం సంభవించి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఉన్నది.

వాణిజ్య బాంకులు కూడా కేంద్ర బాంకువలన ఏర్పడే పోటీనుంచి తమను తాము రక్షించుకొనే మార్గాలున్నాయి. ఉదాహరణకు స్వర్ణ ప్రమాణం అమలులోనున్నప్పుడు వాణిజ్య బాంకులు వాటి రిజర్వులను బంగారం రూపంలో తిరిగి తీసుకోవడం ద్వారా కేంద్ర బాంకు రిజర్వు నిష్పత్తి దెబ్బతీసి కేంద్ర బాంక్ వ్యవస్థనే బలహీనపరుస్తుంది. కాని స్వర్ణ ప్రమాణం తాత్కాలిక నిలుపుదలవలన వాణిజ్య బాంకులు తమ రిజర్వులను తక్షణమే బంగారం రూపంలో తిరిగి తీసుకొనే అవకాశం లేదు. కాని వినిమయ సంబంధ ఆంక్షలు లేని దేశాలలో వాణిజ్య బాంకులు విదేశీ మారక ద్రవ్యాన్ని చెల్లించమని కోరవచ్చు. అయితే విదేశీ మారక రేట్లు తరచూ మారడం వలన, అవసరాలకు మించి విదేశీ మారక ద్రవ్యాన్ని కొనుగోలు చేయడం మూలాన కలిగే నష్టాన్ని వాణిజ్య బాంకే భరించాల్సి వుంటుంది. వినిమయ సంబంధమైన ఆంక్షలు అమలులో వున్న దేశాలలో, కేంద్ర బాంకు తమ నోట్లను

ప్రత్యేక అవసరాలకు తప్ప విదేశీ మారక ద్రవ్యంలోకి మార్చుకోవలసిన అవసరం లేనప్పుడు వాణిజ్య బాంకులు వాటి నగదును కేంద్ర బాంకు వద్ద ఉంచడం తప్ప గత్యంతరం లేదు.

రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం విదేశీ వ్యాపార చెల్లింపుల శేషాలలో కలిగిన అసమతౌల్యం మూలంగా మధ్య యూరప్, తూర్పు యూరప్, దక్షిణ అమెరికా, మధ్య అమెరికా ప్రాంతాలలో అనేక దేశాలు వినిమయ విషయంలో ఆంక్షలను ఏదో ఒక రూపంలో యిప్పటికీ అమలు జరుపుతున్నాయి. యుద్ధ కాలంలో కూడా దాదాపు అన్ని దేశాలలో వినిమయ నియంత్రణ ఖచ్చితంగా అమలు జేయడం జరిగింది. దీనితోబాటు అనేక దేశాలలో చట్టపరంగా బంగారం రిజర్వులను, విదేశీ మారక రిజర్వులను కేంద్ర బాంకులోనో, ఖజానాలోనో లేదా ఒక ప్రత్యేక వినిమయ సంస్థలోనో కేంద్రీకృతం చేయడం జరిగింది.

ఆర్థిక సుస్థిరత, సమర్థవంతమైన ద్రవ్య విధానం అమలు జరుపుటలో కేంద్ర బాంకుకు దేశంలోని వాణిజ్య బాంకులకు సంపూర్ణ సహకారం, సత్సంబంధాలు అవసరం. దేశ సంక్షేమం దృష్ట్యా వాణిజ్య బాంకులు తమ నగదు మిగులును కేంద్ర బాంకు వద్ద ఉంచాలి. కేంద్ర బాంకు వాణిజ్య బాంకులు తనవద్ద ఉంచిన నిల్వలను సద్వినియోగం చేయాలి.

రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా చట్టం సెక్షన్ 42 (1) ప్రకారం షెడ్యూల్డు బాంకులు వాటి డిమాండ్ డిపాజిట్లపై 5 శాతం, టైమ్ డిపాజిట్లపై 2 శాతం కనిష్ట నగదు రిజర్వుగా రిజర్వు బాంకు వద్ద ఉంచాలి. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఈ రిజర్వు నిష్పత్తిని పరపతి సృష్టించే అధికారాన్ని పెంచవలసిన అవసరం ఏర్పడింది. 1956 లో రిజర్వు బాంకు చట్టం సవరించబడింది. ఈ చట్టం బాంకుల డిమాండ్ డిపాజిట్లపై 5 నుంచి 20 శాతం, టైమ్ డిపాజిట్లపై 2 నుండి 8 శాతాల మధ్య కనిష్ట రిజర్వులు ఉంచడానికి అనుమతించింది. తరువాత 1962లో సవరించిన చట్టం ప్రకారం డిమాండ్, టైమ్ డిపాజిట్లతో నిమిత్తం లేకుండా అన్ని డిపాజిట్లపై ఒకే విధంగా 3 శాతం రిజర్వులుగా ఉంచాలని నిర్దేశించబడింది. ఈ బాంకు డిపాజిట్లను గణించడంలో చెల్లించిన మూలధనం, బాంకు రిజర్వులు లాభనష్టాల పట్టికలోని పరపతి నిల్వలు, రిజర్వు బాంకు నుండి, IDBI నుండి తీసుకొన్న ఋణాలు పరిగణనలోకి రావు. 1960 - 70 ల మధ్య యీ నగదు రిజర్వుల నిష్పత్తిలో మార్పు చేయలేదు. 1973లో ఈ రిజర్వు నిష్పత్తిని 3 శాతం నుండి 5 శాతానికి, తర్వాత 7 శాతానికి పెంచడం జరిగింది. బాంకులు యిచ్చే పరపతి వనరులను పెంచాలనే నిమిత్తం ఈ నిష్పత్తిని 1974 డిసెంబరులో 4 శాతానికి తగ్గించడం జరిగింది. 1976 సెప్టెంబరులో 4 నుండి 5 శాతానికి, తరువాత 1976 నవంబరులో 6 శాతానికి పెంచారు. ఈ నిష్పత్తిలో జూలై 1981 వరకు ఎలాంటి మార్పులేదు. 1981 జూలై - ఆగస్టు నెలలో యీ రిజర్వు శాతాన్ని 6 నుండి 7 శాతానికి, 1981 అక్టోబరులో 8 శాతానికి పెంచారు. 1982 జూన్ తర్వాత యీ నిష్పత్తిని బాంకింగ్ వ్యవస్థ ద్రవ్యత్వాన్ని పెంపొందించే నిమిత్తం నగదు నిష్పత్తిని 7 శాతానికి తగ్గించడం జరిగింది. క్రమేణా నగదు నిల్వల శాతం 1996 జూన్ నాటికి 13 శాతానికి పెరిగింది. 1996 జూలై నుంచి యీ శాతాన్ని 12 శాతానికి తగ్గించినట్లు రిజర్వు బాంకు ప్రకటించింది.

### 20.5.4 అంతర్జాతీయ ద్రవ్య నిధుల పరిరక్షణ (Custodian of International Monetary Reserves)

కేంద్ర బాంకు ఆయా దేశంలోని విదేశీ మారక కరెన్సీ రిజర్వులకు సంరక్షకునిగా వ్యవహరించడం ఒకానొక ముఖ్య విధి. చాలా దేశాలలో స్వర్ణ ప్రమాణం రద్దు కావడంతోబాటు యుద్ధ పరిస్థితులు, అత్యవసర పరిస్థితుల మూలంగా బంగారం నిల్వలపైన, ఎగుమతి దిగుమతులపైన, విదేశీ మారక లావాదేవీలపైన ఆంక్షలు విధించడం జరిగింది. అందువలన కేంద్ర బాంకు వద్ద బంగారం నిల్వలు అధికంగా కేంద్రీకృతమైనాయి. స్వర్ణ ప్రమాణం

BRAOU

అమలులోనున్న కాలంలో చలామణిలో నున్న కరెన్సీ నోట్లను నాణేలలోకి గాని, బంగారంలోకి గాని మార్చుకొనే సదుపాయం ఉండేది. విదేశీ వ్యాపారంలో బంగారం ఎగుమతి, దిగుమతులకు ఎలాంటి ఆంక్షలు లేవు. కేంద్ర బాంకు వద్దనుండే బంగారపు నిల్వలు మారినప్పుడు దేశీయ ద్రవ్య వ్యవస్థలో అసాధారణ పరిస్థితులేర్పడే అవకాశాలుండేవి. స్వర్ణ ప్రమాణం విచ్ఛిన్నమైన తర్వాత కూడా బంగారం, అంతర్జాతీయ ద్రవ్య రిజర్వులను దేశ అవసరాలకు అనుగుణంగా ఉంచే బాధ్యత కేంద్ర బాంకులు నిర్వహించేవి. అంతర్జాతీయ చెల్లింపుల పరిష్కారానికి కేంద్ర బాంకు వద్ద తగినంతగా విదేశీ మారక నిల్వలు ఉండవలసిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధానంతరం అనేక దేశాలు అంతర్జాతీయ చెల్లింపుల విషయంలో సంకట పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి అనేక దేశాలు యితర దేశాల నుండి దిగుమతులు చేసుకోవడం వలన అంతర్జాతీయ చెల్లింపుల విషయంలో సంక్షోభం ఏర్పడింది. అందువలన ప్రతి దేశంలోను అంతర్జాతీయ ద్రవ్య నిధుల పరిరక్షణ విశేష ప్రాముఖ్యత సంతరించుకొన్నది. చాలా దేశాలలో వినిమయ నియంత్రణ అమలులో ఉన్నది. దేశపు విదేశీ మారక నిల్వలన్నీ కేంద్ర బాంకు అధీనంలో ఉంటాయి. ఈ నిల్వలను దేశ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పంపిణీ చేసే అధికారం కేంద్ర బాంకుకు ఉంటుంది.

ప్రతికూల విదేశీ వ్యాపార చెల్లింపుల శేషాన్ని భర్తీ చేయడానికి, తన కరెన్సీకి గల బాహ్య విలువను పరిరక్షించడానికి కొంత అంతర్జాతీయ కరెన్సీ రిజర్వును కేంద్ర బాంకు తన వద్ద ఉంచుకొంటుంది. తన నోట్ల జారీకి హామీగా, డిపాజిట్ల ఋణ బాధ్యతకు హామీగా కేంద్ర బాంకు చట్టపరంగా కనిష్ఠ రిజర్వులను ఉంచుకోవాలి. కనిష్ఠ రిజర్వు నిబంధనను ఏర్పాటు చేయడంలో కొన్ని ముఖ్యమైన ఉద్దేశాలున్నాయి: (1) స్వదేశంలోను, విదేశాలలోను దేశపు కరెన్సీలో ప్రజలకున్న విశ్వాసం సడలి పోకుండా చూడటం, (2) పరపతి వ్యాకోచానికి ఒక పరిమితి ఏర్పరచటం. చాలా దేశాల కనిష్ఠ రిజర్వులలో విదేశీ మారక ద్రవ్యాన్ని కూడా చేర్చడం జరిగింది. కరెన్సీ విలువ పరిరక్షణకు, విదేశీ మూలధనాన్ని పెట్టుబడి పెట్టడంలోను, మూలధనాన్ని దిగుమతి చేయటంలోను కలిగే ఒడుదుడుకుల వలన కొన్ని పరిణామాలు సంభవించవచ్చు. ఈ పరిణామాలను ఉపశమింపజేసే నిమిత్తం అవసరమైనంత విదేశీ ద్రవ్య నిధులను రిజర్వులుగా కేంద్ర బాంకు ఉంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. పైన వివరించిన విధంగా కేంద్ర బాంకులు అంతర్జాతీయ ద్రవ్య నిధులను సమీకరించి, సంరక్షించి, విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంలో అనుకూల పరిస్థితులను నెలకొల్పి దేశ ఆర్థిక పటిష్టతకు ఉపయుక్తమైన సేవలను అందిస్తుంది. భారతీయ రిజర్వు బాంకు వద్ద 1996 మే 24 నాటికి రూ. 1,028.76 కోట్ల విలువగల SDR లు, రూ. 15,856, 69.కోట్ల విలువగల బంగారం, రూ. 59,191.15 కోట్ల విలువగల విదేశీ మారక ద్రవ్యం ఉంది.

### 20.5.5 రీడిస్కౌంటు బాంకుగా, అంతిమ ఋణదాతగా వ్యవహరించడం (Acting as Rediscount Bank and Lender of the Last Resort)

ఇతర విధులతోబాటు బిల్లులను రీ డిస్కౌంటు చేయడం, అంతిమ ఋణదాతగా వ్యవహరించడం లాంటి విధులను కేంద్రబాంకు నిర్వర్తిస్తుంది. కేంద్ర బాంకుకున్న రీడిస్కౌంట్ ధర్మమే దానిని అంతిమ ఋణదాతగా కూడా రూపొందించిందని డి కాక్ భావించాడు. 'అంతిమ ఋణదాత' అనే యీ పదాన్ని బేగ్‌హాట్ (Beghot) మహాశయుడు సృష్టించాడు. వాణిజ్య బాంకులకు, డిస్కౌంట్ సంస్థలకు, ఇతర పరపతి సంస్థలకు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా కాని ఋణ సౌకర్యాలు కలిగించే బాధ్యతను కేంద్ర బాంకు స్వీకరించిందని దీని అంతర్భాగంగా డి కాక్ భావించాడు. అయితే కేంద్ర బాంకు డిస్కౌంటు రేటు విధానం (discount rate policy) లోని కొన్ని షరతులకు లోబడి మాత్రమే ఈ ఋణ సౌకర్యాలు లభిస్తాయి.

BRAOU

పైన చెప్పిన విధంగా కేంద్ర బాంకు దేశంలోని వాణిజ్య బాంకులకు ఋణ సౌకర్యాలను కల్పిస్తుంది. అవసరమైనప్పుడు వాణిజ్య బాంకులు తమ వ్యాపార వ్యవహారాలకు కేంద్ర బాంకు నుండి స్వల్పకాలిక ఋణాలను పొందవచ్చు. తాను డిస్కౌంటు చేసిన హుండీలను, అవసరమైనప్పుడు తిరిగి కేంద్ర బాంకు వద్ద వాణిజ్య బాంకులు డిస్కౌంట్ చేయవచ్చు. ఆ విధంగా హుండీలను తిరిగి డిస్కౌంట్ చేయడం వలన వాణిజ్య బాంకులకు యిచ్చిన పరపతి కేంద్ర బాంకు యిచ్చిన పరపతిగా మార్చబడుతుంది. కనుక అవసర సందర్భాలలో వాణిజ్య బాంకులు తమవద్దనుండే వ్యాపార హుండీలను కేంద్ర బాంకు వద్ద డిస్కౌంట్ చేస్తాయి. కాని యీ రెండు డిస్కౌంట్ రేట్లలో తేడాలుంటాయి. కేంద్ర బాంకు వసూలు చేసే డిస్కౌంటు, వాణిజ్య బాంకులు వసూలు చేసే డిస్కౌంటు కన్నా ఎక్కువగా ఉంటుంది. కనుక డిస్కౌంట్ విధానం వలన వాణిజ్య బాంకులకు నష్టాలు సంభవిస్తాయి. అందువలన వేరే యితర అవకాశాలు లేనప్పుడు మాత్రమే వాణిజ్య బాంకులు హుండీలను తిరిగి రీడిస్కౌంట్ చేయడానికిగాను కేంద్ర బాంకును ఆశ్రయిస్తాయి. డిస్కౌంట్ సంస్థలు, బిల్లు బ్రోకర్లు ఉండే ఇంగ్లాండ్‌లో ఈ సౌకర్యం కేవలం వాణిజ్య బాంకులకే గాక వీటికి కూడా డిస్కౌంట్ సౌకర్యం వర్తింపచేయబడింది.

ఇటీవల కాలంలో తమ వ్యాపార వ్యవహారాలను పరిష్కరించుకోవడానికి వాణిజ్య బాంకులు హుండీలనే గాక ఓవర్ డ్రాఫ్టులను (overdraft) ఉపయోగించడం జరుగుతుంది. దీని కారణంగా డిస్కౌంటుకు వచ్చు హుండీల సంఖ్య తగ్గిపోయింది. తమ చెంతవున్న ప్రభుత్వ బాండ్లను, సెక్యూరిటీలను, ట్రెజరీ బిల్లులను హామీగా ఉంచి వాణిజ్య బాంకులు కేంద్ర బాంకునుంచి ఋణ సౌకర్యాలను పొందుతూ ఉన్నాయి. కేంద్ర బాంకు రీడిస్కౌంట్ జరపడంలో ముఖ్యోద్దేశం కేవలం నగదు కొరత వలన ఏ వాణిజ్య వ్యవహారం ఆగిపోవడం జరగకూడదు.

ట్రెజరీ బిల్లులను రీ డిస్కౌంట్ చేయడం ద్వారాను, ప్రభుత్వ సెక్యూరిటీల హామీమీద ఋణాలను మంజూరు చేయడం ద్వారా వాణిజ్య బాంకులకు, డిస్కౌంట్ సంస్థలకు, బిల్లు బ్రోకర్లకు కేంద్ర బాంకు అదనంగా ఋణాలను మంజూరు చేస్తాయి. యుద్ధానంతర కాలంలో ఏర్పడిన కొన్ని పరిణామాల వలన బిల్లుల రీడిస్కౌంటింగ్ బదులు వ్యాపార ఋణాలకు డిమాండ్ పెరిగింది. విదేశీ వ్యాపారానికి బాంకులు ఎక్కువగా ఋణాలివ్వడం ప్రారంభించాయి. అందువలన విదేశీ బిల్లు వాడకం తగ్గింది. మరొకవైపు ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ ఋణాల పెరుగుదలవలన ట్రెజరీ బిల్లులనే ఎక్కువగా ఉపయోగించడం జరిగింది. కేంద్ర బాంకు వద్ద రీ డిస్కౌంట్ పొందే అర్హత ట్రెజరీ బిల్లులకు ఉండడం వలన ట్రెజరీ బిల్లుల ప్రాముఖ్యత పెరిగింది. తర్వాత కాలంలో కేంద్ర బాంకు వద్ద రీ డిస్కౌంట్ రూపంలోగాక స్వల్పకాలిక ఋణాల రూపంలో ఋణ సౌకర్యాలను పొందడానికి ప్రయత్నించేవారు. అనేక దేశాలలో వాణిజ్య బాంకులు, డిస్కౌంట్ సంస్థలు మాత్రమేగాక ఇతర పరపతి సంస్థలు కూడా కొన్ని సమయాలలో నేరుగా కేంద్ర బాంకువద్ద ఋణాలను పొందేవి.

రీడిస్కౌంటింగ్ విధానం పరపతి వ్యవస్థలోని ద్రవ్యత్వ వ్యాకోచత్వాన్ని పెంపొందిస్తుంది. వాణిజ్య బాంకులు, ఇతర సంస్థలు తమ ఆస్తులను నగదుగా మార్చుకోవడానికి వీలు కల్పిస్తుంది. నగదు రిజర్వులు తగ్గినప్పుడు లేదా ఆ రిజర్వులు శాసనాత్మక కనిష్ట పరిమితికన్నా తక్కువైనప్పుడు తమ నగదు వనరులను పెంచుకోవడానికి యీ రీడిస్కౌంటు సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర బాంకు ద్వారా రీ-డిస్కౌంట్ సదుపాయం ఉన్నందువలన బాంకులు స్వల్పమైన నగదు రిజర్వులతోనే తమ వ్యాపారాన్ని కొనసాగించడానికి వీలవుతుంది. కొన్ని సమయాలలో లేదా వ్యాపార చక్రాల కాలంలో బాంకుల వద్దనున్న నగదు రిజర్వుల మీద ఒత్తిడి కలుగుతుంది. కేంద్ర బాంకులు ఋణాలిచ్చినంత మాత్రాన వాణిజ్య బాంకులు తమ నగదు నిల్వలను తగ్గించరాదు. అట్లా జరిగిన పక్షంలో వాణిజ్య బాంకులు డిస్కౌంట్ సౌకర్యాలను శాశ్వత మూలధనంగా వినియోగించుకొన్నట్లవుతుంది.

BRAOU

కేంద్ర బాంకుకున్న రీడిస్కౌంట్ ధర్మమే దానిని అంతిమ ఋణదాతగా రూపొందించింది. ఈ రెండు విధులు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. కేంద్ర బాంకు డిస్కౌంట్ రేటు విధానంలో కొన్ని షరతులకు లోబడి మాత్రమే అంతిమ ఋణ సౌకర్యాలను అందిస్తుంది. అన్ని దేశాలలో కూడా కేంద్ర బాంకులు ఆయా దేశాలలోని వాణిజ్య బాంకులకు, యితర పరపతి సంస్థలకు అంతిమ ఋణదాతగా బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. కాలక్రమేణా కేంద్ర బాంకులకు యీ విధికి అవినాభావ సంబంధం ఏర్పడింది. 20 వ శతాబ్దంలో స్థాపించబడిన నూతన కేంద్ర బాంకులు చాలావరకు యీ విధిని తమకు తాము అంగీకరించి అమలు చేస్తున్నాయి.

### 20.5.6 కేంద్ర క్లియరెన్స్, పరిష్కార, బదలాయింపు బాంకుగా పనిచేయడం (Working as Central Clearance, Settlement and Transfers Bank)

డి కాక్ (De Kock) తన 'కేంద్ర బాంకింగ్' లో పేర్కొన్న విధంగా కేంద్ర క్లియరెన్స్ విధిని, పరిష్కార విధిని ప్రప్రథమంగా బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ 19వ శతాబ్దం మధ్యలో రూపొందించింది. స్ప్రరుగ్ (Sparugue) చెప్పినట్లు 1854 సంవత్సరంలోనే వాణిజ్య బాంకులన్నీ తమ జమా ఖర్చులన్నీ పరిష్కరించుకొనే ఒక పథకాన్ని రూపొందించుకున్నాయి. ఈ పథకం ప్రకారం బాంకులు రోజువారీ క్లియరింగ్ చేసుకొని బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద ఉన్న తమ తమ ఖాతాలలో బదలాయింపు (transfer) ద్వారా తమ మధ్యగల తేడాలను పరిష్కరించుకొనేవి. షా (Shaw) తన గ్రంథమైన 'Theory and Principles of Central Banking లో "కేంద్ర బాంకు ఒక ప్రత్యేక సంవిధానం రూపంలో తన సభ్య బాంకులన్నింటికీ వాణిజ్య గణిత శాస్త్ర పద్ధతిలో క్లియరింగ్ హౌస్‌గా వ్యవహరిస్తుంది" అని పేర్కొన్నాడు. కిష్, మరియు ఎల్కిన్ (Kisch and Elkin) కూడా "డ్రాఫ్టుల క్లియరెన్స్ నిమిత్తం అంతరంగిక ఖాతాల పరిష్కారం (settlement of internal accounts) నిమిత్తం త్వరితంగాను, స్వల్ప వ్యయంతోను కొనసాగే ఒక యంత్రాంగాన్ని స్థాపించాల్సి వుంది" అని తన 'Central Banks' అను గ్రంథంలో పేర్కొన్నారు. "క్లియరింగ్ ప్రక్రియ కేంద్ర బాంకింగ్‌లో ఒక ప్రధాన వ్యవహారం" అని జాన్సే అభిప్రాయపడ్డాడు. విల్లిస్ (Willis) దృష్టిలో "క్లియరింగ్ వ్యవహారాలన్నింటినీ కేంద్ర బాంకులో కేంద్రీకృతం చేయటం వలన మాత్రమే, ఒక సంపూర్ణమైన క్లియరింగ్ విధానం, పరిష్కార విధానం రూపొందగలదు. అంతేగాని ఈ క్లియరింగ్ కేంద్ర బాంకుకు గల ముఖ్య విధులలో ఒక్కటి అని వేరే చెప్పనక్కరలేదు." పైన పేర్కొన్న విధంగా కేంద్ర బాంకు బాంక్ ఆఫ్ క్లియరెన్స్‌గా వ్యవహరిస్తుంది.

వాణిజ్య బాంకులకు తమ దైనందిన వ్యాపారంలో వసూలు నిమిత్తం ఖాతాదారులు పంపిన చెక్కులు వస్తూంటాయి. ఆ చెక్కులను యితర బాంకులకు పంపి, ఆ సొమ్మును వసూలు చేసి ఖాతాదారుల అకౌంట్‌లో జమచేయవలసి ఉంటుంది. ఈ విధంగా ప్రతి బాంకుకు యితర బాంకులనుండి ప్రతిరోజు వసూలు చేయవలసిన చెక్కులు విరివిగా వస్తూంటాయి. వీటిని వసూలు చేయడమన్నది వ్యయ ప్రయాసతో కూడుకొన్న పని. కనుక యీ పనిని సులభతరం చేయడానికి వీలుగా కొన్ని ప్రధాన కేంద్రాలలో క్లియరింగ్ హౌస్‌లను (clearing houses) స్థాపించడం జరిగింది. ఈ క్లియరింగ్ హౌస్‌లలో ఒక్కో బాంకుకు ఇతర బాంకుల నుంచి రావలసిన మొత్తం చెక్కుల సొమ్మును క్రమపద్ధతిలో పట్టీ రూపంలో తయారుచేసి సులభంగా నికర నిల్వలను తేల్చి ఆయా బాంకుల ఖాతాలు తయారుచేసి చూపవచ్చు. ఈ వివరాలన్నీ కేంద్ర బాంకుకు కూడా తెలియజేయడం జరుగుతుంది. ఈ సమాచారం కేంద్ర బాంకుకు అత్యంత అవసరం. ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకొని కేంద్ర బాంకు వాణిజ్య బాంకులకు ఆదేశాలివ్వడం జరుగుతుంది. ఈ విధంగా కేంద్ర బాంకు బాంక్ ఆఫ్ క్లియరెన్స్‌గా వ్యవహరిస్తుంది.

నూతనంగా స్థాపించబడిన కేంద్ర బాంకులు కూడా యీ విధిని నిర్వహిస్తున్నాయి. కేంద్ర బాంకు వద్ద నున్న ఖాతాల ద్వారా బాంకులమధ్యగల తేడాలను పరిష్కరించడం సులభం. ఈ పద్ధతి బాంకింగ్ వ్యవస్థల

BRAOU

పటిష్టతకు దోహదపడుతుంది. కేంద్ర బాంకుకు గల వివిధ స్థానిక శాఖల ద్వారా స్థానికంగా పరిష్కరించడం వలన బాంకింగ్ వ్యవహారాలలో నగదు వాడకంలో పొదుపు కూడా జరుగుతుంది. "కేంద్ర బాంకు నిర్వహిస్తూ బలాన్ని పుంజుకొన్న క్లియరింగ్ పద్ధతి నగదు వినియోగంలోను పొదుపు సాధించటానికి ఒక సాధనంగా మాత్రమే గాక, ఏ సమయంలోనైనా సంఘానికి గల ద్రవ్యత్వ స్థాయికి కొలబద్దగా కూడా ఉపయోగపడుతుంది. ఈ ద్రవ్యత్వాన్ని ఏ రోజుకారోజు తెలుసుకోవడం ఎంతైనా అవసరం" అని విల్లీస్ అభిప్రాయపడినాడు. కేంద్ర బాంకు క్లియరింగ్ పరిష్కార విధులను నిర్వహించడం ద్వారా దేశంలోని బాంకింగ్ వ్యవహారాలలో గల పోకడలను అధ్యయనం చేయడానికి సాధనంగా ఉపయోగపడుతుంది.

వాణిజ్య బాంకులు చెక్కుల వసూళ్లకు, చెక్కుల చెల్లింపులకు, ద్రవ్యం ట్రాన్స్‌ఫరు చేయడానికి కొంత కమీషన్ వసూలు చేసే ఆచారం ఉండేది. కరెన్సీని ఒకచోట నుండి ఇంకొక చోటికి తరలించడానికి బాంకులు కొంత ఖర్చు చేయవలసి ఉంది. కొన్ని సందర్భాలలో చెక్కుల నిరాధరణ జరగడం, లేదా అవి పోవడం జరగవచ్చు. ఇంతేగాక వాణిజ్య బాంకులు మంజూరు చేసే ఋణాలలో చాలా భాగం కరెంట్ ఖాతాల మీద ఓవర్ డ్రాఫ్టుల రూపంలో ఉంటాయి. వసూలు నిమిత్తమై చెక్కు రావడంతోనే ఆ చెక్కు మొత్తాన్ని ఖాతాదారుని పేరిట జమకట్టే పద్ధతివలన బాంకులు కొంత వడ్డీ నష్టపోతాయి. కనీసం యీ వడ్డీ నష్టాన్ని పూడ్చుకొనే నిమిత్తం బాంకులు ఈ రకంగా కమీషన్ వసూలు చేయడం జరుగుతుంది. ప్రపంచం మొత్తం మీద కేంద్ర బాంకులు ఆయా దేశాలలో క్లియరెన్స్, పరిష్కారాలు, ట్రాన్స్‌ఫర్ కార్యక్రమాలను మెరుగుపరచడానికి అనేక విధాల ప్రయత్నం చేస్తున్నాయి.

### 20.5.7 పరపతి నియంత్రణ (Credit control)

దేశంలో బాంకులు సృష్టించే పరపతిని అదుపులో వుంచి ద్రవ్య సుస్థిరతకు తద్వారా దేశాభివృద్ధికి తోడ్పడడం కేంద్ర బాంకుల కర్తవ్యం. కేంద్ర బాంకు నిర్వర్తించే ఇతర విధులన్నీ ఈ కర్తవ్యతా నిర్వహణకు అనుషంగికాలు. నోట్లను జారీచేయడం, ప్రభుత్వానికి బాంకరుగా, సలహాదారుగా పనిచేయడం, వాణిజ్య బాంకుల రిజర్వులకు సంరక్షకుడుగా వ్యవహరించడం, క్లియరింగ్, పరిష్కార విధులను నిర్వర్తించడం మొదలైన విధులన్నీ పూర్వం పరపతి నియంత్రణ విధితో సంబంధం లేకుండా స్వతంత్రంగా రూపొందించడం జరిగింది. కాని ప్రస్తుతం రీడిస్కౌంటింగ్ చేయడం, అంతిమ ఋణదాతగా వ్యవహరించడం వంటి విధులతోబాటు అన్ని విధులన్నీ పరపతి నియంత్రణ విధికి అనుబంధ విధులుగా భావిస్తున్నారు. బాంకులు సృష్టించే పరపతిని అదుపులో పెట్టి దేశ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం అధిక ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. అనేక దేశాలలో, ముఖ్యంగా ఆర్థికాభివృద్ధి సాధించిన దేశాలలో, చలామణిలో ఉన్న ద్రవ్యంలో బాంకు డిపాజిట్లు అధిక భాగం ఆక్రమించడమే దీనికి కారణం. ఆర్థికంగా వెనుకబడి ఉన్న దేశాలలో కేంద్ర బాంకులు జారీచేసిన నోట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, వాణిజ్య బాంకులు సృష్టించే డిపాజిట్లు కూడా అధికంగా ఉన్నాయి. అందువలన బాంకులు సృష్టించే పరపతిని, పరపతి పరిమాణాన్ని, ఈ పరపతి ద్వారా సాధించే ప్రయోజనాలను కేంద్ర బాంకు నిరంతరం పరిశీలిస్తూ, ఉచిత రీతిన తన విధానాలను నిర్ణయించుకోవలసి వస్తుంది.

బాంక్ ఆఫ్ కెనడా చట్టం ప్రకారం, "పరపతిని, కరెన్సీని నియమబద్ధం చేయడం, జాతీయ ద్రవ్య యూనిట్ యొక్క బాహ్య విలువను పరిరక్షించడం, దానిని నియంత్రించడం, ఇంతేగాక దానికి గల పలుకుబడిని వినియోగించి ద్రవ్య సంబంధమైన చర్యల పరిధిలో సాధ్యమైనంతవరకు వస్తూత్పత్తిలోను, వాణిజ్యంలోను, ధరలలోను, ఉద్యోగావకాశాలలోను వచ్చే ఒడుదుడుకులను నిరోధించడం చేయాలని" బాంక్ ఆఫ్ కెనడాను ఆదేశించింది. అదే విధంగా భారత రిజర్వు బాంక్‌కు కూడా దేశాభివృద్ధికి దోహదపడే విధంగా ద్రవ్య వ్యవస్థను పరపతి వ్యవస్థను నిర్వహించవలసిన బాధ్యత ఉంది. నోట్ల జారీలో గుత్తాధిపత్యం కారణంగా వచ్చిన అధికారం

BRAOU

వలన కేంద్ర బాంకు పరపతిని నియంత్రించడానికి వీలయ్యింది. ప్రభుత్వ ఖాతాలను నిర్వహించడం, ప్రభుత్వానికి ఋణాలు మంజూరు చేయడం, వాణిజ్య బాంకు నగదు రిజర్వులకు, విదేశీ మారక రిజర్వులకు సంరక్షకత్వం వహించడం మొదలగు విధులను పరపతి నియంత్రణ విధితో జోడించడం జరిగింది.

పరపతి నియంత్రణ ఆవశ్యకత, దానిని అమలు పరచవలసిన బాధ్యతపై ఏకాభిప్రాయం ఉంది. కాని పరపతి నియంత్రణ లక్ష్యాలు అనగా విదేశీ మారక రేట్ల స్థిరీకరణ, ధరల స్థిరత్వం, వ్యాపార ఉపాధి రంగాల స్థిరత్వం - వాటిపై భిన్నాభిప్రాయాలున్నాయి. విదేశీ మారకరేట్ల స్థిరత్వం స్వదేశంలోను, విదేశాలలోను ధర స్థిరత్వానికి సంబంధించి ఉంది. కాబట్టి ధరల స్థిరత్వం యొక్క ఆవశ్యకతను గుర్తించడం జరిగింది. 1931వ సంవత్సరానికి పూర్వం స్థిరమైన వినిమయ రేట్ల విధానం అవలంబించారు. దానికి కారణం అంతర్జాతీయ వ్యాపారం పెంపొందించడానికి వినిమయ స్థిరత్వం అవసరం. ప్రపంచమంతా స్వర్ణ ప్రమాణం వదిలివేసిన తర్వాత ధరల స్థాయిని స్థిరీకరించే లక్ష్యంతో పరపతి నియంత్రణ సాగించాలనే అంశానికి ప్రాముఖ్యతను యివ్వడం జరిగింది. వీటిలో సామ్యత దెబ్బతిన్నప్పుడు వినిమయ స్థిరీకరణ కన్నా ధర స్థిరత్వానికే ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉన్నది.

ధరలలో వచ్చే మార్పులు దేశంలోనే గాక మిగతా వ్యాపార సంబంధాలున్న దేశాలలో కూడా కొన్ని పరిణామాలకు దారితీస్తాయి. కాబట్టి దేశంలో ధరల స్థిరత్వంతోబాటు విదేశీ మారక రేట్లు కూడా సర్దుబాట్లు చేసుకోవడం వలన ఒక దేశం యితర దేశాల ద్రవ్య విధానంపై ఆధారపడవలసిన పనిలేదు. ఈ పద్ధతి స్వీడన్‌లో కొంతకాలం అమలు చేయడం జరిగింది. 1930 తర్వాత ఇంగ్లాండ్, అమెరికా వంటి దేశాలు ఇతర లక్ష్యాలతో బాటు ధరల స్థిరత్వం కూడా లక్ష్యంగా గల ద్రవ్య విధానాన్ని అనుసరించాయి.

## పరపతి నియంత్రణ లక్ష్యాలు (Objectives of Credit Control)

విదేశీ మారకపు రేట్ల స్థిరీకరణ, ధరల స్థిరీకరణ, సంపూర్ణోద్యోగిత, అంతర్జాతీయ సహకారం, ఆర్థికాభివృద్ధి మొదలగునవి పరపతిని నియంత్రణ ముఖ్యమైన లక్ష్యాలు.

### 1. మారక రేట్ల సుస్థిరత (Stability of Exchange Rates)

మారక రేట్లలో సుస్థిరత సాధించడం పరపతి నియంత్రణ ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయ వ్యాపారం అభివృద్ధి చెందాలంటే మారకపు రేట్లు స్థిరంగా ఉండాలి. ఇంతేగాక విదేశీ మూలధనం ఒక దేశం నుంచి ఇంకొక దేశానికి మారాలంటే కూడా మారకపు రేట్ల స్థిరత్వం అవసరం.

### 2. ధరల స్థిరీకరణ (Price Stability)

మారకపు రేట్లలో స్థిరత్వాన్ని సాధించడం జరిగినప్పుడు దేశంలో ధరల స్థాయిలో మార్పులు అనివార్యం. ధరల స్థిరత్వం ఉంటే మారకపు రేట్లలో మార్పులు సంభవిస్తాయి. మారకపు రేట్ల స్థిరత్వం, ధరల స్థిరత్వం ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. పూర్వం ధరల స్థిరత్వం కన్నా మారపు రేట్ల స్థిరత్వానికి ప్రాముఖ్యతను ఇచ్చేవారు. కాని క్రమక్రమంగా మారకపు రేట్లలో స్థిరత్వం సాధించడం కంటే దేశంలో ఉన్న ధరల స్థాయిలో గణనీయమైన మార్పులు రాకుండా చూడటం ముఖ్యంగా గుర్తించడం జరిగింది. ఈ పరివర్తనానికి రెండు కారణాలున్నాయి. మొదటిది, ధరల స్థాయి మారినప్పుడు దేశంలోని వివిధ వర్గాల ప్రజలకు, ఋణదాతలకు, ఋణగ్రస్తులకు, వ్యాపారస్తులకు లాభంగాని నష్టాలుగాని రావచ్చు. కానీ విదేశీ వ్యాపారం ధరల స్థాయిలో కలిగే మార్పుల వలన దెబ్బతింటుంది. రెండవది, ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన దేశంపై చాలా దేశాలు ఆధారపడి ఉంటాయి. ఆ దేశంలో ద్రవ్యోల్బణం ఏర్పడితే దానిపై ఆధారపడిన దేశాలలో ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. ఆ

BRAOU

దేశంలో ధరలు పడిపోతే మిగతా దేశాలలో ఆర్థిక మాంద్య పరిస్థితులు నెలకొంటాయి. కాబట్టి ప్రపంచంలోని ఇతర దేశాలలో ఉత్పన్నమైన పరిణామాలనుంచి తమ దేశాల ఆర్థిక వ్యవస్థను పరిరక్షించుకోవడానికి స్వదేశంలో ధరల స్థిరత్వాన్ని సాధించడం ప్రధాన లక్ష్యంగా కేంద్ర బాంకు పరపతిని నియంత్రించాలి.

**3. సంపూర్ణోద్యోగిత (Full Employment)**

1929-34ల మధ్య సంభవించిన ఆర్థిక మాంద్య పరిస్థితుల మూలంగా అన్ని దేశాలలో ధరల స్థాయి క్షీణించడం, ఆదాయ, ఉత్పత్తుల తరుగుదల, నిరుద్యోగం పెరిగిపోవడం, పేదరికం ఎక్కువకావడం మొదలగు విపత్కర పరిస్థితుల మూలాన ఆర్థికంగా సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొని, దేశంలో ఉత్పత్తిని పెంచి, ఉద్యోగావకాశాలను పెంపొందించి దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకురావలసిన బాధ్యత ప్రభుత్వానికీ, కేంద్ర బాంకుకూ విధ్యుక్త ధర్మంగా మారింది. కాబట్టి కేంద్ర బాంకులు తమ పరపతి నియంత్రణ విధానంలో సంపూర్ణోద్యోగితను సాధించడం ముఖ్య లక్ష్యంగా కల్గియున్నాయి.

**4. అంతర్జాతీయ సహకారం**

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ ద్రవ్య నిధి స్థాపించిన తర్వాత ద్రవ్య విధాన లక్ష్యాలలో మార్పు వచ్చింది. స్వర్ణ ప్రమాణం విచ్ఛిన్నమైన తర్వాత ప్రతి దేశం స్వలాభ పూరితమైన ఆర్థిక విధానాలను అనుసరించడం మూలంగా అంతర్జాతీయ వ్యాపారం దెబ్బ తిన్నది. ప్రతి దేశం తన దేశపు ద్రవ్యపు బాహ్య విలువను తగ్గించి ఎగుమతులను పెంచి దిగుమతులను తగ్గించడానికి ప్రయత్నిస్తుంది. ఏదో ఒక రకంగా దేశంలో విదేశీ మారక నిల్వలను పెంచడానికి ప్రయత్నిస్తుంది. ఈ అంతర్జాతీయ వ్యాపారం నిరాటంకంగా సాగడానికి, మారకపు రేట్లు స్థిరంగా ఉంచడానికి, దేశాల మధ్య ఆర్థిక సహకారం పెంపొందించడానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి ప్రయత్నిస్తుంది. ఆయా దేశాలలో కేంద్ర బాంకులు అంతర్జాతీయ ఆర్థిక సహకారాన్ని పెంపొందింపజేసే విధానాలను రూపొందించి తద్వారా మారకపు రేట్ల స్థిరీకరణ, మారక నిల్వలను పెంచుకోవడానికి ప్రయత్నించాలి.

**5. ఆర్థికాభివృద్ధి (Economic Growth)**

ఈ మధ్య కాలంలో ఆర్థికాభివృద్ధిని సాధించడం దేశ ద్రవ్య విధానంలో ప్రధాన లక్ష్యంగా పరిగణించబడుతున్నది. ప్రణాళికాబద్ధమైన ఆర్థిక ప్రగతిని సాధించడం, ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడం ఆర్థికంగా వెనుకబడిన దేశాల కేంద్ర బాంకుల ముఖ్య కర్తవ్యంగా మారింది. ప్రణాళికా నిర్వహణలో కేంద్ర బాంకు ముఖ్య పాత్ర వహిస్తూ, ద్రవ్యాన్ని ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సృష్టించి, పరపతిని నియంత్రణ చేసి, ఆర్థిక వ్యవస్థ సమతౌల్యతను కాపాడి, ఆర్థిక ప్రగతికి కేంద్ర బాంకులు కృషిచేస్తాయి.

కేంద్ర బాంకు పరపతి నియంత్రణకు ఉపయోగించే మార్గాలు, పద్ధతులు క్రింది విధంగా ఉంటాయని డి కాక్ పేర్కొన్నాడు.

1. ద్రవ్య రేట్లను పెంచడానికి, తగ్గించడానికి పరపతిలో సంకోచ వ్యాకోచాలను ప్రోత్సహించే నిమిత్తం కేంద్ర బాంకు తన డిస్కౌంట్ రేట్లను తగ్గించడం లేదా హెచ్చించడం.
2. మార్కెట్లో అదనంగా నిధులను ప్రవేశపెట్టడం, తగ్గించడం ద్వారా పరపతిలో సంకోచ వ్యాకోచాలను సాధించటంకోసం స్వేచ్ఛా మార్కెట్లో సెక్యూరిటీలు, హుండీలు అమ్మడం, కొనుగోలు చేయడం.
3. డిస్కౌంట్ రేటు, వడ్డీ రేటు పెంచడంతోబాటు లేదా దానికి ప్రత్యామ్నాయంగా పరపతి రేషనింగ్ కొనసాగించటం.
4. అపరాధి అయిన బాంకు మీద లేదా ఇతర ద్రవ్య సంస్థల మీద ఒత్తిడి తేవడం ద్వారా గాని, బాంకుల ఋణాల, పెట్టుబడి వ్యవహారాలలో అవసరమైన నిబంధనలను విధించడం ద్వారా గాని ప్రత్యక్ష చర్యకు

BRAOU

పూనుకోవడం, పరపతిలో గుణాత్మకమైన పంపిణీని సాధించడంలో కేంద్ర బాంకుకు ఎంతో సహాయకారిగా ఉంటుంది.

5. పరపతిని సృష్టించడంలో వాణిజ్య బాంకుల స్థోమతను విస్తృతం చేయటానికి, సంకోచింపజేయటానికి సాధనంగా కేంద్ర బాంకు తనవద్ద వాణిజ్య బాంకులు ఉంచవలసిన కనిష్ట నగదు రిజర్వులను తగ్గించడం, పెంచడం.

6. ప్రభుత్వ సెక్యూరిటీల రూపంలోనూ, ఇతర నిర్దిష్ట ఆస్తుల రూపంలోనూ వాణిజ్య బాంకులు ఉంచవలసిన కనిష్ట, ద్వితీయ శ్రేణి రిజర్వు నిబంధనలను విధించటం.

7. వాయిదాల మీద తిరిగి చెల్లించే పద్ధతిమీద వినియోగ వస్తువులు కొనుగోలు చేసే నిమిత్తం, వాటిని రవాణా చేసే నిమిత్తం ఋణాలు మంజూరు చేసే విషయంలో కొన్ని నిబంధనలు, షరతులు విధించడం, దీనివలన బకాయిపడిన వినియోగదారుల పరపతిమీద కొంత ప్రత్యక్ష అజమాయిషీ కొనసాగించడం.

8. సెక్యూరిటీ మార్కెట్లలో ఉపయోగించే ఋణాల మంజూరు మీద ప్రభుత్వ అజమాయిషీ కొనసాగించడం కోసం సాధనంగా స్టాకు ఎక్స్ఛేంజీ సెక్యూరిటీల కొనుగోలులో మార్జిన్ (margin) అవసరాలను నియంత్రించడం.

9. అవసరమైన లక్ష్యాల సాధనకు నైతికమైన ఒత్తిడిని, ప్రచారాన్ని సాధనాలుగా వినియోగించడం.

మూలధన పరపతి వినియోగంలోనూ, మూలధన పెట్టుబడులలోనూ ఒడుదుడుకులు సంభవిస్తే పరపతి వ్యవస్థలోనూ, మూలధన వ్యవస్థలోనూ ఒక్క బాంకు పరపతి మాత్రమే వ్యాకోచత్వం కలిగియుంది. అందువలన కేంద్ర బాంకు పరపతి వ్యవస్థపై, మూలధన వ్యవస్థపై, పరపతి నియంత్రణపై అజమాయిషీ కలిగియుండాలి. దేశంలోని సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిణామాల వలన మూలధన పరపతి పరిమాణంలోను, మూలధన పెట్టుబడులలోను ఒడుదుడుకులు సంభవిస్తాయి. దీని మూలంగా కేంద్ర బాంకు యొక్క పరపతి నియంత్రణాధికారం కొంత కుంటుపడుతుంది.

ప్రతి దేశంలోను వాణిజ్య బాంకులకులతోబాటు చాలా యితర ద్రవ్య సంస్థలున్నాయి. కావున పరపతి రంగంలోను, పెట్టుబడి రంగంలోను పనిచేసే యీ సంస్థల వ్యవహారాలు పరపతి వ్యవస్థపై, ద్రవ్య వ్యవస్థపై ప్రభావం కలిగి ఉంటాయి. ఈ సంస్థలు తమ విస్తరణ ద్వారా పెట్టుబడుల ద్వారా వాణిజ్య బాంకులతో పోటీపడుతున్నాయి. కాబట్టి కేంద్ర బాంకు వాణిజ్య బాంకులతోపాటు యితర సంస్థలను తన పరిధిలోకి తెచ్చుకొని పరపతి నియంత్రణను విస్తరించవలసిన అవసరం ఉంది.

పరపతి నియంత్రణ దృష్ట్యా కేంద్ర బాంకు వాణిజ్య బాంకులతో బాటు యితర ద్రవ్య సంస్థలతో సన్నిహిత సంబంధాలు కలిగియుంటుంది. కేంద్ర బాంకు పరపతి నియంత్రణకు కొన్ని ప్రాథమిక ప్రాతిపదికలున్నాయి. పరపతి నియంత్రణకు అవసరమైన శాసనాత్మక అధికారాలు, వనరులు కేంద్ర బాంకు వద్ద ఉండటం, దేశంలోని ప్రముఖ వాణిజ్య బాంకులన్నీ కేంద్ర బాంకు పరిధిలో ఉండటం మొదలగునవి కేంద్ర బాంకు పరపతి నియంత్రణ లక్ష్యసాధనకు తోడ్పడుతాయి. దేశంలో ఆర్థిక నియంత్రణ లోపించినప్పుడు అటు కేంద్ర బాంకుగాని, ఇటు వాణిజ్య బాంకులుగాని పరపతి పంపిణీని, పరపతి వినియోగాన్ని పూర్తిగా నియంత్రించలేవు. కేంద్ర బాంకు నిర్దేశించిన విధానానికి అనుగుణంగా వాణిజ్య బాంకులు తమ పరపతి తక్షణ వినియోగాన్ని, పంపిణీని మార్చుకొంటాయి.

కేంద్ర బాంకులు పరపతి నియంత్రణకు కొన్ని సాధనాలను ఉపయోగిస్తాయి. ఈ పరపతి నియంత్రణ సాధనాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి : 1) పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు; 2) గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలుగా బాంకు రేటు

BRAOU

విధానం, బహిరంగ మార్కెట్ వ్యవహారాలు, నగదు నిల్వలను మార్చడం ఉపయోగించడం జరుగుతుంది. బాంకు అడ్వాన్సుల నియంత్రణ, మార్జిన్లను నిర్ణయించడం, వినియోగదార్ల పరపతి నియంత్రణ, పరపతి రేషనింగ్, నైతికోద్బోధ, ప్రత్యక్ష చర్యలు మొదలగునవి గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలుగా కేంద్ర బాంకు ఉపయోగిస్తుంది.

దేశంలోని వాణిజ్య బాంకులు, ఇతర ద్రవ్య వ్యవస్థలు, తమ వ్యాపారాలకు అవసరమైన ద్రవ్యాన్ని కేంద్ర బాంకునుంచి ఋణాలుగా తీసుకొంటాయి. ఈ ఋణాలపైన కేంద్ర బాంకు విధించే వడ్డీరేటును బాంకు రేటు (bank rate) అని అంటారు. బాంకు రేటు సాధనం ద్వారా కేంద్ర బాంకు దేశానికి హానికరమైన పరపతి సంకోచ వ్యాకోచాలను అదుపులో ఉంచవచ్చు. వాణిజ్య బాంకులు పరపతి ద్రవ్యాన్ని ఎక్కువగా సృష్టిస్తే ధరల స్థాయి పెరిగి ద్రవ్య మార్కెట్ సుస్థిరతకు భంగం వాటిల్లి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితులలో బాంకు రేటును కేంద్ర బాంకు పెంచుతుంది. బాంకులు పరపతి ద్రవ్యాన్ని బాగా తగ్గిస్తే ద్రవ్య మార్కెట్ ఇబ్బందికి గురి అవుతుంది. అలాంటప్పుడు బాంకు రేటును తగ్గించి కేంద్ర బాంకు సులభ ద్రవ్య స్థితిని కల్పిస్తుంది. ఈ విధంగా బాంకు రేటును మార్చడం వలన ఆర్థిక వ్యవస్థలో ధరలు, ఉత్పత్తి స్థాయిలు కూడా మారుతాయి.

1930 లలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వరకు కేంద్ర బాంకు ఉపయోగించే వివిధ పరపతి నియంత్రణ సాధనాలలో ముఖ్యమైనదిగా బాంకు రేటును పరిగణించారు. ఇంగ్లాండ్‌లోని మాక్మిలన్ కమిటీ ద్రవ్య విధానాన్ని అమలు చేయడంలో కేంద్ర బాంకు ఉపయోగించగల సున్నితమైన, సుందరమైన సాధనంగా బాంకు రేటును అభివర్ణించింది. స్వర్ణ ప్రమాణాన్ని త్యజించిన తర్వాత, ఆర్థిక మాంద్యం ఏర్పడిన తర్వాత బాంకు రేటు ప్రాధాన్యత తగ్గింది. హుండీల ప్రాముఖ్యం తగ్గి, కరెంట్ ఖాతాలు, ఓవర్ డ్రాఫ్టుల ద్వారా ఋణ సదుపాయాలు కలిగినందువలన కూడా బాంకు రేటు ప్రాధాన్యత కొంత తగ్గిందని చెప్పవచ్చు. వీటికితోడు బహిరంగ మార్కెట్ వ్యవహారాలు, నగదు నిల్వల మార్పు అమలులోకి రావడం వల్ల బాంకు రేటు విధాన ప్రాముఖ్యత తగ్గింది. అయినప్పటికీ 1951లో సంభవించిన కొరియా యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడడంతో మరల బాంకురేటు విధానం ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. దీని ఫలితంగా 1951 నవంబరులో బాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ బాంకు రేటును 2 నుండి 2.5 శాతానికి, భారత దేశంలో రిజర్వు బాంకు 3 నుండి 3.5 శాతానికి పెంచాయి. 1951 తర్వాత ద్రవ్యోల్బణ పరిస్థితుల మూలంగా చాలా దేశాలు కూడా బాంకు రేటు విధానాన్ని తరచూ ఉపయోగిస్తున్నాయి.

భారత దేశంలో కూడా రిజర్వు బాంకు చట్టం 49వ సెక్షన్ ప్రకారం తన బాంకు రేటును ఎప్పటికప్పుడు మారుస్తూ వచ్చింది. 1951 నవంబరులో 3.5 శాతానికి, 1957 మే నెలలో 4 శాతానికి, 1963 జనవరిలో 4.5 శాతానికి, 1964 సెప్టెంబరులో 5 శాతానికి, 1971 మార్చిలో 6 శాతానికి, 1973 మే నెలలో 7 శాతానికి, 1974 జూలైలో 9 శాతానికి, 1981 జూలైలో 10 శాతానికి పెంచింది. 1996 మే 24 నాటికి బాంకు రేటు 12 శాతంగా ఉంది.

మొదట ప్రపంచ యుద్ధానంతరం పరపతి నియంత్రణ సాధనంగా బహిరంగ మార్కెట్ వ్యవహారాలు విశేష ప్రాముఖ్యంలోకి వచ్చాయి. డి కాక్ మాటల్లో మార్కెట్లో ఎలాంటి పత్రాలనైనా, సెక్యూరిటీలనైనా అమ్మడాన్ని, కొనడాన్ని బహిరంగ మార్కెట్ వ్యవహారాలుగా నిర్వచించవచ్చు. అయితే ఇంగ్లాండ్, అమెరికా, మరికొన్ని ఇతర దేశాలలో కేంద్ర బాంకులు సెక్యూరిటీలను మాత్రమే కొనడం, అమ్మడం చేస్తున్నాయి. కొన్ని దేశాల కేంద్ర బాంకులు ప్రభుత్వ సెక్యూరిటీలనే గాక హుండీలను, విదేశీ మారక ద్రవ్యాన్ని కొనడంగాని, అమ్మడంగాని చేస్తాయి. ఈ విధమైన మార్కెట్ వ్యవహారాలు చలామణిలో ఉన్న ద్రవ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి.

BRAOU

ద్రవ్యోల్బణ పరిస్థితులలో వాణిజ్య బాంకులవద్ద నగదు రిజర్వులు అధికంగా ఉండి అది హానికరమైన స్థాయి వరకు పరపతిని పెంచుతున్నప్పుడు కేంద్ర బాంకు సెక్యూరిటీలను అమ్ముతుంది. వ్యక్తులు, సంస్థలు కేంద్ర బాంకుకు నగదు చెల్లించి సెక్యూరిటీలను కొనడం ద్వారా చలామణిలోనున్న ద్రవ్యం తగ్గుతుంది. అలా నగదుగా గాక చెక్కుల రూపంలో కేంద్ర బాంకుకు ఇస్తే కేంద్ర బాంకు వాణిజ్య బాంకులనుండి వెంటనే ఆ సొమ్మును వసూలు చేస్తుంది. అందువలన వాణిజ్య బాంకుల నగదు రిజర్వులు తగ్గుతాయి. ఈ విధంగా చలామణిలోనున్న ద్రవ్యరాశి తగ్గడం వలన ద్రవ్యోల్బణాన్ని అరికట్టవచ్చు.

ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులలో కేంద్ర బాంకు సెక్యూరిటీలను కొనుగోలు చేస్తుంది. తత్ఫలితంగా చలామణిలోనున్న ద్రవ్యరాశి పెరుగుతుంది. సెక్యూరిటీలు అమ్మినవారు తమకు వచ్చిన నగదును బాంకులలో డిపాజిట్ చేస్తే బాంకుల నగదు నిల్వలు పెరుగుతాయి. బాంకులకు ఋణాలిచ్చే శక్తి పెరిగి పరపతి విస్తృతి జరుగుతుంది. భారతీయ రిజర్వు బాంకు చట్టంలోని 17 (8) వ సెక్షన్ ప్రకారం మన దేశంలో ప్రభుత్వ సెక్యూరిటీల క్రయ విక్రయాలు కొనసాగించే అధికారం రిజర్వు బాంకుకు కలదు.

అన్ని దేశాలలోనూ వాణిజ్య బాంకులు తమ నగదు నిల్వలలో కొంత భాగాన్ని కేంద్ర బాంకు వద్ద ఉంచుతాయి. ఉదాహరణకు భారత దేశంలోని వాణిజ్య బాంకులు తమ మొత్తం డిపాజిట్లలో 3 శాతం వరకు నగదు రూపంలో రిజర్వు బాంకు వద్ద ఉంచాలి. రిజర్వు బాంకుకు యీ శాతాన్ని 3 నుండి 15 శాతం వరకు మార్పు చేయగల అధికారం ఉంది. ఈ విధంగా నగదు నిల్వల శాతం మార్చడాన్ని పరపతి నియంత్రణ సాధనంగా కేంద్ర బాంకు ఉపయోగిస్తుంది. ఈ సాధనాన్ని భారతీయ రిజర్వు బాంకు మొదటిసారిగా 1970 మార్చిలో ఉపయోగించింది.

మొట్టమొదటగా ఈ పద్ధతిని అమెరికా ప్రవేశపెట్టింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఈ విధానం ఇండియా, స్వీడన్, పశ్చిమ జర్మనీ, బెల్జియం మొదలైన దేశాలలో అమలులోకి వచ్చింది. వాణిజ్య బాంకులు విరివిగా ఋణాలిచ్చి, హానికరమైన స్థాయి వరకు డిపాజిట్లను సృష్టిస్తున్నాయని కేంద్ర బాంకు భావించినప్పుడు నగదు నిల్వల శాతాన్ని పెంచడం జరుగుతుంది. దీనివలన వాణిజ్య బాంకుల వద్దనుండే నగదు నిల్వలు కేంద్ర బాంకుకు బదిలీ అవుతాయి. దీనివల్ల వాణిజ్య బాంకులు యివ్వగలిగిన ఋణాలు తగ్గిపోతాయి. అదే విధంగా వాణిజ్య బాంకులు ఉంచాల్సిన నగదు నిల్వలను కేంద్ర బాంకు తగ్గించినప్పుడు నగదు నిల్వలు కేంద్ర బాంకులనుండి వాణిజ్య బాంకులకు బదిలీ అవుతాయి. అప్పుడు వాణిజ్య బాంకులు ఎక్కువగా ఋణాలు ఇవ్వగలుగుతాయి. భారతీయ రిజర్వు బాంక్ ఇటీవల వాణిజ్య బాంకుల నగదు నిల్వల శాతాన్ని 13 శాతం నుండి 12 శాతానికి తగ్గించింది. ఈ విధానం జూలై 6, 1996 నుంచి అమలులోకి వచ్చింది. దీని ఫలితంగా వాణిజ్య బాంకులకు అదనంగా రూ. 4,100 కోట్ల ద్రవ్యాన్ని వినియోగించుకొనే అవకాశం లభించింది.

పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలైన బాంకు రేటు, బహిరంగ మార్కెట్ వ్యవహారాలు చలామణిలోనున్న ద్రవ్యరాశిని పరోక్షంగా ప్రభావితం చేస్తాయి. అయితే నగదు నిల్వల మార్పు మాత్రం ప్రత్యక్షంగా వాణిజ్య బాంకుల వద్ద ఉన్న నగదు నిల్వలను, తద్వారా అవి యివ్వగలిగే ఋణాల పరిమాణంలో మార్పులను తెస్తుంది. ఈ పద్ధతి సమర్థవంతమైనదిగా కూడా కొందరు అభిప్రాయపడ్డారు. ఈ విధంగా వాణిజ్య బాంకుల వద్ద ద్రవ్యం అధికంగా ఉన్నప్పుడు, ఈ పద్ధతిని అమలు చేయడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించవచ్చు.

ఋణాలను మంజూరు చేయడంలో బాంకులు అవలంబించవలసిన విధానాన్ని నిర్ణయించే అధికారం చట్టరీత్యా కేంద్ర బాంకుకు కలదు. ఈ పద్ధతి మొట్టమొదట అమెరికాలో ప్రవేశపెట్టబడింది. భారత దేశంలో



BRAOU

1949 భారత బాంకింగ్ రెగ్యులేషన్ చట్టం యీ అధికారాన్ని రిజర్వు బాంకుకు కల్పించింది. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వాణిజ్య బాంకులు ఋణ విధానాలకు సంబంధించిన కేంద్ర బాంకు ఆదేశాలను పాటించాలి.

బాంకులు ఋణాలిచ్చేటప్పుడు హామీగా యిచ్చిన సెక్యూరిటీ విలువకు, మంజూరు చేసే ఋణానికి కొంత తేడా ఉంటుంది. ఆ తేడానే మార్జిన్ (margin) అని అంటారు. ఉదాహరణకు రూ. 100 విలువగల బంగారాన్ని బాంకు వద్ద తాకట్టు పెట్టి ఆ బంగారం విలువలో 80 శాతం వరకు అంటే రూ. 80 ఋణంగా యిస్తే మిగిలిన 20 శాతం అనగా రూ. 20 మార్జిన్ అవుతుంది. తాకట్టుపెట్టిన వస్తువుల విలువలో కలిగే మార్పులనుంచి, ఋణాలపైన పెరిగే వడ్డీని గురించి బాంకుకు రక్షణ కల్పించడానికి యీ మార్జిన్ ఉపయోగపడుతుంది. ఈ మార్జిన్లను కేంద్ర బాంకు నిర్ణయిస్తుంది. ఈ మార్జిన్ పెంచడం లేదా తగ్గించడం ద్వారా కేంద్ర బాంకు పరపతిని నియంత్రించగలుగుతుంది.

వినియోగదార్లకు వాయిదా పద్ధతిలో వస్తువులు కొనడానికి సంబంధించి బాంకులు పరపతి సౌకర్యం కలుగచేస్తాయి. ఈ పరపతి సౌకర్యాన్ని పెంచడం ద్వారా లేదా తగ్గించడం ద్వారా వస్తువులకున్న డిమాండ్‌ను ప్రభావితం చేయవచ్చు. ద్రవ్యోల్బణ సమయంలో డౌన్ పేమెంట్ (down payment) ను పెంచి, వాయిదాల సంఖ్యను తగ్గించి, స్టాంపు రుసుం పెంచితే కొనుగోళ్లు తగ్గుతాయి. ఆర్థిక మాంద్య కాలంలో డౌన్ పేమెంట్ తగ్గించి, వాయిదాల సంఖ్యను పెంచి, స్టాంపు రుసుం తగ్గిస్తే వస్తువుల కొనుగోళ్లు పెరుగుతాయి. ఈ విధంగా వస్తువుల డిమాండ్‌లో మార్పులను తెచ్చి ఆర్థిక కార్యకలాపాల స్థాయిని మార్చవచ్చు.

వాణిజ్య బాంకులు యిచ్చే పరపతి సౌకర్యాలకు పరిమితి విధించడం లేక పరపతిని క్రమబద్ధీకరించడం ద్వారా కేంద్ర బాంకు పరపతిని నియంత్రిస్తుంది. ఆర్థిక ప్రణాళికలు అమలులోనున్నప్పుడు, దేశంలో ఉన్న ద్రవ్య నిధులను, పరపతి సౌకర్యాలను అంచనా వేసి, ఆ సౌకర్యాలను వివిధ రంగాలలో పెట్టుబడి నిమిత్తం కేంద్ర బాంకు కేటాయిస్తుంది. దీనినే పరపతి రేషనింగ్ అంటారు. వాణిజ్య బాంకులు వివిధ రంగాలకు యిచ్చే ఋణాలకు హద్దులను ఏర్పరచి పరిమాణాత్మకంగాను, గుణాత్మకంగాను పరపతి నియంత్రణకు కేంద్ర బాంకు కృషి చేస్తుంది. దీనికితోడు దేశ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ద్రవ్య వ్యవహారాలకు సంబంధించి కేంద్ర బాంకు వాణిజ్య బాంకులకు, యితర సంస్థలకు సమయోచిత సలహాలను ఇచ్చి దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు, ద్రవ్య వ్యవస్థ సుస్థిరతకు కృషి చేస్తుంది. పైన వివరించిన విధంగా కేంద్ర బాంకులు పరిమాణాత్మక, గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఉపయోగించి పరపతి నియంత్రణ విధిని నిర్వహిస్తాయి.

BRAOU

## 20.6 ముగింపు

కేంద్ర బాంకులు దేశంలో ద్రవ్య సుస్థిరతను కాపాడి, దేశ ఆర్థిక స్థితిగతులకు అనుగుణమైన ద్రవ్య విధానాన్ని రూప కల్పనచేసి, ద్రవ్య మార్కెట్‌కు నాయకత్వం వహించి, విదేశీ మారకపు రేట్ల స్థిరీకరణ, ధరల స్థిరత్వం, సంపూర్ణోద్యోగిత, ఆర్థికాభివృద్ధిలాంటి ద్రవ్య విధాన లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషిచేస్తూ దేశ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతున్నాయి. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర బాంకులు కొన్ని ముఖ్యమైన విధులను నిర్వహిస్తున్నాయి. కరెన్సీ నోట్లను జారీ చేయడం, చలామణిలోనున్న ద్రవ్య సప్లయ్‌ను అదుపులో వుంచి ద్రవ్య సుస్థిరతను కాపాడటం, ప్రభుత్వ బాంకరుగా, సలహాదారుగా వ్యవహరించడం, వాణిజ్య బాంకుల నగదు రిజర్వులను పరిరక్షించడం, అంతర్జాతీయ నిధులను సంరక్షించి విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంలో ప్రతికూలతను తొలగించడం, అంతిమ ఋణదాతగా వ్యవహరించి బాంకింగ్ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పడటం, వీటన్నింటికంటే ముఖ్యంగా పరపతి నియంత్రణ బాధ్యత వహియించి ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు కేంద్ర బాంకులు విశేష కృషి చేస్తున్నాయి.

# భాగం - 21 : పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

విషయ క్రమం


21.0 ఉద్దేశం

21.1 కేంద్ర బ్యాంకు పరిచయం, లక్ష్యాలు

21.2 పరపతి ప్రాముఖ్యత

21.3 పరపతి నియంత్రణ ఆవశ్యకత

21.4 పరపతి నియంత్రణా సాధనాలు

21.5 బ్యాంకు రేటు విధానం

21.6 బహిరంగ మార్కెట్ కార్యకలాపాలు

21.7 నగదు నిల్వల నిష్పత్తిలో మార్పులు

21.8 సారాంశం

21.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

21.10 సంప్రదింపు గ్రంథాలు

21.11 పదకోశం


## 21.0 ఉద్దేశం

ఈ భాగంలో పరిమాణాత్మక పరపతి నియంత్రణ అంటే ఏమిటో వివరించి, పరిమాణాత్మక పరపతి నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో అందుబాటులో ఉండే పరపతి పరిమాణాన్ని ఏ విధంగా అదుపులో ఉంచటం జరుగుతుందో తెలియజేసాం.

## 21.1 కేంద్ర బ్యాంకు పరిచయం, లక్ష్యాలు

భారత దేశంలో రిజర్వ్ బ్యాంకు కేంద్ర బ్యాంకుగా పనిచేస్తుంది. చట్టబద్ధంగా అన్ని బ్యాంకులపైన అజమాయిషీ చేసే అధికారం కేంద్ర బ్యాంకుకు ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వాన్ని చేకూర్చుతూ, ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు లేకుండా ఆర్థికాభివృద్ధి ప్రక్రియకు చేయూతనివ్వవలసిన బాధ్యత కేంద్ర బ్యాంకుపై వుంది. ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో అస్థిరత్వ పరిస్థితులకు దారితీసి ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయిలలో హెచ్చుతగ్గులకు దారితీస్తాయి. కేంద్ర బ్యాంకు ఆర్థిక వ్యవస్థలో మొత్తం పరపతిని, ద్రవ్య సప్లయ్‌ని నియంత్రించడం ద్వారా సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధించటానికి ప్రయత్నిస్తుంది.

## 22.2 పరపతి ప్రాముఖ్యత

పరపతి ద్రవ్యాన్ని సృష్టించటం వాణిజ్య బ్యాంకుల ముఖ్యమైన విధిగా చెప్పబడుతుంది. వాణిజ్య బ్యాంకులు ప్రాథమిక డిపాజిట్ల ఆధారంగా ఋణాలను అందించి, ప్రాథమిక డిపాజిట్‌కు కొన్ని రెట్లు ఎక్కువగా పరపతిని సృష్టించటం జరుగుతుంది. పరపతి సృష్టి అనేది ఋణాలు అందించటం ద్వారా వాణిజ్య బ్యాంకులు పరపతిని

విస్తరించటం అనే ప్రక్రియకు సంబంధించింది. వాణిజ్య బాంకులు ఋణాలు అందించినప్పుడు, ఈ ఋణాలు తిరిగి డిపాజిట్లుగా బాంకింగ్ వ్యవస్థకు చేరతాయి. పై విధంగా వచ్చిన డిపాజిట్ల ఆధారంగా, వాణిజ్య బాంకులు తిరిగి ఋణాలు అందిస్తాయి. ఋణాలు తిరిగి డిపాజిట్లుగా బాంకింగ్ వ్యవస్థకు చేరతాయి. అనగా డిపాజిట్లు ఋణాలుగాను, ఋణాలు డిపాజిట్లుగాను మారుతుంటాయి.

పరపతి ద్రవ్యానికి ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో విశేష ప్రాముఖ్యం ఉంది. వాణిజ్య బాంకులు ఎక్కువగా పరపతిని సృష్టిస్తూ, దానిని సులభతరమైన నిబంధనల ద్వారా పెట్టుబడిదార్లకు అందిస్తున్నట్లయితే, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి నిధుల సప్లయ్ పెరుగుతుంది. అందువలన ఆర్థిక వ్యవస్థలో ఇప్పటివరకు ఉపయోగించబడకుండా వున్న వనరులను పూర్తిగా ఉపయోగించుకోవటానికి వీలు అవుతుంది. దీని కారణంగా ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగిత, ఉత్పత్తి స్థాయి పెరుగుతాయి. అంతేకాకుండా, గుణక ప్రభావం వలన, ఆదాయ స్థాయిలో పెరుగుదల పెట్టుబడిలోని పెరుగుదలకు కొన్ని రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే మన దేశంలో పరపతిని ఆర్థిక మరియు ద్రవ్య విధాన లక్ష్యాలను సాధించటానికి ఒక పరికరంగా ఉపయోగించడం జరుగుతుంది. పరపతి ద్రవ్య పరిమాణంలో మార్పులు వస్తే, హై పవర్డ్ (high powered) ద్రవ్య సప్లయ్‌లో మార్పులు వస్తాయి. ఆర్థిక వ్యవస్థలో మొత్తం ద్రవ్య సప్లయ్ ద్రవ్య గుణకం (money multiplier) పైన, హై పవర్డ్ ద్రవ్య సప్లయ్‌పైన ఆధారపడి వుంటుంది. ఇక్కడ గుర్తు పెట్టుకోవలసిన విషయమేమంటే, ద్రవ్య గుణకాన్ని ప్రభావితం చేసే అంశాలపై కేంద్ర బాంకు నియంత్రణ ఏమీ ఉండదు. ద్రవ్య గుణకాన్ని ప్రభావితం చేసే అంశాలన్నీ ప్రజల మానసిక ప్రవర్తనకు సంబంధించినవి. ఈ కారణంగా కేంద్ర బాంకు ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సప్లయ్ మరియు పరపతి పరిమాణంలో మార్పులు చేయడానికి, హై పవర్డ్ ద్రవ్య సప్లయ్‌లో మార్పులు చేయవలసి వుంటుంది. హై పవర్డ్ ద్రవ్య సప్లయ్‌లో మార్పులు చేయటం వలన దానిలో అంతర్భాగాలైన కరెన్సీ మరియు రిజర్వ్ ద్రవ్యం ($H = C + R$) లో మార్పులు వచ్చి, ఆశించిన లక్ష్యాలు సాధించటానికి అవకాశం ఏర్పడుతుంది.

## 21.3 పరపతి నియంత్రణ - ఆవశ్యకత

ఆర్థిక వ్యవస్థ యొక్క అభివృద్ధి ప్రక్రియలో బాంకులు సృష్టించే పరపతికి విశేష ప్రాముఖ్యం ఉన్నప్పటికీ, అందుబాటులో ఉండే పరపతి పరిమాణం హద్దులు దాటితే, ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం ఏర్పడి, ధరలలో అస్థిరత్వానికి; ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయిలలో హెచ్చు తగ్గులకు దారి తీస్తుంది. అంచనా వ్యాపారం మొగలైన ప్రమాద భరితమైన కార్యకలాపాలకు బాంకు పరపతి ఉపయోగించకుండ నివారించి, దేశ శ్రేయస్సు దృష్ట్యా, సామాజిక ప్రయోజనం ఎక్కువగా ఉన్న రంగాలలోకి పరపతి పెద్ద మొత్తంలో తరలి వెళ్ళేటట్లు చూడవలసిన బాధ్యత కేంద్ర బాంకుపై ఉంటుంది. కావలసినంత మేరకు పరపతి అందుబాటులో లేకపోయినట్లయితే, సమష్టి డిమాండ్ తగ్గిపోయి, ధరల స్థాయి తగ్గిపోయి ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయిలు పడిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ కారణంగా కేంద్ర బాంకు ద్రవ్య విధానం ద్వారా, ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు లభ్యమయ్యే పరపతి పరిమాణంలో మార్పులు ప్రవేశపెడుతూ, స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించటానికి ప్రయత్నిస్తుంది. పరపతి నియంత్రణకు క్రింది కారణాలవల్ల ప్రాముఖ్యత ఏర్పడుతుంది.

1. ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులను అరికట్టడానికి బాంకులు సృష్టించే పరపతిని నియంత్రించవలసి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణం విపరీతంగా పెరిగితే, ధరల స్థాయిలో పెరుగుదల ఏర్పడి, ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఒకవేళ పరపతి పరిమాణం విపరీతంగా తగ్గిపోతే, ఆర్థిక కార్యకలాపాల స్థాయి తగ్గి, ధరల స్థాయి తగ్గుముఖం పట్టి, ఆర్థిక వ్యవస్థ పతన (collapse) దిశవైపు నడుస్తుంది. ఆర్థిక వ్యవస్థ యొక్క దీర్ఘకాలిక అభివృద్ధి దృష్ట్యా ద్రవ్యోల్బణం కాని, ప్రతి ద్రవ్యోల్బణం కాని ఆశించతగినవి

కావు. ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితుల మూలంగా ఆర్థికాభివృద్ధి ప్రక్రియ సజావుగా నడవక కుంటుపడుతుంది. కనుక ఆర్థిక వ్యవస్థలో సాధారణ పరిస్థితులు నెలకొనేటట్లు చేయటానికి ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించాలి. దీనికిగాను వాణిజ్య బాంకులు సృష్టించే పరపతిని నియంత్రించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

2. ఆదాయ సంపదలలో అసమానతలను తగ్గించడానికి పరపతిని నియంత్రించవలసి ఉంటుంది. భారత దేశం వంటి అభివృద్ధి చెందుచున్న దేశాలలో, ఆదాయ సంపదలలో అసమానతలు సహజంగా కనిపిస్తుంటాయి. దీనికి కారణం ఆర్థికాభివృద్ధి ద్వారా కలిగే ప్రయోజనాలు దేశంలోని ప్రజలందరికీ సమానంగా పంపిణీ కాకపోవటమే. ఆర్థికాభివృద్ధి ప్రక్రియ కొనసాగుతూ ఉన్నప్పుడు, ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినట్లయితే, ఆర్థిక వ్యవస్థలో ధనిక పేద వర్గాల మధ్య, ఆదాయ సంపదలలో అసమానతలు పెరుగుతూ వుంటాయి. ద్రవ్యోల్బణం ఏర్పడినట్లయితే ధనికులు మరీ ధనవంతులు అవుతుంటే, పేదవాళ్లు ఇంకా పేదరికంలోకి నెట్టి వేయబడతారు. ఈ కారణంగా, కేంద్ర బాంకు తన పరపతి విధానం ద్వారా, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతూ, వివిధ వర్గాల ప్రజల మధ్య ఆదాయ సంపదలలో ఉన్న వ్యత్యాసాలను తగ్గించేందుకు పరపతి నియంత్రణ చాలా అవసరం.

3. ఆర్థిక వ్యవస్థలో ఆర్థికాభివృద్ధి ప్రక్రియ ఒక క్రమమైన పద్ధతిలో సాగకుండా, హెచ్చు తగ్గులు అనగా వ్యాపార చక్రాలు ఏర్పడినట్లయితే, వ్యాపార చక్రాలను అదుపులో ఉంచి, ఆర్థికాభివృద్ధి ప్రక్రియ సాఫీగా జరిగేటట్లు చూడడానికి కూడా కేంద్ర బాంకు వాణిజ్య బాంకులు సృష్టించే పరపతిపైన నిర్బంధాలను విధించి నియంత్రించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

4. వాణిజ్య బాంకులు సృష్టించే పరపతి, సామాజిక ప్రయోజనం ఎక్కువగా వున్న రంగాలలో, పెద్ద మొత్తంలో ప్రవహించేటట్లు, సామాజిక ప్రయోజనం లేని, ముఖ్యంగా అంచనా వ్యాపారం మొదలైన రంగాలలోకి తక్కువగా ప్రవహించేటట్లు చూడటానికి బాంకులు సృష్టించే పరపతిని నియంత్రించి క్రమబద్ధం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

5. ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల మధ్య (ఉదాహరణకు వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలు), వివిధ వర్గాల మధ్య (ఉదాహరణకు చిన్నతరహా, మధ్యతరహా, పెద్దతరహా వ్యవసాయదారులు) వాణిజ్య బాంకులు సృష్టించే పరపతి అభిలషణీయంగా పంపిణీ చేసి, ఆయా రంగాల అభివృద్ధికి తోడ్పడేందుకు, బాంకులు సృష్టించే పరపతి పరిమాణాన్ని నియంత్రించవలసి ఉంటుంది.

పై లక్ష్యాలను సాధించడానికి వాణిజ్య బాంకులు సృష్టించే పరపతి పరిమాణాన్ని, పరపతి ప్రవాహ మార్గాలను నియంత్రించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

## 21.4 పరపతి నియంత్రణా సాధనాలు

భారతీయ రిజర్వ్ బాంకు అనుసరించే ద్రవ్య విధానం "నియంత్రిత విస్తరణ" (controlled expansion) అని తెలుసుకున్నాం. పరపతి నియంత్రణ ద్రవ్య విధానంలో ఒక అంతర్భాగం. ద్రవ్య విధానంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి కేంద్ర బాంకు పరపతి నియంత్రణకు చర్యలు తీసుకుంటు[illegible] [illegible]ేంద్ర బాంకు పరపతి నియంత్రణ కొరకు రెండు రకాల చర్యలు చేపడుతుంది. అవి : (1) పరిమాణాత్మక సాధనాలు (quantitative instrumens), (2) గుణాత్మక లేదా ఎంపిక చేసిన సాధనాలు (selective or qualitative instruments). ఈ

పాఠంలో పరిమాణాత్మక చర్యలను సవివరంగా చర్చించడం జరిగింది. వచ్చే పాఠంలో గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను చర్చించుకొందాం.

బాంకు రేటు విధానం, బహిరంగ మార్కెట్ చర్యలు, నగదు నిల్వల నిష్పత్తిలో మార్పులు చేయటం పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలుగా చెప్పవచ్చు. కేంద్ర బాంకు పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాల ద్వారా వాణిజ్య బాంకులు సృష్టించే పరపతి పరిమాణాన్ని, పరపతి వ్యయాన్ని (cost of credit) ప్రత్యక్షంగా ప్రభావితం చేసి, ఆర్థిక వ్యవస్థలో మొత్తం పరపతిని అవసరాలకు అనుగుణంగా నియంత్రించ గలుగుతుంది. ఈ సాధనాలను ఉపయోగించడం ద్వారా బాంకుల యొక్క పరపతి సృష్టించే శక్తిని పెంచటం గాని, తగ్గించడం గాని చేయడానికి వీలుంటుంది. పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను ఉపయోగించి, చలామణిలో ఉండే ద్రవ్య సప్లయ్‌ని, పరపతి పరిమాణాన్ని, కేంద్ర బాంకు నియంత్రించగలుగుతుంది. వాణిజ్య బాంకులు సృష్టించగలిగే మొత్తం పరపతి పరిమాణాన్ని అదుపులో ఉంచటం పరిమాణాత్మక పరపతి నియంత్రణ ప్రధానోద్దేశం.

ఆర్థిక వ్యవస్థలో అందుబాటులో ఉండే పరపతి పరిమాణంలో మార్పులు ప్రవేశపెట్టడానికి కేంద్ర బాంకు తీసుకునే పరిమాణాత్మక చర్యలను ఇప్పుడు తెలుసుకుందాం.

## 21.5 బాంకు రేటు విధానం

వాణిజ్య బాంకులు డిస్కౌంట్ చేసిన వినిమయ బిల్లులను కేంద్ర బాంకు తిరిగి డిస్కౌంట్ (re-discount) చేసి ఋణాలు అందించేటప్పుడు, కేంద్ర బాంకు వసూలు చేసే వడ్డీ రేటును బాంకు రేటు అంటారు. బాంకు రేటునే రీ-డిస్కౌంట్ రేటు అని కూడా అంటారు. వాణిజ్య బాంకులతోపాటు, ఆర్థిక వ్యవస్థలోని ఇతర ఆర్థిక సంస్థలు అవసరం అయినప్పుడు తాము ఇంతకు ముందు డిస్కౌంట్ చేసిన వాణిజ్య బిల్లులను, సెక్యూరిటీలను కేంద్ర బాంకు వద్ద రీ-డిస్కౌంట్ చేయించుకోవడం ద్వారా ఋణాలను పొందడానికి వీలుంటుంది.

ఉదాహరణకు X అను వాణిజ్య బాంకు, A అనే వ్యక్తి హామీగా ఇచ్చిన రూ. 1,000 విలువగల వినిమయ బిల్లు (bill of exchange) ను డిస్కౌంట్ చేసి, రూ. 600 ఋణం అందించిందనుకుందాం. ఋణం ఇచ్చిన తర్వాత X వాణిజ్య బాంకు నిధుల కొరతను ఎదుర్కొంటున్నదనుకుందాం. ఇటువంటి పరిస్థితిలో X వాణిజ్య బాంకు A అనే వ్యక్తి వద్ద నుండి డిస్కౌంట్ చేసిన రూ. 1,000 వినిమయ బిల్లును కేంద్ర బాంకుకు ఇచ్చి, దాని ఆధారంగా ఋణాన్ని ఇవ్వమని కేంద్ర బాంకును వాణిజ్య బాంకు కోరుతుంది. ఈ పరిస్థితిలో కేంద్ర బాంకు, X వాణిజ్య బాంకు హామీగా ఇచ్చిన వినిమయ బిల్లును రీ-డిస్కౌంట్ చేసి ఋణాన్ని ఇచ్చినప్పుడు ఆ ఋణంపై వసూలు చేసే వడ్డీ రేటును బాంకు రేటు అంటారు. అనగా వాణిజ్య బాంకులు హామీగా ఇచ్చిన ట్రెజరీ బిల్లులను, సెక్యూరిటీలను హామీగా తీసుకుని ఋణాలు మంజూరు చేసేటప్పుడు, కేంద్ర బాంకు విధించే నిబంధనలలో (వడ్డీ రేటులో) మార్పులను బాంకు రేటు విధానమని చెప్పవచ్చు.

కేంద్ర బాంకు డిస్కౌంటు రేటులో మార్పులు ప్రవేశపెట్టడం వలన, ఆర్థిక వ్యవస్థలో అందుబాటులో ఉండే పరపతి పరిమాణంలోను, పరపతి వ్యయంలోను (cost of credit) మార్పులు వస్తాయి. బాంకు రేటులో వచ్చే మార్పులు పరపతి పరిమాణాన్ని, పరపతి వ్యయాన్ని ప్రభావితం చేస్తాయి. కేంద్ర బాంకు వద్ద డిస్కౌంట్ చేసే బిల్లులకు ఉండవలసిన అర్హతలను, ఋణాలను మంజూరు చేసేటప్పుడు హామీగా అంగీకరించే సెక్యూరిటీల అర్హతలను, ఋణాలను తిరిగి చెల్లించటానికి ఉండే గరిష్ఠ కాల పరిమితిని నిర్ణయించటం వల్ల, కేంద్ర బాంకు ఇచ్చే పరపతికి, తద్వారా వాణిజ్య బాంకులు అందించగల పరపతికి పరిమితి ఏర్పడుతుంది. దీనికి కారణం

ఆర్థిక మాంద్య పరిస్థితిలో సార్థక డిమాండ్ లోపించి, ధరల స్థాయి పతనమవుతుంది. ఈ పరిస్థితిలో కేవలం ఉత్పత్తియైన వినియోగ వస్తువులకే కాకుండ, పెట్టుబడి వస్తువులకు కూడా డిమాండ్ తగ్గిపోయి ఆర్థిక వ్యవస్థ యావత్తు పతన దిశవైపు పయనిస్తుంది.

వాణిజ్య బాంకులు అందించే పరపతి పరిమాణం తక్కువగా ఉండి, ఆర్థిక వ్యవస్థలో ప్రతి ద్రవ్యోల్బణం లేదా ఆర్థిక మాంద్య పరిస్థితి తీవ్రరూపం దాల్చినప్పుడు, కేంద్ర బాంకు బాంకు రేటును తగ్గిస్తుంది. కేంద్ర బాంకు బాంకు రేటును తగ్గించినందువలన, మార్కెట్లో వడ్డీ రేట్లు తగ్గిపోతాయి. అందువలన వాణిజ్య బాంకులు కూడా అవి ఇచ్చే ఋణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తాయి. అందువలన వ్యాపారస్తులు బాంకుల నుండి తీసుకున్న ఋణాలపై చెల్లించవలసిన వడ్డీ రేటు తగ్గుతుంది. వడ్డీ భారం తగ్గటం వల్ల, వ్యాపారస్తులు ఉత్పత్తిదారుల నుండి వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేసి పెద్ద మొత్తంలో నిల్వలను పెంచుతారు. అందువలన ఉత్పత్తిదారుల అమ్మకాలు పెరుగుతాయి. ఉత్పత్తిదారులకు ఆర్థిక పరిస్థితులు ప్రోత్సాహకరంగా ఉన్నందువలన, ఉత్పత్తిదారులు ఎక్కువమంది శ్రామికులను ఉత్పత్తి ప్రక్రియలో నియమించి, ఉత్పత్తిని పెంచటానికి చర్యలను తీసుకుంటారు. అందువలన కార్మికుల ఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా, ఆర్థిక వ్యవస్థలో మొత్తం మీద ఉత్పత్తి పరిమాణం పెరుగుతున్నందువలన, ముడి పదార్థాల డిమాండ్ పెరిగి, అమ్మకాలు పెరుగుతాయి. కనుక ముడిపదార్థాలను ఉత్పత్తి చేసే ఉత్పత్తిదారుల ఆదాయం, వాటిలో పనిచేసే శ్రామికుల ఆదాయం పెరుగుతుంది. అందువలన ఆర్థిక వ్యవస్థలో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, వస్తువుల డిమాండ్ పెరిగి, ధరల స్థాయి క్రమంగా పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నీ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉన్నందువలన, వ్యాపారస్తులు వాణిజ్య బాంకులనుండి ఎక్కువ మొత్తంలో ఋణాలు తీసుకుని, పెద్ద మొత్తంలో సరుకులను నిల్వ చేస్తారు. అందువలన ఉత్పత్తిదారుల అమ్మకాలు పెరుగుతాయి. కావున, ఎక్కువగా వస్తూత్పత్తి చేయటానికి శ్రామికులను ఎక్కువగా పనిలో నియమించటం జరుగుతుంది. దీని ఫలితంగా శ్రామికుల ఆదాయాలు పెరుగుతాయి. అనగా ఆర్థిక వ్యవస్థలో వినియోగ వస్తువులకు, పెట్టుబడి వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. వీటన్నిటి ఫలితంగా, ఆర్థిక వ్యవస్థలో వస్తువులకు డిమాండ్ పెరిగి, ధరల స్థాయి క్రమంగా పెరుగుతుంది.

వ్యాపారస్తులు వాణిజ్య బాంకులనుండి ఋణాలు తీసుకున్నప్పుడు, ఆ ఋణాలపై చెల్లించే వడ్డీ రేటులో మార్పుల వల్ల, ఆర్థిక వ్యవస్థలో ఆశించిన మార్పులు సంభవించాలంటే ముఖ్యంగా రెండు రకాల పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో ఉండాలి.

1. వ్యాపారస్తులు వస్తువుల కొనుగోలు కోసం ఋణాలు తీసుకుని, ఋణాలపై వడ్డీ చెల్లించడంతోపాటు, వస్తువులను నిల్వ ఉంచే సమయంలో అద్దెను, తరుగుదలను, భీమా ఖర్చులను భరించవలసి ఉంటుంది. అందువలన మొత్తం వ్యయంలో వడ్డీ చెల్లింపులు ఎక్కువ భాగంగా ఉన్నప్పుడే, వడ్డీ రేటులో వచ్చే మార్పులు, వ్యాపారస్తుల మానసిక వైఖరిని ప్రభావితం చేయటానికి వీలుంటుంది.

2. వడ్డీ రేటులో మార్పుల వల్ల ఆశించిన ఫలితాలు రావాలి అంటే, వ్యాపారస్తుల సరుకు నిల్వల వ్యాకోచత్వం ఎక్కువగా ఉండాలి. అనగా బాంకు రేటులో మార్పులవలన వడ్డీ రేటులో కొద్దిగా మార్పు వచ్చినప్పుడు, వ్యాపారస్తుల వద్ద ఉండే వస్తువుల నిల్వలో ఎక్కువగా మార్పులు రావాలి.

పైన వివరించిన రెండు రకాల పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో ఉన్నప్పుడు, కేంద్ర బాంకు బాంకు రేటులో మార్పులు చేయటం వలన, మార్కెట్లో వడ్డీ రేటులో మార్పులు వచ్చి, ఆర్థిక వ్యవస్థలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయి.

BRAOU

## 21.5.2 కేన్స్ దృక్పథం

బాంకు రేటులో కేంద్ర బాంకు మార్పులు చేసినప్పుడు, ఈ మార్పుల ప్రభావం దీర్ఘకాలిక వడ్డీ రేట్లపై ఎక్కువగా ఉంటుందని కేన్స్ అభిప్రాయం. ఈ కారణంగా ఆర్థిక వ్యవస్థలో వచ్చే మార్పులు స్వల్పకాలిక వడ్డీ రేట్లపై కాకుండా, దీర్ఘకాలిక వడ్డీ రేట్లలో వచ్చే మార్పులపై ఆధారపడతాయి. కేన్స్ ప్రకారం, బాంకు రేటులో మార్పులు వచ్చినప్పుడు, ముందుగా స్వల్పకాలిక వడ్డీ రేట్లు మార్పు చెందుతాయి. స్వల్పకాలిక వడ్డీ రేట్లలో మార్పులు దీర్ఘకాలిక వడ్డీ రేటును ప్రభావితం చేస్తాయి. దీర్ఘకాలిక వడ్డీ రేట్లలో మార్పులు పెట్టుబడి నిధుల డిమాండ్‌లో మార్పులకు కారణభూతమవుతాయి. పెట్టుబడి నిధులు లేదా వస్తువుల డిమాండ్‌లో మార్పులు ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక స్థితిగతులలో  మార్పులకు దారితీస్తాయని కేన్స్ అభిప్రాయం.

వ్యాపారస్తులు వస్తువులను కొనుగోలు చేసి నిల్వచేయటం అనేది స్వల్పకాలిక వడ్డీ రేట్లలో వచ్చే మార్పుల వల్ల ఎక్కువగా ప్రభావితం కాదని, వ్యాపారస్తుల ప్రవర్తనలో వచ్చే మార్పులు దీర్ఘకాలిక వడ్డీ రేట్లపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయని కేన్స్ తెలియజేసాడు. అనగా దీర్ఘకాలిక వడ్డీ రేటులో వచ్చే మార్పుల వలన, పెట్టుబడి స్థాయిలో చెప్పుకోతగిన రీతిలో మార్పు వచ్చి, ఉత్పత్తి, ఉద్యోగిత, ధరల స్థాయిలో ఆశించిన మార్పులు వస్తాయి.

కేన్స్ ప్రకారం, ఆర్థిక వ్యవస్థలో ఆర్థిక కార్యకలాపాల స్థాయి, పెట్టుబడి స్థాయిపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడి స్థాయి ముఖ్యంగా రెండు కారకాల చేత ప్రభావితం అవుతుంది. అవి : 1. వడ్డీ రేటు, 2. ఉపాంత మూలధన సామర్థ్యం.

ఉపాంత మూలధన సామర్థ్యం పెట్టుబడిపైన ఆశించిన లాభపు రేటును తెలియజేస్తుంది. వడ్డీ రేటు, ఉపాంత మూలధన సామర్థ్యం కంటె ఎక్కువగా ఉంటే పెట్టుబడి స్థాయి తగ్గుతుంది. ఈ కారణంగా, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి నిధుల డిమాండ్ తగ్గి, కొంతమంది శ్రామికులకు కొన్ని ఇతర ఉత్పాదకాలకు పని లేకుండా పోతుంది. అందువలన ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద, ఆదాయ స్థాయి క్షీణించి వినియోగ మరియు ఉత్పాదక వస్తువులకు డిమాండ్ తగ్గిపోతుంది. వీటన్నిటి ఫలితంగా, ఆర్థిక వ్యవస్థలో సాధారణ ధరల స్థాయి తగ్గుముఖం పడుతుంది.

ఉపాంత మూలధన సామర్థ్యం వడ్డీ రేటు కంటె ఎక్కువగా ఉంటే, పెట్టుబడి నిధుల డిమాండ్ పెరుగుతుంది. పెట్టుబడిదారులు తాము బాంకుల నుండి తీసుకున్న ఋణాలపై భరించవలసిన వడ్డీ రేటు కంటె ఆ ఋణాలను పెట్టుబడిగా పెట్టి, ఆ పెట్టుబడినుండి ఆశించిన లాభపు రేటు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. దీని ఫలితంగా ఆర్థిక వ్యవస్థలో శ్రామికులకు, ఇతర ఉత్పత్తి సాధనాలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితులలో, ఆర్థిక వ్యవస్థలో మొత్తం మీద ఆదాయ స్థాయి, ఉత్పత్తి, ఉద్యోగితా స్థాయి పెరుగుతాయి. అందువలన వినియోగ వస్తువులకు తద్వారా ఉత్పాదక వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. వీటన్నిటి ఫలితంగా ఆర్థిక వ్యవస్థలో సాధారణ ధరల స్థాయి పెరిగి, ఆర్థిక వ్యవస్థ ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులనుండి బయటపడుతుంది. అనగా ఆర్థిక వ్యవస్థలో ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినప్పుడు, బాంకు రేటును తగ్గించి, వడ్డీ రేటు, ఉపాంత మూలధన సామర్థ్యం కంటె తక్కువగా ఉండేటట్లు చూడడం ద్వారా; ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినప్పుడు, బాంకు రేటును పెంచి, వడ్డీ రేటు, ఉపాంత మూలధన సామర్థ్యం కంటె ఎక్కువగా ఉండేటట్లు చూడటం ద్వారా ఆర్థిక వ్యవస్థలో సాధారణ పరిస్థితులు నెలకొనేటట్లు చేయటానికి అవకాశం ఉంటుంది.

హాట్రే మరియు కేన్స్ ఒకే గమ్యాన్ని చేరటానికి వేర్వేరు మార్గాలను సూచించారు. వీరిద్దరూ బాంకు రేటులోని మార్పుల వల్ల మార్కెట్ వడ్డీ రేటులో మార్పులు వచ్చి, ఆర్థిక కార్యకలాపాల స్థాయి మార్పు చెందుతుందని వివరించారు.

BRAOU

బాంకు రేటులో మార్పుల వల్ల, వడ్డీ రేటులో మార్పులు సంభవించినప్పుడు, పూర్తిగా తయారైన వస్తువులకు గల డిమాండ్‌లో మార్పుల వల్ల, ఆర్థిక పరిస్థితిలో ఆశించిన మార్పులు వస్తాయని హాట్రే వివరించాడు. అంతే కాకుండా హాట్రే స్వల్పకాలిక వడ్డీ రేటులో మార్పుల వల్ల, వ్యాపారస్తుల వైఖరిలో మార్పులు వచ్చి, వస్తువుల డిమాండ్‌లో, తద్వారా ఆర్థిక కార్యకలాపాల స్థాయిలో మార్పులు వస్తాయని భావించగా, కేన్స్ దీర్ఘకాలిక వడ్డీ రేటులో మార్పుల వలన ఆర్థిక కార్యకలాపాల స్థాయి ప్రభావితం చెందుతుందని భావించాడు. బాంకు రేటులో మార్పులవల్ల వడ్డీ రేటులో మార్పులు వచ్చి, వస్తువులకు ఉన్న డిమాండ్‌లో మార్పులు రావటం వలన ఆర్థిక వ్యవస్థలో ఆశించిన ఆర్థిక పరిణామాలు సంభవిస్తాయని కేన్స్ మరియు హాట్రే వివరించారు.

ఆర్థిక వ్యవస్థలలో స్వర్ణ ప్రమాణం అమలులో ఉన్న కాలంలో, బంగారు నిల్వలను పరిరక్షించుకునే సాధనంగా బాంకు రేటును ఉపయోగించుకోవడం జరిగింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 1930 దశాబ్దంలో ఆర్థిక మాంద్యపు విష వలయంలో చిక్కుకునేంతవరకు, బాంకు రేటును అతి ముఖ్యమైన పరపతి నియంత్రణా సాధనంగా భావించటం జరిగింది. కాని ఆర్థిక మాంద్యం ఏర్పడిన కాలంలో, బాంకు రేటులో మార్పులు, మార్కెట్‌లో వడ్డీ రేటులో మార్పులకు దారితీసినా, ఆర్థిక కార్యకలాపాల స్థాయిపై ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. దీనికి కారణం, ఆర్థిక మాంద్య కాలంలో పెట్టుబడిదారులు నిరాశావాదులుగా ఉంటారు. అందువలన వడ్డీ రేటులోని మార్పులు పెట్టుబడి పరిమాణాన్ని పెంచలేవు. ద్రవ్యోల్బణ కాలంలో, వ్యాపార కార్యకలాపాలు జోరుగా సాగుతుంటాయి. కావున పెట్టుబడిదారులకు లాభ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువలన పెట్టుబడిదారులు ఆశావాదులుగా ఉండి, వడ్డీ రేటు పెరిగినప్పుడు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించరు. అధిక లాభాలను ఆశించినప్పుడు వడ్డీ రేటు అధికంగా ఉన్నా లెక్క చేయరు.

ఆర్థిక మాంద్య సమస్యను రూపుమాపడానికి బాంకు రేటు విధానం సమర్థవంతమైన పరికరంగా పని చేయదు. ఆర్థిక మాంద్య కాలంలో బాంకు రేటులో మార్పుల మూలంగా, ఆర్థిక కార్యకలాపాల స్థాయిలో ఆశించిన మార్పులు రావు. కాని ద్రవ్యోల్బణాన్ని నివారించడానికి బాంకు రేటు సమర్థవంతమైన పరికరంగా ఉపయోగపడుతుంది. ఆర్థిక సమస్యలు ప్రారంభ దశలో ఉన్నప్పుడే, బాంకు రేటులో మార్పుల వలన ఆశించిన ఫలితాలు వస్తాయి. కాని ఆర్థిక సమస్యలు తీవ్ర రూపం దాల్చినప్పుడు, బాంకు రేటులో మార్పులు, ఆర్థిక కార్యకలాపాల స్థాయిపైన ఎటువంటి ప్రభావం చూపించక పోవచ్చు.

పై కారణాల మూలంగా బాంకు రేటు విధానం నిరుపయోగమైనదని చెప్పడానికి వీలులేదు. ఆర్థిక సమస్యలు తీవ్రరూపం దాల్చినప్పుడు, బాంకు రేటుతోపాటు, అందుబాటులో ఉన్న ఇతర పరపతి నియంత్రణా సాధనాలను ఉపయోగంచడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చు.

బాంకు రేటు విధానం విజయవంతం కావాలంటే, బాంకు రేటులో మార్పులు వచ్చినప్పుడు, మార్కెట్లో వడ్డీ రేట్లు కూడా ప్రత్యక్షంగా మార్పు చెందాలి. ద్రవ్య మార్కెట్ అభివృద్ధి చెందిందై ఉండి, బాంకు రేటులో మార్పులు వచ్చిన వెంటనే, పరపతి పరిమాణం ప్రభావితం అయ్యే విధంగా ఉండాలి. బాంకు రేటులో మార్పుల వలన, మార్కెట్‌లో వడ్డీ రేట్లలో మార్పులు వచ్చినప్పుడు, వ్యాపారస్తులు వడ్డీ రేట్లలో మార్పులకు అనుగుణంగా ప్రతిస్పదించాలి.

### 21.5.3 బాంకు రేటు విధానంపై పరిమితులు

అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్య మార్కెట్ బాగా అభివృద్ధి చెంది ఉంటుంది. అందువలన బాంకు రేటులోని మార్పుల వలన వెంటనే వడ్డీ రేట్లలో మార్పులు వచ్చి, ఆర్థిక కార్యకలాపాల స్థాయిలో మార్పులను

తీసుకు వస్తాయి. అందువలన బ్యాంకు రేటు విధానం అభివృద్ధి చెందిన దేశాలలో విజయవంతంగా పని చేస్తుంది. అభివృద్ధి చెందని దేశాల్లో, వాణిజ్య బ్యాంకులు కేంద్ర బ్యాంకు నుండి రీ-డిస్కౌంట్ సౌకర్యం పొందటానికి కావలసిన సెక్యూరిటీలను పెద్ద మొత్తంలో కలిగి ఉండకపోవచ్చు. ఆర్థిక మాంద్య కాలంలో బ్యాంకు రేటు విధానం సమర్థవంతంగా పని చేయదు. ఆర్థిక మాంద్య కాలంలో బ్యాంకు రేటు తగ్గించినప్పుడు, మార్కెట్ వడ్డీ రేట్లలో మార్పులు వచ్చినప్పటికీ, పరపతికి ఉన్న డిమాండ్ పెరగదు. అందువలన ఆర్థిక మాంద్య కాలంలో బ్యాంకు రేటు విధానం ద్వారా ఆర్థిక కార్యకలాపాల స్థాయిని వేగవంతం చేయటం సాధ్యం కాదు.

### 21.5.4 భారత దేశంలో బ్యాంకు రేటు విధానం

1951వ సంవత్సరం వరకు కేంద్ర బ్యాంకు బ్యాంకు రేటును 3 శాతంగా నిర్ణయించి కొనసాగించింది. కేంద్ర బ్యాంకు అవలంబించిన సులభ ద్రవ్య విధానం వలన ఆర్థిక వ్యవస్థలో మంచి ఫలితాలు ఏమీ రాకపోగా, పరపతి పరిమాణం విపరీతంగా పెరిగి ఒక వైపు అంచనా వ్యాపారం, మరియొకవైపు విదేశీ వ్యాపార చెల్లింపులలో లోటుకు దారితీసింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బ్యాంకు 1951 నవంబర్‌లో బ్యాంకు రేటును 3.5 శాతానికి పెంచింది. 1957లో బ్యాంకు రేటు 4 శాతానికి పెంచబడింది. 1963 జనవరిలో బ్యాంకు రేటును 4.5 శాతానికి, 1964 సెప్టెంబర్‌లో 5 శాతానికి పెంచటం జరిగింది. దీనికి కారణం, ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణాన్ని తగ్గించి, ద్రవ్యోల్బణ పరిస్థితులను అరికట్టడానికి బ్యాంకు రేటును పెంచడం తప్పనిసరి చర్యగా కేంద్ర బ్యాంకు భావించటమే. ఈ కారణంగానే 1964 తర్వాత కూడా అనేకసార్లు బ్యాంకు రేటును పెంచటం జరిగింది. 1968లో బ్యాంకు రేటు 6 శాతానికి పెంచబడింది. 1971 మరియు 1974 మధ్య కాలంలో, బ్యాంకు రేటును మూడు సార్లు పెంచడం జరిగింది. 1974లో బ్యాంకు రేటు 9 శాతానికి చేరుకుంది. 1981 జులైలో బ్యాంకు రేటు 10 శాతానికి పెంచబడింది. 1981 మరియు 1991 మధ్య కాలంలో బ్యాంకు రేటు 10 శాతంగా స్థిరంగా ఉంది. 1991 జులైలో బ్యాంకు రేటును 11 శాతానికి పెంచటం జరిగింది. ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న ద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించడానికి బ్యాంకు రేటును 1951 నుండి 1991 మధ్య కాలంలో 3 శాతం నుండి 11 శాతానికి పెంచడం జరిగింది. మన ద్రవ్య మార్కెట్ ఉన్న లోపాల కారణంగా, బ్యాంకు రేటు విధానం సమర్థవంతంగా పనిచేసి ఆశించిన లక్ష్యాలను సాధించడం జరగలేదు.

## 21.6 బహిరంగ మార్కెట్ కార్యకలాపాలు

BRAOU

పరపతిని నియంత్రించడంలో బ్యాంకు రేటు విధానం విజయవంతం కాకపోవడంతో దానికి తోడుగా దానిని సమర్థవంతం చేయడానికి కొంతమంది ఆర్థిక వేత్తలు బహిరంగ మార్కెట్ చర్యలను పరపతి నియంత్రణా సాధనంగా ఉపయోగించుకోవచ్చునని వివరించారు. మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలను కొనడాన్ని లేదా అమ్మడాన్ని బహిరంగ మార్కెట్ చర్యలుగా చెప్పబడుతుంది. బహిరంగ మార్కెట్ చర్యలు చలామణిలో ఉన్న ద్రవ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. కేంద్ర బ్యాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను అమ్మడం, కొనడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో చలామణిలో ఉండే పరపతి పరిమాణంలో ప్రత్యక్షంగా మార్పును కలుగజేస్తుంది. వాణిజ్య బ్యాంకుల వద్ద నగదు నిల్వలు హెచ్చుగా ఉండి, అవి సృష్టించే పరపతి పరిమాణం అధిక మొత్తంలో ఉండి, ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినప్పుడు, కేంద్ర బ్యాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను మార్కెట్‌లో అమ్ముతుంది. ప్రభుత్వ సెక్యూరిటీలలో అధిక మొత్తాన్ని వాణిజ్య బ్యాంకులు కొనుగోలు చేస్తాయి. సెక్యూరిటీలను కొనుగోలు చేసిన బ్యాంకులు కేంద్ర బ్యాంకుకు నగదు చెల్లించడం జరుగుతుంది. అందువలన చలామణిలో ఉండే ద్రవ్యరాశి తగ్గుతుంది. వాణిజ్య బ్యాంకులు కేంద్ర బ్యాంకుకు చెల్లింపులు చేసినందువలన, వాణిజ్య బ్యాంకుల వద్ద ఉండే నగదు నిల్వల పరిమాణం తగ్గుతుంది. ఈ కారణంగా, నగదు నిల్వలలో వచ్చిన తగ్గుదలకు కొన్ని రెట్లు ఎక్కువగా

వాణిజ్య బాంకుల పరపతి సృష్టించే శక్తి తగ్గిపోతుంది. ఉదాహరణకు ఆర్థిక వ్యవస్థలోని వాణిజ్య బాంకులు రూ. 1,000 విలువగల ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసి, కేంద్ర బాంకుకు రూ. 1,000 చెల్లించాయని అనుకుందాం. అనగా రూ. 1,000 మేర బాంకింగ్ వ్యవస్థలో ఉండే నగదు నిల్వలు తగ్గుతాయి. నగదు నిల్వల నిష్పత్తి 10 శాతంగా ఉన్నట్లయితే, బాంకింగ్ వ్యవస్థ సృష్టించగలిగే పరపతిలో వచ్చే తగ్గుదల రూ. 10,000కు సమానంగా ఉంటుంది. అనగా బహిరంగ మార్కెట్‌లో కేంద్ర బాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను అమ్మి, వాణిజ్య బాంకుల నగదు నిల్వలను తద్వారా ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణాన్ని నియంత్రించి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి అవకాశం ఉంటుంది.

ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణం తగ్గిపోయి, పరపతి కొరత ఏర్పడి, ఉత్పత్తి ఉద్యోగితా స్థాయిలు దెబ్బతిని, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినప్పుడు కేంద్ర బాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తుంది. అందువలన, కేంద్ర బాంకు వాణిజ్య బాంకులకు చెల్లింపులు చేస్తుంది. అనగా ఈ పరిస్థితిలో ద్రవ్య వనరులు కేంద్ర బాంకు నుండి వాణిజ్య బాంకులకు బదిలీ అవుతాయి. అందువలన వాణిజ్య బాంకుల నగదు నిల్వలు పెరుగుతాయి. నగదు నిల్వలలో పెరుగుదల పరపతి విస్తరణకు దారితీస్తుంది.

ఉదాహరణకు కేంద్ర బాంకు రూ. 1,000 విలువగల సెక్యూరిటీలను వాణిజ్య బాంకులనుండి కొనుగోలు చేసిందనుకుందాం. అందువలన కేంద్ర బాంకు నుండి వాణిజ్య బాంకులకు రూ. 1,000 మేరకు నిధులు బదిలీ అవుతాయి. ఈ కారణంగా బాంకింగ్ వ్యవస్థ వద్ద నగదు నిల్వలు రూ. 1,000 మేరకు పెరుగుతాయి. నగదు నిల్వల నిష్పత్తి 10 శాతంగా ఉన్నట్లయితే, బాంకింగ్ వ్యవస్థ మొత్తం, నగదు నిల్వలలో రూ. 1,000 పెరుగుదల ఆధారంగా, రూ. 10,000 వరకు పరపతిని సృష్టిస్తుంది. అందువలన ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణం పెరిగి చలామణిలో ఉండే ద్రవ్యరాశి పెరుగుతుంది. ఈ కారణంగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, వస్తువులకు డిమాండ్ పెరిగి, ధరల స్థాయి క్రమంగా పెరగనారంభిస్తుంది.

బహిరంగ మార్కెట్ చర్యలు, బాంకు రేటు కంటే సమర్థవంతంగా పనిచేసి, ఆశించిన లక్ష్యాలు సాధించడానికి తోడ్పడతాయి.దీనికి కారణం కేంద్ర బాంకు బహిరంగ మార్కెట్ చర్యలు చేపట్టినప్పుడు, వాణిజ్య బాంకుల నగదు నిల్వలలోను, తద్వారా అవి సృష్టించే పరపతి పరిమాణంలో ప్రత్యక్షంగా మార్పులు వస్తాయి. బాంకు రేటులో మార్పుల వలన ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణంలో వచ్చే మార్పులు వ్యాపారస్తుల మానసిక ప్రవర్తనపై ఆధారపడి ఉంటాయి.

భారత దేశంలో బహిరంగ మార్కెట్ చర్యలు పరపతి నియంత్రణలో శక్తివంతమైన పరికరంగా పనిచేసి, పరపతిని సమర్థవంతంగా నియంత్రించలేకపోతున్నాయి. బహిరంగ మార్కెట్ చర్యలు విజయవంతంగా పని చేయాలంటే క్రింద వివరించిన పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో ఉండాలి.

1. ప్రభుత్వ సెక్యూరిటీలకు ఉన్న మార్కెట్ అభివృద్ధి చెంది వ్యవస్థీకృతమై (organised) ఉండాలి.

2. కేంద్ర బాంకు సెక్యూరిటీలను అమ్మటానికి, కొనటానికి తగిన శక్తి కలిగి ఉండాలి.

3. చలామణిలో ఉండే ద్రవ్యరాశి, బాంకుల వద్ద ఉండే నగదు నిల్వలు, బహిరంగ మార్కెట్ చర్యల వల్ల ప్రత్యక్షంగా ప్రభావితం చెందాలి.

పై పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో ఉన్నప్పుడు, బహిరంగ మార్కెట్ చర్యలు సమర్థవంతంగా పనిచేసి, ఆశించిన ఫలితాలను ఇస్తాయి.

రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం బహిరంగ మార్కెట్ చర్యలను ఎక్కువగా చేపట్టలేదు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో, యుద్ధ అవసరాలను తీర్చుకోవడానికి కావలసిన వనరులను సమీకరించడానికి కేంద్ర బాంకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ సెక్యూరిటీలను మార్కెట్‌లో అమ్మడం జరిగింది. యుద్ధం ముగిసిన తర్వాత, కాల (ఋతు) సంబంధమైన (seasonal) పరపతి డిమాండ్‌ను తట్టుకోవడానికి, వాణిజ్య బాంకుల ద్రవ్య నిల్వలను పెంచడానికి, కేంద్ర బాంకు కొన్ని సమయాలలో సెక్యూరిటీలను కొనుగోలు చేయడం, మరికొన్ని సమయాలలో సెక్యూరిటీలను అమ్మడం జరిగింది. 1951లో బాంకు రేటును పెంచడంతోపాటు, బహిరంగ మార్కెట్ చర్యలలో కూడా స్పష్టమైన మార్పులు ప్రవేశ పెట్టబడినాయి.

1951కి పూర్వం, వాణిజ్య బాంకులకు ఋణాలు కావలసినప్పుడు, వాటి వద్ద వున్న ప్రభుత్వ సెక్యూరిటీలను కేంద్ర బాంకు కొనుగోలు చేసి, ఋణాలు అందించేది. బహిరంగ మార్కెట్ చర్యలలో మార్పులవలన, కొన్ని ప్రత్యేక సందర్భాలలో (exceptional cases), మినహా వాణిజ్య బాంకుల వద్ద ఉన్న సెక్యూరిటీలను కొనుగోలు చేసి ఋణాలు అందించటం జరగదు అని ప్రకటించబడింది. 1951-56 మధ్య కాలంలో, కేంద్ర బాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను నికరంగా అమ్మటం జరిగింది. ప్రస్తుత కాలంలో కేంద్ర బాంకు "switch operations" కు ఎక్కువగా పాల్పడుతుంది. ఒక సెక్యూరిటీ అమ్మకం ద్వారా వచ్చిన ద్రవ్యంతో ఇంకొక సెక్యూరిటీని కొనుగోలు చేయటం జరుగుతుంది. ప్రస్తుతం కేంద్ర బాంకు ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేసిన మొత్తంకంటే అమ్మిన మొత్తమే ఎక్కువగా వుంది. దీనికితోడు వాణిజ్య బాంకులపైన, ఇంకా ప్రభుత్వ అధీనంలో ఉన్న ఇతర ఆర్థిక సహాయ సంస్థలపైన కొన్ని నిర్బంధాలు విధించటం జరిగింది. దీని ప్రకారం వాణిజ్య బాంకులు, ఆర్థిక సహాయ సంస్థలు (ఉదా ॥ జీవిత భీమా సంస్థ) తమ నిధులలో కొంత నిర్ణీత మొత్తాన్ని చట్టబద్ధంగా ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి చేయాలని నిర్దేశించటం జరిగింది.

## 21.7 నగదు నిల్వల నిష్పత్తిలో మార్పులు

వాణిజ్య బాంకులు తమ డిమాండ్ డిపాజిట్లలో, కాల పరిమితి డిపాజిట్లలో కొంత నిష్పత్తిని చట్టబద్ధంగా నగదు రూపంలో కేంద్ర బాంకు దగ్గర ఉంచవలసి ఉంటుంది. దీనినే నగదు నిల్వల నిష్పత్తి అంటారు. నగదు నిల్వల నిష్పత్తిలో మార్పులు ప్రవేశపెట్టడం ద్వారా కేంద్ర బాంకు ఆర్థిక వ్యవస్థలో వాణిజ్య బాంకులు సృష్టించే పరపతి పరిమాణాన్ని, తద్వారా ద్రవ్యోల్బణ, ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులను సమర్థవంతంగా నియంత్రణ చేయటానికి అవకాశం కలిగింది. కేంద్ర బాంకు వాణిజ్య బాంకుల వద్ద ఉండవలసిన నగదు నిల్వల నిష్పత్తిని 3 నుండి 5 శాతం మధ్య నిర్ణయిస్తుంది.

వాణిజ్య బాంకులు ఉంచుకోవలసిన నగదు నిల్వల నిష్పత్తికి, అవి సృష్టించగలిగిన మొత్తం పరపతి పరిమాణానికి విలోమ సంబంధం ఉంటుంది. అనగా నగదు నిల్వల నిష్పత్తిని పెంచినట్లయితే, నిర్ణీత డిపాజిట్ ద్రవ్యం ఆధారంగా, వాణిజ్య బాంకులు సృష్టించ గలిగే పరపతి పరిమాణం తగ్గిపోతుంది. ఒకవేళ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గించినట్లయితే, నిర్ణీత డిపాజిట్ ఆధారంగా, వాణిజ్య బాంకింగ్ వ్యవస్థ సృష్టించగలిగే పరపతి పరిమాణం పెరుగుతుంది.

ఉదాహరణకు ప్రాథమిక డిపాజిట్ రూ. 1,000, నగదు నిల్వల నిష్పత్తి 10 శాతం అనుకుందాం. ఈ పరిస్థితిలో బాంకింగ్ వ్యవస్థ సృష్టించగలిగే మొత్తం పరపతి ప్రాథమిక డిపాజిట్‌కు పది రెట్లు ఎక్కువగా ఉంటుంది. అనగా ప్రాథమిక డిపాజిట్ రూ. 1,000 ఆధారంగా, బాంకింగ్ వ్యవస్థ రూ. 10,000 పరపతిని సృష్టించగలుగుతుంది. ఈ ఉదాహరణలో పరపతి గుణకం విలువ పది (10). పరపతి గుణకాన్ని క్రింది విధంగా అంచన వేయవచ్చు.

BRAOU

$$\text{పరపతి గుణకం} = \frac{1}{r}$$

ఇందులో, r = నగదు నిల్వల నిష్పత్తి

$$r = \frac{1}{\frac{10}{100}} = \frac{100}{10} = 10.$$

కేంద్ర బాంకు ఆర్థిక వ్యవస్థలో పరపతి అధికంగా ఉన్న కారణంగా ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినాయని భావించినట్లయితే, నగదు నిల్వల నిష్పత్తిని పెంచుతుంది. ఉదాహరణకు నగదు నిల్వల నిష్పత్తి 10 నుండి 20 శాతానికి పెంచబడిందనుకుందాం. ఈ పరిస్థితిలో పరపతి గుణకం విలువ ఐదు (5). అనగా ప్రాథమిక డిపాజిట్ రూ. 1,000 అనుకున్నట్లయితే, వాణిజ్య బాంకులు సృష్టించగలిగే మొత్తం పరపతి పరిమాణం రూ. 5,000 గా ఉంటుంది. ఈ కారణంగా పరపతి పరిమాణం తగ్గి, చలామణిలో ఉండే ద్రవ్యరాశి తగ్గి, సాధారణ ధరల స్థాయి తగ్గుముఖం పడుతుంది. ఒకవేళ ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణం తక్కువగా ఉండి, ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినట్లయితే, కేంద్ర బాంకు నగదు నిల్వల నిష్పత్తిని తగ్గిస్తుంది. ఉదాహరణకు నగదు నిల్వల నిష్పత్తిని 10 శాతం నుండి 5 శాతానికి తగ్గించిందనుకుందాం . ఈ పరిస్థితిలో పరపతి గుణకం విలువ ఇరవై (20). అనగా ప్రాథమిక డిపాజిట్‌కు 20 రెట్లు ఎక్కువగా వాణిజ్య బాంకులు పరపతిని సృష్టించగలుగుతాయి. దీని కారణంగా ఆర్థిక వ్యవస్థలో పరపతి పరిమాణం పెరిగి, చలామణిలో ఉండే ద్రవ్యరాశి పెరిగి, సాధారణ ధరల స్థాయి పెరుగుతుంది. నగదు నిల్వలలో మార్పులు వాణిజ్య బాంకుల పరపతి పరిమాణంపై ప్రత్యక్ష ప్రభావాన్ని కలుగజేసి, పరపతిని సమర్థవంతంగా నియంత్రించగలుగుతుంది.

"రిజర్వ్ బాంకు ఆఫ్ ఇండియా" చట్టం ప్రకారం నగదు నిల్వల నిష్పత్తిని కేంద్ర బాంకు 3 నుండి 15 శాతం మధ్య మార్పు చేసే అధికారం కలిగి ఉంటుంది. 1973 జూన్‌లో ద్రవ్య సప్లయ్‌లో పెరుగుదలను అరికట్టడానికి కేంద్ర బాంకు నగదు నిల్వల నిష్పత్తిని 3 నుండి 5 శాతానికి పెంచింది. దీని ఫలితంగా ఆర్థిక వ్యవస్థలో ఆశించిన మార్పులు రానందువలన, 1973 సెప్టెంబరులో నగదు నిల్వల నిష్పత్తిని 5 నుండి 7 శాతానికి పెంచటం జరిగింది. ఈ చర్యల వలన ఆర్థిక వ్యవస్థలో ధరల స్థిరత్వం ఏర్పడి, పరిస్థితి చక్కబడినందువలన, కేంద్ర బాంకు నగదు నిల్వల నిష్పత్తిని 4 శాతానికి తగ్గించింది. కాని 1976వ సంవత్సరంలో ద్రవ్యోల్బణ పరిస్థితులు ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్నందువలన, నగదు నిల్వల నిష్పత్తిని 6 శాతానికి పెంచటం జరిగింది.

ఆర్థిక వ్యవస్థలో నిరంతరంగా పెరుగుచున్న ధరల స్థాయిని నియంత్రించటానికి కేంద్ర బాంకు 1981లో రెండు సార్లు నగదు నిల్వల నిష్పత్తిని పెంచటం జరిగింది. 1981 జూలైలో 6 నుండి 7 శాతానికి, 1981 అక్టోబర్‌లో 7 నుండి 8 శాతానికి నగదు నిల్వల నిష్పత్తిని పెంచటం జరిగింది. 1982లో సాధారణ ధరల స్థాయిలో స్థిరత్వం (stability) చేకూరినందువలన, నగదు నిల్వల నిష్పత్తిని 7 శాతానికి తగ్గించటం జరిగింది. ముఖ్యంగా 1980 సంవత్సరం తర్వాత అనేక సార్లు కేంద్ర బాంకు నగదు నిల్వల నిష్పత్తిలో మార్పులు ప్రవేశపెట్టింది. 1989 జూలైలో నగదు నిల్వల నిష్పత్తిని 15 శాతానికి పెంచటం జరిగింది. ప్రస్తుతం నగదు నిల్వల నిష్పత్తిని 14 శాతంగా నిర్ణయించటం జరిగింది.

1949లో రూపొందించిన "బాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్" ప్రకారం వాణిజ్య బాంకులు తమ యొక్క డిమాండ్ మరియు టైం లయబిలిటీస్‌లో 20 శాతానికి తగ్గకుండ ద్రవ్యత్వ ఆస్తులను కలిగి ఉండాలి. కేంద్ర-బాంకు, వాణిజ్య బాంకుల పరపతిని సృష్టించే శక్తిని తగ్గించటానికి నగదు నిల్వల నిష్పత్తిని పెంచినప్పుడు, వాణిజ్య బాంకులు తమ ద్రవ్యత్వ ఆస్తులను అమ్ముకోవడం జరిగేది. "బాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్"లో ఉన్న ఈ లోపాన్ని

BRAOU

సరిదిద్దటానికి 1962లో "బాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్"కు సవరణ చేయటం జరిగింది. ఈ సవరణ ప్రకారం వాణిజ్య బాంకులు తమ డిమాండ్ మరియు టైం లయబిలిటీస్ పై కనీస రిజర్వ్ నిష్పత్తితో పాటు, 15 శాతం చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి (statutory liquidity ratio) ని కలిగి ఉండాలని నిర్దేశించటం జరిగింది. 1972లో చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తిని 30 శాతానికి, 1973లో 32 శాతానికి, 1974లో 33 శాతానికి పెంచింది. 1982 మార్చిలో చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తిని 38.5 శాతానికి పెంచటం జరిగింది. నరసింహం కమిటీ సూచనలను ఆధారంగా చేసుకొని 1992లో చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తిని 30 శాతానికి తగ్గించటం జరిగింది. చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తిలో పెరుగుదల వాణిజ్య బాంకుల పరపతి విస్తరణపై పరిమితులను విధించింది.

## 21.8 సారాంశం

ప్రణాళికా బద్ధమైన ఆర్థికాభివృద్ధిని సాధించడానికి, ప్రణాళికలలో చేపట్టిన ఏ ఆర్థిక కార్యకలాపం, ద్రవ్య వనరుల కొరత కారణంగా కుంటుపడకుండా చూసే బాధ్యత కేంద్ర బాంకుపై ఉంటుంది. దీనితోపాటు ద్రవ్యోల్బణ రహితమైన ఆర్థికాభివృద్ధిని సాధించటానికి కేంద్ర బాంకు ద్రవ్య విధానం ద్వారా అనేక చర్యలు తీసుకుంటుంది. పరపతి నియంత్రణ కోసం కేంద్ర బాంకు పరిమాణాత్మక మరియు గుణాత్మక పద్ధతులను ఉపయోగిస్తుంది. పరిమాణాత్మక పద్ధతులు, వాణిజ్య బాంకుల పరపతి పరిమాణంపై ప్రత్యక్షంగా ప్రభావాన్ని చూపుతాయి. పరిమాణాత్మక పద్ధతి ద్వారా చర్యలు తీసుకోవటం వలన పరపతి పరిమాణం (volume of credit) లో, పరపతిపై అయ్యే వ్యయం (cost of credit) లో మార్పులు వచ్చి, వాణిజ్య బాంకుల పరపతిని సృష్టించే శక్తి ప్రత్యక్షంగా ప్రభావితమై ఆర్థిక వ్యవస్థలో ఆశించిన ఫలితాలు వస్తాయి.

## 21.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ఆర్థిక వ్యవస్థలో పరపతి నియంత్రణ ఆవశ్యకతను విమర్శనాత్మకంగా పరిశీలించండి.
2. పరిమాణాత్మక పరపతి నియంత్రణ పద్ధతులను వివరించి, ఆశించిన లక్ష్యాలను సాధించడంలో ఎంతవరకు తోడ్పడినాయో భారత దేశం దృష్ట్యా చర్చించండి.
3. బాంకు రేటు విధానాన్ని వివరించి, బాంకు రేటు విధానంపై హాట్రే, కేన్స్‌ల అభిప్రాయాలను తెలియ జేయండి.
4. "పరపతి నియంత్రణలో బాంకు రేటు కంటే బహిరంగ మార్కెట్ చర్యలు ఎక్కువ సమర్థవంతంగా పని చేస్తాయి" - చర్చించండి.

**II. క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో పరపతి ప్రాముఖ్యతను విశ్లేషించండి.
2. బాంకు రేటు విధానం ద్వారా ద్రవ్యోల్బణాన్ని ఏ విధంగా నియంత్రించటం జరుగుతుందో వివరించండి.
3. పరపతి నియంత్రణలో బహిరంగ మార్కెట్ చర్యల ప్రాముఖ్యాన్ని వివరించండి.
4. పరపతి సృష్టికి, నగదు నిల్వల నిష్పత్తికి విలోమ సంబంధం ఉంటుందనే దానిని ఉదాహరణ ద్వారా వివరించండి.

BRAOU

## 21.10 సంప్రదింపు గ్రంథాలు


| | | |
|---|---|---|
| Suraj B. Gupta | : | Monetary Economics : Institutions, Theory and Policy |
| Suraj B. Gupta | : | Monetary Planning for India |
| Mishra & Puri | : | Indian Economy |


## 21.11 పదకోశం

| | | |
|---|---|---|
| Credit control | : | పరపతి నియంత్రణ |
| Selective instruments | : | ఎంపిక చేసిన సాధనాలు |
| Quantitative | : | పరిమాణాత్మక |
| Qualitative | : | గుణాత్మక |
| Inflation | : | ద్రవ్యోల్బణం |
| Deflation | : | ప్రతి ద్రవ్యోల్బణం |
| Price stability | : | ధరల స్థిరత్వం |
| Multiplier | : | గుణకం |
| Collapse | : | పతనం |
| Aggregate demand | : | సమష్టి డిమాండ్ |
| Trade cycles | : | వ్యాపార చక్రాలు |
| Depression | : | ఆర్థిక మాంద్యం |
| Controlled expansion | : | నియంత్రిత విస్తరణ |
| Marginal efficiency of capital | : | ఉపాంత మూలధన సామర్థ్యం |
| Open market operations | : | బహిరంగ మార్కెట్ కార్యకలాపాలు |
| Seasonal | : | ఋతు సంబంధమైన, కాల సంబంధమైన |
| Cash reserve ratio | : | నగదు నిల్వల నిష్పత్తి |
| Statutory liquidity ratio | : | చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి |

– డా॥ ఏ. వకులా రెడ్డి

BRAOU

# భాగం - 22 : గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

విషయ క్రమం


22.0 ఉద్దేశం

22.1 గుణాత్మక పరపతి నియంత్రణ - అర్థం

22.2 గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

22.2.1 మార్జిన్‌లను నిర్ణయించడం

22.2.2 పరపతి రేషనింగ్

22.2.3 వినియోగదారుల పరపతి క్రమబద్ధీకరణ

22.2.4 నైతికోద్బోధ

22.2.5 ప్రత్యక్ష చర్య

22.3 గుణాత్మక పరపతి నియంత్రణ ప్రాముఖ్యం

22.4 భారత దేశం దృష్ట్యా గుణాత్మక పరపతి నియంత్రణ

22.5 కేంద్ర బాంకు పరపతి నియంత్రణ - సమీక్ష

22.6 సారాంశం

22.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

22.8 సంప్రదింపు గ్రంథాలు

22.9 పదకోశం


## 22.0 ఉద్దేశం

గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను వివరించటం ఈ భాగం ముఖ్య ఉద్దేశం. ఈ భాగం చదివిన తర్వాత క్రింది అంశాలను మీరు సులభంగా అర్థం చేసుకోగలుగుతారు.

- గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను తెలుసుకోగలుగుతారు.
- గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాల ప్రాముఖ్యతను గుర్తించగలుగుతారు.

## 22.1 గుణాత్మక పరపతి నియంత్రణ - అర్థం

గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు మొత్తం పరపతి పరిమాణాన్ని కాక పరపతి ఉపయోగాన్ని, పరపతి ప్రవాహ మార్గాలను ప్రభావితం చేస్తాయి. ఏ రంగాలకు ఎంత మొత్తంలో పరపతిని అందించాలి, పరపతిని అందించే సమయంలో ఏ రంగాలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వాలి అని గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు నిర్దేశిస్తాయి. సామాజిక ప్రయోజనం లేని లేదా అవాంఛనీయ రంగాలలోకి పరపతి ఎక్కువగా తరలి వెళ్ళకుండ ఉండేందుకు గుణాత్మక పరపతి నియంత్రణా చర్యలు తోడ్పడతాయి. ముఖ్యంగా అంచనా వ్యాపారం (speculative business) చేసే వ్యక్తులకు, బాంకు పరపతి ఎక్కువగా అందకుండా ఉండేటట్లు చూడటానికి గుణాత్మక పరపతి నియంత్రణా చర్యలు ఉపయోగపడతాయి.

B R A O U

## 22.2 గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

పరపతి ప్రవాహ మార్గాన్ని ప్రభావితం చేసే గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు ఏవనగా

1. మార్జిన్‌లను నిర్ణయించడం
2. పరపతి రేషనింగ్
3. వినియోగదారుల పరపతి నియంత్రణ
4. నైతికోద్బోధ
5. ప్రత్యక్ష చర్య

పైన వివరించిన చర్యలు తీసుకోవడం ద్వారా బ్యాంకు పరపతి సామాజిక ప్రయోజనం ఎక్కువగాగల రంగాలలోకి తరలి వెళ్ళేటట్లు చూడటానికి వీలవుతుంది. అంచనా వ్యాపారం కంటే సామాజిక ప్రయోజనం ఎక్కువగా ఉండే రంగాలకు పరపతి పెద్ద మొత్తంలో తరలి వెళ్ళేటట్లు చూడటమే ఈ పద్ధతి ముఖ్య ఉద్దేశం. ఇప్పుడు ఒక్కొక్క గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాన్ని విపులంగా తెలుసుకుందాం.

### 22.2.1 మార్జిన్‌లను నిర్ణయించటం (Fixing of Margins)

ఋణం తీసుకునే వ్యక్తులు సెక్యూరిటీగా ఇవ్వజూపిన వస్తువు విలువకు, వాణిజ్య బ్యాంకు అందించే ఋణం పరిమాణానికి మధ్య ఉన్న తేడానే మార్జిన్ అంటారు. మార్జిన్‌లో మార్పులు చేయటం ద్వారా, ఒక్కొక్క ఆర్థిక కార్యకలాపానికి, బాంకులు అందించే పరపతిని సమర్థవంతంగా నియంత్రించడం జరుగుతుంది. వాణిజ్య బాంకులు ఋణం తీసుకునే వ్యక్తులు సెక్యూరిటీగా తాకట్టు పెట్టిన వస్తువు విలువలో కొంత మేరకు మాత్రమే ఋణం అందిస్తాయి. ఈ సాధనం యొక్క ముఖ్య ఉద్దేశం అంచనా వ్యాపారంలోకి బాంకు పరపతి ఎక్కువగా ప్రవహించకుండా చూడటమే. వ్యాపారస్తులు బాంకుల నుండి పరపతిని పొంది ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, నల్ల బజారు వ్యాపారానికి (black marketing) పాల్పడుతూ, వస్తువులను దాచివేసి, నిత్యావసర వస్తువులకు కృత్రిమ కొరతలను సృష్టించినట్లయితే ధరల స్థాయి పెరుగుతుంది. ఇటువంటి పరిస్థితిలో ధరల స్థాయిని అదుపులో ఉంచుటకు నిత్యావసర వస్తువుల సప్లయ్ సాఫీగా జరిగేటట్లు చూడటానికి కేంద్ర బాంకు మార్జిన్‌లను పెంచవలసిందిగా వాణిజ్య బాంకులను కోరుతుంది.

BRAOU

ఉదాహరణకు ప్రారంభంలో రూ. 1,000 విలువగల ఆహార ధాన్యాలను సెక్యూరిటీగా ఉంచుకుని, వాణిజ్య బాంకులు రూ. 800 ఋణం అందిస్తున్నాయనుకుందాం. అనగా బాంకులు 20 శాతం మార్జిన్‌గా ఉంచుకుంటున్నాయి. ఇటువంటి పరిస్థితిలో నిత్యావసర వస్తువులకు కొరత ఏర్పడి, ధరల స్థాయి క్రమంగా పెరుగుతుందని కేంద్ర బాంకు భావించినట్లయితే, కేంద్ర బాంకు వాణిజ్య బాంకులను మార్జిన్ పెంచవలసిందిగా కోరుతుంది. మార్జిన్ 30 శాతంగా నిర్ణయించినట్లయితే, రూ. 1,000 విలువగల ఆహార ధాన్యాలను తాకట్టు పెట్టినట్లయితే, రూ. 700 మాత్రమే ఋణం ఇవ్వటం జరుగుతుంది. అంతేకాకుండా పెరిగిన మార్జిన్ మేరకు సొమ్ము కట్టమని ఆహార ధాన్యాల కొనుగోలు కోసం ఋణం తీసుకున్న వ్యక్తులను ఆదేశించటం జరుగుతుంది. ఈ కారణంగా వ్యాపారస్తులు తాము నిల్వ చేసిన ఆహార ధాన్యాలలో కొంత మొత్తాన్ని అమ్మవలసి వస్తుంది. అందువలన మార్కెట్‌లో ఆహార ధాన్యాల సప్లయ్ పెరిగి, ధరల స్థాయి క్రమంగా తగ్గు ముఖం పడుతుంది.

మార్జిన్ పెరిగినప్పుడు అంచనా వ్యాపారం కోసం లభించే పరపతి పరిమాణం తగ్గిపోతుంది. అనగా ద్రవ్యోల్బణ కాలంలో, అంచనా వ్యాపారం మొదలైన ప్రమాదభరితమైన ఆర్థిక కార్యకలాపాలలోకి పరపతి పెద్ద మొత్తంలో

ప్రవహించకుండా నియంత్రించటానికి, కేంద్ర బాంకు మార్జిన్‌ను పెంచుతుంది. ఒక్కొక్క రంగానికి లేదా ఒక్కొక్క వస్తువుకు అందించే పరపతికి సంబంధించి, మార్జిన్‌లలో మార్పులు చేయటం ద్వారా, వాణిజ్య బాంకులు అందించే పరపతిని అంచనా వ్యాపారం, నల్ల బజారు వ్యాపారం చేసే వ్యక్తులకు ఎక్కువగా అందకుండా, సామాజిక ప్రయోజనం గల రంగాలలోకి ఎక్కువగా ప్రవహించేటట్లు చేయటానికి వీలవుతుంది.

### 22.2.2 పరపతి రేషనింగ్ (Credit Rationing)

ఈ సాధనం ద్వారా వాణిజ్య బాంకులు ఏ రంగాలకు, ఏ వస్తువుల ఉత్పత్తికి అధికంగా పరపతిని అందించాలో కేంద్ర బాంకు నిర్దేశిస్తుంది. వివిధ రంగాలకు అందించాల్సిన మొత్తం పరపతికి గరిష్ట పరిమితిని కేంద్ర బాంకు నిర్ణయిస్తుంది. అనగా వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి పరిమాణానికి హద్దులు నిర్ణయించటం, ప్రాధాన్యతా రంగాలకు లేక వస్తువుల ఉత్పత్తికి పరపతిలో ఎక్కువ మొత్తాన్ని కేటాయించేటట్లు కేంద్ర బాంకు చర్య తీసుకుంటుంది. ఈ సాధనం ప్రకారం కేంద్ర బాంకు సూచించిన నియమ నిబంధనలకు లోబడి, గరిష్ట పరిమితి నిర్ణయించబడిన మొత్తం పరపతిని, వివిధ రంగాల మధ్య వాణిజ్య బాంకులు పంపిణీ చేయవలసి ఉంటుంది. కేంద్ర బాంకు వివిధ పరిశ్రమలకు లేదా రంగాలకు, వాణిజ్య బాంకులు అందించే పరపతిపై గరిష్ట పరిమితిని నిర్ణయించటాన్నే పరపతి రేషనింగ్‌గా చెప్పబడుతుంది.

### 22.2.3 వినియోగదారుల పరపతిని క్రమబద్ధం చేయటం (Regulation of Consumers Credit)

మన్నిక కలిగిన వినియోగ వస్తువులను వినియోగదారులు కొనుగోలు చేసుకునేందుకు వాణిజ్య బాంకులు ఋణ సహాయం చేస్తుంటాయి. ఉదాహరణకు టెలివిజన్, స్కూటర్, రిఫ్రిజిరేటర్లు కొనుగోలు చేయటానికి వాణిజ్య బాంకులు పరపతిని అందిస్తుంటాయి. వినియోగ వస్తువులను కొనుగోలు చేయటానికి, వస్తువు విలువలో కొంత మొత్తం వరకు వాణిజ్య బాంకులు ఋణ సహాయం చేస్తాయి. వస్తువును కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు ముందుగా, వస్తువు విలువలో కొంత మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది. దీనినే డౌన్ పేమెంట్ అంటారు. వస్తువు విలువలో డౌన్ పేమెంట్ పోగా మిగిలిన మొత్తాన్ని బాంకులు ఋణంగా అందిస్తాయి. వినియోగదార్లు తాము తీసుకున్న ఋణాలను కొన్ని సమాన వాయిదాలలో తిరిగి చెల్లించవచ్చు.

ఈ చర్య ద్వారా కేంద్ర బాంకు రెండు రకాలుగా వినియోగదార్లకు అందించే పరపతిని క్రమబద్ధం చేస్తుంది. అవి :

1. డౌన్ పేమెంట్‌లో మార్పులు చేయటం ద్వారా,
2. వాయిదాల సంఖ్యలో మార్పులు చేయటం ద్వారా.

ఏదైనా వినియోగ వస్తువుకు డిమాండ్ ఎక్కువగా ఉండి ధరలు పెరుగుతూ ఉంటే, డౌన్ పేమెంట్‌ను పెంచటం ద్వారా, లేదా ఋణం తిరిగి చెల్లించవలసిన వాయిదాల సంఖ్యను తగ్గించటం ద్వారా లేదా రెండింటి ద్వారా వినియోగదార్ల పరపతిని క్రమబద్ధం చేయటం జరుగుతుంది. అనగా పై చర్యలు చేపట్టడం ద్వారా వస్తువుల కొనుగోలు కోసం, వినియోగదార్ల నుండి పరపతికి ఉండే డిమాండ్‌ను నిరుత్సాహ పరచటం జరుగుతుంది.

ఉదాహరణకు వినియోగదారులు రూ. 1,000 విలువగల X వస్తువును కొనుగోలు చేస్తున్నారు అనుకుందాం. అంతేకాకుండా వినియోగదారులు ముందుగా రూ. 100 చెల్లించాలని (down payment), మిగిలిన రూ. 900 బాంకులు ఋణంగా అందిస్తాయని, మరియు తీసుకున్న ఋణాన్ని (రూ. 900ను) 9 సమాన వాయిదాలలో (నెలకూ రూ. 100 చొప్పున) చెల్లించవచ్చునని అనుకుందాం. ఇటువంటి పరిస్థితిలో X వస్తువు ధరల స్థాయి

BRAOU

విపరీతంగా పెరుగుతుంటే, దానిని నియంత్రించడానికి డౌన్ పేమెంట్‌ను పెంచి, వాయిదాల సంఖ్యను తగ్గించటం జరుగుతుంది. దీని ప్రకారం, రూ. 1,000 విలువగల X వస్తువును కొనుగోలు చేసేటప్పుడు, డౌన్ పేమెంటును రూ. 400 గాను, మిగిలిన మొత్తాన్ని మూడు సమాన వాయిదాలలో (నెలకు రూ. 200 చొ॥న) చెల్లించాలని నిర్దేశించబడిందనుకుందాం. ఈ చర్య X వస్తువును కొనుగోలు చేయాలి అనుకునే వినియోగదారులను నిరుత్సాహపరుస్తుంది. దీనికి కారణం X వస్తువు కొనుగోలు చేసేటప్పుడు ముందుగా రూ. 100 చెల్లించటం కంటే రూ. 400 చెల్లించటం చాలా కష్టం. అదే విధంగా వాయిదాల పద్ధతిలో నెలకు రూ. 100 చెల్లించటం కంటే రూ. 200 చెల్లించటం చాలా కష్టం. దీని కారణంగా X వస్తువుకు ఉండే డిమాండ్ తగ్గిపోయి ధరల స్థాయి తగ్గుముఖం పడుతుంది.

ద్రవ్యోల్బణ సమయంలో డౌన్ పేమెంట్‌ను పెంచి, వాయిదాల సంఖ్యను తగ్గించినందువల్ల, వాయిదా పద్ధతిపై కొనుగోలు చేసే వస్తువులకు ఉండే డిమాండ్ తగ్గుముఖం పట్టి, కొనుగోళ్ళు తగ్గిపోయి, ధరల స్థాయి తగ్గుముఖం పడుతుంది. ప్రతిద్రవ్యోల్బణ కాలంలో డౌన్ పేమెంట్ తగ్గించి, వాయిదాల సంఖ్యను పెంచటం ద్వారా, వాయిదా పద్ధతిపై వస్తువులను కొనుగోలు చేయడం సులభతరం అవుతుంది. అందువలన ఎక్కువ మంది వినియోగదారులు వస్తువును కొనుగోలు చేయటానికి ప్రయత్నిస్తారు. ఈ కారణంగా వస్తువు యొక్క డిమాండ్ పెరిగి, ధరల స్థాయి పెరిగి, ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులను నియంత్రించటం జరుగుతుంది.

### 22.2.4 నైతికోద్బోధ (Moral Sausion)

ఈ సాధనం ప్రకారం కేంద్ర బాంకు వాణిజ్య బాంకుల అధికారులను సమావేశపరచి, ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని వివరించి, వాణిజ్య బాంకులు అవలంబించవలసిన విధానాలకు సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తుంది. దేశ శ్రేయస్సు దృష్ట్యా ప్రాధాన్యతలేని రంగాలకు ఎక్కువగా పరపతిని అందించవద్దని, తమకు చట్టబద్ధంగా రావలసిన దానికంటే అధికంగా పరపతిని ఇకముందు, తననుండి ఆశించవద్దనే నైతిక సలహాలను కేంద్ర బాంకు వాణిజ్య బాంకులకు ఇస్తుంది. కేంద్ర బాంకు ఇచ్చే సలహాలకు, సూచనలకు చట్టబద్ధతలేని కారణంగా, కేంద్ర బాంకు ఇచ్చే సూచనలను సలహాలను పాటించటం అనేది ఆయా బాంకుల నిజాయితీపై ఆధారపడి ఉంటుంది. నైతిక సలహాలను అలక్ష్యం చేస్తే రిజర్వ్ బాంకు ప్రత్యక్ష చర్య తీసుకుంటుంది.

### 22.2.5 ప్రత్యక్ష చర్య (Direct Action)

ప్రతి వాణిజ్య బాంకు, కేంద్ర బాంకు వద్ద అకౌంటును కలిగి ఉండి, కొంత మొత్తంలో నగదు నిల్వలను డిపాజిట్‌గా ఉంచుతాయి. వాణిజ్య బాంకులు ఉంచిన డిపాజిట్ల ఆధారంగా, కేంద్ర బాంకు వాణిజ్య బాంకులకు పరపతిని అందిస్తుంది. వాణిజ్య బాంకులకు ఋణం ఇచ్చేటప్పుడు, కేంద్ర బాంకు వసూలు చేసే వడ్డీరేటు ఒకే విధంగా ఉంటుంది. ఉదాహరణకు, ఆయా బాంకుల డిపాజిట్ల ఆధారంగా, ఒక్కొక్క బాంకుకు ఇచ్చిన ఋణంపై వసూలు చేసే వడ్డీరేటు 10 శాతం అనుకుందాం. ఏదైనా ఒక వాణిజ్య బాంకు కేంద్ర బాంకు సూచనలను పాటించకుండా, తన ఇష్టం వచ్చినట్లుగా, అంచనా వ్యాపారం మొదలైన సామాజిక ప్రయోజనం లేని రంగాలకు అధిక మొత్తంలో పరపతిని అందించి, కేంద్ర బాంకు వద్ద ఉంచిన డిపాజిట్ ఆధారంగా రావలసిన దానికంటే ఎక్కువగా పరపతిని కేంద్ర బాంకు నుండి కోరినట్లయితే, అదనంగా ఇచ్చే ఋణాలపై వసూలు చేసే వడ్డీ రేటును కేంద్ర బాంకు పెంచుతుంది. అనగా డిపాజిట్ ఆధారంగా ఇచ్చే ఋణంపై వడ్డీ రేటు 10 శాతం, అదనపు ఋణంపై విధించే వడ్డీ రేటు ఉదాహరణకు 10 కంటే ఎక్కువ. అనగా కేంద్ర బాంకు విచక్షణాత్మక వడ్డీ రేటు పద్ధతిని అవలంబిస్తుంది. ఏ బాంకు అయితే కేంద్ర బాంకు సూచనలను పాటించకుండా, విచక్షణా రహితంగా పరపతిని అందించినట్లయితే, ఆ బాంకుకు ఇచ్చే అదనపు ఋణాలపై కేంద్ర బాంకు వడ్డీ రేటును పెంచటాన్ని ఒక రకంగా

ఆ బ్యాంకును శిక్షకు గురిచేయటంగా చెప్పవచ్చు. ఒక వేళ వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలు రిజర్వ్ బ్యాంకు నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే, కేంద్ర బ్యాంకు ఆయా బ్యాంకులకు, బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణ కోసం ఇచ్చిన అనుమతిని ఉపసంహరించటం జరుగుతుంది. వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలను పర్యవేక్షించటం ద్వారానూ, బ్యాంకులను తనిఖీ చేయటం ద్వారానూ వాణిజ్య బ్యాంకులు, తాను విధించే నియమ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించే విధంగా కేంద్ర బ్యాంకు చూస్తుంది.

పైన వివరించిన సాధనాల ద్వారా వాణిజ్య బ్యాంకులు అందించే పరపతి సామాజిక ప్రయోజనం గల రంగాలలోకి అధికంగా ప్రవహించేటట్లు చూస్తూ, దేశ శ్రేయస్సు దృష్ట్యా ప్రమాదభరితమైన రంగాలలోకి పరపతి ప్రవహించకుండా కేంద్ర బ్యాంకు నియంత్రిస్తుంది.

## 22.3 గుణాత్మక పరపతి నియంత్రణ - ప్రాముఖ్యం

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో తరచుగా పరిమాణాత్మక పరపతి నియంత్రణ పద్ధతులను ఉపయోగించినట్లయితే ఆర్థికాభివృద్ధి ప్రక్రియ దెబ్బ తింటుంది. దీనికి కారణం, పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను అమలు పరిస్తే, చలామణిలో ఉండే పరపతి ద్రవ్య పరిమాణం తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దృష్ట్యా, ప్రాధాన్యత కలిగిన రంగాలకు కావలసినంత పరిమాణంలో పరపతి అందుబాటులో ఉండదు. అందువలన ముఖ్యమైన రంగాలలో ఆర్థిక కార్యకలాపాల స్థాయి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ యొక్క అభివృద్ధి ప్రక్రియ వేగం దెబ్బతింటుంది.

అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో గుణాత్మక పరపతి నియంత్రణా సాధానాలను చేపట్టటం ద్వారా, పరపతి దుర్వినియోగం కాకుండా చూడటానికి అవకాశం ఉంటుంది. అనగా ఆర్థిక వ్యవస్థ యొక్క అభివృద్ధి దృష్ట్యా అవసరమైన ఆర్థిక కార్యకలాపాలకు కావలసినంత మేరకు పరపతి సౌకర్యాలు కలుగజేస్తూ, సమాజ శ్రేయస్సు దృష్ట్యా హానికరమైన ఆర్థిక కార్యకలాపాలకు పరపతి అందకుండా చూడటానికి గుణాత్మక పరపతి నియంత్రణా చర్యలు ఉపయోగపడతాయి. గుణాత్మక పరపతి నియంత్రణ పద్ధతిలో వాణిజ్య బ్యాంకులు ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల మధ్య పరపతిని ఏ విధంగా కేటాయించాలో కేంద్ర బ్యాంకు నిర్దేశిస్తుంది.

వాణిజ్య బ్యాంకులు అందించే పరపతితో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసి, వ్యాపారస్తులు వాటిని దాచివేసి, కృత్రిమ కొరతలు సృష్టించడం ద్వారా ధరల స్థాయి పెరుగుతూ ఉన్నట్లయితే, కేంద్ర బ్యాంకు గుణాత్మక పరపతి నియంత్రణ చర్యలు చేపడుతుంది. ఈ పద్ధతిలో పరపతిని అందించే సమయంలో వివిధ రంగాల మధ్య విచక్షణ చూపడానికి వీలుంటుంది. నిత్యావసర వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలకు ఎక్కువగా పరపతిని అందించటం ద్వారా, సామాజిక ప్రయోజనం అంతగా లేని వస్తువుల ఉత్పత్తికి పరపతిని తగ్గించటం ద్వారా, ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ఎదురయ్యే ఆటంకాలను తొలగించవచ్చు. కొన్ని రకాల వినియోగ వస్తువులకు డిమాండ్ తక్కువగా ఉండి, మార్కెట్‌లో ఆ వస్తువు సప్లయ్ అధికంగా ఉండి, అత్యుత్పత్తి ఏర్పడినప్పుడు, వస్తువు డిమాండ్‌ను పెంచటానికి గుణాత్మక పరపతి నియంత్రణ తోడ్పడుతుంది. ఒక వస్తువు సప్లయ్ డిమాండ్‌ను మించి ఉన్నప్పుడు, ఆ వస్తువు కొనుగోలుకు ఎక్కువగా పరపతిని అందించటం ద్వారా వస్తువు డిమాండ్‌ను పెంచవచ్చు. ఒకవేళ ఏదైనా ఒక వస్తువు యొక్క ధరల స్థాయి విపరీతంగా పెరుగుతూ ఉన్నట్లయితే, ఆ వస్తువు కొనుగోలును లేదా డిమాండ్‌ను నియంత్రించడానికి, ఆ వస్తువు కొనుగోలు కోసం ఇచ్చే పరపతిని తగ్గించటం జరుగుతుంది. అందువలన వస్తువుకు డిమాండ్ తగ్గి, ధరల స్థాయి తగ్గుముఖం పడుతుంది. విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించటానికి ఎగుమతి వస్తువులను ఉత్పత్తిచేసే పరిశ్రమలకు తక్కువ వడ్డీరేటుకు పెద్ద మొత్తంలో పరపతిని

అందించవచ్చు. అదే విధంగా వ్యవసాయ రంగాన్ని, చిన్న తరహా పరిశ్రమల రంగాన్ని ప్రాధాన్యతా రంగాలుగా పరిగణించి, ఇతర రంగాలకంటే ఎక్కువగా, ఈ రంగాలకు ఎక్కువ పరపతిని సులభతరమైన నిబంధనలపై అందించవచ్చు. పరిమాణాత్మక పరపతి నియంత్రణా చర్యల ద్వారా సాధించటానికి వీలుకాని లక్ష్యాలను గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాల ద్వారా సాధించటానికి వీలుంటుంది.

## 22.4 భారత దేశం దృష్ట్యా గుణాత్మక పరపతి నియంత్రణ

1956కు పూర్వం, కేంద్ర బాంకు గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను ఉపయోగించలేదు. 1956వ సంవత్సరంలో మొదటిసారిగా, గుణాత్మక పరపతి నియంత్రణా చర్యలను చేపట్టటం జరిగింది. వరి ధాన్యం (paddy) మరియు వస్త్రాన్ని (cotton textiles) సెక్యూరిటీగా ఉంచుకుని, వాణిజ్య బాంకులు వ్యాపారస్తులకు పెద్ద మొత్తంలో అడ్వాన్సులు అందించిన కారణంగా, ఆర్థిక వ్యవస్థలో ఆహార ధాన్యాల కొరత ఏర్పడి, వాటి ధరలు పెరిగినందున, గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను చేపట్టడం జరిగింది. 1956 మే నెలలో, ఆహార ధాన్యాలను సెక్యూరిటీగా ఉంచుకుని ఇచ్చే ఋణాలను తగ్గించవలసిందిగా కేంద్ర బాంకు వాణిజ్య బాంకులను ఆదేశించటం జరిగింది. అదే సమయంలో ఆహార ధాన్యాలతోపాటు, వస్త్రాన్ని కూడా గుణాత్మక పరపతి నియంత్రణా చర్యల పరిధిలోకి తీసుకురావటం జరిగింది. 1957లో ఆహార ధాన్యాలను సెక్యూరిటీగా ఉంచుకుని ఇచ్చే ఋణాలపై మార్జిన్‌లను 40 శాతంగా ఉంచుకోవాలని కేంద్ర బాంకు వాణిజ్య బాంకులను ఆదేశించటం జరిగింది. పంచదార (sugar) ను సెక్యూరిటీగా ఉంచుకున్నప్పుడు మార్జిన్‌ను 35 శాతంగా నిర్ణయించటం జరిగింది. 1959లో నూనె గింజలను కూడా గుణాత్మక పరపతి నియంత్రణ పరిధిలోకి తేవటం జరిగింది. నూనె గింజలను సెక్యూరిటీగా ఉంచుకుని ఇచ్చే ఋణాలకు మార్జిన్‌లను నిర్ణయించడమే కాకుండా, నూనె గింజలను సెక్యూరిటీగా ఉంచుకుని ఇచ్చే పరపతి పరిమాణానికి గరిష్ఠ పరిమితిని నిర్ణయించడం జరిగింది.

1960లో స్టాక్ మార్కెట్‌లో, స్పెక్యులేటివ్ కార్యకలాపాలను అరికట్టడానికి, షేర్లను సెక్యూరిటీగా ఉంచుకుని అడ్వాన్సులు ఇచ్చేటప్పుడు మార్జిన్ 50 శాతంగా నిర్ణయించబడింది. 1956 నుండి ప్రస్తుత కాలం వరకు, ఆహార ధాన్యాల సప్లయ్‌కు సంబంధించి ఏర్పడిన కృత్రిమ కొరతలను, ఆహార ధాన్యాల ధరల స్థాయిని అరికట్టడానికి ఎక్కువగా మార్జిన్‌లలో మార్పులు చేయటం జరిగింది. 1965లో కేంద్ర బాంకు "క్రెడిట్ ఆథరైజేషన్ పథకాన్ని" (Credit Authorisation Scheme) ప్రవేశ పెట్టింది. బాంకు పరపతి ఉత్పాదకత కలిగిన రంగాలలోకి, వాస్తవంగా అవసరం వున్న వ్యక్తులకు అందేటట్లు చూడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం ప్రకారం కేంద్ర బాంకు వివిధ రంగాలకు అందించే పరపతి పరిమాణాన్ని క్రమబద్ధం చేయటంతోపాటు, పరపతిని అందించే సమయంలో వాణిజ్య బాంకులు అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తుంది. దీని ద్వారా బాంకులు అందించే పరపతి దురుపయోగం (misuse) కాకుండా చూడటం జరుగుతుంది.

క్రెడిట్ ఆథరైజేషన్ పథకం ప్రకారం ప్రయివేటు రంగంలో ఒక్కొక్కరికి ఒక కోటి రూపాయలకు మించి ఋణం ఇవ్వదలచినట్లయితే, వాణిజ్య బాంకులు ముందుగా కేంద్ర బాంకు అనుమతి పొందవలసి ఉంటుంది. క్రెడిట్ ఆథరైజేషన్ పథకం పనిచేయటానికి బాంకులు అందించే పరపతిని మూడు తరగతులుగా విభజించటం జరిగింది. అవి

ఎ) ముందుగా కేంద్ర బాంకు అనుమతి పొందాల్సిన పరపతి. దీని ప్రకారం

(i) ప్రయివేటు రంగంలో రూ. 2 కోట్లు, ప్రభుత్వ రంగంలో రూ. 3 కోట్లకు మించి చర మూలధనాన్ని ఒక వ్యక్తికి లేదా ఒక కంపెనీకి ఋణం ఇవ్వదలచినప్పుడు కేంద్ర బాంకు అనుమతి పొందాలి.

BRAOU

(ii) మూలధన ఆస్తులను సమకూర్చుకోవడానికి రూ. 25 లక్షల కంటే ఎక్కువగా ప్రయివేటు రంగానికి, రూ. 1 కోటి కంటే ఎక్కువగా ప్రభుత్వ రంగానికి కాల పరిమితి ఋణాలను (term loans) ఇవ్వదలచినప్పుడు కూడా కేంద్ర బాంకు అనుమతి అవసరం.

(iii) రూ. 50 లక్షల కంటే ఎక్కువగా విలంబిత (వాయిదా) చెల్లింపుల గ్యారంటీలను మంజూరు చేసేటప్పుడు ముందుగా రిజర్వ్ బాంకు అనుమతి తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది.

బి) కొన్ని రకాల ఋణాలను అందించేటప్పుడు ముందుగా కేంద్ర బాంకు అనుమతి పొందవలసిన అవసరం ఉండదు. కాని ఋణం మంజూరు చేసిన తర్వాత కేంద్ర బాంకుకు తెలియజేయాల్సి వుంటుంది. ఆ ఋణాలు ఏవనగా

(i) ఎగుమతి రంగానికి అందించే పరపతి,

(ii) రసాయనిక ఎరువుల పంపిణీకి సంబంధించిన ఋణాలు,

(iii) రక్షణ రంగానికి అందించే పరపతి.

సి) కొన్ని రకాల ఋణాలకు సంబంధించి ముందుగా కేంద్ర బాంకు అనుమతి పొందవలసిన అవసరం లేదు. అదే విధంగా ఋణం మంజూరు చేసిన తర్వాత కూడా కేంద్ర బాంకుకు తెలియజేయాల్సిన అవసరం లేదు. ఆ ఋణాలు ఏవనగా

(i) మంజూరు చేసిన పరపతి కంటే 10 శాతానికి మించకుండా తాత్కాలికంగా డ్రా చేసినప్పుడు;

(ii) నిజమైన వ్యాపార లావాదేవీలకు సంబంధించిన బిల్లులను కొనుగోలు చేసేటప్పుడు;

(iii) బాంకేతర ఆర్థిక సంస్థలనుండి లేదా విదేశాలలో వున్న భారతీయ బాంకులనుండి ఋణం పొందేటప్పుడు.

## 22.5 రిజర్వ్ బాంకు పరపతి నియంత్రణ - సమీక్ష

కేంద్ర బాంకు పరిమాణాత్మక, గుణాత్మక పద్ధతుల ద్వారా పరపతిని నియంత్రించటానికి అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఆశించిన లక్ష్యాలు సాధించటంలో విఫలమవుతుంది. ముఖ్యంగా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటం కేంద్ర బాంకుకు ఒక సవాలుగా పరిణమించింది. కేంద్ర బాంకు ఆర్థిక వ్యవస్థలో మొత్తం పరపతి పరిమాణాన్ని, పరపతి ప్రవాహ మార్గాలను సమర్థవంతంగా క్రమబద్ధం చేయలేకపోవటానికి, తద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించ లేకపోవటానికి అనేక కారణాలు వున్నాయి. అవి :

1. మన ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థీకృతం కాని (unorganised) ద్రవ్య మార్కెట్ పెద్ద మొత్తంలో పనిచేస్తుంది. ముఖ్యంగా వడ్డీ వ్యాపారస్తులు, భూస్వాములు, వ్యాపారస్తులు పెద్ద మొత్తంలో పరపతిని అందించటం జరుగుతున్నది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ పరపతిని అందించటంలో అవ్యవస్థీకృత రంగమే ప్రాధాన్యత వహిస్తుంది. దీనికి కారణం వ్యవస్థీకృత బాంకింగ్ వ్యవస్థ ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు తగినంతగా విస్తరించకపోవటంతో పాటుగా, గ్రామీణ ప్రజల విశ్వాసాన్ని చూరగొనకపోవటమే. అవ్యవస్థీకృత రంగాన్ని కేంద్ర బాంకు ప్రత్యక్షంగా తన నియంత్రణలో ఉంచుకునే అవకాశం లేదు. కేంద్ర బాంకు జారీ చేసే నియమ నిబంధనలు, పరపతి విధానంలో మార్పులు కేవలం వ్యవస్థీకృత రంగానికే పరిమితమైనాయి. ఈ కారణంగా కేంద్ర బాంకు యొక్క పరపతి నియంత్రణ విధానం సమర్థవంతంగా పనిచేయటం లేదని చెప్పవచ్చు.

BRAOU

2. ద్రవ్యం చొరబడని రంగం (non-monetised sector) ఇంకా మన ఆర్థిక వ్యవస్థలో వుంది.

3. అభివృద్ధి చెందిన బిల్ మార్కెట్, సెక్యూరిటీ మార్కెట్ లేకపోవటం.

4. విభిన్న వడ్డీ రేట్లు అమలులో ఉండటం.

5. ప్రతి సంవత్సరం ప్రభుత్వం లోటు బడ్జెటును అనుసరిస్తూండటం.

వీటి మూలంగా, కేంద్ర బాంకు తాను తీసుకునే చర్యల ద్వారా సమర్థవంతంగా పరపతిని నియంత్రించి ఆశించిన లక్ష్యాలను సాధించ లేకపోవుచున్నది.

## 22.6 సారాంశం

గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు మొత్తం పరపతి పరిమాణాన్ని కాక పరపతి ఉపయోగాన్ని, పరపతి ప్రవాహ మార్గాలను ప్రభావితం చేస్తాయి. ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రాముఖ్యాన్ని బట్టి ఒక్కొక్క రంగానికి ఎంత మొత్తంలో పరపతిని అందించాలో కేంద్ర బాంకు నిర్ణయిస్తుంది. వాణిజ్య బాంకు అందించే పరపతి సామాజిక ప్రయోజనం గల రంగాలలోకి ఎక్కువగా ప్రవహించేటట్లు చూడటం ఈ చర్యల ముఖ్య ఉద్దేశం. గుణాత్మక పరపతి నియంత్రణ పద్ధతిలో పరపతిని అందించేటప్పుడు వివిధ రంగాల మధ్య విచక్షణ చూపటానికి వీలుంటుంది. ఈ కారణంగా వాణిజ్య బాంకులు అందించే పరపతి దుర్వినియోగం కాకుండా చూడడానికి, అంచనా వ్యాపారం మొదలైన సమాజానికి హాని కలిగించే రంగాలకు పెద్ద మొత్తంలో పరపతి అందకుండా చూడటానికి వీలవుతుంది. మన ఆర్థిక వ్యవస్థలో వున్న అవ్యవస్థీకృత ద్రవ్య రంగంపై కేంద్ర బాంకు యొక్క అజమాయిషీ లేని కారణంగా, పరపతి నియంత్రణ విధానం సమర్థవంతంగా పనిచేయడం లేదు.

## 22.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులిమ్ము.**

1. గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాల ద్వారా పరపతి నియంత్రణ ఏ విధంగా జరుగుతుందో వివరించండి.

2. పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలకంటే గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు ఏ విధంగా మెరుగైనవో చర్చించండి.

II. **క్రింది ప్రశ్నలలో ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

1. క్రింది వాటిని వివరించండి.

ఎ) మార్జిన్‌లను నిర్ణయించడం, బి) వినియోగదారుల పరపతి నియంత్రణ.

2. గుణాత్మక పరపతి నియంత్రణ ప్రాముఖ్యం ఏమిటి?

## 22.8 సంప్రదింపు గ్రంథాలు


| | | |
|---|---|---|
| Suraj B. Gupta | : | Monetary Economics |
| Suraj B. Gupta | : | Monetary Planning for India |
| Mishra & Puri | : | Indian Economy |


B R A O U

## 22.9 పదకోశం

| | | |
|---|---|---|
| Qualitative credit control | : | గుణాత్మక (ఎంపిక చేసిన) పరపతి నియంత్రణ |
| Quantitative credit control | : | పరిమాణాత్మక పరపతి నియంత్రణ |
| Speculative business | : | అంచనా వ్యాపారం |
| Credit rationing | : | పరపతి క్రమబద్ధీకరణ |
| Black marketing | : | నల్ల బజారు |
| Down payment | : | ఒకేసారి చెల్లించడం, డౌన్ పేమెంట్ |
| Inflation | : | ద్రవ్యోల్బణం |
| Moral suasion | : | నైతికోద్బోధ |
| Misuse | : | దురుపయోగం |
| Term loans | : | కాలపరిమితి ఋణాలు |
| Unorganised sector | : | వ్యవస్థీకృతం లేదా అవ్యవస్థీకృత రంగం |
| Non - monetised sector | : | ద్రవ్యం చొరబడని రంగం |
| Direct action | : | ప్రత్యక్ష చర్య |
| Durable | : | మన్నిక కలిగిన |

– డా॥ ఏ. వకులా రెడ్డి

BRAOU

# భాగం - 23 : పరపతి ప్రణాళికా విధానం

విషయ క్రమం

23.0 ఉద్దేశం

23.1 పరిచయం - ద్రవ్య విధానం

23.2 పరపతి దృక్కోణాలు

23.3 పరపతి : విత్త సంస్థల పాత్ర

23.4 పరపతి కల్పనలో వాణిజ్య బాంకుల పాత్ర

23.5 పరపతి ప్రణాళికా విధానం

23.5.1 పరపతి ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు

23.5.2 పరపతి ప్రణాళిక రచన

23.5.3 పరపతి క్రమశిక్షణ

23.5.4 భారత దేశంలో పరపతి ప్రణాళికా ప్రయత్నాలు

23.6 స్థూల పరపతి ప్రణాళికా దశలు, ప్రణాళికలలో లోపాలు

23.7 సూక్ష్మ స్థాయి పరపతి ప్రణాళికలు

23.7.1 లీడ్ బాంకు పథకం

23.7.2 ప్రాంతీయ పరపతి ప్రణాళికా విధానం

23.7.3 జిల్లా సమన్వయ సమితి

23.7.4 జిల్లా పరపతి ప్రణాళికలు - మూల్యాంకనం

23.8 పరపతి ప్రణాళికా విధానం సాధించిన ప్రగతి

23.9 సారాంశం

23.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

23.11 సంప్రదింపు గ్రంథాలు

## 23.0 ఉద్దేశం

ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య వనరుల పెరుగుదల, వనరుల పంపిణీ అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా జరగాలి. ఈ దృక్కోణంలో పరిశీలించినప్పుడు 'పరపతి ప్రణాళిక' ప్రాముఖ్యతను సంతరించుకొంది. 'పరపతి ప్రణాళిక' భావన ఆవిర్భావం, పరిణామ క్రమం, స్థూల, సూక్ష్మ స్థాయి ప్రణాళికలు, లక్ష్యాలు, దశలు, వాటి అమలు తీరు వంటి విషయాలను తెలుపడం ఈ భాగం ఉద్దేశం.

BRAOU

## 23.1 పరిచయం - ద్రవ్య విధానం

ఆర్థికాభివృద్ధి ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు ఉత్పన్నమయ్యే సమస్యల్లో ముఖ్యమైంది వనరుల సమీకరణకు సంబంధించింది. పొదుపు పెట్టుబడుల పెరుగుదల, ఉత్పత్తి రంగాల్లో ఈ వనరుల పంపకం కలిసి ఉంటాయి. కాబట్టి ఒక దేశ ద్రవ్య విధానం ఈ లక్ష్యాల సాధనకు సహాయపడాలి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లోని ఆర్థిక ప్రణాళికలకు ద్రవ్య విధానం ఒక సాధనంగా పనిచేస్తుంది. ఒక దేశంలోని మొత్తం ద్రవ్య సప్లయిలో బాంకు పరపతి కీలకమైన పాత్ర వహిస్తున్న కారణంచేత, బాంకింగ్ రంగం సృష్టించే పరపతి ఆర్థిక ప్రణాళికలో అంతర్భాగం అవుతుంది.

కొన్ని సందర్భాల్లో ఆర్థిక వ్యవస్థల్లో ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ద్రవ్య డిమాండు పెరుగుతుంది. కాని అది ద్రవ్య సప్లయ్, నిజమైన వస్తు డిమాండుల మధ్య అసమతౌల్యాన్ని సృష్టిస్తుంది. కాబట్టి పరపతి ప్రవాహాన్ని అదుపు చేయవలసి ఉంటుంది. ద్రవ్య వనరులను ప్రాధాన్యతలేని రంగాలలో అనుత్పాదక ప్రక్రియల్లో, అంచనా వ్యాపార రంగాలలో పరపతి ప్రవాహాన్ని నియంత్రించవలసి ఉంటుంది. అనగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్య విధానం 'నియంత్రిత పరపతి విస్తరణ' (controlled credit expansion) లక్ష్యంగా పనిచేయవలసి ఉంటుంది. ద్రవ్య నిర్వహణా సాధనాలు వనరుల అంచనా వ్యాపార రంగపు డిమాండు, ఉత్పాదక డిమాండుల మధ్య విచక్షణాయుత, ఎంపిక ప్రాధాన్యతలు కలదిగా ఉండాలి. భారత దేశంలో మొత్తం పరపతి ప్రధాన రంగాలకు లభించిన పరపతి 1969లో 14.7 శాతం కాగా 1993 - 94 నాటికి అది సుమారుగా 35.3 శాతానికి పెరిగింది. ఈ విధంగా ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో ద్రవ్య విధానం క్రియాశీలకమైన పాత్రను నిర్వహించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఆ దృష్ట్యా పరిశీలించినప్పుడు ద్రవ్య విధానం ప్రధాన లక్ష్యాలు కింది విధంగా ఉండాలి;

**ద్రవ్యవిధానం లక్ష్యాలు**

1. పెరుగుతున్న అవసరాలను తీర్చే విధంగా భౌగోళిక రీత్యా విధుల దృష్ట్యా పరపతి వ్యవహారాలను విస్తృత పరిచేదిగా ద్రవ్య విధానం ఉండాలి.
2. అభివృద్ధికి దోహదపడని రంగాల్లో ద్రవ్య డిమాండును తగ్గించాలి.
3. ఆర్థిక వ్యవస్థ ప్రణాళికాయుతంగా నడుస్తున్న కారణంచేత అభివృద్ధికి కావలసిన వనరుల డిమాండును పెంచడానికి ద్రవ్య విధానం ప్రణాళికల ప్రాధాన్యతలను బట్టి నిర్వహించాలి.
4. పరపతి విస్తృతిని అన్ని రంగాల్లోని డిమాండును పూరించే రీతిగా ఉంటూ రంగాల వారీగా ఉన్న అసమానతలను తొలగించాలి. వ్యవసాయం వంటి కార్యకలాపాలు గల ప్రాథమిక రంగం వనరుల లోటుతో బాధపడుతుంది. అయితే గౌణ రంగంలో డిమాండు ఎక్కువ శీఘ్రంగా పెరగగా, ప్రాథమిక రంగంలో అల్ప రేటులో పెరుగుతుంది. ఏ విధంగానైతే రక్త ప్రసరణం మనిషిలోనిఅన్ని అంగాలకు అవసరమో, అదే విధంగా పరపతి కూడ ఏ ఒక్క రంగానికి ప్రసరణ కాకపోయినా, మొత్తానికే ప్రమాదం ఏర్పడుతుంది.

## 23.2 పరపతి దృక్కోణాలు

ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశంగా పరపతిని రెండు దృక్కోణాల ద్వారా గమనించాలి.

1. ఇది మొదట విస్తృతపరిచేదిగా ఉండాలి. బాంకు పరపతి ధోరణిని నిర్ణయించే ప్రధానం అంశాలు -

(a) పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో పెట్టుబడి కార్యకలాపాలు, (b) పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో పెట్టుబడి

BRAOU

అవకాశాలు, (c) ధరలస్థాయి, (d) విదేశీ వ్యాపార పరిస్థితులు, (e) ఉద్యోగితా స్థాయి, (f) ప్రభుత్వ పారిశ్రామిక విధానం.

2. ఆర్థిక వ్యవస్థలో మారుతున్న అవసరాల దృష్ట్యా బాంకు పరపతి పంపిణీలో గణనీయమైన మార్పులు రావాలి. ప్రాధాన్యతా రంగం, అనుత్పాదక, అంచనా వ్యాపార రంగాల మధ్య కేటాయింపులో మార్పులు రావలసి ఉంటుంది. వ్యవసాయ ప్రాధాన్యత దృష్ట్యా దానికి ప్రత్యేక సదుపాయం కల్పించవలసి ఉంటుంది. అదే విధంగా పరపతి పంపిణీలోని ప్రాంతీయ అసమాతలను తొలగించవలసి ఉంటుంది.

## 23.3 పరపతి : విత్త సంస్థల పాత్ర

బాంకు పరపతి ఎక్కువగా స్వల్పకాలిక, మధ్యకాలిక అభివృద్ధి అవసరాలను మాత్రమే తీర్చగల్గేదిగా ఉన్నందువల్ల పారిశ్రామిక, ఇతర రంగాల్లో దీర్ఘకాలిక అవసరాలను తీర్చేవిధంగా ప్రత్యేక విత్త సంస్థల ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంటుంది. మన దేశంలో కూడా అఖిల భారత స్థాయి విత్త సంస్థలు అనేకం ఏర్పాటు చేయబడ్డాయి. అందులో ప్రధానమైనవి : IDBI, IFCI, ICICI, SIDBI, IRBI, SCICI, RCTC, TDICI, TFCI. పెట్టుబడి సంస్థలు : UTI, LIC, GIC. వీటి వల్ల రెండు రకాల పరపతి విస్తృతి జరుగుతుంది. ఒకటి, ప్రత్యక్ష పరపతి కల్పన. రెండు, ఋణ పత్రాల్లో పెట్టుబడి పెట్టడం మరియు ప్రాథమిక మార్కెటు కార్యకలాపాలకు ద్రవ్య సహాయాన్ని అందించడం. భారత దేశంలో 1993-94 లో ఈ సంస్థలన్నీ కలిసి రూ. 25,631.9 కోట్ల పరపతిని పంపిణీ చేయడం జరిగింది. అందులో ప్రత్యక్షంగా కల్పించింది. రూ. 18,630.2 కోట్లు కాగా పెట్టుబడి ద్వారా రూ. 7,876.7 కోట్లు అందించడం జరిగింది. వీటి నిర్మాణంలో రిజర్వు బాంకు కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. అభివృద్ధి విత్త సంస్థల ఏర్పాటుకు కింది విధాలుగా సహాయపడుతుంది.

1. మూలధన పత్రాలు కొనుగోలు చేయడం (subscribe చేయడం),

2. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో వారి బాండులకు, డిబెంచర్లకు హామీని ఇవ్వడం (గ్యారంటీ ఇవ్వడం),

3. గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను వాడటం,

4. ఆర్థికాభివృద్ధికి దోహదపడే సామర్థ్యం గల ద్రవ్య విధానాన్ని నిర్మాణం చేయడం.

## 23.4 పరపతి కల్పనలో వాణిజ్య బాంకుల పాత్ర

దేశంలో వివిధ సంస్థలు, వ్యక్తులు చేసే పొదుపు మొత్తాలను సమీకరించి వాటిని ఉత్పాదక కార్యకలాపాల కోసం సమకూర్చే సంస్థలే వాణిజ్య బాంకులు. బాంకులు ఒక రకమైన ద్రవ్యాన్ని (బాంకు ద్రవ్యం) సృష్టిస్తూ, మొత్తం ద్రవ్య చలామణిలో హెచ్చు భాగాన్ని ఆక్రమిస్తాయి. ఆ విధంగా ద్రవ్యాన్ని సృష్టించే ప్రక్రియ ద్వారా బాంకుల ఉత్పత్తి పరిమాణాన్ని స్వభావాన్ని ప్రభావితం చేస్తాయి. మన దేశంలో 1949లో ప్రవేశపెట్టిన బాంకింగ్ కంపెనీల చట్టం అనంతరం రెండు దశాబ్దాల్లో బాంకింగ్ రంగం నిర్మాణాత్మక, భౌగోళిక మరియు విధుల రీత్యా గణనీయమైన మార్పును సంతరించుకొంది. అదే కాలంలో పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న దృష్ట్యా మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఉంచడానికి బాంకింగ్ వ్యవస్థ మరియు రిజర్వు బాంకు కొంత కృషి చేసాయి. అయితే ఈ మార్పులు కొంత మందకొడిగా సాగాయి. భారత దేశ వాణిజ్య బాంకింగ్ వ్యవస్థ 1949 బాంకింగ్ కంపెనీల చట్టాల ద్వారా నియంత్రింపబడినప్పటికీ, ఆ తర్వాత చట్టాన్ని సవరించి నియంత్రించడం జరిగింది. 1960 చట్టం సవరణ పిదప బాంకుల విలీనీకరణ ప్రక్రియ విజయవంతంగా

BRAOU

చేపట్టడం జరిగింది. 1955లో భారతీయ స్టేట్ బాంకును ఏర్పాటు చేసిన పిదప గ్రామీణ రంగంలో బ్రాంచీల విస్తరణ, చిన్నతరహా పరిశ్రమలకు, గ్రామీణ పరపతిని అందించే అవకాశం ఏర్పడింది.

బాంకింగ్ రంగం 1951 నుండి 1969లో బాంకుల జాతీయీకరణ జరిగేంత వరకు కొంత ప్రగతిని సాధించింది. అదే కాలంలో బాంకు డిపాజిట్లు రూ. 835 కోట్ల నుండి రూ. 4,338 కోట్లకు పెరిగింది. క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 62 శాతం నుండి 78 శాతానికి పెరిగింది. అయితే మొత్తం బాంకు పరపతిలో పెద్ద , మధ్య తరగతి పరిశ్రమలకు అందించిన పరపతి వాటా 34 శాతం నుండి 68 శాతానికి పెరిగింది. వాణిజ్య రంగానికి అందించిన వాటా మాత్రం 36 శాతం నుండి 19 శాతానికి తగ్గింది. అయితే చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలు, చిల్లర వ్యాపారం, స్వయం ఉపాధి, చిన్న ఋణగ్రహీతలను బాంకింగ్ రంగాల పరిధి నుండి బయట ఉంచడం జరిగింది. వ్యవసాయ పరపతి అవసరాలు సంస్థాగతంగా అందించే బాధ్యత సహకార రంగానికి వదిలి వేయబడింది. ఆ రంగంలో RBI కొన్ని సంస్కరణలను ప్రవేశపెట్టినప్పటికీ ఫలితం సమకూరలేదు.

### 23.4.1 సామాజిక నియంత్రణ (Social Control)

ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థలో బాంకులు తమ ఋణాలను అన్ని ఉత్పాదక రంగాలకు ప్రయోజనాత్మకంగా ఉండేటట్లు పంపిణీ చేయడం అవసరమని; బాంకులు అనుసరించే విధానాలు ఏకస్వామ్యపు ధోరణులు పెంపొందించేవిగా ఉండరాదని; ఆర్థిక స్థోమతను కేంద్రీకృతం చేసేవి కాకుండా, వనరులను దుర్వినియోగం కాకుండా చూడవలసిన అవసరాన్ని గుర్తించి, పెరుగుతున్న పొదుపులను ఆకర్షించడానికిగాను 1967లో బాంకులు "సామాజిక నియంత్రణ" ('social control) ను ప్రవేశపెట్టింది. ఆ నాటికి ప్రైవేటు రంగంగా ఉన్న బాంకింగ్ రంగం, నిర్వహణ తీరుపై నమ్మకాన్ని కోల్పోయి, ప్రజాస్వామిక బాంకులు 'సామాజిక నియంత్రణ' ను ప్రవేశపెట్టడం జరిగింది. దాన్ని అమలు జరపడానికి 'జాతీయ పరపతి మండలి'ని ఏర్పాటు చేయడం జరిగింది. దానికి మూడు ముఖ్య విధులను నిర్దేశించారు.

1. బాంకు పరపతి డిమాండును అంచనా వేయడం,
2. ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, చిన్న పరిశ్రమలు మరియు ఎగుమతి అవసరాలను మూల్యాంకనం చేసి ఆ రంగాల్లో పెట్టుబడి అవసరాలకు సరిపడు రీతిగా ఋణాలను, అడ్వాన్సులను మంజూరు చేసే విధంగా ప్రాతిపదికలను ఏర్పాటు చేయడం.
3. అభిలషణీయ మరియు పటిష్ఠమైన వనరుల ఉపయోగాన్ని కల్పించడానికి వాణిజ్య బాంకుల, సహకార సంస్థల, ప్రత్యేక విత్త సంస్థల మధ్య ఋణాల/ పెట్టుబడి విధానాల మధ్య సమన్వయాన్ని సాధించడం.

### 23.4.2 బాంకుల జాతీయీకరణ

సామాజిక నియంత్రణలో భాగంగా ప్రవేశపెట్టిన మార్పుల్లో బాంకు బోర్డు నిర్మాణంలో మార్పులు, బాంకులను వ్యవసాయ పరపతిని కల్పించే దిశగా వ్యవసాయ ద్రవ్య కార్పోరేషన్ లిమిటెడ్ (1968) ను ఏర్పాటు చేయడం, బ్రాంచీల విస్తరణకు పథకాన్ని తయారు చేయడం, పరపతి పంపిణీలో ప్రధాన రంగాలను గుర్తించడం వంటివి చేపట్టినప్పటికీ, అనుకున్న ఫలితాలు సమకూరకపోవడం వల్ల 1969లో 14 వాణిజ్య బాంకుల జాతీయీకరణ జరిగింది. ఇండియన్ బాంకింగ్ కమీషన్‌ను ఏర్పాటు చేయడమూ జరిగింది.

BRAOU

సామాజిక లక్ష్యాలను నెరవేర్చడానికి "సామాజిక నియంత్రణ" సరిపోదని భావించి జాతీయాకరణ జరిగిందా, లేక రాజకీయ కారణాల వల్ల జరిగిందా అన్న మీమాంసపై చర్చ అవసరం లేకపోయినప్పటికీ, జాతీయాకరణవల్ల 85 శాతం బాంకు డిపాజిట్లు ప్రభుత్వ ఆధీనంలోకి తేబడినాయి. జాతీయాకరణ ఉద్దేశం ఏమైనప్పటికీ తర్వాత జరిగిన మార్పులను బట్టి, అనుభవాన్ని బట్టి ముఖ్యంగా పరపతి ప్రణాళిక మరియు బాంకు బ్రాంచీల విస్తరణకు సంబంధించి ఫలితాలు విజయవంతంగా ఉన్నాయి.

14 బాంకులను జాతీయం చేసినప్పుడు ప్రభుత్వం కొన్ని ప్రయోజనాలను దృష్టియందు ఉంచుకోవడం జరిగింది. అందులో ముఖ్యమైనవేమంటే:

(i) వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, ఎగుమతి పరిశ్రమలు వంటి ప్రాధాన్య రంగాల్లో వృద్ధిరేటును పెంచడం;

(ii) వృద్ధి వేగాన్ని ఇనుమడింపచేయడం;

(iii) ప్రతిభావంతులైన కొత్త పారిశ్రామిక ఉద్యమదారులను ప్రోత్సహించడం;

(iv) వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పరచడం;

(v) బాంకు సౌకర్యాల విషయంలో దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తొలగించడం.

## 23.5 పరపతి ప్రణాళికా విధానం

పై అంశాల దృష్ట్యా, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో పరపతి ప్రణాళిక అవసరం ఎంతో ఉంది. కొరతగా ఉన్న వనరులను వివేకవంతంగాను, ఉత్పాదకంగాను, లాభసాటిగాను వాడటం ఈ పరపతి ప్రణాళిక ప్రాథమిక ఉద్దేశం. పరపతి ప్రణాళికను స్థూల, సూక్ష్మ అంశాల్లో గమనించవలసి ఉంటుంది. స్థూల పరపతి ప్రణాళిక మొత్తంపై ద్రవ్య సప్లయి పెరుగుదల నిజ జాతీయోత్పత్తిలోని ప్రస్తుత ధోరణుల, అంశాల ప్రత్యేకత దృష్ట్యా ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చడానికి అవసరపడే మొత్తం పరపతి పరిమాణం విస్తృతిని పరిగణనలోనికి తీసుకుంటుంది. ఈ విస్తృత అర్థంలో పరపతి ప్రణాళిక పరపతి సృష్టిని ప్రైవేటు రంగంలోనే కాక ప్రభుత్వ రంగ పరపతిని కూడ పరిగణనలోకి తీసుకుంటుంది. కాబట్టి ఆర్థిక వ్యవస్థలో పరపతి ప్రణాళిక ప్రాథమిక అంశం "ద్రవ్య సంబంధమైన బడ్జెట్" తయారీతో ఆరంభమౌతుంది. నిజ ఆదాయ పెరుగుదల రేటు ఇవ్వబడినప్పుడు, ద్రవ్య విస్తృతి రేటు ఊహించిన నిజాదాయ పెరుగుదల రేటు కన్న హెచ్చుగా ఉండవలసి వస్తుంది. దీనికి కారణం ఆర్థిక వ్యవస్థ ఎక్కువ ద్రవ్యీకరణ చెందడం మరియు జాతీయాదాయం పెరిగినప్పుడు సమాజం నగదు నిల్వల అవసరాలు పెరగడం జరుగుతుంది. ఈ విధంగా ద్రవ్య బడ్జెట్ సాధారణంగా నిజ ఆదాయంపై ద్రవ్య అవసరాలలో ఊహించిన సంబంధంపై ఆధారపడి ఉంటుంది.

BRAOU

### ద్రవ్య సప్లయిని నిర్ణయించే మూడు అంశాలు

ద్రవ్య సప్లయిని నిర్ణయించే మూడు అంశాల్లో ప్రభుత్వానికి అందించే నికర బాంకు పరపతి ప్రభుత్వ బడ్జెట్ విధానంపైన, ప్రభుత్వం నిర్ణయించిన బడ్జెటరీ లోటు పరిమాణాన్ని కలుపుకొని నిర్ణయింపబడుతుంది. వాణిజ్య రంగానికి అందించబడే నికర బాంకు పరపతి రిజర్వు బాంకు అనుసరించే ద్రవ్య మరియు పరపతి విధానాలపైన ఆధారపడి ఉంటుంది. ద్రవ్య సప్లయిపై విదేశీ రంగం కల్గి ఉండే ప్రభావం వ్యాపార కదలికలు మరియు ఇతర చెల్లింపుల శేషం ఇతర అంశాల ఆధారితంగా ఉండే నికర విదేశీ ఆస్తుల కదలికలపై నిర్ణయిపంబడుతుంది. ద్రవ్య సప్లయిలో బాంకు పరపతి ప్రాముఖ్యత దృష్ట్యా, పరపతి ప్రణాళిక ఆవశ్యకత గోచరమౌతుంది. కాబట్టి పరపతి ప్రణాళిక ప్రణాళికల్లో నిర్దేశించిన ద్రవ్య పరమైన/భౌతిక లక్ష్యాలను మరియు బాంకు పరపతి విస్తృతిని అనుసంధాన పరిచే ఉద్దేశంతో రచించవలసి ఉంటుంది. పెట్టుబడి పెరుగుదలకు మరియు ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల ఉత్పత్తికి అనుగుణంగా పరపతి పెరుగుదలను కల్పించడం ఈ పరపతి ప్రణాళిక లక్ష్యం.

### 23.5.1 పరపతి ప్రధాన లక్ష్యాలు

పై అంశాలు గమనించినప్పుడు పరపతి పంపిణీ ప్రధాన లక్ష్యాలు కింది విధంగా ఉంటాయి.

1. ఇంతవరకు బాంకు పరపతి అందని రంగాలకు, అదే విధంగా సంస్థాగతమైన పరపతి సౌకర్యాలు సులభంగా అందుబాటులో లేని ఋణ గ్రహీతకు పరపతి సౌకర్యాలు అందించడం; అంటే వెనుకబడిన ప్రాంతాల్లో, నూతన ఉద్యమిత్వ సామర్థ్యంగల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరపతిని అందించడం. దీనివల్ల పరపతి పంపిణీ విషయంలో, వివిధ రంగాల్లో మరియు ప్రాంతీయంగా నెలకొని ఉన్న అసమానతలను తొలగించడం మరియు ఆర్థిక స్థోమత వికేంద్రీకరణను సాధించడం జరుగుతుంది.
2. బాంకులు రైతులకు సేవలను అందిస్తూ వ్యవసాయోత్పత్తిని మరియు సాధారణ గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడం.
3. అంచనా వ్యాపారానికి వాడబడే బాంకు పరపతిని, అనుత్పాదక ప్రక్రియల్లో వాడబడే బాంకు పరపతిని తగ్గించడం.
4. ప్రైవేటు పరిశ్రమకు, వ్యాపారానికి నిజంగా అవసరపడే పరపతి అవసరాలను తీర్చడం; కాగా అధిక ద్రవ్య కల్పన/బహుళ ద్రవ్య సప్లయి వంటి అవాంఛనీయ ఋణ కల్పనలను తొలగించడం.
5. ప్రాధాన్యతా రంగాల్లో నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చే ప్రాముఖ్యత విషయంలో ఆర్థికతను, వికసనశీలతను (economic viability) మాత్రం పణంగా పెట్టరాదు.

### 23.5.2 పరపతి ప్రణాళిక రచన

మన దేశంలో ఆర్థిక పంచవర్ష ప్రణాళికను 1951 నుండి చేపట్టినప్పటికీ, పరపతి ప్రణాళికలను మాత్రం ఒక రకంగా సామాజిక నియంత్రణ (1967) నుండి, ఆ పిదప 1969లో బాంకుల జాతీయాకరణ నుండి మాత్రమే ప్రవేశపెట్టడం జరిగింది. మొదటి రెండు దశాబ్దాల ప్రణాళికా కాలంలో అనుసరించిన పరపతి ప్రణాళిక సాంప్రదాయంగా సాలీనా చేపట్టే ముమ్మర (busy) మరియు స్లాక్ (slack) ఋతువులకు సంబంధించినదిగా మాత్రమే ఉంది. అయితే వాణిజ్య బాంకులు పరపతి ప్రణాళికలను తయారుచేయడంలో తోడ్పడటానికి రిజర్వు బాంకు ఒక "పరపతి ప్రణాళిక" విభాగాన్ని ఏర్పాటు చేసింది. పరపతి బడ్జెట్‌లను రిజర్వు బాంకు బాంకుల ఉన్నత యాజమాన్యాలతో చర్చిస్తుంది. ఈ విధంగా తయారుచేసిన పరపతి ప్రణాళిక ఉద్దేశం పరపతిని ప్రాధాన్యతా రంగాలకు అదే విధంగా జాతీయ విధానాలకు అనుగుణంగా తిరిగి పంపిణీ చేయడం. బాంకుల పరంగా ఋణాత్మక నిధులను అన్ని రంగాలకు కేటాయించే విధంగా ప్రత్యేక కృషి సల్పడం జరుగుతుంది.

### 23.5.3 పరపతి క్రమశిక్షణ

పరపతి ప్రణాళిక ఇంకొక ముఖ్యమైన అంశం పరపతి క్రమశిక్షణ (credit discipline). ఉత్పత్తి ఆధారిత పరపతి అనే భావన ప్రమేయం ఏమనగా ప్రతి ఉత్పత్తి కార్యక్రమానికి ఒక సంతృప్తిపరిచే కనీస పరపతి అవసరం పెరుగుతుంది. కాని బాంకు పరపతి మొత్తం పరపతి అవసర స్థాయి ఉంటుంది. ప్రతి ఉత్పత్తిలోని పెరుగుదల దానికి సమాంతరమైన పరపతి అవసరం పెరుగుతుంది. కాని బాంకు పరపతి మొత్తం అవసరంలో కొంతభాగమే ఉంటుంది. ఉదాహరణకు భారత దేశంలోని మొత్తం పారిశ్రామిక అవసరంలో బాంకు పరపతి 1972లో 17.7 శాతం మాత్రమే ఉండేది. అదే విధంగా ప్రస్తుత ఆస్తుల్లో బాంకు పరపతి శాతం 32.7 శాతం మాత్రమే ఉండేది. ఈ విధంగా ఉన్న అంతరాన్ని తొలగించడం పరపతి క్రమశిక్షణ క్రిందకు వస్తుంది.

BRAOU

బాంకులు నిర్వహించే పరపతి ప్రణాళిక కేవలం పరపతి క్రమశిక్షణను తేలేవు. సూక్ష్మ స్థాయిలో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని ఆధారాలద్వారా సృష్టింపబడే పరపతిని పెరిగిన ఉత్పత్తితో అనుసంధాన పరచాలి కాని కేవలం బాంకు పరపతి పెరుగుదలతో మాత్రం కాదు. దీనిని సూక్ష్మ స్థాయిలో ఒక యూనిట్‌కు లభించే పరపతి, ఉత్పత్తి పెరుగుదలతో ముడిపెట్టే మాదిరిగా గమనించవలసి ఉంటుంది. అప్పుడే ద్రవ్య విధానానికి పరపతి ప్రణాళిక ఒక విజయవంతమైన సాధనంగా పనిచేయగల్గుతుంది. అంతేకాకుండా, పరపతి ప్రణాళిక విజయవంతం కావాలంటే ద్రవ్య మార్కెటులోని సంస్థాగతం కాని ద్రవ్య సంస్థల పాత్ర తగ్గించబడాలి. కాబట్టి పరపతి ప్రణాళిక, పరపతి క్రమశిక్షణ, పరపతి నియంత్రణ - ఈ మూడు ఋణ నిర్వహణకు ముఖ్యమైన అంశాలుగా పనిచేస్తాయి.

## 23.5.4 భారత దేశంలో పరపతి ప్రణాళికా ప్రయత్నాలు

భారత దేశంలో పరపతి ప్రణాళిక ప్రయత్నాలు 1960ల్లోని రెండవ భాగంలో మాత్రమే ఆరంభమైనాయి. మన దేశంలో ఆర్థిక ప్రణాళిక ప్రక్రియ 1951లోనే ఆరంభమైనప్పటికీ, బాంకింగ్ రంగం గాని, జీవిత భీమా సంస్థ వంటి ద్రవ్య సంస్థల పాత్ర ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో విశదపరచబడలేదు. 1967లో సామాజిక నియంత్రణలో భాగంగా జాతీయ పరపతి మండలిని స్థాపించినప్పటినుండి పరపతి ప్రణాళిక మొదలు పెట్టబడిందని చెప్పవచ్చు. డిపాజిట్లను సేకరించడంలో, పరపతి పంపిణీలో బాంకుల పాత్రను సముచితంగా గుర్తించడం జరిగింది. ప్రాంతీయపరంగా, రంగాల వారీ దృష్టి ఆధారంగా డిపాజిట్ల పెరుగుదలకు, పరపతి పంపిణీకి నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించడానికి ప్రారంభం జరిగింది. 14 వాణిజ్య బాంకుల జాతీయీకరణతో 85 శాతం బాంకింగ్ వ్యాపారం ప్రభుత్వ రంగంలోకి తేబడటం వల్ల పరపతి యంత్రాంగాన్ని స్థూల ఆర్థిక ప్రణాళిక యంత్రాంగంతో సమన్వయపరిచే ఉద్దేశంతో వనరుల సమీకరణకు, పరపతి ప్రణాళికకు నిర్దిష్టమైన అర్థవంతమైన ప్రయత్నం చేయడానికి అవకాశాన్ని ఇచ్చింది.

అయితే అంతకు పూర్వం బాంకులవంటి ద్రవ్య సంస్థలు డిపాజిట్ల సమీకరణ పట్ల శ్రద్ధ వహించడం నిజమే కాని, అట్టి ప్రయత్నాలు దేశంలోని పొదుపు ఆధారితను పెంచడానికి ఉద్దేశ పూర్వకంగా చేపట్టిన ప్రయత్నం కాకుండా కేవలం వారి వ్యాపారాన్ని మాత్రమే పెంచుకొనే ఉద్దేశంతో మాత్రమే చేయబడినాయి. జాతీయ స్థాయిలో డిపాజిట్లను సేకరించడానికి బాగా ఆలోచించి చేసిన ప్రణాళికలు లేవు. మొదటి ప్రణాళిక ముసాయిదాల్లో పొదుపు - ఆదాయ నిష్పత్తిని పెంచవలసిన ఆవశ్యకతను గుర్తించినప్పటికీ బాంకుల వంటి ద్రవ్య సంస్థల ప్రత్యేక పాత్రను సూచించలేదు. కాలాంతరంగా అంతకుముందు రిజర్వు బాంకు బాంకింగ్ రంగాన్ని బలపర్చడానికి, బ్రాంచీల విస్తరణ ద్వారా బాంకింగ్ అలవాటును సమాజంలో పెంచడానికి ప్రత్యేక కృషి సల్పిన మాట నిజమే కాని, దానినే వనరుల సమీకరణకు చేసిన ప్రణాళికా వంతమైన కృషిగా పేర్కొనలేం. అంతవరకు పాటించిన పరపతి విధానం కూడా తాత్కాలిక ప్రాతిపదికన సాంప్రదాయక ఋతు సంబంధమైన ప్రక్రియగా మాత్రమే కొనసాగింది. పరపతి విధానం ప్రధానంగా ప్రస్తుత ఆర్థిక స్థితి, స్వల్పకాలంలో పరపతి ప్రవాహంలో వచ్చే ఒడుదుడుకులను, లోటుపాట్లను ఉద్దేశించి చేపట్టిందే. దీనికి భిన్నంగా పరపతి ప్రణాళిక దీర్ఘకాలానికి, ఉన్నత ఆశయాలకు కేవలం డిపాజిట్ల సేకరణ, రంగాలవారీగా ప్రాంతీయపరమైన పరపతి పంపిణీయేకాకుండా, ప్రణాళిక కాలంలో తలపెట్టిన ఉత్పత్తి మిశ్రమం మరియు ఆశించిన పెట్టుబడి ప్రణాళికకు సంబంధించి ఉంటుంది. ఈ విధంగా ఒక అర్థవంతమైన వనరుల సమీకరణ పథకం ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల, వివిధ ప్రాంతాల మధ్య పరపతిని ప్రయోజనకారిగా, సమానంగా పంపిణీచేసే విధంగా ప్రణాళికలను పంచవర్ష ప్రణాళికల్లో నిర్దేశించుకున్న ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏర్పాటు చేయడం పరపతి ప్రణాళిక ముఖ్య సారాంశం (essence).

ప్రత్యేకమైన పరపతి ప్రణాళిక లేకపోయినట్లయితే ఎన్నో అవాంఛనీయ పోకడలు చోటుచేసుకొనవచ్చు పరపతి అసమాన పంపిణీ జరిగి ప్రాధాన్యతలేని రంగాల్లో (అంచనా వ్యాపారం) విస్తృతం చెంది ప్రాధాన్య రంగాలు (వ్యవసాయం, చిన్న పరిశ్రమలు) కుంటుపడవచ్చు. కొద్దిమంది పెద్ద వ్యాపారస్థులు వృద్ధి చెందగా, ఉద్యమిత్వ పెరుగుదల విస్తృత ప్రాతిపదికన కొనసాగకఆదాయ, సంపద వ్యత్యాసాలు సన్నగిల్లడానికి బదులు పెరుగుతాయి. అందువల్ల పరపతి ప్రణాళికను ఆర్థిక ప్రణాళికలతో అనుసంధాన పరచడం చాలాముఖ్యం. వాస్తవంగా పరపతి ప్రణాళిక అనేది ప్రణాళికాయుతమై ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో అంతర్భాగమై ఉండాలి.

## 23.6 స్థూల పరపతి ప్రణాళిక దశలు, ప్రణాళికలలో లోపాలు

### 23.6.1 మొదటి దశ – ద్రవ్య బడ్జెట్ తయారీ

పరపతి ప్రణాళికలోని మొదటి దశ పంచవర్ష ప్రణాళికతో సరిపోయే కాలంగా ద్రవ్య బడ్జెట్‌ను రూపొందించుటకు సంబంధించింది. ఈ ద్రవ్య బడ్జెట్ సాధారణంగా ప్రమేయంగా పెట్టుకున్న నిజ ఆదాయం మరియు ద్రవ్య అవసరం సంబంధంపై ఆధారపడి ఉంటుంది. నిజ ఆదాయంలోని పెరుగుదలకన్న ద్రవ్య అవసరం పెరుగుదల ఎక్కువగా ఉంటున్న కారణంచేత ప్రణాళికలో నిర్దేశించిన వృద్ధి రేటుకు అనుగుణమైన రీతిగా ద్రవ్యం అవసరాలను ఊహించి పరపతి ప్రణాళికను రచించవలసి ఉంటుంది.

గమనించిన ఉపాంత కరెన్సీ - డిపాజిట్ల నిష్పత్తి ధోరణిని ఆధారంగా మొత్తం ద్రవ్య విస్తృతిని అంచనా వేసిన పిదప, డిపాజిట్ వనరులను వేరుచేయవలసి ఉంటుంది. ఈ విధంగా అంచనా వేసిన డిపాజిట్లను డిపాజిట్ల ఆదాయ వ్యాకోచత్వం వంటి పద్ధతితో సరిచూడవచ్చు. బాంకింగ్ రంగం అభివృద్ధి చెందడం, ప్రాంతీయ మరియు రంగాల వారీ ఆర్థిక కార్యక్రమాలు విస్తృతి చెందినప్పుడు, మొత్తం ద్రవ్య వనరులలో డిపాజిట్ల శాతం పెరుగుతుంది. 1960 దశకంలో భారత దేశంలో మొత్తం ద్రవ్య వనరుల్లో డిపాజిట్ల వాటా 40 శాతం నుండి 60 శాతానికి పెరిగింది. అదే విధంగా ఉపాంత కరెన్సీ - డిపాజిట్‌ల నిష్పత్తి డిపాజిట్లకు అనుకూలంగా మారింది. 1961 - 62లో 33 : 67 ఉన్న ఈ శాతం 1971 - 72 నాటికి 25 : 75 కు మారింది.

### 23.6.2 రెండవ దశ - వనరుల పంపిణీ

ఐదు సంవత్సరాల్లో డిపాజిట్ వనరులను అంచనా వేసిన పిదప పరపతి ప్రణాళికలోని తర్వాతి దశ సమీకరించిన వనరుల పంపిణీకి సంబంధించింది. ఇక్కడ ప్రణాళికల లక్ష్యాలకు అనుగుణంగా పరపతి విధాన లక్ష్యాలను ప్రకటించవలసి ఉంటుంది. వీటి దృష్ట్యా, ప్రణాళికలో వివిధ రంగాల లక్ష్యాలకు అనుగుణంగా పరపతి పెరుగుదలను అంచనా వేయవలసి ఉంటుంది.

సమీకరించిన డిపాజిట్లన్నీ పరపతి పంపిణీకి లభించకపోవచ్చు. చట్టపరంగా, సాంప్రదాయకంగా కొన్ని పెట్టుబడులను బాంకులు అనివార్యంగా చేయవలసి ఉంటుంది. బాంకులు కొన్ని వనరులను రిజర్వు బాంకు వద్ద ఉంచవలసి వస్తుంది. కొంత భాగాన్ని నగదు, బంగారం ఆమోదించిన ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడిగా ఉంచవలసి వస్తుంది. ఇటువంటివి పోగా మిగిలిన 2/3 వంతు భాగాన్ని మాత్రమే పరపతిగా అందించే వీలుంటుంది. ఈ విధంగా లభించే పరపతిని వివిధ రంగాల మధ్య/ ప్రాంతాలమధ్య ప్రణాళికల్లో ఉద్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పంపిణీ చేయవలసి ఉంటుంది. తర్వాతి కాలంలో ప్రాధాన్య రంగాలకు కేటాయించవలసిన భాగాన్ని కూడ రిజర్వు బాంకు నిర్దేశించడం జరుగుతుంది. కాబట్టి పరపతి ప్రణాళికల్లో ఈ ప్రాధాన్య రంగానికి కేటాయించే భాగాన్ని ప్రత్యేక అంశం క్రింద పేర్కొనవలసి ఉంటుంది.

BRAOU

అయితే రంగం వారీ పరపతి సక్రమ పంపిణీ కొరకు వివిధ రంగాల పరపతి అవసరాలకు సంబంధించిన సమాచారం తెలియవలసిన అవసరం ఎంతైనా కలదు. ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల పరపతి డిమాండును అంచనా వేసేటప్పుడు ఇన్వెంటరీ - పరపతి నిష్పత్తి (inventory - credit ratio), అదనపు పరపతి - ఉత్పత్తి నిష్పత్తి (incremental credit - output ratio) వంటి సంఖ్యాశాస్త్ర పరికరాల సహాయంతో చేయవచ్చు. కాని ఇది కష్టంతో కూడిన పని. కారణమేమంటే దత్తాంశ కొరతతోపాటు ఈ నిష్పత్తుల్లో కాలాంతరంగా మార్పులు రావడం. అదే విధంగా పరిశ్రమలలో తాత్కాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక పరపతి అవసరాలున్నచోట బాంకులు ఎంతమేరకు అందించవలసి ఉంటుందో నిర్ధారించడం కూడ కష్టమైన పనే. అదే విధమైన ఇబ్బందులు వ్యవసాయ రంగంలోనూ ఏర్పడవచ్చు.

హేతుబద్ధమైన పరపతి పంపిణీలో ప్రాంతీయ పరపతి పంపిణీ ఒక ముఖ్య భాగం. రంగాల వారీ వ్యత్యాసాలతోపాటు పరపతి పంపిణీలో ప్రాంతీయ వ్యత్యాసాలున్నాయి. పరపతి - డిపాజిట్ల నిష్పత్తి కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో చాలా స్వల్పంగా ఉంది. ఈ అంశం దృష్ట్యా ప్రాంతీయ పరపతి ప్రణాళిక అనివార్యం అవుతుంది.

అయితే రంగాల వారీ పంపిణీలోగాని, ప్రాంతీయ పరపతి ప్రణాళికలో గాని పరపతి పరిమాణాన్ని గాని ఖాతాల సంఖ్యను గాని నిర్దేశించడం జరగదు. ఎందుకనగా టార్గెట్ల నిర్ధారణ (targeting) అనేది ఋణ సమీక్ష (appraisal) ప్రమాణాలకు విఘాతం కల్గిస్తుంది. వ్యక్తిగత బాంకులు కొంతవరకు ఈ విధమైన టార్గెట్లను నిర్దేశించుకోవచ్చు. అదే విధంగా ఉత్పాదిత సహిత పరపతిపై హెచ్చు ప్రాధాన్యతగాని, పరపతిని భద్రతనుండి వేరుచేస్తేగాని పరపతి సమీక్ష (appraisal) ప్రమాణానికి భంగం ఏర్పడకపోవచ్చు. ప్రాధాన్య రంగాల్లోగాని, సంఘటిత పరిశ్రమల్లో గాని సహాయాన్ని అందించినప్పుడు అది అవసరానుగుణ్యమైందా అన్న విషయాన్ని గమనించడం, తర్వాత అది 'ఆర్థికత' లేదా వికసనశీలత (economic viability)ను కలిగి ఉందా అన్న విషయాన్ని గమనించవలసి ఉంటుంది. ఈ విషయంలో 'లీడ్ బాంకు పథకం' క్రింద ప్రవేశపెట్టిన సూక్ష్మ స్థాయి ప్రణాళిక ఎంతైనా తోడ్పడగలదు. దానికి సంబంధించిన అంశాన్ని తర్వాత చర్చించడం జరిగింది.

### 23.6.3 చివరి దశ – పరపతి ప్రణాళిక అమలు

పరపతి ప్రణాళికలో అతి ముఖ్యమైన దశ అమలుకు సంబంధించింది. పరపతి ప్రణాళికలో వ్యక్తిగతమైన బాంకు పాత్ర ఏమి ? ప్రతి బాంకు వనరుల సమీకరణ, పరపతి పంపిణీ ఏమి చేయాలన్నదాన్ని జాతీయ పరపతి ప్రణాళిక వేర్వేరుగా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఇది ప్రధానంగా ఒక బాంకు స్వంత వ్యాపార ప్రణాళిక. అయితే ప్రతి బాంకు పరపతి ప్రణాళిక, పరిమాణం, వనరులు, ప్రాంతీయ విస్తృతి, నిర్వహించే విధులు, నిర్వహణ యంత్రాంగం వంటి అంశాలను దృష్టియందు ఉంచుకోవలసి ఉంటుంది. అయితే ప్రతి వ్యక్తిగత బాంకు ప్రణాళిక మొత్తం దేశ పరపతి ప్రణాళిక కానేరదు. స్థూల ప్రణాళికలను బాంకువారీ పరపతి నిర్ణయాలకు మార్చాలంటే (translate), పరపతి ప్రణాళిక అధికారి (రిజర్వు బాంకు) నైతికోద్బోధతోపాటు గుణాత్మక పరపతి నియంత్రణ పద్ధతులు, రీఫైనాన్స్ పథకాలు, క్రెడిట్ ఆథరైజేషన్ ప్రక్రియల వంటి వాటిని కూడ వాడవలసి ఉంటుంది. ఈ విషయంలో ఫలవంతమైన మార్గం ఏమనగా పరపతి ప్రణాళికతో సంబంధం ఉన్న అధికారులు, పరపతి ప్రణాళికను అమలు పరిచే వ్యక్తిగత పరపతి సంస్థలతో నిర్మాణాత్మక చర్చలు కొనసాగించడం.

### 23.6.4 రిజర్వు బాంకు పాత్ర

స్థూల స్థాయిలో ద్రవ్య బడ్జెట్, పరపతి ప్రణాళిక అధికారిగా రిజర్వు బాంకు గణనీయమైన పాత్రను నిర్వహిస్తుంది. ఈ విషయంలో రిజర్వు బాంకు అనేక చర్యలను ప్రారంభించింది.

BRAOU

1. రిజర్వు బాంకు ప్రణాళికా సంఘం రిసోర్సెస్ వర్కింగ్ గ్రూపుతో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళికల లక్ష్యాలకు అనుపుగా ఉండేటట్లు ఐదు సంవత్సరాల ద్రవ్య బడ్జెట్‌ను, పరపతి ప్రణాళికను తయారుచేస్తుంది.

2. వ్యక్తిగత బాంకుల్లో శిక్షణ పొందిన సిబ్బంది లోటు కారణంగా స్థూల ప్రణాళికను వ్యక్తిగత బాంకులకు వర్తింపజేసి అమలు జరపడం కష్టమైన పని. అందువల్ల తొలి దశలో రిజర్వు బాంకులో పరపతి ప్రణాళిక విభాగాన్ని ఏర్పాటు చేసి ఒక ప్రణాళిక నమూనాను తయారుచేసి అందించడం, ఎప్పటికప్పుడు బాంకుల అధికారులతో చర్చలు జరిపి బాంకు స్థాయి పరపతి ప్రణాళికలను మరింత అమలుయోగ్యమైన రీతిగా తయారు చేయడం, పరపతి విధానంపై అభిప్రాయాలను సేకరించడం జరుపుతుంది. ఆ విధంగా "భాగస్వామ్య ప్రణాళిక"ను తయారు చేయడానికి కృషి సల్పుతుంది.

3. పరపతి టార్గెట్లను నిర్దేశించుట పరపతి ప్రణాళికలో ఒక భాగం. వ్యక్తిగత బాంకు పరపతి ప్రణాళికను అమలు చేయడం క్రెడిట్ అప్రెయిజల్ పద్ధతిలో పునశ్చరణ, పరపతి మంజూరు, పరపతి చివరి వినియోగాన్ని పర్యవేక్షించుట వంటి వాటిని కలుపుకొని ఉంటుంది. కాబట్టి వీటి విషయంలో రిజర్వు బాంకు తగిన మార్పులను తీసుకొనివస్తుంది.

ఈ విధంగా రిజర్వు బాంకు విధానంలో పునశ్చరణ అవసరముంది. అందులో ప్రధానమైనవి:

(1) ప్రస్తుతం పబ్లిక్ రంగానికి కూడ వర్తించే విధంగా క్రెడిట్ ఆథరైజేషన్ విధానాన్ని సవరించడం;

(2) నూతన బిల్లు డిస్కౌంటింగ్ పథకాన్ని ప్రవేశపెట్టడం;

(3) గుణాత్మక పరపతి నియంత్రణ పద్ధతులను ప్రవేశపెట్టడం.

### 23.6.5 స్థూల స్థాయి పరపతి ప్రణాళికల్లో లోపాలు

అయితే స్థూల స్థాయిలో చేపట్టిన పరపతి ప్రణాళిక యంత్రాంగంలో కొన్ని లోటుపాట్లు లేకపోలేదు.

1. పరపతి ప్రణాళికను అమలుచేసే క్రమంలో వ్యక్తిగత బాంకులు తమ డిపాజిట్ అంచనాలను పెంచి చెప్పవచ్చు. ఈ విధంగా చేయడంవల్ల అప్పటికే నెలకొని ఉన్న ద్రవ్యోల్బణంకు ఆజ్యం పోసినట్లు కావచ్చు.

2. ద్రవ్య ప్రణాళిక భావన ఉన్నప్పటికీ. డిపాజిట్ల అంచనాలను తయారు చేయుటతో పరపతి ప్రణాళిక సాధకానికి ఆరంభ బిందువు అవుతుంది. అయితే ఇందులో రెండు రకాలైన దోషాలు దొర్లవచ్చు.

(a) డిపాజిట్ టార్గెట్లను తగ్గించడానికి సలహాలను ఇచ్చినప్పుడు బాంకులు, ఆ విధంగా చేసే క్రమంలో పరపతి విస్తృతి కూడ తగ్గిపోతుంది. అప్పుడు అప్పటికే తయారు చేసిన రంగాలవారీ ప్రణాళికకు అంతరాయం ఏర్పడుతుంది. ఇంకా డిపాజిట్ల యోచనలు మించిన బాంకులు కూడ నిధులను సమకూర్చలేకపోవచ్చు. మహా ఎక్కువైతే ట్రెజరీ బిల్లులలోగాని, నగదు నిల్వలలోగాని పెట్టుబడి పెట్టవచ్చు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యత్వం పెరుగుతుంది. ఇటువంటి స్థితిలో మనం ప్రత్యామ్నాయాన్ని సూచించవచ్చు. ఆర్థిక కార్యక్రమాల జోరును కొనసాగించడానికి కనీసంగా అవసరమేర్పడే మూల పరపతి స్థాయిని రిజర్వు బాంకు నిర్ణయించవచ్చు. ఇపుడు చేయదగింది ఏమంటే బాంకు వనరులనుండి స్థాయిని సాధించడమెట్లా అనేది ఆలోచించడం. ఒకవేళ బాంకులు కొన్ని కారణాల వల్ల డిపాజిట్ యోచనలను సాధించలేనప్పుడు, మూల పరపతి ప్రణాళికను రక్షించడానికి బాంకు వనరులకు తోడుగా అదనపు వనరులను కల్పించే సహజ ఏర్పాటు జరగాలి. దీనివల్ల ఆర్థిక కార్యకలాపాలకు పరపతిని కల్పించడం ఒకవైపు కాగా బాంకులు సమర్థవంతంగా పనిచేయడానికి తోడ్పడుతుంది.

3. భారత దేశంలో ఆర్థిక కార్యకలాపాలు వైవిధ్యాన్ని సంతరించుకొని ఉన్నాయి. భారత దేశంలో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో స్వయం - ఉపాధికి ఎంతో అవకాశం ఉంది. ఇటువంటి రంగాలకు వనరుల లోటుతో ప్రమేయం లేకుండా సమయానుకూల పరపతిని అందివ్వవలసి ఉంది. వాస్తవంగా సంభావ్య స్థూల జాతీయోత్పత్తి కొరకు పరపతిని అందించవలసిన సమయం ఆసన్నమైంది. కొంత ద్రవ్యోల్బణ శక్తి పెరిగినప్పటికీ, పరపతి అంతిమ ప్రయోజనం పట్ల జాగ్రత్త వహించినట్లయితే, ఆర్థిక వ్యవస్థ ఇంకా వేగంగా పుంజుకుంటుంది.

4. ఆర్థిక కార్యకలాపాల స్థాయి (Range) : ప్రాథమిక, ద్వితీయ, గౌణ రంగాల్లో కార్యకలాపాల విస్తృతిలో తేడాలుంటాయి. వాణిజ్య, పారిశ్రామిక రంగాలు కొంత వేగవంతమైన వృద్ధి సాధించే అవకాశం ఉన్నందువల్ల, దీనికి భిన్నంగా వ్యవసాయ రంగంలో కార్యకలాపాల పెరుగుదల కొంత మందకోడిగా సాగుతున్నందువల్ల రంగాలవారీ పరపతి అవసరాల్లో వ్యత్యాసాలు ఏర్పడతాయి. ఇట్టి తేడాలను సరిగా గమనించకపోయినట్లయితే పగపతి ప్రణాళిక కొంత వైఫల్యం చెందే అవకాశం ఉంది.

పరపతి ప్రణాళికలు ఎంతవరకు విజయవంతం అవుతున్నాయన్న అంశం పై అవరోధాలను అధిగమించే తీరుపైన, అవి అమలు జరిగే తీరుపైన, పరపతి వ్యవస్థ సామర్థ్యంపైన ఆధారపడి ఉంటుంది. అయితే స్థూల స్థాయి ప్రణాళిక విజయవంతం స్థాయి సూక్ష్మ స్థాయిలో రచించబడి నిర్వహింపబడుతున్న ప్రాంతీయ పరపతి ప్రణాళికలపై కూడ ఆధారపడి ఉంటుంది. దానికి సంబంధించిన వివరాలు కింద చర్చించబడినాయి.

## 23.7 సూక్ష్మ స్థాయి పరపతి ప్రణాళికలు

### 23.7.1 లీడ్ బాంకు పథకం (Lead Bank Scheme)

భౌగోళికంగాను, విధులను అనుసరించిగాను భారతదేశంలో వైవిధ్యం కలిగి ఉన్న కారణంచేత ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణమైన ఆర్థిక కార్యకలాపాల విస్తృతి, దాన్ని పోషించడానికి కావలసిన సంస్థాగత పరపతి వ్యవస్థను పటిష్టపరచడం అవసరం. అందువల్ల ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా సూక్ష్మ స్థాయి ప్రణాళికలను రచించి, అమలు చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. ఆ లక్ష్యం మేరకు రూపొందించిందే 'లీడ్ బాంకు పథకం".

**లీడ్ బాంకు పథకం ఆవిర్భావం**

సాంద్రమైన స్థల ప్రాతిపదికగల పద్ధతి నుండి పరిణమించిందే లీడ్ బాంకు పథకం. ఆచార్య డి. ఆర్. గాడ్గిల్ గారి నేతృత్వంలో జాతీయ పరపతి మండలి అధ్యయన బృందం సామాజిక లక్ష్యాలను అమలు పరిచే యంత్రాంగపు నిర్మితి భాగంగా సూచన చేసింది. దేశంలోని బాంకింగ్ పరపతి అభివృద్ధికి ప్రణాళికలను, పథకాలను 'స్థల ప్రాతిపదిక' పై చేపట్టవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ పథకం వెనక ఉన్న లక్ష్యం ఏమనగా వాణిజ్య బాంకుకు ఒక జిల్లాను కేటాయించడం, అక్కడ కన్సార్టియం లీడర్‌గా కేంద్రీకరించడం, సమీకృత బాంకింగ్ పరపతి సౌకర్యాల కల్పనలో ముందు స్థాయి (pace setter) లో ఉంచడం. లీడ్ బాంకు పథకం కింద ప్రతి బాంకు "అభివృద్ధి బాంకు"గా, పబ్లిక్ సర్వీసు బాంకింగ్, బాంకరుగా, ప్రభుత్వ సేవకుడుగా అనుకోబడుతుంది. లీడ్ బాంకింగ్, ఇంకొక అడుగు ముందుకు వేస్తుంది. ఇది బాంకింగ్ రంగంలో నాయకత్వాన్ని కల్పించడమే కాకుండా అప్పగించిన ప్రాంతంలో సాధారణ అభివృద్ధిని తీసుకొని వచ్చే బాధ్యత కూడ దానికి అప్పజెప్పబడింది. ప్రతి లీడ్ బాంకు కేటాయించబడిన జిల్లాలో బాంకింగ్ అభివృద్ధి అవకాశాల సర్వేను నిర్వహించాలి; పరపతి లోటును గుర్తించాలి. అట్లాగే సామూహిక జిల్లా అభివృద్ధికి సారథ్యం వహించాలి.

B R A O U

ఆగస్టు 1969లో రిజర్వు బాంకు యఫ్. కె. యఫ్. నారిమన్ అధ్యక్షతన ఒక బాంకర్ల కమిటీని ఏర్పాటు చేసింది. బాంకింగ్ విషయంలో వెనుకబడిన జిల్లాల్లో తగినంతగా బాంకింగ్ సౌకర్యాలను ఏర్పాటుచేయడానికి ఒక పథకాన్ని తయారుచేయడానికి ఆ కమిటీ ఉద్దేశింపబడింది. ఆ కమిటీ సూచనలను అంగీకరించి రిజర్వు బాంకు 'లీడ్ బాంకు పథకాన్ని' ప్రవేశపెట్టింది. 1969లో ప్రవేశపెట్టిన లీడ్ బాంకు పథకం వల్ల జిల్లా ప్రణాళిక లేదా సూక్ష్మ స్థాయి ప్రణాళికకు ఒక నిర్దిష్టమైన రూపం వచ్చింది. ఆర్థికాభివృద్ధికి పనిచేసే సాధనంగా నూతన బాధ్యతను బాంకులకు అప్పజెప్పడం జరిగింది. బాంకు వసతులు లేని గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య బాంకుల బహుళ విస్తరణ, ఏ భౌగోళిక ప్రాంతంలో కూడ బాంకు సౌకర్యాల లోటు లేకుండా చేయాలనే జాతీయ సంకల్పం దృక్పథంలో ఈ అంశాన్ని గమనించాలి. లీడ్ బాంకు పథకంలో పొందుపరిచిన రీతిగా జిల్లా పరపతి ప్రణాళికను అమలు పరచడం వల్ల బాంకులు, ఇతర ద్రవ్య సంస్థలు దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో స్వయంపోషకమైన అభివృద్ధి ప్రక్రియను ప్రారంభించవచ్చునని (trigger) ఆశించడం జరిగింది. ఈ పథకం క్రింద తయారు చేయబడిన పరపతి ప్రణాళిక ప్రాంతీయ గ్రామీణ బాంకులను కలుపుకొని 483 జిల్లాల్లో అమలు పరచబడుతుంది. వాటి ఆధీనంలో దాదాపు 95 శాతం ప్రభుత్వ రంగం ద్వారా నిర్వహించబడుతుంది.

వివిధ బాంకులకు జిల్లాలను కేటాయించే విషయంలో రిజర్వు బాంకు అనేక అంశాలను దృష్టిలో పెట్టుకొంది. బాంకు వ్యవహారాలకు వికసనశీలతను, ఆర్థికతను కల్పించే రీతిగా జిల్లాల దూరం, అభివృద్ధి పనులను నిర్వహించడానికి బాంకుల విస్తరణకు నియంత్రణ కేంద్రాలను కల్పించడం, బాంకుల వనరుల ఆధారిత బాధ్యతను అప్పగించిన బాంకుల సంఖ్య మధ్య పొత్తు కుదిర్చే అంశాల ప్రాతిపదికన జిల్లాలను కేటాయించడం జరిగింది.

**లీడ్ బాంకు పథకం లక్ష్యాలు, విధులు**

ఈ పథకం కింద బాంకులు అన్ని జిల్లాల్లోనూ అభివృద్ధి చెందడానికి గల అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. లీడ్ బాంకులు ఆర్థిక వ్యవస్థలోని ఉద్యోమిత్వపు ప్రవృత్తులను పోషించడానికి పూనుకొంటాయి. వాటికి సంబంధించిన జిల్లాల్లో శాఖల విస్తరణ, వనరుల సమీకరణ, పరపతి పంపకం వంటి కార్యక్రమాలను, అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించిన ప్రత్యేకమైన పథకాలను రూపొందించడానికి ఈ బాంకులు జిల్లా వారీ ప్రణాళికలను తయారు చేస్తున్నాయి. ఈ పథకం కింద కేటాయించిన జిల్లాల్లో పరిశీలనా నివేదికలను, పరపతి ప్రణాళికలను తయారు చేసి అమలు పరచడం జరుగుతుంది. తొలి దశలో ఈ నివేదికలను తయారు చేయడంలో అస్సాం, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ వంటి వెనుకబడిన రాష్ట్రాలలోని జిల్లాలకు ప్రాముఖ్యం చూపడం జరిగింది.

లీడ్ బాంకులు జిల్లా స్థాయిలో సంప్రదింపుల సంఘాలను నెలకొల్పుతాయి. ప్రాధాన్యతా రంగాలలో పరపతిని సమకూర్చడం, జిల్లాలో బాంకులు సహాయం చేయడానికి అనువుగా ఉండే పథకాలను (bankable scheme) గుర్తించడం, వాటికి పరపతిని అందజేయడానికి అనువైన పద్ధతులను రూపొందించడం, ఋణాలు తీసుకొనేవారిని గురించి సమాచారం సేకరించడం మొదలైన విషయాలను చర్చించడానికి ఈ సంఘాలు ఉపయోగకరంగా ఉంటాయి.

**లీడ్ బాంకు పాత్ర**

బాంకింగ్ అభివృద్ధికై అవకాశాలను సర్వే చేయడం, వృద్ధి కేంద్రాలను గుర్తించి బాంకు బ్రాంచీలను విస్తరించడం, వికసనశీలత (viable),సంభావ్య వికసనశీలత (potentially viable) ప్రాతిపదికలను నిర్ధారించి

పరపతి సౌకర్యాలను విస్తరించడం, పెరుగుతున్న ఆదాయాల నుండి డిపాజిట్లను సమీకరించడం వంటి విషయాల్లో నాయకత్వ పాత్రను వహించే బాధ్యత 'లీడ్ బాంకు' పై ఉంది. ప్రాథమిక ధ్యేయం ఏమంటే ప్రాంతాల అభివృద్ధి అవసరాలను జాతీయ ప్రాధాన్యతలను అనుసరించి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాంకింగ్ వ్యవస్థ సేవలను అందించడం. స్థూలంగా చెప్పాలంటే బాంకుల మాధ్యమంగా జిల్లా అభివృద్ధిని ప్రోత్సహించడం. జిల్లాకు సంబంధించి పూర్తి అవగాహనను రూపొందించుకోవడం, అట్టి అవగాహన ఆధారంగా ఉచితమైన చర్యాత్మక పథకాలను రూపొందించడం లీడ్ బాంకుల సత్వర చర్య అయింది. ఈ అవసరానికై వారికి ఇచ్చిన జిల్లాల్లో అక్కడి వనరులను, సంభావ్యాలను అంచనా వేయడానికి సత్వర సర్వేను (quick and impressionistic survey) లీడ్ బాంకులు చేపట్టవలసి వచ్చింది. అంతేగాకుండా లీడ్ బాంకు అనేది కన్సార్టియం నాయకునిగా ఉంటూ ఇతర బాంకుల, ఇతర ద్రవ్య సంస్థల (సహకార పరపతి రంగం) సహకారాన్ని పొందడం, జిల్లా యంత్రాంగంతో మధ్యవర్తిగా పని చేయడం. ఏ జిల్లాలోనైనా 'లీడ్ బాంకు' విజయం అనేది ఆ ప్రాంతంలో ఆ బాంకు కార్యాలయాలు ఏం పని చేశాయన్న దానిమీదనే కాకుండా బాంకుల మాధ్యమం ద్వారా ప్రభావితం చేయగల జిల్లా ఆర్థిక వ్యవస్థ పూర్తి మెరుగుదలపై ఆధారపడుతుంది.

**లీడ్ బాంకు పథకం - బలహీనతలు**

లీడ్ బాంకు పథకాన్ని ప్రవేశపెట్టిన తొలి దశలో సరియైన పద్ధతిలో మొదలు కాలేదు. లీడ్ బాంకు పథకం యొక్క పరిధిని తప్పుగా అర్థం చేసుకోవడం జరిగింది. అదే విధంగా అవి ఆర్థిక, సాంఘిక, సాంకేతిక సర్వేలను నిర్వహించే స్థితిలో ఉండేవికావు. లీడ్ బాంకు యంత్రాంగం కూడ విస్తృతమైన సర్వేలను చేబట్టే స్థితిలో ఉండేవికావు. అందువల్ల సమగ్రమైన ప్రాంతీయ సర్వేలను నిర్వహించలేకపోయాయి.

ప్రణాళికా విధానం విధి, అలాగే బాంకుల విధి వేర్వేరుగా ఉంటాయి. జిల్లాలో తయారుచేసిన జిల్లా ప్రణాళిక యంత్రాంగానికి అనుగుణమైన పద్ధతిలో బాంకులు నడుచుకోవాలి. జిల్లా ప్రణాళిక చట్రంలో మాత్రమే లీడ్ బాంకు ఇతర ద్రవ్య సంస్థల సహాయంతో పరపతిని అందించడంలో ద్రవ్య నాయకుడుగా పనిచేయగలడు. ప్రణాళిక రచన దాని అమలు దశల్లో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా జిల్లా కలెక్టరు అతని సిబ్బంది జిల్లా ప్రణాళికకు ఇంఛార్జిగా ఉంటారు. అయితే పరపతి ప్రణాళిక అందులో భాగమే అవుతుంది. లీడ్ బాంకు కేవలం జిల్లా పరపతి ప్రణాళిక తయారీలో సహాయపడగలడు. వీటన్నింటి సమన్వయం సాధించడం కష్టమైన పని. బాంకులనుండి ఏం ఆశిస్తాం అనే విషయంలో కొంత జాగ్రత్త (caution) అవసరం. పరపతి ప్రణాళిక ఆ ప్రదేశంలో లభించే అవస్థాపన సౌకర్యాల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. ఆ సౌకర్యాలను తగినంతగా ఏర్పాటు చేయునప్పుడు లీడ్ బాంకు పరిమితమైన విజయాన్ని సాధించగలదు. బాంకుల లాభదాయకత కొంత దెబ్బతింది. చాలా గ్రామీణ ప్రాంతాల్లో బ్రేక్ - ఈవెన్ బిందువును (break even point) చేరుకోలేకపోయినాయి.

జిల్లా సమన్వయ సమితి నిర్వహణ యాంత్రికంగా నిర్వహింపబడేదిగాను, రొటీన్ విషయాలను చూసుకొనేదిగాను తయారైంది. చర్చల్లో స్పష్టత లోపించడం, కమిటీల విధులు, అధికారాల పట్ల సరియైన అవగాహన లేకపోవడం, లీడ్ బాంకులు తగినంత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయకపోవడం వంటి కారణాల వల్ల 'లీడ్ బాంకు పథకం' అనుకున్నంత విజయాన్ని సాధించలేకపోతుందని చెప్పవచ్చు. పైన పేర్కొన్న విధంగా ఆ పథకం ఎదుర్కొంటున్న ప్రతిబంధకాలను తొలగించి, బలహీనతలను సరిచేసుకొని జిల్లా పరపతి ప్రణాళికలను మరింత సమర్థవంతంగాను నిర్వహించే అవకాశం ఉంది.

**లీడ్ బాంకు పథకం విజయాన్ని నిర్ణయించే అంశాలు**

లీడ్ బాంకు పథకం ఎంతవరకు విజయవంతం అవుతుందన్న విషయం అనేక అంశాలపై ఆధారపడి ఉంది.

BRAOU

1. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే చర్యలపై ఆధారపడి ఉంటుంది. రిజర్వు బ్యాంకు ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతున్న ఆదేశ సూత్రాలకు అనుగుణమైన మార్పులు చేయడం, సాధారణ అవస్థాపన సౌకర్యాలను కల్పించడం అనివార్యమౌతుంది. అనుభవంలో ఈ విధమైన సమస్యలు అనేక సందర్భాల్లో ఎదురైనట్లు నివేదికలు తెలుపుతున్నాయి.

2. అదే విధంగా జిల్లా యంత్రాంగం IRDP వంటి పథకాల పరపతి కార్యక్రమానికి అవసరమైన మద్దతును ఇవ్వవలసి ఉంటుంది. జిల్లా కలెక్టరు అధ్యక్షుడు కావడం వల్ల దీన్ని సాధించడం కొంత సులువు కావచ్చు.

3. బాంకులు దీర్ఘకాలిక ఋణ సంస్థల మధ్య సమన్వయం అవసరం. ఈ సమన్వయ ప్రక్రియ వికసనశీలత అధ్యయనం మొదలుకొని వ్యక్తిగత పథకం అమలు పూర్తి అయ్యేంతవరకూ అవసరపడుతుంది. పరిశ్రమల అభివృద్ధి బాంకు వంటి సంస్థలతో సమన్వయం అనివార్యం.

4. 'లీడ్ బాంకు' ఆ జిల్లాలో ఉన్న బాంకులు ఇతర ద్రవ్య సంస్థలతో కల్గి ఉన్న సంబంధాలపై కూడ దాని విజయం ఆధారపడి ఉంటుంది. అదే విధంగా జిల్లా అభివృద్ధి ఏజెన్సీలతో కల్గి ఉన్న సంబంధంగాని, వివిధ బాంకులు, అభివృద్ధి సంస్థల మధ్య ఉన్న సంబంధంగాని అంతే ముఖ్యమైంది. పరపతి ప్రణాళిక సరిగా అమలుకాకపోయినప్పుడు దానికి బాధ్యతను ఇతరులపైకి తోయడం జరుగుతుంది.

5. అనేక పథకాల / పరపతి ప్రణాళికల విషయంలో 'లీడ్ బాంకు' స్వయంగా సాధించిన ప్రగతిపై కూడ దీని విజయం ఆధారపడి ఉంటుంది. అపుడే సమన్వయకర్తగా దానికి నైతిక బలం ఏర్పడుతుంది.

6. 'లీడ్ బాంకు' యంత్రాంగం సరిపోయినంతగా లేదు. అందువల్ల దాన్ని విస్తృతపరచడం జరగాలి. లీడ్ బాంకు అధికారి తనకు సంబంధంలేని పాలనా విషయాలపై పనిని పెంచి అతని మొత్తం పని భారాన్ని పెంచకూడదు. అందువల్ల నాయకత్వ శక్తి సన్నగిల్లుతుంది.

ఇటువంటి విషయాల పట్ల అన్ని వైపుల నుండి సహాయ సహకారాలు లభించి ఒక్క త్రాటిపై నడిచే దృక్పథాన్ని అలవరచుకొన్నప్పుడే ఈ పథకం మరింత విజయవంతం కాగలదు.

## 23.7.2 ప్రాంతీయ పరపతి ప్రణాళిక విధానం - చర్యాత్మక ప్రణాళికల తయారీ

జిల్లా స్థాయిలో పరపతి ప్రణాళికలను ఇదివరకు చెప్పినట్లు లీడ్ బాంకు చేపట్టవలసి ఉంది. అయితే అమలుకు యోగ్యమైన చర్యాత్మక ప్రణాళికలను లీడ్ బాంకు ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల, ద్రవ్య సంస్థల సమన్వయ పూర్తి ప్రయత్నాల ఫలితంగా తయారు చేయాలి. ఈ విషయంలో మొదట ఆ ప్రాంతానికి సంబంధించిన క్షుణ్ణమైన, లోతైన అధ్యయనాన్ని జరపాలి. దాని ఆధారంగా తయారు చేసిన నివేదికలే ఆ ప్రాంత అభివృద్ధికి ఆధారంగా ఉంటాయి. ఈ అధ్యయనాన్ని జరిపేటప్పుడు కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

1. ఆ ప్రాంతానికి సంబంధించి ప్రస్తుతం లభించే ముందు ఉండే సహజ వనరులు, అవస్థాపన సౌకర్యాలను విపులంగా అంచనా వేస్తాయి. అది జిల్లాలోని అభివృద్ధి సంభావ్యతను సూచిస్తాయి.

2. ఆ ప్రాంత అభివృద్ధితో సంబంధమున్న సంస్థల విధులను, పనితీరును, అవి నిర్వహిస్తున్న పనుల పరిధిని, పనుల్లో లోపాలను పరిశీలిస్తాయి. ఇటువంటి విశ్లేషణవల్ల సమీకృతమైన చర్యాత్మక ప్రణాళికను రూపొందించే అవకాశం ఏర్పడుతుంది.

BRAOU

3. వృద్ధి కేంద్రాల ఎంపిక పొరుగు గ్రామాల అభివృద్ధికి ప్రోత్సాహాన్ని కల్పిస్తాయి. అసెంబ్లింగ్, మార్కెటింగ్, ప్రాసెసింగ్, స్టోరేజీ, పంపిణీ, విస్తరణ మరియు గౌణసేవలు, పరపతి మొదలగు అంశాలను వృద్ధి కేంద్రాలవద్ద ఏర్పాటు చేయడం వల్ల గ్రామాలకు సౌకర్యాలు ఏర్పడతాయి.

4. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ఆ ప్రాంతంలోని అన్ని సంస్థలు అభివృద్ధి కోసం అమలుకు యోగ్యమైన చర్యాత్మక కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేయడం. భౌగోళిక అంశాలు, ఎల్లలు, భూమి ఉపయోగం, సహజ వనరులు, ప్రస్తుత మరియు ప్రణాళిక వేసిన అవస్థాపన సౌకర్యాలు, శక్తి లభ్యత, నీరు, భౌతిక ఉత్పాదకాలు, ఉద్యమిత్వ సామర్థ్యం, నైపుణ్యం ఉన్న, నైపుణ్యంలేని శ్రామిక శక్తి, సాంఘికార్థిక లక్షణాలు; ప్రభుత్వం, బాంకులు, ఇతర సంస్థల వద్ద ద్రవ్య, సాంకేతిక వనరుల లభ్యత వంటి విషయాలపై సమగ్ర సమాచార సేకరణ జరగాలి.

5. సమీప భవిష్యత్తులో ద్రవ్య మిగుళ్ళను సృష్టించగల కార్యకలాపాలను గుర్తించి సమీకృత ప్రణాళికలో చేర్చడం.

6. అన్ని అనుకూల బాంకు కార్యక్రమాల సాంకేతిక వీలును, ఆర్థిక 'స్వావలంబన' లను మూల్యాంకనం చేయడం ప్రతి ఆర్థిక కార్యకలాపానికి సంబంధించి సాంకేతిక, ఆర్థిక వివరాలతో కూడిన ప్రాజెక్టు ప్రొఫైళ్ళను తయారు చేయడం.

7. బాంకు ఋణాలకు అనువైన పథకాల మొత్తం మూలధన, పరపతి అవసరాలను అంచనా వేయడం మరియు వాణిజ్య బాంకులు, ఇతర ద్రవ్య సంస్థల మధ్య వాటాలను కేటాయించడం.

8. ఒక్కొక్క బాంకు ఋణానికి అనువైన పథకానికి రానున్న ఐదు సంవత్సరాలు బాంకు పరపతి పంపిణీ కార్యక్రమాన్ని తయారుచేయడం. కార్యక్రమ స్వభావం, మొత్తం మూలధన / పరపతి అవసరాలు, ప్రాజెక్టు ఫలన కాలం, ఊహించిన లాభదాయకత వంటి విషయాల పరిగణన ఆధారంగా ఈ కార్యక్రమాన్ని నిర్దేశించడం.

9. సమర్థవంతమైన చర్యాత్మక ప్రణాళిక అమలు, ముఖ్యంగా ప్రణాళికలో పేర్కొన్న బాంకు ఋణానికి అనువైన పథకాల అమలు సక్రమంగా జరగడానికి బాంకులు చేపట్టవలసిన అదనపు అభివృద్ధి సౌకర్యాలను సిఫారసు చేయడం.

10. అదే విధంగా దీర్ఘదర్శి ప్రణాళికను తయారుచేయడం,తద్వారా ప్రాంత అభివృద్ధికి కృషి సల్పడం.

ఈ విధంగా చేబట్టే అధ్యయనాలు (సర్వేలు) అవే అంతం కాదు. అవి నిజమైన చర్యాత్మక కార్యక్రమాన్ని చేపట్టడానికి ఆరంభ బిందువు మాత్రమే అవుతాయి. జిల్లా సర్వేలో సేకరించిన సమాచారం ఆధారంగా సర్వేలో గుర్తించిన వృద్ధి కేంద్రాల్లో బాంకింగ్ సౌకర్యాలను స్థాపించడం, వృద్ధి పరచడానికి వివిధ దశల్లో పథకాలను తయారు చేయవలసి ఉంటుంది. దీని కొరకు ఇతర వాణిజ్య బాంకుల అభివృద్ధి, ద్రవ్య సంస్థల సహకారాన్ని అర్థించడం తప్పనిసరి. కన్సార్టియమ్ లీడర్ అయిన లీడ్ బాంకు ఎక్కువ భారాన్ని వహించినప్పటికీ, ఇతర సంస్థలు కూడ బాధ్యతను స్వీకరించవలసి ఉంటుంది. సర్వేలో సేకరించిన సమాచారం ఆధారంగా వివిధ ఆర్థిక కార్యక్రమాలను గుర్తించి, సమాజంలోని వివిధ రంగాలకు అందించే విధంగా ఉత్పత్తిదాయక పరపతి పంపిణీకి అర్థవంతమైన పథకాలను రూపొందించాలి. ఇది కొంతవరకు కష్టమైన పని. జిల్లాలో ప్రధానంగా ప్రణాళికా విభాగం వారు తయారు చేసిన జిల్లా అభివృద్ధి ప్రణాళికను అనుసరించి జిల్లా పరపతి ప్రణాళికను తయారు చేయవలసి ఉంటుంది.

BRAOU

మొదటి రౌండులో రిజర్వు బాంకునుండి ప్రమాణీకృత సూచనలు లేకుండానే లీడ్ బాంకులకు జిల్లా పరపతి ప్రణాళికలను తయారుచేయవలసిందిగా పురమాయించడం జరిగింది. అందువల్ల వివిధ బాంకులు వివిధ రీతుల ద్వారా, పద్ధతుల ద్వారా, వివిధ కాల భేదాలతో జిల్లా పరపతి ప్రణాళికా ముసాయిదాలను తయారుచేసినాయి. అందువల్ల అవి అనుసరించిన పద్ధతుల్లో తేడాలు ఎక్కువగా పొడ చూపినాయి.

ఒకే రీతిగా జిల్లా పరపతి ప్రణాళికలను తయారు చేయడానికి 1980 - 82 సంవత్సరాల కాలానికి పోల్చడానికి అనువుగా ఉండడానికి నిర్దిష్టమైన సూచనలను చేయడం జరిగింది. రెండవ రౌండులో చేబట్టిన జిల్లా పరపతి ప్రణాళికలను జిల్లా యంత్రాంగం తయారుచేసి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను అనుగుణంగా తయారు చేయాలని సూచించడం జరిగింది. 1983 - 85 కాలానికి చేపట్టిన జిల్లా పరపతి ప్రణాళికల్లో సమీకృత గ్రామీణాభివృద్ధి పథకం (IRDP), SC & ST, DRI లబ్ధిదారులను కలుపుకొని బలహీన వర్గాల ప్రజల ఋణ పథకాలకు ప్రాముఖ్యతను ఇవ్వవలసిందిగా ఆదేశించడమైంది. ఆ తర్వాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక ప్రాంత / వర్గ ప్రాతిపదికగల అభివృద్ధి పథకాలకు (JRY, TRYSEM) అనువుగా జిల్లా పరపతి ప్రణాళికలను తయారుచేసే విధంగా ఆదేశించారు.

### 23.7.3 జిల్లా సమన్వయ సమితి (District Coordination Committee)

జిల్లాలోని వివిధ వాణిజ్య బాంకులు, సహకార సంఘాలవంటి ఇతర ద్రవ్య సంస్థలు, ఇతర అభివృద్ధి ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని సమకూర్చి పరపతి ప్రణాళిక రచన, నిర్వహణ అమలు సరిగా జరిగేటట్లు చూడటానికి జిల్లా స్థాయిలో "జిల్లా సమన్వయ కమిటీ" (District Coordination Committee) లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటిని సుమారుగా 3 నెలలకు ఒకసారి సమావేశపరుస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు, వాణిజ్య బాంకులు, ఇతర ద్రవ్య సంస్థల మధ్య చర్యలు విధాన తయారీలో సమన్వయ యంత్రాంగంగా పనిచేస్తాయి. అదే విధంగా జిల్లా పరపతి ప్రణాళికలను రచించి అమలు జరిపే ప్రయత్నంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఒక వేదికగా పని చేస్తుంది. ఈ కమిటీకి జిల్లా కలెక్టరు చైర్మన్‌గా ఉండగా, లీడ్ బాంకు అధికారి కన్వీనర్‌గా ఉంటాడు. NABARD ప్రతినిధి, DCC అధ్యక్షులు, ప్రాంతీయ గ్రామీణ బాంకు, వాణిజ్య బాంకు ప్రతినిధులు ఐదారుగురు, AAP, DRDA, DIC, వ్యవసాయం, పశు సంవర్ధక శాఖవంటి ప్రభుత్వ శాఖల ప్రతినిధులు ఐదారుగురు ఇందులో సభ్యులుగా ఉంటారు.

B RAOU

**జిల్లా సమన్వయ సమితి విధులు**

జిల్లా పరపతి ప్రణాళిక రచనలో, నిర్వహణలో, అమలులో క్రియాశీలకమైన పాత్ర నిర్వహిస్తుంది. దీని ప్రత్యేక విధులు ఏవంటే :

1. సంభావ్య బాంకు ఋణాలకు అనువైన పథకాలను గుర్తించడం, జిల్లా పరపతి ప్రణాళికలో చేర్చదగిన పథకాలను తయారుచేయటం.
2. జిల్లా పరపతి ప్రణాళికను ఆమోదించడం.
3. సమీకృత గ్రామీణాభివృద్ధి పథకాన్ని ఆమోదించటం.
4. జిల్లా పరపతి ప్రణాళిక పరపతి వాటాలను కేటాయించటం.
5. AAP, IRDP వంటి పథకాలను అమలు పరచడానికి భౌతికంగా, ద్రవ్య పరంగా అభివృద్ధిని పర్యవేక్షించటం.
6. అదే విధంగా అవస్థాపన, ఉత్పాదకాలను అందించడంలోని సమస్యలను, అడ్డంకులను గుర్తించడం, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకొనటం.

7. IAP, IRDP పథకాల్లో బాంకువారీ పరపతి పంపిణీని సమీక్షించటం.

8. ఋణ దరఖాస్తుల మంజూరీలో ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించటం; దరఖాస్తులను దశలవారీగా పంపించే ఏర్పాటు చేయటం; దరఖాస్తులు విత్త సంవత్సరం ఆఖరులో కేంద్రీకృతం అయ్యేటట్లు చూడకూడదు.

9. సబ్సిడీలను నిర్వహించి సకాలంలో చెల్లించే విధంగా చూడాలి.

10. ద్రవ్య సంస్థల ఋణ వసూళ్ళను పర్యవేక్షిస్తూ, ఋణ వసూళ్ళు చక్కగా జరగడానికి సహకరించండం.

11. జిల్లా స్థాయిలో పరిష్కారం కాలేని సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర స్థాయి తత్సంబంధిత యంత్రాంగంతో చేపట్టడం.

12. బాంకు బ్రాంచీలను ఏర్పాటు చేయడానికి బాంకులు లేని ప్రాంతాలను గుర్తించడం, ఆ తర్వాత కూడ బాంకు బ్రాంచీల ప్రగతిని సమీక్షించడం.

13. క్షేత్ర స్థాయిలో వివిధ పథకాల అమలును మూల్యాంకనం చేయడం, అదే విధంగా గుర్తించిన లబ్ధిదారులకు సమకూరిన ప్రయోజనాలను మూల్యాంకనం చేయడం.

భౌతికమైన లక్ష్యాల సాధనను, ప్రభుత్వం నుండి అందిన సహాయాన్ని జిల్లా స్థాయిలో బేరీజు వేయవలసి ఉంటుంది. ఈ రెండు అంశాలను జిల్లా సమన్వయ మండలి ఓర్పుతో పర్యవేక్షించినప్పుడు అదే విధంగా ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలను చేపట్టినట్లయితే ఆ మండలి పనితనాన్ని గణనీయంగా మెరుగుపరచవచ్చు. లీడ్ బాంకు పథకం అందించిన సమాచారం ఆధారంగా ఈ పర్యవేక్షణను సాధించవచ్చు.

## 23.7.4 జిల్లా పరపతి ప్రణాళికలు - మూల్యాంకనం

ప్రస్తుతం జిల్లా పరపతి ప్రణాళిక మూల్యాంకనం కాలాంతరంగా జిల్లా సమన్వయ మండలి చేయబడుతుంది. తరచుగా జరిగే జిల్లా స్థాయి సమీక్షా సమావేశాల్లో వివిధ బాంకులు జిల్లా పరపతి ప్రణాళికను ఎలా అమలు పరుస్తున్నారన్న విషయాన్ని పరిశీలిస్తుంది. అన్ని సమీక్షలు, మూల్యాంకనంలు, బేరీజులు ద్రవ్య సంబంధమైన లక్ష్యాలకు మాత్రమే పరిమితం చేయడం జరుగుతుంది. కాని భౌతిక లక్ష్యాల వైపు పోవడంలేదు. కాబట్టి మూల్యాంకనం పద్ధతిని మెరుగు పరచి అటు ద్రవ్య ఇటు భౌతిక లక్ష్యాలను సమీక్షించేటట్లు చేయాలి. ప్రస్తుత మూల్యాంకనంలో ఇంకొక ముఖ్యమైన లోపం ఏమనగా జిల్లా పరపతి ప్రణాళికలో బాంకులు వాటి లక్ష్యాలు, సాధించిన ప్రగతికి సంబంధించి మాత్రమే ప్రధానంగా జరుగుతుంది. అయితే జిల్లా పరపతి ప్రణాళికలను అమలుతో సంబంధమున్న ఇతర అభివృద్ధి సంస్థల పాత్రను మూల్యాంకనం చేసే విధానం రూపొందించబడలేదు. ఈ విషయంలో అవస్థాపన కల్పన బేరీజును రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టవలసిన అవసరాన్ని రిజర్వు బాంకు సూచించింది. జిల్లా పరపతి ప్రణాళికను రచించినపుడు అభివృద్ధి సంస్థలు ఏ పాత్ర నిర్వహిస్తాయని తలంచడం జరిగిందో, అట్టి పని ప్రణాళిక అమలు దశలో అందిందీ లేనిదీ మూల్యాంకనం చేయవలసి ఉంటుంది.

చివరగా పరపతి ప్రణాళిక ఏ మూల్యాంకనం అయినప్పటికీ లబ్ధిదారులకు ఏర్పడిన వాస్తవ ప్రయోజనాలను అంచనా వేయకపోతే అది అసంపూర్తిదే అవుతుంది. క్షేత్ర స్థాయిలో ఋణ కల్పనద్వారా వాస్తవ లాభాలను అంచనా వేసే మూల్యాంకనం అవసరం పడుతుంది. వారు పొందిన లాభాలు వారికి అందించిన పరపతి ప్రవాహానికి అనుగుణంగా ఉన్నదీ, లేనిదీ మూల్యాంకన చేయాలి. ప్రభుత్వం బడుగువర్గాల ప్రయోజనాల కోసం చేబట్టిన అనేక పథకాల దృష్ట్యాను, వారిని పేదరిక రేఖ నుండి పైకి లాగడానికి చేపట్టే ప్రయత్నాల దృష్ట్యా, అనివార్యం

అవుతుంది. IRDP, ఇతర పథకాలు సన్న, చిన్నకారు, రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ వృత్తులవారు పేదరిక రేఖకు దిగువనున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారిని ఉద్దేశించి చేబట్టినవి. వారికొరకు చిన్న నీటి వనరులు, పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ళ పరిశ్రమ, వడ్రంగం, దుకాణాలు, సేవా కేంద్రాలు, కుట్టు, రిక్షాలు వంటి పథకాలవల్ల ఎంతెంత ఉద్యోగిత, ఆదాయం ఏర్పడిందో తెలుసుకొనుట మూల్యాంకన భాగం అవుతుంది.

## 23.8 పరపతి ప్రణాళికా విధానం సాధించిన ప్రగతి

పరపతి ప్రణాళిక రచన, అమలులో కొన్ని లోపాలున్నప్పటికీ, అది బాంకింగ్ అభివృద్ధిలో పరిమాణాత్మక, గుణాత్మక మార్పులు తెచ్చిపెట్టిందనడంలో సందేహం లేదు. అట్టి ప్రయోజనాల తీరు కింది విధంగా ఉంది.

1. పరపతి ప్రణాళిక ద్వారా బాంకు పరపతి పంపిణీకి ఒక దిశ చూపడమే కాకుండా గుణాత్మక నియంత్రణను సాధ్యపరిచింది. బాంకు ఋణం పట్ల దృక్పథాన్ని కూడ మార్చివేసింది. మొదట "బాంకరు దగ్గరకు ఋణగ్రహీత" అన్న దృక్పథం ఋణగ్రహీత దగ్గరకు బాంకరు అనే దృక్పథానికి మారింది.
2. 'బాంకులు' అభివృద్ధి దృక్పథాన్ని సంతరించుకొని పరపతిని "భద్రత" ఆధారంగా కాకుండా "ఉత్పత్తి" ప్రాతిపదికగా అందించడం మొదలైంది.
3. పరిమాణాత్మకంగా చూసినపుడు వాణిజ్య బాంకులు, గ్రామీణ బాంకులు, సహకార బాంకుల రూపంలో దేశం అంతటా విస్తృతమైనాయి. 1969లో నున్న 8,282 బాంకు బ్రాంచీలు 1994 నాటికి 61,742కి పెరిగినాయి. అందులో చిన్న పట్టణాల్లో 18.6 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 57.5 శాతం నెలకొల్పడం జరిగింది. ప్రాంతీయ అసమానతలను కొంత తగ్గించింది.
4. బాంకు బ్రాంచీల విస్తరణ, పర్యవేక్షణ, సలహాలివ్వడం సాధ్యమైంది.
5. జిల్లా స్థాయిలో వాణిజ్య బాంకులు, సహకార బాంకుల, ప్రభుత్వ అభివృద్ధి ఏజెన్సీల మధ్య చలనాత్మక సంబంధం ఏర్పడింది. స్థల ప్రాతిపదికపై బాంకు పరపతిని నిర్వహించినందువల్ల ఇది సాధ్యమైంది.
6. పరపతి మరియు బాంకింగ్ వ్యాపారం మరియు ఇతర కార్యక్రమాల మధ్య సన్నిహిత, సమీకృత సంబంధం ఏర్పడింది.
7. జిల్లా స్థాయిలో అభివృద్ధి ఆటంకాలను గుర్తించే వీలు ఏర్పడింది. వాటిని సరిచేసే చర్యల నిమిత్తమై తత్సంబంధమైన ఏజెన్సీలపై లీడ్ బాంకు ఒత్తిడి తెస్తుంది.
8. ప్రాధాన్యతా రంగాలకు అందించే బాంకు పరపతి బాంకుల జాతీయాకరణ మొదట్లో మొత్తం పరపతిలో 14.9 శాతం కాగా అది 1983 నాటికి 37.3 శాతం ఉంది.

## 23.9 సారాంశం

ఈ పాఠంలో పరపతి ప్రణాళికను చర్చించేముందు ద్రవ్య విధానాన్ని, దాని లక్ష్యాలను తెలుసుకొన్నాం. పరపతి దృక్కోణాలను, పరపతి కల్పనలో విత్త సంస్థల, బాంకుల పాత్రను చర్చించడం జరిగింది. పరపతి ప్రణాళికా విధానాన్ని, భారత దేశంలో దాని అమలును వివరించాం. పరపతి ప్రణాళికలో ద్రవ్య బడ్జెట్ తయారీ, వనరుల పంపిణీ, పరపతి ప్రణాళికల అమలు అను మూడు దశలు వున్నట్లు తెలుసుకొన్నాం. అదే విధంగా సూక్ష్మ స్థాయి పరపతి ప్రణాళికలను కూడా చర్చించుకోవడం జరిగింది. ఇక చివరిగా పరపతి ప్రణాళికా విధానం సాధించిన ప్రగతిని సమీక్షించాం.

B R A O U

## 23.10 నమూనా పరీక్షా ప్రశ్నలు

**I క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులిమ్ము.**

1. పరపతి ప్రణాళికా విధానాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.
2. స్థూల పరపతి ప్రణాళికా దశలను వివరించండి. ఈ విధానపు లోపాలను తెలియ జేయండి.
3. లీడ్ బాంకు పథకాన్ని విశ్లేషించండి.

**II క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తుల చొప్పున జవాబులిమ్ము**

1. ద్రవ్య విధాన ఆవశ్యకతను తెలుపుతూ, దాని లక్ష్యాలను పేర్కొనండి.
2. పరపతిని కల్పించడంలో వాణిజ్య బాంకుల పాత్రను వివరించండి.
3. భారత దేశంలో పరపతి ప్రణాళికల అమలును విశదీకరించండి.
4. ప్రాంతీయ పరపతి ప్రణాళికా విధానాన్ని విపులీకరించండి.
5. జిల్లా సమన్వయ సమితి విధులేమి ?

## 23.11 సంప్రదింపు గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. | S. L. N. Sinha (ed) | *Reform of the Indian Banking System,* Orient Longman Limited, Madras, 1973. |
| 2. | J. K. Sharma | *Banking Credit and Economic Development in India,* Classical Publishing Company, New Delhi, 1985. |
| 3. | S. K. Basu | *A Review of Current Banking Theory & Practice,* Macmillan, India, 1974. |
| 4. | Markandeya Jha | *Lead Bank Scheme and Regional Development*, Deep and Deep Publication, New Delhi, 1988. |
| 5. | Vasanth Desai | *Development Banking - Issues and Options,* Himalaya Publishing House, Bombay, 1988. |
| 6. | D. L. Narayana (ed) | *Bharatha Desa Arthikabhivruddi Samasyalu,* Telugu Akadami, Hyderabad, 1984. |


**– డా ॥ ఏ. సుదర్శన్ రెడ్డి**

BRAOU

# ఖండం – VI

# ద్రవ్య, విత్త వ్యవస్థలు – సంస్కరణలు

ద్రవ్య, బాంకింగ్ వ్యవస్థలను వివరంగా చర్చించుకొన్న తర్వాత భారత ద్రవ్య, విత్త వ్యవస్థలలో ఏయే సంస్కరణలు అవసరమో, ఆ సంస్కరణల ద్వారా ద్రవ్య, విత్త వ్యవస్థలను ఏ విధంగా మెరుగు పరుచుకోవచ్చో తెలుసుకొందాం. భాగం - 24 లో భారత దేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ చేసిన సిఫారసులు ఏమిటో పరిశీలిద్దాం. భారత విత్త సంస్కరణలకు సంబంధించి నరసింహం మరియు ఇతర కమిటీల సూచనలను భాగం-25 లో చర్చించుకొందాం. ఇక చివరి పాఠమైన భాగం – 26 లో అంతర్జాతీయ ద్రవ్య, విత్త వ్యవస్థల ఆవశ్యకతను, వాటి స్థాపనను, లక్ష్యాలను, పనితీరును తెలుసుకొందాం. ఆ సంస్థలతో భారత దేశానికి గల సంబంధాన్ని కూడా చర్చించుకొందాం.

ఈ ఖండంలో గల మూడు భాగాలు :

భాగం – 24 : భారత దేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ నివేదిక

భాగం – 25 : భారత దేశంలో ఇటీవలి విత్త సంస్కరణలు : నరసింహం కమిటీ, ఇతర కమిటీలు

భాగం – 26 : అంతర్జాతీయ ద్రవ్య, విత్త సంస్థలు

B R A O U

BRAOU

# భాగం - 24 : భారత దేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ నివేదిక

విషయ క్రమం


24.0 ఉద్దేశం

24.1 పరిచయం

24.2 చక్రవర్తి కమిటీ ఏర్పాటు, నిర్మాణం, మార్గదర్శక సూత్రాలు

24.3 ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో ద్రవ్య వ్యవస్థ పాత్ర చక్రవర్తి కమిటీ పరిశీలన

24.4 చక్రవర్తి కమిటీ చేసిన సిఫారసులు

24.5 సారాంశం

24.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

24.7 సంప్రదింపు గ్రంథాలు

24.8 పదకోశం


## 24.0 ఉద్దేశం

ఈ భాగంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి లక్ష్యాల సాధనకు ద్రవ్య విధానం యొక్క సామర్థ్యాన్ని మెరుగుపరచటానికి, భారత దేశ ద్రవ్య వ్యవస్థ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి చక్రవర్తి కమిటీ సిఫారసు చేసిన అంశాలను తెలుసుకుందాం.

## 24.1 పరిచయం

భారత దేశ ద్రవ్య వ్యవస్థను లోతుగా పరిశీలించి, ఈ వ్యవస్థ సక్రమంగా పని చేయటానికి తీసుకోవలసిన అవసరమైన చర్యలను సూచించడానికి గతంలో అనేక కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. 1975లో ప్రకాశ్ టాండన్ కమిటీని, 1979లో కె.బి. చోరే కమిటీని, 1982లో ఎ. ఘోష్ కమిటీని, 1983లో ఎస్. ఎస్. మరాఠే కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కానీ, ఈ కమిటీలు ద్రవ్య వ్యవస్థ యొక్క కొన్ని నిర్దిష్ట అంశాలను మాత్రమే పరిశీలించాయి. ఈ కమిటీలు మన దేశ ద్రవ్య వ్యవస్థలోని అన్ని అంశాలను సమూలంగా పరిశీలించలేదు. కాబట్టి, డిసెంబరు 1982లో భారతీయ రిజర్వు బ్యాంకు మన దేశ ద్రవ్య వ్యవస్థ పనితీరును సమగ్రంగా పరిశీలించి, దానిని మెరుగు పరచటానికి అవసరమయ్యే తగు చర్యలను సూచించటానికి ఒక కమిటీని నియమించింది. తదనుగుణంగా, ఈ కమిటీ గత కమిటీల నివేదికల ఆధారంగా, మన దేశ ద్రవ్య వ్యవస్థను లోతుగా, సవివరంగా పరిశీలించి తగు సిఫారసులను చేసింది.

## 24.2 చక్రవర్తి కమిటీ ఏర్పాటు, నిర్మాణం, మార్గదర్శక సూత్రాలు

ఈ క్రింది మార్గదర్శక సూత్రాల (terms of reference) తో డిసెంబరు 1982లో ఆచార్య సుఖమాయ్ చక్రవర్తి అధ్యక్షతన, భారతీయ రిజర్వు బ్యాంకు మన దేశ ద్రవ్య వ్యవస్థ పని తీరును పున: పరిశీలించడానికి ఒక కమిటీని నియమించింది.

(ఎ) ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి ప్రాథమిక లక్ష్యాల నేపథ్యంలో ద్రవ్య వ్యవస్థ నిర్మాణాన్ని, పనితీరును విమర్శనాత్మకంగా పున: పరిశీలించడం ;

(బి) ద్రవ్య విధానం సార్థకతపై ప్రభావం ఉన్నంత మేరకు, ప్రభుత్వ రుణ నిర్వహణ మరియు ద్రవ్య విధానం మధ్య మున్న పరస్పర సంబంధాలను అంచనా వేయడం;

(సి) ఆర్థిక వ్యవస్థపై, పరపతి వ్యవస్థపై ద్రవ్య, పరపతి విధానాల ప్రభావాన్ని మదింపు చేయడం. ఈ సందర్భంగా, అసంఘటిత రంగం, బ్యాంకేతర విత్త సంబంధిత సంస్థలు, బ్యాంకింగ్ రంగంల మధ్యనున్న సంబంధాలను అంచనా వేయడం;

(డి) ద్రవ్య, పరపతి విధానాల పనితీరు, వాటి రూపకల్పనలో మెరుగుదల కోసం తీసుకోవలసిన చర్యలను సిఫారసు చేయడం. వివిధ విధాన సాధనాలను శక్తివంతం చేయవలసిన నిర్దిష్ట క్షేత్రాలను సూచించడం;

(ఇ) ద్రవ్య, పరపతి విధానాలు సమర్ధవంతంగా పనిచేయడానికి, కమిటీ భావిస్తే, సంగతమైన సిఫారసులను చేయడం.

ఈ కమిటీ క్రింది సభ్యులను కలిగివుంది.

| | |
|---|---|
| ఆచార్య సుఖమాయ్ చక్రవర్తి | అధ్యక్షుడు |
| శ్రీ యం.పి. చితాలే | సభ్యుడు |
| డా ॥ ఆర్.కె. హజారీ | సభ్యుడు |
| డా ॥ ఎఫ్. ఎ. మెహతా | సభ్యుడు |
| డా ॥ సి. రంగరాజన్ | సభ్యుడు |

ఈ కమిటీ, తన నివేదికను మే 1985లో భారతీయ రిజర్వు బ్యాంకుకు అందజేసింది. ఈ కమిటీ తన నివేదికలో మొత్తం ద్రవ్య వ్యవస్థ పనితీరును పరిశీలించింది. అంతేకాకుండా, సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో ఆర్థిక విధానం సార్థకతను పెంపొందించే దృష్టితో ద్రవ్య వ్యవస్థ పున:నిర్మాణానికి సంబంధించి ఈ కమిటీ అనేక సిఫారసులను చేసింది.

## 24.3 ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో ద్రవ్య వ్యవస్థ పాత్ర - కమిటీ పరిశీలన

పొదుపు మొత్తాల సమీకరణ ప్రక్రియ మరియు ఈ విధంగా సేకరించిన వనరుల వినియోగం సమాజానికి ప్రయోజనాన్ని చేకూర్చే విధంగా, ద్రవ్య వ్యవస్థ పనితీరు క్రమానుసారంగా రూపొందించబడిన పంచవర్ష ప్రణాళికలలో నిర్దేశింపబడిన లక్ష్యాలతో అనుకూలంగా ఉండాలని ఈ కమిటీ నొక్కి చెప్పింది. ద్రవ్య, పరపతి విధానాలను అనుసరించడంలో ప్రణాళికాబద్ధ కృషి వల్ల ఏర్పడే చిక్కులను ఈ కమిటీ పరిశీలించింది. ప్రణాళికాబద్ధ అభివృద్ధిలో పొదుపు రేటు 1950-51లో 10.2% కాగా, 1983-84 లో 22.6% కు పెరిగిందని గుర్తిస్తూ, ఈ కమిటీ పొదుపు రేటు పెరిగినా, ప్రభుత్వంపై పెరుగుతున్న బాధ్యతల వల్ల, తన బజెటు లోటు పెరగడాన్ని రిజర్వు బ్యాంకు దృష్టికి తీసుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంకు నుండి తీసుకున్న పరపతి రూపంలో కొలవబడిన లోటు ద్రవ్య పరిమాణం సురక్షిత పరిమితులను దాటరాదని ఈ కమిటీ వక్కాణించింది. దీనికి అనుగుణంగా, గతంలో కన్నా, ప్రజల నుండి ఎక్కువ పొదుపు మొత్తాలను సేకరించి, ప్రణాళికలకు కావలసిన విత్తాన్ని, ద్రవ్యోల్బణం ఉత్పన్నం కాకుండా సమకూర్చవలసిన అవసరాన్ని ఈ కమిటీ

నొక్కి వక్కాణించింది. అంతేకాకుండా, ప్రభుత్వ రంగం నుండి ఎక్కువ పొదుపు మొత్తాలను రాబట్టడం, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం, ప్రభుత్వ వ్యయంలో సామర్థ్యాన్ని పెంచడం జరగాలి. ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి ప్రక్రియ తన చలనగతి పరిమాణాన్ని కొనసాగించడానికి ఈ అభివృద్ధి యొక్క ప్రయోజనాలు ద్రవ్యోల్బణం వల్ల క్షీణించకుండా, అనుకొన్న వర్గాలకు చేరడానికి ఈ దృక్పథం అవసరమని ఈ కమిటీ భావించడం జరిగింది.

ఈ కమిటీ ప్రకారం, ఒక ప్రధాన లక్ష్యంగా, ద్రవ్య సంబంధిత అధికారుల యొక్క ధరల స్థిరత్వ విధాన అనుసరణ, పంచవర్ష ప్రణాళికలలో చేర్చబడిన సామాజిక, ఆర్థిక విధానం ఇతర లక్ష్యాలతో అనుగుణంగా ఉండి, భారత దేశంలాంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్య విధానాన్ని అమలు చేయడానికి ప్రధాన వ్యవస్థను అందించాలి. 1951-64 కాలంలో ధరల స్థాయిలోని సగటు పెరుగుదల రేటు సంవత్సరానికి 2.8% ఉందని గుర్తిస్తూ, ఈ కమిటీ టోకు ధరల సూచికలో సగటు పెరుగుదల సంవత్సరానికి 4% కన్నా ఎక్కువ ఉండరాదని ధరల విధాన లక్ష్యంగా ఉండాలని నమ్మింది. ఈ కమిటీ ఉద్దేశంలో, ధరల స్థిరత్వం అనగా ధరల స్థాయి నిలకడగా ఉండాలని భావించకూడదు. ధరల స్థాయిని నిలకడగా ఉంచడం, ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి కోసం భారత దేశం యొక్క కృషి సందర్భంగా అర్థవంతమైన విధాన లక్ష్యం కాదు అని ఈ కమిటీ వక్కాణించింది.

ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంకు రెండూ కలిసి ధరల స్థిరత్వ లక్ష్యాన్ని సాధించడానికి తగిన శ్రద్ధ చూపించాలని ఈ కమిటీ నొక్కి వక్కాణించింది. ఈ శ్రద్ధ ఉత్పత్తి స్థాయిని పెంచే లక్ష్యం కోసం ద్రవ్య సప్లయి, రిజర్వు ద్రవ్యంలోని పెరుగుదల నియంత్రణకు సంబంధించిన రిజర్వు బ్యాంకు చర్యలకు ఆధారంగా ఉండాలి అని ఈ కమిటీ భావించింది.

వాతావరణ పరిస్థితుల కారణంగా, వ్యవసాయ ఉత్పత్తిలోని ఒడుదుడుకుల నుండి జనించే సప్లయి అఘాతాల సందర్భంలో ఏర్పడే ద్రవ్యోల్బణ ఒత్తిడుల నియంత్రణలో, సప్లయి నిర్వహణ చర్యలు ఇమిడి ఉంటాయి అని ఈ కమిటీ వక్కాణించింది.

అదే సమయంలో దీనిని గుర్తిస్తూ, ఉత్పత్తిలోని నిరంతర వృద్ధితో సమానంగా ద్రవ్య సప్లయి పెరుగుదల ఉండే విధంగా చూసుకోవడానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించవలసిన అవసరం ఉందని ఈ కమిటీ భావించింది. ఈ యంత్రాంగంలో పరపతి యొక్క సార్థక వినియోగం, డిమాండు నిర్వహణలో ప్రభుత్వం మరియు రిజర్వు బ్యాంకుచే సమన్వయ చర్య ఇమిడి ఉంటుంది.

## 24.4 చక్రవర్తి కమిటీ సిఫారసులు

ద్రవ్యం, ఉత్పత్తి, ధరల మధ్య వున్న పరస్పర సంబంధాలు, పునర్నివేశం (feed-back) తో, ద్రవ్య సంబంధిత లక్ష్యాల సాధనకోసం ద్రవ్య విధాన రూప కల్పనకు అనుమతిస్తాయని ఈ కమిటీ భావించింది. ఈ కమిటీ, ఒక సంవత్సరంలోని ద్రవ్య సప్లయి ($M_3$) వృద్ధి లక్ష్యాన్ని కొన్ని హద్దుల మధ్య నిర్దేశించాలని సిఫారసు చేసింది. ధరల పరిస్థితి దృష్ట్యా ఉత్పత్తిలోని ఆశించిన వృద్ధిలో ఏవైనా మార్పులను ఆ సంవత్సరంలో చేయవలసి వస్తే, ద్రవ్య సప్లయి యొక్క వృద్ధి లక్ష్యాన్ని పునఃపరిశీలించాలని ఈ కమిటీ నొక్కి చెప్పింది. ఈ కమిటీ అభిప్రాయం ప్రకారం, ద్రవ్య సప్లయి యొక్క హద్దులు ముందుగానే ప్రకటింపబడాలి. ఈ హద్దులలోని మార్పులు, ఎటువంటి పరిస్థితులలో చేయబడినాయో కూడా స్పష్టంగా తెలియ పరచాలి. ఇంకా, ఈ మార్పులను కూడా ముందుగానే తెలియ జేయాలి. ఈ కమిటీ ప్రకారం, ద్రవ్య సంబంధిత లక్ష్యం ఒక సమిష్టి భావన. ఈ భావన అనేక ద్రవ్య విధాన సాధనాల ఉపయోగంలో, చాలా స్పష్టమైన పరిధిని చూపించడంలో ద్రవ్య సంబంధిత అధికారులకు సహాయం చేస్తుంది. పైన వివరించిన విధంగా భారతీయ రిజర్వు బ్యాంకు ద్రవ్య సంబంధిత లక్ష్యాల నిర్దేశనాన్ని ఒక ముఖ్యమైన విధాన సాధనంగా అనుసరించాలి.

ద్రవ్య సంబంధిత లక్ష్యాల ఆధారంగా చేయబడే ద్రవ్య సంబంధిత నియంత్రణలో వడ్డీ రేటు విధానం సహాయకారిగా పని చేయాలని ఈ కమిటీ భావించింది. గత 15 సంవత్సరాలుగా, రిజర్వు ద్రవ్యం (reserve money) మరియు ద్రవ్య సప్లయిలలోని పెరుగుదలకు, భారతీయ రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి అందించిన పరపతి స్థాయిలోని పెరుగుదల కారణం అని ఈ కమిటీ గుర్తించింది. ఈ పరపతి, ప్రభుత్వం యొక్క గమనార్హమైన ద్రవ్య చలామణిని ప్రతిబింబిస్తుంది. ఈ ప్రభుత్వ రుణ సంబంధిత ద్రవ్య చలామణిని ప్రభావితం చేయడానికి తీసుకోవలసిన చర్యలలో, పరిణతి తేదీలు కలిగిన సెక్యూరిటీలపై వచ్చే ప్రతిఫలాలలో మార్పులు మరియు కోశ బిల్లులపై ఇచ్చే మినహాయింపు రేటులోని మార్పులు ఇమిడి ఉంటాయి. ఇలాంటి మార్పులను ఈ కమిటీ సిఫారసు చేసింది. ఈ కమిటీ భావనలో, పరిణతి తేదీ కలిగిన సెక్యూరిటీలపై లభించే సగటు ప్రతిఫలం, నిజరూపంలో, సంవత్సరానికి 2 శాతం ఉండాలి. కోశ బిల్లులపై ఇచ్చే మినహాయింపు రేటు, నిజ రూపంలో, సంవత్సరానికి నామమాత్రంగా ధనాత్మకంగా ఉండాలి. ప్రతిఫలాల స్థాయిలలో, ఈ విధమైన మార్పులు చేయడం మూలంగా, ప్రభుత్వం ప్రస్తుత బలవంతపు మార్కెటు (captive market) కు బయటి నుండి రుణదాతలను ఆకర్షించవచ్చు. ఈ బలవంతపు మార్కెటులో బ్యాంకులు, జీవిత బీమా సంస్థలు ప్రధానంగా ఇమిడి ఉంటాయి. ఫలితంగా, ప్రభుత్వం ముందుగా నిర్ణయించబడిన స్థాయిలో భారతీయ రిజర్వు బ్యాంకు నుండి తీసుకొనే పరపతిని కొనసాగించవచ్చు. ఈ కమిటీ ప్రకారం, ఈ దృక్పథం ద్రవ్య సంబంధిత నియంత్రణ లక్ష్యంతో కూడిన ప్రయత్నాలలో వైరుధ్యం లేని రీతిలో, ప్రభుత్వం వనరులను సమకూర్చుకోవడంలో వీలు కల్పిస్తుంది. అంతేకాక, పై దృక్పథం రిజర్వు బ్యాంకు ఇచ్చే పరపతి స్థాయిలో ముందుగా నిర్ణయించిన పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని, ప్రజల పొదుపు మొత్తాల ద్వారా లేదా పన్నుల రాబడిని పెంచడం ద్వారా లేదా రిజర్వు బ్యాంకేతర సంస్థల నుండి తీసుకోబడిన రుణాలచే భర్తీ చేయబడిన బడ్జెటు సంబంధిత లోటు ద్వారా వనరులను సమకూర్చుకోవడంలో ప్రభుత్వానికి అడ్డురాదని ఈ కమిటీ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా, ప్రతి సంవత్సరం నిర్ణయించే ద్రవ్య సంబంధిత లక్ష్యాల పరిధిలో ప్రభుత్వానికి అందించబడే రిజర్వు బ్యాంకు పరపతిలోని పెరుగుదల స్థాయిని ముందుగానే నిర్ణయించడంలో ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకుకు మధ్య సన్నిహిత సమన్వయం ఉండవలసిన అవసరాన్ని ఈ కమిటీ నొక్కి చెప్పింది.

ద్రవ్య సంబంధిత నియంత్రణకోసం అవలంబించే పై దృక్పథం పర్యవసానంగా, కేంద్ర బడ్జెటు లోటును పున:నిర్వచించవలసిన అవసరాన్ని ఈ కమిటీ తెలియ జేసింది. ఈ కమిటీ ప్రకారం, ప్రస్తుత నిర్వచనం కోశ సంబంధిత ప్రక్రియల ద్రవ్య సంబంధిత ప్రభావాన్ని స్పష్టంగా తెలియపరచదు. ఎందుకంటే, ఈ నిర్వచనం ప్రకారం, బడ్జెటు లోటు మిగిలియున్న కోశ బిల్లుల స్థాయిలోని మార్పులతో మాత్రమే సంబంధం కలిగి ఉంటుంది. అంతేకాక, బడ్జెటు లోటు ద్రవ్య సంబంధిత ప్రభావం కలిగి యుండే రిజర్వు బ్యాంకు వద్దనున్న పరిణతి తేదీ కలిగిన ప్రభుత్వ సెక్యూరిటీలలోని పెరుగుదలను పరిగణనలోకి తీసుకోదు. ఈ లోటు, ద్రవ్య సంబంధిత ప్రభావం కలిగియున్న రిజర్వు బ్యాంకు అట్టిపెట్టుకున్న కోశ బిల్లులలోని పెరుగుదల మరియు ప్రత్యక్ష ద్రవ్య సంబంధిత ప్రభావం లేని రిజర్వు బ్యాంకేతర పెట్టుబడిదారుల పెట్టుబడుల పట్టిక (investment portfolio) లోని కోశ బిల్లుల పెరుగుదల మధ్యనున్న భేదాన్ని తెలియ జేయదు. ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు అందించే పరపతి స్థాయిలోని మార్పులు, కోశ సంబంధ ప్రక్రియల ద్రవ్య సంబంధిత ప్రభావం యొక్క స్పష్టమైన, ఆర్థికంగా అర్థవంతమైన కొలమానాన్ని సమకూర్చుతుందని ఈ కమిటీ భావించింది. కాబట్టి, బడ్జెటు లోటు నిర్వచనంలో తగిన మార్పులు చేయవలసిన అవసరం ఉందని ఈ కమిటీ భావించింది. ఎప్పుడైతే ప్రభుత్వమూ, రిజర్వు బ్యాంకూ రెండూ కలిసి వార్షిక బడ్జెటు అమలులో ఒక భాగంగా ప్రభుత్వ రుణ కార్యక్రమం అభిలషణీయ ద్రవ్య సంబంధిత ప్రభావాన్ని ముందుగానే నిర్ణయించగలిగితే, ద్రవ్య, కోశ విధానాలను సమన్వయ పరచడం అనుకూలంగా ఉంటుందని ఈ కమిటీ అభిప్రాయపడింది.

BRAOU

స్వల్పకాల ద్రవ్య సంబంధిత నిర్వహణలోనూ, పరపతి యొక్క సార్థకమైన ఉపయోగాన్ని పెంపొందించడంలోనూ, వడ్డీ రేటు విధానం ఒక ముఖ్యమైన పాత్ర వహించాలని ఈ కమిటీ భావించింది. ప్రణాళికా ప్రాముఖ్యత అనుసారం వివిధ రంగాల మధ్య అభిలషణీయ పరపతి కేటాయింపును సాధించేందుకు తయారుచేసే పరపతి ప్రణాళికను కొనసాగించాలని ఈ కమిటీ నొక్కి చెప్పింది. పరపతి యొక్క మితిమీరిన డిమాండు విషయంలో, ధరల పరిమితి యంత్రాంగం సహాయంతో, పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలను (quantitative credit controls) శక్తివంతం చేయవలసిన అవసరాన్ని ఈ కమిటీ తెలియ జేసింది. దీనివల్ల, ద్రవ్యోల్బణ వ్యతిరేక విధానాల క్రింద అవసరమైన సర్దుబాట్ల భారం పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలపై ఎక్కువగా ఉంచబడదు. అంతేకాకుండా, స్వల్పకాలిక వడ్డీ రేట్లను ప్రభావితం చేసే సరియైన విధానాలచే, ద్రవ్య సంబంధ లక్ష్యాల ద్రవ్యోల్బణ వ్యతిరేక ప్రభావం శక్తివంతం చేయబడుతుంది.

ఈ కమిటీ ప్రకారం, ప్రస్తుతం నిర్వహించబడుతున్న వడ్డీ రేట్ల వ్యవస్థ అనవసరంగా సంక్లిష్టంగా తయారైంది. కావున, దీనిని మార్చవలసిన అవసరం ఉంది. ద్రవ్య సంబంధ పొదుపు మొత్తాలను ప్రోగు చేయడం, కోశ సంబంధ రాయితీల మూలంగా ప్రయోజనం పొందలేని చిన్న పొదుపుదారులు చేసే పొదుపు మొత్తాలపై సహేతుకమైన ప్రతిఫలాన్ని అందించడం, ద్రవ్యోల్బణ వ్యతిరేక విధానాలను శక్తివంతం చేయడం, ప్రాముఖ్యత గల రంగాలకు రాయితీలతో కూడిన వడ్డీ రేట్లతో పరపతిని అందించవలసిన అవసరం, బ్యాంకుల లాభాలు, మొదలగునవి వడ్డీరేటు విధానం యొక్క కొన్ని ముఖ్యమైన అంశాలని చెప్పాలి. ప్రస్తుతం నిర్వహించబతున్న వడ్డీ రేట్ల నిర్మాణంలో మార్పులు చేసే సమయంలో, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంటుందని ఈ కమిటీ అభిప్రాయపడింది. పరిణతి కలిగిన సెక్యూరిటీలపై వచ్చే ప్రతిఫలంలో (ఇంతకు ముందు తెలియజేసినట్టుగా) కోశ బిల్లులపై ఇచ్చే మినహాయింపు రేటులో మార్పులు బ్యాంకుల లాభాలను పెంచుతాయి. ఎందుకంటే, చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి (statutory liquidity ratio) ను అనుసరించి బ్యాంకులు పెట్టే పెట్టుబడులపై ఎక్కువ ప్రతిఫలాన్ని బ్యాంకులు పొందుతాయి. లాభాలలో అలాంటి పెరుగుదలను పరిగణనలోకి తీసుకొని, బ్యాంకులు అందించే అప్పులపై కనీస వడ్డీ రేటు మరియు బ్యాంకుల డిపాజిట్లపై ఇచ్చే గరిష్ట వడ్డీ రేటు మధ్య 3 శాతం పరిపాలిత వ్యాపనం (administered spread) ఆధారంగా, బ్యాంకుల మధ్య నియంత్రిత పోటీ (controlled competition) ను ఈ కమిటీ సిఫారసు చేసింది. ఇంకా, బ్యాంకు డిపాజిట్లపై గరిష్ట వడ్డీ రేటురిజర్వు బ్యాంకుచే నిర్ణయించబడాలని, ఈ రేటును 5 సంవత్సరాలు లేదా అంతకు మించి పరిణతి కలిగిన డిపాజిట్లకు వర్తింపజేయాలనీ ఈ కమిటీ సిఫారసు చేసింది. ఒక సంవత్సరం పరిణతి కలిగిన డిపాజిట్లపై చెల్లించబడే వడ్డీ రేటును కూడా రిజర్వు బ్యాంకు నిర్ణయించాలని ఈ కమిటీ అభిప్రాయపడింది. బ్యాంకులు అందించే అప్పులపై వసూలు చేసే వడ్డీ రేట్లపై ఎలాంటి పరిమితిని ఈ కమిటీ సిఫారసు చేయలేదు. అంతేకాకుండా, వ్యాపార కార్యకలాపాలలోని ఒడుదుడుకులకు అనుగుణంగా, బ్యాంకులు అవి ఇచ్చే అప్పులపై వడ్డీ రేట్లలో మార్పులు చేయాలని ఈ కమిటీ ఆశించింది. అంతేకాకుండా, ఇంతకు ముందు సూచించిన పరిపాలిత వ్యాపనం (administered spread) కు లోబడి నిధులపై బ్యాంకులు భరించే వ్యయానికి అనుగుణంగా వడ్డీ రేట్లలో మార్పులు చేయాలి. ఈ కమిటీ ప్రకారం, 5 సంవత్సరాలు లేదా అంతకు మించి పరిణతి కలిగిన డిపాజిట్లను అన్ని బ్యాంకులూ అంగీకరించాలి. కానీ, ఇతర పరిణతిలు కలిగిన డిపాజిట్లకు సంబంధించి భరించే వ్యయాన్ని మరియు బ్యాంకు యొక్క అన్ని శాఖలలో ఒకే విధమైన వడ్డీ రేటు నిర్మాణాన్ని కొనసాగించి, బ్యాంకు అప్పుల ప్రక్రియలకు అనుగుణంగా డిపాజిట్ల పరిణతి నిర్మాణాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛను బ్యాంకుకు ఇవ్వాలి.

పొదుపుదారులు, తమ దీర్ఘకాలిక పొదుపు మొత్తాలపై సహేతుకమైన ప్రతిఫలాన్ని పొందడానికి అనుగుణంగా, 5 సంవత్సరాలు లేదా అంతకు మించి పరిణతి కలిగిన డిపాజిట్లపై బ్యాంకు ఇచ్చే వడ్డీ రేటు కనీసం

సంవత్సరానికి 2 శాతం ధనాత్మక నిజ ప్రతిఫలం ఇచ్చే విధంగా ఉండాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. పై వడ్డీ రేట్లకు అనుగుణంగా, రిజర్వు బ్యాంకు నామమాత్రపు డిపాజిట్ల రేట్లను నిర్ణయించాలని ఈ కమిటీ సలహా ఇచ్చింది. చిన్న పొదుపుదారులు, వారి డిపాజిట్లపై ఇంతవరకు పొందుతున్న ప్రతిఫలానికన్నా మేలైన ప్రతిఫలాన్ని ఇవ్వడానికి, బ్యాంకులు నవీన రీతిలో పథకాలను రూపొందించాలని కూడా సలహా ఇచ్చింది.

నిర్దిష్ట ప్రాముఖ్యంగల రంగాలకు అందజేసే బ్యాంకు పరపతికి, రాయితీలతో కూడిన వడ్డీ రేట్లు రెండు కన్నా ఎక్కువ వర్తింపజేయకూడదు. ఈ రేట్లలో ఒకటి అప్పుపై వసూలు చేయబడే కనీస వడ్డీ రేటుకు సమానంగా ఉండాలి. ఇంకొకటి కనీస వడ్డీ రేటుకు కొంచెం తక్కువగా ఉండాలి. దీనికి అనుగుణంగా, ప్రస్తుతం రాయితీలతో కూడిన వడ్డీ రేట్లను హేతుబద్ధం చేయాలి. ఈ సందర్భంగా, ప్రాముఖ్యతగల రంగానికి ఇచ్చే పరపతిని తగినంతగా, సమయానికి అందజేయాలని ఈ కమిటీ నొక్కి చెప్పింది. అంతేకాకుండా, రాయితీలతో కూడిన వడ్డీ రేట్లతో, ప్రాముఖ్యంగల రంగాలకు ఇచ్చే అప్పుల క్షేత్రంలో, పరపతి బట్వాడా (disbursement) వ్యవస్థను శక్తివంతం చేయవలసిన అవసరం నుండి దృష్టిని మళ్ళించకూడదని కూడా ఈ కమిటీ నొక్కి చెప్పింది. ప్రాముఖ్యంగల రంగాల క్రింద, కొన్ని వర్గాల కోసం నిర్దేశింపబడిన బ్యాంకు పరపతిపై వసూలు చేసే వడ్డీ రేట్లు సామాజిక లక్ష్యాలను ప్రతిబింబించాలని ఈ కమిటీ నొక్కి చెప్పింది. రాయితీలతో కూడిన వడ్డీ రేట్ల శ్రేణిని హేతుబద్ధం చేసే సమయంలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కూడా ఈ కమిటీ వక్కాణించింది. రాయితీలతో కూడిన వడ్డీ రేట్ల వద్ద, ప్రాముఖ్యత గల రంగాలకు ప్రత్యేకంగా ఋణాలనిచ్చే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (regional rural banks), రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలనుండి ప్రత్యేక సహాయం పొందాలని ఈ కమిటీ సలహా ఇచ్చింది. ప్రాముఖ్యత గల రంగాలకోసం ఋణాలు ఇచ్చే కార్యక్రమంలో, గడువు దాటిన ఋణాల స్థాయి అధికంగా ఉండడం విషయంలో ఈ కమిటీ ఆందోళన వెలిబుచ్చింది. కార్యకలాపాల వారీగా, ప్రాంతీయ వారీగా ఉన్న గడువు దాటిన ఋణాలను సమగ్రంగా పునఃపరిశీలించాలని ఈ కమిటీ సలహా ఇచ్చింది. ఈ పునఃపరిశీలన సంబంధిత బ్యాంకులచే, అభివృద్ధి ఏజన్సీలచే పరిహార చర్యలు తీసుకోవడానికి అనుకూలతను చేకూర్చుతుంది.

ఈ కమిటీచే సిఫారసు చేయబడిన వడ్డీ రేట్ల పునఃనిర్మాణం, మొత్తం ఆర్థిక వ్యవస్థలోని పరపతి వినియోగంపై ప్రత్యక్ష ప్రభావం కలిగి వుంటుందని ఆశించడం జరిగింది. ఈ కమిటీ ప్రకారం, కోశ బిల్లులలో మరియు ప్రభుత్వ సెక్యూరిటీలపై వచ్చే ప్రతిఫలాలలో మార్పులు చేయాలనే సిఫారసు ప్రభుత్వ వ్యయంలో సామర్థ్యాన్ని పెంచడంలో సహకరిస్తుంది. ఈ సిఫారసు సంజాయిషీ చెప్పవలసిన ప్రభుత్వ బాధ్యతను కూడా పెంచుతుంది. అలాగే, ప్రభుత్వ సెక్యూరిటీలపై ఇచ్చే తక్కువ ప్రతిఫలాలలో ఇమిడియున్న సబ్సిడీలలో తగిన విధంగా మార్పులు చేయడానికి ఈ సిఫారసు దోహదం చేస్తుంది. బ్యాంకులు ఇచ్చే ఋణాల రేట్లలో, బ్యాంకు డిపాజిట్ల రేట్లలో మార్పులకు సంబంధించిన సిఫారసులు, బ్యాంకుల మధ్య ధరల పోటీ అంశాన్ని ప్రవేశపెట్టడం, బ్యాంకులు ఇచ్చే పరపతి యొక్క సార్థక ఉపయోగాన్ని పెంపొందించే లక్ష్యాలను సాధించడానికి ఉద్దేశించినవి. సిఫారసు చేయబడిన వడ్డీ రేట్ల పునఃనిర్మాణం, ద్రవ్య మార్కెటును అభివృద్ధి చేయడంలో కూడా ప్రోత్సహిస్తుంది. ఈ సందర్భంగా ముందుగా హెచ్చరిక చేయనక్కర లేకుండా అడిగిన వెంటనే తీర్చవలసిన అంతర్ బ్యాంకు అప్పు (inter-bank call money loan) పై నున్న 10 శాతం వార్షికవడ్డీ రేటుపరిమితిని తొలగించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. ముందుగా హెచ్చరిక చేయనక్కరలేకుండా అడిగిన వెంటనే తీర్చవలసిన ద్రవ్య మార్కెటు (call money market) ను, కొత్త సంస్థల సభ్యులకు ఈ మార్కెటులో పాల్గొనటానికి అనుమతిని ఇవ్వడం ద్వారా, విస్తృతపరచాలని కూడా ఈ కమిటీ సిఫారసు చేసింది. పరపతి వినియోగంలో, గతంలో కన్నా ఎక్కువ ఖచ్చితమైన క్రమశిక్షణను విధించాలని అభిప్రాయపడింది. అప్పుల విన్నపాలను అతి జాగ్రత్తగా మదింపు చేయాలని పిలుపునిచ్చింది. రాయితీలతో కూడిన వడ్డీ రేట్ల వద్ద లభించే నిధులచే లేదా కోశ సంబంధిత ప్రోత్సాహకాలచే లేదా రక్షణతో కూడిన

BRAOU

మార్కెట్లను ఆశించడంచే, అదనపు ఉత్పాదక శక్తి సృష్టి జరగకుండా చూడడానికి అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వబడాలని ఈ కమిటీ నొక్కి చెప్పింది. కొన్ని సంవత్సరాల నుండి పెరుగుతున్న పారిశ్రామిక రుగ్మత (industrial sickness) పరపతి - ఉత్పత్తి మధ్య సంబంధాలను గణనీయంగా దెబ్బతీసిందని గుర్తించింది. దీనికి అనుగుణంగా సార్థకమైన పరిహార చర్యలు లేవు కాబట్టి, నివారణా చర్యలకు తగినంత శ్రద్ధ చూపవలసిన అవసరాన్ని ఈ కమిటీ నొక్కి వక్కాణించింది.

బ్యాంకులచే ఇవ్వబడే అప్పులకు సంబంధించి నగదు పరపతి విధానం (cash credit policy) విస్తృతమైన ఉపయోగం, ఈ పరపతి చివరగా ఎలా ఉపయోగింపబడుతుందో పర్యవేక్షించడం బ్యాంకులకు కష్టతరమైనదని ఈ కమిటీ అభిప్రాయపడింది. ఈ నగదు పరపతి వ్యవస్థ (cash credit system) బిల్లు మార్కెటు అభివృద్ధిపై హానికరమైన ప్రభావాన్ని కలిగి వుంది. అందువల్ల, ఒకవైపు ద్రవ్య పరపతి వ్యవస్థ యొక్క అనేక ప్రయోజనాలను అంగీకరిస్తూ, ఈ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను క్రమంగా తగ్గిస్తూ, ఎక్కువగా ఋణాలు, బిల్లుల ద్వారా చర మూలధనానికి కావలసిన విత్తాన్ని అందించాలని ఈ కమిటీ సిఫారసు చేసింది.

బ్యాంకులు ఇచ్చే ఋణాల కోసం టాండను, చోరే కమిటీలు రూపొందించిన ప్రమాణాల పనితీరును. హేతుబద్ధతను ఈ కమిటీ పరిశీలించింది. ఈ పరిశీలన నుండి పరపతి మదింపు వ్యవస్థను గణనీయ స్థాయిలో మార్పు చేయవలసిన అవసరం ఉందని ఈ కమిటీ ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ కమిటీ చేసిన విశ్లేషణ, నిధుల ప్రవాహ పద్ధతి ఆధారంగా టాండను కమిటీ ప్రమాణాలు పనిచేసినప్పటికీ, బ్యాంకుల అప్పుల, ఆస్తుల కుదువ పద్ధతిని ప్రతిబింబిస్తున్నాయి. ఎందుకంటే, పరపతిని సమకూర్చడం కోసం ఆధారంగా పనిచేసే "నిలువ ప్రకటన" (stock statement) ధృవపత్రంగా కొనసాగుతుంది. టాండను ప్రమాణాల ఆధారంగా చేసే పరపతి మదింపు వ్యవస్థను మెరుగుపరచడానికి, మరియు ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో అధికంగా కొనుగోలు చేసేవారు మరియు ప్రభుత్వం ఆలస్యంగా అప్పులు చెల్లించడం కారణంగా పరపతి ప్రవాహాలలో ఏర్పడిన స్థాన చలనాన్ని తగ్గించడానికి, ఈ కమిటీ ప్రభుత్వానికి చేసే సరఫరాలకు అవసరమైన విత్తం కోసం. ప్రత్యేకంగా కేటాయించబడిన ద్రవ్య పరపతి సౌకర్యాన్ని, ద్రవ్య ప్రవాహాలకు గణనీయంగా విఘాతం కలిగించే, ముందుగా ఊహించని విత్త అవసరాలను తీర్చడం కోసం ప్రత్యేకంగా ఇంకొక ద్రవ్య పరపతి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ప్రత్యేకంగా కేటాయించబడిన ద్రవ్యం పరపతి పరిమితులలో, తగిన మార్పులను చేసి, టాండను ప్రమాణాల ప్రకారం, సాధారణ చర మూలధన పరిమితులు నిర్ణయింపబడాలి. ఈ కమిటీ ప్రకారం, సాధారణ చర మూలధన పరిమితులు ప్రబలంగా ఋణాలు, బిల్లుల రూపంలో ఉండాలి.

బిల్లుల ఆధారంగా, విత్తాన్ని సమకూర్చడాన్ని ప్రోత్సహించటానికి, బిల్లుల ద్వారా ఇచ్చే విత్తం పై వడ్డీ రేటు బ్యాంకుల కనీస వడ్డీ రేటు కన్నా 2% తక్కువగా ఉండాలని ఈ కమిటీ సిఫారసు చేసింది. బిల్లు మార్కెటును అభివృద్ధి చేయు పథంలో ఏర్పడుతున్న కార్యసరళికి సంబంధించిన అడ్డంకులను తొలగించవలసిన అవసరాన్ని ఈ కమిటీ నొక్కి చెప్పింది. బిల్లులను ఒప్పుకోవడానికి అధిక మొత్తంలో కొనుగోలు చేసేవారు అయిష్టత చూపుతున్నట్లు ఈ కమిటీ గుర్తించింది. కాబట్టి, ఈ కమిటీ ప్రకారం, ప్రభుత్వం, ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసేవారు, వారి వారి కొనుగోలు ఒప్పందాలలో, ఆలస్యంగా చెల్లించడానికి సంబంధించి, వడ్డీ చెల్లింపు నిబంధనను చేర్చాలి. ప్రభుత్వం ఈ నిబంధనను ఎక్కువ కొనుగోలు చేసేవారి కోసం చట్టబద్ధం చేయాలి.

ఈ కమిటీచే చేయబడిన వివిధ సిఫారసులు ద్రవ్య మార్కెటు అభివృద్ధిపై ప్రభావాన్ని కలిగి యున్నాయి. ఈ కమిటీచే ఊహింపబడిన, పున: నిర్మాణం చేయబడిన ద్రవ్య వ్యవస్థలో కోశ బిల్లుల మార్కెటు , ముందుగా హెచ్చరిక చేయనక్కర లేకుండా అడిగిన వెంటనే తీర్చవలసిన అప్పుల మార్కెటు (call money market), వాణిజ్య బిల్లుల మార్కెటు మరియు అంతర్ కార్పొరేటు బిల్లుల మార్కెటు కనీస జాప్యంతో మరియు కనీస వ్యాపార నిర్వహణ వ్యయం (transaction cost) తో, వనరుల కేటాయింపుతో ముఖ్యమైన పాత్రను వహిస్తాయి. అంతేగాక,

BRAOU

యుక్తమైన సంఘటిత ద్రవ్య మార్కెటు, ద్రవ్య సంబంధిత నియంత్రణా చర్యల ప్రభావాన్ని ప్రసరింపచేయడానికి, మిగతా ఆర్థిక వ్యవస్థకు ఒక సమర్థవంతమైన యంత్రాంగాన్ని అందిస్తుంది. దీనికి అనుగుణంగా రిజర్వు బ్యాంకు, సమర్థవంతమైన ద్రవ్య మార్కెటు అభివృద్ధి కోసం, చర్యలు తీసుకోవాలని ఈ కమిటీ సిఫారసు చేసింది.

భారతీయ రిజర్వు బ్యాంకు, ఇతర విత్త సంబంధిత సంస్థలకు నిధులను సమకూర్చుతుంది. ఈ సందర్భంగా, ఈ సంస్థలు వాటి ఆయా కార్యకలాపాలలో, వర్ధమాన దశకు చేరిన కొలది రిజర్వు బ్యాంకేతర సంస్థలనుండి సాధారణంగా నిధులను పొందాలని ఈ కమిటీ అభిప్రాయపడింది. అంతేగాక, ఇలాంటి అభివృద్ధి సంస్థలకు రిజర్వు బ్యాంకు సహాయం చేసే పాత్రను, ద్రవ్య సంబంధిత నియంత్రణలో, దాని బాధ్యతలతో జోడించి పరిశీలించాలి. ఫలితంగా, రిజర్వు ద్రవ్యం (reserve money) సృష్టిని కొన్ని పరిమితులలో ఉంచవచ్చు.

ఈ కమిటీ ప్రకారం, వాస్తవిక సార్థక విదేశీ మారకపు రేటు, నామమాత్రపు మారకపు రేటు కన్నా చాలా ఉపయోగకరమైన సూచిక. ఎందుకంటే, మొదటిది ఆర్థిక వ్యవస్థ పోటీ తత్వానికి సంబంధించింది. ఈ పోటీ తత్వం, దేశం యొక్క ప్రోత్సాహకరమైన ప్రస్తుత అకౌంటు (current account) స్థితిపై ప్రభావాన్ని చూపుతుంది. ఈ వాస్తవిక సార్థక విదేశీ మారకపు రేటును దాని యొక్క "ఆధార కాలం" (base period) తో పోల్చినపుడు, స్వదేశంలో పోటీ తత్వాన్ని నిరంతరంగా కొనసాగించే విధంగా ఉండే స్థాయిలో కొనసాగించాలి. ఈ లక్ష్యాన్ని, సార్థక సాపేక్ష ధరలలోని కదలికలకు అనుగుణంగా, నామమాత్రపు విదేశీ మారకపు రేటును మార్పు చేయడం ద్వారా సాధించవలసి యుంటుంది.

బ్యాంకులు, వాటి యొక్క అన్ని అంశాలతో కూడిన బ్యాంకింగు ప్రక్రియలలో ఉత్పాదకతను పెంపొందించడానికి, ఒక ముఖ్యమైన నిర్వహణా సంబంధిత లక్ష్య సాధనకు కృషి చేయాలి. ఈ లక్ష్యం ద్రవ్య సంబంధిత వ్యవస్థ సామర్థ్యాన్ని ప్రధానంగా ప్రభావితం చేస్తుంది. బ్యాంకింగు యొక్క వివిధ అంశాలకు సంబంధించిన సిఫారసులు చేసేటప్పుడు, బ్యాంకుల యొక్క ప్రస్తుత తక్కువ లాభాలాను ఈ కమిటీ దృష్టిలో పెట్టుకొన్నది.

ఈ కమిటీ, సంప్రదాయ బ్యాంకేతర విత్త మధ్యవర్తి సంస్థల (Non-Banking Financial Intermediaries) పాత్రను పరిశీలించింది. ఈ కమిటీ అభిప్రాయంలో, భారత దేశానికి సంబంధించి, ఈ మధ్యవర్తి సంస్థలు, సంప్రదాయంగా, అసంఘటిత రంగం (informal sector) యొక్క కొన్ని పరపతి అవసరాలను, దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంప్రదాయాలు, అలవాట్లచే తీర్చుతున్నాయి. ఈ కమిటీ అభిప్రాయంలో, ఈ అంశాలు క్రమబద్ధమైన బ్యాంకింగు వ్యవస్థకు అనుబంధంగా మధ్యవర్తి సంస్థల పాత్రను అంచనా వేయడంలో పరిగణనలోకి తీసుకోవాలి. బ్యాంకేతర విత్త మధ్యవర్తి సంస్థల డిపాజిటుదారుల యొక్క క్షేమాన్ని కాపాడడం కోసం, ఒక విధమైన అనుమతి పత్రాన్ని (licensing) ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టాలని ఈ కమిటీ సలహా ఇచ్చింది. అంతేకాకుండా, వాటి వ్యాపార స్థాయికి సంబంధించి, అనువైన పరిమితిని విధించాలి. ఒకవేళ, ఈ సంస్థలు పరిమితిని మించి వ్యాపారం చేస్తే, చట్టబద్ధంగా ఒక లైసెన్సును పొందాలని ఈ కమిటీ అభిప్రాయపడింది.

ద్రవ్య వ్యవస్థను పునఃనిర్మాణం చేయు సందర్భంగా, ఈ కమిటీ ద్రవ్య సంబంధిత నియంత్రణ యొక్క వివిధ సాధనాల పాత్రను పరిశీలించింది. గత అనుభవం ఆధారంగా, ద్రవ్య విధానం అమలు ఏ ఒక్క లేదా కేవలం కొన్ని ద్రవ్య నియంత్రణా సాధనాలపై అమితంగా ఆధారపడకూడదని ఈ కమిటీ హెచ్చరించింది. అంతేకాక, ద్రవ్య సంబంధిత అడ్డంకులను వర్తింపజేస్తూ, వీటిని సాధ్యమైనంత తొందరగా ప్రారంభించి, దశలవారీగా అమలు చేయాలని ఈ కమిటీ అభిప్రాయపడింది. ఎందుకంటే, ఈ నియంత్రణా చర్యల ప్రభావాన్ని ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రాముఖ్యంగల నిర్దిష్ట రంగాలకు అసంకల్పిత నష్టాలను కలుగజేయకుండా అనుమతించాల్సి యుంటుంది. బ్యాంకింగు వ్యవస్థ గణనీయంగా వృద్ధి చెందిన సందర్భంగా, ఆలస్యంగా తీసుకొనే నిర్ణయాల నష్టాన్ని కూడా ఈ కమిటీ రిజర్వు బ్యాంకు దృష్టికి తేవడం జరిగింది.

BRAOU

ఈ కమిటీ ఒకవైపు భారతీయ రిజర్వు బ్యాంకు యొక్క ద్రవ్య వ్యవస్థ పనితీరును నియంత్రించి, పర్యవేక్షించే బాధ్యతకూ, ఇంకొకవైపు ఆ విధంగా చేయడానికి, దాని అధికారానికీ మధ్య సమఉజ్జీ ఉండాలని అభిప్రాయపడింది.

## 24.5 సారాంశం

భారతీయ రిజర్వు బ్యాంకు 1982 డిసెంబరులో ఆచార్య సుఖమాయ్ చక్రవర్తి అధ్యక్షతన, ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ భారత దేశ ద్రవ్య వ్యవస్థ పనితీరును సమగ్రంగా పరిశీలించి, ఆర్థిక, సామాజిక లక్ష్యాలను సాధించడంలో ఒక సాధనంగా ద్రవ్య వ్యవస్థ పనితీరును మెరుగు పరచడానికి అనేక సిఫారసులను చేసింది. ఈ సిఫారసులు క్రింది విధంగా ఉన్నాయి.

1. ప్రభుత్వం తనకు అవసరమైన వనరులను, రిజర్వు బ్యాంకు నుండి కాక ఎక్కువగా ప్రజల పొదుపు మొత్తాలనుండి సేకరించాలి.
2. ద్రవ్య సప్లయి ($M_3$) యొక్క వృద్ధి కొన్ని హద్దుల మధ్య నిర్దేశింపబడాలి. ఈ హద్దులు ముందుగానే ప్రకటింపబడాలి.
3. ప్రభుత్వ సెక్యూరిటీలపై లభించే ప్రతిఫలం నిజరూపంలో 2% ఉండాలి. కోశ బిల్లులపై ఇచ్చే మినహాయింపు రేటు, నిజరూపంలో, నామమాత్రంగా ధనాత్మకంగా ఉండాలి.
4. ప్రస్తుత కేంద్ర బడ్జెటు లోటును తిరిగి నిర్వచించాలి.
5. ప్రస్తుత వడ్డీ రేట్ల నిర్మాణాన్ని మార్చాలి. బ్యాంకులు ఇచ్చే అప్పులపై కనీస వడ్డీరేటు, బ్యాంకుల డిపాజిట్లపై ఇచ్చే గరిష్ఠ వడ్డీరేటు మధ్య 3 శాతం "పరిపాలిత వ్యాపనం" ఆధారంగా బ్యాంకుల మధ్య నియంత్రిత పోటీని ప్రవేశపెట్టాలి.
6. బ్యాంకుల అప్పుల ప్రక్రియలకు అనుగుణంగా డిపాజిట్ల పరిణతి నిర్మాణాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛను బ్యాంకులకు ఇవ్వాలి. డిపాజిట్లపై మేలైన ప్రతిఫలాన్ని ఇవ్వడానికి, బ్యాంకులు నవీన రీతిలో పథకాలను రూపొందించాలి.
7. ప్రాముఖ్యంగల రంగాల అప్పుదారులకు అందజేసే బ్యాంకు పరపతికి రాయితీలతో కూడిన వడ్డీ రేట్లు రెండు కన్నా ఎక్కువ ఉండకూడదు. ప్రాముఖ్యంగల రంగాలకు ప్రత్యేకంగా రుణాలనిచ్చే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక సహాయాన్ని అందజేయాలి.
8. ముందుగా హెచ్చరిక లేకుండా అడిగిన వెంటనే తీర్చవలసిన అంతర్ బ్యాంకు అప్పు (inter-bank loan) పైనున్న 10% వార్షిక వడ్డీ రేటు పరిమితిని తొలగించాలి.
9. బ్యాంకేతర విత్త మధ్యవర్తి సంస్థల వ్యాపారంపై పరిమితిని విధించి, లైసెన్సింగు విధానాన్ని ప్రవేశపెట్టాలి.

## 24.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. **క్రింది ప్రశ్నకు సుమారు 40 పక్తులలో జవాబులిమ్ము.**

   1. చక్రవర్తి కమిటీ సిఫారసులను విమర్శనాత్మకంగా వివరించండి.

BRAOU

## 24.7 సంప్రదింపు గ్రంథాలు


1. Report of the Committee to Review the Working of the Monetary System : A Summary, Published in R.B.I. Bulletin, October, 1985, pp. 725–730.
2. Report of the Committee to Review the Working of the Monetary System, R.B.I., 1985 (Chairman : S. Chakravarthy)


## 24.8 పదకోశం

Monetary System : ద్రవ్య వ్యవస్థ

Monetary Policy : ద్రవ్య విధానం

Treasury Bills : కోశ బిల్లులు

Informal Sector : అసంఘటిత రంగం

Budgetary Deficit : బడ్జెటు సంబంధిత లోటు

Reserve Bank of India : భారతీయ రిజర్వు బ్యాంకు

Supply Shocks : సప్లయి అఘాతాలు

Captive Market : బలవంతపు మార్కెటు

Administered Spread : పరిపాలిత వ్యాపనం

Controlled Competition : నియంత్రిత పోటీ

Priority Sector : ప్రాధాన్యత గల రంగం

Non-Bank Financial Intermediary : బ్యాంకేతర విత్త మధ్యవర్తి సంస్థ

Regional Rural Bank : ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు

Call Money Market : ముందుగా హెచ్చరిక చేయనక్కర లేకుండా అడిగిన వెంటనే తీర్చవలసిన అప్పుల మార్కెట్

Stock Statement : నిలువ ప్రకటన

Reserve Money : రిజర్వు ద్రవ్యం

Exchange Rate : మారకపు రేటు

Feedback : ఫీడ్‌బాక్, పునర్నివేశం

Investment Portfolio : పెట్టుబడుల పట్టిక

Quantitative Credit Control : పరిమాణాత్మక పరపతి నియంత్రణ

Statutory Liquidity Ratio : చట్టబద్ధ ద్రవ్యత్వ నిష్పత్తి

Industrial Sickness : పారిశ్రామిక రుగ్మత

Cash Credit Policy : నగదు పరపతి పద్ధతి

Transaction Cost : వ్యాపార నిర్వహణ వ్యయం

— డా॥ ఎస్. సుధాకర్

B R A O U

# భాగం - 25 : భారతదేశంలో ఇటీవలి విత్త సంస్కరణలు: నరసింహం కమిటీ, ఇతర కమిటీలు

విషయ క్రమం


25. 0 ఉద్దేశం

25.1 పరిచయం

25.2 విత్త సంస్కరణల పరిధి

25.3 నరసింహం కమిటీ కాకుండా ఇతర విత్త సంస్కరణల కమిటీలు, చర్యలు

(a) సెబీ (b) జానకిరామన్ కమిటీ (c) మల్‌హోత్రా కమిటీ (d) గోఇపోరియా కమిటీ (e) విత్త కంపెనీల అధ్యయన బృందం (f) రంగరాజన్ కమిటీ

25.4 నరసింహం కమిటీ

25.4.1 విత్త రంగ సంస్కరణల ఆవశ్యకత

25.4.2 నరసింహం కమిటీ నియామకం - బాధ్యతలు, దృక్పథం

25.4.3 ప్రధాన సూచనల సారాంశం

25.4.4 నరసింహం కమిటీ సూచనల అమలు - వాటి ప్రభావాలు

25.5 ముగింపు - విమర్శనాత్మక పరిశీలన

25.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

25.7 సంప్రదింపు రచనలు

25.8 పారిభాషిక పదకోశం


BRAOU

## 25.0 ఉద్దేశం

భారత దేశంలో 1991 సంవత్సరం నుండి ప్రవేశ పెట్టబడిన నిర్మాణాత్మక (structural) మార్పుల, సంస్కరణల నేపథ్యంలో; విత్తపరమైన సంస్కరణలను, ముఖ్యంగా నరసింహం కమిటీ నివేదిక ఆధారంగా జరిగిన, జరుగనున్న మార్పులను, సంస్కరణలను సమీక్షించి, విశ్లేషించడం ఈపాఠం ప్రధాన ఉద్దేశం. బ్యాంకింగ్‌తో సహా విత్త రంగాన్ని ఏ విధంగా సరిదిద్దడం జరిగిందో, వాటి ప్రభావం ఏ మేరకు కలదన్న అంశాలను ఈ పాఠంలో చర్చించాం.

## 25.1 పరిచయం

ఈ పాఠాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవటానికి, వ్యాఖ్యానించటానికి ముందు, 14 నుంచి 24 వరకు గల భాగాలను ముఖ్యంగా 24వ భాగంలో తెలిపిన చక్రవర్తి కమిటీ నివేదిక సారాంశాన్ని పునశ్చరణ చేసుకోవడం అవసరం. భారతీయ విత్త విధానాన్ని, కూర్పును, ప్రధాన రంగాలను వాటి సమస్యలను గుర్తుంచుకోవాలి.

ఇంతేకాకుండా 1991 సం॥ మధ్య భాగంలో భారత్ ఎదుర్కొన్న విషమ స్థితిని (Crisis), దానిని పరిష్కరించటానికి తీసుకున్న సమగ్ర చర్యలను అవగాహన చేసుకోవాలి. 1991 నుండి 1995 మధ్య $4\frac{1}{2}$ సంవత్సరాలలో చేపట్టబడిన స్థిరీకరణ (stabilisation), వ్యవస్థాపక (మౌలిక) సర్దుబాటు కార్యక్రమాలను (structural adjustment programmes – SAP) క్రింది తెలిపిన 7 అంశాలలో సంక్షిప్తంగా తెలుపవచ్చు.

1. బాహ్యంగా రూపాయి విలువను సరిదిద్దడం, రూపాయి మారకాన్ని సంపూర్ణంగా మారకం సరళీకృతం చేయడం (devaluation & full convertibility of Rupee).

2. అంతర్జాతీయ వ్యాపారాన్ని సరళీకృతం చేసి, స్వేచ్ఛగా కనిష్ఠ నిబంధనలతో ఎగుమతి, దిగుమతులను వర్తమాన వ్యవహారాలను నిర్వచించడం.

3. ప్రభుత్వ రంగ వ్యవహారాలను, పరిధిని గణనీయంగా తగ్గించడం.

4. భారత దేశాన్ని, ప్రపంచ దేశాలతో వర్తకం దృష్ట్యా విలీనం చేయడం (globalisation).

5. ఎం. ఆర్. టీ. పీ. కంపెనీలు, ఇతర పరిశ్రమలపై కల నియంత్రణలను తగ్గించడం, 15 పరిశ్రమలకు మాత్రమే లైసెన్సుల అవసరాన్ని పరిమితం చేయడం. తెలుపబడిన 34 అధిక ప్రాధాన్య పరిశ్రమలకు స్వయంచాలకంగా విదేశస్తులు 51% మేరకు యాజమాన్యాన్ని కలిగి ఉండడం, స్వేచ్ఛగా భారతీయులు విదేశస్తులతో వర్తక, ఉత్పత్తి సంబంధాలను, అంగీకారాలను కుదుర్చుకోవడం.

6. కోశ సంబంధిత (fiscal) సంస్కరణలను చేపట్టడం (ముఖ్యంగా కోశ లోటును తగ్గించడం; ప్రభుత్వ వ్యయాన్ని అదుపు చేయడం; ప్రత్యక్ష, పరోక్ష పన్నులను తగ్గించి పన్ను విధానాన్ని సంస్కరించడం).

7. విత్త, బ్యాంకింగ్ సంస్కరణలను చేపట్టడం.

ముఖ్యంగా పైన తెలిపిన 7వ అంశానికి ఈ పాఠం సంబంధించినదని ప్రత్యేకంగా తెలుపనవసరం లేదు.

BRAOU

## 25.2 విత్త సంస్కరణల పరిధి

విత్త సంస్కరణల భావన లేదా పదం విశాలమైంది. కొన్ని సందర్భాలలో విత్తకోశ సంస్కరణలను విడదీయడానికి వీలుండదు. ఉదాహరణకు కోశ బిల్లులు, వడ్డీ రేట్లు, కోశ ఇంకా బడ్జెటు లోట్లు, శాసకీయ ద్రవ్యత్వ నిష్పత్తి లోని మార్పులు విత్త, కోశ వ్యవహారాలను ప్రభావితం చేస్తాయి. ఏ దేశంలోనైనా మార్పులు, సంస్కరణలు నిరాఘాటంగా జరుగుతుంటాయి. కాబట్టి ప్రస్తుత పాఠంలో చర్చించే విత్త సంస్కరణలకు సందర్భాన్ని తెలపాలి. కేంద్రంలో 1991 నుంచి 1995 వరకు ప్రవేశపెట్టబడిన సంస్కరణలు, మార్పులను, ఇంకా విత్త సంబంధిత ప్రధాన కమిటీల నివేదికల సారాంశాన్ని, వీటన్నింటిలో ముఖ్యంగా నరసింహం కమిటీ నివేదికను, దాని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంకు అమలు చేసిన విధానాలను, చర్యలను ఈ పాఠంలో వివరించాం.

## 25.3 నరసింహం కమిటీ కాకుండా ఇతర విత్త సంస్కరణల కమిటీలు, చర్యలు

నరసింహం కమిటీ నివేదిక, దాని వివరణ, అమలు తీరును తెలుసుకోవటానికి ముందు, విత్త సంస్కరణలతో సంబంధం కల ఇతర నివేదికలను, సూచనలను, చర్యలను సంక్షిప్తంగా మొదట తెలుసుకొందాం.

### 25.3.1 సెబీ (SEBI – Securities & Exchange Board of India)

దీనిని 1988 ఏప్రిల్‌లో, కంట్రోలర్ ఆఫ్ క్యాపిటల్ ఇష్యూస్ (Controller of Capital Issues - C. C. I.) స్థానంలో స్థాపించారు. అంటే సీ.సీ.ఐ.ని రద్దు చేసి, దాని విధులను సెబీకి అప్పచెప్పబడినాయి. అయితే 1992 సం॥ నుంచి మాత్రమే "సెబీ" కి శాసకీయ హోదా ఇవ్వబడింది. సెబీకి పూర్వం ప్రభుత్వ ఆధ్వర్యంలో సీ.సీ.ఐ. వివిధ సంస్థల మూలధన వాటాలను నియంత్రిస్తుండేది. వాటా మూలధనాలను, ఇతర సెక్యూరిటీల లావాదేవీలను సెబీ స్వతంత్రంగా నియంత్రిస్తుంది. అంటే ప్రభుత్వ ప్రత్యక్ష జోక్యాన్ని వాటాల మార్కెట్లో సెబీ ద్వారా రద్దు చేయబడింది. సరళీకృత విధానంలో స్వతంత్ర ప్రతిపత్తిగల ఇట్లాంటి సంస్థ ఉండడం అవసరం. గత 3 సం॥లలో సెబీ ప్రాథమిక, ద్వితీయ వాటాల, సెక్యూరిటీల మార్కెట్లలో పెక్కు కట్టుదిట్టాలను అమలుచేసి, న్యాయ సమ్మత లావాదేవీలను సులభంగా కొనసాగించడానికి ప్రయత్నం చేసింది.

### 25.3.2 జానకిరామన్ కమిటీ

1992లో వెలికివచ్చిన వాటాల కుంభకోణం గురించి సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇట్లాంటి అవకతవకలు జరగకుండా చూడటానికి చర్యలు సూచించమని రిజర్వు బ్యాంక్ ఈ కమిటీని నియమించింది. 1993 ఏప్రిల్ వరకు ఇది ఆరు నివేదికలను సమర్పించింది. బ్యాంకుల నిధుల వినియోగం దొడ్డిమార్గం ద్వారా వాటాల కొనుగోలుకు ఏ విధంగా జరిగిందో, బ్యాంకులు ఎలాంటి అక్రమాలకు తోడ్పడ్డాయో ఈ కమిటీ తెలిపింది. బ్యాంకుల పర్యవేక్షణ సమర్థవంతంగా చేయటానికి, బ్యాంకులు నియమాల ప్రకారం వ్యవహరించటానికి సమాచారాన్ని పొంది ఎప్పటికప్పుడు సమన్వయం చేయటానికి జానకిరామన్ కమిటీ పెక్కు సూచనలను చేసింది. భారత పార్లమెంట్‌లోని ప్రతిపక్షాల పట్టుదలవల్ల, కేంద్ర ప్రభుత్వం వాటాల కుంభకోణంపై ఉమ్మడి పార్లమెంట్ కమిటీ (Joint Parliament Committee, JPC) ని నియమించింది. ఇది తన నివేదికను 1993లో సమర్పించింది. విత్త మంత్రి వర్గం అసమర్థతను, రెవెన్యూ మంత్రి రామేశ్వర్ టాకూర్‌కు, హర్షద్ మెహతాకు సంబంధించిన ఆదాయ పన్ను దస్తావేజులను కప్పి పుచ్చటాన్ని ఖండించింది. వాటా మార్కెటును పటిష్టం చేయటానికి, బ్యాంకులు క్రమశిక్షణతో మెలగటానికి అనేక సూచనలు చేయబడినాయి.

### 25.3.3 మల్‌హోత్రా కమిటీ

ఇది భీమా వ్యవహారాలకు సంబంధించింది. జీవిత భీమా, సాధారణ భీమా కంపెనీల వ్యవహారాలను సంస్కరించటానికి R. N. మల్‌హోత్రా అధ్వర్యంలో ఈ కమిటీ నియామకం జరిగింది. కేంద్ర విత్త మంత్రికి 1994 జనవరిలో నివేదిక సమర్పించబడింది. ఇది అనేక సిఫారసులను చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎట్లాంటి చర్య తీసుకోలేదు. ఇది చేసిన సూచనలలో కొన్ని ముఖ్యమైన వాటివి గమనిద్దాం. భీమా రంగంలో ప్రైవేటు రంగానికి ప్రవేశం ఇవ్వాలి; జీవిత భీమా, సాధారణ భీమా ఏకస్వామ్యాన్ని తొలగించాలి; సాధారణ భీమా కార్పొరేషన్ కింద ఉన్న కంపెనీలను వేరు చేయాలి; జీవిత భీమా, సాధారణ భీమా కార్పొరేషన్‌ల వాటా ధనాన్ని రూ.200 కోట్లకు పెంచాలి.

### 25.3.4 గోశిపోరియా కమిటీ

రిజర్వు బ్యాంకు 1990 సెప్టెంబర్‌లో భారతీయ స్టేటు బ్యాంకు అధ్యక్షుడైన M. N. గోశిపోరియా నాయకత్వంలో ఈ కమిటీ నియామకం జరిగింది. డిసెంబర్ 1991 లో ఈ కమిటీ నివేదికను సమర్పించింది. బ్యాంకు ఖాతాదారులకు, డిపాజిటర్లకు త్వరితంగా గుణాత్మకంగా సేవలు బ్యాంకులు అందచేయకపోవటాన్ని పరిశీలించి, బ్యాంకు ఉద్యోగుల ప్రవర్తన సంస్కృతిని చక్కదిద్దటానికి, వ్యవస్థాపూర్వక, ఆచరణీయ పరిమితాలను

పరిష్కరించటానికి ఈ కమిటీ నియమించబడింది. ఇది చేసిన సూచనలలో కొన్నింటిని అమలు చేయడం జరిగింది.

### 25.3.5 విత్త కంపెనీల అధ్యయన బృందం

రిజర్వు బ్యాంకు 1992లో ఎ.సి.షా ఆధిపత్యంలో ఈ కమిటీని నియమించింది. అదే సంవత్సరంలో ఈ కమిటీ నివేదికను కూడా సమర్పించింది. భారతీయ విత్త వ్యవస్థలో బ్యాంకేతర విత్తపరమైన కంపెనీలకు (NBFC) ప్రాముఖ్యం పెరుగుతున్నది కాబట్టి వాటి కార్యకలాపాలను సమర్థవంతంగా క్రమబద్ధంగా చేయటానికి ఈ కమిటీ నియమించబడింది. ఈ కమిటీ చేసిన ఒక ముఖ్య సూచన ఏమనగా రిజర్వు బ్యాంకు వాటిని అజమాయిషీ చేసే అధికారాన్ని కలిగి ఉండాలి. బ్యాంకేతర విత్త సంస్థలు కూడా కనిష్ఠ మూలధనాన్ని కలిగి ఉండాలి. ఇవి 1 నుంచి 7 సంవత్సరాల వరకు డిపాజిట్లను, బ్యాంకులు ఇచ్చే వడ్డీరేటుకన్న 20% నుంచి 30% పాయింట్ల వరకు ఎక్కువ ఇవ్వవచ్చు. రిజర్వు బ్యాంకు ఈ కమిటీ సూచనలను కొన్ని సవరణలతో అంగీకరించి దశలవారీగా అమలు చేయటానికి అంగీకరించింది.

### 25.3.6 రంగరాజన్ కమిటీ

బ్యాంకు వ్యవహారాలలో కంప్యూటర్ల ఆవశ్యకత గుర్తించబడింది. దాదాపు అన్ని రకాల ఆర్థిక, ఆర్థికేతర కార్యకలాపాలలో సత్వర, సమర్థవంతమైన నిర్వహణకు కంప్యూటర్ల అవసరం ఉంది. అయితే కంప్యూటర్ల ప్రవేశం వల్ల ఉద్యోగుల ప్రమోషన్‌లు, నూతన ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతాయని కార్మిక సంఘాలు ఆందోళనను వ్యక్తం చేశాయి. ఈ ఆందోళనలో అర్థంలేదని, కంప్యూటర్ల వల్ల ఉద్యోగస్తుల శ్రేయస్సు భంగంకాదని తెలుపటానికి, కంప్యూటర్ల ఉపయోగంపై రంగరాజన్ కమిటీ నియమించబడింది. వ్యవస్థాపకులకు సరియైన నిర్ణయాలను తీసుకొని, నిధులను లాభదాయకంగా కేటాయించటానికి ఎప్పటికప్పుడు సమాచారం అవసరం. అంతేకాకుండా వినియోగదారులు సులభంగా తమ డిపాజిట్లను విత్‌డ్రా (withdraw) చేసుకోవటానికి కంప్యూటర్లు ఉపయోగపడుతాయని ఈ కమిటీ శాస్త్రీయంగా వివరించింది.

## 25.4 నరసింహం కమిటీ

B R A O U

### 25.4.1 విత్త రంగ సంస్కరణల ఆవశ్యకత

భారత దేశం స్వాతంత్ర్యానంతరం, వివిధ ఆర్థిక రంగాలతోబాటు విత్త - బ్యాంకింగ్ రంగంలో గణనీయమైన పురోగతిని సాధించిందని తెలుపడం అతిశయోక్తికాదు. ముఖ్యంగా 1969 తర్వాత అంటే 14 ప్రధాన బ్యాంకులను జాతీయం చేసిన తర్వాత, భారతీయ విత్త వ్యవస్థ విస్తారంగా వ్యాప్తి చెందింది. విత్త పొదుపును సమీకరించడంలో సమర్థవంతంగా పనిచేసి, స్థూల జాతీయోత్పత్తి (G.D.P.) లో 13% మేరకు విత్త పొదుపును (స్థూల జాతీయోత్పత్తిలో మొత్తం పొదుపు రేటు సుమారు 20%) సాధించింది. చెప్పుకోదగ్గ ప్రగతి చరిత్ర ఉన్నప్పటికీ, భారతీయ విత్త రంగం పెక్కు పరిమితాలకు, అసమర్థతకు గురియైంది. సమర్థత లోపించి జాప్యాల, అల్ప లాభాల, కొన్ని కుంభకోణాల సమస్యలు ఎదురైనాయి. ముఖ్యమైన బలహీనతలను, లోపాలను క్రింది విధంగా సమీక్షించవచ్చు.

వడ్డీ రేటు మార్కెటు పరంగా (అసలైన కొరతల సూచికగా) లేదు; నష్ట భయంగల అప్పులకు ఉచిత నిధులు కేటాయించబడలేదు; లావాదేవీల సంబంధిత ఆధునిక సాంకేతిక పురోగతి లోపించింది; మితిమీరిన శాఖల పెరుగుదలవల్ల, అధిక ఉద్యోగుల సంఖ్య వల్ల లాభం తగ్గింది; శాసకీయ పరిమితాల వల్ల బ్యాంకులు తమ

నిధులను సక్రమంగా పెట్టుబడి చేయలేకపోయినాయి; ప్రాధాన్య రంగాన్ని సరిగా నిర్వచించనందువల్ల ఎక్కువ నిధులు అల్ప లాభదాయకతతో పెట్టుబడి చేయబడి, ఇతర రంగాలకు నిధుల కొరత ఏర్పడి, నిధులను తీసుకొనేవారికి వ్యయ భారం అధికమైంది; బ్యాంకులు తమ బాధ్యతలకు (liabilities) అనుగుణంగా స్వంత మూలధనాన్ని (capital adequacy) కలిగి లేకుండా వ్యవహరించాయి; బ్యాంకుల వాస్తవమైన విత్త స్వస్థతను పరిశీలించే విధంగా గణాంక వివరాలు, పట్టికలు ప్రకటించకపోవడం; కొత్త బ్యాంకుల ప్రవేశంపై పెక్కు ఆంక్షలు విధించడం మొదలగునవి. వీటన్నిటినీ తగు రీతిలో సవరించడానికి ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు క్రింద తెలిపిన 6 ప్రధాన సంస్కరణలను ప్రవేశపెట్టడానికి సంకల్పించింది.

1. విత్త విధానాల సరళీకృతం
2. విత్తసేవల రంగాలలో పోటీ కల్పించడం
3. బ్యాంకు సంస్థల స్వస్థతను తిరిగి సంపాదించడం
4. ప్రభుత్వరంగ బ్యాంకుల యాజమాన్య హక్కులను విస్తృతం చేయడం
5. ప్రభుత్వ సెక్యూరిటీలకు క్రియాశీలక (active) దేశీయ మార్కెటును కల్పించడం
6. గ్రామీణ పరపతి విధానంలో సంస్కరణలు.

ప్రభుత్వం 1991 నుంచి పాటిస్తున్న నూతన ఆర్థిక విధానానికి పైన తెలిపిన మార్పులు, సంస్కరణలు ఎంతైన అవసరం. ఆర్థిక సంస్కరణల వ్యూహం ఆర్థిక స్థిరీకరణ, వ్యవస్థాపూర్వక సర్దుబాట్లు అన్న రెండు అంశాల కూర్పు. ఆర్థిక స్థిరీకరణ చర్యలు స్వల్పకాలంలో భారత వ్యవస్థ కోశ, బాహ్య చెల్లింపుల అసమతౌల్యాలను సరిదిద్దడానికి ఉద్దేశించబడినాయి. వ్యవస్థాపూర్వక సర్దుబాట్లు మాధ్యమిక కాలంలో పోటీద్వారా, సంస్థాగత శాసకీయ మార్పుల ద్వారా ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని (efficiency) మెరుగుపరచడానికి సంబంధించినవని గమనించాలి. ఇట్లా ఆర్థిక వ్యవస్థలో మౌలిక సంస్కరణలను తలపెట్టినప్పుడు, వాటిని విజయవంతం చేయడానికి విత్త రంగం కూడా సారూప్య మార్పులను, సంస్కరణలను చేపట్టడం అనివార్యం. కాబట్టి ఆర్థిక సంస్కరణలు కేవలం వాస్తవ రంగాలపైననే కాకుండా విత్త కూర్పు/పరిణామంలో కూడా ఎక్కువ వ్యవస్థీకృత,. సరళీకృత మార్పులను సాధించాలని తలపెట్టినాయి. ఈ నేపథ్యంలో 1991 సం॥ మధ్య భాగం నుండి విత్త రంగాన్ని వృద్ధి చేయడానికి పెక్కు కమిటీలను నియమించడం జరిగింది. కొన్ని కమిటీల గురించి ఇదివరకే తెలుసుకొన్నాం. ప్రస్తుతం విత్త సంస్కరణలకు కీలకమైన నరసింహం కమిటీ నివేదికను పరిశీలిద్దాం.

BRAOU

## 25.4.2 నరసింహం కమిటీ నియామకం - బాధ్యతలు, దృక్పథం

భారత విత్త విధానాన్ని, కూర్పును పరిశీలించి, నూతన ఆర్థిక విధానానికి చేయూతనివ్వడానికి, విత్త రంగంలో చేపట్టవలసిన సంస్కరణలను సూచించడానికి, భారత ప్రభుత్వం 1991 లో రిజర్వు బ్యాంకు మాజీ గవర్నరు అయిన నరసింహం అధ్యక్షతన 9 మంది సభ్యుల కమిటీని నియమించింది. దీనిని విత్త విధాన కమిటీ లేదా ఎం. నరసింహం కమిటీ అని అంటారు. ఇది తన నివేదికను 1991 నవంబరులో సమర్పించిన పిదప, డిసెంబరులో పార్లమెంటు పరిశీలించింది.

**మార్గదర్శక సూత్రాలు - పరిశీలనా అంశాలు (Terms of Reference)**

భారత విత్త వ్యవస్థకు సంబంధించిన పెక్కు అంశాలను పరిశీలించి, సూచనలు చేయాలని ఈ కమిటీని కోరినారు. వీటిలో ముఖ్యమైనవి : ప్రస్తుత విత్త కూర్పు, భాగాల పరిశీలన; వ్యవస్థ సామర్థ్యాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దడానికి కావలసిన సంస్కరణలను సూచించడం; వాటి వ్యవహారాలలో లాభదాయకత ఆదాలు; చేసిన

ప్రభుత్వ ఆమోదిత సెక్యూరిటీలలో పెట్టుబడి చేయాలి. ఈ పెట్టుబడులపై లభించే వడ్డీ మార్కెటు ఆధారితంగా ఉండక, అల్ప లాభదాయకతను కలిగి ఉంటుంది. కాబట్టి బ్యాంకులు స్వేచ్ఛగా తమ నిధులను సమర్థవంత ప్రత్యామ్నాయాలలో పెట్టుబడి చేయజాలవు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని, నరసింహం కమిటీ ఎస్. ఎల్. ఆర్. ను వాయిదాలలో 5సం॥లో 25% కు తగ్గించాలని సూచించింది. రెండు రకాల ఎస్.ఎల్.ఆర్. నిబంధనలు కలవు. సగటు, ఉపాంత అదనపు ఎస్.ఎల్.ఆర్.లు. 1991లో విధించిన అదనపు (incremental) ఎస్. ఎల్. ఆర్. ను 40% నుంచి ప్రస్తుత సమయాన 25% కు తగ్గించడం జరిగింది. అట్లాగే 1991-92లోగల 38.5% సగటు ఎస్.ఎల్.ఆర్. ను 31.5% కు (1994 అక్టోబర్ నుండి) తగ్గించబడింది. 1996 మార్చ్ వరకు 25%కు తగ్గించబడునని తెలుపడం జరిగింది. ఎస్.ఎల్.ఆర్. ను 1% పాయింట్ తగ్గించడం వలన బ్యాంకులకు సుమారు రూ. 1,000 కోట్లకు పైగా స్వేచ్ఛాయుతంగా పెట్టుబడి చేయ వీలుగల నిధులు లభ్యమవుతాయని గుర్తుంచుకోవాలి. పర్యవసానంగా బ్యాంకులు తమ లాభాన్ని పెంచుకోవటానికి వీలు కలుగుతుంది.

**2. నగదు నిలువల నిష్పత్తి (సి.ఆర్.ఆర్.)**

భారతీయ రిజర్వు బ్యాంకు 1934 చట్టం ప్రకారం, ప్రతి బ్యాంకు తమ డిపాజిట్లలో కనీసం 3% నిధులను రిజర్వు బ్యాంకుకు బదిలీ చేయాలి. దీనిని రిజర్వు బ్యాంకు 15% కు పెంచవచ్చు. ఎస్.ఎల్.ఆర్. వలె ఇది కూడా రెండు రకాలు - సగటు అదనపు సీ. ఆర్. ఆర్. లో సీ. ఆర్. ఆర్. కనిష్ట స్థాయిలో ఉన్నప్పుడు ఏమాత్రం వడ్డీ చెల్లింపబడదు. 3% మించిన సీ.ఆర్.ఆర్. నిధులపై నామమాత్రపు వడ్డీ లభిస్తుంది. నరసింహం కమిటీ సీ.ఆర్.ఆర్. (సగటు) ను 10%కు తగ్గించాలని సూచించింది. ఈ సూచన ఆధారంగా, 1991లో అమలులో ఉన్న 10% అదనపు సీ. ఆర్. ఆర్. ను ప్రస్తుతం రద్దు చేసారు. సగటు సీ.ఆర్.ఆర్. ను 15%నుంచి $14\frac{1}{2}$ %కి (నవంబర్ 1995) తిరిగి 14% కి (డిసెంబర్ 1995లో) తగ్గించారు. సీ.ఆర్.ఆర్. ను 1/2% తగ్గిస్తే బ్యాంకులకు అదనంగా స్వేచ్ఛాయుత నిధులు రూ. 2,000 కోట్లు సంక్రమిస్తాయని గమనించాలి.

**3. వడ్డీ రేట్లు**

గతంలో పెక్కు రకాల వడ్డీ రేట్లు అమలులో ఉండి అతి క్లిష్టతతో బ్యాంకింగ్ విధానం కొనసాగింది. దీనిని హేతుబద్ధం (rationalised) చేసి ప్రస్తుతం 3 అంచెల వడ్డీ రేట్లు అమలుచేయబడుతున్నాయి. డిపాజిట్లకు గరిష్ఠ వడ్డీ రేటు సూచింపబడింది. రూ. 25,000 వరకు, రూ. 25,001 నుంచి రూ. 2 లక్షల వరకు, రూ. 2 లక్షలకు మించిన అప్పులకు వేర్వేరుగా 3 వడ్డీ రేట్లు కలవు. ఇటీవల (1994 అక్టోబర్ నుండి) రూ. 2 లక్షలకు మించిన అప్పులపైకల కనిష్ఠ వడ్డీ రేటు రద్దు చేయబడింది. అయితే 46 రోజులు, ఆపైన గల డిపాజిట్లపై గరిష్ఠ వడ్డీ రేట్లు ఇంకా అమలులో ఉన్నాయి. రూ. 2 లక్షలకు మించిన అప్పులపై విధించే వడ్డీ రేటు దాదాపు 4% తగ్గి, 15%కు చేరుకొంది.

**(4) మూలధన మార్కెటునుంచి స్వేచ్ఛగా వాటా ధనాన్ని పొందుట**

భారతీయ స్టేటు బ్యాంక్ చట్టాన్ని సవరించి, ప్రభుత్వేతర సంస్థలనుంచి వాటా ధనాన్ని పొందుటకు వీలు కల్పించబడింది. వాటాలను, బాండ్లను జారీచేసి భారతీయ స్టేటు బ్యాంకు రూ. 2 వేల కోట్లకు పైగా నిధులను పొంది, రిజర్వు బాంక్ వాటా 99% నుంచి 67% కు కుదించడం జరిగింది. అట్లాగే బ్యాంకు కంపెనీల చట్టాన్ని సవరించి, జాతీయం చేయబడిన బ్యాంకులకు మార్కెటుపరంగా వాటా రుణధనాన్ని పొందే అవకాశం కల్పించబడింది. ఉదా॥ ఓరియంటల్ కామర్స్ బ్యాంకు రూ. 360 కోట్లను వాటాల అమ్మకం ద్వారా సేకరించింది. జాతీయం చేయబడిన బ్యాంకులు ప్రస్తుతం 27 కలవు. కేంద్ర ప్రభుత్వానికి 51% వాటాను ఉంచి 49% వరకు ఇతరులకు వాటాలను అమ్మవచ్చు.

BRAOU

5. నూతన బాంకుల ప్రవేశం, శాఖల లైసెన్సింగ్ రద్దు

నూతనంగా 6 ప్రైవేటు బ్యాంకులకు లైసెన్సులు ఇవ్వబడ్డాయి. అవి పనిచేయడం ప్రారంభించాయి. మరి 6 దరఖాస్తులకు సూత్రప్రాయంగా ఆమోదం ఇవ్వబడింది. విదేశాలనుండి, ప్రవాసంకాని భారతీయుల (Non-Resident Indians - NRI)నుండి బ్యాంకులు వాటా ధనాన్ని సేకరించవచ్చు. 1993 జనవరి నుంచి రిజర్వు బ్యాంకు ప్రైవేటు బ్యాంకుల ప్రవేశంపై కల ఆటంకాలను తొలగించింది. కావలసినంత మూలధనంకల బ్యాంకులు కొత్త శాఖలను ప్రారంభించవచ్చు. విస్తృత కౌంటర్లను (extension counters) శాఖలుగా మార్చుకోవచ్చు. గ్రామీణ శాఖలు మినహా, ఇతర ఆర్థికంగా బలహీనంగా ఉన్న (non-viable) శాఖలను రద్దు చేసుకోవచ్చు. బలహీనంగా ఉన్న బ్యాంకు, సమర్థవంతమైన బ్యాంకుతో విలీనం కావచ్చు. ఉదాహరణకు, న్యూ బ్యాంకు ఆఫ్ ఇండియాను పంజాబ్ నేషనల్ బ్యాంకులో కలిపారు.

6. విత్త పర్యవేక్షణ బోర్డు (Board of Financial Supervision)

నరసింహం కమిటీ సలహా ఆధారంగా, విత్త పర్యవేక్షణ బోర్డు స్థాపించబడింది. ఈ బోర్డుకు సహాయం చెయ్యడానికి, రిజర్వు బ్యాంకులో ప్రత్యేకంగా పర్యవేక్షణ శాఖ 1993 డిసెంబర్‌లో సృష్టించబడింది. విత్త పర్యవేక్షణ బోర్డు 1994 నుంచి పనిచేయటం ప్రారంభించింది.

7. ఋణాల తిరిగి చెల్లింపులు

ఋణాల తిరిగి చెల్లింపులను త్వరితం చేయడానికి 1993 సం॥లో శాసనం చేయబడింది. దీని ప్రకారం బ్యాంకులకు, విత్త సంస్థలకు రావలసిన బాకీలను త్వరితం చేయడానికి ఐదు ట్రిబునల్ల స్థాపన జరిగింది.

8. 1993లో బ్యాంకు ఉద్యోగుల అంగీకారంతో బ్యాంకుల కార్యకలాపాల నిర్వహణలో కంప్యూటర్ల ప్రవేశ పెట్ట బడినాయి.

9. ఉచిత మూలధన నిష్పత్తి నిబంధన

నరసింహం కమిటీ సిఫారసు మేరకు, ప్రతి బ్యాంకు బేసిల్ కమిటీ సూచించిన విధంగా స్వంత మూలధనాన్ని కలిగి ఉండాలని రిజర్వు బ్యాంకు 1992 ఏప్రిల్‌లో ఆదేశించింది. 1993 మార్చ్ వరకు ప్రతి భారతీయ బ్యాంకు 4% మూలధన - నష్ట భయ ఆస్తి నిష్పత్తిని (capital to risk asset ratio) కలిగి ఉండటానికి ప్రయత్నించాలి. ఈ శాతం 1996 మార్చి వరకు 8% కు పెరగాలి. అంతర్జాతీయ అనుబంధం గల భారతీయ బ్యాంకులు, మార్చ్ 1994 వరకు భారత్‌లో పనిచేస్తున్న విదేశీ బ్యాంకులు మార్చ్ 1993 వరకు 8% నిష్పత్తిని కలిగి ఉండాలి. మూలధన నిష్పత్తితో సహా, బ్యాంకులు ఆదాయ పద్దులను, ఆస్తుల వర్గీకరణను, బలహీన (bad) బాకీలకు సరిపోయే నిధులను కలిగి ఉండాలని రిజర్వు బ్యాంకు సూచించగా, 1992 - 1993 సం॥ నుంచి అమలు చేయబడింది. ప్రభుత్వ ఆధీనంలోని బ్యాంకుల మూలధనాన్ని అధికం చేయటానికి కేంద్ర ప్రభుత్వం 1993-1994, 1994-1995 సంవత్సరాలలో వరుసగా రూ. 5,700 కోట్లు, రూ. 5,600 కోట్లు వాటా ధనంగా ఇవ్వబడింది.

10. గ్రామీణ బ్యాంకింగ్, ప్రాధాన్య రంగం పరపతి

నరసింహం కమిటీ సూచనల ఆధారంగా గ్రామ ప్రాంతాలకు పరపతిని ఇచ్చే 196 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు (RRB) లలో 49 బ్యాంకులను పునర్వ్యవస్థీకరించాలని రిజర్వు బ్యాంకు సూచించింది. ఈ బ్యాంకులు స్వేచ్ఛగా తమ శాఖలను హేతుబద్ధం చేయటానికి, లక్ష్య సమూహంకాని (non-target group) వారికి 60% వరకు (వెనుకట ఇది 40%) నూతన రుణాలు ఇవ్వవచ్చు. నరసింహం కమిటీ ప్రాధాన్య రంగం పరపతిని 40% నుంచి 10% కు తగ్గించాలని, ప్రాధాన్య రంగాన్ని పునః నిర్వచించాలని తెలిపింది. అయితే ఈ సిఫారసు ఇంతవరకు



BRAOU

| | | |
|---|---|---|
| Terms of reference / Guidelines | : | పరిశీలనా అంశాలు / మార్గదర్శక సూత్రాలు |
| N.B.F.C. | : | బ్యాంకేతర విత్త కంపెనీలు |
| Apprehension / Anxiety | : | అనుమానం / ఆందోళన |
| Rational | : | హేతుబద్ధంగా / శాస్త్రీయంగా |
| Nationalised | : | జాతీయం చేయబడిన |
| Transactions | : | లావాదేవీలు / వ్యవహారాలు |
| Regulate | : | క్రమబద్ధం చేయుట |
| Liabilities | : | అప్పులు |
| Active | : | క్రియాశీలక |
| Accountability | : | చేసిన పనికి బాధ్యత వహించడం |
| Transparency | : | తేటతెల్లంగా / కప్పిపుచ్చకుండా |
| Supervisory | : | పర్యవేక్షణ |
| Recommendation | : | సిఫారసు / సూచన |
| Advice | : | సలహా |
| Quasi - autonomous | : | పాక్షిక స్వతంత్ర ప్రతిపత్తి |
| Deregulation | : | అనియంత్రణ |
| Doubtful & bad debts | : | అనుమానాస్పద, బలహీన అప్పులు |
| ఏ.ఆర్.ఎఫ్. | : | ఆస్తి పునర్నిర్మాణ నిధి |
| Prudential | : | ఉత్తమ |
| Autonomous decisions | : | స్వతంత్ర నిర్ణయాలు |
| Incremental | : | అదనంగా, ఉపాంతంగా |
| Extention counters | : | విస్తృత / అనుబంధ కౌంటర్లు / శాఖలు |
| Study group | : | అధ్యయన బృందం |
| Adjustment | : | సర్దుబాటు |

- ఆచార్య ఎస్. కిషన్ రావు

BRAOU

# భాగం - 26 : అంతర్జాతీయ ద్రవ్య, విత్త సంస్థలు

**విషయ క్రమం**


26.0 ఉద్దేశం

26.1 పరిచయం

26.2 అంతర్జాతీయ ద్రవ్య నిధి

26.2.1 ద్రవ్య నిధి - లక్ష్యాలు

26.2.2 ద్రవ్య నిధి - వ్యవస్థ

26.2.3 ద్రవ్య నిధి - వనరులు

26.2.4 ద్రవ్య నిధి - ఋణ సహాయం

26.2.5 ద్రవ్య నిధి - మారకపు రేట్ల స్థిరత్వం

26.2.6 ద్రవ్య నిధి పని తీరు - పరిశీలన

26.3 ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు

26.4 అంతర్జాతీయ పునర్నిర్మాణ, అభివృద్ధి బాంకు (ప్రపంచ బాంకు)

26.4.1 ప్రపంచ బాంకు - విధులు

26.4.2 ప్రపంచ బాంకు - ఋణ విధానం

26.4.3 ప్రపంచ బాంకు పని తీరు - పరిశీలన

25.5 అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు - భారత దేశం

26.6 అంతర్జాతీయ విత్త కార్పొరేషన్

26.6.1 అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ ముఖ్య లక్షణాలు

26.6.2 అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ - భారత దేశం

26.7 ఆసియా అభివృద్ధి బాంకు

26.7.1 ఆసియా అభివృద్ధి బాంకు విధులు

26.8 సారాంశం

26.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

26.10 సంప్రదింపు గ్రంథాలు

26.11 పదకోశం


B R A O U

## 26.0 ఉద్దేశం

ఈ భాగంలో అంతర్జాతీయ ద్రవ్య, విత్త సహాయ సంస్థల స్థాపనకు కారణాలు, అంతర్జాతీయ ద్రవ్య నిధి లక్ష్యాలు, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు, ద్రవ్య నిధి పని తీరు, ప్రపంచ బాంకు లక్ష్యాలు, అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ లక్ష్యాలు, ఆసియా అభివృద్ధి బాంకు లక్ష్యాలు వివరించడం జరిగింది. ఈ భాగాన్ని చదివిన తర్వాత క్రింది విషయాలను సులభంగా అవగాహన చేసుకోవచ్చు.

- అంతర్జాతీయ ద్రవ్య, విత్త సంస్థల స్థాపనకు పూర్వం ఉన్న పరిస్థితి
- అంతర్జాతీయ సంస్థల స్థాపనకు కారణాలు

● అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బాంకు, అంతర్జాతీయ విత్త కార్పొరేషన్, ఆసియా అభివృద్ధి బాంకులపై అవగాహన కలుగుతుంది.

## 26.1 పరిచయం

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం అనేక దేశాలు స్వర్ణ ప్రమాణాన్ని పాటిస్తూ వుండేవి. స్వర్ణ ప్రమాణ నిబంధనలను సరియైన విధంగా పాటించినందువల్ల, మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం, విదేశీ మారకపు రేటు ఎక్కువగా ఒడుదుడుకులకు గురికాకుండా స్థిరంగా ఉండేది. అనగా ప్రతి దేశం, విదేశీ మారకపు రేటు స్థిరత్వాన్ని సాధించటానికి స్వర్ణ ప్రమాణం దోహదకారిగా ఉన్నది. అంతేకాకుండా, స్వర్ణ ప్రమాణాన్ని అనుసరించిన కాలంలో ప్రపంచ దేశాల మధ్య ద్రవ్య సహకారం చెప్పుకోతగినరీతిలో ఉండేది. కాని మొదటి ప్రపంచ యుద్ధం జరుగుచున్న కాలంలో ఒక దేశం తర్వాత ఇంకొక దేశం స్వర్ణ ప్రమాణాన్ని పూర్తిగా వదలి వేయటం జరిగింది. దీని కారణంగా, మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, వివిధ దేశాలమధ్య ద్రవ్య సహకారం లోపించింది. అయితే మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, తిరిగి ఒక్కొక్క దేశం క్రమంగా స్వర్ణ ప్రమాణాన్ని అనుసరించటానికి ప్రయత్నించటం జరిగింది. అమెరికా 1919లో స్వర్ణ ప్రమాణాన్ని తిరిగి అనుసరించటం జరిగింది. స్వర్ణ ప్రమాణ పద్ధతి అంతర్జాతీయ ఆర్థిక రంగంలో వచ్చే మార్పులకు త్వరితంగా ప్రభావితం అవుతుంది. అందువలన ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం వుండదు. ఇతర దేశాలు కరెన్సీ విలువను తగ్గించినట్లయితే, కరెన్సీ విలువను తగ్గించని దేశలనుండి, కరెన్సీ విలువను తగ్గించిన దేశాలకు బంగారం తరలి వెళుతుండేది. అందువలన కరెన్సీ విలువను తగ్గించని దేశాలు అంతర్జాతీయ ఆర్థిక రంగంలో వచ్చే మార్పుల వల్ల ప్రభావితమై ఆర్థికపరమైన అస్థిరత్వ పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చేది.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థలో ఏర్పడిన అనిశ్చిత పరిస్థితులను తొలగించి, వివిధ దేశాల మధ్య ద్రవ్య సహకారాన్ని పెంపొందించటానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాలలో భాగంగానే స్వర్ణ ప్రమాణాన్ని కొన్ని మార్పులతో ప్రవేశపెట్టటం జరిగింది. కాని అతికొద్ది కాలంలోనే అనేక దేశాలు మారకపు రేటు స్థిరత్వం కంటె సంపూర్ణోద్యోగిత, స్థిరత్వంతో కూడిన ఆర్థికాభివృద్ధిపై దృష్టిని సారించటం వల్ల, స్వర్ణ ప్రమాణం ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయింది. ఈ కారణంగాప్రపంచ దేశాలు ఒక దాని తర్వాత ఇంకొకటి స్వర్ణప్రమాణాన్ని త్యజించటం జరిగింది. వీటన్నిటితోపాటు 1929-33 సంవత్సరాల మధ్య కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను పెనుభూతంలా వెంటాడిన 'ఆర్థిక మాంద్యం' (economic depression) కారణంగా కూడా ప్రపంచ దేశాలు స్వర్ణ ప్రమాణాన్ని వదలి వేయటంజరిగింది. 1931లో ఇంగ్లాండ్, 1933లో అమెరికా, 1936లో ఫ్రాన్స్ స్వర్ణ ప్రమాణాన్ని వదలి వేసినాయి. దీని కారణంగా విదేశీ మారకపు రేట్లలో స్థిరత్వం లేకుండా పోయింది.

1929-33 సంవత్సరాలలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం కారణంగా, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోయింది. ఆర్థిక మాంద్యం కారణంగా పెట్టుబడిదారీ దేశాలలో లేదా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో ఆర్థిక కార్యకలాపాల స్థాయి తగ్గిపోయింది. ఈ దేశాలలో ఆర్థిక మాంద్యం కారణంగా ఆదాయ స్థాయి తగ్గిపోయి, కొనుగోలు శక్తి తగ్గిపోయిన కారణంగా దిగుమతులు తగ్గిపోయినాయి. ప్రతి దేశంలోనూ ఇవే పరిస్థితులు నెలకొన్న కారణంగా, ఆయా దేశాల విదేశీ మారకపు నిల్వలు అతి తక్కువ స్థాయికి చేరుకుని, ముందు కాలంలో ఎదుర్కొనబోయే విపత్కర పరిస్థితులను సూచించటం జరిగింది. అందువలన ప్రతి దేశం తన యొక్క విదేశీ మారకపు నిల్వలను కాపాడుకోవటానికి దిగుమతులపై కఠినమైన ఆంక్షలను విధించటానికి పూనుకున్నాయి. ఈ ఆంక్షలలో భాగంగానే దిగుమతి సుంకాలను పెంచి, కోటా (quotas) విధానాలను అవలంబించినాయి.

BRAOU

స్వల్పకాలంలో ఎగుమతులను ప్రోత్సహించే ఉద్దేశంతో కొన్ని దేశాలు మూల్య హీనీకరణను చేపట్టినాయి. కొన్ని దేశాలు ఆర్థిక వ్యవహారాల స్వభావాన్ని బట్టి మారకపు రేట్లను నిర్ణయించుకున్నాయి.

స్వర్ణ ప్రమాణం నిరుపయోగంగా మారిన తర్వాత విదేశీ మారకపు స్థిరత్వానికి సంబంధించి అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్స్ మధ్య ఒక సర్దుబాటు జరిగింది. ఈ సర్దుబాటు ప్రకారం, ఈ మూడు దేశాలలోను 'మారకపురేటు స్థిరత్వ నిధులను' (Exchange Rate Stabilisation Funds) ఏర్పాటు చేయటం జరిగింది. 1936 నుండి 1939 వరకు ఈ సర్దుబాటు ద్వారా ఆశించిన ఫలితాలను పొందటం జరిగింది. అయితే 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమై, యుద్ధం ముగిసేవరకు దేశాల మధ్య ఎటువంటి అంతర్జాతీయ ద్రవ్య సర్దుబాటు లేకుండా పోయింది.

1930వ దశాబ్దంలో స్వర్ణ ప్రమాణం విజయవంతం కాకపోవటం మూలంగా అనేక దేశాలు స్వర్ణ ప్రమాణాన్ని త్యజించటం వలన, విదేశీ వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన అసమతౌల్యాన్ని సర్దుబాటు చేసుకోవటానికి అనేక సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ పరిస్థితులలో విదేశీ వ్యాపార చెల్లింపులలో లోటును సరిదిద్దుకోవటానికి ప్రతి దేశం తనకు అనుకూలమైన పద్ధతిని చేపట్టడం జరిగింది. అంతేకాకుండా వస్తువుల దిగుమతులపై అనేక నిర్బంధాలను విధించిన కారణంగా ప్రపంచ వ్యాపార స్థాయి క్రమంగా తగ్గిపోవటం జరిగింది.

పై పరిస్థితుల నేపథ్యంలో, మారకపు రేట్లలో స్థిరత్వాన్ని సాధించి, వివిధ దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించటానికి, ప్రపంచ వ్యాపారం సాఫీగా జరుగుతూ, దినదినాభివృద్ధి చెందేటట్లు చూడటానికిగాను ఏ విధమైన చర్యలు చేపట్టవలెనో సూచిస్తూ, అనేక దేశాలలో ఆర్థిక వేత్తలు కొన్ని పథకాలను రూపొందించటం జరిగింది. వీటిలో భాగంగానే ఒక అంతర్జాతీయ ద్రవ్య సంస్థను స్థాపించవలెనని సూచించటం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య సహకారంపై 'కేన్స్' (Keynes) వెలిబుచ్చిన అభిప్రాయాలను పొందుపరుస్తూ ఇంగ్లాండు ఒక శ్వేత పత్రాన్ని ప్రకటించింది. "అంతర్జాతీయ ఋణ పరిష్కార సంఘాన్ని" ఒక దానిని స్థాపించవలెనని కేన్స్ సూచించాడు. కేన్స్ ప్రకారం, అంతర్జాతీయ ఋణ పరిష్కార సంఘం, అంతర్జాతీయ కేంద్ర బాంకుగా పనిచేస్తు, వివిధ దేశాలలోనే కేంద్ర బాంకులకు బాంకరుగా వ్యవహరించవలసి ఉంటుంది. ఈ సంఘానికి అంతర్జాతీయ కొనుగోలు శక్తిని సృష్టించే అధికారం కూడా ఉండవలెనని కేన్స్ అభిప్రాయపడినాడు. అమెరికా ఆర్థికవేత్త హారీ డి. వైట్ (Harry D. White) అంతర్జాతీయ మారక స్థిరీకరణ నిధి (International Exchange Stabilization Fund) నొక దానిని స్థాపించవలెనని సూచించాడు. వైట్ ప్రకారం, వివిధ దేశాలు తమ ఇష్టం వచ్చినట్లుగా మారకపు రేట్లలో మార్పులు ప్రవేశపెట్టకుండా, మారక స్థిరీకరణ నిధి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కేన్స్ వివరించిన ఋణ పరిష్కార సంఘం, సభ్య దేశాలకు అంతర్జాతీయ కొనుగోలు శక్తిని అందిస్తూ ఒక బాంకర్‌గా మాత్రమే పనిచేస్తుంది. వైట్ సూచించిన మారక స్థిరీకరణ నిధి, సభ్య దేశాలకు కొనుగోలు శక్తిని అందించటంతోపాటు, సభ్య దేశాలు విచక్షణారహితంగా మారకపు రేట్లలో మార్పులు చేయకుండా తగిన చర్యలు తీసుకుంటుంది. వైట్ ప్రకారం, సభ్య దేశాలు మారకపు రేట్లలో మార్పులు చేయదలచుకుంటే ముందుగా మారక స్థిరీకరణ నిధి అనుమతి పొందవలసి వుంటుంది.

కేన్స్ మరియు వైట్ సూచించిన ప్రతిపాదనలను చర్చించేందుకు 1944వ సంవత్సరం జూలై నెలలో అమెరికాలోని బ్రెటన్ వుడ్స్ (Bretton Woods) లో 44 దేశాలు "ఐక్య రాజ్య సమితి ద్రవ్య, విత్త సమావేశం" (United Nations Monetary and Financial Conference) లో పాల్గొన్నాయి. ఈ సమావేశంలో అంతర్జాతీయ ద్రవ్య నిధిని స్థాపించాలని, వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి ప్రపంచ బాంకును స్థాపించాలని నిర్ణయించారు.

BRAOU

అనేక దేశాలు విదేశీ వ్యాపార చెల్లింపులలో ప్రతికూల శేషం ఎదుర్కొంటూ ఉన్నందువలన ఈ సమస్యను పరిష్కరించటానికి, ఆ దేశాలకు స్వల్ప కాలిక ఋణాల రూపంలో విదేశీ మారక ద్రవ్యాన్ని అందించటానికి, మారకపు రేట్లలో స్థిరత్వాన్ని సాధించటానికి, అంతర్జాతీయ వ్యాపారాన్ని పెంపొందించి అంతర్జాతీయ ద్రవ్య సహకారాన్ని సాధించటానికి అంతర్జాతీయ ద్రవ్య నిధిని స్థాపించాలని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు నిర్ణయించటం జరిగింది. దీనితోపాటు, రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న దేశాల ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మించడానికి అవసరమైన దీర్ఘకాలిక ఋణాలను అందించేందుకు, మరియు ప్రపంచంలోని వెనుకబడిన దేశాలు ఆర్థికాభివృద్ధిని సాధించడానికి అవసరమైన దీర్ఘకాలిక ఋణాలను అందించేందుకు ప్రపంచ బాంకును స్థాపించాలని నిర్ణయం చేయుటం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధిని మరియు ప్రపంచ బాంకును స్థాపించాలని బ్రెటన్ వుడ్సులో జరిగిన సమావేశంలో నిర్ణయించటం జరిగింది కావున వీటిని "బ్రెటన్ వుడ్స కవలలు" (Bretton Woods Twins) గా చెప్పటం జరుగుతుంది.

## 26.2 అంతర్జాతీయ ద్రవ్య నిధి (International Monetary Fund)

అంతర్జాతీయ ద్రవ్య నిధి స్థాపన, అంతర్జాతీయ ద్రవ్య సహకారానికి సంబంధించిన ముఖ్యమైన విషయంగా చెప్పవచ్చు. ప్రారంభంలో **44** దేశాలు అంతర్జాతీయ ద్రవ్య నిధిలో సభ్యులుగా వుండేవి. ప్రస్తుతం **168** దేశాలు అంతర్జాతీయ ద్రవ్య నిధిలో సభ్యత్వం పొంది వున్నాయి. **1947** మార్చి **1**వ తేదీనుండి అంతర్జాతీయ ద్రవ్య నిధి పనిచేయటం ప్రారంభించింది.

### 26.2.1 అంతర్జాతీయ ద్రవ్య నిధి లక్ష్యాలు

*1.* *అంతర్జాతీయ ద్రవ్య సహకారం :* ప్రపంచ దేశాల మధ్య, అంతర్జాతీయ ద్రవ్య సహకారాన్ని ప్రోత్సహించటం అంతర్జాతీయ ద్రవ్య నిధి ముఖ్యమైన ఉద్దేశం. దీని ద్వారా వివిధ దేశాల మధ్య బహు పక్షీయ చెల్లింపులకు వీలు కల్పించటం ఒక లక్ష్యంగా చెప్పవచ్చు.

*2.* *మారకపు రేటు స్థిరత్వం :* విదేశీ మారకపు రేటు స్థిరత్వాన్ని సాధించటం కూడా అంతర్జాతీయ ద్రవ్య నిధి లక్ష్యాలలో ఒకటి. విదేశీ మారకపు రేటులో వచ్చే హెచ్చుతగ్గులు, విదేశీ వ్యాపారం సాఫీగా జరగకుండా, ఆటంకాలను కలిగిస్తాయి. అందువలన మారకపు రేటు స్థిరత్వాన్ని సాధించి ప్రపంచ వ్యాపారం సంతులితంగా అభివద్ధి చెందేటట్లు చూడటం; సభ్య దేశాలు మారకపు రేట్లను ఒక క్రమ పద్ధతిలో లేదా ఒక నిర్ణీతమైన రేటులో మార్చుకోవటానికి వీలు కలుగజేస్తూ, సభ్య దేశాలు మూల్య హీనీకరణను పదేపదే చేపట్టకుండా చూడటం ఈ నిధి లక్ష్యం.

*3.* *సభ్య దేశాలు సంతులిత ఆర్థికాభివృద్ధిని సాధించటానికి చేయూతనివ్వటం :* అనగా సంతులితమైన, స్థిరత్వంతో కూడిన, విచక్షణారహిత బహుముఖ వ్యాపార విస్తరణకు తోడ్పడుతూ, సభ్య దేశాలలో హెచ్చు స్థాయిలో ఉద్యోగావకాశాలను, ఆదాయాలను పెంపొందించేందుకు సహాయపడటం ఇంకొక లక్ష్యం.

4. సభ్య దేశాలు విదేశీ వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన తాత్కాలిక అసమతౌల్యాన్ని తొలగించుకోవటానికి అవసరమైన నిధులను, సభ్య దేశాలకు అందించటం; విదేశీ వ్యాపార చెల్లింపులలో ప్రాథమిక అసమతౌల్యం ఏర్పడినప్పుడు కూడా సభ్య దేశాలకు ఆర్థిక సహాయం చేయటం ఈ నిధి ఉద్దేశం.

5. సభ్య దేశాల మధ్య ఇంతకు పూర్వం (ద్రవ్య నిధి ఆవిర్భావానికి పూర్వం) ఉన్న ద్విపక్షీయ చెల్లింపులకు బదులుగా, బహు పక్షీయ చెల్లింపులకు మార్గం సుగమం చేయటం మరియొక లక్ష్యం.

BRAOU

6. సభ్య దేశాలు విదేశీ మారక ఆంక్షలకు పూనుకోకుండా, పోటీపడి మూల్యహీనీకరణను చేపట్టకుండా, నిరుత్సాహపరచటం అంతర్జాతీయ ద్రవ్య నిధి ఉద్దేశం. అంతర్జాతీయ ద్రవ్య నిధి చార్టర్‌లోని ఆర్టికల్ 8 ప్రకారం, సభ్య దేశాలు ద్రవ్య నిధి అనుమతి లేకుండా వ్యాపార ఆంక్షలను విధించటానికి వీలులేకుండా చేయటం జరిగింది.

పైన వివరించిన లక్ష్యాలను సాధించటానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి తనవంతు బాధ్యతను నెరవేరుస్తుంది.

## 26.2.2 అంతర్జాతీయ ద్రవ్య నిధి - వ్యవస్థ

అంతర్జాతీయ ద్రవ్య నిధి యొక్క కేంద్ర కార్యాలయం వాషింగ్టన్ డి.సి. (Washington .D.C.) లో వుంది. బోర్డ్ ఆఫ్ గవర్నర్ల ఆధ్వర్యంలో ద్రవ్య నిధి పని చేస్తుంది. ప్రతి సభ్య దేశం ఒక గవర్నర్‌ను, ఒక ప్రత్యామ్నాయ గవర్నర్‌ను నియమిస్తుంది. ద్రవ్య నిధిలో 20 మంది కార్యనిర్వాహక డైరెక్టర్లు ఉంటారు. ఇందులో అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జపాన్ ఒక్కొక్కరిని నియమిస్తాయి. మిగిలిన 15 మందిని ద్రవ్య నిధిలోని సభ్య దేశాలు ఎన్నుకుంటాయి. కార్యనిర్వాహక డైరెక్టర్ల బోర్డు అధ్యక్షుడు మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తాడు.

## 26.2.3 అంతర్జాతీయ ద్రవ్య నిధి - వనరులు

ద్రవ్య నిధిలోని ప్రతి సభ్య దేశానికి కోటాలను నిర్ణయించటం జరుగుతుంది. సభ్య దేశ జాతీయాదాయాన్ని, ప్రపంచ వ్యాపారంలో దాని వాటాను దృష్టిలో ఉంచుకుని ఈ కోటాలను నిర్ణయించటం జరుగుతుంది. ప్రతి సభ్య దేశం అంతర్జాతీయ ద్రవ్య నిధికి చెల్లించవలసిన మొత్తం, ఆ దేశానికి కేటాయించిన కోటాకు సమానంగా ఉంటుంది. ప్రతి సభ్య దేశంతన కోటా మొత్తాన్ని తన కరెన్సీ రూపంలోనూ, బంగారం రూపంలోనూ చెల్లించటం జరుగుతుంది. ఈ కారణంగానే అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద వివిధ సభ్య దేశాల కరెన్సీలు అందుబాటులో ఉంటాయి. ప్రతి దేశం తనకు కేటాయించిన కోటాలో 25 శాతం బంగారం రూపంలోనూ, మిగిలిన 75 శాతం ఆయా దేశాల కరెన్సీల రూపంలోనూ చెల్లించటం జరుగుతుంది. 1944లో సభ్య దేశాలు అంతర్జాతీయ ద్రవ్య నిధికి చెల్లించిన మొత్తం 8.8 బిలియన్ డాలర్లు. సభ్య దేశాల కోటా పరిమాణం ద్రవ్య నిధిలో సభ్య దేశాల ఓటింగ్ శక్తి (voting power) ని నిర్ణయిస్తుంది. అమెరికాకు కోటా ఎక్కువగా ఉన్న కారణంగా, దాని యొక్క ఓటింగ్ శక్తి కూడ ఎక్కువగా ఉండి, ద్రవ్య నిధి పనితీరుపై అధిక ప్రభావాన్ని చూపుతుంది. ప్రారంభంలో అమెరికా కోటా 36 శాతంగా ఉంది. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి సభ్య దేశాల కోటాలను మార్చే అధికారం ద్రవ్య నిధికి వుంది. 1965లో అనేక సభ్య దేశాల కోటాలను 50 శాతం వరకు, 1970లో 35 శాతం వరకు మార్చటం జరిగింది. కొన్ని సభ్య దేశాలు తమ ఆర్థిక శక్తిని తెలియజెప్పే ఉద్దేశంతో, వ్యక్తిగతంగా తమ కోటాలను పెంచటం జరిగింది. 1970 మధ్య కాలంలో ద్రవ్య నిధి వద్ద వున్న వనరుల మొత్తం 30 బిలియన్ ప్రత్యేక డ్రాయింగ్ హక్కులకు చేరుకున్నాయి. 1980లో అమెరికా కోటా ద్రవ్య నిధి మొత్తం వనరులలో 23 శాతం, ఇంగ్లాండ్ కోటా 9.6 శాతం, జర్మనీ కోటా 5.5 శాతం, ఫ్రాన్స్ కోటా 5.1 శాతం, జపాన్ కోటా 4.1 శాతం, కెనడా కోటా 3.8 శాతం, ఇండియా కోటా 3.2 శాతంగా ఉన్నాయి. 1984 నాటికి ద్రవ్య నిధి వనరుల మొత్తం 89.2 బిలియన్ S.D.R. లకు చేరుకున్నాయి. ఒక్కొక్క దేశపు కోటాలో మూడు ముఖ్యమైన అంశాలు ఉంటాయి. అవి ఏవనగా (1) సభ్య దేశం ద్రవ్య నిధికి చందాగా ఎంత మొత్తం చెల్లించాలి, (2) సభ్య దేశం ద్రవ్య నిధినుండి ఎంత మొత్తం ఋణంగా పొందవచ్చు, (3) సభ్య దేశం చెల్లించిన కోటా ద్రవ్య నిధిలో ఆ దేశం యొక్క ఓటింగ్ శక్తిని సూచిస్తుంది.

BRAOU

## 26.2.4 అంతర్జాతీయ ద్రవ్య నిధి - ఋణ సహాయం

విదేశీ వ్యాపార చెల్లింపులలో తాత్కాలిక ప్రతికూల శేషం ఉన్న సభ్య దేశం, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుండి విదేశీ ద్రవ్యాన్ని అప్పుగా తీసుకోవచ్చు. ద్రవ్య నిధి వద్ద అన్ని సభ్య దేశాల కరెన్సీలు అందుబాటులో ఉంటాయి కావున, ద్రవ్య నిధి ఏ సభ్య దేశపు కరెన్సీనైనా అప్పుగా ఇవ్వగలుగుతుంది. ప్రతి దేశం ద్రవ్య నిధి నుండి అప్పుగా తీసుకునే మొత్తాన్ని ఐదు భాగాలుగా విభజించటం జరుగుతుంది. ఇందులో మొదటిది స్వర్ణ భాగం (gold tranche), మిగిలిన నాలుగు భాగాలను పరపతి భాగాలు (credit tranches) గా చెప్పబడతాయి. ద్రవ్య నిధి నిబంధనల ప్రకారం, ఏ నిర్బంధాలు లేకుండానే, సభ్య దేశం స్వర్ణ భాగం మేరకు ఋణ సహాయం పొందవచ్చు. అదే విధంగా పరపతి భాగాలలో మొదటి పరపతి భాగం వరకు ఏ విధమైన నిర్బంధాలు లేకుండానే వాడుకోవచ్చు. అటు తర్వాత 2, 3, 4 పరపతి భాగాలను వాడుకోవటానికి ద్రవ్య నిధి అనుమతి పొందవలసి ఉంటుంది. దీని ప్రకారం మొదటి పరపతి భాగాన్ని (credit tranche) మించి ద్రవ్య నిధి నుండి ఋణం పొందగోరినట్లయితే ద్రవ్య నిధి ఆ సభ్య దేశంపై కఠినమైన షరతులను విధిస్తుంది. మొదటి పరపతి భాగాన్ని మించి తీసుకునే ఋణాలపై ద్రవ్య నిధి ఎక్కువ వడ్డీ రేటును వసూలు చేస్తుంది. ద్రవ్య నిధి నుండి తీసుకున్న ఋణాలను సాధారణంగా మూడు నుండి ఐదు సంవత్సరాల కాల పరిమితిలో తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఏ సభ్య దేశం అయినా, ఒక సంవత్సర కాలంలో తన కోటాలో 25 శాతానికి మించి ఋణాన్ని పొందలేదు. అయితే ఏ సమయంలోనైన, ద్రవ్య నిధి వద్ద ఏ దేశ కరెన్సీయైనా ఆ దేశ కోటాకు రెట్టింపు కంటె ఎక్కువగా ఉండకూడదు. ఒక దేశం ద్రవ్య నిధి నుండి ఎంత మొత్తంలో ఋణం పొందగలదు అనేది, ఆ సభ్య దేశం ఇంతకు పూర్వం తీసుకున్న ఋణాలపైన మరియు ఆ దేశం యొక్క ఆర్థిక కార్యకాలపాల స్థాయిపైన ఆధారపడి ఉంటుంది. 1950వ దశాబ్దం నుండి ద్రవ్య నిధి సభ్య దేశాలకు స్టాండ్-బై-సౌకర్యాలను కూడా కల్పించటం జరిగింది. ఈ నూతన పద్ధతి ప్రకారం, సంవత్సరం లోపు కాలానికి గాను, ద్రవ్య నిధి సభ్య దేశాలకు ఆర్థిక సహాయం అందించటానికి ముందుకు వస్తుంది.

## 26.2.5 అంతర్జాతీయ ద్రవ్య నిధి - మారకపు రేట్ల స్థిరత్వం

ద్రవ్య నిధిలో సభ్యత్వం పొందిన ప్రతి దేశం తన కరెన్సీ విలువను డాలర్ లేదా బంగారం రూపంలో ప్రకటించవలసి ఉంటుంది. 1971వ సంవత్సరం వరకు డాలర్ బంగారంతో సమానంగా అంతర్జాతీయ కరెన్సీగా చలామణి అయింది. కాని 1971వ సంవత్సరంలో, అమెరికా చెల్లింపుల శేషంలో లోటు మూలంగా డాలర్ సంక్షోభం ఏర్పడింది. ఈ కారణంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి మారకం రేటు విషయంలో తన విధానం మార్చుకోవటం జరిగింది. ఈ పరిస్థితులలో సభ్య దేశాలు తమ మారకం రేట్లను స్వేచ్ఛగా మార్చుకునేందుకు (floating exchange rates) వీలు కల్పించాయి.

సభ్య దేశాలు తమ విదేశీ వ్యాపార చెల్లింపులలో ప్రాథమిక అసమతౌల్యం కలిగి ఉన్నట్లయితే, తమ కరెన్సీల మారకం రేట్లను మార్చుకోవటానికి వీలుంటుంది. మారకం రేటును మార్చటానికి ముందుగా ద్రవ్య నిధికి తెలియ జేయవలసి ఉంటుంది. సాధారణంగా ఏదైనా సభ్య దేశం తన కరెన్సీ బాహ్య విలువను 10 శాతం కంటె తక్కువగా మార్చినట్లయితే ద్రవ్య నిధి ఏ విధమైన అభ్యంతరాలను తెలియ జేయదు. కరెన్సీ బాహ్య విలువలో మార్పు 10 శాతం కంటె ఎక్కువగా ఉంటే, తప్పనిసరిగా ద్రవ్య నిధి అనుమతి పొందవలసి ఉంటుంది. సభ్య దేశం విదేశీ వ్యాపార చెల్లింపులలో ప్రాథమిక అసమతౌల్యం ఎదుర్కొనప్పుడే, ద్రవ్య నిధి ఆ సభ్య దేశం తన కరెన్సీ బాహ్య విలువను మార్చటానికి అనుమతిని ఇస్తుంది.

BRAOU

S.D.R. లను సృష్టించగలుగుతుంది. ద్రవ్య నిధి S.D.R. లను సృష్టించి ప్రతి సభ్య దేశానికి కేటాయిస్తుంది. సభ్య దేశాలకు కేటాయించబడే S.D.R. ల పరిమాణం, ఆ సభ్య దేశం ద్రవ్య నిధికి అందించే చందా లేదా కోటాపై ఆధారపడి ఉంటుంది. ప్రతి సభ్య దేశపు అంతర్జాతీయ నిల్వలలో S.D.R. లు శాశ్వత భాగంగా ఉంటాయి. సభ్య దేశానికి అంతర్జాతీయ ద్రవ్య అవసరం ఏర్పడినప్పుడు, ద్రవ్య నిధికి S.D.R. లను ఇచ్చి, సభ్య దేశం ద్రవ్య నిధి నుండి తనకు అవసరమైన కరెన్సీని పొందటానికి వీలుంటుంది. 1970లో మొదటిసారిగా 9.3 బిలియన్ S.D.R. లను సృష్టించటం జరిగింది. ప్రారంభంలో ఒక S.D.R. విలువ 0.888671 గ్రాముల బంగారానికి సమానంగా ఉండేది. అదే విధంగా ప్రారంభంలో ఒక S.D.R. ఒక అమెరికన్ డాలర్‌కు సమానంగా ఉండేది. 1971లో డాలర్ మూల్యహీనీకరణ జరిగిన తర్వాత ఒక S.D.R. విలువ ఒక డాలర్ కంటే ఎక్కువగా నిర్ణయించబడింది. 1974 జూలై 1వ తేదీ నుండి S.D.R. విలువను కరెన్సీ బాస్కెట్ (Basket of currencies)తో ముడిపెట్టడం జరిగింది. ముఖ్యంగా 16 దేశాల కరెన్సీల భారిత సూచీల ఆధారంగా S.D.R. విలువను చెప్పటం జరిగింది. 1981లో బాస్కెట్ కరెన్సీల సంఖ్యను ఐదుకు తగ్గించటం జరిగింది. ఈ ఐదు కరెన్సీలు ఏవనగా అమెరికా డాలర్, జర్మన్ మార్కు, బ్రిటిష్ పౌండ్, ఫ్రెంచ్ ఫ్రాంక్, జపాన్ యెన్. 1984లో ఒక S.D.R. విలువ 1.031 డాలర్లకు సమానంగా నిర్ణయించటం జరిగింది.

దురదృష్టవశాత్తు, అమెరికా మరియు ఇంకా కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ధృఢతరమైన (rigid) విధానాల వలన, 1982 నుండి S.D.R. లను సభ్య దేశాల మధ్య పంపిణీ చేయటంలో ద్రవ్య నిధి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఈ కారణంగానే S.D.R. ల రూపంలో అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని సమకూర్చటంలో ద్రవ్య నిధి సఫలం కాలేదని చెప్పవచ్చు.

## 26.4 అంతర్జాతీయ పునర్నిర్మాణ, అభివృద్ధి బ్యాంకు (ప్రపంచ బ్యాంకు) (International Bank for Reconstruction and Development)

BRAOU

అంతర్జాతీయ ద్రవ్య నిధితో పాటు, అంతర్జాతీయ పునర్నిర్మాణానికి, అభివృద్ధికి ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించవలెనని 1944లో బ్రెటన్ వుడ్స్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయించటం జరిగింది. దీనిలో భాగంగానే ద్రవ్య నిధితో పాటు, 1945లో అంతర్జాతీయ పునర్నిర్మాణ, అభివృద్ధి బ్యాంకును కూడా స్థాపించటం జరిగింది. దీనినే ప్రపంచ బ్యాంకు అని కూడా అంటారు. ప్రపంచ బ్యాంకును స్థాపించటంలో ముఖ్య ఉద్దేశం రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి కావలసిన వనరులను సమకూర్చటం. అయితే ప్రస్తుత కాలంలో సభ్య దేశాల ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి కావలసిన దీర్ఘకాలిక ఋణ సహాయాన్ని ప్రపంచ బ్యాంకు అందిస్తుంది.

### 26.4.1 ప్రపంచ బ్యాంకు విధులు

1. సభ్య దేశాల ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి కావలసిన మూలధన వనరులను సమకూర్చటం.
2. సభ్య దేశాలలో చేసే విదేశీ ప్రయివేటు పెట్టుబడులకు హామీలు ఇవ్వటం ద్వారా, సభ్య దేశాలలో విదేశీ ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించటం. హేతుబద్ధమైన వడ్డీ రేటు (reasonable interest rate) కు ప్రయివేటు పెట్టుబడులు తగినంతగా లేనప్పుడు, ప్రపంచ బ్యాంకు తన వనరులను సభ్య దేశాల ఉత్పాదక కార్యకలాపాలకు అందించటం.
3. దీర్ఘకాలంలో సంతులిత, అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధిని సాధించటం. సభ్య దేశాలలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ, సభ్య దేశాలు విదేశీ వ్యాపార చెల్లింపులలో సమతౌల్యాన్ని సాధించేటట్లు చూడటం. సభ్య

## 26.2.6 అంతర్జాతీయ ద్రవ్య నిధి పనితీరు - పరిశీలన

ప్రారంభంలో ద్రవ్య నిధి నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించలేకపోయింది. దీనికి కారణం ద్రవ్య నిధి నుండి తీసుకున్న ఋణాలను విదేశీ వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన అసమతౌల్యాన్ని సరిదిద్దుకోవటానికి గాక, తమ ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి ఉపయోగించుకోవటం జరుగుతుందనే సందేహంతో, తాను ఇచ్చే ఋణాలపై కఠినమైన షరతులను విధించటం జరిగింది. అంతేకాకుండా, తీసుకున్న ఋణాలను నిబంధనల మేరకు చెల్లించకుండా ఉన్నట్లయితే, చెల్లించని ఋణాలపై వడ్డీ రేటును పెంచటం జరిగింది. అంతేకాకుండా, ద్రవ్య నిధి నుండి సహాయం పొందగోరిన దేశం, తన యొక్క విదేశీ వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన లోటు కేవలం తాత్కాలికమైనదని, అతి స్వల్ప కాలంలో దీనిని పరిష్కరించటం జరుగుతుందని, ద్రవ్య నిధికి నచ్చచెప్పవలసి ఉంటుంది. పై కారణాల వలన ద్రవ్య నిధి 1950వ దశాబ్దంలో చెప్పుకోతగిన పాత్రను నిర్వహించలేకపోయింది. దీనితో పాటుగా 1950 మరియు 1960 సంవత్సరాల కాలంలో మారకం రేట్లలో క్రమబద్ధమైన (systematic) మార్పులు ప్రవేశపెట్టటానికి సరియైన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ రెండు దశాబ్దాల కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చాలావరకు ఐక్యత (integrate) చెందటం జరిగింది. ముఖ్యంగా పెట్టుబడిదారీ దేశాలలోనే మూలధన మార్కెట్లలో సంభవించిన ఐక్యత స్పష్టంగా కనిపిస్తుంది. అప్పటినుండి బహు పక్షీయ (multilateral) పరపతిని అందించే విధంగా ద్రవ్య నిధిని వ్యవస్థీకరించటం జరిగింది. కాని అభివృద్ధి చెందిన దేశాలు అవలంబించిన స్వాప్ (swap) ఒప్పందాల ఫలితంగా, ద్రవ్య నిధి తన విధులను సరియైన విధంగా నిర్వహించ లేకపోయింది. 'స్వాప్' ఒప్పందం అనగా రెండు దేశాల మధ్య జరిగే స్వల్ప కాలిక పరపతి ఒప్పందం. రెండు దేశాల మధ్య కరెన్సీల మారకాన్ని 'స్వాప్స్' అంటారు (Swaps consist of an exchange of currencies between countries). ద్రవ్య నిధి తన విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోవటానికి అమెరికా అనుసరించిన విధానం కూడా కొంతవరకు కారణం అని చెప్పవచ్చు. అంతేకాకుండా సోషలిస్టు దేశాలు IMF లో సభ్యత్వాన్ని స్వీకరించలేదు. అంతర్జాతీయ ద్రవ్యత్వానికి ముఖ్యమైన ఆధారం అమెరికానే. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఇతర దేశాల సహకారంతో అమెరికా అంతర్జాతీయ ద్రవ్య విధాన అభివృద్ధిని (development of International Monetary System) నిర్ణయించటం జరిగింది. ఈ పరిస్థితులలో ద్రవ్య నిధి అంతర్జాతీయ ద్రవ్యత్వానికి సంబంధించి ప్రధాన పాత్రను నిర్వహించ లేకపోయింది.

1960వ దశాబ్దం చివరినుండి, అంతర్జాతీయ ద్రవ్య నిధి చెప్పుకోతగిన రీతిలో తన పాత్రను నిర్వహించటానికి వీలు కలిగింది. దీనికి కారణం 1967లో రియో డి జనిరో (Rio De Janeiro) లో జరిగిన ద్రవ్య నిధి సమావేశంలో ద్రవ్య నిధికి నూతన రక్తాన్ని ఎక్కించి, స్వస్థతను, బలాన్ని చేకూర్చటానికి చర్యలు తీసుకోవటం జరిగింది. దీనిలో భాగంగానే "ప్రత్యేక డ్రాయింగ్ హక్కుల" (Special Drawing Rights) ను ప్రవేశ పెట్టడం జరిగింది. దీని ఫలితంగా, అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని సప్లయ్ చేయటానికి, ద్రవ్య నిధి ముఖ్యమైన ఆధారమైపోయి, ద్రవ్య నిధి యొక్క ప్రాముఖ్యం పెరిగింది.

## 26.3 ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు (Special Drawing Rights)

ప్రత్యేక డ్రాయింగ్ హక్కులను మొదటిసారిగా 1970లో సృష్టించటం జరిగింది. S.D.R. లను కాగితపు బంగారం (paper gold) అని కూడా అంటారు. S.D.R.లు అంతర్జాతీయ ద్రవ్యంగా చలామణి అవుతాయి. S.D.R. లను అంతర్జాతీయ ద్రవ్యత్వంగా కూడా చెప్పటం జరుగుతుంది. అంతర్జాతీయ వ్యాపార వ్యవహారాలలో దేనినైతే చెల్లింపుల సాధనంగా అంగీకరిస్తారో దానినే అంతర్జాతీయ ద్రవ్యత్వం అంటారు. ద్రవ్య నిధి ఒక పెన్నుపోటుతో

దేశాలలో ఉత్పాదకత, ప్రజల జీవన ప్రమాణం, శ్రామికుల స్థితిగతులలో పురోభివృద్ధి సాధించటానికి చర్యలు తీసుకోవడం.

4. ప్రపంచ బాంకు తన వద్ద ఉన్న నిధుల నుండి దీర్ఘకాలిక ఋణాలను అందజేయటం ద్వారానూ, ఇతర దేశాలు ఇచ్చే ఋణాలకు హామీలు ఇవ్వటం ద్వారానూ సభ్య దేశాలలో చిన్న, భారీ పథకాల అమలుకు తోడ్పడటం.

### 26.4.2 సభ్యత్వం

ద్రవ్య నిధిలోని సభ్య దేశాలు అన్నీ ప్రపంచ బాంకులో స్వతహాగా సభ్యత్వాన్ని పొందుతాయి. ప్రపంచ బాంకులోని సభ్యులలో ఎవరైనా బాంకు సభ్యత్వాన్ని వదులుకోదలచినట్లయితే, తాను తీసుకున్న ఋణాలను ఆ ఋణాలపై వడ్డీని పూర్తిగా చెల్లించిన తర్వాత మాత్రమే సభ్యత్వాన్ని వదులుకోవటానికి వీలుంటుంది. ప్రపంచ బాంకును స్థాపించినప్పుడు ప్రారంభంలో 10 బిలియన్ డాలర్లను అధీకృత మూలధనంగా (authorised capital) నిర్ణయించటం జరిగింది.

### 26.4.3 ఋణ విధానం

ప్రపంచ బాంకు క్రింద వివరించిన విషయాలను దృష్టిలో ఉంచుకుని ఋణ సహాయాన్ని సభ్య దేశాలకు అందిస్తుంది. ఆ విషయాలు ఏవనగా

1. ఋణాన్ని కోరిన దేశానికి, తాను ఇచ్చిన ఋణాన్ని మరియు ఋణంపై వడ్డీ తిరిగి చెల్లించగల ఆర్థిక స్తోమత ఉన్నదా లేదా అని పరిశీలన జరుపుతుంది. తాను ఋణంగా ఇచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లించగల సామర్థ్యం సభ్య దేశానికి ఉన్నదని సంతృప్తి చెందిన తర్వాతే ఋణాన్ని మంజూరు చేయటం జరుగుతుంది.

2. ఏయే ప్రాజెక్టులు లేదా పథకాల నిర్మాణంకోసం సభ్య దేశం ఋణ సహాయం కోరిందో, ఆ ప్రాజెక్టుల నిర్మాణం వలన కలిగే మంచి చెడులను పరిశీలించటం జరుగుతుంది. ఆయా ప్రాజెక్టుల నిర్మాణం వలన కలిగే లాభనష్టాలను అంచనావేసి, నష్టాలకంటే సామాజిక ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని సంతృప్తి చెందితేనే, నిధులను మంజూరు చేయటం జరుగుతుంది. అంతేకాకుండా, ప్రపంచ బాంకు అందించే నిధుల ద్వారా అమలు జరుప తలపెట్టిన పథకాలు ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరిచేవిగా ఉండాలి.

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దృష్ట్యా పునాదిరాళ్ళుగా ఉండే పథకాలకు మాత్రమే ప్రపంచ బాంకు ఋణాలను అందిస్తుంది. ఇందులో ముఖ్యంగా విద్యుచ్ఛక్తి పథకాలు, ఇనుము-ఉక్కు కర్మాగారాల నిర్మాణం, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసం అవసరమైన నిధులను ప్రపంచ బాంకు అందిస్తుంది. పైన వివరించిన వివిధ పథకాలు, ఆర్థిక వ్యవస్థ యొక్క దీర్ఘకాలిక అభివృద్ధి దృష్ట్యా చాలా అవసరం. అయితే, ప్రస్తుత కాలంలో ప్రపంచ బాంకు సభ్య దేశాలలో విద్యాభివృద్ధి కోసం, రోడ్ల నిర్మాణం కోసం కూడా ఆర్థిక సహాయాన్ని అందించటాన్ని మనం గమనించవచ్చు.

### 26.4.4 ప్రపంచ బాంకు పనితీరు - పరిశీలన

రెండవ ప్రపంచ యుద్ధం మూలంగా దెబ్బతిన్న ఆర్థికవ్యవస్థల పునర్నిర్మాణాన్ని, అభివృద్ధిని సాధించటంలో ప్రపంచ బాంకు తనవంతు కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహించిందనటంలో సందేహంలేదు. ప్రపంచ బాంకు అందించిన ఆర్థిక సహాయం ద్వారా, రెండవ ప్రపంచ యుద్ధంలో దెబ్బతిన్న యూరోపియన్ దేశాలు, తమ ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మించుకోవటం జరిగింది. 1970వ సంవత్సరం తర్వాత, అభివృద్ధి చెందుతున్న దేశాలలో

BRAOU

అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధి కోసం, పెట్టుబడి నిధులను అందిస్తూ, ఈ దేశాలలో ఉత్పాదకతను మరియు పేద ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచటానికి కృషి చేస్తుంది. ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణం మరియు అభివృద్ధి విషయంలో ప్రపంచ బాంకు నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహిస్తున్నప్పటికీ, అనేక మంది ప్రపంచ బాంకు పనితీరును విమర్శించటం కూడా జరిగింది. ఈ విమర్శలు ఏవనగా –

1. ప్రపంచ బాంకు అందించే ఋణాలపై విధించే వడ్డీ రేటు చాలా ఎక్కువగా ఉంటుంది. వడ్డీరేట్లు ఎక్కువగా ఉండటమే కాకుండా, ప్రతి సంవత్సరం వడ్డీ రేట్లను క్రమంగా పెంచటం కూడా జరుగుచున్నది.

2. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధికి కావలసిన నిధులను పూర్తి స్థాయిలో అందించ లేకపోవుచున్నదనేది మరొక విమర్శ. ప్రపంచ బాంకు అందించే ఆర్థిక సహాయం, అభివృద్ధి చెందుతున్న దేశాల మూలధన అవసరాలలో అత్యల్ప భాగంగా మాత్రమే ఉంటుంది.

   అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించే ఉద్దేశంతో 1960లో "అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ" (International Development Association) ను స్థాపించిన తర్వాత కూడా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉత్పాదకతలోనూ, జీవన ప్రమాణ స్థాయిలోనూ చెప్పుకోదగిన ప్రగతిని సాధించలేకపోయింది. ప్రపంచ బాంకు అందించే ఋణాలలో, పేద దేశాలకు అందించిన ఋణాల వాటా అతి తక్కువగా ఉన్నదని కూడా విమర్శకుల అభిప్రాయం.

3. ప్రపంచ బాంకు యొక్క ఋణ విధానం లోపభూయిష్టమైనదిగా ఉందని విమర్శకుల అభిప్రాయం. దీనికి కారణం, ఋణం తిరిగి చెల్లించే శక్తిని పరిగణనలోకి తీసుకుని, ప్రపంచ బాంకు ఋణాన్ని అందించటం జరుగుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు, పేద దేశాలు పెద్ద మొత్తంలో ఋణ సహాయం పొందటానికి ఈ నిబంధన అవరోధంగా ఉంది. వాస్తవానికి పేద దేశాల యొక్క ఋణ చెల్లింపు శక్తి ఋణాన్ని ఉపయోగించుకోవటంపై ఆధారపడి ఉంటుంది. అనగా ప్రపంచ బాంకు అందించే ఋణ సహాయాన్ని ఉపయోగించుకుని, పథకాలు పూర్తి చేసుకున్న తర్వాత, ప్రజల ఆదాయ స్థాయి పెరిగి, ఆ దేశానికి ఋణం తిరిగి చెల్లించే శక్తి పెరుగుతుంది. ఈ కారణం దృష్ట్యా, ఋణం తిరిగి చెల్లించే శక్తిని ఆధారంగా చేసుకొని, సభ్య దేశాలకు ఋణ సహాయం అందించటం అనేది పేద దేశాల దృష్ట్యా విచక్షణ (discriminatory) తో కూడుకున్నదిగా చెప్పబడుతుంది.

4. ఉద్దేశాల దృష్ట్యా (purpose-wise) మరియు ప్రాంతాల వారీగా (region-wise) ప్రపంచ బాంకు అందించే ఋణాలు కూడా సరియైన విధంగా లేవనీ, విచక్షణతో కూడుకున్నవనీ విమర్శించడం జరుగుతున్నది.

5. 1985లో ప్రవేశపెట్టిన "వ్యవస్థాపూర్వక సర్దుబాటు పథకం" (Structural Adjustment Programme) వలన ప్రపంచ బాంకు నుండి ఋణ సహాయం పొందటం చాలా కఠినతరంగా మారింది. దీని ప్రకారం ఋణాన్ని పొందగోరిన దేశం, స్వేచ్ఛా వ్యాపారం, బడ్జెట్ సంస్కరణలు, ధరల విధాన పునఃపరిశీలన, ప్రభుత్వ పెట్టుబడి విధానంలోనూ మరియు ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణలోనూ అనేక మార్పులు తీసుకురావలసి ఉంటుంది.

## 26.5 అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు - భారతదేశం

అంతర్జాతీయ ద్రవ్య సహాయ సంస్థలైన IMF మరియు IBRD నుండి భారత దేశం పెద్ద మొత్తంలో ఋణ సహాయం పొందటం జరిగింది. ముఖ్యంగా ఇనుము-ఉక్కు కర్మాగారాల నిర్మాణం, అభివృద్ధి కోసం, నదీజలాల

BRAOU

నీటి ఉపయోగం కోసం నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణం కొరకు, రైల్వేల ఆధునికీకరణ, ఓడరేవుల అభివృద్ధికి, ఇంకా ఇతర అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధికోసం ప్రపంచ బాంకు నుండి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం పొందటం జరిగింది. దీనితోపాటుగా, ముఖ్యంగా 1981లో విదేశీ వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన ప్రాథమిక అసమతౌల్యాన్ని సరిదిద్దుకోవటానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి నుండి 5 బిలియన్ ప్రత్యేక డ్రాయింగ్ హక్కులను (S.D.R.) ఋణ సహాయంగా పొందటం జరిగింది. ప్రస్తుత కాలంలో భారత ప్రభుత్వం సరళీకృత విధానం అవలంబిస్తున్నందువల్ల, అనేక పథకాల అమలుకోసం, ఋణ సహాయం అందించటం కోసం ప్రపంచ బాంకు ముందుకు వస్తుంది.

## 26.6 అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ (International Finance Corporation)

అంతర్జాతీయ విత్త కార్పొరేషన్‌ను 1956లో స్థాపించటం జరిగింది. ఇది ప్రపంచ బాంకుకు అనుబంధంగా ఉంటుంది. దీనిని స్థాపించటంలో ముఖ్య ఉద్దేశం ఏమనగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న దేశాలలో ప్రయివేటు రంగం యొక్క వృద్ధికి ప్రోత్సాహం అందించటం ద్వారా ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి దోహదం చేయటమే. ఆర్థికంగా వెనుకబడిన దేశాలలో దేశీయ మరియు విదేశీ మూలధన వనరులు సమకూర్చటంలో కూడా ఈ కార్పొరేషన్ తన చేయూతను అందిస్తుంది. అంతర్జాతీయ విత్త కార్పొరేషన్‌లో సభ్యత్వం పొందాలంటే, ప్రపంచ బాంకులో తప్పనిసరిగా సభ్యత్వం పొంది ఉండాలి.

### 26.6.1 ఈ కార్పొరేషన్ ముఖ్య లక్షణాలు

1. ప్రయివేటు పెట్టుబడిదారులతో కూడిన భాగస్వామ్య సంస్థలలో అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ పెట్టుబడులు చేస్తుంది. ఈ ప్రయివేటు పెట్టుబడిదారులు మూలధనాన్ని ఎగుమతి చేసే దేశానికి లేదా ఏ దేశంలోనైతే పరిశ్రమను స్థాపించటం జరుగుతుందో ఆ దేశానికి చెందినవారైనా లేదా పైన వివరించిన రెండు రకాలుగాను ఉంటారు.
2. పారిశ్రామిక సంస్థను స్థాపించటానికి కావలసిన మొత్తం మూలధనంలో సగం కంటే ఎక్కువగా ఈ కార్పొరేషన్ పెట్టుబడిగా చేయదు.
3. ఏదైనా ఒక పారిశ్రామిక సంస్థలో అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ చేసే కనీస పెట్టుబడి 1,00,000 డాలర్లుగా నిర్ణయించటం జరిగింది. గరిష్ఠ పరిమితిని నిర్ణయించలేదు.
4. అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ నుండి ఆర్థిక సహాయం పొందాలంటే, నిర్మించ తలపెట్టిన పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేసేవిగా ఉండాలి.
5. అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ ఏదైన ఒక దేశంలో పెట్టుబడి చేయదలచుకున్నట్లయితే, తన యొక్క పెట్టుబడుల తిరిగి చెల్లింపులకు (repayments) సంబంధించి ఆ ప్రభుత్వ హామీని కోరదు. తాను పెట్టుబడులు చేసే పరిశ్రమలకు ఆర్థిక సహాయంతో పాటు సాంకేతిక సహాయాన్ని (technical assistance) కూడా అందిస్తుంది.

### 26.6.2 అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ - భారత దేశం

అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ భారత దేశంలో అనేక పథకాలకు ఆర్థిక సహాయం అందించటం జరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానం ప్రకారం మన ఆర్థిక వ్యవస్థలో ప్రయివేటు రంగం పాత్ర గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా, మన దేశ పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి, అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ అతిముఖ్యమైన పాత్రను నిర్వహించవలసి ఉంటుంది. అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ భారత దేశంలో

B R A O U

కొన్ని ప్రాధాన్యతా రంగాలను గుర్తించి, ఆ రంగాలలో తన కార్యకలాపాలను ముమ్మరం చేయటం జరుగుతుంది. ఇందులో ముఖ్యంగా మూలధన మార్కెట్ల అభివృద్ధి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి, విదేశీ మార్కెట్లకు అవకాశం (access to foreign markets) కల్పించటం, కొత్త కంపెనీలలో, విస్తరిస్తున్న కంపెనీలలో ఈక్విటీ పెట్టుబడులు మొదలైనవి. దీనిలో భాగంగానే –

1. అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ భారత దేశంలో అనేక ఆర్థిక సేవా కంపెనీలలో (financial service companies) పెట్టుబడులు పెడుతూ, వాటికి సాంకేతిక సహాయాన్ని అందిస్తూ మూలధన మార్కెట్ అభివృద్ధికి దోహదం చేస్తుంది.

2. ప్రపంచంలో వివిధ దేశాలలోని కంపెనీలతో తనకున్న సంబంధాలను ఉపయోగించి, అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ భారత మరియు విదేశీ కంపెనీల మధ్య సహకారాన్ని పెంపొందించి, విదేశీ పెట్టుబడులను, విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత దేశంలోకి ప్రవహించేటట్లు చేస్తుంది.

3. భారత కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్లో ఋణాలు పొందటానికి వీలుగా ఈ కంపెనీల సెక్యూరిటీలకు అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ పూచీదారుగా వ్యవహరిస్తుంది.

4. అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని తట్టుకుని నిలబడగలిగే కంపెనీల ఈక్విటీలలో పెట్టుబడులు చేయటానికి అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ ముందుకు వస్తుంది.

## 26.7 ఆసియా అభివృద్ధి బాంకు (Asian Development Bank)

అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బాంకు ఇంకా ఇతర అంతర్జాతీయ ఆర్థిక సహాయ సంస్థలు ఉన్నప్పటికీ, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల ప్రాంతీయ అవసరాలను తీర్చటానికి ప్రాంతీయ బాంకులను స్థాపించటం జరిగింది. ఈ ప్రాంతీయ బాంకులలో, ఆసియా ప్రాంత దేశాల ద్రవ్య అవసరాలు తీర్చటానికి స్థాపించినదే ఆసియా అభివృద్ధి బాంకు. దీనిని 1966లో స్థాపించటం జరిగింది. దీని కేంద్ర కార్యాలయం 'మనీలా' (Manila) లో ఉన్నది. ఆసియా ప్రాంతంలో ఉన్న దేశాల ఆర్థికాభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయటానికి కావలసిన ద్రవ్య నిధులను అందించటమే దీని స్థాపనలోని ముఖ్య ఉద్దేశం. ఆసియా అభివృద్ధి బాంకుకు కావలసిన నిధులను అభివృద్ధి చెందిన దేశాలైన జపాన్, అమెరికా, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా మొదలైన దేశాలు సమకూర్చటం జరుగుతుంది.

BRAOU

### 26.7.1 విధులు

1. ESCAP (Economic and Social Commission for Asia and Pacific) ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడును ప్రోత్సహించటం.

2. తన వద్ద ఉన్న నిధులను ఆసియా ప్రాంతంలో వివిధ పథకాలు లేదా ప్రాజెక్టుల అమలు కోసం అందించటం ద్వారా ఈ ప్రాంతం మొత్తం సర్వతోముఖాభివృద్ధి చెందేటట్లుగా చూడటం.

'ఆసియా అభివృద్ధి బాంకు' తాను జరిపిన 23వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఈ క్రింది లక్ష్యాలను సాధించటం జరుగుతుంది. అవి ఏవనగా –

1. ఆసియా ప్రాంతంలో పేదరికాన్ని తొలగించి పర్యావరణ పరిరక్షణ (environmental protection) కు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వటం.

2. ఆసియా ప్రాంత దేశాలలో ప్రయివేటు రంగానికి ఆర్థిక సహాయాన్ని అందించటం ద్వారా, ప్రయివేటు రంగం యొక్క సామర్థ్యాన్ని, ఉత్పాదకతను పెంచటం.

3. ఆసియా ప్రాంత దేశాలలో మానవ వనరులను, మూలధనాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవటానికి అనువైన విధానాన్ని రూపొందించటం.

ప్రస్తుత కాలంలో ఆసియా అభివృద్ధి బాంకు నిధుల కొరతను ఎదుర్కొంటున్నది. దీనికి కారణం, ఆసియా అభివృద్ధి బాంకుకు చందాలను అందించే అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాలు, తమ చందాలను సకాలంలో, సక్రమంగా అందించకపోవటంతోపాటు, వాటి ప్రాధాన్యతలలో వచ్చిన మార్పులు కూడా నిధుల కొరతకు కారణంగా చెప్పవచ్చు. పై కారణాల మూలంగా ఆసియా అభివృద్ధి బాంకు తన విధులను నిర్వర్తించటంలో పూర్తిగా విజయాన్ని సాధించలేకపోయింది.

## 26.8 సారాంశం

రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం అనేక దేశాలు స్వర్ణ ప్రమాణాన్ని విడనాడినందువల్ల, మారకపు రేట్లలో స్థిరత్వం లేకుండా పోయింది. అంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపులలో ఏర్పడిన అసమతౌల్యాన్ని సరిదిద్దుకోవటానికి అనేక సమస్యలు ఎదుర్కోవలసి వచ్చేది. ఇటువంటి పరిస్థితులలో ప్రతి దేశం దిగుమతులపై ఆంక్షలను విధించటం జరిగింది. దీని కారణంగా ప్రపంచ వ్యాపార స్థాయి తగ్గుముఖం పట్టింది. మారకపు రేట్లలో స్థిరత్వాన్ని సాధించి, వివిధ దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించటానికి, ప్రపంచ వ్యాపారం సాఫీగా జరుగుతూ దినదినాభివృద్ధి చెందేటట్లు చూడటానికి గాను అంతర్జాతీయ ద్రవ్య నిధిని స్థాపించటం జరిగింది. సభ్య దేశాలు విదేశీ వ్యాపార చెల్లింపులలో ప్రాథమిక అసమతౌల్యాన్ని ఎదుర్కొన్నప్పుడు అంతర్జాతీయ ద్రవ్య నిధి సభ్య దేశాలకు S.D.R. ల రూపంలో అంతర్జాతీయ ద్రవ్యత్వాన్ని అందించి, విదేశీ వ్యాపార చెల్లింపులలోని ప్రాథమిక అసమతౌల్య సమస్యను సరిదిద్దుకునేందుకు తోడ్పడుతుంది. రెండవ ప్రపంచ యుద్ధ కారణంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి అవసరమైన దీర్ఘకాలిక ఋణాలను అందించటానికి 1945లో ప్రపంచ బాంకును స్థాపించటం జరిగింది. ప్రస్తుతం ప్రపంచ బాంకు సభ్య దేశాల ఆర్థిక వ్యవస్థలను పటిష్ట పరిచే పథకాలకు అవసరమైన దీర్ఘకాలిక నిధులను సమకూరుస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి మరియు ప్రపంచ బాంకుతోపాటు, అంతర్జాతీయ విత్త కార్పొరేషన్‌ను 1956 వ సంవత్సరంలో, ప్రపంచ బాంకుకు అనుబంధంగా స్థాపించటం జరిగింది. వీటితోపాటు ఆసియా ప్రాంత దేశాల అవసరాలు తీర్చటానికి ఆసియా అభివృద్ధి బాంకును స్థాపించటం జరిగింది. పైన వివరించిన సంస్థలు తమ లక్ష్యాల సాధనలో పూర్తి విజయాన్ని సాధించలేకపోయినాయి. దీనికి కారణం ఈ సంస్థలు కూడా నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి.

## 26.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. క్రింది ప్రశ్నలకు సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులిమ్ము.**

1. అంతర్జాతీయ ద్రవ్య నిధి స్థాపనలోని లక్ష్యాలను వివరిస్తూ, లక్ష్యాల సాధనలో అది ఎంతవరకు విజయాన్ని సాధించటం జరిగిందో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వివరించండి.

2. ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణంలోనూ, అభివృద్ధి విషయంలోనూ ప్రపంచ బాంకు నిర్వహించిన పాత్రను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

BRAOU

II. క్రింది ప్రశ్నలకు సుమారు 20 పంక్తుల చొప్పున జవాబులిమ్ము.

1. ప్రత్యేక డ్రాయింగ్ హక్కుల (Special Drawing Rights) పై ఒక లఘుటికను రాయండి.
2. అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ లక్షణాలను వివరిస్తూ, భారత దేశానికి అది చేసిన సేవను గుర్తించండి.
3. ఆసియా అభివృద్ధి బాంకు విధులను, లక్ష్యాలను తెలియ జేయండి.

## 26.10 సంప్రదింపు గ్రంథాలు


1. B.O. Soderstein : International Economics
2. Francis Cherunilam : International Economics
3. M.C. Vaish : Monetary Theory


## 26.11 పదకోశం

| | | |
|---|---|---|
| Gold standard | : | స్వర్ణ ప్రమాణం |
| Economic depression | : | ఆర్థిక మాంద్యం |
| Exchange rate | : | మారకపు రేటు |
| Stabilization | : | స్థిరీకరణ |
| International Monetary Fund | : | అంతర్జాతీయ ద్రవ్య నిధి |
| Systematic | : | క్రమబద్ధమైన |
| Multilateral | : | బహు పక్షీయ |
| Special Drawing Rights | : | ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు |
| Authorised Capital | : | అధీకృత మూలధనం |
| World Bank | : | ప్రపంచ బాంకు |
| International Bank for Reconstruction and Development | : | అంతర్జాతీయ పునర్నిర్మాణ, అభివృద్ధి బాంకు లేదా ప్రపంచ బాంకు |
| International Development Association | : | అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ |
| Discriminatory | : | విచక్షణాయుత |
| Strcutural adjustment | : | వ్యవస్థాపూర్వక సర్దుబాటు |
| International Finance Corporation | : | అంతర్జాతీయ విత్త కార్పొరేషన్ (సంస్థ) |
| Environ tal protection | : | పర్యావరణ పరిరక్షణ |

– డా॥ ఏ. వకులా రెడ్డి

BRAOU

# ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### పాఠ్య ప్రణాళిక

**ఖండం I : ద్రవ్య సప్లయ్**

భాగం : 1 : ద్రవ్యం : పరిణామం, స్వభావం, ప్రాధాన్యత

భాగం : 2 : భారతదేశంలో ద్రవ్య సప్లయ్ కొలమానాలు

భాగం : 3 : ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి 'H' సిద్ధాంతం - ద్రవ్య గుణకం

భాగం : 4 : ద్రవ్య సప్లయ్‌ని ప్రభావితం చేయు కారకాలు - భారతీయ రిజర్వు బ్యాంకు వివరణ

**ఖండం II : ద్రవ్య డిమాండ్**

భాగం - 5 : ద్రవ్యరాశి సిద్ధాంతాలు : సాధారణ ధరల స్థాయిపై ఫిషర్, కేంబ్రిడ్జ్ దృక్పథాలు

భాగం - 6 : ద్రవ్య డిమాండ్ దృక్పథాలు : సంప్రదాయ వాదులు, కేన్స్

భాగం - 7 : కేన్సియన్ల, ఉత్తర - కేన్సియన్ల, ఫ్రీడ్‌మన్‌ల ద్రవ్య డిమాండ్ దృక్పథాలు

**ఖండం III : ద్రవ్యం : సమస్యలు, దృక్పథాలు**

భాగం - 8 : ద్రవ్యం - విత్తాభివృద్ధి

భాగం - 9 : ప్రసార యంత్రాంగం

భాగం - 10 : ద్రవ్యోల్బణం : సిద్ధాంతాలు, కారణాలు, ప్రభావాలు

భాగం - 11 : సాధారణ ధరల స్థాయి గణన

భాగం - 12 : కేన్స్ పరమైన వాదం, ద్రవ్య వాదం

భాగం - 13 : హేతుబద్ధ అంచనాల పరికల్పన

**ఖండం IV : వాణిజ్య బ్యాంకింగ్**

భాగం - 14 : విత్త వ్యవస్థ : ద్రవ్య, మూలధన మార్కెట్లు

భాగం - 15 : భారత దేశంలో వాణిజ్య బ్యాంకుల విధులు, పురోగతి

భాగం - 16 : బ్యాంకేతర పరపతి సంస్థలు

భాగం - 17 : భారత దేశంలో అభివృద్ధి బ్యాంకులు

భాగం - 18 : భారతదేశంలో గ్రామీణ బ్యాంకింగ్

BRAOU

భాగం - 19 : వాణిజ్య బ్యాంకుల పరపతి సృష్టి విధానం

**ఖండం V : కేంద్ర బ్యాంకింగ్**

భాగం - 20 : కేంద్ర బ్యాంకులు : లక్ష్యాలు, విధులు

భాగం - 21 : పరిమాణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

భాగం - 22 : గుణాత్మక పరపతి నియంత్రణా సాధనాలు

భాగం - 23 : భారత దేశంలో పరపతి ప్రణాళిక

**ఖండం VI : విత్త వ్యవస్థ, సంస్కరణలు**

భాగం - 24 : భారతదేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ నివేదిక

భాగం - 25 : భారతదేశ విత్త సంస్కరణలపై నరసింహం కమిటీ మరియు ఇతర కమిటీల నివేదికలు

భాగం - 26 : అంతర్జాతీయ ద్రవ్య, విత్త సంస్థలు


BRAOU

# డా ॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

### ఎం.ఎ. అర్థ శాస్త్రం (రెండవ సంవత్సరం)

### మాదిరి పరీక్షా పత్రం

### కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

సమయం : 3 గంటలు | మార్కులు : 100

**విభాగం - A (15 × 4 = 60 మార్కులు)**

క్రింది ఎనిమిదింటిలో ఏవైనా నాలుగు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తుల చొప్పున జవాబులు రాయండి.

1. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య విధులను చర్చించండి.
2. ద్రవ్య వ్యవహారాల సిద్ధాంతానికీ, ద్రవ్య నిల్వల సిద్ధాంతానికీ మధ్య గల పోలికలను, తారతమ్యాలను పరిశీలించండి.
3. సూచీ సంఖ్యల నిర్మాణం ఎలా జరుగుతుంది ? వాటి గణనలో ఎదురయ్యే ఇబ్బందులేమి ?
4. హేతువాద అంచనాలంటే ఏమిటి ? వాటిని ఏవిధంగా సిద్ధం చేస్తారు ? ఈ వాదనపై కల ప్రధాన విమర్శలేమి ?
5. బ్యాంకేతర పరపతి సంస్థలు అంటే ఏమిటి ? పరపతి కల్పనలో వాటి పాత్రను వివరించండి.
6. సహకార పరపతి సంస్థల పాత్రను విమర్శనాత్మకంగా తెలుపండి ?
7. భారతదేశంలో పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు ఎంతవరకు ఆశించిన లక్ష్యాలను సాధించగలిగాయి ?
8. భారత దేశ ద్రవ్య వ్యవస్థపై చక్రవర్తి కమిటీ సిఫారసులను పరిశీలించండి.

**విభాగం -B (8 × 5 = 40 మార్కులు)**

క్రింది పదింటిలో ఏవైనా ఐదు ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తుల చొప్పున జవాబులు రాయండి.

9. $M_1$ ద్రవ్య సప్లై కొలమానాన్ని వివరించండి.
10. ద్రవ్య సప్లయ్‌ని ప్రభావితం చేయు కారకాలేవి ?
11. ద్రవ్య గుణకాన్ని విశదీకరించండి.
12. కేన్స్ సిద్ధాంతం ప్రకారం ప్రసార యంత్రాంగం ను తెలియజేయండి.
13. ఫిలిప్స్ రేఖను విమర్శనాత్మకంగా పరిశీలించండి.
14. విత్త వ్యవస్థలోని అంతర్భాగాలేవి ?
15. వాణిజ్య బ్యాంకుల ఆస్తి - అప్పుల పట్టీని విపులీకరించండి.
16. NABARD విధులేమిటి ?
17. గుణాత్మక పరపతి నియంత్రణ ఆవశ్యకతను వివరించండి.
18. ప్రపంచ బాంకు పనితీరును పరిశీలించండి.

BRAOU

## ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

### కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### అభ్యాసం (Assignment) - I

**గమనికలు :**

- ✡ పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- ✡ సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- ✡ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- ✡ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- ✡ మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలిండి.
- ✡ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

**I. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ద్రవ్య సప్లయ్‌కి సంబంధించి ద్రవ్య గుణక సిద్ధాంతాన్ని వివరించండి.
2. ఫ్రీడ్‌మన్ ద్రవ్య డిమాండ్ సిద్ధాంతాన్ని పరిశీలించండి.

**II. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

3. ద్రవ్య పరిణామ క్రమాన్ని చర్చించండి.
4. ఫిషర్, కేంబ్రిడ్జ్ సిద్ధాంతాల మధ్య తారతమ్యాలను తెలుపండి.
5. భారతదేశంలో ద్రవ్య సప్లయ్ పోకడలను నిర్ణయించు కారకాలను వివరించండి.

BRAOU

# ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

## కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### అభ్యాసం (Assignment) - II

**గమనికలు :**

- ✡ పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.
- ✡ సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- ✡ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- ✡ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- ✡ మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలిండి.
- ✡ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

**I. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. కేన్స్ సిద్ధాంతం తెలిపే ప్రసార యంత్రాంగాన్ని వివరించండి.
2. ద్రవ్యోల్బణం అంటే ఏమిటి ? ద్రవ్యోల్బణ ప్రభావం ఏ విధంగా వుంటాయి ?

**II. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

3. భారతదేశంలో విత్త మార్కెట్ల విస్తరణ ఏ విధంగా జరిగింది ?
4. సూచీ సంఖ్యల నిర్మాణంలో గల వివిధ దశలను తెలుపండి ?
5. హేతువాద అంచనాలను ఏ విధంగా సిద్ధం చేస్తారు ?

BRAOU

## ఎం.ఎ. అర్థశాస్త్రం ( రెండవ సంవత్సరం)

### కోర్సు - X : ద్రవ్యం, బ్యాంకింగ్

### అభ్యాసం (Assignment) - III

**గమనికలు :**

✡ పుస్తకాలను చూచి, జవాబులను రాయకూడదు.

✡ సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.

✡ జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.

✡ అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.

✡ మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకనం కోసం అవసరమైన స్థలాన్ని వదలిండి.

✡ ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి, రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

**I. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 40 పంక్తులలో జవాబులు రాయండి.**

1. వాణిజ్య బ్యాంకులు అంటే ఏమిటి ? వాటి ప్రధాన విధులను విశదీకరించండి.

2. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను విపులీకరించండి.

3. విత్తరంగంలో నరసింహం కమిటీ సిఫారసులను తెలియజేయండి. వాటి అమలు ఏ విధంగా వుందో విమర్శనాత్మకంగా వివరించండి.

**II. క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి సుమారు 20 పంక్తులలో జవాబులు రాయండి.**

4. ద్రవ్య విధానపు అమలులో బ్యాంకేతర సంస్థల పాత్రను అంచనా వేయండి.

5. పెట్టుబడి సంస్థల విధులను, అవి పరిశ్రమల కందించే సేవలను సమీక్షించండి.

6. బ్యాంకు ఋణాలు డిపాజిట్లను ఎలా సృష్టిస్తాయి ?

BRAOU